
ఊరు - పేరు


(ఆంధ్రప్రదేశ్)



ఎంతో కొండలరావు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ

సౌజన్యంతో



అమరావతి రాష్ట్ర రాజధాని



అరసవల్లి (శ్రీకాకుళం)




విజయనగరం




కైలాసగిరి (విశాఖపట్నం)



అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి గోదవ




ద్వారకా తిరుమల (పశ్చిమ గోదావరి)



విజయవాడ నగరం (కృష్ణా జిల్లా)

ఊరు-పేరు (ఆంధ్రప్రదేశ్)



రచన, సేకరణ

వాంద్రంగి కొండలరావు ఎం.ఏ, బి.యిడి,

అక్రిడిటెడ్ సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్,

నేషనల్ బుక్‌ట్రస్ట్ క్లబ్ జీవిత సభ్యుడు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ

సౌజన్యంతో ముద్రితం.

ఊరు-పేరు (ఆంధ్రప్రదేశ్)

రచన, సేకరణ : **వాండ్రంగి కొండలరావు**

చరవాణి : 9490528730, 9490595391

ప్రథమ ముద్రణ : **2017**

ప్రతులు : **1000**

పుటలు : **296**

వెల : **రూ.100/-**

డి.టి.పి, కూర్పు : **నెయ్యిల ఉమామహేశ్వరరావు**

సహకారం : **చందన రవీంద్ర**

ముఖచిత్రం : **మణిపాత్రుని నాగేశ్వరరావు**

ప్రతులకు : **వాండ్రంగి రమాదేవి**
W/o. కొండలరావు, కొండ వీధి,
పొందూరు - 532 168.
శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్
చరవాణి : 9490528730, 9490595391

ముద్రణ : **సత్యం ఆఫ్‌సెట్ ఇంప్రింట్స్**, విశాఖపట్నం
ఫోన్ : 0891-2796538, 984 999 6538

గమనిక :
ఈ పుస్తకంలోని అంశాలను రచయిత అనుమతి లేనిదే పునర్ముద్రించ రాదు. న్యాయపరమైన లావాదేవీలు శ్రీకాకుళం నగరానికే పరిమితం.

అంకితం



అమ్మానాన్నలు

కీ॥శే॥ రాధాకాంతమ్మ, చినగురుమూర్తి గార్లకు

- వాండ్రంగి కొండలరావు

రచయిత

పొట్లూరి హరికృష్ణ
అధ్యక్షులు, ఎ.పి. ప్రభుత్వ అధికార భాషా సంఘం
జాతీయ అధ్యక్షులు, తెలుగు రక్షణ వేదిక, అమరావతి.



అభినందనలు !

తెలుగునాడులో పరిచయం అక్కరలేని ఓ కవి, రచయిత, సీనియర్ పాత్రికేయులు... పైపెచ్చు మంచి మనిషి ముఖ్యంగా వివాద రహితునిగా... స్వతంత్రంగా ఆలోచించి తన అనుభవం అంగీకరించిన దాన్ని మాత్రమే చెప్పే వ్యక్తిత్వం... వాండ్రంగి కొండలరావు గారిది. భాష, సాంస్కృతిక, రాజకీయ, సాహిత్య ప్రక్రియలో నిర్మాణాత్మకమైన రచనలతో భావాలను పండించగల బహుముఖ ప్రజ్ఞ వారికి సాధ్యం.

ప్రతి వ్యక్తికి ఒక చరిత్ర ఉంటుంది. ప్రతి కుటుంబానికి ఒక చరిత్ర ఉంటుంది. ప్రతీ ఊరికి ఒక చరిత్ర ఉంటుంది. ప్రతీ వ్యక్తికి ఒక ఊరు ఉంటుంది... ఆ ఊరికి పేరు ఉంటుంది. ఆ ఊరికి ఆ పేరు ఎలా వచ్చిందో దాని వెనుక దాగి ఉన్న చరిత్ర-విశిష్టతను వివరిస్తూ విపులీకరిస్తూ కొండలరావు గారు రాసిన గ్రామ నామాల సంగ్రహ చరిత్రే ఈ పుస్తకం. ఎవ్వరూ దృష్టి పెట్టడానికి ఆసక్తి చూపించని విషయం మీద ఎంతో కష్టించి విషయ సేకరణ చేసిన తీరు కడు ప్రశంసనీయం. చాలా మందికి తమ ఊరికి ఆ పేరు ఎలా వచ్చిందో తెలియదు. తెలుసుకోవాలని కూడా ప్రయత్నించరు. కానీ కొండలరావుగారి ఈ పుస్తకం అలాంటి లోటుని తీరుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాలలోని ఎంపిక చేసుకున్న ఊరి పేర్ల వెనుక ఉన్న చరిత్రను సమాజానికి తెలియజేస్తూ తానూ తెలుగుజాతి చరిత్రలో నిలిచి పోనున్నారు. వారి కృషిని హృదయపూర్వకంగా ప్రశంసిస్తూ, మరెన్నో రచనలు వారి కలం నుంచి జాలువారి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేయాలని ఆశిస్తున్నాను.

ధన్యవాదాలతో....
మీ

వి.వి.రమణమూర్తి
ఎడిటర్, లీడర్ దిన పత్రిక, అధ్యక్షులు, రైటర్స్ అకాడమీ,
విశాఖపట్నం (సిటీ ఆఫ్ డెస్టినీ)



పేరులో 'నేమ్'ంది

ఎవరికైనా తమ ఊరి పేరు గురించి చెబితే ఆసక్తిగా వినడం చూస్తుంటాం. ఆ ఊరికి ఆ పేరు ఎలా వచ్చిందో తెలుసుకోవాలనే ఉబలాటం ఉంటుంది. ఇక కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల్లో వున్న ముఖ్యమైన ఊర్లకు పేర్లు ఎలా వచ్చాయో తెలుసుకుందామనుకుంటే ఆ అనుభూతి ఏ విధంగా వుంటుందో ఇట్టే ఊహించుకోవచ్చు. రచయిత. జర్నలిస్టు శ్రీ వాంద్రంగి కొండలరావు ఈ ఊహను నిజం చేయడం కోసం కలం పట్టారు. నిరంతరం అధ్యయనం చేసి ఏ ఊరు పేరు ఎలా వచ్చిందో స్పష్టంగా చెబుతూ కథనాలు రూపొందించారు. శ్రీ కొండలరావు చేసిన అధ్యయనాన్ని నిజంగా ఏదైనా యూనివర్సిటీలో విద్యార్థులు చేసి వుంటే దీనికి 10పీహెచ్.డిలు వచ్చి వుండేవి. ఎందుకంటే ఊరు వున్నంత వరకే కాదు లేకున్నా పుస్తకం బతికి ఉంటుందనడంలో సందేహం లేదు. ఈ మాట ఎందుకన్నానంటే కొన్ని ప్రాజెక్టుల కోసం ఊర్లకు ఊర్లు పోతున్నాయి. చరిత్రలో కనుమరుగు అవుతున్నాయి. అయినప్పటికీ ఆయన రాసిన పుస్తకంలో ఆ ఊర్లు, ఆ ఊర్ల చరిత్రలు ఎప్పటికీ పదిలంగా వుంటాయి.

కొంతమందికి, కొన్ని వస్తువులకు తయారు చేసిన వారికి స్వయంగా కాకుండా మొత్తం ఊరికే పేరు వస్తుండడం మనం చూస్తున్నాం. ఉదాహరణకు ఖద్దరు చూసినప్పుడల్లా పొందూరు గుర్తొస్తుంది. అలాగే ఉత్తరాంధ్రలో దేవాలయాలు గురించి మాట్లాడేటప్పుడు విజయనగరం పైడితల్లి, అనకాపల్లి నూకాలమ్మ, విశాఖపట్నం సింహాద్రి అప్పన్న, అరసవిల్లి సూర్యనారాయణస్వామి మన మదిలో వుంటారు. అరపవిల్లి గురించి రచయిత చెబుతూ అక్కడి సూర్యదేవాలయంలో

ప్రవేశించగానే హర్షాతిరేకం కలిగి హర్షవెల్లియే అనిపిస్తుందని రాశారు. అర్మస్సు అనగా మూల వ్యాధి, సూర్యారాధన చేస్తే ఈ వ్యాధి నయమవుతుందని. అందుకే అరసవిల్లి అని మరోకథనాన్ని బయటపెట్టారు. ఇలా ఏ ఊరికి ఆ ఊరి చరిత్రను ఈ పుస్తకంలో పదిలపరిచారు.

పట్నం, వరం, పర్తి, గామ, రంగుల, నగరం, కొండ, గిరి, పశువులు, మృగాల పేర్లతో పేట, కోట, సామాజికవర్గం పేర్లతో, చెట్ల, వలసల, గూడెంపేర్లతో, పాలెం, వ్యక్తుల, సీతారాముల, కొత్త పేరు తో, పల్లిపేరుతో, రేగపేర్లతో మిట్ట, పూడి పేర్లతో లోవ పేర్లతో పాటు ఒరియా, కన్నడ, ఉర్దూ, తమిళ, సవర భాషా ప్రభావంతో ఏర్పడ్డ ఊరిపేర్లను గురించి వివరంగా తెలియజేశారు. రాష్ట్రంలోని వివిధ ఊర్ల పేర్ల చరిత్రకు సంబంధించి ఇది ఓ ఉత్తమ గ్రంథమని చెప్పడం అతిశయోక్తి కాకపోవచ్చు. జిల్లాలకు సంబంధించిన యంత్రాంగాలు కూడా ఊరు చరిత్ర కావాలంటే వాండ్రంగి రాసిన పుస్తకాన్ని తిరగేయాల్సిందే. అందువల్లనే కొండలరావు రాసిన ఈ పుస్తకానికి కొండంత విలువ ఉంది. గల్లీ ప్రాంత విలేకరిగా జర్నలిజంలో అడుగుపెట్టినప్పటికీ జిల్లా అవధులు దాటి రాష్ట్రస్థాయి జర్నలిస్టుగా కీర్తి ప్రతిష్టలు నార్జించిన ఆయన జీవితంలో ఈ పుస్తకం ఒక మైలు రాయి. పుట్టిన ప్రతి ఒక్కరూ ఏదో ఒక ఊర్లో పుట్టిన వారే. ఆసక్తి గల ఊర్ల చరిత్ర తెలుసు కోవాలంటే ఈ పుస్తకం ఉపయోగపడుతుంది. అందుకే ఊర్ల చరిత్రకు ఈ పుస్తకం ఎన్‌సైకిలోపిడియా అనడం సమంజసంగా ఉంటుంది. ఒక జర్నలిస్టుగా వాండ్రంగి కొండలరావు పరిశోధన చూసి ఎంతో గర్వపడుతున్నాను. వారు భవిష్యత్తులో మరిన్ని రచనలు అందించాలని మనసావాచా కోరుకుంటూ....

మీ

పొగిరి సుగుణాకరరావు బి.ఇ, ఎం.బి.ఏ
కన్వీనర్
మిత్ర సాంస్కృతిక సమితి (శ్రీకాకుళం)



మనసులో మాట..

ఊరు-పేరు(ఆంధ్రప్రదేశ్) అనే పుస్తకాన్ని "మరో చరిత్ర" అనవచ్చు. సరికొత్త కోణంలో రాసిన మంచి గ్రంథం ఇది. కృషి ఉంటే సాధ్యం కానిది ఏమీ ఉండదు. ఏ పనినైనా అలవోకగా చేయవచ్చునని ఈ పుస్తక రచయిత, సీనియర్ పాత్రికేయులు వాండ్రంగి కొండలరావు మాస్టారు నిరూపించారు. పత్రికారంగంలో నాలుగు దశాబ్దాల నుంచి నిలదొక్కుకొని అక్షర జల్లులను కురిపిస్తున్నారు. చిన్నా పెద్దలకు ఆయనొక సంప్రదింపుల గ్రంథం. ఆయన ఓ గురుకులం. చిరకాలం జ్ఞాపకం బండి పోవాలంటే జనంగుర్తించుకోదగ్గ పుస్తకాలైన రాయాలి. చిట్టిపొట్టి మాటలతో నిలువెత్తు భావాన్నిచ్చే శతకపద్యం లాంటివారు మా కొండలరావుగారు. ఏ పని చేసినా ద్వారబంధానికి పసుపు అద్దినంత శ్రద్ధగా పెరట్లో గులాబీలు మృదువుగా తెంపినంత ప్రేమతో అమ్మవారికి అభిషేకం చేసినంత దీక్షతో ఆయన రచనలు ఉంటాయి. ఆయన చిరునవ్వుకు కారణం ఏమిటని అడిగితే శిష్యులుగా మా శ్రీకాకుళం భాషలో చెప్పే ఒకే ఒక్క వాక్యం ఆయన రచనా వ్యాపకమే ఆయనకు ఊత, ఊపు, ఊరట, ఉల్లాసం, ఉత్సాహం. ఓ ఊరికి ఆపేరు ఎలా వచ్చిందనే అంశంపై పుస్తకం రాయడం సాహసమే. అందునా ఓ రాష్ట్రాన్ని ప్రాతిపదికగా చేసుకొని రాయడం మరింత క్లిష్టమైన కార్యక్రమం. దీన్ని ఓ సవాలుగా తీసుకొని సఫలీకృతులై జయకేతనాన్ని ఎగరేశారు. గతంలో ఆయన నాలుగు పుస్తకాలు రాసినా అయిదో పుస్తకం "ఊరు-పేరు" (ఆంధ్రప్రదేశ్) అద్వితీయమైంది. ఎందరో మహారచయితలను స్ఫూర్తిగా తీసుకొని రాసిన గ్రంథం ఇది. ఈ పుస్తకంలో విషయం విభిన్నంగా, విలక్షణంగా కనిపిస్తుంది. ప్రతి పుట దేనికదే ప్రత్యేకంగా ఉండి నవ్యతతో తొణికిసలాడుతోంది. అన్ని పుటలను పాఠకులచే చదివింపజేసే సరుకు ఉంది. ఎంపిక చేసుకున్న ఊరిపేర్ల వెనుక చరిత్రను


సేకరించడం. ఆషామాషీ వ్యవహారం కాదు. శ్రీకాకుళం జిల్లాలో వసుంధర, మల్లి, అయోధ్యపురం, హరిద్వారం, విజయనగరం జిల్లాలో పార్వతీపురం, విజయనగరం పట్టణంలోని బొంకులదిబ్బ, విశాఖపట్టణం జిల్లాలో పంచదార్ల, ఎలమంచిలి, తూర్పుగోదావరి జిల్లాలో అంతర్వేది, ర్యాలీ, రావులపాలెం, పశ్చిమ గోదావరి జిల్లాలో జుత్తిగ, పెదవేగి, కృష్ణా జిల్లాలో హంసలదీవి, విజయవాడలోని కరెన్సీనగర్, గుంటూరు జిల్లాలోని కోటప్పకొండ, తెనాలి, జిల్లెళ్ళమూడి, ప్రకాశం జిల్లాలో మార్కాపురం, చీరాల, ఒంగోలు, నెల్లూరు జిల్లాలో శ్రీహరికోట, గూడూరు, చిత్తూరు జిల్లాలో మంగళం, మిట్టకండ్రిగ, చంద్రగిరి, మదనపల్లె, కడప జిల్లాలో వెల్లాల, కన్నెలూరు, తాళ్ళపాక, కర్నూలు జిల్లాలో మంత్రాలయం, శ్రీశైలం, అహోబిలం, అనంతపురం జిల్లాలో ఉరవకొండ, తిమ్మమ్మమర్రి మాను, రాప్తాడు తదితర అసంఖ్యాక పల్లెల పేరు వెనుక చరిత్రను వెలికితీసిన తీరు ప్రశంసనీయం. ఊరి పేర్లతో పేర్లతో ప్రసిద్ధి చెందిన వాటి గూర్చి ప్రస్తావిస్తూ "బొబ్బిలి వారిలా తొందరెందుకు", "అత్రేయపురం పూతరేకులు" మొదలైన అంశాలు ఆకట్టుకున్నాయి. ఎంపిక చేసుకున్న గ్రామాల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చేసిన రచన ఇది. విషయ సేకరణకు వివిధ ప్రాంతాల్లో క్షేత్ర పర్యటనలు జరిపారు. 13 జిల్లాల్లో రచయితల నిండైన సహకారం ఆయనకు లభించింది. వివిధ గ్రంథాలు పత్రికలు రచయితకు దిక్సూచిగా నిలిచాయి. ఓ మంచి మనస్సుతో సమాజానికి తనవంతుగా ఏదో చేయాలనే తపనతో, తాపత్రయంతో ఈ కార్యాన్ని పూర్తి చేశారు. కొత్త పుంతలు తొక్కి విజేతగా నిలిచారు. సంకల్పబలం ఉంటే క్లిష్టతరమైన రచన చేయడమైనా నల్లేరు మీద నడకలాంటిదని రుజువు చేశారు. తెలుగంటే ప్రేమ..జాలి.. అభిమానం..నాకు తెలిసిన తెలుగు మాస్టారు ఆయన. ప్రతి ఒక్కరూ తమ ఊరి పేర్ల గూర్చి తెలుసుకొనే ప్రయత్నం చేయడానికి ఈ పుస్తకం ఉపకరిస్తుంది. ఆయన కలం నుంచి మరిన్ని గ్రంథాలు వెలువడాలని ఆశిస్తూ....

మీ



ఇందులో.....

	శీర్షిక		పేజీ నెం.
1)	కడలిని కలశంలోకి	-	11
2)	పిట్టచూపుగా	-	17
3)	శ్రీకాకుళంజిల్లా	-	28
4)	విజయనగరం జిల్లా	-	78
5)	విశాఖపట్టణం జిల్లా	-	98
6)	తూర్పు గోదావరి జిల్లా	-	118
7)	పశ్చిమ గోదావరి జిల్లా	-	136
8)	కృష్ణా జిల్లా	-	154
9)	గుంటూరు జిల్లా	-	172
10)	ప్రకాశం జిల్లా	-	189
11)	నెల్లూరు జిల్లా	-	199
12)	చిత్తూరు జిల్లా	-	213
13)	కడప జిల్లా	-	234
14)	కర్నూలు జిల్లా	-	252
15)	అనంతపురం జిల్లా	-	273
16)	ఆ గ్రంథకర్తల ఇంటి పేర్లు ఊరిపేర్లే	-	287
17)	ఊరిపేర్లతో ప్రసిద్ధి చెందినవి	-	289
18)	ఆధార గ్రంథాలు	-	293
19)	ఈ పుస్తకానికి మార్గదర్శకులు వీరే	-	296



కడలిని కలశంలోకి....

కడలిని కలశంలోకి నింపే ప్రయత్నం ఇది. మహాకవి శ్రీశ్రీ అన్నట్టు మహా సముద్రాన్ని చెంచాతో తోడడం సాధ్యమా... అని ప్రశ్నించుకొంటే వచ్చే జవాబు ఏమిటో మనందరికీ తెలిసిందే. ఈ పుస్తకం "ఊరు-పేరు" (ఆంధ్రప్రదేశ్) రాయడానికి ఎంతో కొంత సాహసం చేశాను. 'దీన్ని రాయడానికి గల నేపథ్యాన్ని ప్రస్తావించాలి. నేను ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎం.ఏ (తెలుగు) చదువుతున్న రోజులవి. మాకు ఆచార్య తూమాటి దొణప్ప భాషా శాస్త్రాన్ని బోధించేవారు. ఆయన ఎక్కువగా ఊరి పేర్లను, వాటి పుట్టుపూర్వోత్తరాలను అనుసంధానం చేస్తూ పాఠాన్ని ఆసక్తికరంగా చెప్పేవారు. ఆ ప్రభావం నాపై పడింది. ఇది ప్రేరణగా నిలిచింది. 1976లో తెలుగు భాషోపాధ్యాయునిగా, పత్రికా రచయితగా చేరినప్పటి నుంచి వివిధ ప్రాంతాల్లోని గ్రామాలు వాటికి ఆపేర్లు ఎలా వచ్చాయనే అంశంపై కృషి చేసాను. దీన్ని ఓ ప్రియ కార్యంగా స్వీకరించాను. గత 40 శాబ్దాల నుంచి ఊరి పేర్లకు సంబంధించి పత్రికల ద్వారా, గ్రంథాల ద్వారా కొంత సమాచారాన్ని సేకరించాను. వాస్తవానికి రంగులు వేయకుండా చెప్పాలంటే వీటిపై పుస్తకాన్ని రాయాలని ఎప్పుడూ అనుకోలేదు. అయితే 2014లో నేను

తూర్పు వెళ్ళే రైలులో కాశీబుగ్గలో జరిగే సాహితీ సమావేశానికి వెళ్తుండగా మార్గ మధ్యంలో వచ్చిన ఆలోచన మేరకు "ఊరు-పేరు" (ఆంధ్రప్రదేశ్) పుస్తకానికి శ్రీకారం చుట్టాలని దృఢమైన నిర్ణయాన్ని తీసుకున్నాను. దీక్షాకంకణం ధరించాను. ఆ మర్నాటి నుంచే ప్రణాళికను సిద్ధం చేసుకున్నాను. ఈ సాహసం చేయొద్దని సాహితీ మిత్రులు స్నేహ పూర్వక హెచ్చరికలు చేశారు. జిల్లా మేరకు చేస్తే బాగుంటుందని సూచించారు. అయితే నా మనస్సు అందుకు అంగీకరించలేదు. నడిచే మార్గం లో ముళ్లూ ఉంటాయి, ముద్దబంతి పూలు ఉంటాయి. ధైర్యంగా ముందుకు వెళితే ఏదీ అసాధ్యం కాదనే ఆత్మ విశ్వాసంతో కదిలాను. శ్రీముఖలింగం నుంచి శ్రీకాళహస్తి వరకూ, శ్రీకాకుళం నుంచి శ్రీశైలం వరకూ ఎన్నో వేల గ్రామాలున్నాయి. వాటిలో కొన్నింటిని ఎంపిక చేసుకున్నాను. ఇందుకోసం వివిధ ప్రాంతాల్లో క్షేత్ర పర్యటనలు జరిపాను. చరవాణి ద్వారా పలువురి గళాలను నిక్షిప్తం చేశాను. అన్ని జిల్లాల్లోని ఎందరో రచయితల, జర్నలిస్టుల జానపదుల సహకారాన్ని తీసుకున్నాను. అయిదూళ్ళిచ్చిన చాలు అని అడిగితే అంతకు మించిన గ్రామాల సమాచారాన్ని అందించిన వారూ ఉన్నారు. క్వెరీలు, పరిష్కరించిన వివిధ శాసనాలు, దినపత్రికల జిల్లా అనుబంధాలు, ప్రత్యేక సంచికలు, ప్రామాణిక గ్రంథాలు, గ్రంథాలయాలు ఉపయోగపడ్డాయి. మంగళగిరి పానకాలస్వామికి ఎంత పానకం పోసినా తనివితీరదన్నట్టు ఎంత రాసినా చెప్పాల్సింది చాలా ఉన్నా ఇంకా మిగిలే ఉంటుందనేది అక్షర సత్యం. "కలువకు చంద్రుడు ఎంతో దూరం కమలానికి సూర్యుడు మరీ దూరం" అనే విషయం తెలిసిందే. సువిశాలమైన ఆంధ్రప్రదేశ్‌లో అందుబాటులో ఉన్న, లేని ప్రాంతాల నుంచి కూడా విషయాన్ని సేకరించాను. జనవాణిని ఘనవాణిగా భావించాను. గ్రామాలకు తొలుత పేర్లు పెట్టేటప్పుడు కొన్ని గ్రామాల కు చారిత్రక ఆధారాలు ఉండవనేది అక్షర సత్యం. ఆయా గ్రామాల ప్రజలు ఇతిహాసాలపై ఉన్న అభిమానంతో సీతానగరం, సీతారామపురం, రామాపురం, కృష్ణాపురం వంటి గ్రామాలకు ఈ పేర్లు పెట్టుకున్నారు. ఇటువంటివి ఆంధ్రదేశంలో కోకొల్లలుగా కనిపిస్తాయి. అలాగే హంసలదీవి,

అయినవిల్లి, శ్రీకాళహస్తి, శ్రీశైలం, సఖినేటిపల్లి తదితర కొన్ని గ్రామాలకు ఇతిహాసాల ప్రాతిపదికపై నామకరణం చేశారు. గ్రామానికి ఆ పేరు ఎలా వచ్చిందో, ఆ పేరు వెనుక గల నేపథ్యాన్ని రాయడమే ఈ పుస్తకం లక్ష్యమని మనవి చేస్తున్నాను. కాగా మన ఇంటి పేర్లలో 90శాతం మేరకు ఊళ్ళ పేర్లే చోటుచేసు కున్నాయి. వ్యక్తి నామపరంగా, సామాజిక వర్గాల పరంగా, వృక్షాల పేర్లతో, రంగుల పేర్లతో, పశువుల పేర్లతో ఏర్పడినవి కూడా ఉన్నాయి. నేను చేసిన ఈ ప్రయత్నంలో ఉల్లంఘనలు కనిపించవచ్చు, పొరపాట్లు తటస్థపడవచ్చు. లోపాలుచోటుచేసుకోవచ్చు. చంద్రునిలోనే మచ్చ ఉంది. నేను ఏమాత్రం అనుకొంటూ సర్దుబాటు చేసుకొని, సముదాయించుకొని, ఈ కార్యాన్ని ముగించాను. జానపదుల నోట వినిపించే గాథలను, స్థానిక చరిత్రలను ఆధారంగా తీసుకున్నాను. అంశ విస్తృతి దృష్ట్యా పెద్దగా పరిశోధన చేయలేకపోయినా శక్తియుక్తులను కూడగట్టుకొని బలీయమైన కాంక్షతో ఈ పుస్తకాన్ని పూర్తి చేయగలిగాను. ఓ పక్క పుస్తకాన్ని రాస్తూనే మరోపక్క ప్రముఖ పత్రికలకు వ్యాసాలు రాస్తూ మధ్యమధ్య సాహితీ సమావేశాల్లో పాల్గొంటూ సఫలీకృతుడయ్యాను. ఎందరో సాహితీవేత్తలు, మరెందరో జానపదులు నాయీ ప్రయత్నానికి దీవించారు. సహృదయంతో సహకరించారు. మీ అమూల్య హస్తాల్లో ఉన్న ఈ పుస్తకం మీకు ఏమాత్రం సంతృప్తి పరచినా నా కృషి ఫలించినట్టే. ఏమైనప్పటికీ ఈ పుస్తకం సమగ్రం మాత్రం కాదు. ఓ చిన్న ప్రయత్నం మాత్రమేనని సవినయంగా మనవి చేస్తున్నాను. ఇదీ క్లుప్తంగా.....

నామవిజ్ఞానానికి ఆద్యులు:-

నామ విజ్ఞానానికి విశేష కృషి చేసిన మహానుభావులలో ఆచార్య తూమాటి దొణప్ప, ఆచార్య డా॥ యార్లగడ్డ బాలగంగాధరరావు, ఆచార్య డా॥ కేతు విశ్వనాథరెడ్డి, విద్వాన్ కట్టా నరసింహులు డా॥ ఎ. విజయదత్తాత్రేయశర్మ, ఆచార్య డా॥ డి. చెంగారెడ్డి, కానూరి బదరీనాథ్ తదితరులు పేర్కొనదగినవారు.

కృతజ్ఞతాభివందనాలు

ఈ పుస్తకం వెలుగులోకి వచ్చేందుకు ఆర్థిక సాయం అందించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ, సంబంధిత సంచాలకులు డా॥ దీర్ఘాసి విజయ్‌భాస్కర్, తమ అమూల్య సందేశాలను పంపిన ఎ.పి అధికార భాషా సంఘం అధ్యక్షులు పొట్లూరి హరికృష్ణ, లీడర్ దినపత్రిక సంపాదకులు, రైటర్స్ అకాడమీ (విశాఖ) అధ్యక్షులు వి.వి.రమణమూర్తి, మిత్ర సాంస్కృతిక సమితి (శ్రీకాకుళం), సంబంధిత కన్వీనర్ పొగిరి సుగుణాకరరావు, అన్ని విధాల సహకరించిన తిరుమల-తిరుపతి దేవస్థానం (తి.తి.దే) ప్రచురణల సలహాదారు విద్వాన్ కట్టా నరసింహల్లు, నెల్లూరు సర్వోదయ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రధానాచార్యులు డా॥ కాళిదాసు పురుషోత్తం, ప్రముఖసాహితీవేత్త కానూరి బదరీనాథ్ (తణుకు), ప్రముఖ రచయిత్రి డా॥ డి.గాయత్రి(కర్నూలు), సి.ఎస్.ఆర్.శర్మ డిగ్రీ కళాశాల విశ్రాంత తెలుగు విభాగాధిపతి డా॥ ఆకొండి విశ్వనాథం (ఒంగోలు), బి.వి.కె.డిగ్రీ కళాశాల (విశాఖ) పూర్వ తెలుగు విభాగాధిపతి డా॥ డి.వి.సూర్యారావు, దివంగత ఆచార్య యార్లగడ్డ బాలగంగాధర రావు, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ తెలుగు ఆచార్యులు డా॥ పేట శ్రీనివాసులరెడ్డి (పేటశ్రీ), సీనియర్ పాత్రికేయులు దాసరి కృష్ణారెడ్డి (పుంగనూరు), ప్రముఖ కథారచయిత నారంశెట్టి ఉమామహేశ్వరరావు (పార్వతీపురం), ధర్మశాస్త్రం మాసపత్రిక సంపాదకులు ఎస్.పి.రాజు, సాహితీవేత్తలు దూసి ధర్మారావు, ఈ-వేమన, శివాజీ పట్నాయక్, బద్రి కూర్మారావు, బి. భూపతిరావు, పెయ్యల శ్రీనివాసరావు, ఉరిటి మురళీమోహన్ (శ్రీకాకుళం), ఈతకోట సుబ్బారావు (నెల్లూరు), మహ్మమ్మద్ రసూల్ (గూడూరు), మహిళా ప్రగతి సంపాదకులు సూరుచంద్రశేఖరరావు, రాష్ట్ర రచయితల సంఘం కార్యదర్శి పి. లక్ష్మణరావు (విజయనగరం), రచయిత సూరంపూడి పవన్ సంతోష్ (తాడేపల్లిగూడెం), సాంకేతిక సహాయం అందించిన ఎస్.హరిబాబు (ప్రథమ్) మరెందరో.... వారందరికీ నా ధన్యవాదాలు.

ప్రోత్సాహం....

ఈ పుస్తకానికి ప్రోత్సాహాన్ని అందించిన ఆచార్య మిర్యాల చంద్రయ్య ఇన్‌చార్జి ఉపకులపతి డా॥ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం, శ్రీకాకుళం, డా॥ జి. కొండలరావు, కేంద్ర ప్రభుత్వ క్షేత్ర ప్రచార శాఖాధికారి, శ్రీకాకుళం, విజయనగరం, సనాతన ధర్మప్రచారకులు బెజ్జంకి సింహాద్రి (అచ్చంపేట, గుంటూరు) వారికి నా కృతజ్ఞతాభివందనాలు.

నా సాహితీ ప్రగతికి.....

ఇక నా సాహితీ ప్రగతికి సహకరించిన జాతీయ తెలుగు రక్షణ వేదిక అధ్యక్షులు పొట్లూరి హరికృష్ణ (అనంతపురం), తెలుగు రచయితల వేదిక (శ్రీకాకుళం) ప్రతినిధులు కోనే శ్రీధర్, యు.నాగేశ్వరరావు, యు.వి.రమణమూర్తి, జనజాగృతి సాహిత్య, సాంస్కృతిక సమాఖ్య (కాశీబుగ్గ) అధ్యక్షులు తెప్పల కృష్ణమూర్తి, భారతీ సాహితీసాంస్కృతిక సేవా సంస్థ (కాశీబుగ్గ), ఎ.పి.యు.డబ్ల్యు.జె, అధ్యక్షులు నల్లిధర్మారావు, శ్రీకాకుళం ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు యస్. జోగినాయుడు, యు.జె.ఎఫ్. నాయకులు గుంటలీలావరప్రసాద్ అమరావతి విశ్వసాహితి, సాంస్కృతిక సంస్థ (విశాఖ) ప్రతినిధులకు, వివిధ దిన, వార, మాస పత్రికల యాజమాన్యాలకు, ఆకాశవాణి, విశాఖకేంద్రం వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

అన్నింటా అండగా :-

ఈ పుస్తకానికి డి.టి.పి, కూర్పు బాధ్యతలు నిర్వహించిన జర్నలిస్టు నెయ్యిల ఉమామహేశ్వరరావు, అన్ని విధాలవెన్నంటి ఉండి సేవలందించిన యువ రచయిత చందన రవీంద్ర, ముఖచిత్రం రాసిన మణిపాతుర్ని నాగేశ్వరరావు, నా సతీమణి రమాదేవి తదితరులకు నా కృతజ్ఞతాభివందనాలు.....

పల్లెలు, బస్తీలు హాయిగా నవ్వుతూ, మురిసిపోతూ నవకాంతులు వెదజల్లాలని నిండు మనసుతో ఆకాంక్షిస్తూ.....

మీ

రచయిత

బొంద్రంగి కొండలరావు

ఊరు-పేరు (ఆంధ్రప్రదేశ్)



పిట్టచూపుగా.....

నామ విజ్ఞానం ఓ శాస్త్రం. దీన్ని ఆంగ్లంలో "ఓనమాస్టిక్స్" అంటారు. వ్యక్తి నామ విజ్ఞానాన్ని 'ఆంత్రోపోనమి' అని, స్థల (గ్రామ)నామ విజ్ఞానాన్ని "టొపోనమి" అని పిలుస్తారు. బిడ్డ పుట్టిన తర్వాత బాలసారె (బారసాల) జరిపి నామకరణం చేయడం బంధు, మిత్రులను ఆహ్వానించడం మన సంప్రదాయంలోని భాగమే. పుట్టిన తిథి, వార, నక్షత్రాలను అనుసరించి పురోహితుల సూచనలతో పేర్లు పెడుతుంటాం. దేవుళ్ళ, గ్రామదేవతల పేర్లు కలిసొచ్చే విధంగా ఎక్కువగా నామకరణం చేయడం సాధారణమే. అయితే ఇదంతా వ్యక్తి నామాలకు సంబంధించినవి. అయితే ప్రస్తుతం గ్రామ నామ విజ్ఞానాన్ని గూర్చి ముచ్చటించుకుందాం. ఊరు పేరు బట్టి ఇంటి పేర్లు వచ్చాయా లేదా ఇంటి పేర్లు బట్టి ఊరి పేర్లు వచ్చాయా అని ప్రశ్నించుకుంటే రెండూ నిజమేననిపిస్తాయి. ఇందుకు వేలాది ఉదాహరణలు మనకు కనిపిస్తాయి. ఇక పేరులోనే ఉన్నది పెన్నిధి అంటారు. అసలు ఊరు అంటే ఏమిటో తెలుసుకుందాం. గ్రామము అనేది సంస్కృత పదం. కాగా ఊరు అనేది అచ్చ తెలుగు పదం. గ్రామం అనే దాని కన్నా ఊరు అనే పదాన్నే మనం వ్యవహారికంలో వాడుతున్నాం. ఎవరైనా అవతలి వ్యక్తి కనిపిస్తే మీదే ఊరని అంటాం. కానీ మీ గ్రామం ఏదని అనం. ఇక ఊరు అనే దానికి నిర్వచనం "అప్పిచ్చువాడు, వైద్యుడు/ నెప్పుడు నెడ తెగక పాఱు నేఱున్ ద్విజుడున్ / జొప్పడిన యూర నుండుము చొప్పడ కున్నట్టి యూరు జొరకము సుమతీ". దీని అర్థం ఏమిటంటే అవసరానికి అప్పిచ్చువాడు, రోగాలను నివారించే వైద్యుడు ఎల్లవేళలా ప్రవహించే నది, పురోహితుడు ఉన్న గ్రామంలో కాపురం ఉండాలి. అవి లేని ఊరిలో ప్రవేశించవద్దని సుమతీకారుడు బద్దెభూపాలుడు స్పష్టం చేశాడు. కౌటిల్యుడు అర్థశాస్త్రంలో గ్రామమంటే కనీసం అక్కడ వంద కుటుంబాలయినా ఉండాలని ముఖ్యంగా రైతులు అధికంగా ఉండాలని గ్రామపరిమితి రెండు క్రోసులయినా ఉండాలి. స్వయం పోషకంగా

ఉంటూ పొరుగు గ్రామాలకు ఉత్పత్తులను సరఫరా చేయగల స్థితిలో ఉండాలి. "గ్లోజరి అఫ్ ది మద్రాస్ ప్రెసిడెన్సీ" గ్రంథం కూడా ఇలానే వివరించింది. తమిళంలో ఊరు శబ్దం నివశించు అనే అర్థాన్ని ఇస్తుంది. గాంధీజీ గ్రామస్వరాజ్యం గూర్చి వివరిస్తూ స్వయం పోషకత్వంతో ఉన్నవే నిజమైన పల్లెలని అన్నారు. నేటి ఆధునికులు ఏం చెబుతున్నారంటే విద్యాలయం, వైద్యాలయం, ప్రార్థనాలయం, గ్రంథాలయం ఉండేవి అసలైన ఊరు అని వివరిస్తున్నారు. ఊరికి ఉన్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. "జననీ, జన్మభూమి స్వర్గాదపి గరీయసి' అని అంటారు. విదేశాలలో ఉద్యోగరీత్యా వెళ్లిన వారైనా సరే సంక్రాంతివంటి పండగలకు పుట్టిన ఊరును సందర్శిస్తారు. ఊరు మారినా ఉనికి మారునా అని అంటారు ఇందుకే. నోరు మంచిదయితే ఊరు మంచిదనే సూక్తిని గమనంలోకి తీసుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలలో ఎంపిక చేసిన కొన్ని ఊరి పేర్ల గూర్చి పిట్టచూపుగా పరిశీలిస్తే ఆసక్తికరమైన విషయాలు కనిపిస్తాయి. ఊరిపేరు వెనుక గల చరిత్రను క్లుప్తంగా రాశాను. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 13జిల్లాలు, 670 మండలాలు ఉన్నాయి. 16,449 గ్రామాలు, వీటిలో 12,918 పంచాయితీలు ఉన్నాయి. జనావాసం లేని గ్రామాలు 914ఉన్నాయి. 94 పురపాలికలు, నగర పంచాయితీలు ఉన్నాయి. నగరపాలక, మహానగరపాలక సంస్థలు 16 ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం మన రాష్ట్రంలో 4,95,77,103 జనాభా ఉంది.

సాధారణంగా గ్రామాలు రెండు పదాల కలయికతో ఉన్నవే ఎక్కువగా ఉన్నాయి. ప్రతి ఊరికి సంబంధించి ఎంతో కొంత చరిత్ర ఉంటుంది. ప్రదేశ ప్రాధాన్యతను అనుసరించి గ్రామాలు ఏర్పడినట్టు స్పష్టమవుతుంది. పుణ్యక్షేత్రాలకు సంబంధించి ఏర్పడినవి అలాగే వ్యక్తుల నామాలను బట్టి ఏర్పడినవి ఉన్నాయి.

శాసనాలు :-

కొన్ని గ్రామాల ప్రస్తావన మాత్రమే శాసనాల్లో కనిపిస్తాయి. అయితే శాసనాల్లో ఉన్న ఊరి పేర్లు జనం వాడుకలో కాస్త విభిన్నంగా కనిపిస్తాయి. మరికొన్ని యథాతథంగా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాలో ముఖలింగం శాసనం

(శ.సం 1059) లో "తులగ్రావ" అనే గ్రామ ప్రస్తావన ఉంది. అయితే జనవ్యవహారంలో "తులగాం"గా పిలుస్తున్నాం. ఉమావర్మ (400-430) టెక్కలి తామ్ర శాసనంలోని వర్థమానపురం నేడు వడుమగా వ్యవహరిస్తున్నారు. నెల్లూరు జిల్లాలో నెల్లూరు(ఉదయగిరి) శాసనంలో ప్రభాకరపట్నం నేడు ప్రభగిరిపట్నంగా జనవ్యవహారంలో ఉంది. విష్ణుగోపుని ఉరవపల్లి శాసనంలో కెందుకూర అని ఉండగా జనంవాడుకలో గొల్లకందుకూరుగా మారింది. ఇలా ఎన్నో ఉదాహరణలు అన్ని జిల్లాల్లో కనిపిస్తాయి. అయితే శాసనాల్లో పేర్కొన్న అనేక గ్రామాల పేర్లు యథాతథంగా నేటికీ కొనసాగుతున్నాయి. ఉదాహరణకు శ.స॥ 555 నాటి కుబ్జ విష్ణువర్థనుని తిమ్మాపురం శాసనంలో కలువలపల్లి గ్రామం అదే పేరుతో నేటికీ కొనసాగుతోంది. ఈ గ్రామం విశాఖజిల్లా ఎలమంచిలికి సమీపంలో ఉంది. ఇలా ఎన్నో ఉదాహరణలు కనిపిస్తాయి. ఇక ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లో ఎంపిక చేసుకున్న కొన్ని గ్రామాలకు ఆ పేర్లు ఎలా వచ్చాయో పరిశీలిద్దాం....

కైఫియత్‌లు :-

స్వాతంత్ర్యం రాకముందు ఆంగ్లేయుల పాలనలో వారు మన గ్రామ చరిత్రలను రాయించారు. వాటికి కైఫియత్‌లు' అంటారు. కైఫియత్ అంటే స్థానిక చరిత్ర లేదా గ్రామ చరిత్ర అని అర్థం చేసు కోవాలి. అలాంటి వాటిలో మెకంజీ దొర కైఫియత్‌లు ఎంతో ప్రసిద్ధి చెందాయి. గ్రామ నామాల అధ్యయ నానికి ఇవి ఎంతో ఉపయోగపడతాయి. మొత్తం మీద శాసనాలు, కైఫియత్‌లు ఈ పుస్తక రచనకు చాలా వరకు వెలుగు చూపాయి.

పుట్టుగలపేర్లతో :-

శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలోని కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం మండలాల్లో ఉత్తర పదంగా పుట్టుగతో వచ్చే గ్రామాలు 136 ఉన్నాయి. పుట్టుగ అంటే పుట్టు అనే పదం నుంచి వచ్చింది కాదు. మాండలికం ప్రకారం పరిమిత ప్రాంతంలో నివశించే కుటుంబాల సముదాయం అని అర్థం. ఉదాహరణ రామయ్యపుట్టుగ, నీలాపుట్టుగ, జల్లుపుట్టుగ తదితరమయినవి.

పట్నం పేరుతో :-

పట్నం ఉత్తర పదంగా ఉన్న గ్రామాలను పరిశీలిస్తే అవన్నీ సముద్ర లేదా నదీ ప్రాంతాలలోనే ఉన్నాయి. అయితే కొన్ని గ్రామాల ఉత్తర పదంలో పట్నం ఉన్నప్పటికీ ఇది వర్తించనవి కూడా అక్కడక్కడ ఉన్నాయి. విశాఖపట్నం, మచిలీపట్నం, కళింగపట్నం, నిజాంపట్నం,.... తదితరమైనవి సాగర ప్రాంతంలో వెలిశాయి.అయితే శ్రీకాకుళం జిల్లా పలాస మండలంలోని టెక్కలి పట్నం, విశాఖజిల్లా లోని నర్సీపట్నం, అనంతపురం జిల్లాలో బుక్కపట్నం దీనికి మినహాయింపుగా ఉన్నాయి.

వరం పేరుతో :-

ఇక వరం ఉత్తర పదంగాకొన్ని గ్రామాల పేర్లు ఉన్నాయి. అన్నవరం, అడివి వరం, సత్యవరం, ధర్మవరం,భీమవరం, తదితర గ్రామాలలో వరం అంటే పెద్దగ్రామంలోని కొంత భాగం విడదీసి ఇచ్చిన భూభాగం. కాగా అగ్రహారం ఉత్తర పదంగా ఉన్న గ్రామాలు కూడా ఉన్నాయి. ఆనందపుర అగ్రహారం, నరసాపుర అగ్రహారం, ఆర్.సి. హెచ్ అగ్రహారం తదితరమయినవి. ఆ రోజుల్లో రాజులు సంస్థానాధీశులు, బ్రాహ్మణుల పోషకత్వానికి ఇచ్చిన గ్రామాలన్నీ ఏర్పడినట్టు గమనించవచ్చు.

పాడు ఉత్తరపదంగా :-

పాడు ఉత్తర పదంగా ఉన్న గ్రామాలు కూడా కనిపిస్తాయి. సంతనూతలపాడు, మర్రిపాడు, అమలపాడు, నల్లపాడు, గంగన్నపాడు తదితరమయినవి... పాడు ఉత్తర పదంగా వచ్చిన గ్రామాలన్నీ ఒకప్పుడు జైన సంస్కృతితో విలసిల్లినట్టు విద్వాన్ కట్టా నరసింహులు అభిప్రాయపడ్డారు.

ఒకే ఊరి పేరుతో :-

ఒకే ఊరి పేరుతో ఎన్నో గ్రామాలు కనిపిస్తాయి. ఉదాహరణకు.... కృష్ణా జిల్లాలో ఓ గుడివాడ ఉండగా, విశాఖపట్నం జిల్లా ఎస్.రాయవరం మండలంలో ఇదే పేరుతో మరో గుడివాడ ఉంది. అలాగే విజయనగరం జిల్లాలో

భోగాపురం గ్రామం ఉండగా ఇదే గ్రామం పేరుతో శ్రీకాకుళం జిల్లా మందస మండలంలో మరో భోగాపురం. ఇక నెల్లూరు జిల్లాలో గూడూరు ఉండగా ఇదే పేరుతో కృష్ణా జిల్లాలో మరో గూడూరు ఉంది. ఇలాంటి ఉదాహరణలు ఎన్నెన్నో ఉన్నాయి.

పర్తి పేరుతో :-

పర్తి ఉత్తర పదంగా కనిపించే గ్రామాలు కూడా మనకు దర్శనమిస్తాయి. పర్తి అంటే ప్రాంతం లేదా ప్రదేశం అని పేర్కొనవచ్చు అనంతపురం జిల్లాలోని పుట్టపర్తి, తూ.గో జిల్లాలోని అనపర్తి, విశాఖపట్నంలోని దొండపర్తి వంటివి.

గామ పేరుతో :-

గామ ఉత్తర పదంగా ఉన్న గ్రామాలు కనిపిస్తాయి. అవి నందిగామ, జనగామ తదితర మయినవి. గామ అనేది గ్రామం నుంచి రూపాంతరం చెందింది.

పురం ఉత్తర పదంగా :-

ఉత్తర పదం పురం పేరుతో మరెన్నో గ్రామాలు ఉన్నాయి. పార్వతీపురం, నరసాపురం, విజయరాంపురం, చినమంగళాపురం, పెద్దాపురం తదితరమయినవి. పురం అనేది సంస్కృత పదం. ఆ రోజుల్లో జానపదాలను కూడా పురం పేరుతో పిలిచేవారు.

నగరం పేర్లతో :-

ఉత్తర పదంగా నగరం ఉన్నవి కూడా హెచ్చుసంఖ్యలోనే కనిపిస్తాయి. విజయనగరం, సీతానగరం, అల్లినగరం, రాజానగరం తదితరమయినవి. నగరం అంటే పెద్దదైన ఆవాసాలను నగరంగా పేర్లు పెట్టేవారు. నాగరికులు ఉండే ప్రాంతమని కూడా పేర్కొంటారు.

రంగుల పేర్లతో :-

రంగుల పేర్లతో కొన్ని గ్రామాలు ఉన్నాయి. ఎర్రవరం, ఎర్రగుడిపాడు, నీలంపేట, పసుపురెడ్డిపేట, నల్లపాడు, ధవళపేట తదితరమయినవి. ఇందులో ధవళ అంటే తెల్లనైన అని అర్థం.

కొండ...అచలం...గిరి... పేర్లతో :-

ఉత్తర పదంగా కొండ అని అర్థాన్నిచ్చే గ్రామాలు వెలిశాయి. పాలకొండ, కోరుకొండ, సింహాచలం, వేదాచలం, వేదగిరి, వెంకటగిరి, ద్రోణాచలం మొదలైనవి.

పశువుల, మృగాల పేర్లతో :-

పశువుల, మృగాల పేర్లతో ఉన్న గ్రామాలను పరిశీలిస్తే గేదెలపేట, ఆబోదులపేట, గొర్లెపేట, నక్కపేట, గుర్రాలపాలెం, గజపతినగరం, సింహపురి, పులివెందుల తదితరమైనవి.

పేట పేర్లతో :-

పేట ఉత్తర పదంగా ఉన్న గ్రామాలు కొన్ని దర్శనమిస్తాయి. ముఖ్యంగా ఈ గ్రామాలు మెట్ట ప్రాంతాలలో దర్శనమిస్తాయి. అలాగే వ్యక్తుల పేర్లతో వచ్చిన పేటలు కూడా ఉన్నాయి. నరసన్నపేట, ఇల్లయ్యగారిపేట, జగ్గునాయుడుపేట, కృష్ణదేవిపేట, గారపేట, ఆదివారంపేట తదితరమైనవి. పేట అంటే కొత్తగా నివాసం ఏర్పాటుచేసుకున్న ప్రాంతమని గ్రహించాలి.

కోట పేర్లతో :-

కోటపేరుతో అయితే కోటబొమ్మాళి, సారవకోట, కోటపాలెం, లక్కవరపు కోట, శృంగవరపుకోట, గండికోట ఒకప్పుడు ఇక్కడ కోటలు ఉన్నందున ఆపేర్లు వచ్చినట్లు చెబుతారు.

సామాజిక వర్గం పేర్లతో :-

సామాజిక వర్గం పేర్లతో వెలసిన గ్రామాలు కూడా ఉన్నాయి. బ్రాహ్మణగూడెం, బలిజిపేట, పట్టుశాలిపేట, రెడ్డిపల్లి, నాయుడుపేట, భట్టుపాలెం, బ్రాహ్మణతర్ల, కమ్మసిగడాం, దేవరవలస, కాపుశంభాం తదితరమైనవి.

చెట్ల పేర్లతో :-

చెట్ల పేర్లతో ఉన్న గ్రామాలు ఎన్నో కనిపిస్తాయి. పనసలవలస, తాడికొండ, మర్రివలస, మర్రిపాడు, మునగవలస, వేపంజరి, వేపాడ, వేపగుంట, మామిడిపల్లి, తదితరమయినవి.

నిమ్మ పూర్వ పదంగా :-

నిమ్మ పూర్వ పదంగా ఉన్న గ్రామాలెన్నో కనిపిస్తాయి. నిమ్మకూరు, నిమ్మాడ, నిమ్మలవలస, నిమ్మతొర్లాడ తదితరమైనవి. కాగా దబ్బ పూర్వ పదంగా ఉన్న పల్లె (దబ్బపాడు) కూడా ఉంది.

అంతరించిన గ్రామాలు :-

వివిధ ప్రాజెక్టుల నిర్మాణం ఫలితంగా అంతరించిన గ్రామాలు ఉన్నాయి. ఇందుకు ఉదాహరణగా శ్రీకాకుళం జిల్లా మడ్డువలస జలాశయం ఏర్పాటుతో పలు గ్రామాలు అంతరించాయి. మగ్గూరు, లక్ష్మింపేట, కొట్టిశ గ్రామాలు ఉనికి కోల్పోయాయి. అయితే ఈ గ్రామల ప్రజలు సమీప ప్రాంతాల్లో గ్రామాలను ఏర్పాటు చేసుకున్నారు. అవే పేర్లు పెట్టుకొని తమ అభిమానాన్ని చాటుకున్నారు. అయితే వీటిలో మగ్గూరు గ్రామాన్ని వంగర సమీపంలోని మెట్టపై నిర్మించుకొని మెట్టమగ్గూరు అని నామకరణం చేసుకున్నారు.

వలసల పేర్లతో :-

వలసల పేర్లతో మన రాష్ట్రంలో వలసల పేర్లతో ఎన్నో గ్రామాలు ఉన్నాయి. ప్రజలు జీవనోపాధి కోసం ఎన్నో 'గ్రామాలకు వలస పోతుంటారు. వలస ఉత్తర పదంగా ఉన్న గ్రామాలు వందల సంఖ్యలో ఉన్నాయి. శ్రీకాకుళం, విశాఖ జిల్లాలలో ఈ వలసల పేర్లతో ఉన్న గ్రామాలు మరీ ఎక్కువగా ఉన్నాయి. అముదాలవలస, మెట్టక్కివలస, మెట్టవలస, వెన్నెలవలస, బాలకవివలస, మునకలవలస, పనసలవలస, వేములవలస తదితరమయినవి.

గూడెం పేర్లతో :-

గూడెం ఉత్తర పదంగా ఉన్నవి గ్రామాలు కోకొల్లలుగా కనిపిస్తాయి ముఖ్యంగా వృక్ష సంపద, అటవీ ప్రాంతం ఎక్కువగా ఉన్న చోట ఈ గ్రామాలు కనిపిస్తాయి. తాడేపల్లి గూడెం, వెంకటరామన్న గూడెం, జంగారెడ్డి గూడెం, వి.ఆర్.గూడెం తదితర మయినవి. ఇక ఏక పదంతో ఉన్న గూడెం అనే గ్రామం శ్రీకాకుళం జిల్లాలో ఉంది.

పాలెం పేర్లతో :-

పాలెం ఉత్తర పదంగా ఉన్న గ్రామాలలో ఎక్కువగా మత్స్యకారులు నివాసం ఉంటున్నవే కావడం విశేషం. ఇజ్జువానిపాళెం, పెదకర్రి వానిపాలెం, చినకర్రివానిపాలెం, జాలరిపాలెం, బట్టివానిపాలెం, బుడగట్లపాలెం, బండిపాలెం, వరదయ్యపాలెం పేర్కొనవచ్చు. విశాఖపట్నంలో గల మువ్వలవానిపాలెం (ఎం.వి.పి). విషయానికి వస్తే ఒకప్పుడు ఇది మత్స్యకారుల గ్రామమే. కాలగమనంలో పేదలైన మత్స్యకారులు తమ భూములను రియల్ఎస్టేట్‌కు అమ్ముకున్నారు. చీమలు పెట్టిన పుట్టలు పాముల కిరవైనట్టు పరిణమించింది.

వ్యక్తుల పేర్లతో :-

వ్యక్తి నామ సూచికలతో ఏర్పడిన గ్రామాలు ఆంధ్రదేశమంతటా కనిపిస్తాయి. పాయకరావుపేట, గోవిందరెడ్డి దరఖాస్తు, వెంకటరామన్న గూడెం, జగ్గునాయుడుపేట, విశ్వనాథపురం, వీరప్పరెడ్డిపాలెం, నరసరావుపేట, నరసన్నపేట, అబ్దుల్లాపురం మొదలైనవి...

ఇంటిపేర్లతో :-

ఇంటిపేర్లతో కోకొల్లలుగా గ్రామాలు ఏర్పడ్డాయి. అజ్జాడ, కాటూరు, మాడుగుల, భోగాపురం, రాజాం, సాలూరు, పొందూరు, రేగిడి, బెజవాడ, టంగుటూరు, తాళ్ళపాక, కోరుకొండ, బలివాడ, గుత్తి, తదితరమైనవి.

సీతా, రాముల పేర్లతో :-

సీతానగరం పేరుతో అన్ని జిల్లాలలో ఎక్కువగా పల్లెలు వెలిశాయి. అలాగే సీతారాంపురం, రామ్‌నగర్, శ్రీరామ్‌నగర్, సీతాపురం, గుళ్లసీతారాంపురం, రామవరప్పాడు, సీతంపేట, రామభద్రపురం, రామచంద్రాపురం, రామతీర్థం, రామగుండం, రామాపురం తదితర గ్రామాలు ఉన్నాయి.

కొత్త పేరుతో :-

పూర్వ పదంగా కొత్త పేరుతో వచ్చే పల్లెలెన్నో ఆంధ్రదేశంలోని అన్ని జిల్లాల్లో కూడా ఉండడం విశేషం. కొత్త, ఊరు కలిసి కొత్తూరు అవుతుంది. ఓ

ప్రాంత ప్రజలు మరో కొత్త ప్రదేశానికి వచ్చి స్థిర నివాసం ఏర్పాటు చేసుకొనే సందర్భాలలో తమ జానపదాలకు కొత్తూరు లేదా కొత్తూరిపేట అనే పేర్లు పెడుతున్నారు.

పల్లె పేర్లతో :-

పల్లి లేదా పల్లె పేరుతో హెచ్చు సంఖ్యలో గ్రామాలు కనిపిస్తాయి. అన్నదేవరపల్లి, మెట్టపల్లి, చీపురుపల్లి, బుడతనాపల్లి, కొండపల్లి తదితరమయినవి. పల్లె అంటే చిన్న ఊరు అని అర్థం.

రేగ పేర్లతో :-

బంకమన్ను గల ప్రాంతంలో వెలసిన గ్రామాల్లో కొన్ని రేగ పేర్లతో ఏర్పాటయ్యాయి. కళ్లేపల్లిరేగ, పూసపాటిరేగ తదితరమైనవి. ఇవన్నీ విజయనగరం జిల్లాలో ఎక్కువగా కనిపిస్తున్నాయి.

మిట్ట పేర్లతో :-

ఎత్తయిన భూమి లేదా కొండ అని అర్థం. కడప జిల్లాలోని ఒంటిమిట్ట తదితరమయినవి...

పూడి పేర్లతో :-

పూడి అంటే జల ప్రవాహానికి సమీపంలో ఉన్న కొన్ని గ్రామాలకు పూడి అనే పేరు వస్తుంది. చిలకలపూడి, పూడివలస తదితరమయినవి.

లోవ పేర్లతో :-

రెండుకొండల నడుమ గల ప్రదేశం కలిగి ఉండి రాకపోకలకు అనువుగా ఉండేది. తలుపులమ్మలోవ, ముడసరలోవ తదితరమయినవి.

కండిగ్రల పేర్లతో :-

కండ్రిగల పేర్లతో ఉన్న గ్రామాలు చిత్తూరు జిల్లాలో హెచ్చు సంఖ్యలో కనిపిస్తాయి. కండ్రిగ అంటే భూభాగం లేదా గ్రామం. రాజులు,సంస్థానాధీశులు

తమను ఆశ్రయించే వారికి కొంత భూమిని ఇచ్చేవారు. ఆ భూమిపై వారంతా గ్రామాలను నిర్మించుకొనేవారు. పుల్లారెడ్డికండ్రిగ, మిట్టకండ్రిగ, శ్రీనివాస కండ్రిగ, గొల్ల కండ్రిగ, డి.వి.ఆర్ కండ్రిగ. ఎం.కె.కె కండ్రిగ, పేరారెడ్డికండ్రిగ, గోవిందప్పనాయుడు కండ్రిగ, అర్జునప్ప కండ్రిగ తదితరమయినవి.

వాడల పేర్లతో :-

పెద్ద పెద్ద గ్రామాల్లోన్ని కొన్నింటిని వాడలతో పిలుస్తున్నారు. వాడ అంటే వీధి అని పేర్కొనవచ్చు. ఇవి ఎక్కువగా సామాజిక వర్గాల పేర్లతో కనిపిస్తున్నాయి. ఉదాహరణకు దళితవాడను పేర్కొనవచ్చును. కాగా పెద్ద పెద్ద గ్రామాలు కాలక్రమంలో ఉత్తర పదం వాడతో పిలుస్తున్నారు. మధురవాడ, విజయవాడ, గుడివాడ, రావాడ..

పాడు పేర్లతో :-

పాడు ఉత్తర పదంగా గల గ్రామాలన్నీ దాదాపుగా జైనులు నివశించినవే అని పేర్కొంటారు. కాగా గుంటూరు జిల్లాలోని దళిత ఆవాసాలను పాడు అని పేర్కొంటారు. అమలపాడు, భావనపాడు, మర్రిపాడు, తదితరమయినవి. కాగా ఒకసారి శిథిలావస్థలోకి చేరి మరుగునపడిన గ్రామాలు తిరిగి పునరుద్ధరణకు నోచుకుంటే వాటి ఉత్తర పదంలో పాడు అనేది చేరుతుందని చెబుతారు.

ఊరు ఉత్తర పదంగా :-

ఊరు ఉత్తర పదంగా 'ఊరు'గా ఉన్న గ్రామాలు కనిపిస్తాయి. ఊరు అంటే జనావాసం అని వేరేగా చెప్పనక్కర్లేదు. ఉదాహరణకు బుడుమూరు, గూడూరు, ఏలూరు, నందలూరు, నెల్లూరు తదితరమయినవి.

ఒరియా భాషా ప్రభావంతో :-

ఉత్తరాంధ్రలో ఒరియా భాషా ప్రభావంతో ఏర్పాటైన గ్రామాలు అసంఖ్యాకంగా కనిపిస్తాయి. బనమాలి, బెల్లుపడ, తేలుకుంచి, పి.కొజ్జీరియా, చినకొజ్జీరియా, ముండాల, భోగబేని తదితరమయినవి.

కన్నడ భాషా ప్రభావంతో :-

అనంతపురం జిల్లాలో కన్నడ భాషా ప్రభావంతో కొన్ని గ్రామాలు ఏర్పడ్డాయి. కొడిహెనగల్లి, దెవగనహల్లి, సుంకలహత్తి, మడకశిర, భక్తారహల్లి, మేలవాయి, పాపసన్నహల్లి, గొల్లహర్తి, గుడ్డంహల్లి, సుంకలహర్తి, హలహర్వి, తదితరమయినవి.

సవర భాషా ప్రభావంతో :-

సవర భాష ప్రభావంతో సమరిల్లి, జల్లర, గుజ్జి, డరబ, గొయిడి, జజ్జువ, కురుసింగి, జొంగ, వాబా, బార్నా, సవర గుడ, టంకెడి, సానంగి, వర్జాయి గుడ, కుంబీ, పుబ్బడ తదితర గ్రామాలు ఏర్పడ్డాయి. ఇవన్నీ శ్రీకాకుళం జిల్లాలో ఉన్నాయి.

ఉర్దూ భాషా ప్రభావంతో :-

ఉర్దూ భాషా ప్రభావంతో ఏర్పడిన గ్రామాలు దాదాపు అన్ని జిల్లాల్లో కనిపిస్తాయి. షేర్‌మహ్మద్‌పురం, కాజీ పేట, ఇబ్రహీంబాద్, ఇబ్రహీంపట్టణం, నిజాంబాద్, అఖింఖానుడుపేట, తురకలపేట,'తురకలపూడి, మసీదు అగ్రహారం తదితరమయినవి.

తమిళ ప్రభావంతో :-

చిత్తూరు జిల్లాలో తిరుమల – తిరుపతి, ఏర్పేడు, కుప్పం, పెరియంబాడి, తడ, గుండ్రాజకుప్పం, ఆగరం, తిరుచానూరు, నంగమంగళం తదితర గ్రామాలు తమిళభాషా ప్రభావంతో ఏర్పడ్డాయి.

శ్రీకాకుళం జిల్లా

శ్రీకాకుళం

జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం తొలిపేరు చికాకోల్. మహ్మదీయుల, ఆంగ్లేయుల పాలనలో ఈపేరే వ్యవహారంలో ఉండేది.శిస్తులు వసూలు చేసి డబ్బు మూటల శిఖలు(ముడి) ఇక్కడ కోసేవారు.దీంతో శిఖాఖోల్ గాను ఆ తరువాత చికాకోల్‌గా భ్రష్టమైందని చెబుతారు. సిక్కా(నాణేం), ఖోల్(తెరచే) ప్రదేశమని కూడా పేర్కొంటారు. శిఖాఖోల్ క్రమంగా శికాకోళం, శికాకుళం, శ్రీకాకుళంగా రూపాంతరం చెందింది. ఇక శ్రీకళింగ పథం శ్రీకాకుళంగా మారిందని కూడా మరో కథనం ప్రచారంలో ఉంది. ఇప్పటికీ శ్రీకాకుళంను చిక్కోలు, సిక్కోలు, గుల్సనాబాద్ (ఉద్యాననగరం) అని కూడ వ్యవహరిస్తుంటారు. 2015ల్లో శ్రీకాకుళం పురపాలక స్థా యి నుంచి నగరపాలక సంస్థగా ఏర్పాటైంది. శ్రీకాకుళం నగరం నాగావళి నదీ తీరంలో ఉంది. ఈపట్టణం1687లో కుతుబ్‌షాహీల పాలనలో చికాకోల్‌గా ఏర్పడింది. కైఫియత్‌ను పరిశీలిస్తే శ్రీకాకుళానికి ముందునుంచి ఆ పేరే (శ్రీకాకుళం) ఉన్నట్టు తెలుస్తోంది. శిష్ట జనులు నాటి నుంచి నేటి వరకూ శ్రీకాకుళంగానే పిలుస్తున్నారు 1950 ఆగస్టు 15న ఈపట్టణం కేంద్రంగానే జిల్లా అవతరించింది. ఇక్కడ వెలసిన శ్రీఉమారుద్ర కోటీశ్వరాలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. బలరాముడు ఈ ఆలయాన్ని ప్రతిష్టించినట్టు ఇతిహాసం వల్ల తెలుస్తోంది. శ్రీకారానికి ప్రాకారమై వర్ధిల్లు శ్రీకాకుళం. నాగావళీ, వంశధార, మహేంద్రతనయ పుట్టిల్లుగా కవుల ప్రశంసలు పొందింది. కాళీపట్నం రామారావు (కా.రామాస్టారు) ఆధ్వర్యంలోని ఇక్కడి "కథానిలయం" తెలుగు భాషకే గర్వ కారణంగా నిలుస్తుంది. ఇది ఇలా ఉండగా కృష్ణా జిల్లాలోని ఘంటశాల మండలంలో మరో శ్రీకాకుళం ఉండడం విశేషం. ఒకప్పుడు శాతవాహనుల రాజధాని గా విరాజిల్లింది. ఇక్కడ ప్రసిద్ధి చెందిన ఆంధ్రమహావిష్ణువు ఆలయం ఉంది. ఆంధ్రమహా విష్ణువుపై కాసులపురుషోత్తమకవి రాసిన శ్రీకాకుళాంధ్రదేవ శతకం ఎంతో ప్రాచుర్యం పొందింది.

అరసవిల్లి

శ్రీకాకుళం పట్టణ పరిధిలో అరసవిల్లి ఉంది. ఇది ఓ దివ్య క్షేత్రం. ఈ పుణ్యక్షేత్రంలో ప్రవేశించగానే ఓ విధమైన హర్షాతిరేకం కలిగి నిజంగా హర్షవెల్లియే అనిపిస్తుంది. ప్రత్యక్ష దైవం శ్రీసూర్యనారాయణమూర్తి వారి దివ్య సాన్నిధ్యం వల్ల ఆపేరు సార్థకమైంది. హర్షవెల్లియే జనవ్యవహారంలో అరసవిల్లిగా మారింది. అర్మస్సు అనగా మూలవ్యాధి. సూర్యారాధన ఇక్కడ చేస్తే ఈ వ్యాధి మాయమవుతుందని చెప్తారు. అంచేతనే అరసవిల్లి అయినట్లు మరో కథనం ప్రచారంలో ఉంది. అలాగే స్వామిని దర్శించుకుంటే నేత్ర, శోక, దారిద్ర్యాలు నశిస్తాయని భక్తుల విశ్వాసం. ఇక్కడి సూర్యదేవాలయంలో గల ఈ స్వామిని స్వయంగా దేవేంద్రుడే ప్రతిష్ఠించినట్టు ఐతిహ్యం వల్ల తెలుస్తోంది. కాగా ఈ దేవాలయాన్ని దేవేంద్రవర్మ అనే రాజు క్రీ.శ 747లో నిర్మించినట్టు శాసనాల వల్ల స్పష్టమౌతోంది. గంగరాజులు దీనిని ఎంతో అభివృద్ధి చేసినట్టు చెబుతారు. స్వామి వారి ఆలయాన్ని అరుదైన అరుణ శిలతో నిర్మించారు. ప్రతీ ఏటా రథసప్తమి రోజున స్వామి వారి నిజరూప సందర్శన సేవను నిర్వహిస్తారు. వేలాది మంది భక్తులు స్వామిని దర్శించుకుంటారు.

గుజరాతీపేట

ఇది శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో ఉంది. గుజరాత్ ప్రాంతానికి చెందిన వర్తకులు చాలా ఏళ్ల క్రితం ఈ ప్రాంతానికి వచ్చి వజ్రాలు, వైడూర్యాలు, బంగారం, వెండి విక్రయించేవారు. వారంతా ఇక్కడే స్థిరపడ్డారు. వారి పేరుతోనే ఇక్కడ ఏర్పాటైన పేటకు గుజరాతీపేట అని పేరు వచ్చినట్టు జిల్లా ఇంటాక్ కన్వీనర్ దూసి ధర్మారావు పేర్కొన్నారు.

నిజాంబాద్

ఇది గార మండలంలో ఉంది. నైజాం పాలన ప్రభావంతో ఈ పల్లెకు నైజాంబాద్ అని పేరు వచ్చింది. జన వ్యవహారంలో నిజామాబాద్ గా మారింది. అయితే ఈ గ్రామాన్ని నిరక్షరాస్యులు మాత్రం నిజాంబద్ద గా పిలుస్తారు. ముస్లిం పాలకుల ప్రాబల్యంతో ఏర్పాటైన ఈ గ్రామంలో నాటి గుర్రపుశాల, స్నానవాటిక నేడు శిథిలావస్థలో ఉన్నాయి.

సంగాం

ఈ పల్లె శ్రీకాకుళం జిల్లా వంగర మండలంలో ఉంది. ఈపల్లె తీరాన సువర్ణముఖి, నాగావళి, వేగావతి నదుల సంగమం(కలయిక) జరుగుతుంది. అంచేతనే దీనికి సంగాం అనే పేరు వచ్చింది. తొలుత సంగమం అనే నామకరణంచేసినా కాలక్రమేణా సంగాంగా పిలుస్తున్నారు. పంచలింగాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందిన సంగమేశ్వర దేవాలయం ఇక్కడ వెలసింది. ఈ ఆలయాన్ని బలరాముడు ప్రతిష్ఠించినట్టు ఇతిహాసం చెప్తుంది. ఇక ఉత్తర ప్రదేశ్‌లో గల అలహాబాద్ సమీపంలోని ప్రయాగ వద్ద మూడు నదులు కలుస్తున్నట్టుగానే సంగాం వద్ద మూడు నదులు సంగమిస్తున్నాయి.

శ్రీ కూర్మం

శ్రీమహావిష్ణువు దశావతారాల్లో కూర్మావతారం ఒకటి. కూర్మం అంటే తాబేలు. తాబేలు రూపంలో విష్ణువు ఉంటాడు. కూర్మం పేరుతో శ్రీకూర్మక్షేత్రం వెలిసింది. కూర్మరూపంలో దర్శనమిచ్చే అరుదైన ఆలయం ఇది. ఈ ఆలయంలో రెండు ధ్వజస్తంభాలు ఉండటం విశేషం. ఈ ప్రసిద్ధ ఆలయంలో11వ శతాబ్దం నాటి శిలాశాసనాలు ఉన్నాయి. ఆలయ ప్రాంగణంలో తాబేళ్ల పరిరక్షణ కేంద్రం ఉంది. ఇందులో 220 తాబేళ్లు ఉ న్నాయి. ఈ ఆలయం దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో ఉంది. ప్రతి ఏటా ఫాల్గుణ శుద్ధ త్రయోదశి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుపుతారు. ఇక్కడి గల శ్వేత కుండంలో పిండ నిక్షేపం చేస్తే పితృదేవతలకు శాశ్వత విష్ణులోక సిద్ధి లభిస్తుందని చెబుతారు. ఈ కుండంలోని నీటి అడుగు భాగాన ఉన్న మట్టి తెల్లగా ఉంటుంది. దీన్ని గోపిచందనం అంటారు.

రావివలస

ఇది టెక్కలి మండలంలో ఉంది. ఈ గ్రామంలో పరమేశ్వరుడు ఎండలమల్లిఖార్జునుడిగా పూజలు అందుకుంటున్నాడు. శైలోద్భవ రాజులు బసచేసిన ఈ ఆలయ గ్రామానికి రాజబస, రాయబస,రాయవలస అని తొలుత పిలిచేవారు.ఆ గ్రామం క్రమంగా రావివలసగా మారిందని గ్రామంలోని వృద్ధులు

పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా గ్రామం సరిహద్దుల్లో ఓపెద్దరాయి లింగాకారంలో కన్పించింది. అయితే దాన్ని ప్రజలు అంతగా పట్టించుకోలేదు. కాలక్రమంలో రాయి పెరుగుతూ ఉండటంతో తప్పని సరిగా ఇది శివలింగమేనని భావించి పూజలు జరిపేవారు. ఆ రాయివల్లనే రాయివలస అనే పేరు వచ్చిందని జనవ్యవహారంలో రావివలసగా మారిందని మరో కథనం ఉంది.

సింగుపురం

ఇది శ్రీకాకుళం గ్రామీణ మండలంలో ఉంది. దీని ప్రాచీన నామం సింహపురం. 4వ శతాబ్దం చివరలో ఏర్పాటైన చిన్న రాజ్యాలలో సింహపురం ఒకటి. క్రీ.శ 350లో పిఠాపురం రాజధానిగా మాఠర వంశీయులు కొన్నాళ్లు సింహపురాన్ని రాజధానిగా చేసుకొని పాలించారు. అంతకు ముందు పితృభక్త వంశీయులు దీనిని రాజధానిగా మూడు తరాల వరకూ పాలించారు. కాగా ఈ ప్రాంతానికి చెందిన కళింగ దేశపు రాజు శౌర్య పరాక్రమ పరీక్షలో సింహాన్ని చంపి రాజకుమారిని పెండ్లాడాడు. వారికి పుట్టినవాడు సింహబాహు (సింహబలుడు). అంచేత అతని పేరుమీదుగా సింహపురం అయింది. అతడే ఈ పట్టణాన్ని నిర్మించాడు. ఈ విషయం "మహావంశ" అనే బౌద్ధ గ్రంథంలో ఉంది. సింహం పదానికి వికృతి రూపం సింగం జనవ్యవహారంలో సింగుపురంగా మారింది.

కళింగరాజైన ఖారవేలుని రెండో భార్య సింధుల సింగుపురం గ్రామానికి చెందడం విశేషమని ఆంధ్రప్రదేశ్ భాషా, సాంస్కృతిక వ్యవహారాల శాఖ సంచాలకులు డా॥ దీర్ఘాసి విజయభాస్కర్ పేర్కొన్నారు.

శాలిహుండం

శ్రీకాకుళం పట్టణానికి 15 కిలో మీటర్లు దూరంలో శాలిహుండం ఉంది. కళింగపట్టణానికి సమీపంలోనున్న చిన్న కొండపై గల భాగంలో బౌద్ధుల చైత్యం ఉంది. శాలి అంటే ధాన్యం, హుండం అంటే కుండ. ధాన్యం పండించి నిల్వ చేసే ప్రదేశమని స్పష్టంగా పేర్కొనవచ్చు. ఇక్కడ త్రవ్వకాల్లో లభ్యమైన

రెండు శంఖాలపై చెక్కిన శాలిపేటిక వల్ల కూడా శాలిహుండం అయిందని చెబుతారు. స్థూప చైత్యాలు, మండప విహార శిథిలాలు, పద్మాసనాశీనుడైన బుద్ధుని ప్రతిమ లభ్యమయ్యాయి. ఇక్కడ గల పురావస్తుశాఖవారి మ్యూజియంలో క్రీ.శ2,3 శతాబ్దాలలో రోమ్ దేశం నుంచి తెచ్చిన ప్రత్యేక మేలిమి రాళ్ళతో బౌద్ధ భిక్షువులు నిర్మించిన శిల్పాలు దర్శనమిస్తాయి. ఈ ప్రాంతంలో కళింగపట్నం ఓడరేవు ఉంది. ఈ ప్రదేశం శాతవాహన చక్రవర్తులతో సంబంధం కలిగి ఉంది. శాతవాహనుల రాజధాని ధాన్యకటకం కూడా దాదాపు ఇదే అర్థంలో వస్తుంది. అంచేతనే శాలిహుండం అనే పేరు వచ్చింది. ఇది వంశధార నది ఒడ్డున కొద్ది దూరంలో ఉంది.

వసుంధర

ఎంత అందమైన పేరు ఇది. తమ పల్లె పేరు వసుంధర అని చెప్పుకోడానికి అక్కడి ప్రజలు సగర్వంగా భావిస్తారు. ఈ పల్లె మహేంద్రతనయ నదీ తీరాన, మెళియాపుట్టి మండలంలో వెలసిఉంది. ఈ పల్లెలో హెచ్చు శాతం మంది భూమి పుత్రులే (రైతులు). వీరంతా మట్టిని నమ్ముకొని జీవనయానం సాగిస్తున్నారు. ఇంతకీ ఈ పల్లెకు ఇంత అందమైన పేరు ఎలా వచ్చిందని తెలుసుకోడానికి అందరూ ఉవ్విళ్ళూరుతుంటారు. వివరాలలోకి వెళితే..... ఈ గ్రామాన్ని ఏర్పాటు చేసుకొనే ముందు కొంత మంది పెద్దలు సమావేశమైఓ పండితుణ్ణి ఆహ్వానించారు. ఆవిర్భావం కాబోతున్న గ్రామానికి మంచి పేరు పెట్టాలని పురోహితులను కోరారు. ఆయన సూచన మేరకు ఈ పల్లెకు వసుంధర అని నామకరణంచేశారు. వసుంధర అంటే "భూమి" అని అర్థం.

కొండములగాం

ఈ గ్రామం రణస్థలం మండలంలో ఉంది. ఈ ప్రాంతంలో కొండలతో పాటు మునగచెట్లు ఆ రోజుల్లో విపరీతంగా ఉండేవి. దీంతో ప్రజలు తాము నివశిస్తున్న జానపదానికి కొండమునగాం అని నామకరణం చేశారు. క్రమేపి మునగాం ములగాంగా మారింది. ఈ గ్రామం రణస్థలం నుంచి రామతీర్థం వెళ్లే మార్గంలో ఉంది.

ఇచ్ఛాపురం

ఇక్కడి ఇలవేల్పు స్వేచ్ఛావతి అమ్మవారు. ఆమె పేరుతోనే ఈ పట్టణం వెలసింది. స్వేచ్ఛ అనే పదం క్రమేపి ఇచ్ఛగా మారింది.స్వ+ఇచ్ఛ= స్వేచ్ఛ అని గుర్తించాలి. ఇక్కడ వెలసిన అమ్మవారు కోరికలు తీర్చే కల్పవల్లిగా భక్తులు భావిస్తారు. ఇక్కడ ఏటా జరిగే ఉత్సవాలకు, పండగలకు వేలాది ప్రజలు హాజరై తమ మొక్కుబడులను తీర్చుకుంటారు. మామూలు రోజుల్లో సైతం పట్టణాన్ని సందర్శించేవారు, తప్పనిసరిగా అమ్మవారి ఆలయానికి వెళ్లి పూజాదికాలు జరపటం విశేషం. ఇచ్ఛాపురం ఒడిషా రాష్ట్ర సరిహద్దుల్లో ఉంది. ఉత్కళాంధ్ర సంస్కృతికి ఈ పట్టణం ప్రతీకగా నిలుస్తుంది. ఇక్కడ ప్రజలు ఒడియా యాసతో తెలుగు మాట్లాడటం విశేషం.

దీపావళి

దీపావళి గ్రామం గార మండలంలో ఉంది. శ్రీకాకుళం పట్టణానికి 8 కి.మీ॥ దూరంలో ఉంది. గొంటి పంచాయతీలోని ఈ పల్లె జనాభా సుమారు వెయ్యి. 1652-1682 మధ్య కాలంలో అప్పటి చికాకోల్ ముస్లింల పాలనకు కేంద్రంగా ఉండేది. కళింగపట్నం వరకు ఉన్న ప్రాంతానికి ఉన్న మహమ్మద్ అనే రెవెన్యూ పాలానాధికారి విధి నిర్వహణలో భాగంగా శిస్తులు వసూలు చేసేందుకు ఈ ప్రాంతాలకు గుర్రంపై వెళ్లేవారు. రహదారి సౌకర్యం లేనందున గుర్రమే పెద్దదిక్కు గా ఉండేది. ఒక రోజున ఈ ప్రాంతంలోని ఓ పల్లె సమీపంలోకి వస్తుండగా ఏమైందంటే, ఆయన బాగా అలసిపోయారు. గుర్రం మీద నుంచి క్రింద పడ్డారు.కనీసం త్రాగునీరు కూడా అందుబాటులో లేని పరిస్థితి ఎదురయ్యింది. దీంతో ఆయన సొమ్మసిల్లి పడిపోయారు. అయితే ఈ విషయం గమనించిన గొర్రెల కాపర్లు గబగబా వచ్చి తాగునీరు అందించి సపర్యలు చేశారు. ఆ తరువాత గ్రామంలోకి తీసుకొని వెళ్లి పిండివంటలతో మంచి భోజనాన్ని ఏర్పాటు చేసి సంతృప్తి పరిచారు. దీంతో ఆ ముస్లిం అధికారి ఆనందానికి అవధులు లేవు .రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఉదంతం దీపావళి రోజున జరిగింది.

అప్పటి నుంచి ఈపల్లెకు కొత్తగా దీపావళి అని నామకరణం చేశారు. ఆపేరే స్థిరపడింది. అంతకముందు గొంటిగ్రామం పరిధిలో ఈ జనావాసం ఉండేది. దీపావళి పేరును ఖరారు చేస్తూ ఆ ముస్లిం అధికారి మహమ్మద్ ఉత్తర్వులను జారీ చేశారు. దీపావళి గ్రామంతో తనకున్న ఆత్మీయతను గమనంలోకి తీసుకొని ఆపల్లెలో మసీదు నిర్మాణంతో పోలిన హిందూ దేవాలయాన్ని ఆ అధికారి నిర్మించారు. ప్రస్తుతం ఆ నిర్మాణం పూర్తిగా శిథిలం అయింది. అలాగే ఈపల్లెలో రాతి బావిని కూడా ఏర్పాటు చేశారు.

కళింగపట్నం

ఇది గార మండలంలో ఉంది. కళింగరాజులు ఈ ప్రాంతాన్ని పెద్ద రేవు పట్నంగా, రాజధానిగా ఉపయోగించేవారు. రాయకళింగ గంగు అనే రాజు ఈ ప్రాంతాన్ని పాలించి పట్టణాన్ని నిర్మించినట్టు కైఫియత్ వల్ల తెలుస్తుంది. కళింగ రాజుల ప్రాబల్యంతోనే దీనికి కళింగపట్నం అనే పేరు వచ్చింది. కాగా బ్రిటిష్ వారి కాలంలో ఇక్కడ గల చంద్రలింగేశ్వర ఆలయాన్ని మహమ్మద్‌రజాక్ హయాంలో ధ్వంసం చేశారు. అయితేఆయనే ఒక పెద్ద చెరువును నిర్మించారు. ఆ చెరువును మహమ్మద్‌రజాక్ పేరుతోనే పిలుస్తున్నట్టు గ్రామ పెద్ద పొట్నూరు కృష్ణమూర్తి చెప్పారు. ముస్లింల పాలనలో ధ్వంసం చేసిన ఆలయాన్ని 12 ఏళ్ల క్రితం పునరుద్ధరించారు. గతంలో ఇక్కడ నుండి తూర్పు ఆసియా దేశాలకు ఎగుమతులు, దిగుమతులు జరిగేవి. 7దశాబ్దాల కితం దీన్ని మూసివేశారు. ప్రస్తుతం దీప స్తంభం ఉంది. తీర ప్రాంతం 25కి.మీ నుంచి ఓడలకు ఇది కనిపించే విధంగా నిర్మించారు. కళింగపట్నం మంచి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది.

హిరమండలం

ఇది మండల కేంద్రం. వంశధార నదికి సమీపంలో గొట్టాబ్యారేజి వద్ద ఉంది. దీని తొలి పేరు హీరమండలం. హీరం అంటే వజ్రం అని అర్థం. ఈ ప్రాంతంలో వజ్రాల వ్యాపారం ఎక్కువగా జరిగేది. దీంతో ఇక్కడ ఏర్పాటైన గ్రామానికి హీరమండలం అని పేరు పెట్టారు. కాలాంతరంలో హీర మండలం-హిరమండలంగా స్థిరపడింది

పాతపట్నం

ఇది నియోజకవర్గ కేంద్ర మహేంద్రతనయ నదికి సమీపంలో ఉంది. అత్యంత పురాతనమైన గ్రామం కావడంతో దీనికి పాతపట్నం అనే పేరు వచ్చినట్టు స్థానిక వృద్ధులు తెలిపారు. అయితే పాతపట్నం సమీపంలో ఏదైనా కొత్తపట్నం ఉందని అనుకొంటే పొరపాటే అవుతుంది. దీని పేరును కొత్తపట్నంగా మారుద్దామని కొందరు ప్రజా ప్రతినిధులు ఎన్నికల్లో పేర్కొన్నప్పటికీ అదేమీ జరగలేదు. దీని తొలిపేరు పట్నంగా ఉండేది. కాలక్రమంలో పాతపట్నంగా మారినట్టు స్పష్టమౌతోంది. సముద్ర లేదా నదీతీరాలు ఉన్న వాటికి సాధారణంగా ఉత్తర పదం పట్నంగా కనిపిస్తున్నట్టు ఎన్నో దాఖలాలు కనిపిస్తున్నాయి.

చెట్టుపాదిలాం

ఇది గంగువారి సిగడాం మండలంలో ఈ గ్రామం ఉంది. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం ప్రాంతం నుంచి భూపతి వంశీయులు జరుగుబాటు లేక గంగువారి సిగడాం ప్రాంతానికి వచ్చి స్థిరపడదల్చారు. చెట్లు,పొదలతో నిండిఉన్న ఓ ప్రాంతాన్ని బాగుచేసుకొని గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఏర్పాటు చేసుకునే ముందు చెట్లుపొదలను నిర్మూలించి వాసయోగ్యం చేసుకున్నారు. అప్పటి నుంచి ఈ పల్లెకు చెట్టుపొదిలాం అనే పేరు వచ్చింది.

అల్లినగరం

ఈ గ్రామం ఎచ్చెర్ల మండలంలో ఉంది. చిలకపాలెం – మురపాక మార్గంలో అల్లి అడవులు ఎక్కువగా ఉండేవి. వాటిలో కొంత భాగాన్ని నిర్మూలించారు. ఆప్రాంతంలోనే ఓ పల్లె ఏర్పాటైంది. అదే అల్లినగరం గ్రామం.

కామర్స్‌పేట

ఇదేదో వ్యాపారకేంద్రం అనుకుంటే తప్పులో కాలేసినట్టే. ఈ పల్లె అల్లినగరం పంచాయతీలో తలదాచుకుంటోంది. ఈపల్లెలోని శ్రీశయన సామాజిక వర్గంలో కామర్స్ ఇంటిపేరు గలవారే ఎక్కువగా ఉన్నారు. దీంతో ఈ గ్రామానికి కామర్స్ పేట అని అంచక్కా పేరుపెట్టుకున్నారు.

వాల్తేరు

ఈ గ్రామం సంతకవిటి మండలంలో నాగావళి నది తీరంలో ఉంది. ఈ గ్రామానికి ఇంత అందమైన పేరు ఎలా వచ్చిందంటే..... బలరాముడు పంచలింగ ప్రతిష్టల్లో భాగంగా నాగావళి నది ఒడ్డున ఉన్న ఓమారుమూల పల్లెలో శివలింగాన్ని ప్రతిష్టింప దలిచాడు.అయితే ఈ ప్రాంతానికి అతడు వచ్చేసరికి సాయం సంధ్యావేళ అయింది. వాలును, తేరును ఓ దగ్గర ఉంచి, సంధ్యా వందనం చేశాడు. వాల్తేరు అనే నామధేయం ఇలా వచ్చింది. వాలు + తేరు= వాల్తేరు. వాలు అంటే కత్తి, తేరు అంటే రథం. అయితే అప్పటికే ఆ ప్రాంతంలో మార్కండేశ్వరస్వామి వెలసి ఉన్నాడు. దీంతో ఆయన మనసు మార్చుకుని శివలింగాన్ని అక్కడ ప్రతిష్ఠ చేయకుండా మర్నాడు వెనుదిరిగాడు. ఆతరువాత శ్రీకాకుళంలో ఉమారుద్ర కోటీశ్వర లింగాన్ని ప్రతిష్టించాడు.

దూసి

ఇది ఆముదాలవలస మండలంలో ఉంది. నాగావళి(లాంగుల్య) నదీ తీరాన వెలసి ఉంది. సంగీత సాహిత్యాలకు ఆట పట్టుగా ఉంది. ఎన్నో ఏళ్ల కితం దళిత సామాజిక వర్గానికి చెందిన వంశీయులు ఈ గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నారు. పూర్వం గోదావరి ప్రాంతంలో ఉన్న ముంగండ అగ్రహారం నుంచి ఉపద్రష్ట అనే ఇంటి పేరుగల అనే బ్రాహ్మణుడు ఇక్కడకు వచ్చి ఉపాధి కల్పించాలని గ్రామంలోని దళితులను కోరాడు. అప్పటికీ దళితుల ఇంటిపేరు దూసి అని ఉండేది. వీరి వద్ద ఈ బ్రాహ్మణుడు సుమధుర కవిత్వాన్ని వినిపించాడు. ఈ విషయాన్ని విజయనగరం సంస్థానాధీశులకు తెలియజేశారు. సంస్థానాధీశుడు నిర్వహించిన సాహితీ సరీక్షలో ఆ బ్రాహ్మణుడు తన ప్రతిభను ప్రదర్శించాడు. రాజు సంతోషించి భూములను దానం చేశాడు. అయితే దూసి ఇంటి పేరు కలిగిన దళితులు తమ ఇంటి పేరునే బ్రాహ్మణుడు మార్చుకోవాలని సూచించారు. ఆ విధంగా ఇంటి పేరును మార్చుకుంటే అన్ని విధాల సహకరిస్తామని పేర్కొన్నారు. అందులకు ఆ "ఉపద్రష్ట" ఇంటి పేరు కలిగిన బ్రాహ్మణుడు తన ఇంటి పేరును

దూసి అని మార్చుకున్నాడు. ఇది దూసి ఇంటిపేరు వెనుకగల చరిత్ర "తూర్పుభామా కలాపం" రచయిత దూసి జగన్నాధ శాస్త్రి ప్రముఖ భావగవతార్ దూసి బెనర్జీ, దూసి రామ్మూర్తి భాగవతార్, దూసి గోపాలం భాగవతార్ ప్రముఖ సాహితీవేత్తలు దూసి ధర్మారావు,దూసి అలివేలు, అంతర్జాతీయ నృత్య కళాకారిణి స్వాతి స్వామినాథన్ తదితరులు ఈ ప్రాంతానికి చెందిన వారే.

వల్లభరాయిపాడు

ఈ గ్రామం నందిగాం మండలంలో ఉంది. గ్రామానికి నైరుతి దిశలో ఓ పెద్ద మర్రిచెట్టు తొర్రలో వల్లభనారాయణ స్వామి విగ్రహం ఉండేది. ఎలాంటి ఆలనాపాలనా లేకుండా అలక్ష్యానికి గురైంది. అయితే ఆ దేవుడు మందస రాజు కలలోకి వచ్చి ఓ ఆలయాన్ని నిర్మించాలని కోరాడు. దీంతో ఆయన దైవాజ్ఞ మేరకు పలాన సమీపంలో గల రట్టిలో వల్లభనారాయణస్మామి ఆలయం నిర్మించారు. ఇదీ స్థలపురాణం.మర్రిచెట్టు తొర్రలో వెలసిన దేవుని పేరుతో వల్లభరాయిపాడు ఏర్పాటైంది. పాడు అంటే పాటి నేలలో నిర్మించిన గ్రామం అని అర్థం. కార్తీకమాసంలో ఈ గ్రామంలో పెద్దఎత్తున ఆరాధన కార్యక్రమాలు జరుగుతాయి.

గోసాం

ఇది రణస్థలం మండలంలో ఉంది. ఈ గ్రామాన్ని ఏర్పాటు చేసేటపుప్పుడు వేరే ప్రాంతాల నుంచి వలస వచ్చిన పలువురు తమ గోసంపద తోనే ఇక్కడకి వచ్చి స్థిరపడ్డారు. గోసంరక్షణకు అగ్రతాంబూలం ఇచ్చే వారు. ఇక్కడ గల పెద్ద చెరువును గోపాలుని చెరువుగా పిలుస్తారు. గోవుల ప్రస్తావనతో నాడు ప్రసిద్ధి చెందడంతో దీనికి గోసాం అని నామకరణం చేశారు. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన విద్యార్థి కె.నాగిరెడ్డి తెలియజేశాడు.

తెలిగపెంట

ఇది సరుబుజ్జిలి మండలంలో ఉంది. శ్రీముఖలింగానికి 13 కిలో మీటర్ల దూరంలోని దంతవక్త్రుని కోట శిథిలాల్లో నాణేలు దొరికాయని ఇవి సంగ్రహించిన పేదలెందరో ధనవంతులయ్యారని ఈ ప్రాంతంలోచెప్పుకునేవారు.

వంశధార నదికి సమీప గ్రామమైన తెలిగపెంట గ్రామంలో తూర్పుచాళుక్య లక్షణాలు కలిగిన శాసనాలు బయటపడ్డాయి. అందులో ఒక శాసనంలో త్రిలింగవాటిక అని రాసిఉంది. త్రిలింగవాటికకు వికృతి రూపం తెలిగపెంటగా భావిస్తున్నారు. ఇలా ఈ గ్రామ నామంస్థిరపడింది.

దీర్ఘాసి

ఇది పోలాకి మండలంలో ఉంది. ఇక్కడ ఒకప్పుడు రైతులకు. తదితర వర్గాలకు అవసరమైన పెద్ద కత్తులను తయారుచేసేవారు. కాగా కళింగయుద్ధానికి (క్రీ.పూ261) సంబంధించి ఈ గ్రామంలో పెద్దపెద్ద కత్తులను తయారు చేసి రాజధానికి పంపించేవారు. దీర్ఘ+అసి అని వీడదీయవచ్చు. దీర్ఘ అంటే పొడవైన, అసి అంటే కత్తి అని అర్థం. అలా ఈ గ్రామాన్ని దీర్ఘాసి అని పేరు వచ్చింది. క్రీ.శ 1077(శక.సం.997)లో ఏర్పాటు చేసిన దీర్ఘాసి(వనపతి) శాసనంలో ఓ సీసపద్యం ఉంది. "శ్రీ శుకునే కోడలు భూసతిపై శైల.....దీవియవట్టే న ద్ధేనికి" అని ఉంది. దీనిని సర్వసైన్యాధ్యక్షుడు గణపతి వేయించాడు. ఈ శాసనంలో 23 పంక్తులున్నాయి. ఇందులో మొదటి 16 పంక్తులు సంస్కృతంలో మిగిలిన 7 పంక్తులు తెలుగులో ఉన్నాయి. దీన్ని బట్టి, నన్నయకు పూర్వమే పద్య రచన ఉండేదని "శ్రీకాకుళం జిల్లా చరిత్ర" (1975) పుస్తకంలో ఆదిభట్ల వెంకట రమణ పేర్కొన్నారు. దీర్ఘాసి శాసనంలోని భాష, శక. సం.987లో ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయంలో గల శాసనభాష ఒక్కలాగే ఉంటుంది. ఇక్కడి శ్రీభగవతి దుర్గమెట్ట అమ్మవారి దేవాలయం చారిత్రక ప్రసిద్ధి చెందింది. ఈ శాసనం ఎంతో విలక్షణమైందని తహశీల్దార్ జన్ని రామారావు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ఆధార ప్రతులను రచయితకు అందజేశారు.

గుర్రాలపాలెం

ఈ గ్రామం లావేరు మండలంలో ఉంది. దీని తొలి పేరు పాలెం. గ్రామంలో వెలసిన గుర్రమ్మ పేరంటాల పేరుతోనే ఈ పల్లెకు గుర్రాల పాలెం అనే పేరు వచ్చింది. కాగా విజయనగరం సంస్థానాధీశుల హయాంలో ఇక్కడ గుర్రపుశాల ఉండేదని మరో కథనం ప్రచారంలో ఉంది.

గుళ్లసీతారామపురం

ఈ గ్రామం సంతకవిటి మండలంలో ఉంది. గుడి+లు=గుళ్లు ఈ గ్రామంలోని సీతారాముల ఆలయాన్ని 16వ శతాబ్దంలో బొబ్బిలి సంస్థానాధీశులు నిర్మించారు. సీతారాముల పేరుతో సీతారాంపురంగా, కాగా ఈ ఆలయ ప్రాంగణంలో చిన్న చిన్న గుళ్లు ఉన్నాయి. ఆలయాన్ని ఆనుకొని ప్రదక్షిణ మార్గంలో 12 మంది ఆళ్వారులు దర్శనమిస్తారు. దీంతో ఆ గ్రామానికి గుళ్లసీతారామపురం అనే పేరు వచ్చింది. ఈ ఆలయంలో రాముడు, సీత మాత్రమే ఏకాంతంగా ఉన్న ఏకశిలా విగ్రహం ఉండడం ఇక్కడి ప్రత్యేకత. నిత్య పూజలు, ఉత్సవాలు క్రమం తప్పకుండా జరుగుతుంటాయి.

వనిత మండలం

ఈ పల్లె పోలాకి మండలంలోని ఉంది. ఎంతో అందంగా ఉందికదా ఈ ఊరి పేరు. గ్రామం వెలిసినప్పటి నుంచి ఈ గ్రామంలో పురుషుల కన్నా వనితల సంఖ్య ఎక్కువగా ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం గ్రామ జనాభా 665 ఉండ గా, పురుషుల సంఖ్య 330, వనితల సంఖ్య 335 మంది ఉన్నారు. అయితే వనిత మండలం అని ఈ గ్రామానికి పేరు ఎలా వచ్చిందంటే ఐతిహ్యం ప్రకారం వంశధార ప్రాంతంలోని శాలిహుండం బౌద్ధవిహారం ఉన్న స్థలంలో అలనాడు ఓ మహారాజు ఉండేవాడని, అతడు తన వనితలైన రాణులను, ప్రియురాళ్ళలను, పనివారిని నదికి అవతల ఉన్న జనావాసంలో ఉంచాడని అంచేతనే ఈ పల్లెకు వనితమండలం లనే పేరు వచ్చిందని స్పష్టమవుతోంది. ఈ గ్రామానికి వెళ్ళడానికి అనుకూలంగా వేసిన పురాతనమైన రాళ్ల శిథిలాలు నేటికి కూడా నదిలో నీరు తగ్గినప్పుడు కనిపిస్తాయి.

అంపోలు

ఈ గ్రామం గార మండలంలో ఉంది. చేనేత,పాలిస్టర్ వస్త్ర పరిశ్రమకు ప్రసిద్ధి గాంచింది. ఇందులో ఆల అంటే గోవులని అర్థం. ప్రోలు అంటే పట్టణము అని అర్థం. ఒకప్పుడు అంపోలు చిన్న బస్తీగా ఉండేది. ఈ జనావాసం సాగరతీరానికి సమీపంలో ఉంది. అలాగే వంశధార నదికి కూడ దగ్గరలో ఉంది. గతంలో ఈ

గ్రామంలో గోవుల సంఖ్య విపరీతంగా ఉండేది. వీటికోసం సువిశాలమైన మైదానాన్ని ఏర్పాటు చేసి గోశాలలను కూడా నిర్వహించేవారు. జనవ్యవహారంలో ఆలప్రోలు అంపోలుగా మారినట్టు పలువురు సాహితీ వేత్తలు పేర్కొన్నారు. ఈ గ్రామంలోని ఆగస్త్యేశ్వరాలయం ప్రముఖ దివ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా॥దీర్ఘాసి విజయభాస్కర్ స్వగ్రామం ఇదే.

కొర్ని

ఇది గార మండలంలో ఉంది. దీని తొలి పేరు ఖొన్న. నాటి శ్రీముఖలింగం పాలకుడు అనంతవర్మ చోడగాంగదేవుడు (1078-1150) తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఈ గ్రామాన్ని బ్రాహ్మణులకు దానం చేశాడు. ఇక్కడ దొరికిన రాగి శాసనాన్ని గిడుగు సీతాపతి పరిష్కరించారు. ఇందులో తూర్పు గాంగరాజుల వంశవృక్షం ఉంది. కాగా ఖొన్న గ్రామం జనవ్యవహారంలో కొర్నిగా మారింది.

కనుగులవానిపేట

ఈ పల్లె శ్రీకాకుళం గ్రామీణ మండలంల్లో ఉంది. ఈ గ్రామం తొలిపేరు లబ్బోడిపేట. కనుగలవానిపేటకు ఆ పేరు ఎలా వచ్చిందంటే ఇంటిపేరు కనుగులతో ఉన్న వ్యక్తులు హెచ్చు మంది ఉండడంతో కనుగులవానిపేట అని నామకరణం చేశారు. అయితే నాటి లబ్బోడిపేటకు అప్పుడు ఆపేరు ఎందుకు పెట్టారంటే.... లబ్బ ఇంటిపేరుతో ఉన్న శ్రీశయన సామాజికవర్గం వారు ఎక్కువమంది ఉండేవారు. అయితే వీరంతా బతుకు తెరువు కోసం పరదేశిపాలెం ప్రాంతానికి వలస వెళ్లారు. తాజాగా కనుగులవానిపేటగా స్థిరపడింది

నౌపడ

ఇది సంతబమ్మాళి మండలంలో ఉంది. శ్రీకాకుళం జిల్లాలో ఏకైక రైల్వే కూడలి ఇది. నౌపడ అనగానే ఉప్పు గల్లీలు, రాజావారి రైలు మార్గం గుర్తుకొస్తాయి. ఇంతకీ ఈ ఊరికి ఆ పేరు ఎలా వచ్చిందంటే... నవ+పథ్ అనే

పదాల నుంచి నవపథంగా వచ్చింది. నవ అంటే కొత్తదైన, పథం అంటే మార్గం అని అర్థం. 1892లో పర్లాఖిముండి రాజులు నౌపడ నుంచి గుణుపూర్ వరకూ 91 కి.మీ 6 ఫర్లాంగుల నేరోగేజ్ రైలు మార్గాన్ని నిర్మించారు. ఇలా ఇది నవపథంగా మారి ఆ తరువాత జనం వాడుకలో నౌపడగా మారినట్టు ప్రముఖ పాత్రికేయులు పేడాడ పరమేశ్వరరావు ఈ రచయితకు తెలిపారు. నౌపడలో పర్లాఖిముండి రాజుల బంగ్లా కూడా ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉంది.

తేలినీలాపురం

ఈ గ్రామం టెక్కలి మండలంలో ఉంది. శ్రీకాకుళం నుండి ఇచ్ఛాపురం వెళ్లే జాతీయ రహదారిపై టెక్కలి నుంచి ఏడు కిలో మీటర్లు దూరంలో ఉంది. ఈ పేరు వెనుక ఒక కథ ప్రచారంలో ఉంది. ఈ గ్రామంలో పూర్వం రెండు కులాలు వారు నివశించేవారు. తెలికల, రెడ్డిక అనే రెండు కులాలవారు ఆపల్లెలో ఇంచుమించు అన్ని రంగాలలో సమాన ప్రాతినిధ్యం ఉండేది. ఊరు పేరును ఎవరి కులానికి సంబంధించిన పేరు వారు పెట్టుకోవాలని ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. చివరికి పెద్దల సమక్షంలో సయోధ్య కుదిరింది. అదేమిటంటే తెలికల కులానికి చెందిన పేరులో తొలి రెండు అక్షరాలు, రెడ్డి కులంలో అత్యధిక ప్రజల ఇంటిపేరైన నీలాపు అనే పదం వచ్చేటట్టుగా ఆ గ్రామానికి తేలినీలాపురంగా మార్చారు. (తేలి+నీలా+పురం) ఆ తరువాత కాలంలో రెడ్డి సామాజిక కర్గం వారు ఏ కారణం చేతనో ఆ ఊరి నుంచి వలసపోయారు. ఈగ్రామానికి ఓ ప్రత్యేకత ఉంది. ప్రతి ఏటా సెప్టంబర్‌లో పెలికాన్, స్టార్క్ పక్షులు సైబీరియా, రష్యా, మలేసియా, హంగేరి, సింగపూర్, జర్మన్ దేశాల నుండి ఈ గ్రామ ప్రాంతానికి వలస పక్షులు వస్తుంటాయి. మార్చి నెలాఖరు వరకు ఉండి తిరిగి వెళ్లిపోతాయి. మొత్తం 113 రకాల పక్షులు ఇక్కడికి వస్తున్నట్టు పరిశోధనలో తేలింది. తేలినీలాపురం పక్షుల కేంద్రంలో జరిగిన ఓ ఉదంతంపై సీనియర్ పాత్రికేయులు పేడాడ పరమేశ్వరరావు ప్రేరణ చెంది "పక్షి"అనే గొప్ప నాటికను రాశారు. దీనికి 1992లో కేంద్ర సాహితీ సమ్మేళన్ (న్యూదిల్లీ) జాతీయ పురస్కారం లభించింది.

దంతపురి

ఈ గ్రామం సరుబుజ్జిలి మండలంలో, రొట్టవలసకు కూతవేటు దూరంలో ఉంది. ఈ గ్రామ ప్రాంతంలో పురాతన బౌద్ధస్థూపాలు ఉన్నాయి. ఇక్కడ బౌద్ధమతస్థులు నివశించేవారని స్పష్టమవుతోంది. ఇది ముఖ్యమైన పురాతన బౌద్ధప్రదేశము. ఇది బుద్ధజ్ఞాన దంతపురిగా పిలువబడుతోంది. పురావస్తు పరిశోధకులు ఇక్కడ కొన్ని ఇటుకలు కుండలు, గాజులు, రాతి ఇనుప వస్తువులను కనుగొన్నారు. క్రీ॥పూ 261 లో కళింగ యుద్ధం తరువాత ఈ ప్రాంతం ప్రముఖ బౌద్ధ ప్రదేశంగా విరాజిల్లింది. కళింగరాజులు ఈ ప్రాంతాన్ని మత రాజధానిగా భావించేవారు.బుద్ధుని నిర్యాణం తరువాత అతని జ్ఞాన దంతం హర్షఖేరుతేరుడు ద్వారా కళింగరాజైన బ్రహ్మదత్తకు అందజేశారు. బ్రహ్మదత్తుడు ఈ దంతాన్ని భూస్థాపితం చేసి దానిపై ఒక స్థూపాన్ని నిర్మించాడు. ఈప్రాంతంలో బుద్ధుని జ్ఞానదంతం ఉన్నందున దంతపురి లేదా దంతవరపు కోటగా పిలుస్తున్నారు. బౌద్ధ సాహిత్యంలో ఈ ప్రదేశం దంతవక్త్రుని కోటగా వ్యవహరిస్తున్నారు. దంతపురికి ఘనచరిత్ర ఉంది. మధ్య యుగంలో తూర్పు గంగ వంశపు రాజులు జారీ చేసిన శిలా, తామ్ర శాసనాలు దంతపురం కళింగదేశపు రాజధానిగా ధృవీకరిస్తున్నాయి. కొన్ని శాసనాల (క్రీ.శ10340 ప్రకారం అనంతవర్మ చోడగంగరాజైన కామార్ణపుడు దంతపురం రాజధానిగా పాలించినట్టు చెబుతోంది. క్రీ.శ1105, 1113మధ్య కాలంలో శ్రీముఖలింగంలో లభించిన శాసనాలు కళింగదేశపు రాజధాని దంతపురంగా వెల్లడిస్తున్నాయి. ఆ తరువాత కళింగ రాజధానిని దంతపురం నుంచి శ్రీముఖలింగానికి మార్చినట్టు ఆధారాలున్నాయి. ఇక ధనగుప్తుడు అనే రాజు పరిపాలనలో మట్టితో నిర్మించిన ఈ కోట సుమారు 500 ఎకరాల విస్తీర్ణం చుట్టూ 50 అడుగుల వెడల్పు, 20 అడుగుల ఎత్తు కలిగిన మట్టి గోడలు ఆనాటి కోటకు ఆనవాళ్లుగా ఇప్పటికీ ఉన్నాయి. దంతపురానికి అనుబంధంగా మూడు కోటలు, ఒక దుర్గం ఉండేవని చెప్తారు. కోటలో ఉన్న స్థానం లో నిర్మించిన గ్రామాలనే కొత్తకోట ధనుకోట, పెద్దకోటగా పిలుస్తారు. కరకవలసలోని దుర్గంలో

ఇప్పటికి ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. కోట చుట్టు 8 ద్వారాలు ఉండేవి. అవి ఉన్న ప్రదేశాలలో ఇప్పుడు 8 గ్రామాలు వెలసి ఉన్నాయి. అవే ఈనాటి రావివలస, పాలవలస, పెద్దపాలెం, చిన్నపాలెం, కొండవలస, మునగవలస, రొట్టవలస, అవతారబాదులు. ఈ కోట చుట్టూ ఏర్పాటైన ఆనాటి కందకమే నేడు బందలుగా పిలుస్తున్నారు. పూర్వం నుండి ఈ గ్రామానికి సంబంధించిన రైతులు చరిత్ర అడుగంటిన తరువాత వంశపారపర్యంగా కోట ప్రాకారానికి లోపల గల మెట్టుభూమిపై ఉలవలు, జొన్నలు, వేరుశనగ, జనపనార, మిరప, కూరగాయలు పండిస్తున్నారు. అయితే అప్పుడప్పుడు బావులు తవ్వినప్పుడు లేదా గోతులు తవ్వినప్పుడు వింత వింత మట్టిపాత్రల డిజైన్‌లతో కూడిన పెంకులు, ఆటవస్తువులు లభ్యమయ్యాయి. చిన్నచిన్న బంగారపు వస్తువులు, చిన్నచిన్న విడి భాగాలు దొరికేవి. 10 ఏళ్లక్రితం ఆంధ్రప్రదేశ్ పురావస్తుపరిశోధన శాఖవారి వద్ద ఉన్న ఆధారాల ప్రకారం భీమిలి, తుని, శ్రీకాకుళంలో తవ్వకాలు ప్రారంభించారు. వారి దగ్గర కొన్ని బ్లూప్రింట్లు దగ్గర పెట్టుకొని పురావస్తు పరిశోధన శాఖ దంతపురి ప్రాంతంలో తవ్వకాలు జరిపింది. ఈ కార్యక్రమం ఆనాటి పురావస్తు పరిశోధనా శాఖ కమిషనర్ ఎస్.కె పచోరి స్వయంగా వచ్చి అప్పటి జిల్లా కలెక్టర్ అనీల్ చంద్రపునేఠా ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ ప్రాంతంలో పురాతత్వశాఖ జరిపిన తవ్వకాల్లో మూడు బౌద్ధ స్థూపాలు బయటపడ్డాయి. ఇంకా తవ్వకాలు జరిపితే మహా స్థూపం బయటపడుతుందని ఆశిస్తున్నారు. బయటపడిన ఈ స్థూపాలు బౌద్ధమతానికి చెందినవని, ఇవి శాలిహుండం స్థూపాన్ని పోలి ఉండటం గమనార్హం. అలాగే అక్కడ పైపై తవ్వకాల్లో బయటపడిన ఆధారాల ప్రకారం ఒక చిన్న అంత:పురం, వంశధార నదికి ఒక సొరంగం ఉన్నట్టుగా శాఖపరమైన సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. తవ్వకాల్లో దొరికిన ఆధారాల నివేదిక ప్రకారం ఈ ప్రాంతాన్ని ఒక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ద వచ్చుననే భావనతో పర్యాటక శాఖ ఉంది. 2002 జూన్ 10వ తేది నుండి మూడు రోజులపాటు ఇక్కడ ఉత్సవాలు నిర్వహించారు. అప్పటిలో కోట మధ్య ప్రాంతంలో బుద్ధుని ఏకశిలా విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. 2003, 2004 సంవత్సరంలో బుద్ధ జయంతి ఏర్పాట్లలో భాగంగా ఉత్సవాలను జరిపారు.

పురుషోత్తపురం

ఇది సరుబుజ్జిలి మండలంలో ఉంది. ఈ జానపదానికి పేరు వెనుక గల చరిత్రను పరిశీలిస్తే..... పురుషోత్తముడు అనే పొందరి (కూరగాయలు పండించే సామాజిక వర్గం) ఇక్కడ కూరగాయలు పండిస్తూ స్థిరనివాసం ఏర్పాటుచేసుకున్నాడు. అతని పేరుతోనే ఈ పల్లెకు పురుషోత్తపురం అనే పేరు వచ్చినట్టు స్థానిక విశ్రాంత తెలుగు అధ్యాపకులు, ప్రముఖ రచయిత డా॥ సనపల నారాయణమూర్తి ఈ రచయితకు తెలిపారు. ఒకటవ శతాబ్దానికి చెందిన లకులీశుడు పాశుపత శైవ సంప్రదాయానికి ఇక్కడే శ్రీకారం చుట్టారు. ఈశ్వరుని 21వ అవతారంగా భావించే లకులీశుని విగ్రహంతో పాటు అతని సతీమణి కీరవాణి విగ్రహాలు ఇక్కడి తవ్వకాలలో బయటపడ్డాయి.

పర్వతాలపేట

ఇది సరుబుజ్జిలి మండలం, తెలిగపెంట పంచాయితీలో పరిధిలో ఉంది. తెలుగు వ్యవహారికభాషా పితామహుడు గిడుగు రామమూర్తి స్వగ్రామం ఇది. పర్వతాలపేటకు ఈ పేరు ఎలా వచ్చిందంటే.... పర్వతాలు అనే మోతుబరి పేరుతో ఈ గ్రామానికి ఆ పేరు వచ్చింది. ఉత్తర పదంలో పేట ఉంది. కొత్తగా ఏర్పాటు చేసుకున్న గ్రామాలకు పేట చేరడం సాధారణంగా కనిపిస్తుంది. పర్వతాలపేట అనగానే అక్కడ పర్వతాలు, కొండలు ఉన్నాయేమోనని అనిపిస్తుంది. అయితే ఇది నిజం కాదు. వ్యక్తి నామధేయంగా (పర్వతాలు) ఏర్పడిన గ్రామం ఇది.

కూనజమ్మన్నపేట

ఇది సరుబుజ్జిలి మండలంలో ఉంది. కూన ఇంటి పేరుతో ఏర్పాటైన పల్లె ఇది. ఈ గ్రామం వీరజవానులకు పుట్టినిల్లు. జవాను అనే పదాన్ని శ్రీకాకుళం యాసలో జమాను అని అంటారు. జమాను అనే పదం జమ్మన్నగా మారింది. ఇలా కూనజమ్మన్నపేట అని ఈ గ్రామానికి పేరు వచ్చినట్టు స్థానికులు పేర్కొన్నారు.

బారువ

ఇది సోంపేట మండలం సముద్ర తీరంలో ఉంది. ఇక్కడ తీరం బహు అందంగా,ఆహ్లాదకరంగా ఉంటుంది. ఉదయిస్తున్న సూర్యుణ్ణి సముద్ర తీరంలో నిల్చొని చూడటం ఆద్భుతమైన అనుభూతిని కలిగిస్తుంది. ఇక్కడ పుష్కరాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. బంగాళఖాతంలో కలుస్తున్న పవిత్ర మహేంద్ర తనయ నది సంగమ స్థలమే బారువ. ఆంధ్ర, ఒడిషా రాష్ట్రాల నుండి అనేక మంది పుణ్యస్నానాలకు ఇక్కడకు వస్తుంటారు. మాఘమాసం శ్రవణ నక్షత్రం సమయాన పుష్కర శుభఘడియలు ప్రారంభం అవుతాయి. ప్రతి 12 ఏళ్లకు ఒకసారి వచ్చే పుష్కర మహోదాయానికి ఈ స్థలం ప్రత్యేకగాంచింది. 2016 ఫిబ్రవరి 7, 8 తేదీలలో మహోదయ ఉత్సవాలను పెద్దఎత్తున నిర్వహించారు. స్కందపురాణం ఆధారంగా సుమారు 16 వేల సంవత్సరాల క్రితం తూర్పు కనుమలలో నడయాడిన పాండవులు ఒక అడవి జంతువునువేటాడే ప్రయత్నంలో విడిచిన బాణం సుదూరంలో ఉన్న ఒక గోవును తాకగా అది చనిపోయింది. గోహత్యమహా పాపమని భావించి పాప విమోచనం కోసం ఆలోచించారు. ఈనేపథ్యంలో శ్రీకృష్ణుడ్ని అర్జునుడు కోరగా అందుకు మృతి చెందిన గోవును సముద్రతీరానికి తీసుకువెళ్లి కర్మకాండలు నిర్వహించాలని సల హా ఇచ్చారు. దీంతో ఆగోవును సాగరతీరానికి తరలించి అంత్యక్రియలు జరిపారు. ఆ తరువాత అక్కడే ఉన్న పావన మహేంద్రతనయ నదీ సాగర సంగమ స్థలంలో పాండవులు స్నానాలు చేశారు. పాండవులు సంగమ స్నానం చేసిన తరువాత సమీపంలో ఉన్న గ్రామానికి వెళ్లి అక్కడ 12 మంది బ్రాహ్మణుల సమక్షంలో భారీ ఎత్తున యజ్ఞాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఆ గ్రామాన్ని బారహరపురంగా (బారహ అంటే 12 మంది) పిలిచేవారు. కాలక్రమేణ అది బారువగా మారింది.

తురక శాసనం

ఇది సోంపేట మండలంలో ఉంది. ఇది 17వ శతాబ్దంలో మహమ్మదీయ (తురక) ప్రభువుల పాలనలో ఉండేది. ఇక్కడ శాసనం అంటే అధికార హవా అని అర్థం చేసుకోవచ్చు. అంతే గానీ ముస్లింలు ఇక్కడ శాసనం వేయించారని

కాదు. ఆ రోజుల్లో ఈ ప్రాంతంలో ఓ రైతుకు శవపేటికలో నెలవంక చిహ్నంతో ఉన్న కాసులు కొన్ని దొరికాయి. వీటిని ఆ రైతు అధికారులకు అందజేశాడు. ఈ ఉదంతం ముస్లిం పాలనను ధృవీకరిస్తున్నాయి. ఇలా ఈ పల్లెకు తురక శాసనం అనే పేరు వచ్చినట్టు స్పష్టమౌతోంది. అయితే నేడు కనీసం ఒక్క ముస్లిం కుటుంబం కూడా లేదు. ఈ గ్రామం తురకశాసనంగానే ప్రభుత్వ దస్త్రాల్లో ఉంది.

శాసనాం

ఇది కంచిలి మండలంలో ఉంది. ఈ పంచాయితీ పరిధిలో జలాంతరశాసనం, పూర్ణశాసనం, కళింగశాసనం గ్రామాలు ఉన్నాయి. అయితే ఈ గ్రామాలకు సంబంధించి ఒక్క శాసనం అచూకీ కూడా తెలియడంలేదు. ఈ గ్రామాలకు శాసనాం అనే పేరు వెనుకగల చరిత్ర ఇప్పటికీ వెలుగుచూడలేదని సర్పంచి గుడిభద్ర వేణు రచయితతో మాట్లాడుతూ అన్నారు. తొలుత ఈ గ్రామాలను శాసనం పేరుతో పిలిచేవారు. కాలగమనంలో శాసనాంగా మారింది. ఇదిలా ఉండగా ఇక్కడకు సమీపంలోని సోంపేట మండలంలో గల బేసి రామచంద్రపురం పంచాయితీ పరిధిలో పల్లిశాసనం గ్రామం ఉంది. అయితే ఇక్కడ కూడా ఎలాంటి శాసనం బయటపడలేదని స్థానిక ప్రముఖులు పి.అప్పన్న తెలిపారు. ఏమైనప్పటికీ శాసనాల పేరుతో గ్రామాలు ఏర్పడడం విశేషం.

కలివరం

ఈ గ్రామం ఆమదాలవలస మండలంలో నాగావళి ఒడ్డున వుంది. ఈ గ్రామంలో ఒకప్పుడు కవులు,కళాకారులు హెచ్చుసంఖ్యలో ఉండేవారు. తొలుత ఈ గ్రామాన్ని కవివరం అని పిలిచేవారు. కాలక్రమేణా ఈపల్లె కలివరంగా ప్రసిద్ధికెక్కింది. ఈ గ్రామానికి చెందిన ముద్దంశెట్టి హనుమంతురావు ప్రఖ్యాత తెలుగు రచయితగా గుర్తింపు పొందారు. ఈయన 1928 డిశంబరు1వ తేదీన ఇక్కడ జన్మించారు. అలాగే బోను వెంకటరమణ అనే యువ రచయిత కూడా ఇదే గ్రామానికి చెందినవారే.

నేరడి

ఈ గ్రామం భామిని మండలంలో ఉంది. ఈ గ్రామం నేరేడు చెట్లకు ఎంతో ప్రసిద్ధిచెందింది. ఇక్కడ నుంచి సుదూర ప్రాంతాలకు సైతం నేరడి పండ్లను బుట్టలతో పంపుతారు. అయితే కాలక్రమేణా నేరడి చెట్ల పెంపకం తగ్గిందనే చెప్పాలి. ఏమైనప్పటికీ నేరేడు పంట పేరుతోనే నేరడి గ్రామ నామకరణ జరిగినట్టు ఆ గ్రామంలోని పూర్వీకుల కథనం. ఇదిలా ఉండగా మెళియాపుట్టి మండలంలో వెంకటాపురం పంచాయితీ పరిధిలో పుల్లంగి నేరేడులోవ అనే గ్రామం ఉంది. పూర్వం ఎత్తయిన కొండపై నివాసం ఉంటున్న గిరిజనులు నేరేడు చెట్టునే అమ్మవారిగా కొలుస్తున్నారు. నేరేడమ్మ అంటే వారికి పంచ ప్రాణాలు.

వాండ్రంగి

ఈ గ్రామం గంగువారి సిగడాం మండలంలో ఉంది. ఈ గ్రామంలో ఒకప్పుడు వడ్రంగుల సంఖ్య అధికంగా ఉండేది. వీరు కలపతో గృహోపకరణాలు తయారు చేసేవారు. అంతే కాకుండా వ్యవసాయ ఉపకరణాలైన నాగలి, కాడి మేడి, నాటుబండ్లు తయారు చేసేవారు. వివిధ ప్రాంతాల నుంచి తమ అవసరాల కోసం ప్రజలు ఇక్కడకి వచ్చి వీటిని తయారు చేయించుకునేవారు. అయితే కాలక్రమేణా వడ్రంగులు పొందూరు పాతబస్టాండు ప్రాంతానికి వచ్చి స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం పరిమిత కుటుంబాలు మాత్రమే వాండ్రంగిలో ఉంటున్నాయి. వడ్రంగుల పేరుతోనే తొలుత వడ్రంగిగా... ఆ తరువాత జనవ్యవహారంలో వాండ్రంగిగా మారింది. ఇదిలా ఉండగా వాండ్రంగి అనే ఇంటిపేరు ఉన్న వారిని బట్టి ఈపేరు వచ్చిందని కూడా మరో కథనం. ఈ గ్రామానికి చెందిన వాండ్రంగి కృష్ణదాస్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అదర్శప్రాయునిగా గుర్తింపు పొందేరు.

నిద్దాం

ఈ పల్లె జి.సిగడాం మండలంలో ఉంది. గ్రామ దేవత నిద్దాలమ్మ తల్లి పేరుతో ఈ గ్రామనామం ఏర్పడింది. ఈ గ్రామ దేవతను ప్రజలు ఇలవేల్పుగా పూజలు చేస్తుంటారు. ఎవరైనా మంచి కార్యక్రమం చేపట్టేముందు, అలాగే నూతన వధూవరులు అమ్మవారిని దర్శించి దీవెనలు అందుకుంటారు. ప్రతి ఏటా ఫిబ్రవరి

నెలలో ఇక్కడ జాతర, ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తుంటారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా నిద్దాలమ్మ ప్రసిద్ధి చెందింది. నిద్దాలమ్మ పేరుతోనే వాండ్రంగి గ్రామంలో మరో ఆలయం ఉంది.

అధ్వాన్నంపేట (శ్రీరాంపురం)

ఈ గ్రామం గంగువారి సిగడాం మండలం నిద్దాం పంచాయతీ పరిధిలో ఉంది. నిద్దాంలో అంతర్భాగంగా ఉన్న ఈ శివారు గ్రామం ఎంతో అధ్వాన్న స్థితిలో ఉండేది. దీంతో ఈపల్లెకు అధ్వాన్నంపేట అని పేరు వచ్చింది. అయితే ఈపేరు తమ గ్రామం పరువు తీస్తుందని భావించిన యువత 2015లో శ్రీరాంపురంగా నామకరణం చేశారు. గ్రామంలో నామఫలకాన్ని కూడా ఏర్పాటు చేశారు.

సిద్ధాంతం

ఈ గ్రామం ఎల్.ఎన్.పేట మండలంలో ఉంది. దంతపురానికి దగ్గరలో ఉంది. ఈ ప్రాంతంలో బౌద్ధమత చిహ్నాలు లభించాయి. సిద్ధార్థుడు(బుద్ధుడు) ఈప్రాంతంలో ధర్మప్రచారానికి వచ్చినట్టు చెబుతారు. సిద్ధార్థని పేరుతోనే సిద్ధాంతం గ్రామం అవతరించినట్టు ఓ కథనం ప్రచారంలో ఉంది.

దొంతహుండం

ఇది వంశధార నది ఒడ్డున సిద్ధాంతం గ్రామం సమీపంలో ఉంది. త్రిపురానవారి జమీందారీలో ఉండేది. హుండం అంటే కుండ లేదా నిల్వ చేసే ప్రదేశం. దొంతి అంటే వరుస క్రమం అని అర్థం. ఆ రోజుల్లో ధాన్యాన్ని హెచ్చు సంఖ్యలో గాదెల్లో వరుస క్రమంలో నిల్వచేసేవారు. దొంతి కాలక్రమంలో దొంతగా మారిందని గ్రహించవచ్చు.

కేశవదాసుపురం (భేరిపేట)

ఈ గ్రామం పొందూరు మండలంలో ఉంది. చిలకపాలెం కూడలికి కూత వేటు దూరంలో నెలకొని ఉంది. ఆంగ్లేయుల పాలనలో ఓ తెల్లదొర

నరసాపురం, చిలకపాలెం మార్గంలో ప్రయాణం చేస్తుండగా అతనికి ఓ అనుభవం ఎదురైంది. అదేమిటంటే ఎదురుగా పెద్ద ఎలుగుబంటి ఆయన మీదకు వచ్చేసరికి "బేర్‌బేర్" అని కేకలు వేశాడు. బేర్ అనే ఆంగ్ల పదానికి ఎలుగుబంటి అని అర్థం. ఈ ఉదంతాన్ని దృష్టిలో ఉంచుకుని చిన్న జనావాసమైన ఈ గ్రామానికి బేర్‌పేట అని నామకరణం చేశారు.క్రమంగా అది భేరిపేట అయింది. అలా కొంత కాలం గడిచాక ఈ పేరు ఏ మాత్రం బాగోలేదని అప్పటి గ్రామ పెద్ద కేశవదాసు అనే పేరుతో ఈ గ్రామానికి కేశవదాసుపురంగా నామకరణం చేయడం కొసమెరుపు.

కింతలి

ఈ పల్లె పొందూరు మండలంలో తలదాచుకుంటోంది. కాగా అప్పటిలో ఈ గ్రామంలో పురుషులందరికి శిఖతో కూడిన జుత్తు ఉండేది. దీన్ని కుంతలం అని అంటారు. దీంతో ఈ కుంతలం అనే పదం కింతలిగా రూపాంతరం చెందింది. కాగా ప్రాంతాలవారీగా కాళింగ సామాజిక వర్గానికి చెందిన వారిని కింతలి కాళింగులని, పందిరి కాళింగులని, బూరగాం కాళింగులని పిలుస్తారని 'కాళింగుల చరిత్ర-సంస్కృతి' అనే పుస్తకాన్ని రాసిన డా॥ సనపల నారాయణమూర్తి ఈ రచయితకు తెలియజేశారు. కాగా మరో కథనం ప్రకారం కళింగయుద్ధం (క్రీ.పూ261)లో ఈ గ్రామంలోని కాళింగ సామాజిక వర్గానికి చెందిన ఎంతో మంది యువయోధులు అసువులు బాసారు. దీనితో విలపిస్తున్న వారి భార్యలను కొంత మంది పెద్దలు "కిం? తాళి" అని వ్యాఖ్యానించారు. తాళి ఎందుకని దీని అర్థం. నాటి పెద్దలు మీరు పునర్వివాహం చేసుకొవచ్చునని హితవు పలికారు. పెద్దల సలహాలను ఆ యువతులు పాటించి తిరిగి పెళ్ళి చేసుకున్నారు. అప్పటినుంచి ఈ పల్లెకు కింతలి అనే పేరు స్థిరపడింది. గతంలో ఈ విషయాన్ని దివంగత శ్రీకాకుళం మాజీ ఎం.పి హనుమంతు అప్పయ్యదొర తోలాపిలో ఏ.పి.టి.ఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన విద్యా, వైజ్ఞానిక సభలలో వెల్లడించారు. కళింగయుద్ధంలో భర్తలను కోల్పోయిన యువతులు తమ పుస్తెలను ముకుమ్మడిగా ఓ గుండంలో సంప్రదాయ బద్ధంగా పడేసారు.

చిలకపాలెం

ఇది ఎచ్చెర్ల మండలంలో ఉంది. చిలక ఇంటి పేరు గల వారు ఈ ప్రాంతంలో జనావాసాలను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఈ గ్రామానికి చిలకపాలెం అనే పేరు వచ్చింది. ఒకే ఇంటి పేరు గల వారు లేదా ఒకే సామాజిక వర్గం వారు లేదా మత్స్యకారులు ప్రారంభంలో ఏర్పాటు చేసుకున్న గ్రామాలకు పాలెం అనే పదం చేరుతుంది. విశాఖపట్నం జిల్లాలో కేవలం పాలెం అనే పేరుతోనే ఓ గ్రామం ఉంది.

రాగోలు

ఈ గ్రామం శ్రీకాకుళం గ్రామీణ మండలంలో ఉంది. ఈ పల్లె తొలిపేరు రాకలువ మాతరవంశానికి చెందిన అనంతశక్తి వర్మ (400-435) రాకలువ శాసనం వేయించాడు. రాకలువ జనవ్యవహారంలో క్రమంగా రాగోలుగా మారింది. ఇక్కడ వ్యవసాయ పరిశోధన స్థానం ఉంది.

నెలవంక

ఈ గ్రామం కవిటి మండలంలో ఉంది. ప్రతి నెలలో అమావాస్య తరువాత వచ్చే శుక్ల పాడ్యమి(శుక్ల అనగా తెల్లని అని అర్థం) రోజున కనిపించే నెలవంకకు ఈ గ్రామీణులు అత్యంత ప్రాముఖ్యం ఇచ్చేవారు. ఆ గ్రామంలోని ఆబాలగోపాలం స్థానికంగా ఉన్నా లేదా బయట ఉన్న నెలవంకను విధిగా దర్శించే సంప్రదాయం కొనసాగేది. అయితే మారుతున్న కాలంతోపాటుగానే ఈ ఆచారం కూడా కనుమరుగైంది. ఏమైనప్పటికి ఈ సంప్రదాయం వల్లనే ఆ గ్రామానికి నెలవంక అనే పేరు వచ్చినట్టు చెబుతారు.

శ్రీముఖలింగం

శ్రీకాకుళం పట్టణానికి 46 కి.మీ దూరంలో ఉంది. వంశధార నదీతీరంలో వెలసి ఉంది. ఈ గ్రామం జలుమూరు మండలంలో ఉంది. శ్రీముఖలింగేశ్వరుడు వెలసిన గొప్ప శైవక్షేత్రం ఇది. ఈ దివ్యక్షేత్రం పేరుతోనే శ్రీముఖలింగం గ్రామం

ఏర్పడింది. ఈ ఆలయాన్ని మధుకేశ్వరాలయం అని కూడా పిలుస్తారు. ఈ ఆలయంలో ఉన్న శివలింగం రాతి శివలింగం కాదు. ఇప్ప చెట్టు మొదలను నరికి వేయగా అదే శ్రీముఖలింగంగా ప్రసిద్ధి చెందిందని క్షేత్ర పురాణం వల్ల తెలుస్తుంది. ఆ చెట్టు మొదలే క్రమంగా రాపిడికి శివలింగంగా మారిందని చెబుతారు. ఇప్పచెట్టును సంస్కృతంలో మధుకం అంటారు. అందువల్ల ఈ ఆలయాన్ని మధుకేశ్వరస్వామి ఆలయం అని పిలుస్తారు. లింగాకృతితో వెలసిన ఆ దేవునికి ముఖాకృతి ఉంటుంది. ఈ ఆలయ ప్రాంగణంలో మధుకేశ్వరాలయంతో పాటు భీమేశ్వరాలయం, సోమేశ్వరాలయం ఉన్నాయి. ఇందులో సోమేశ్వరాలయాన్ని క్రీ.శ. 573లో పూర్వగంగా వంశానికి చెందిన హస్తివర్మ అనే రాజు నిర్మించాడు. ఇక్కడి మధుకేశ్వరాలయాన్ని 8వ శతాబ్దంలో రెండో కామార్ణవుడు నిర్మించాడు. భీమేశ్వరాలయాన్ని 9వ శతాబ్దం చివరిలో అనియంకభీముడు నిర్మించాడు. మధుకేశ్వరాలయంలో వందకు పై గా శాసనాలు అభించాయి. కళింగుల శిల్పకళకు ఇవి మచ్చుతునకగా నిలుస్తాయి. ఇక్కడ కోటికి ఒకటి తక్కువగా శివలింగాలు ఉన్నాయి. కళింగరాజులు శ్రీముఖలింగాన్ని రాజధానిగా చేసుకొని కొంత కాలం పరిపాలించారు. ఈ ఆలయం లోపల మహాశివరాత్రి రోజున తప్ప మిగతా రోజుల్లో చీకటిగా ఉంటుంది.

నగరికటకం

ఇది జలుమూరు మండలంలో, వంశధార నదికి సమీపంలో ఉంది. ఉంది. శ్రీముఖలింగానికి దక్షిణ దిశలో ఉన్న ఈ గ్రామం చారిత్రకంగా ప్రాముఖ్యత పొందింది. నగరికటకాన్ని రాజధానిగా చేసుకొని గంగవంశరాజులు పరిపాలించారు. నగరి అంటే రాజ గృహం, కటక్(కటకం) అనే మాటకు సంస్కృత భాషలో సైనిక స్థావరం అని అర్థం. ఈ గ్రామం పరిసరాల్లో ఆ రోజుల్లో సైనిక దళం ఉండేది. ఇలా ఆ ఊరికి నగరికటకం అనే పేరు వచ్చింది. ఇక్కడకు కూత వేటు దూరంలో ఉన్న శ్రీముఖలింగంలో గంగరాజుల ధాన్యాగారం ఉండేది. 1955 నుంచి 1978 వరకు నగరికటకం పేరుతో అసెంబ్లీ నియోజకవర్గం ఉండేది. ఒకప్పుడు నగరికటకం బాజా ఎంతో ప్రసిద్ధి చెందింది.

షేర్‌మహ్మద్‌పురం

గోల్కొండ నవాబు కులీకుతుబ్‌షా కాలంలో పాలనా వికేంద్రీకరణలో సుబాలు లేదా పరగణాలు ఏర్పడ్డాయి. వాటిలో చికాకోల్ ఒకటి. కులీకుతుబ్‌షా చికాకోల్ ఫౌజ్‌దారుగా షేర్‌మహమ్మద్‌ఖాన్ నియమించాడు. ఫౌజ్‌దార్ షేర్ మహ్మద్‌ఖాన్ నిర్మించిన గ్రామమే షేర్‌మహ్మద్‌పురం. ఆయన పేరుమీదుగానే షేర్‌మహ్మద్‌పురంగా పిలుస్తున్నారు. ఈ గ్రామం ఎచ్చెర్ల మండలంలో ఉంది. ఇక్కడ శిథిలమై, నేలమట్టమైన కోట కనిపిస్తుంది. ఈ గ్రామంలో షేర్‌మహమ్మద్‌ఖాన్ ఓ చెరువును ఏర్పాటు చేశాడు. క్రీ.శ. 1640లో ఖాన్ శ్రీకాకుళంలో జుమా మసీదును నిర్మించాడు. ఇదిలా ఉండగా ఫౌజుల్‌బాగ్‌పేట, అఖింఖానుడుపేట, ఇబ్రహీంబాద్, నిజామబాద్, జాఫ్రాబాద్ తదితర గ్రామాలు నాటి ముస్లిం పాలకుల పేరుమీదనే వెలిశాయి.

కార్గిల్‌గూడెం

ఇది టెక్కలి మండలంలో ఉంది. దీని తొలి పేరు గూడెం. గూడెం అంటే చిన్న గ్రామం అని అర్థం. ఈ పల్లెకు చెందిన యువకులు 1999 సంవత్సరం మే నుండి జులై వరకూ కశ్మీర్ లో జరిగిన కార్గిల్ యుద్ధంలో వీరోచితంగా పోరాడారు. గ్రామానికి ఎనలేని కీర్తిప్రతిష్ఠలను తెచ్చి పెట్టారు. గ్రామానికి చెందిన లోపింటి జనార్ధన రెడ్డి, తూత గణపతిరావు, పువ్వల కృష్ణారావు, గుజ్జు జానకిరావు, తిప్పాన కృష్ణారావు, రుంకు ధిల్లేశ్వరరావు, గుజ్జు హేమారెడ్డి తదితరులు ఈ యుద్ధంలో పాల్గొన్నారు. వీరిలో పువ్వల కృష్ణారావుకు పెళ్ళయిన రెండో రోజునే కార్గిల్ యుద్ధంలో పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా గ్రామంలో విజయోత్సవాన్ని నిర్వహించారు. ఫలితంగా ఈ పల్లెకు ప్రభుత్వమే చొరవచూపి కార్గిల్ గూడెం అని పేరు పెట్టింది. రెండవ ప్రపంచ యుద్ధంలో ఈ పల్లెకు చెందిన ఇద్దరు వీర జవానులు జీరు జగన్నాయకరెడ్డి, కొర్లాన అంకులు పాల్గొన్నారు. అంతకు ముందు 19వ శతాబ్దంలో ఆంగ్లేయులతో యుద్ధం చేసిన టిప్పు సుల్తాను సైన్యంలో ఉండి పోరాడిన వీర జవానుల చరిత్ర పేర్కొనదగినది.

వారు వాడిన ఆయుధాలు నేటికి పూజలందుకొంటున్నవి. 1962లో జరిగిన భారత-చైనా యుద్ధంలోనూ, 1965, 1971 సంవత్సరాలలో భారత్-పాకిస్థాన్ యుద్ధాలలో ఈ గ్రామానికి చెందిన సైనికులు పాల్గొన్నారు. ఈ విషయాలను గ్రామానికి చెందిన ప్రముఖ రచయిత గుజ్జు వెంకట రెడ్డి మాస్టారు తాను రాసిన "భావ ప్రభంజనాలు" పుస్తకంలో ఉటంకించారు. ఈపల్లె పేరు ఆంధ్రదేశంలోనే కాకుండా, భారతావనిలో సైతం మారుమోగింది.

తురకల కోట

ఇది నందిగాం మండలంలో 16వ నెంబరు జాతీయరహదారి ప్రక్కనే ఉంది. ప్రస్తుతం ముస్లిం కుటుంబం ఒక్కటి కూడా లేదు. అయితే ఇప్పటికీ గ్రామం దగ్గరలో అనేక ముస్లింల సమాధులు ఉన్నాయి. అప్పట్లోపెద్ద సైనిక శిబిరం ఉండేది.

మబుగాం

ఇది పోలాకి మండలంలో ఉంది. అసఫ్ జాహీల పరిపాలనలో ఈగ్రామం పేరు మెహబూబ్‌గామ్ గా ఉండేది. ముస్లింల పాలన ముగిసిన తర్వాత మెహబూబ్‌గామ్ జనవ్యవహారంలో మబుగాం గా రూపాంతరం చెందింది.

పలాస

ఇది జిల్లాలో అతి పెద్ద పట్టణాలలో ఒకటి. తెల్ల బంగారంగా పిలిచే జీడిపప్పుకు ఎంతో ప్రసిద్ధి చెందింది. ఇక్కడ సుమారు 150 జీడిపప్పు మిల్లులు ఉన్నాయి. పలాస ఎప్పుడూ కులాసాగానే ఉంటుందని స్థానికులు వ్యాఖ్యా నిస్తుంటారు. పలాస తొలి పేరు పలాసిక. అసలు "పలాశ" అనునది వృక్ష సంబంధమైనది. పలాశ అంటే ఆకుపచ్చని మోదుగ చెట్లు. ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉండేవి. దీంతో పలాశ అనే పేరు వ చ్చింది. కాలక్రమంలో పలాసగా మారినట్టు స్పష్టమవుతోంది.

కాశీబుగ్గ

కాశీబుగ్గ పట్టణంలోని డెంకివీధికి చివరలో ఉన్న కాశీగుండం ఆధారంగానే ఆపేరు వచ్చినట్టు చెబుతారు. మండే ఎండలైనా ఈ కాశీగుండంలో నీరు ఇంకిపోదు. ఇందులో స్నానం చేస్తే చర్మరోగాలు నయమవుతాయని భక్తుల విశ్వాసం. పూర్వం ఒకసారి కొందరు యోగులు ఈ ప్రాంతంమీదుగా వచ్చి ఉబుకుతున్న నీటివద్దకు చేరారు. ఈసమీపంలోనే ఉన్న చెట్టుక్రింద విశ్రాంతి తీసుకున్నారు. మేల్కొన్న తరువాత తమ కమండలాన్ని ఎక్కడో మరచిపోయినట్టు గుర్తించారు. దీన్ని తమ యోగదృష్టితో సమీపంలో ఉన్న ఈ గుండం ద్వారా రప్పించారన్న కథనం ప్రచారంలో ఉంది. కాశీలో పోయిన కమండలం ఈ గుండం ద్వారా అకస్మాత్తుగా వచ్చినట్టు వారు గుర్తించారు. ఈ అద్భుతం నేపథ్యంలో దీన్ని కాశీగుండంగా స్థానికులు పిలుస్తారు. అయితే క్రమేపి ఈ ప్రాంతంలో పట్టణాన్ని కాశీబుగ్గగా నామకరణం చేశారు. బుగ్గ అంటే పైకి ఉబికే నీరు అని అర్థం.

మెళియాపుట్టి

ఇది మండల కేంద్రం. ఇది చాలా కాలం పర్లాఖిముండి రాజుల పాలనలో ఉండేది. 18వ శతాబ్ది ప్రాంతంలో కృష్ణచంద్రగజపతి నారాయణదేవ్ హయాంలో ఈ గ్రామం ఏర్పడింది. తమిళనాడులో మిలైపుట్టి అనే ఊరు ఉంది. పర్లాఖిముండి రాజులు గుర్రపు పందేల కోసం మద్రాసు తరచూ వెళ్తుండేవారు. ఆ ప్రభావంతో మెళియాపుట్టి అని ఈ ప్రాంతానికి పేరు పెట్టారు. విశేషమేమిటంటే ఈ ప్రాంత ప్రజలు భూమి శిస్తులను సక్రమంగా చెల్లించేవారు కాదు. ఏదో మెళిపెట్టి వాయిదా వేసేవారు. మెళిపెట్టడానికి ఈ ప్రాంతంపుట్టినిల్లని భావించి మెళిపుట్టిగా గ్రామానికి రాజులు నామకరణం చేశారని మాజీ ఎం.పి.పి మాడుగుల రామారావు ఈ రచయితకు తెలిపారు. ఇక్కడ 1840లో పర్లాఖిముండిని పాలించిన వీరేంద్ర ప్రతాప రుద్రరాజు తన భార్య విష్ణుప్రియ కోరిక మేరకు నిర్మించిన రాధాగోవిందస్వామి ఆలయం ఒడిషా సంప్రదాయంలో దర్శనమిస్తుంది.

సిరిపురం

ఈ గ్రామం సంతకవిటి మండలంలో ఉంది. మండలంలో అతిపెద్ద గ్రామాల్లో ఇది ఒకటి. తొలుత ఈ గ్రామాన్ని శ్రీపురం అని పిలిచేవారు. శ్రీ అంటే లక్ష్మీ అని అర్థం. ధన, ధాన్యాలతో ఈ ప్రాంతం విలసిల్లడంతో దీన్ని శ్రీపురం అని నామకరణం చేశారు. అయితే జన వ్యవహారంలో ఇది సిరిపురంగా మారింది. "శ్రీ"కి వికృతి రూపం సిరి. ఈ గ్రామం గొప్ప పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది. 4వ శతాబ్దంలో వాసిష్ఠీ వంశంవారు ఈ ప్రాంతాన్ని పాలించారు. ఇక్కడ గల తామరచెరువు గట్టు 1.5 కి.మి పొడవు ఉంది. ఆగట్టుపై వెలసిన పెద్దకంచమ్మ, చిన్నకంచమ్మ సోదరీమణులు దేవతలుగా పూజలు అందుకుంటున్నారు. ఈ గ్రామానికి చెందిన అదపాక సత్యారావు ఆంధ్ర ప్రదేశ్‌ప్రెస్ అకాడమి చైర్మన్‌గా పనిచేసి కీర్తి ప్రతిష్టలు పొందారు.

వీరగున్నమ్మ పురం (వి.జ. పురం)

మందస మండలంలోని మారుమూల గ్రామం వీరగున్నమ్మపురం. ఈ పల్లె తొలిపేరు గుడారి రాజమణిపురం. ఇతర సుదూర ప్రాంతాల నుంచి వచ్చి వ్యాపారులు ఈ ప్రాంతంలో గుడారాలు వేసుకొని మణులు, మాణిక్యాలు, వజ్రాలు, వైడూర్యాలను స్వల్పలాభం వేసుకొని విక్రయాలు సాగించేవారు. దీంతో ఈపల్లెకు గుడారి రాజమణిపురం అని నామకరణం చేశారు. కాల ప్రవాహంలో ఈ గ్రామానికి చెందిన వీరవనిత సాసుమాను గున్నమ్మ మందస ఎస్టేటు అధికారుల, రెవెన్యూ పోలీసుల అక్రమాలకు,రైతు వ్యతిరేక విధానాలపై పోరాటం జరిపింది. అధికారుల గుండెల్లో గున్నమ్మ రైళ్లు పరుగెత్తించింది. తమ అక్రమాలు ఇక సాగవని భావించిన దుష్ట అధికార యంత్రాంగం పోలీసులకు సైగచేసి వీరవనిత గున్నమ్మను 1940 ఏప్రిల్ 1న కాల్చి చంపారు. అప్పటికి ఆమె నిండు చూలాలు. ఈమె నాయకత్వంలో పనిచేసిన నార్ల జగ్గన్న, కర్రి కళియడు, గుంట చక్రపాణి, గుంట చిన్ననారాయణ కాల్పుల్లో మృతి చెందారు. ఈ రక్తబలి జరిగిన చోటే గూడారి రాజమణిపురం. ఈ సాహస మహిళ జ్ఞాపకార్థం గ్రామీణులంతా

ఏకకంఠంతో గుడారి రాజమణిపురం గ్రామాన్ని వీరగున్నమ్మపురం (వి.జి.పురం)గా పేరును మార్చుకున్నారు. ప్రస్తుతం రెవెన్యూ రికార్డుల్లో వీరగున్నమ్మపురం గానే నమోదు చేశారు. అన్ని ఎన్నికల్లో ఇదే పేరుతో వ్యవహరిస్తున్నారు. 1988 సెప్టెంబరు 10న నాటి గవర్నర్ కుముద్‌బెన్ జోషి ఈ గ్రామాన్ని సందర్శించారు. వీరగున్నమ్మ శిలాఫల కాన్ని ఆవిష్కరించారు. గవర్నర్ చొరవతోనే అధికార పూర్వకంగా ఈ గ్రామానికి వీరగున్నమ్మపురంగా పేరు పెట్టడం విశేషం. గున్నమ్మ స్మారక ముఖద్వారం చూడగానే ఎవరికైనా హృదయం చలించిపోతుంది.

బాలిగాం

మందస మండలంలో ఉంది. మందస సంస్థానాధీశులతో యుద్ధాలు జరిగిన చోటు ఇది. ఈ గ్రామం వద్ద అనేక మంది యోధులు బలిదానం చేశారు. దీంతో బలిదానం చేసిన ఈ ప్రాంతం బాలిగాం గా మారింది. జరిగిన విషయాన్ని వావిలపల్లి మాధవరావు ఈ గ్రామాన్ని సందర్శించిన రచయితకు తెలిపారు.

వరదరాజపురం

మందస మండలంలో ఉంది. బాలిగాం వద్ద జరిగిన యుద్ధాలతో ప్రవహించిన రక్తం వరదగా మారింది. ఈ రక్తం పారి గ్రామం చెంతకు చేరడంతో ఈ గ్రామానికి వరదరాజపురం అని పేరు వచ్చింది.

పొందూరు

పొందూరు అనగానే ఖాదీ గుర్తుకు వస్తుంది. మూడవ వజ్రహస్తుని నడగాం శాసనం క్రీ.శ॥ 979 ప్రకారం పొందూరు పూర్వనామం పోడూరుగా ఉన్నట్టు తెలుస్తోంది. ఇక్కడ పోడు వ్యవసాయం కొన్నాళ్ళు అమలులో ఉండేది. అంచేత పోడూరు పొందూరు అయిందని చెబుతారు. విజయనగరం పైడితల్లికి మూలం పొందూరు పైడితల్లేనని పెద్దలు చెబుతుంటారు. ఆ మాత చల్లని చూపులతో పొందూరు ఓ క్రమపద్ధతిలో విస్తరిస్తుంది. సింహాద్రి అప్పన్న ఇక్కడ గల పైడికొండపై అడుగు వేశాడని, ఆ తరువాత సింహాచలంలో కొలువుదీరినట్టు ఐతిహ్యం వల్ల

తెలుస్తోంది. అప్పన్న పైడికొండపై అడుగు వేసినపుడు చిన్న జలంతో కూడిన బిలం ఏర్పడింది. ఇప్పటికీ ఈ బావిని చూసేందుకు చాలా మంది వెళుతుంటారు. పొందూరు ఖాదీ, చేనేత, పట్టు పరిశ్రమలకు త్రివేణీ సంగమంగా వర్ధిల్లుతోంది. జ్ఞాపికల తయారీ పరిశ్రమకు ఆటపట్టుగా ఉంది. విశాఖపట్నం జిల్లా నర్సీపట్నం ప్రాంతంలో కూడా పొందూరు పేరుతో ఓ గ్రామం ఉంది.

మందస

ఇది మండల కేంద్రం. దీని తొలిపేరు మంజూష. మంజూష అంటే మనోహరమైన స్థలం. జనవ్యవహారంలో మందసగా మారింది. 1206లో రాజా వామన సింగ్‌దేవ్ ఉత్తరాది ప్రాంతాన్ని విడిచిపెట్టి ఇక్కడకు వచ్చి మంజూష అనే ప్రాంతాన్ని ఏర్పాటుచేసాడు. ఈయన మంజూష వంశానికి చెందినవాడు. రాజ వంశీయుల పేరుతో నే ఇక్కడ ఎస్.ఆర్.ఎస్.ఎమ్.జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఉంది. అన్నింటికి మించి ఇక్కడ గల శ్రీవాసుదేవ ఆలయం ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయంలో ప్రతిఏటా మాఘమాసంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతాయి. మందస పాలకోవా గూర్చి అందరికీ తెలిసిందే.

బుడంబో

ఇది మందస మండలం సాబకోట పంచాయితీలో ఉంది. రాజుల కాలంలో ఈ ప్రాంతంలో మామిడి తోటలు ఎక్కువగా ఉండేవి. పెద్ద పరిమాణంతో తియ్యని మామిడి పండ్లు లభించేవి. వీటిని మందస జమిందారులు బాగా ఇష్టపడేవారు. ఒడియా భాషలో 'బడొ' అంటే పెద్ద 'అంబొ' అంటే మామిడి పండు అని అర్థం. బడొ అంబొ అంటే పెద్ద మామిడి పండు అని అర్థం. కాల క్రమంలో బుడంబోగా మారింది.

ఆమదాలవలస

ఇది నియోజకవర్గ, పురపాలిక కేంద్రం. అప్పటిలో ఆమదాలవలస పేరు తొలుత ఎరడపల్లిగా ఉండేది.క్రీ.శ 342-343ల మధ్య మగధ రాజైన సముద్రగుప్తుడు దక్షిణభారత దిగ్విజయ యాత్రలో భాగంగా ఈ ప్రాంతపు రాజు

దమునుడుని ఓడించినట్టు సముద్రగుప్తుని అలహాబాదు శాసనాన్ని బట్టి తెలుస్తోంది. ఎరడపల్లి క్రమంగా హేరండపల్లిగా మారింది. హేరండా అంటే ఆముదం అని అర్థం. ఎక్కువగా ఆముదం నూనె తయారీ ఇక్కడ జరిగేది. వైద్యానికి, ఇంట్లో దీపాలకు, దివిటీలకు ఆముదాన్నే వాడేవారు. ఆ తరువాత హేరండపల్లి ఆముదపల్లిగా రూపొందింది. చివరకు ఆమదాలవలసగా స్థిరపడింది. ఈపట్టణానికి వేరే ప్రాంతాల నుంచి ఇక్కడకు వలస వచ్చినవారి సంఖ్య చాలా ఎక్కువ దీంతో ఈ పట్టణానికి వలస అనేది ఉత్తర పదంగా చేరింది. శ్రీకాకుళం జిల్లా కేంద్రం పేరుతో శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్ ఉంది. వెయిట్ లిఫ్టింగ్‌లో ఇస్తాంబుల్ ప్రపంచ ఛాంపియన్ షిప్ పోటీల్లో 197.5 కిలోల బరువును ఎత్తి ప్రపంచ ఛాంపియన్‌గా గుర్తింపు పొందిన కరణం మల్లీశ్వరి ఇక్కడి వారే. 1994, 97లో అర్జున, రాజీవ్‌ఖేల్‌రత్న అవార్డులను పొందారు.

గరిమెళ్లకొత్తవలస

ఈ పల్లె ఆమదాలవలస మండలంలో ఉంది. తొలుత గరిమెళ్ల వంశీయులు దీన్ని అగ్రహారంగా పొందారు. కాలక్రమంలో కొత్తగా కొంతమంది ఇక్కడకు వలస వచ్చి స్థిరపడ్డారు. దీంతో ఈ పల్లెకు గరిమెళ్లకొత్తవలస అనే పేరు వచ్చింది. అయితే గరిమెళ్ల వంశీయులు కనీసం ఒక్కరు కూడా లేరు. వారు దానంగా పొందిన భూములు ఆ రోజుల్లోనే కొందరు పెత్తందారులు ఆక్రమించుకున్నారు. దీంతో గరిమెళ్ల వంశీయులు దిక్కు తోచక ఇళ్లు వదలి పల్లెదాటి వేరే ప్రాంతాలకు తరలిపోయారు.

నరసన్నపేట

ఇది నియోజకవర్గ, మండల కేంద్రం. నర్సునాయుడు, అతని అన్నలు ముగ్గురు గొప్ప మల్లయోధులు. వారికి కళింగసీమలో మంచి గుర్తింపు ఉండేది. ఈ అన్నదమ్ముల పేరుతో నరసన్నల పేట అయ్యింది. కాలక్రమంలో నరసన్నపేటగా మారింది. బంగారం, స్టీలు, ఇత్తడి, ప్లాస్టిక్ వ్యాపారానికి మంచి ప్రసిద్ధి. ఈ ప్రాంతంలో హెచ్చు సంఖ్యలో రైసు మిల్లులు ఉన్నాయి. ఇక్కడ కూడా సూర్యదేవాలయం ఉంది.

కవిటి మండలంలో 'పుట్టగలు'

చిన్న గ్రామాలను పుట్టగలంటారు. పుట్టగ అనేది పుట్టుక అనే పదం నుంచి వచ్చింది. పుట్టగ ఉత్తర పదంగా వచ్చే గ్రామాలను కాస్తా పరిశీలిద్దాం. దూగాన పుట్టగ, పొందూరుపుట్టగ, నర్తుపుట్టగ, బంజుపుట్టగ, బైరెట్ల పుట్టగ, దుత్తుపుట్టగ, సహలాలపుట్టగ, ప్రగడ పుట్టగ, గొండ్యాల పుట్టగ, రామయ్యపుట్టగ, బల్లిపుట్టగ, తుంగాన పుట్టగ, బోగిడియాపుట్టగ తదితర గ్రామాలెన్నో ఉన్నాయి. వీటిలో రామయ్యపుట్టగ, బల్లిపుట్టగ మినహాయించి గమనిస్తే మిగిలిన అన్ని గ్రామాల తొలిపదాలు ఆయా సామాజిక వర్గాల ఇంటి పేరుతో ఏర్పాటు అయ్యాయి. అయితే రామయ్యపుట్టగ విషయానికి వస్తే రామయ్య అనే పెద్దమనిషి పేరుతో రామయ్యపుట్టగకు ఆ పేరు వచ్చింది కాగా బల్లిపుట్టగకు ఆపేరు ఏలా వచ్చిందంటే బల్లి అంటే ఒరియాలో ఇసుక అని అర్థం. ఈ గ్రామంలో సమీప ప్రాంతంలో ఉ న్న గెడ్డ నుంచి నాటుబండ్ల తో ఇసుక తెచ్చేవారు. వారిపేరుతోనే బల్లిపుట్టగ ఏర్పాటు అయ్యింది. విశేషం ఏమిటంటే ఈ గ్రామాలన్నీ ఒరియా ప్రభావంతో ఏర్పాటయ్యాయి. ఈ విషయాన్ని పత్రికా రచయిత బస్వా జగన్నాధరావు ఈ రచయిత తో మాట్లాడుతూ ధ్రువీకరించారు.

కంచిలి-1

ఈ గ్రామం మండల కేంద్రం కూడా. కంచెమ్మ దేవత పేరుతోనే ఈ గ్రామానికి కంచిలి అని పేరుపెట్టారు. కంచెమ్మ జాతరకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఒడిషా ప్రాంతం నుండి కూడా భక్తులు వచ్చి అమ్మవారిని సందర్శించి మొక్కుబడులను తీర్చుకుంటారు. ఈ జాతరను ప్రతి ఐదేళ్లకొకసారి ఘనంగా నిర్వహిస్తారు.

కంచిలి-2

ఈ మండలంలో కూడా పుట్టగలెన్నో ఉన్నాయి. సాలీన పుట్టగ, పర్రిపుట్టగ, జన్ని పుట్టగ, దాసరి పుట్టగ, ఆముదాలపుట్టగ, కొక్కిలిపుట్టగ, అమ్మవారిపుట్టగ తదితర గ్రామాలున్నాయి. వీటిలో అమ్మవారి పుట్టగ అక్కడ

గల గ్రామదేవత పేరుతో వచ్చినట్టు గమనించవచ్చు. మిగిలిన పుట్టుగలన్ని సంబంధిత వంశాల ప్రాతిపదికగా ఆ గ్రామాలకు పేర్లు వచ్చినట్టు చెబుతారు.

బొంతలకోడూరు

ఈ గ్రామం ఎచ్చెర్ల మండలంలో ఉంది. ఈ గ్రామంలో శివభక్తులైన జంగమ సామాజిక వర్గం వారు దర్జీపని చేసేవారు. ముఖ్యంగా బొంతలు కుట్టుకుంటూ జీవనం సాగిస్తుండేవారు. ఈ బొంతలకు ఎంతో గిరాకి ఉండేది. దీంతో బొంతలపేరుతోనే ఈ గ్రామానికి బొంతల కోడూరు అని పేరు వచ్చింది. ఇందులో ఉత్తరపదమైన కోడూరు జలసూచి. ఈ గ్రామానికి సమీపంలోనే నాగావళినది, బంగాళాఖాతం ఉన్నాయి.

చిలకపాలెం

ఇది ఎచ్చెర్ల మండలంలో ఉంది. పాలెం అంటే చిన్నబస్తీ అని కూడా అర్థం. చిలక వంశీయుల పేరుతో చిలకపాళంగా మారింది. కాలక్రమేణా జనవ్యవహారంలో చిలకపాలెంగా మారింది. ఒకప్పుడు ఇక్కడ మత్స్య కార కుటుంబాలు ఉండేవి. అయితే ప్రస్తుతం నాలుగు కుటుంబాలు మాత్రమే ఉన్నాయి.

కామేశ్వరిపేట / ఎలమంచిలి

ఇది జలుమూరు మండలంలో ఉంది. ప్రభుత్వ రికార్డులలో ఈ ఊరుపేరు ఎలమంచిలి. అయితే ఈపల్లెలో ఎండల కామేశ్వరస్వామి కొలువై ఉన్నారు. దీంతో ఆ ఊరి పేరు కామేశ్వరిపేటగా మారింది. విశేషం ఏమిటంటే ఈ గ్రామంలో స్వామి పేరుమీదుగా కామేశ్వరరావులే ఎక్కువ మంది ఉన్నారు. పలువురు పేర్లు 'క' అక్షరంతో ప్రారంభమౌతాయి. కామేశ్వరరావులతోపాటు కామయ్య, కామేశ్వరి, కామమ్మ, కావేరి, కళ్యాణి, కావ్య, కల్పన, కామాక్షి ఇలాంటి పేర్లు ఎన్నో ఈపల్లెలో ఉన్నాయి.

అక్కులపేట/వేణమ్మపేట

ఇవి జంట గ్రామాలు. ఆమదాలవలస మండలంలో ఉన్నాయి. పంచాయితీలు ఏర్పడక ముందు రెండు గ్రామాలకు ఒకే మునసబు, కరణం తలయారి ఉండేవారు. ప్రస్తుతం రెండు పంచాయతీలుగా ఏర్పడ్డాయి. పైడి హక్కులు అనే గ్రామ పెద్ద పేరుమీదుగా అక్కులపేట గ్రామం, పాంద్రంగి శ్రీనివాసాచార్యులు అనే వైష్ణవుని పేరుమీదుగా శ్రీనివాసాచార్యుల పేటగా ఈ గ్రామాలు ఏర్పడ్డాయి. శ్రీనివాసాచార్యులు తన కుమార్తె వేణమ్మకు ఈ గ్రామాన్ని అరణంగా ఇవ్వడం వల్ల ఈ గ్రామానికి శ్రీనివాసాచార్యులపేట/వేణమ్మపేట అని పిలుస్తున్నారు. శ్రీకాకుళం ఎం.పిగా ఆరుసార్లు ఎన్నికైన బొడ్డేపల్లి రాజగోపాలరావు స్వగ్రామం ఈ జంట పంచాయతీలలోని అక్కులపేట కావడం విశేషం.

వజ్రపుకొత్తూరు

ఇది మండల కేంద్రం. తీరప్రాంతం. మత్స్యకారులు ఈ పల్లెను తొలుత ఏర్పాటు చేశారు. క్రీ.పూ.300 ప్రాంతంలో మీల కొత్తూరుగా పిలిచేవారు. చంద్రగుప్తుల కాలంలో మీన (చేప) కొత్తూరులో వజ్రాలు రాసులుగా పోసి కుంచాలతో విక్రయించేవారట. స్థానికంగా ఉన్న నారికంపల్లి కోమట్లతో వజ్రాలు కొట్లు పెట్టి నడిపించేవారని పూర్వీకులు చెప్తారు. వజ్రాలు విక్రయం వల్ల మీనకొత్తూరు పేరు క్రమేపీ వజ్రపుకొత్తూరుగా మారిందని చెబుతున్నారు. నారికంపల్లి వారి ఇంటిపేరు కూడా వజ్రపుగా మారిపోగా, వజ్రపు పేరుతోనే కోనేరు, మంచినీటి బావులను పిలవడం విశేషం.

పాలకొండ

ఇది రెవెన్యూ డివిజన్ కేంద్రం, నియోజకవర్గ, నగర పంచాయితీ కేంద్రం. ఇది ఒకప్పుడు పరగణాగా ఉండేది. యర్కారాయుడు అనే జమీందారు దీన్ని పాలించేవాడు. ఈ పట్టణానికి సమీపంలో సీతంపేట కొండలు ఉన్నాయి. తమపాడి పశువులతో సహా ఇతర ప్రాంతాలు నుంచి ఇక్కడకు వచ్చిన కొందరు గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నారు. పాడి పరిశ్రమ కలిసి వచ్చే విధంగా తమ గ్రామానికి

పూర్వ పదంగా పాల, సమీపంలో కొండలు ఉండడంతో పాలకొండ అని నామకరణం చేసినట్టు స్థానిక వృద్ధులు కొందరు తెలిపారు. పాలకొండను "క్షీరగిరి"గా అడిదం సూరకవి సంస్కృతీకరించారు. ఇక్కడ గల బొబ్బిలి రాజుల ఆరాధ్య దేవత కోటదుర్గమ్మ ఆలయం ఎంతో వాసికెక్కింది. 6 శతాబ్దాల కితం ఇక్కడ నిర్మించిన జగన్నాథస్వామి ఆలయం పూరీ తరహాలో ఉంటుంది.

వీరఘట్టం

ఇది మండల కేంద్రం. పేరుకు తగిన ఊరు ఇది. కొన్ని వందల సంవత్సరాల క్రితం ఈ ప్రాంతాన్ని అచ్చెపువలస రాజులు పరిపాలించేవారు. విశేషం ఏమిటంటే అప్పటిలో వీరు పులుల సహాయంతో భూములను దున్ని వ్యవసాయం చేసేవారు. క్రూర మృగాలైన పులులతో వ్యవసాయం చేయించడం అసాధారణమైన విషయం. దీంతో వీరిని అత్యంత వీరత్వం కలిగిన రాజులుగా పిలిచేవారు. ఈ కారణంగానే అప్పటి నుంచి ఈ ప్రాంతానికి వీరఘట్టం పేరు వచ్చినట్టు చెబుతారు. సింహాచలం శాసనం ప్రకారం క్రీ.శ 1270 ప్రకారం ఈ గ్రామం తొలిపేరు వీరకోట అని ఉండేది. వీరులు పాలించిన వీరఘట్టం పేరును ప్రపంచ స్థాయిలో చాటిచెప్పిన కోడి రామ్మూర్తి (1896-1985) ఈ ప్రాంతానికి చెందినవాడు కావడం గర్వకారణం. రామ్మూర్తి కర్రసాము, కుస్తీ తదితర పోటీల్లో పాల్గొని గొప్ప విజేతగా నిలిచారు. ప్రపంచం నలుమూలల్లో జరిగిన ఎన్నో పోటీల్లో పాల్గొని విజయం సాధించిన ఘనత ఈయనకు దక్కింది. బలవంతమైన ఏనుగును గుండులపైన వేయించుకున్నాడు. ఇండియన్ హెర్క్యులస్, కలియుగ భీముడు, మల్లమార్తాండ తదితర బిరుదులను సాధించాడు. జిల్లా కేంద్రమైన శ్రీకాకుళంలో ఆయన పేరుతో ఒక స్టేడియం ఉండటం విశేషం. బెంగుళూరులో ఓ వీధి ఆయన పేరుతోనే ఉంది.

మామిడిమానుగూడ

ఇది వీరఘట్టం మండలంలో ఉంది. మామిడి చెట్లు విస్తారంగా ఉన్న ప్రాంతం కావడంతో మామిడి మానుగూడ అనే పేరు వచ్చింది. గతంలో గోర అనే పల్లెలో సవర, జాతాబు అనే జాతులు కలిసి ఉండేవి. అతరువాత సవర

తెగకు చెందిన వారంతా అక్కడి నుంచి విడిపోయి అదే పల్లెకు సమీపంలో మరొక దాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అప్పట్లో ఇక్కడ మూడు పెద్ద మామిడి చెట్లు ఉండడంతో మామిడి మానుగూడగా పేరుపెట్టినట్టు కూడా చెబుతారు.

నువ్వలరేవు

ఇది వజ్రపుకొత్తూరు మండలంలో ఉంది. రాష్ట్రంలో కేవిటి సామాజిక వర్గం ఉన్న ఏకైక పల్లె ఇది. సంప్రదాయ మత్స్యకారులే ఇక్కడ ఉన్నారు. నువ్వల రేవు గ్రామం అసలు పేరు లక్ష్మీదేవిపేట. ఇప్పటికీ ప్రభుత్వ రికార్డుల ప్రకారం లక్ష్మీదేవిపేట గానే ఉంది. అయినప్పటికీ ఈ గ్రామానికి అందరూ నువ్వలరేవుగానే పిలుస్తారు. సుమారు ఐదు శతాబ్దాల కితం పర్లాఖిముండి రాజుల పాలనలో పూడిలంకకు చెందిన వరదా వంశీయులు లక్ష్మీదేవిపేటగా తొలుత పేరు పెట్టారు. సముద్రంతో పాటు ఉప్పుటేరు ఆనుకొని ఉండటంతో ఇక్కడి వారికి మత్స్య సంపద నిత్యం సిరులు కురిపిస్తుండేది. జీవనోపాధికి ఎలాంటి లోటు లేకుండా జీవనం సాగించేవారు. అందుకే గ్రామానికి లక్ష్మీదేవి పేటగా పేరు వచ్చిందని పూర్వీకులు తెలియజేశారు. ఆంగ్లేయుల పాలన కాలంలో తెల్లదొరలు గ్రామానికి నావలపై రాకపోకలు సాగిస్తుండేవారు. కొంత కాలం తరువాత దీపస్తంభం (లైటు హౌసు) నిర్మించారు. అప్పటి నుంచి ఈ ప్రాంతానికి నావలపై రాకపోకలు పెరగడంతో పాటు వ్యాపారం సాగిస్తుండే వారు. తీరానికి నావల రాకపోకలు సాగుతుండటంతో నావలరేవుగా పిలిచేవారు. అయితే ఆంగ్లేయుల పరిపాలన తరువాత నావలరేవు జనవ్యవహారంలో నువ్వలరేవుగా మారింది. విశేషం ఏమిటంటే ఈ పల్లె ఆసలు పేరు లక్ష్మీదేవిపేట అయినప్పటికి నువ్వలరేవు అంటేనే అందరికి స్పష్టంగా తెలుస్తుంది.

పూడిలంక

ఇది వజ్రపుకొత్తూరు మండలంలో తలదాచుకుంటోంది. పూడి జగన్నాధపురం పంచాయతీ పరిధిలోనిది. ఇక్కడ సుమారుగా 50 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఈ గ్రామం పొలాలు, జీడితోటలు మొత్తం కలిపి సుమారు 100 ఎకరాలు విస్తీర్ణంలో ఉంది. ఇంతకి ఆ గ్రామానికి పేరు ఎలా వచ్చిందంటే

పూడి అంటే ప్రవాహం అని అర్థం. లంక అంటే చుట్టూ నీరు ఉండే ప్రాంతం. దీంతో నాటి పెద్దలు ఈ గ్రామానికి పూడిలంక అని పేరు పెట్టుకున్నారు. ఈ గ్రామాన్ని చేరుకోవాలంటే అష్టకష్టాలు పడాల్సిందే. ఇది తీరప్రాంత గ్రామమని వేరేగా చెప్పనక్కరలేదు. చుట్టూ సముద్రం ఉంది. ఈ గ్రామానికి చేరుకోవడానికి వీలుగా ఒక ఉప్పు కర్మాగారం యాజమాన్యం వారు ఓ గట్టును నిర్మించారు.వారి ప్రయోజనాల కోసం గట్టును ఏర్పాటు చేసుకున్నప్పటికీ ప్రతి మూడు నెలలకు ఒకసారి అది కూలిపోతోంది. దీంతో మళ్లీ గట్టు ను నిర్మించడం సర్వసాధారణమైంది. ఈ గట్టుమీద నుంచే గ్రామీణులు రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాకాలంలో అయితే నాటుపడవలను వినియోగించుకుంటారు.

టెక్కలి

ఇది రెవెన్యూ డివిజన్ కేంద్రం,అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం. టెకిలి అనే ఒరియా పదం నుంచి టెక్కలి అనే పేరు వచ్చింది. పర్లాఖిముండి రాజు ఆడపడుచుకి అరణంగా ఇచ్చిన గ్రామం ఇది. టెకిలి అంటే అరణం అని అర్థం. అంటే టెకిలి జగన్నాథపురం గ్రామాన్ని ఆడపడుచు కట్నంగా ఆ రోజుల్లో ఇచ్చారు. ఒడిషా ప్రజలు పూరీ జగన్నాథస్వామి భక్తులు కావడంతో టెక్కలి జగన్నాధపురం పేరుతో ఆ గ్రామాన్ని పర్లాఖిముండి రాజు అరణంగా ఇచ్చారు. కాలక్రమంలో జగన్నాధపురం తొలగి టెక్కలిగా స్థిరపడింది.

పాతటెక్కలి

ఇది వజ్రపుకొత్తూరు మండలంలో ఉంది. క్రీ.శ 1422లో ఈ ప్రాంతం అడవులతో నిండి ఉండేది. ఇక్కడ నరసింహఖెడీ అనే రాజు పాతటెక్కలిని రాజధానిగా చేసుకొని టెక్కలి ప్రాంతాన్ని అభివృద్ధి చేశాడు. శైలోద్భవ రాజుల నుంచి జయపురం రాజులకు వారి నుంచి పర్లాఖిముండి రాజులకు ఈ ప్రాంతం దత్తత్తైంది. కాలగమనంలో 15వ శతాబ్దం చివరి నాటికి జమిందారుపాలనలోకి వచ్చింది.

ఉర్లాం

ఇది నరసన్నపేట మండలంలో ఉంది. ఉర్లాం సంస్థానం సాహిత్య పోషణకు పెట్టింది పేరుగా నిలిచింది. కందుకూరి వంశస్థులు దీనికి సంస్థానాధీశులుగా ఉండి విశిష్ట సేవలందించారు. ఉర్లాం తొలిపేరు ఉరామల్ల. కాలక్రమంలో ఉరుమెళ్ళ చివరకు ఉర్లాంగా స్థిరపడింది. ఉర్లాం ఇంటి పేరుతోనే ఈ గ్రామం ఏర్పడిందని చెబుతారు. ఉర్లాం సంస్థానంలో సోమనాథ శాస్త్రి, పాపయ్య శాస్త్రి, లక్ష్మి నారాయణశాస్త్రి, వెంకట నృసింహశాస్త్రి వంటి పండితులు ఉండేవారు. బొమ్మకంటి రామావధాని ఇక్కడ వేద పరీక్షకులుగా (1852-1922) ఉండి మంచి పేరు పొందారు. వేద శాస్త్ర నిష్ణాతులు శంఠిశోభనాద్రి ఈ ఆస్థాన విద్వాంసులుగా ఉండేవారు. ఆధునిక కాలంలో "నువ్వు నేను" చిత్రంలో ప్రతినాయకునిగా గుర్తింపు పొందిన వైజాగ్ ప్రసాద్ జన్మస్థలం ఇదే కావడం విశేషం.

సుబ్బమ్మపేట

ఈ పల్లె నందిగాం మండలంలో ఉంది. 300 ఏళ్ల క్రితం చిగిలిపల్లి సుబ్బమ్మ అనే భక్తురాలు ఇక్కడ శ్రీల క్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని నిర్మించింది. ఆమె పేరుతోనే ఈ గ్రామానికి సుబ్బమ్మపేట అని నామకరణం చేశారు. చందనం, నీలగిరి, సరుగుడు, కొబ్బరిచెట్ల మధ్య ఆహ్లాదాన్ని కలిగించే ప్రాంతంలో ఈ ఆలయం వెలసింది. ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లుతుంది. చందనం కప్పబడే నరసింహస్వామి దేవాలయాల్లో సింహాచలం మొదటది కాగా ఇది రెండవదిగా రాష్ట్రంలో ప్రసిద్ధి చెందింది. మాఘ శుద్ధ ఏకాదశి రోజున వైష్ణవ సంప్రదాయంలో స్వామికి తిరుకళ్యాణం జరుగుతుంది. చందనం పూత సమయంలో స్వామివారి నిజరూప దర్శనానికి హెచ్చు సంఖ్యలో భక్తులు హాజరవుతుంటారు. నిత్య కళ్యాణం పచ్చతోరణంగా ఈ ఆలయం విరాజిల్లుతోంది.

కోటబొమ్మాళి

ఇది మండల కేంద్రం. ఇది వ్యాపార కేంద్రం కూడా. దీని తొలిపేరు వనమాలి అని ఉండేది. ఒడిషా రాజులు ఈ ప్రాంతాన్ని పరిపాలించినపుడు వనమాలిని బనమాలిగా పిలిచేవారు. ఒరియాలో 'వ' అనే అక్షరాన్ని 'బ' గా

పలుకుతారు. 'వ' శబ్దం ఒరియాలో లేదు. బనమాలి కాలక్రమంలో బొమ్మాళిగా మారింది. ఒరియా రాజులే చిన్న కోటను నిర్మించుకున్నారు. అయితే కాలగమనంలో ఇది భూస్థాపితమై కనుమరుగైంది. ఇలా కోటబొమ్మాళికి ఆపేరు వచ్చింది. అయితే తొలిపేరు ఎలా వచ్చిందంటే వనమాలి వంశీయులు ఈ గ్రామాన్ని నిర్మించడం వల్ల వనమాలి అనే పేరు వచ్చింది. అయితే ఒడిషా రాజుల ప్రభావంతో చివరకు కోటబొమ్మాళిగా స్థిరపడిందని పత్రికా రచయిత తలగాపు వెంకట రమణ పేర్కొన్నారు.

సంతబొమ్మాళి

ఇది మండల కేంద్రం. ఇది కోటబొమ్మాళికి సుమారు కిలో మీటరు దూరంలో ఉంది. ఈ ప్రాంతంలో ప్రతి గురువారం సంత జరిగేది. చేనేత కార్మికులు తాము ఉత్పత్తి చేసిన వస్త్రాలను ఈ సంతలోనే విక్రయించేవారు. ఈ సంత, బొమ్మాళికి దగ్గరగా జరగడంతో సంతబొమ్మాళిగా పేరు స్థిరపడింది.

హరిశ్చంద్రపురం

ఈ గ్రామం కోటబొమ్మాళి మండలంలో ఉంది. ఒకప్పుడు నియోజకవర్గ కేంద్రం. హరిశ్చంద్రపురం గ్రామానికి పేరు ఎలా వచ్చిందంటే.... పర్లాఖిముండి రాజు తన భార్యలలో ఒకరైన "హరి" పేరుతో ఈ గ్రామం ఏర్పాటైంది. పర్లాఖిముండి రాజు ఈ గ్రామాన్ని భూములను ఇనాంగా ఇచ్చాడు. ముందుగా హరిపురం అనే పేరుతో ఈ గ్రామాన్ని పిలిచేవారు. అయితే హరిపురం అనే గ్రామం మందస ప్రాంతంలో ఉండడంతో "చంద్ర" అనే పదాన్ని జోడించి హరి+చంద్ర పురంగా, క్రమంగా హరిశ్చంద్రపురంగా మారింది. ఈ విషయాన్ని మాజీ శాసనసభ్యులు కె.ఎ.ఎన్.భుక్త పేర్కొన్నారు.

ప్రియాగ్రహారం

ఇది పోలాకి మండలంలో ఉంది. పర్లాఖిముండి రాజు తన రెండవ భార్య అయిన"ప్రియ" పేరుతో ప్రియా అగ్రహారం ఏర్పాటైంది. రాజులు ఇనాంగా ఇచ్చారు. ప్రజా పాటలు త్యాగయ్యగా, స్వాతంత్ర్య సమరయోధునిగా, 'మాకొద్దీ తెల్లదొరతనము' పాటను రాసిన గరిమెళ్ల సత్యన్నారాయణ పుట్టిన గ్రామం ఇదే.

ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గరిమెళ్ల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

కోష్ట

ఇది రణస్థలం మండలంలో ఉంది. ఈ గ్రామం తీర ప్రాంతంలో పదహారో నెంబరు జాతీయ రహదారి పక్కన గల గ్రామం ఇది. సాగర తీర ప్రాంతం కావడంతో కోస్తా అని తమ గ్రామానికి పేరు పెట్టుకున్నారు. ఆంగ్లేయుల పాలనాకాలంలో అధికారులు కోస్తా అని పలకలేక కోష్టగా పిలిచేవారు. జనవ్యవహారంలో కోష్టగా మారింది.

కనిమెట్ట

ఈ గ్రామం కింతలి గ్రామానికి ఆనుకొని ఉన్నది. ఇది పొందూరు మండలంలో ఉంది. కనిమెట్ట గ్రామం పది మంది స్వాతంత్ర్య సమరయోధులకు జన్మనిచ్చిన వీర భూమి ఇది. ఈ పల్లెకు ఆపేరు ఎలా వచ్చిందంటే... గతంలో ఈ ప్రాంతమంతా ముస్లింల పాలనలో ఉండేది. ఆ సందర్భంగా ఈ గ్రామానికి ఖాన్‌పేట అని నామకరణం చేశారు. జనవ్యవహారంలో కనిమెట్టగా మారిందని స్థానిక ప్రగతి యువజన సంఘం అధ్యక్షులు సూరు చంద్రశేఖరరావు తదితరులు తెలిపారు.

ఇబ్రహీంబాద్

ఈ పల్లె ఎచ్చెర్ల మండలంలో ఉంది. ముస్లిం పాలకులలో ఒకరైన ముల్క్ ఇబ్రహీంకు తెలుగు కవిత్వంలో మంచి ప్రవేశం ఉంది. తెలుగు కవులను ప్రోత్సహించాడు. ఆయన పేరుమీదనే వెలసిన గ్రామమే ఇబ్రహీంబాద్. ఈగ్రామం తొలిపేరు కూర్మయ్యపేట. కాగా ఇదే మండలంలోని అఖింఖానుడు పేట ముస్లిం ప్రభావంతో ఏర్పడిన చిన్నపల్లె.

తాన్‌సాహెబ్‌పేట

ఈ పల్లె గార మండలంలో ఉంది. ముస్లిం పాలకులలో చివరివాడైన అబుల్ హసన్ తానిషా పేరు మీద ఈ గ్రామం ఏర్పడింది. ఇదే మండలంలో నిజాంబాద్, హుకుంపేట, ముస్లింల ప్రభావంతో ఏర్పడిన గ్రామాలే.

హయాతినగరం

శ్రీకాకుళం పట్టణ పరిధిలో ఈ గ్రామం వెలసింది. గొల్కొండ మహారాణి హయత్‌బేగం పేరుతో ఈ గ్రామం వెలసినట్టు స్థానికుల కథనం. ఈ గ్రామం గుజరాతిపేట ఆవల వెలసి ఉంది.

అలికాం

ఈ పల్లె శ్రీకాకుళం గ్రామీణ మండలంలో ఉంది. తొలుత ఈ గ్రామాన్ని అలికన్ను అని పలిచేవారు. అలిక అంటే నుదురు అని అర్థం. నుదురు యందు కన్ను ఆభరణముగా కలిగిన వాడు పరమేశ్వరుడు. ఈ గ్రామంలో దొరికిన శివలింగం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఆ తరువాత గ్రామీణులు మల్లేశ్వరాలయాన్ని నిర్మించారు. స్వయంభువు అయిన శివలింగం వల్లనే ఈపల్లెకు అలికాం అనే పేరు వచ్చింది. ఇదే విషయాన్ని ఆ గ్రామానికి చెందిన రచయిత పెయ్యిల శ్రీనివాసరావు తాను రాసిన ఓ పాటలో ఉటంకించారు.

కళ్లేపల్లి

ఈ గ్రామం శ్రీకాకుళం గ్రామీణ మండలంలో ఉంది. దీని తొలిపేరు కళ్లేరుపల్లి. కళ్లేరు అంటే సెలయేరు అని అర్థం. ఈ పల్లె నాగావళి తీరంలో ఉంది. అంచేతనే కళ్లేరుపల్లి అయ్యింది. కాలప్రవాహంలో కళ్లేపల్లి గా మారింది. ఇక్కడ వెలసిన దేవుని పేరు మణినాగేశ్వరుడు. ఇక్కడ శివలింగాన్ని బలరాముడు ప్రతిష్టించాడు ఇక్కడ జ్యేష్ట బహుళ ఏకాదశినాడు స్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఇక్కడ నాగావళి బంగాళాఖాతంలో సంగమిస్తుంది. ఇక విజయనగరం జిల్లాలో కళ్లేపల్లిరేగ పేరుతో ఓ గ్రామం ఉంది.

పనసలవలస

ఈ పల్లె రేగిడి ఆముదాలవలస మండలంలో ఉంది. ఇదో చిన్న అగ్రహారం. ఓ రోజున ఇక్కడ ఉన్న బ్రాహ్మణులు పనసలు (వేదం) సామూహికంగా చదువుతున్నారు. ఇదే సమయంలో గ్రామాన్ని సందర్శించిన బొబ్బిలి సంస్థా

నాధీశుడు వారిని ప్రశంసించాడు. దీనికి పనసలవలస అని నామకరణం చేయాలని ఆదేశించాడు. దీంతో ప్రజలు పనసలవలస అని వెంటనే పేరుపెట్టారు. ఈ ఉదంతం 18వ శతాబ్దంలో జరిగింది. బొబ్బిలి సంస్థానాధీశులు ఈ గ్రామాన్ని బ్రాహ్మణులకు అగ్రహారంగా ఇచ్చారు. ఇతర ప్రాంతాలలోని బ్రాహ్మణుల సైతం ఇక్కడకు వలసగా వచ్చి స్థిరపడ్డారు. అందువలన అయితే కాలక్రమంలో ఆ కుటుంబాలన్ని తరలిపోయాయి. ప్రస్తుతం ఒకే కుటుంబం వుంది. బొబ్బిలి రాజులు ఇక్కడ శ్రీరాజవేణుగోపాలస్వామి ఆలయాన్ని నిర్మించారు. ఈ గ్రామానికి పక్కనే ఉన్న మునకలవలస అగ్రహార భూములను ఆలయనిర్వహణ కోసం సమర్పించారు. అయితే ప్రభుత్వం తీసుకొచ్చిన ఇనాం చట్టం మేరకు తిరిగి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఆ తరువాత దేవాదాయ శాఖకు కొంత మేరకు నష్టపరిహారం ఇచ్చారు. విశేషం ఏమిటంటే ఈ పల్లెలో ఆబాలగోపాలం విష్ణుసహస్ర నామాలను అలవోకగా చదువుతారు. ఈ గ్రామంలోని ఆలయానికి తిరుమల రంగనాథాచార్యుల ధర్మకర్తగా వ్యవహరిస్తున్నారు. ఆయన మాటను అంతా వేదంగా భావిస్తారు. అతని స్ఫూర్తితోనే ఈ గ్రామం ఎంతో ఆదర్శవంతంగా రూపుదిద్దుకుంది. అయితే ఆలయ మాన్యంలో గల కొంత భాగం ఆక్రమణలకు గురైంది. ఆ విషయాన్ని కడగల బోడి నాయుడు ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు.

పనసగూడ

ఇది సీతంపేట మండలం హడ్డుబంగి పంచాయితీ పరిధిలో ఉంది. ఇక్కడ అతి పెద్ద పనసచెట్టు పూర్వం ఉండేదని పేర్కొంటారు. అందుకే పెద్దలు ఈ పల్లెకు పనసగూడ అని పేరు పెట్టినట్టు స్పష్టమౌతోంది. గూడా అంటే కొండ కోనల్లో పరిమిత కుటుంబాలతో నివశించే ప్రాంతం. ఇదే పంచాయితీలోని జామితోటలో ఓ రైతుకు చెందిన పెద్ద జామితోట గతంలో ఉండేది. అంచేతనే దీనిని జామితోటగా పేరుపెట్టారు. కాగా ఇదే మండలంలోని రేగుమానుగూడ రేగు చెట్ల పేరుతో ఏర్పడింది.

మల్లి పేరుతో నాలుగు పల్లెలు

సీతంపేట మండలంలో మల్లి పేరుతో నాలుగు పల్లెలు దర్శనమిస్తాయి. మల్లి, నాయుడుమల్లి, సంతమల్లి, దారిమల్లి అనే పల్లెలు ఉన్నాయి. అయితే ఈ పల్లెల్లో మల్లెలు విరబూస్తాయని అనుకుంటే పొరపాటే అవుతుంది. సంచార జీవులైన గిరిజనులు తమకు ఏపేరు తోస్తే ఆపేరును తమ గూడకు పెట్టుకోవడం సర్వసాధారణం. మల్లిలో గురుకుల పాఠశాల ఉంది. మల్లికి సమీపంలోనే నాయుడుమల్లి ఉంది. నాయుడుమల్లి లో ఆశ్రమ పాఠశాల ఉంది. అయితే నాయుడుమల్లి అనే పేరు ఎలా వచ్చిందంటే బిడ్డిక రామినాయుడు గ్రామాధికారిగా ఉండేవారు. ఆయన ప్రాబల్యంతో మల్లికి నాయుడుమల్లి అని పేరు వచ్చింది. అలాగే ఈ ప్రాంతంలోనే సంతమల్లి ఉంది. అది సంత జరిగే ప్రాంతం కావడంతో సంతమల్లి అని పేరు వచ్చింది. చివరిగా దారిమల్లి ఈ గ్రామం సంతమల్లికి, నాయుడుమల్లికి మధ్యగల దారిలో ఉంది. అంచేత దీనికి దారిమల్లి అని పిలుస్తారు. ఈ విషయాన్ని సీనియర్ పాత్రికేయుడు వి.వి.గిరి పేర్కొన్నారు. ఈ గ్రామాలన్ని కుసుమ పంచాయతీలో ఉన్నాయి.

బావాజిపేట

ఈ పల్లె శ్రీకాకుళం గ్రామీణ మండలంలో ఉంది. రాగోలు పంచాయతీలో ఉంది. శ్రీకాకుళం బొందిలిపురం లోని బావాజి మఠం సౌజన్యంతో ఈప్రాంతంలో గ్రామం ఏర్పాటైంది. ప్రజలు సంతోషంతో బావాజి పేటగా నామకరణం చేసారు. బావాజి పేరుతోనే శ్రీకాకుళం నగరంలో బావాజి నగర్, బావాజి పేట ప్రాంతాలు ఉన్నాయి. పీఠాధిపతిని ఒరియా లో బావాజీ అంటారు.

హరిదాసుపురం

ఈ పల్లె నందిగామ మండలంలో ఉంది. దీన్ని పూర్వ నామం షరాబుకొత్తూరు. హరిదాసుపురానికి ఈ పేరు ఎలా వచ్చిందంటే.... ఏన్నో ఏళ్ల క్రితం ఈ గ్రామంలో హరిదాసులు, పందిరి పాట గాయకులు హెచ్చుసంఖ్యలో ఉండేవారు. దీంతో పెద్దలు తమ గ్రామానికి హరిదాసుపురం అని నామకరణం

చేశారు. ఈ హరిదాసులు సింహాచల వరాహాలక్ష్మీ నరసింహ స్వామిని కొలిచేవారు. కాళింగ సామాజిక వర్గంలో కొంత మంది వంశ పారంపర్యంగా ఈ వృత్తిని చేపడతారు. ఈ దేవుని సంబురాలలో తాళం కొడుతూ పాటలు పాడుతారు. అలాగే ధనుర్మాసంలో హరిదాసులు తలపై అక్షయపాత్ర ధరించి పల్లెలకు వెళు తుంటారు.

సైలాడ

ఇది నందిగాం మండలంలో ఉంది. పురాణ ప్రసిద్ధుడైన నందికేశ్వరుని తండ్రి మహాభక్తుడైన శిలాదుని పేర ఏర్పడిన సైలాడ(శిలాడ) కొండ ప్రాంతపు గ్రామం ఇది.

గురుదాసుపురం

ఈ గ్రామం పలాస మండలంలో ఉంది. ఆ రోజుల్లో గురుదాసులు ఇక్కడ హెచ్చు సంఖ్యలో ఉండేవారు. వీరు ఆయా ప్రాంతాల్లో జరిగే సంబురాలకు ఆధ్వర్యం వహించేవారు. పూజలు,పునస్కారాలకు వీరే సారథ్యం వహించేవారు. దాసుడు లేదా దాసురాళ్లకు నమస్కరించే ఆచారం ఇప్పటికీ ఉంది. అలాగే కొన్ని మంత్ర, తంత్ర విద్యలు తెలిసినవారిని కూడా గురువులని అంటారు. ఇది ఇలా ఉండగా ఇదే గ్రామంపేరుతో పంజాబ్ లోని గురుదాస్‌పూర్ పెద్ద పట్టణాలలో ఒకటి. ఇది అక్కడి జిల్లా కేంద్రాలలో ఒకటి.

రాజాం

ఇది మండల, నగర పంచాయతీ,అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం. విద్య,వైద్య,వ్యాపార పరంగా దినదినాభివృద్ధి చెందుతోంది. ఒకప్పుడు ఇది చిన్న గ్రామమే. అయితే ప్రముఖ పారిశ్రామిక వేత్త గ్రంధి మల్లికార్జునరావు ప్రభావంతో ప్రముఖ పట్టణంగా విరాజిల్లుతోంది. ముందుగా రాజామం అని పేరుపెట్టారు. రాజా అంటే రాజులకు, ఆమం అంటే ఉనికి పట్టు అని అర్థం చేసుకోవచ్చు క్రమంగా రాజామం జనవ్యవహరంలో రాజాంగా మారింది. బొబ్బిలి రాజు

బావమరది అయిన తాండ్రపాపారాయునికి రాజాం స్థావరంగా ఉండేది. ప్రస్తుతం న్యాయస్థాన సముదాయం ఉన్న స్థానంలోనే పాపారాయుడి నివాస స్థలం ఉండేది. ఇక్కడి థాణావీధిలో తాండ్రపాపారాయుని కోశాగారం ఉండేది.ఆయన థాణా నిర్వహించిన భవనంలో ప్రస్తుతం తహశీల్దార్ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఇక్కడ కొన్నాళ్ళ పాటు పిఠాపురం రాజవంశీయులు ఉండేవారు. 1757లో బొబ్బిలి యుద్ధం జరిగినపుడు విజయనగరం రాజులు వారి సైన్యం తాండ్ర పాపారాయుడు రాజాంలో ఉన్నందున భయపడి ఆండ్ర, బాడంగి, ముగడ గోర్జి నుంచి బొబ్బిలి చేరుకుంది. విజయనగరం సైన్యం వెళ్ళిన గోర్జి కాబట్టి దాన్ని దండు గోర్జి అని ఇప్పటికీ పిలుస్తారు.

ఆగూరు కంచరాం

ఇది రాజాం మండలంలో ఉంది. ఇక్కడ కంచర పని చేసే కుటుంబాలు తొలుత నివాసాన్ని ఏర్పాటు చేసుకున్నాయి. దీంతో ఈ గ్రామానికి కంచరాం అని పిలుస్తారు. సమీపంలోనే ఆగూరు ఉన్నందున ఆగూరు కంచరాంగా స్థిరపడింది.

దోసరి

ఇది రాజాం మండలంలో ఉంది. దీని తొలిపేరు దోసరి రామినాయుడు వలస (డి.ఆర్.వలస). పూర్వం దోసరి రామినాయుడు అనే వ్యక్తి తొలుత ఈ ప్రాంతానికి వచ్చి నివాసం ఏర్పరచుకున్నాడు. ఆయన పేరు మీదుగా దోసరిరామినాయుడు వలస గ్రామం ఏర్పడింది. కొంతకాలం తరువాత రామినాయుడు దగ్గరలో ఉన్న మరో ప్రాంతానికి నివాసం ఏ ర్పాటు చేసుకున్నాడు. ఆ గ్రామాన్ని రామినాయుడు వలసగానూ, దీనిని దోసరిగానూ వ్యవహరిస్తున్నారు. అయితే ఈ రెండు ప్రక్కప్రక్క గ్రామాలు కలిసి ఒకే పంచాయితీగా ఉండడం విశేషం. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన అజ్జాడ శివగణేష్ రచయితకు తెలిపాడు.

హరిద్వారం

ఇది పాతపట్నం మండలంలో ఉంది. ఉత్తరభారత దేశంలోని ఉత్తరాంచల్‌లో హరిద్వార్ గూర్చి అందరికీ తెలిసిందే. అదో గొప్ప పుణ్య క్షేత్రం అయితే పాతపట్నం మండలంలోని హరిద్వారం గ్రామ నామం గూర్చి కొద్ది మందికే తెలిసి ఉండవచ్చు. అయితే ఈ గ్రామానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే.... ఉత్తర భారతంలోని హరిద్వార్‌కు ఈ ప్రాంతంలోని కొంత మంది భక్తులు దర్శించుకున్నారు. ఆ తరువాత ఇక్కడికి వచ్చి కొత్తగా గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నారు. హరిద్వారం అని ఈ గ్రామానికి పేరు పెట్టుకున్నారు. ఇదే ప్రాంతంలో నివాసాలను ఏర్పాటు చేసుకొని తమ పల్లెకు హరిద్వారం అని పేరుపెట్టుకున్నారు.

అయోధ్యపురం

ఇది టెక్కలి మండలంలో ఉంది. అయోధ్య ఉత్తరప్రదేశ్ లోని గొప్ప పుణ్య క్షేత్రం. అయితే ఇదే పేరుతో ఆ మండలంలో అయోధ్య పురం వెలసింది. ఈ ప్రాంతంలోని కొందరు అయోధ్యను దర్శించుకొని తిరిగి వచ్చాక ఇక్కడ ఓ పల్లెను ఏర్పాటు చేసుకున్నారు. అయోధ్య స్ఫూర్తితో ఈ పల్లెకు అయోధ్యపురమని పేరుపెట్టుకున్నారు. ఉత్తరాది నుంచి కొంతమంది జీవనోపాధి కోసం ఈప్రాంతానికి వచ్చి స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. తమ ఊరికి అయోధ్య స్ఫూర్తితోనే అయోధ్యపురం అని పేరు పెట్టుకున్నారు.

రఘునాథపురం

ఇది మందస మండలంలో ఉంది. 18వ శతాబ్ది ఉత్తరార్ధంలో టెక్కలి పాలకుడు రఘునాథుడు అతడు తన పేరిట ఒక గ్రామాన్ని నిర్మించాడు. అదియే 'రఘునాథపుర' మని ప్రకీర్తితమగుచున్నది. క్రీ.శ. 1747లో రఘునాథపుర ప్రతిష్ట మహావైభవంగా జరిగింది.

రణస్థలం

ఇది మండల కేంద్రం. జిల్లాకు ముఖద్వారంగా ఉంది. నాటి రణభూమియే నేటి రణస్థలమని పేర్కొంటారు.ఇక్కడ తరచూ ఘర్షణలు చెలరేగి యుద్ధాలు

జరిగేవని రెండూ వైపుల నుంచి వచ్చే శత్రువులు ఈ ప్రాంతాన్ని యుద్ధభూమిగా మార్చుకున్నారని ఆకెళ్ల జగన్నాధం పంతులు పేర్కొన్నారు. మహమ్మదీయులు, చిక్కోలు సంస్థానాధీశులు, చరిత్ర ప్రసిద్ధి కెక్కిన వారంతా ఈ ప్రాంతంలో పోరాడి వీరమరణం పొందారు. 1757లో విజయనగర సంస్థానాధీశుల పాలనలో సేనాపతిగా పనిచేసిన బొట్ల గుర్రప్ప దొర శ్రీకాకుళం కోటను వశపరుచుకోడానికి బాదుర్ల ఖాన్‌తో యుద్ధంచేసాడు. ఈ యుద్ధంలో గుర్రప్ప దొర వీర స్వర్గం పొందాడు. అతని భార్య మహలక్ష్మమ్మ కమ్మ సిగడాంలో భర్తతో పాటు సహగమనం చేసింది. మహలక్ష్మమ్మ యాత్ర ప్రతీ ఏటా భారీ ఎత్తున నిర్వహిస్తున్నారు ఆమె ప్రతిరూపం వాండ్రంగిలో ఉంది. ఆంగ్లేయుల పాలనలో సైతం ఈ ప్రాంతంలో ఘర్షణలు పెద్ద ఎత్తున జరిగాయి. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో ఈ ప్రాంతంలోని మరువాడ కొండపై మిలటరీ వారు రహస్య స్థావరాలు ఏర్పరుచుకున్నారు. సంచాం, కోటపాలెం గ్రామాల్లో మూడు అడుగులు గల నల్లరాతి ఏకశిలా వినాయక విగ్రహాలు అప్పటి యుద్ధాల్లో ధ్వంసమయ్యాయి. రణస్థలం గ్రామ పంచాయితీలో పది గ్రామాలు ఉండేవి. 1995లో ఈ పంచాయితీ నుంచి జగన్నాధ రాజపురాన్ని (జె.ఆర్.పురం) ప్రత్యేక పంచాయితీగా ఏర్పాటు చేశారు.

జగన్నాధ రాజపురం (జె.ఆర్. పురం)

1885లో సంస్థానాధీశుల పాలనలో జగన్నాధరాజు శిస్తులను వసూలు చేసే దివాన్‌గా ఉండేవారు. ఆయనపేరుతోనే ఈ ప్రాంతానికి జె.ఆర్.పురం వచ్చింది. రణస్థలం, జె.ఆర్.పురం పంచాయితీలు వేరువేరుగా ఉన్నప్పటికీ పాలు, నీళ్లు కలిసినట్టు ఏకరూపంలో కనిపిస్తాయి.

కొవ్వాడ మత్స్యలేశం

ఇది రణస్థలం మండలంలోని తీరప్రాంత గ్రామం. ఇక్కడే అణువిద్యుత్ కేంద్రం ఏర్పాటుకానుంది. ఈ గ్రామానికి ఆ పేరు ఎలా వచ్చిందటే... కొత్త, వాడ అనే పదాల నుంచి కొవ్వాడ ఏర్పడింది. వాడబలిజ సామాజికవర్గం

ఉండడంతో (చేపలు పట్టే కులస్థులు) కొవ్వాడకు మత్స్యలేశం అనే పేరు అదనంగా చేరింది. అదే కొవ్వాడ మత్స్యలేశం.

కుంకాం

ఇది లావేరు మండలంలో ఉంది. కుంకాం మూడు కుంకాలుగా ఏర్పడ్డాయి. ముందుగా పాత కుంకాం, ఆ తరువాత కొత్తకుంకాం, కొండకుంకాం ఏర్పడ్డాయి. విజయనగర సంస్థానాధీశుడైన విజయరామ గజపతి రాజు (19వ.శ) తన చెల్లెలికి ఈ ప్రాంతంలో పసుపుకుంకుమ కింద కొన్ని భూములను రాసి ఇచ్చాడు. బొమ్మిరెడ్డిపల్లి రామవిశ్వనాథంను ఎస్టేటు అధికారిగా నియమించారు. ఆయన ఈ భూముల వ్యవహారాలను చూసేవాడు. తరువాత సర్కారు చట్టాల మేరకు ఇవన్నీ రైతుల స్వాధీనంలోకి వచ్చాయి. పసుపుకుంకు మ కింద ఇచ్చిన భూములు కాబట్టి ఈ ప్రాంతానికి కుంకుమ అనే పేరు వచ్చింది. క్రమంగా కుంకాంగా మారింది. తొలుత ఏర్పాటైన కుంకాం పాతకుంకాం అయింది. మరి కొంత దూరంలో ఏర్పాటైన పల్లె కొత్తకుంకాం అయింది. కాగా ఈ ప్రాంతంలోనే కొండ పక్కన గల పల్లె కొండకుంకాం అయింది. ఈ విషయాన్ని గ్రామాలను సందర్శించిన ఈ రచయితకు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కూనపల్లి అప్పారావు, చిరుదివ్వె చైతన్య సంస్థ అధ్యక్షుడు డోకి హరికృష్ణ తెలిపారు.

కే. మత్స్యలేశం

ఇది గార మండలంలోని తీర ప్రాంత పంచాయితీ కేంద్రం. ఇది కళింగపట్నం సమీపంలో ఉంది. మత్స్యం అంటే చేప అని అర్థం. ఈ ప్రాంతంలో సముద్రం వద్ద చేపలు దొరుకుతాయి. ఈ సందర్భంలో 'లేశం' అంటే సులభ సాధ్యమని అర్థం. అంటే ఇక్కడ చేపలు సులభసాధ్యంగా లభిస్తాయని పేర్కొనవచ్చు. 2016 ఫిబ్రవరిలో పెద్దఎత్తున మహోదయ స్నానాలను నిర్వహించారు.

మత్స్యలేశం పేరుతో మరికొన్ని.....

గార మండలంలోనే ఎస్.మత్స్యలేశం(శ్రీకూర్మం మత్స్యలేశం) ఎచ్చెర్ల మండలంలో డి.మత్స్యలేశం (ధర్మవరం మత్స్యలేశం) రణస్థలం మండలంలో కె.మత్స్యలేశం (కొవ్వాడ మత్స్యలేశం) గ్రామాలున్నాయి.

కోడూరు

ఇది పోలాకి మండలంలో ఉంది. కోడూరు పేరుతో విజయనగరం,కడప తదితర జిల్లాల్లో గ్రామాలున్నాయి. పోలాకిలోని కోడూరుకు సంబంధించి.....ఈ పల్లెకు 2 కి.మీ దూరంలో సముద్రం ఉంది. జలసూచిక ఉన్న గ్రామాల్లో కొన్నింటి పేర్లు కోడూరు నామకరణంతో ఉన్నాయి. ఒక్క ముక్కలో చెప్పాలంటే కోడూరు పేరుతో ఉన్న గ్రామాల సమీపంలో సముద్రం లేదా నదీ ప్రాంతం తప్పనిసరిగా ఉంటుంది.

బొడ్డపాడు

ఇది పలాస మండలంలో ఉంది. ఇది ఒకప్పుడు జైనుల స్నానవాటికగా ఉండేది. స్నానముచేయుటను ఒరియా భాషలో 'బుడ్డు' అని పిలుస్తారు. పాడు అంటే ప్రాంతం అని అర్థం. అయితే మెదట బుడ్డుపాడు అని ఈ ప్రాంతాన్ని పిలిచేవారు. కాలక్రమంలో బుడ్డుపాడు కాస్త బొడ్డపాడు గా రూపాంతరం చెందింది. 1969లో ప్రారంభమైన శ్రీకాకుళం రైతాంగ పోరాటంలో ఈ పల్లె కీలక పాత్ర పోషించింది.

గదబపాలెం

ఈ పల్లె గంగువారి సిగడాం మండలంలో ఉంది. చాలా ఏళ్ల కితం గదబ(గిరిజన) తెగ వారు ఈ గ్రామాన్ని ఏర్పాటు చేసుకొన్నారు. అయితే ఈ కుటుంబాలన్నీ స్థానికంగా ఉపాధి లభించకపోవడంతో చెట్టుకొకరు, పిట్టకొకరుగా చెల్లాచెదురయ్యారు. ప్రస్తుతం ఈ పల్లెలో యాదవులు, విశ్వబ్రాహ్మణ సామాజికవర్గం వారు ఉన్నారు. గదబ వంశీయులు ఎవరూ ప్రస్తుతం లేకపోయినప్పటికీ గదబపాలెం పేరుతోనే ఈ గ్రామం కొనసాగుతోంది.

మందరాడ

ఇది సంతకవిటి మండలంలో ఉంది. సుమారు 2శతాబ్దాల కితం మందరాడ వంశీయులు(దళితులు) తొలుత ఈ గ్రామాన్ని వాసయోగ్యంగా తీర్చి

దిద్ది స్థిరపడ్డారు.ఆ తరువాత మిగిలిన సామాజిక వర్గాలు వచ్చి చేరాయి. మందరాడ వంశీయుల పేరుతోనే మందరాడకు ఆపేరు వచ్చింది. గ్రామం చెరువు గట్టుపైగల మర్రి చెట్టు తొర్రలో మూడు కర్ర ప్రతిమలను(త్రిమూర్తులు) అప్పట్లో దళితులు ఏర్పాటుచేశారు. ఆ తరువాత ఇదే గ్రామానికి చెందిన చేనేత ప్రముఖుడు గోరు విశ్వనాథం ప్రజల సహకారంతో త్రిమూర్తుల దేవాలయాన్ని ఏర్పాటు చేశారు. అందులో కర్ర ప్రతిమలకు బదులుగా రాతి ప్రతిమలను ఏర్పాటు చేశారు. 20 ఏళ్ల కితం విశాల హృదయంతో అప్పటి సర్పంచ్ వావిలవల్లి వేణుగోపాలనాయుడు(వేణునాయుడు) మందరాడ ఎర్రయ్య అనే దళితుడ్ని పూజారిగా నియమించారు. అయితే ప్రస్తుతం వేరేవారు అర్చకునిగా వ్యవహరిస్తున్నారు.

పోలవరం

ఇది టెక్కలి మండలంలో ఉంది. ఇక్కడ వెలసిన పాశిపోలమ్మ గ్రామ దేవత పేరుతో ఈ గ్రామానికి స్థానికులు 'పోలవరం' అని నామకరణం చేశారు. పోలమ్మ తల్లి భక్తుల పాలిట కొంగుబంగారంగా వాసికెక్కింది. గ్రామంలోని పెద్ద చెట్టునే అమ్మవారిగా కొలుస్తారు. అమ్మకు.సుందరమైన ఆలయ ముఖద్వారాన్ని ఏర్పాటు చేశారు. తల్లి సిరిమాను ఉత్సవాలను తొమ్మిదేళ్లకొకసారి నిర్వహిస్తారు. 2016లో ఏప్రిల్1 నుంచి 5వరకు ఈ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.

విజయనగరం జిల్లా

విజయనగరం

ఇది జిల్లా కేంద్రంగా ఉంది. విజయనగరం ఒక సంస్థానం. పూసపాటి వంశం వారు దీని పాలకులుగా ఉండేవారు. విజయనగరం రాజులు తొలుత కుమిలిలోని మట్టి కోటలో నివశించేవారు. ఆనందగజపతి రాజు విజయనగరం కోట నిర్మాణాన్ని క్రీ.శ.1712-1714ల మధ్య ప్రారంభించారు. అయిదు విజయాలకు చిహ్నంగా విజయనామ సంవత్సరంలో, విజయదశమి(మంగళవారం) రోజున ఈ కోట నిర్మాణం మొదలైంది. తన కుమారుడు విజయరామరాజు పేరిట దీనికి విజయనగరం అని పేరు పెట్టారు. అదే పేరుతో పిలుస్తున్నారు. విద్యల నగరంగా ఖ్యాతి పొందింది. సంగీత సాహిత్యాలకు ఆటపట్టుగా నిలిచింది. మహాకవి గురజాడ, ఆదిభట్ల నారాయణదాసు, ద్వారం వెంకటస్వామినాయుడు, చాసో, రోణంకి అప్పలస్వామి, కుమ్మరి మాష్టరు, రావుపట్నాయక్, ఘంటసాల వంటి ప్రముఖులెందరికో ఈ పట్టణం ఆదరించి అక్కున చేర్చుకుంది. ఎన్నో విద్యాసంస్థలు ఇక్కడ వెలిశాయి. ఇక్కడ 17వ శతాబ్దంలో నిర్మించిన శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయం ఉత్తరాంధ్రలోనే ప్రసిద్ధి గాంచింది.

బొంకులదిబ్బ

బొంకులదిబ్బ విజయనగరం వారికే కాకుండా తెలుగు వాళ్లందరికి సుపరిచితమైన పేరు. కన్యాశుల్కం నాటకం లోని తొలి అంకం విజయనగరంలోని బొంకులదిబ్బ వేదిక కావడం విశేషం. గురజాడ సృష్టించిన ప్రముఖపాత్ర గిరీశం. గిరీశం స్వగతంతోనే ఈనాటకం ప్రారంభమవుతుంది. ఇంతకీ బొంకులదిబ్బ అనే పేరు ఎలా వచ్చిందో చూద్దాం. ఆ రోజుల్లో ఫ్రెంచి ఇంజనీర్ ఒకరు ఈ ప్రాంతంలో భూగర్భం నుంచి తాగునీటిని తెప్పిస్తామని గొట్టాలు అమర్చి

వెళ్లిపోయాడు. ఆతరువాత అతని జాడే తెలియలేదు. అతను తన మాట నిలబెట్టుకోలేకపోయాడు. బంకు అలానే ఉండిపోయింది. జనవ్యవహారంలో ఇది బొంకు అయింది. ఫలితంగా దీనికి బొంకులదిబ్బ అనే పేరు వచ్చింది. మరో కథనం ప్రకారం బంకు అంటే శిస్తు, దస్తులు వసూలు చేసే కేంద్రం. ప్రజలు తమ వంతు వచ్చేవరకు అక్కడే వేచి ఉండేవారు. అంచేత బంకుల దిబ్బ అయిందని చెబుతారు. జన వ్యవహారంలో బొంకుల దిబ్బ అయింది. గురజాడ ఈ బంకుమీదే ఉపన్యాసాలు ఇస్తుండేవారు. అంచేత ఆయన్ని 'కింగ్ ఆఫ్ బంకు'గా కొందరు వేళాకోళం చేసేవారు. ఈ ప్రాంతం రాజా వారి కోటకు ఎదురుగా ఉంది. ఆనాడు మహారాజులు ఈ ప్రదేశాన్ని సైనికుల విన్యాసాలకు, కవాతులకు ఉపయోగించేవారు. ప్రస్తుతం ఇది కూరగాయల అంగడిగా మారింది. ఈ దిబ్బ గూర్చి 'వెలుగుజాడ' అనే వ్యాస సంకలనంలో డా॥ ఏ.గోపాలరావు ప్రస్తావించారు.

బొగ్గులదిబ్బ

విజయనగరం రైల్వేస్టేషన్ గూడ్సు షెడ్ ప్రాంతంలో బొగ్గులదిబ్బ ఉంది. ఆ రోజుల్లో బొగ్గుతో రైళ్లు, పరిశ్రమలు నడిచేవి కదా! ఎలిశెట్టి వెంకటస్వామి నాయుడు అనే గుత్తేదారు స్థానికంగా బొగ్గులు తయారు చేయించి ఇతర ప్రాంతాలకు రైల్వే వేగన్ల ద్వారా పంపేవారు. వీటిని ఈ ప్రాంతంలో కుప్పలు కుప్పలుగా బొగ్గులను నిల్వచేసి ఉంచేవారు. ఇదిలా ఉండగా అడపా దడపా కొందరు గూడ్సు రైల్లోని బొగ్గులను అపహరించుకుపోయిన సందర్భాలు ఉన్నాయి. అయితే డీజిల్, విద్యుత్ రైళ్లు రావడంతో బొగ్గుతో పనిలేకుండా పోయింది. ఇప్పుడు బొగ్గులు దిబ్బలు లేకపోయినా ఈ ప్రాంతాన్ని నేడు బొగ్గులదిబ్బగానే పిలుస్తారు.

గంటస్తంభం

1885లోఆనాటి పురపాలికవారు పూసపాటిగజపతి రాజుల సౌజన్యంతో ఈ గంటస్తంభాన్ని నిర్మించారు. గంట స్తంభం ఎత్తు 68 అడుగులు అప్పట్లో దీని నిర్మాణానికి కేవలం రూ. 5,400 మాత్రమే ఖర్చయింది. ఈ స్తంభానికి 4 బురుజులు

ఉన్నాయి. ఇవి కాలాన్ని తెలియజేస్తాయి. నాలుగు పక్కల నాలుగు గడియారాలను అమర్చారు. పై భాగంలో సైరన్ ఉంది. ఈ సైరన్ ఉ.8 గంటలకు, మ.12 గంటలకు, రాత్రి.8 గంటలకు మోగుతుంది. దీని నిర్మాణానికి గల ముఖ్య ఉద్దేశ్యం ఏమిటంటే రెండో ప్రపంచ యుద్ధ కాలంలో ప్రజలను అప్రమత్తం చేయడానికి దీనిని ఉపయోగించేవారు.

మూడులాంతర్లు

విజయనగరం చరిత్రలో మూడులాంతర్లకు విశిష్టస్థానం ఉంది. అమ్మవారి గుడి ఎక్కడుందంటే మూడులాంతర్ల దగ్గరంటారు. మూడులాంతర్లు ఎక్కడుందంటే అమ్మవారిగుడి దగ్గరంటారు. పూర్వం విద్యుచ్ఛక్తిలేని రోజుల్లో మూడు లాంతర్లు ఎక్కువగా ఉపయోగపడేవి. మూడుతోవల కూడలిలో ఒక స్తంభాన్ని కట్టించారు. నెల్లిమర్ల, గంటస్తంభం, కోట వైపు వెళ్ళేదారుల్లో ఈ మూడు కలిపే కూడలి మధ్య ఉన్నదే మూడులాంతర్లు. మూడులాంతర్ల ప్రాముఖ్యత కారణంగా నేటికీ దీనిని మూడులాంతర్ల కూడలిగా పిలుస్తారు.

షికారుగంజి

ఈ గ్రామం దత్తిరాజేరు మండలంలో ఉంది. ఈ పల్లె తొలిపేరు రేగులవలస.రేగులవలస ఇంటి పేరుతో కొన్ని కుటుంబాలు ఉన్నాయి. విజయనగరానికి 60 కిలోమీటర్ల దూరంలో ఉంది. 19వ శతాబ్దంలో విజయనగరం సంస్థానాధీశుడైన ఆనందగజపతిరాజు రేగులవలస అటవీ ప్రాంతానికి అశ్వదళంతో షికారుకు, వేటకు వచ్చేవారు. 'రాజువెడలె' తరహాలో మంది మార్బలంతో వచ్చేవారు. చిరుతపులులను వేటాడేవారు. విశ్రాంతి కోసం ఓ బంగ్లాను కూడా నిర్మించుకున్నారు. అయితే బంగ్లా కాలక్రమేణా శిథిలమైంది. ప్రస్తుతం ఆనవాళ్లుగా పునాదులు, పిట్టగోడలు మిగిలున్నాయి. గత వైభవానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ గ్రామానికి విజయనగరం సంస్థానాధీశులకు గల అనుబంధానికి గుర్తుగా రికార్డులలో రేగులవలసను షికారుగంజిగా మార్చారు.

గంజి అంటే గ్రామం. రాజు ఇక్కడ ఒక పేదరాలి ఇంటివద్ద గంజి తాగినట్టు కూడా మరో కథనం ప్రచారంలో ఉంది. షికారుగంజి ప్రాంతంలోని ఓ కొండపై నుండి వచ్చిన వరదనీరు అడవుల మీదుగా ప్రవహిస్తుంది. ఈ నీరు పది చెరువులకు వెళ్తుంది. ఆ జలం ఎంతో తీయగా ఉండేది. ఆ నీటిని ప్రతిరోజు రెండు కావిళ్ళతో విజయనగరం సంస్థానాధీశులకు తీసుకుని వెళ్లేవారు. ఈ ప్రాంతంలోని అడవుల్లో మంచి మంచి వనమూలికలు ఉండేవి. దీని వల్లనే ఈ ప్రాంతంలోని నీరు తీయగా ఉంటుందని ఈ పల్లెను సందర్శించిన రచయితకు ఆర్.ఎస్.పట్నాయక్ తెలిపారు.

పార్వతీపురం

ఇది డివిజన్ కేంద్రం. అసెంబ్లీ నియోజకర్గ కేంద్రం. ఒకప్పుడు లోక్‌సభ నియోజకవర్గ కేంద్రంగా ఉండేది. ఇది ఒడిషాకు సమీపంలో ఉండడంతో వాణిజ్యరంగంలో పరుగులు తీస్తోంది. బెలగాం జమిందారులు ఓడ్ర రాజులుకు చెందినవారు. వారందరిని తాట్రాజులని కూడా పిలుస్తారు. వారి వంశంలో పార్వతమ్మ అనే మహిళపేరుతో ఈ గ్రామానికి పార్వతీపురం అని పేరు పెట్టారు. కాగా ఇక్కడ పర్వతాలు చుట్టూ ఉన్నందున పర్వతపురం అయిందని కాలక్రమంలో అది పార్వతీపురంగా మారిందని కొందరు చెబుతారు. 1796లో పార్వతీపురం పేరుతో ప్రసిద్ధి గాంచింది. ప్రముఖ కథా రచయిత నారంశెట్టి ఉమామహేశ్వరరావు ఇక్కడే స్థిరపడ్డారు.

రంగరాయపురం

ఇది బొబ్బిలి మండలంలో ఉంది. బొబ్బిలి సంస్థానాధీశులకు రంగారావు అనేది వంశక్రమానుగతమైన బిరుదు వారి ప్రభావంతోనే రంగరాయపురం ఏర్పడినట్టు చరిత్ర చెబుతోంది. ఇది ఇలా ఉండగా బొబ్బిలి యుద్ధ వీరుడైన వెంగళరావు కుమారుడు పెద జనార్ధన రంగారావు లక్కవరపు కోటను సంపాదించి పాలించాడు. బొబ్బిలి వంశీయుల బిరుదైన రంగారావు కలిసొచ్చే విధంగా ఈ ప్రాంతంలో కూడా రంగాపురం ఏర్పడింది.

వెంగళరాయపురం

ఇది బలిజపేట మండలంలో ఉంది. బొబ్బిలి సంస్థానాధీశులలో మూడవవాడు వెంగళరావు. బొబ్బిలి యుద్ధంలో (1757) ఆయన కీలకపాత్ర వహించాడు. ఆయన ప్రభావంతోనే ఈ గ్రామం ఏర్పడినట్టు చారిత్రక కథనం వల్ల వ్యక్తమౌతోంది.

నిడగల్లు

ఇది సీతానగరం మండలంలో ఉంది. నిడువైన కళ్ళు (కొండ) ఉన్న ఊరు కాబట్టి నిడువకళ్ళుగా మారింది. జనవ్యవహారంలో నిడగల్లుగా పరిణమించింది.

శంబర

ఈ గ్రామం మక్కువ మండలంలో ఉంది. ఈ గ్రామంలోని గ్రామ దేవత పోలమాంబ గొప్ప మహిమగలది. ఆమెను దర్శించుకోవడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచే కాదు సుదూరం నుంచి వస్తున్నారు. కోర్కెలు తీరిన భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్న సంప్రదాయం కొనసాగుతోంది. ప్రతి ఏటా సంక్రాంతితరువాత వచ్చే సోమ, మంగళ, బుధవారాల్లో అమ్మవారికి ఘనంగా సంబరాలు నిర్వహిస్తారు. తెలంగాణా ప్రాంతంలో వరంగల్ జిల్లాలోని సమ్మక్క-సారక్క జాతరల ప్రసిద్ధి కాగా. ఉత్తరాంధ్రలో శంబర పోలమాంబ ఎంతో ప్రసిద్ధి చెందింది. మక్కువకు దగ్గరలో ఉన్న శంబర ప్రాంతం ఒకప్పుడు దండకారణ్య ప్రాంతం లా ఉండేదని చెబుతారు. ఇది శంబరాసురుడనే రాజు పాలనలో ఉండేదని పేర్కొంటారు. ఆనాటి ప్రజలు అతని వల్ల అనేక బాధలను అనుభవించారు. అందుచే వారు శక్తి స్వరూపిణి అయిన శ్రీపార్వతీదేవిని ప్రార్థించారు. దీంతో ఆమె పోలమాంబరూపంలో అవతరించి శంబరాసురుడిని సంహరించినట్టు చెబుతారు. శంబరుని పేరుతో శంబర ఏర్పడింది ఆనాటి నుంచి పోలమ్మను శంబర పోలమాంబగా పిలుస్తున్నారు.

పెదతాడివాడ చిన్నతాడివాడ

ఈ రెండు గ్రామాలు విజయనగరం పట్టణానికి సమీపంలోని గంట్యాడ మండలంలో ఉన్నాయి. ముందుగా పెదతాడివాడ గ్రామం వెలసింది. గ్రామానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే ఈ ప్రాంతంలో తాటిచెట్లు విస్తారంగా ఉన్నాయి. దీంతో ఈ పల్లెకు తాటివాడ అని పేరు పెట్టారు. క్రమంగా ఇది తాడివాడగా రూపాంతరం చెందింది. ఈ గ్రామానికి కూతవేటు దూరంలో మరో తాడివాడ ఏర్పాటైంది. స్పష్టత కోసం తొలుత ఏర్పాటైన తాడివాడను పెదతాడివాడగా, తదనంతరం అవతరించిన తాడివాడను చినతాడివాడగా నామకరణం చేశారు.

సాంబన్నవలస

ఇది గరుగుబిల్లి మండలంలో ఉంది. మేరంగి జమీందారులు వేద పండితుడైన గొర్తి సాంబమూర్తి శాస్త్రికి ఇచ్చిన అగ్రహారమిది. ఆయన పేరుతోనే సాంబన్నవలస వెలసింది.

గంగరాజపురం

1794లో పద్మనాభ యుద్ధానంతరం మేరంగి జమీందారీని పొందిన వాడు శత్రుచర్ల గంగరాజు (1770-1803). ఆయన పేరుతో పార్వతీపురం ప్రాంతంలో రెండు గంగరాజపురం గ్రామాలు ఏర్పడ్డాయి.

రామతీర్థం

ఈ గ్రామం నెల్లిమర్ల మండలంలో ఉంది. విజయనగరం పట్టణానికి ఈశాన్య దిశగా 12 కిలో మీటర్ల దూరంలో నెలకొని ఉంది. సుమారు వెయ్యి సంవత్సరాల క్రితం ఈ ప్రాంతమంతా కొండలు, గుట్టలతో నిండి ఉండేది. అప్పట్లో పశుపతిరాజుల ఆధ్వర్యంలో శ్రీరామాచంద్రాలయాన్ని నిర్మించారని ప్రచారంలో ఉంది. ఇక్కడ ఆలయానికి గల ప్రాముఖ్యత ఏమిటంటే మొత్తం దీన్ని ఒకే అతిపెద్ద రాతిపై నిర్మించారు. సుందర ప్రకృతి లోగిలిలో ఈ ఆలయం ఆలరారుతుంది. చంపావతి నది సమీపాన నెలకొన్న ఈ ధామం నీలాచలం అనే కొండను ఆనుకొని విరాజిల్లుతోంది. ఇక్కడ గల స్వామివారు నీటి మడుగు

నందు అనగా తీర్థమందు లభించడం వల్ల ఈ క్షేత్రానికి రామతీర్థం అనే పేరు వచ్చిందని ఐతిహ్యం వల్ల తెలుస్తోంది. క్రీ.శ1656లో ఈ ఆలయాన్ని సీతారామచంద్ర రాజు పునరుద్ధరించాడు. కాగా క్రీ.శ 469-496వరకు ఇంద్ర భట్టారక వర్మ ఈ ప్రాంతాన్ని పాలించి రామతీర్థంలో ఒక శాసనం వేయించాడు. దీన్ని బట్టి ఇది ఎంతో ప్రాచీన ఆలయమని అర్థమౌతోంది. దండి రాసిన దశకుమార చరిత్రలో ఈ క్షేత్ర ప్రసక్తి ఉంది. మహాశివరాత్రి పర్వదినాన ఇక్కడ శ్రీరాముడు పూజలందుకోవడం విశేషం. ఈ సందర్భంగా పెద్ద జాతరను నిర్వహిస్తారు. అలాగే శ్రీరామ నవమి,భీష్మ ఏకాదశి పర్వదినాల్లో పెద్దఎత్తున ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయి. 2015 నుంచి ప్రతీ శ్రీరామనవమీ ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం పక్షాన అధికార లాంఛనాలతో స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పిస్తోంది. 1, 2 శతాబ్దాల కాలం నాటి బౌద్ధ శిథిలాలు ఇక్కడ ఉన్నాయి. బౌద్ధుల కాలంలో ఈ ప్రాంతాన్ని ఆరామతీర్థంగా, తరువాత కాలంలో రామతీర్థంగా వాసికెక్కింది.

మార్కొండపుట్టి

ఇది జియ్యమ్మవలస మండలంలో ఉంది. నాటి మేరంగి దివాను మార్కొండ ఆదెయ్య మంచి పరిపాలకునిగా గుర్తింపు పొందాడు. ఆయన ఇంటి పేరుతో జియ్యమ్మవలసలో ఓ మార్కొండ పుట్టి అలాగే మక్కువ మండలంలో మరో మార్కొండపుట్టి ఏర్పడ్డాయి. పుట్టి అంటే చిన్న పల్లె అని అర్థం. కాగా జియ్యమ్మవలస లోని మార్కొండపుట్టి ప్రముఖ సినీ రచయిత దివంగత గణేష్‌పాత్రో స్వగ్రామం.

ధనుంజయపురం

ఇది పార్వతీపురం మండలంలో ఉంది. పార్వతీపురం సంస్థానానికి చెందిన సుందర నారాయణ ధాత్రాజు మనుమడు ధనంజయుడు (1865-1888) పేరుతో ధనుంజయపురం ఏర్పడింది.

సంతోషపురం

ఇది గరుగుబిల్లి మండలంలో ఉంది. మొండెంకల్ అడవులలో పాలకొండ పితూరిదార్లను ఎదిరించిన తెల్లదుమ్ము ముఖాసాదారు సంతోషరాయుని పేరిట ఈ గ్రామం ఏర్పడినట్టు తెలుస్తోంది

బొబ్బిలి

చికాకోల్ పరగణా ఫౌజుదారు షేర్‌మహ్మద్‌ఖాన్ ఈ గడ్డపై పుట్టిన వీరులను పెద్దపులులు అని పేర్కొన్నాడు. నాటి నుంచి పెబ్బులి, బెబ్బులి క్రమంగా బొబ్బిలి అయింది. బొబ్బిలి చరిత్ర ప్రసిద్ధికెక్కి విజయనగరం జిల్లాకే గర్వకారణం అయ్యింది. ఇది వీరనగరం. వీరమరణం పొందిన వారి సంస్మరణకు గాను నిర్మితమైన యుద్ధ స్తంభం ఇక్కడ ఉంది. పెద్ద సంస్థానాల్ల బొబ్బిలి ఒకటి. చికాకోల్ నవాబ్ షేర్‌మహ్మద్‌ఖాన్ చేత రావు రాయుడప్పకు ప్రసాదింపబడిందని, ఇక్కడి కోటకు నివేశన దాతపేరు షేర్ (బెబ్బులి) అని వ్యవహరించ గా అది ప్రజల వాడుకలో బొబ్బిలి అయిందని కొటికలపూడి కోదండరామ కవి రచించిన 'ప్రసన్న పారిజాతం' వల్ల తెలుస్తుంది. ధ్వని పరిణామ సూత్రాల మేరకు బెబ్బులి బొబ్బిలి కావడం శాస్త్రవిరుద్ధం కాదు. 1757 జనవరి 24న జరిగిన బొబ్బిలి యుద్ధం ఆంధ్రదేశంలో ప్రసిద్ధమైంది.

ఉత్తరాపల్లి

ఉత్తరాపల్లి గ్రామం కొత్తవలస మండలంలో ఉంది. పాండవ వనవాస కాలంలో ఉత్తర గోగ్రహణం ఇక్కడ జరిగినందున ఈ గ్రామానికి ఉత్తరాపల్లి అనే పేరు వచ్చినట్టు స్థానికుల కథనం.

శృంగవరపుకోట (ఎస్. కోట)

శృంగవరపుకోట మండల కేంద్రం. రాచరికం అధికారం చెలాయిస్తున్న కాలం అది. రాజులు రోజంతా పరిపాలన బాధ్యతలలో తలమునకలై అలసటకు గురయ్యేవారు. విశ్రాంతి కోసం ఓ మంచి ఉద్యానవనాన్ని ఏర్పాటు చేయాలని

నిర్ణయించుకున్నారు. వారి ఆలోచనలను వెంటనే అమలు చేశారు. ఊరికి కాస్తా దూరంగా పచ్చటి పంటపొలాల మధ్య ప్రత్యేక ఉద్యానవనాన్ని నిర్మించారు. మకాం చేయడానికి ఒక చిన్న కోటను కూడా కట్టించారు. రాజు రాణితో కలసి తోటకు వచ్చేవారు. ఒకరోజో, రెండురోజులో విడిది చేసే వారు. ఆకోట రాజు శృంగారానికి వేదికగా నిలిచింది. ఈ పక్కనే చిన్న కోట ఉండేది. ఆపేరుతోనే శృంగవరపు కోట పేరు వచ్చిందని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రాంతాన్ని పరిపాలించిన ముఖీవంశ రాజులలో ముఖ్యుడైన శింగవరపుభూపాలుడు తన పేరు కలిపొచ్చే విధంగా శృంగవరపు కోట అని నామకరణం చేసినట్టు పేర్కొంటారు. సంక్షిప్తంగా ఎస్.కోట అని పిలుస్తున్నాం.

కుదమ

ఈ పల్లె జియ్యమ్మవలస మండలంలో ఉంది. ఈ గ్రామంలో కొదమ పోతుల కొట్లాట పోటీలు నిర్వహించేవారు. ఆనాటి కురుపాం రాజులు ఈ గ్రామ ప్రాంతానికి కొదమ గ్రామంగా పిలిచేవారు. క్రమేపి జనవ్యవహారంలో కుదమగా మారింది. ఆ తరువాత అనేకమంది ఈ గ్రామం పేరును తమ ఇంటిపేరుగా కూడా మార్చుకున్నారు. ఈ విషయాన్ని ఈ గ్రామానికి చెందిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కుదమ తిరుమలరావు ఈ రచయితకు తెలిపారు.

తోటపల్లి

ఈ గ్రామం గరుగుబెల్లి మండలంలో ఉంది. ఈ ప్రాంతంలో విస్తారంగా మామిడితోటలు ఉండేవి. ఈ తోటల పేరుతోనే తోటపల్లిగా ఈ గ్రామానికి పేరుపెట్టారు. ఇక్కడ ప్రసిద్ధి చెందిన శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం ఉంది. ఉత్తరాంధ్రకే తలమానికంగా ఉంది. చాలా ఏళ్ల కితం ఈ ప్రాంతంలో ఓ బస్సు బోల్తాపడింది. దీన్ని పైకితీస్తుండగా వెంకటేశ్వరస్వామి విగ్రహం దొరికింది. ఆ విగ్రహాన్ని తీసుకుని వెళ్లి సమీప ప్రాంతంలో ఆలయాన్ని నిర్మించారు. తే.26-01-1972లో స్వామి వారి విగ్రహప్రతిష్ఠ జరిగింది. ఈ గ్రామం పేరుతోనే శ్రీకాకుళం, విజయనగరం జిల్లా ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తున్న తోటపల్లి జలశయాన్ని నిర్మించిన సంగతి తెలిసిందే.

గెడ్డలుప్పి

ఈ గ్రామం సీతానగరం మండలంలో ఉంది. ఈ గ్రామానికి మూడువైపులా గెడ్డలు, మరోవైపు సువర్ణముఖి నది ఉంది. అంచేతనే ఈ గ్రామాన్ని గెడ్డలుప్పి అని పేరు వచ్చింది.

బందలుప్పి

బందలుప్పి గ్రామం పార్వతీపురం సమీపంలో ఉంది. ఈ గ్రామంలో చెరువులు, బందలు విస్తారంగా ఉండటంతో బందలుప్పి అనే పేరు వచ్చినట్టు స్థానికులు చెబుతున్నారు.

బలిజపేట

మండల కేంద్రమైన బలిజపేటలో 'బలిజ' సామాజిక వర్గీయులకు పుట్టినిల్లు. ఇక్కడ నుంచే కొన్ని కుటుంబాల వారు రాష్ట్ర మంతటా వ్యాపించినట్లు చరిత్ర కారుల కథనం. బలిజ సామాజిక వర్గానికి జన్మనిచ్చిన గ్రామమైనందున దీనికి బలిజపేట అనే పేరు స్థిరపడింది.

అజ్జాడ

ఈ గ్రామం బలిజపేట మండలంలో ఉంది. ఒడిషా రాష్ట్రం కోరాపుట్ జిల్లాలోని కొండజయపురం ఏలే రామచంద్రదేవుల ద్వారా 18వ శతాబ్దం ప్రారంభంలో ప్రధాన పూర్వీకుడైన అజ్జాడ ఆదిభట్టు అజ్జాడ గ్రామానికి ఆధిపత్యం వహించాడు. దీంతో ఆయన పేరుమీదుగా అజ్జాడగా మారినట్టు ఒక కథనం ప్రచారంలో ఉంది. హరికథా చక్రవర్తి ఆదిభట్ల నారాయణదాసు స్వగ్రామం ఇదే.

కుమిలి

ఈ పల్లె పూసపాటిరేగ మండలంలో ఉంది. కుమిలిని రాజధానిగా చేసుకొని విజయనగరం సంస్థానాధీశుడైన పూసపాటి సీతారామచంద్రగజపతి 16వ శతాబ్దంలో పరిపాలించాడు. దీని తొలిపేరు కుంభిళాపురం కుంభి అంటే ఏనుగు. గజపతి వంశీయులు ఏనుగును ప్రాతిపదికగా చేసుకొని దానికి పర్యాయపదమైన కుంభి కలివచ్చే విధంగా కుంభిళాపురం అని పేరు పెట్టుకున్నారు.

కుంభిళాపురం కాలప్రవాహంలో కుమిలిగా మారింది. గణపతి,శివ, కైకాదేవి, నవగ్రహాలు, సత్యన్నారాయణస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, సీతారామస్వామి, ఆంజనేయస్వామి, వేణుగోపాలస్వామి వార్ల విగ్రహాలు మనోహర రూపాలతో ఈ ఆలయ ప్రాంగణంలో ఉన్నాయి. ఇది గొప్ప పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది. ఈ ప్రాంతంలో విజయనగర రాజ్యానికి సంబంధించిన శిథిలమైన ఆనాటి మట్టికట్టడాలను ఇప్పటికి మనం తనివితీర చూడవచ్చు. ఇక్కడ ఉన్న నవదేవతా మూర్తులను సందర్శించేందుకు దూర ప్రాంతాల నుంచి కూడా పర్యాటకులు వస్తుంటారు.

పూసపాటిరేగ

ఇది మండల కేంద్రం. పూసపాటి వంశీయులైన విజయనగరం రాజులు ఈ గ్రామాన్ని నిర్మించారు. దీంతో ఈ గ్రామానికి పూసపాటి రేగ అని పేరు వచ్చిందని స్థానికుల కథనం. ఇందులో ఉత్తర పదమైన రేగడి అంటే బంకమన్ను అని అర్థం. రేగడి క్రమంగా రేగగా మారింది. ఇలా ఈ గ్రామం ఏర్పాటైంది.

గాజులరేగ

విజయనగరం నగరపాలిక పరిధిలో ఉంది. ఇక్కడ గల ముత్యాలమ్మవారి మందిరం ఎంతో పురాతనమైనది. ప్రతి ఏటా ముత్యాలమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. గాజుల వ్యాపారులు ఆరోజుల్లో ఎక్కువగా ఉండేవారు. వారిపేరుతోనే ఈ గ్రామానికి ఆపేరు వచ్చిందని పేర్కొంటారు. ఇక ముత్యాలమ్మ దర్శనానికి వెళ్లే మహిళా భక్తులు అమ్మవారికి తప్పని సరిగా గాజులు సమర్పిస్తుంటారు. ఈ ప్రాంతం కూడా బంకమన్నుతో ఉండేది. ఇలా ఈ గ్రామానికి గాజులరేగ అనే పేరు వచ్చింది.

జామి

ఇది మండల కేంద్రం. విజయనగరానికి 10 కి.మీ దూరంలో ఉంది. ఇచ్చట గల జనార్దనస్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. పాండవ మధ్యముడైన అర్జునుడు అజ్ఞాత వాస సమయంలో తన ఆయుధాలను జమ్మి చెట్టుమీద సురక్షితంగా ఉంచాడు. దీంతో ఈ గ్రామానికి జమ్మి అనే పేరు వచ్చింది. కాలక్రమంలో జామిగా మారింది.

గజపతినగరం

ఇది విజయనగరం పట్టణానికి సమీపంలో ఉంది. నియోజకవర్గ, మండల కేంద్రం. విజయనగరం సంస్థానాధీశులైన గజపతులు ఈ ప్రాంతానికి వేసవిలో వచ్చి విడిది చేసేవారు. అప్పట్లో పూలతోటలు ఇక్కడ ఎక్కువగా ఉండేవి. వాటిలో వీరంతా విహరించేవారు. దీంతో ఈ పట్టణానికి గజపతినగరం అనే పేరు వచ్చింది. ఈ పట్టణ నిర్మాణంలో వారి పాత్ర ఉంది.

మధుపాడ

ఇది గజపతినగరం మండలంలో ఉంది. ఇక్కడ చెట్లకొమ్మలపై తేనెటీగలు పట్టుపెట్టేవి. తేనెను మధువు అని పేర్కొంటాం. దీంతో ఈ పల్లెకు మధుపాడ అనే పేరు వచ్చింది. ఆది నుంచి ఈ పల్లె తేనెపట్టుకు ప్రసిద్ధి చెందింది. ఇప్పటికీ మధుపాడ-మరుపల్లి మార్గంలో చెట్లకు తేనె పట్టు విపరీతంగా ఉంటాయని ప్రధానోపాధ్యాయురాలు కొల్లూరు పద్మజ ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు. అయితే ఈ తేనె పట్ల జోలికి ఎవరూ వెళ్లరని, గబ్బిలాలు కూడా ఈ చెట్లను అనుసరించే ఉంటాయి.

పురిటిపెంట

ఇది గజపతినగరం మండలంలో ఉంది. ఈ పల్లె తొలి పేరు పూలపేట. ఇక్కడ పూలతోటలు విస్తారంగా ఉండేవి. పర్యాటకులకు ఆహ్లాదవేదికగా ఉండేది. ఆంధ్ర జమీందారులు ఇక్కడ ప్రతీ ఏటా కొన్ని నెలలు ఇక్కడ ఉండేవారు. అయితే ఒకసారి ఏమైందంటే జమీందారు సతీమణి ఈ ప్రాంతంలోనే మార్గమధ్యంలో ప్రసవించింది. దీంతో ఈ గ్రామానికి పురిటిపెంట అనే పేరు వచ్చినట్టు రచయిత్రి కొల్లూరు పద్మజ పేర్కొన్నారు.

పుణ్యగిరి

ఇది ఎస్.కోట మండలంలో ఉంది. ఈ ప్రాంతంలోని పర్వతపంక్తుల మీద ధారగంగమ్మ, ఈశ్వరాలయం జంట ఆలయాలుగా ఎంతో ప్రసిద్ధి చెందాయి. ఈ ఆలయాలు కొండమీద ఉండటంతో పాటు వీటిని దర్శిస్తే పుణ్యం, పురుషార్థం

లభిస్తుందని భక్తుల విశ్వాసం. దీంతోనే ఈ ప్రాంతానికి పుణ్యగిరి అని పేరు వచ్చింది. గిరి అంటే కొండ అని వేరేగా చెప్పనక్కరలేదు.

భీమసింగి

ఇది జామి మండలంలో ఉంది. విరాటరాజు కొలువులో ఉన్నప్పుడు పాండవులలో రెండోవాడైన భీమసేనుడు ఈ ప్రాంతంలో కొన్నాళ్ళు నివశించినట్టు చెబుతారు. సింహం తరహాలో ఉండేవాడని అంచేత సింహం పదం సింగంగా మారి చివరికి సింగిగా స్థిరపడింది. ఇక్కడ చక్కెర కర్మాగారం ఉంది.

విజినిగిరి

ఈ గ్రామం జామి మండలంలో ఉంది. విజినిగిరి ప్రాంతాన్ని ఆరోజుల్లో విరాటరాజు పరిపాలిస్తుండేవాడు.పాండవులు అజ్ఞాత వాసం ఇక్కడే జరిగిందని ఇతిహాసం వల్ల తెలుస్తోంది. అజ్ఞాత వాసం విజయవంతమయిందనడానికి ఈ ప్రాంతం సంకేతంగా నిలిచింది. విజయుడైన అర్జునుడు ఈ ప్రాంతంలోని కొండపై జయకేతనం ఎగరవేశాడు. దీంతో ఈ పల్లెకు విజినిగిరి అని పేరు వచ్చింది. ఇక్కడ యోగాచార్య దివంగత "రాపర్తి రామారావు గారి "యోగ చైతన్య సంస్థ" ఉన్నది.

కొట్టాం

ఈ గ్రామం శృంగవరపు కోట మండలంలో ఉంది. విరాటరాజు ధాన్యాగారం 'కోష్ఠం'. ఇదే కాలక్రమంలో కొట్టాంగా మారింది. జనవ్యవహారంలో కోష్ఠం కొట్టాంగా మారిందని గ్రహించవచ్చు. ఈ విషయాన్ని ఈ గ్రామానికి చెందిన బెహరా శివప్రసాద్ తెలిపారు.

అలమండ

ఈ పల్లె జామి మండలంలో ఉంది. ఉత్తరగోగ్రహణం సందర్భంగా విరటుని ఆవులను కౌరవులు తోలుకునిపోయే ప్రయత్నం చేస్తారు. ఆలమంద కాల క్రమంగా అలమండగా రూపాంతరం చెందింది. ఆ పేరుతోనే ఈ పల్లె ఆవిర్భవించింది. దివంగత ప్రముఖ సంపాదకులు, కథా, నవలా రచయిత కె.ఎన్.వై.పతంజలి స్వగ్రామం.

కంటకాపల్లి

ఈ గ్రామం కొత్తవలస మండలంలో ఉంది. కంటక ద్రుమాలు ఈ ప్రాంతంలో ఎక్కువుగా ఉండేవి. కంటక ద్రుమాలు అంటే కందిరీగలు వశించే ముండ్లచెట్లు అని అర్థం. అయితే వీటిని కొంత మంది తొలగించి నివాసయోగ్యంగా మలచి గ్రామంగా ఏర్పాటు చేసుకున్నారు. అంచేత ఈ గ్రామాన్ని కంటకాపల్లిగా నామకరణం చేశారు.

సాలూరు

ఇది పురపాలిక కేంద్రం. 500 ఏళ్ల క్రితం జయపురం రాజుల ఆధీనంలో ఉండేది. వేగావతి నదీ పరీవాహక ప్రాంతం లో నెలకొని ఉంది. మహాపద్మపురం గ్రామంలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఈ ప్రాంతానికి వలస వచ్చారు. తొలుత సరైవలసగా ఉండేది. తరువాత సరాయివలసగా ఉండి చివరకు సాలూరుగా స్థిరపడింది. ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరు రాజేశ్వరరావు జన్మస్థలం ఇది. పురిపండా అప్పలస్వామి, యామిజాల పద్మానాభస్వామి, క్రొవ్విడి రామం వంటి సాహితీవేత్తలు జన్మనిచ్చిన గొప్పకేంద్ర మిది. మరో సినీ సంగీత దర్శకుడు సత్యం ఇక్కడి వారే. నాటి మేటి సినీ నటి అంజలి భర్త ఆదినారాయణరావు స్వస్థలం ఇదే. వంగపండు లక్ష్మీనాయుడు అనే గొప్ప సాహితీవేత్త ఇక్కడి వారేనని సాహితీవేత్త జె.బి. తిరుమలాచార్యులు పేర్కొన్నారు.

గరివిడి

ఇది మండల కేంద్రం. మేజర్ పంచాయతీ కేంద్రం. గరివడియం అంటే ఒక విధమైన వడియం. ఈ వడియాలను తయారు చేసి కొంతమంది ఈ ప్రాంతంలో జీవనం సాగించేవారు. గరివడియం కాలగమనంలో గరివిడిగా మారింది. ఈ గ్రామం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోంది. ఫేకర్ పారిశ్రామిక సంస్థ ఎన్నో సామాజిక కార్యక్రమాలు సాగిస్తుంది. ఇంజినీరింగ్ కళాశాల, పశు సంవర్ధక పాలిటెక్నిక్, కళాశాల ఇక్కడే ఉన్నాయి. ఈ గ్రామాన్ని కొండపాలెంగా పేర్కొంటారు. ఈ ప్రాంతాన్ని ఫేకర్ యజమాని పేరుమీదుగా శ్రీ రాంనగర్‌గా కూడా పిలుస్తారు. గరివిడి కొండపాలెం పంచాయితీ పేరుతో నడుస్తోంది.

చీపురుపల్లి

ఇది మండల కేంద్రం. చీపురు ఓ గడ్డి రకం జాతి. పూర్వం ఈ ప్రాంతంలో ఈ గడ్డి తప్ప మరేమి ఉండేది కాదు. ఆ తరువాత కొంత మంది ఇక్కడ స్థిరపడాలనే కోరికతో గడ్డిని పూర్తిగా తొలగించారు. గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ పల్లె మేజర్ పంచాయతీ స్థాయికి ఎదిగింది. ఒకప్పుడు లోక్‌సభ నియోజకవర్గ కేంద్రంగా కూడా ఉండేది. ప్రస్తుతం శాసనసభ నియోజకవర్గ కేంద్రంగా ఉంది. ఆ రోజుల్లో అడిదం సూరకవి ఇక్కడే ఉండి కవిజనరంజనం, ఆంధ్రచంద్రాలోకం, ఆంధ్రనామశేషం తదితర గ్రంథాలను రాసి ప్రసిద్ధికెక్కాడు. విజయనగర సంస్థానంలో పూసపాటి రెండవ విజయరామరాజు కాలంలో (1730-1780) కొన్నాళ్ళు ఉన్నట్టు డా॥ దివాకర్ల వెంకటావధాని తాను రాసిన "ఆంధ్రవాఙ్మయ చరిత్రము"లో పేర్కొన్నారు.

అలకనారాయణపురం

ఇది చీపురుపల్లి మండలం పాలవలస పంచాయితీలో ఉంది. విజయనగరం సంస్థానాధీశుడైన అలకనారాయణ గజపతి అప్పుడప్పుడు ఇక్కడ విడిది చేసేవారు. తనకు ఆత్మీయులైన కొన్ని కుటుంబాల వారికి విలువైన సుమారు 1200 ఎకరాల భూమిని బహుమతిగా ఇచ్చారు. ఈ గ్రామానికి చెందిన పురుషులు, మహిళల్లో కొందరు విజయనగర సంస్థానం, అంతఃపురంలో పనిచేసేవారు కూడా. తమకు బహుమతిగా ఈ భూములు లభించినందున ఆయన పేరుతోనే ఈ గ్రామానికి అలకనారాయణపురమని పేరు పెట్టుకున్నారు. ఇక్కడగల భూలోకమాత గుడి ఎంతో ప్రసిద్ధి చెందింది. ఆమె పేరు కలిసొచ్చే విధంగా తమకు అభించిన ఈభూములను భూలోకపతి వరకట్టు భూములుగా పేర్కొంటున్నామని గ్రామానికి చెందిన సాగిరాజు రఘునాథవర్మ ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు. ఇక గజపతి సామాజిక వర్గానికి చెందిన క్షత్రియ కుటుంబాలు ఒకప్పుడు ఎక్కువగా ఉండేవి. అయితే ప్రస్తుతం అయిదు కుటుంబాలు మాత్రమే ఉన్నాయి. ఇక్కడ దళిత కుటుంబాలే ఎక్కువగా ఉన్నాయి.

ఆకులములగాం

తమలపాకులు అనగానే ఆకులములగాం గుర్తుకు వస్తుంది. ఇది చీపురుపల్లి మండలంలో ఉంది. ఇక్కడ తమలపాకులను విస్తారంగా పండిస్తారు. అలాగే ఒకప్పుడు మునగ చెట్లు కూడా ఉండేవి. దీంతో ఈ గ్రామానికి ఆకులములగాం అని పేరు పెట్టుకున్నారు. 2014 అక్టోబర్12న వచ్చిన హుద్‌హుద్ తుఫానుకు తమలపాకుల పంట ధ్వంసమైంది. ఆ తరువాత కూడా నిరాశ చెందకుండా ఈ పంటను కొనసాగిస్తున్నారు. మునగ చెట్లు కూడా గతంలో ఎక్కువగా ఉండేవి.

గుణుపురం

ఈ పల్లె డెంకాడ మండలంలో ఉంది. చాలా కాలం కితం ఒడిషా రాష్ట్రంలోని గుణుపూర్ నుంచి కొంత మంది ఈ ప్రాంతానికి వచ్చి గ్రామాన్ని నిర్మించుకున్నట్టు తెలుస్తోంది. దీంతో ఈ పల్లెకు గుణుపురం అనే పేరు వచ్చింది. ఇదిలా ఉండగా గుణుపురం సమీపంలోనే గుణుపురంపేట కూడా ఉంది.

కురుపాం

ఇది అటవీ ప్రాంతంలో నెలకొని ఉంది. మండల కేంద్రం కూడా. వైరిచర్ల వంశీయుల ప్రాబల్యంలో చాలా కాలం నడిచింది. పూర్వం ఈ గ్రామం ఏర్పాటు చేసుకునే ముందు కురుపాండవ అని తమ గ్రామానికి పేరు పెట్టుకున్నారు. పాండవుల ఎడగల మక్కువతో ఈ గ్రామానికి ఆ పేరు పెట్టుకున్నట్టు జనశ్రుతి. కాలగమనంలో కురుపాండవ, కురుపాంగా మారింది. ఏ పాము పొడిచినా ఫర్వాలేదు గాని కురుపాం పొడిస్తే ప్రమాదమని ఈ ప్రాంతీయులు సామెత పొడుస్తుంటారు. ఇదిలా ఉండగా ఈ గ్రామం ఏర్పాటు చేసేటప్పుడు ఓ పెద్దపాము గిరిజనులకు తారసపడింది దీంతో వారంతా "కుర్రో కుర్రో" అంటూ గట్టిగా అరిచారని దీంతో ఈ గ్రామానికి కురుపాం అని పేరు పెట్టినట్టు మరో కథనం ఉంది.

గుచ్ఛమి

ఈ పల్లె సీతానగరం మండలంలో ఉంది. దీని తొలిపేరు గుచ్ఛకం. గుచ్ఛకం అంటే పొదలు. ఈ ప్రాంతంలో పొదలు విపరీతంగా ఉండేవి. వీటిని నిర్మూలించి గుచ్ఛకం అనే పేరుతో గ్రామానికి పేరు పెట్టుకున్నారు. కాలక్రమంలో గుచ్ఛమిగా మారింది.

జరజాపుపేట

ఈ గ్రామం నెల్లిమర్ల మండలంలో ఉంది. జరజాపు వంశీయులు ఈ గ్రామాన్ని తొలుత ఏర్పాటు చేశారు. వారి పేరుతోనే జరజాపుపేటగా అవతరించింది. ఈ గ్రామం అన్ని రంగాలలో ఆదర్శంగా నిలుస్తోంది. ఇక్కడ ప్రభుత్వ, ప్రయివేటు రంగాలలో ఉద్యోగాలు చేస్తున్నవారు ఎక్కువ మంది ఉన్నారు. సాహితీవేత్త, చిత్రకారుడు కడలి ప్రకాశరావు స్వగ్రామం ఇది.

ఏ.టి. అగ్రహారం

దీని పూర్తి పేరు ఆత్మారాముని అగ్రహారం. ఈ గ్రామం నెల్లిమర్ల మండలంలో ఉంది. రామతీర్థం సమీపంలో ఉంది. రామతీర్థ క్షేత్ర ప్రభావంతో ప్రజలు భక్తి భావంతో ఈ గ్రామానికి ఆత్మారాముని అగ్రహారం (ఏ.టి.అగ్రహారం) అని పేరు పెట్టుకున్నారు.

నారాయణపట్నం

ఈ గ్రామం నెల్లిమర్ల మండలంలో ఉంది. మొయిద గ్రామానికి సమీపంలో ఉంది. చంపావతి నదీతీరంలో వెలసి ఉంది. నారాయణ అనే వ్యక్తి ఈ గ్రామ నిర్మాణానికి ఆద్యుడు. నదీతీరంలో ఉన్నందున పట్నం అని ఉత్తర పదంలో కనిపిస్తుంది. నారాయణపేరుతో ఏర్పడింది ఈ గ్రామం.

కొండపేట

ఈ గ్రామం నెల్లిమర్ల మండలం, నెల్లిమర్ల మేజర్ పంచాయతీ పరిధిలో ఉంది. కొండపక్కనే ఈ గ్రామం వెలసినందున కొండపేటగా వ్యవహరిస్తున్నారు.

గొర్లెపేట

ఈ గ్రామం నెల్లిమర్ల, గంట్యాడ మండలాల్లో ఒకే పేరుతో ఉంది. గొర్లె వంశీయులు ఈ గ్రామాలను ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఈ పేరు వచ్చినట్టు స్థానికులు అందజేసిన సమాచారం వల్ల తెలుస్తోంది.

వేపాడ

ఇది మండల కేంద్రం. ఒకప్పుడు వేపచెట్లు విస్తారంగా ఉండడంతో ఈ పల్లెకు స్థానికులు వేపాడ అని నామకరణం చేసినట్లు స్థానికులు అందించిన సమాచారం వల్ల తెలుస్తోంది.

ఓబులయ్యపాలెం

ఇది వేపాడ మండలంలో ఉంది. అతి చిన్నగ్రామం. ఈ గ్రామాన్ని తొలుత ఓబులయ్య అనే ప్రముఖ వ్యక్తి ఆధ్వర్యంలో నిర్మితమైంది. ఆయన పేరుతోనే ఈ గ్రామానికి ఓబులయ్యపాలెం అనే పేరు వచ్చింది.

టెక్కలివలస

శ్రీకాకుళం జిల్లా టెక్కలి నుంచి పూర్వీకులు కొందరు ఇక్కడికి వచ్చి స్థిరపడ్డారు. దీంతో ఈ గ్రామానికి టెక్కలివలస అని పేరు వచ్చింది. ఇది తెర్లాం మండలంలో ఉంది.

పెరుమాళి

ఈ గ్రామం తెర్లాం మండలంలో ఉంది. పెరుమాళి అంటే దేవుడు అనే అర్థం. దేవుని నామకరణం ఉంటే శుభం జరుగుతుందనే ఉద్దేశంతో ఈ పల్లెకు ఆ పేరును స్థిరపరచినట్లు బాగా వృద్ధులైన కొందరు స్పష్టం చేశారు. 'లోగుట్టు పెరుమాళ్ళ కెరుక' అనే సామెత ఉంది.

కోనాడ

ఇది పూసపాటిరేగ మండలంలో ఉంది. కోనేం రకపు చేపలు ఎక్కువగా అమ్ముడయ్యే సాగరతీర గ్రామం. కోనవాడ. అదే కాలక్రమంలో, జన వ్యవహారంలో కోనాడగా స్థిరపడింది.

కవులవాడ

ఇది భోగాపురం మండలంలో ఉంది. ఇక్కడ కవులు ఎక్కువగా ఉండేవారు అనుకుంటే పొరపాటే అవుతుంది. అయితే ఆ ఊరికి ఈపేరెలా వచ్చిందంటే...ఈ గ్రామాన్ని ఏర్పాటు చేసుకొనే ముందు సమీప గ్రామాలకు చెందిన భూస్వాముల నుంచి కొందరు పొలాలను కౌలుకు తీసుకున్నారు. అక్కడే వీరంతా గ్రామాన్ని ఏర్పాటు చేసుకొని స్థిరపడ్డారు. కౌలు తీసుకున్న వారంతా ఒక వాడలో ఉండటంతో కౌలువాడ అయింది. కాల క్రమంలో కవులవాడగా మారింది.

గరికివలస

ఈ గ్రామం గుర్ల మండలంలో ఉంది. విజయనగరం సంస్థానాధీశుడు తన బృందంతో వేటకు వెళ్తాడు. మిట్ట మధ్యాహ్నం వేళ ఆయనకు విపరీతమయిన ఆకలి వేసింది. మార్గ మధ్యంలో గుర్ల ప్రాంతంలో జీవనం సాగిస్తున్న గొర్తివారి ఆడపడుచు రాజు గారికి నమస్కరించి ఆయనకు, ఆయన బృందానికి భోజనాలు ఏర్పాటు చేసింది. కూరగాయలు అందుబాటులో లేకపోవడంతో గరికి (పచ్చ గడ్డి) తో పచ్చడి చేసి ఇచ్చింది. అది ఎంతో రుచికరంగా ఉండటంతో రాజు నివ్వెరపోయాడు. కుశల ప్రశ్నలలో భాగంగా తాను గరికతో పచ్చడి చేశానని చెప్పింది. దీన్ని ఓ తీపి జ్ఞాపకంగా భావించి ఈ గ్రామానికి 'గరికవలస' అని పేరు పెట్టారు. ఈ అగ్రహారాన్ని గొర్తివారి కుటుంబానికి సంస్థానాధీశులు 19వ శతాబ్దంలో దానం చేసినట్టు పేర్కొంటారు.

లింగాలవలస

ఇది గజపతినగరం మండలంలో ఉంది. ఇక్కడ గల ఓ పొలంలో వరుసగా, ఎక్కువ సంఖ్యలో లింగాలు ఉండటంతో ఈ గ్రామానికి లింగాలవలస అనే పేరు వచ్చింది.

లోగిశ

ఈ గ్రామం గజపతినగరం మండలంలో ఉంది. దీని తొలిపేరు రామచంద్రపురం. గతంలో చంపావతి నది వరదలకు ఈ పల్లె కొట్టుకొనిపోయింది. దీని అవశేషాలు అయిన కుండ పెంకులు, పగిలిన ఇటుకలు కనిపిస్తూనే

ఉన్నాయి. దీంతో కట్టుబట్టలతో మిగిలిన లోగిశ ఇంటి పేరు గల కొన్ని కుటుంబాల వారు ఈ గ్రామానికి దిగువునే ఓ పల్లెను నిర్మించుకున్నారు. తమ ఇంటి పేరైన 'లోగిశ'నే గ్రామానికి నామకరణం చేశారు. బాల సాహిత్య రచయిత బండారు చిన రామారావు, లోగిశ వెంకటరమణ (ఇందు) ప్రముఖ కథా నవలా, సినీ రచయిత ఇక్కడి వారే.

జిన్నాం

ఇది అగ్రహారం. గజపతినగరం మండలంలో గజపతినగరానికి 8 కి.మీ. దూరంలో ఉంది. భైరిపురానికి వెళ్ళే మార్గంలో ఉంది. ఈ అగ్రహారాన్ని విజయనగరం మహారాజులు శృంగారం వంశీయులకు దానంగా ఇచ్చారు. రాజావారికి ఈ కుటుంబీకులు ఓసారి ఇంటికి ఆహ్వానించి మంచి భోజనం ఏర్పాటుచేశారు. అన్నింటికీ మించి జున్ను వండి పెట్టారు. జున్నుతిన్న సంస్థానాధీశులు ఎంతో మురిసిపోయారు. దానపట్టా కింద 1600 ఎకరాలను ఈ వంశీయులకు అందజేశారు ఈ ఉదంతం తో ఈ ప్రాంతానికి జున్నాం అనే పేరు వచ్చింది. కాలప్రవాహంలో అది జిన్నాంగా మారి మారింది. ఇక్కడ శ్రీ రంగనాథ స్వామివారి ఆలయం ఉంది. ఈ విషయాన్ని "ఉత్తరాంధ్రలోని బ్రాహ్మణాగ్రహారములు" అనే గ్రంథంలో విశ్రాంత ఎ.ఎస్.పి సయ్యద్‌మీర్ మహమ్మద్ ప్రస్తావించారు.

కోడూరు

ఇది బాడంగి మండలంలో ఉంది. కోడు+ఊరు = కోడూరు. కోడు అంటే జల సమృద్ధిగా ఉన్న ప్రాంతం అని అర్థం. నదీ లేదా నదీ శాఖ ఉన్న ప్రాంతంలోని జనవాసాన్ని కోడు అంటారని స్పష్టంగా పేర్కొనవచ్చు. కోడూరుకు 3 కి.మీ దూరంలో వేగావతి నది ఉంది. కాగా ఇదే గ్రామంలో అతి పెద్ద చెరువు కూడా ఉంది.

చీకటి పేట

ఇది తెర్లాం మండలంలో ఉంది బొబ్బిలి సంస్థానాధీశులు వేరే ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించేటప్పుడు చిమ్మ చీకటి పడితే ఇక్కడే గుడారాలను వేసుకొని ఉండేవారు. అందుకే ఈ ప్రాంతానికి చీకటి పేట అనే పేరు వచ్చింది. ఈ పల్లెలో చీకటి అనే ఇంటి పేరు కలిగినవారు ఎందరో ఉన్నారు.

విశాఖపట్నం జిల్లా

విశాఖపట్నం

ఆసియాలోనే అత్యంత సుందర నగరంగా విశాఖపట్నం విఖ్యాతి చెందింది. ఆసియా ఖండంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో విశాఖ మొదటిది. ప్రపంచంలో శరవేగంగా ప్రగతి సాధిస్తున్న నగరాల్లో ఐదవది. ఇది రాష్ట్ర పారిశ్రామిక రాజధాని. ప్రముఖ పర్యాటక కేంద్రం. తూర్పు తీర ఆభరణంగా, గమ్యనగరంగా (సిటీ ఆఫ్ డెస్టిని) గా పేరు గాంచిన విశాఖ ఒకప్పుడు చిన్న మత్స్యకారుల గ్రామం. సాగరతీరాన వెలసిన వైశాఖేశ్వర ఆలయాన్ని బట్టి విశాఖపట్నంగా పిలుస్తున్నారు. కాలగమనంలో వైశాఖేశ్వర ఆలయం వరదలకు కొట్టుకొని పోయినట్టు స్థానికులు చెబుతున్నారు. అయితే ఆంగ్లేయులు విశాఖలనే పదాన్ని పలక లేక వైజాగ్ అని పిలిచేవారు. ఇప్పటికీ విశాఖలో పెదవాల్తేరు, చిన్నవాల్తేరు అనే పేర్లతో రెండు ముఖ్య ప్రాంతాలు ఉన్నాయి. అయితే వాల్తేరు అనే పేరు ఏలా వచ్చిందంటే వాలు అంటే వాలుగా ఉండటం. తేరు అనగా మార్గం అని అర్థం. ఈ విషయాన్ని ఏ.యూ. తెలుగు విభాగం మాజీ ఆచార్యులుడా॥ లకంసాని చక్రధరరావు ధ్రువీకరించారు. ఈ మహానగరంలో రహదారులు ఎత్తుపల్లాలుగా ఉంటాయి. 1865లో వైజాగ్ పురపాలికగా మారింది. 1979 ఏప్రిల్ 16న నగరపాలక సంస్థగా రూపుదిద్దుకుంది. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి సి.ఎం. అయ్యాక గాజువాక తదితర ప్రాంతాలను విలీనం చేసి మహానగర పాలక సంస్థగా 2005 లో స్థాయిని పెంచారు.

కైలాసగిరి

ఇది విశాఖపట్నంలో గొప్ప పర్యాటక కేంద్రంగా విలసిల్లుతోంది. పార్వతీ పరమేశ్వరుల నివాసస్థావరమైన కైలాసాన్ని తలపిస్తోంది. అంచేతనే దీనికి కైలాసగిరి అని నామకరణం చేశారు. కైలాసగిరిపై శివపార్వతల విగ్రహాలు ఎంతో

ఆకర్షణీయంగా ఉంటాయి. కొండపై రిసార్ట్‌తో పాటు ప్రకృతి అందచందాలు అలరిస్తాయి. ఈ కొండపై నుంచి సాగరతీరం, విశాఖ అందాలను వీక్షించవచ్చు కైలాసగిరికి ఆర్టీసీ బస్సుల్లో వెళ్లవచ్చు. అలాగే కొండ దిగువ నుంచి రోప్‌వే ద్వారా చేరుకోవచ్చు. కైలాసగిరిని ఎంతో సుందరంగా తీర్చిదిద్దిన ఘనత జి.వి.ఎం.సి. (వుడా)కే దక్కుతుంది.

బురుజుపేట

విశాఖపట్నం మహానగరపాలిక(జి.వి.ఎం.సి) పరిధిలోని వన్‌టౌన్‌లో 17వ శతాబ్దంలో కోట బురుజు ఉండేది. ఈస్టిండియా కంపెనీ వారు దీన్ని నిర్మించారు. ఈ బురుజువల్లె ప్రాంతాన్ని బురుజుపేటగా పిలుస్తారు.అత్యంత ప్రసిద్ధి చెందిన శ్రీకనకమహాలక్ష్మీ అమ్మవారి ఆలయం ఇక్కడే ఉంది.

గన్నేరువీధి

విశాఖ నగర పరధిలో బురుజుపేట పక్కనే గన్నేరు వీధి ఉంది. అక్కడ గన్నర్స్ ఉండేవారు. వారిపేరుతోనే ఇది గన్నేరు వీధిగా మారింది.

టర్నర్‌చౌల్ట్రి

విశాఖపట్నంలో అత్యంత ప్రాచుర్యం పొందినది టర్నర్ చౌల్ట్రి. నాటి విశాఖ ప్రజల ఆదరాభిమానాలను పొందింది. మంచి కలెక్టర్‌గా పేరొందిన టర్నర్‌పేరిట ఈ చౌల్ట్రి వెలసింది. ఇక్కడకి సమీపంలోనే పూర్ణామార్కెట్ ఉంది.

పీర్లకోనేరు (ప్రస్తుత వైశాఖి జల ఉద్యానవనం)

జి.వి.ఎం.సి.లో ఉన్న సూపర్‌బజార్ సమీపంలో మహమ్మదీయులు పీర్లపండుగ జరుపుకోవడానికి పెద్ద కోనేరు ఉండేది. అయితే కాలక్రమంలో దానిని నవీకరించి వైశాఖి జల ఉద్యానవనంగా పేర్కొంటున్నారు.

పూర్ణామార్కెట్

సేట్ పూర్ణమల్ పేరుతో వెలసిన పెద్ద అంగడి ఈ పూర్ణామార్కెట్.

అస్సాంగార్డెన్స్

1922లో అల్లూరి సీతారామరాజు మన్నెం పోరాటాన్ని అణచివేయడం కోసం ఆంగ్లేయులు అస్సాం నుంచి సైనిక దళాలను రప్పించి వారికి వసతి కల్పించిన ప్రాంతమే అస్సాం గార్డెన్స్. ఇది డాబాగార్డెన్స్ సమీపం లో ఉంది.

యల్లమ్మతోట (జగదాంబ జంక్షన్)

విశాఖ గ్రామదేవత యల్లమ్మపేరు మీదుగా యల్లమ్మతోట ప్రాంతం ఏర్పడింది. ఆ దేవత కొలువు తీరిన చెట్టు, మందిరం ఇప్పటికీ ఉన్నాయి. నేటికీ గ్రామదేవత ఉత్సవాలు జరుపుతారు. అయితే ప్రస్తుతం దీని స్వరూపమే మారిపోయింది. తోట అనేది ఇక్కడ లేదు. దీని స్థానంలో జగం మెచ్చిన జగదాంబ జంక్షన్ వెలసింది. ఈ ప్రాంతం నిత్యం జనం రాక పోకలతో కళకళలాడుతుంది. ఈ ప్రాంతంలో నిర్మించిన మసీదు ఎంతో ప్రసిద్ధి చెందింది.

ఆశీలుమెట్ట

ఎడ్లబండ్లకు, ఇతర మోటారు వాహనాలకు ఆశీలు వసూలు చేసే కూడలి ఆశీలుమెట్ట అయింది. ఇక్కడ ప్రసిద్ధి చెందిన సంపత్ వినాయక మందిరం ఉంది. సమీపంలోనే ద్వారకా ఆర్టీసీ బస్ స్టేషన్ ఉంది.

బిర్లా జంక్షన్

ఒకప్పుడు ఈ ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్ కార్పొరేషన్ (ఎ.పి.ఇ.ఇ.సి.) ఉండేది. దీన్ని బిర్లా యాజమాన్యం నిర్వహిస్తూ ఉండేది. ఇది విద్యుత్ ఉపకరణాలు, విడిభాగాలు ఉత్పత్తి చేస్తుండేది. బి.హెచ్.పి.వి, హిందుస్థాన్ జింక్, హెచ్.పి.సి.ఎల్. తదితర సంస్థల కన్నా ముందుగా ఈ కంపెనీ ఏర్పాటైంది. కాలక్రమేణా ఇది మూత పడింది. ప్రస్తుతం వేరే యాజమాన్యంలో కార్ల షోరూంను నిర్వహిస్తున్నారు. అయితే అప్పటి భవనాలు అలానే ఉన్నాయి.

పంజాబ్ హోటల్

పంజాబ్ హోటల్ అనగానే అలనాటి మయసభ గుర్తుకు వస్తుంది. బిర్లా జంక్షన్‌కు సమీపంలోని పంజాబ్ హోటల్ బస్టాప్ ఉంది. అయిత ఇక్కడ హోటల్ జాడలే కనిపించవు. 5దశాబ్దాల కితం ఇక్కడకు వలస వచ్చిన ఓ పంజాబీ కుటుంబం ఓ పాక వేసుకొని హోటల్ నిర్వహించేవారు. లారీలన్నీ ఇక్కడ ఆగేవి. లారీ సిబ్బంది ఇక్కడే భోజనాలు చేసేవారు. ప్రస్తుతం అక్కడ ఈ హోటల్ లేకపోయినా పంజాబ్ హోటల్ ప్రాంతంగానే ప్రజలు పిలుస్తుంటారు. ఆ పంజాబీ కుటుంబానికి చెందిన వారు షీలా నగర్, కూర్మన్న పాలెం వద్ద కూడా హోటళ్లు ఏర్పాటు చేశారు. అయిత కాల గమనంలో ఇవన్నీ మూత పడ్డాయి.

పోతిన మల్లయ్యపాలెం(పి.ఎమ్.పాలెం)

ఈ గ్రామం మహా విశాఖనగరంలో ఉంది. గతంలో ఈ ప్రాంతం బక్కన్నపాలెం పంచాయతీలో ఉండేది. స్థానిక పెద్దల కథనం ప్రకారం నాలుగు తరాల క్రిందట పోతిన మల్లయ్య అనే వ్యక్తి భీమునిపట్నం సమీపాన గల ఉప్పాడ వద్ద ఉండేవాడు. ఆ తరువాత జీవనోపాధికై యారాడ వెళ్లాడు. అక్కడ కూడా ఇమడలేక ఇక్కడకు సమీపంలో ఉన్న యాతవానిపాలెం గ్రామానికి వచ్చాడు. అయితే ఇక్కడ ఎర్ర బూడిద ఎక్కువుగా ఉండటంతో వ్యవసాయానికి అనుకూలంగా ఉంటుందని హెచ్చుమంది యాదవులు యాతవానిపాలెం వచ్చారు. ఇలా ఉండగా పోతిన మల్లయ్యకు ఐదుగురు కొడుకులు కలిగారు. అలా వారి మనుమలు, మనుమరాళ్లు ఒకొక్కరు ఇక్కడే వ్యవసాయం చేసుకుంటూ స్థిరపడ్డారు. అదే సామాజిక వర్గానికి చెందిన పలువురు పోతిన మల్లయ్య ఉంటున్న గ్రామంలో వ్యవసాయం బాగుందంటూ ఇక్కడకు వచ్చి స్థిరపడ్డారు. యాతవానిపాలెంలో ఉన్న యాదవులు అప్పటికే చాలా మంది నగరానికి వలస పోవడంతో మల్లయ్య కుటుంబమే స్థానికులకు చిరునామాగా మారింది. రానురాను యాతవానిపాలేన్ని పోతిన మల్లయ్య గ్రామంగా పిలిచేవారు. కాలక్రమేణా అది పోతిన మల్లయ్య పాలెంగా మారిందని కథనం. ఇప్పుడు పోతిన మల్లయ్య పాలెంను సంక్షిప్తంగా పి.ఎం పాలెంగా పిలుస్తారు.

దాబా గార్డెన్స్

ఈ ప్రాంతంలో తొలుత అంకితం వెంకట భానూజీరావు కుటుంబీకులకు చెందిన ఒక్క మేడ మాత్రమే ఉండేది. చుట్టూ విశాలమైన తోటలు ఉండేవి. కాలక్రమంలో మేడను డాబాగా పిలస్తున్నాం. ఆ ప్రాంతానికి మొట్ట మొదటి డాబా ఇదే కావడంతో ఈ ప్రాంతానికి దాబా గార్డెన్స్ అనే పేరు వచ్చింది. ఈ ప్రాంతం నేడు గొప్ప వ్యాపార కేంద్రంగా విరాజిల్లుతోంది.

అల్లిపురం

ముస్లింల పాలనా కాలం అది. ఆలీ అనే పాలకుని పేరుతో అల్లిపురం అనే పేరు స్థిరపడినట్టు స్థానికుల కథనం.

సోల్జర్స్‌పేట

నగరంలోని ఈ ప్రాంతంలో గతంలో సైనికులు (సోల్జర్స్) ఎక్కువగా ఉండేవారు. అంచేత దీన్ని సోల్జర్స్‌పేటగా నామకరణం చేశారు.

గాజువాక

ఇది ప్రస్తుతం గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్(జి.వి.ఎం.సి) పరిధిలో ఉంది. 30 ఏళ్ల క్రితం ఇది ఒక కుగ్రామం. విశాఖపట్నంలో ఉక్కు కర్మాగారం నెలకొల్పిన తరువాత దీని దశ,దిశ మారింది. అన్నిటికి మించి ఇది ఆ రోజుల్లో అటవీ ప్రదేశంగా ఉండేది. ఇక్కడ గల వాగులలో నీరు తాగటానికి గజరాజులు (ఏనుగులు) వచ్చేవి. అంచేత ఈ ప్రాంతానికి గజవాగు అనే పేరు వచ్చింది. కాలక్రమేణా అది గాజువాకగా మారినట్టు స్థానికులు చెబుతున్నారు.

తెన్నేటి నగర్

విశాఖపట్నానికి చెందిన ప్రముఖ రాజనీతి ప్రముఖుడు, ఆంధ్రరాష్ట్ర మాజీ ఆర్థిక మంత్రి, విశాఖ ఉక్కు సాధన కమిటి నాయకుడు తెన్నేటి విశ్వనాథం చేసిన సేవలకు గుర్తింపుగా ఇక్కడ తెన్నేటి నగర్ అనే పేరుతో అతి పెద్దకాలనీ వెలసింది. ఇదే పేరుతో తెన్నేటి పార్కు కూడా ఉంది. ఆయన స్మృతి చిహ్నంగా విశాఖలో పెద్ద విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

మాధవధార

ఇది విశాఖ జి.వి.ఎం.సి పరిధిలో ఉంది. ఇక్కడ ఉన్న ప్రజలంతా శ్రీకాకుళం జిల్లా నుంచి వలస వచ్చి స్థిరపడినవారే. ఒకప్పుడు ఇది చిన్న చిన్న కొండలు, గుట్టలతో నిండి ఉండేది. అయితే వీరంతా వాటిని చదును చేసి గృహాలను నిర్మించుకున్నారు. ఈ ప్రాంతంలో మాధవస్వామి ఆలయం ఉండటంతో ఆస్వామి పేరుతో మాధవదార అని తమ ప్రాంతానికి నామకరణం చేసుకున్నారు. అయితే ఇందులో ధార అంటే మాధవ స్వామి నెలకొని ఉన్న కొండ మీదనుంచి నీరు ప్రవాహంలా పడుతున్నందున ధార అనే పదాన్ని జోడించి మాధవధారగా పేరును స్థిరపరచుకున్నారు.

తొట్లకొండ

విశాఖపట్నం నుంచి సముద్రతీరం మార్గాన భీమునిపట్నం వెళ్లే దారిలోనే తొట్లకొండ ఉంది. విశాఖకు 16 కిలోమీటర్లు దూరంలో ఉంది. ఈ కొండమీద నీటితొట్టు ఎక్కువుగా ఉండటం వల్ల ఈ పేరు వచ్చిందని స్పష్టమవుతోంది. శాసనాల్లో దీన్ని కొత్తరగిరి అని పేర్కొన్నారు. ప్రధానంగా ఇది క్రీ.పూర్వం 200-300లు సంవత్సరాల మధ్య బౌద్ధభిక్షువుల కేంద్రంగా ఉన్నట్టు తెలుస్తోంది. దీనిని రాబందుల కొండ అని కూడా పిలుస్తారు. అయితే బౌద్ధారామాన్ని ఏర్పాటు చేసిన తరువాత వాననీటి నిల్వకు కొండలోని రాళ్లను పగుల కొట్టి 11 రాతిబావులను ఏర్పాటు చేశారు. అంచేతనే తొట్లకొండ అనే పేరు బాగా స్థిరపడింది.

బావికొండ

ఆసియా ఖండంలోనే ప్రముఖమైన బౌద్ధ క్షేత్రం బావికొండ. తొట్లకొండ సమీపంలోనే ఉంది. ఈ క్షేత్రం అనేక బావులతో నిర్మితమైనందున దీనిని బావికొండ అని పిలుస్తారు. దీనికి"ఏ హిల్స్ ఆఫ్ వెల్స్" అని అంటారు. క్రీ.శ.3వ శతాబ్దం వరకు బావికొండ బౌద్ధారామం బౌద్ధ భిక్షువులకు నెలవుగా విద్యాక్షేత్రంగా విరాజిల్లుతుంది. వర్షపు నీటి నిల్వకోసం మూడు దశల్లో 26 బావులు నిర్మితమయ్యాయి. బౌద్ధమతంలోని హీనయాన శాఖకు చెందిన పాఠశాల నడిచినట్టు చరిత్ర వల్ల తెలుస్తుంది. తవ్వకాలలో క్రీ.పూ. 2, 3 శతాబ్దాలకు

చెందిన రోమాన్, శాతవాహనుల కాలంనాటి నాణేలు, కుండలు, బయటపడ్డాయి. దక్షిణ భారతదేశం లో బౌద్ధ నాగరికతకు సంకేతంగా నిలుస్తుంది. ఈ క్షేత్రంలో ఒక ఎముకముక్క, బూడిద దొరికింది. వీటిని భద్రపరిచారు. ఇది బుద్ధునికి చెందినవిగా చరిత్ర కారుల ఉవాచ.

బోయపాలెం

ఇది ఆనందపురం మండలంలో ఉంది. బోయ వృత్తిగా కలిగిన వారు ఏర్పాటు చేసుకున్న గ్రామం ఇది. అంచేతనే దీనికి బోయపాలెం అనే పేరు వచ్చింది.

కుమ్మరిపాలెం

ఇది పాడేరు మండలంలో ఉంది. కుమ్మరి వృత్తి కలిగిన వారు ఏర్పాటు చేసుకున్న పల్లె ఇది. అంచేతనే దీనికి కుమ్మరిపాలెం అనే పేరు వచ్చింది.

చాకిరేవు

ఇది పాడేరు మండలంలో ఉంది. చాకలి వృత్తి(రజక) పని చేసేవారు ఏర్పాటు చేసుకున్న గ్రామం ఇది. వారి వృత్తి పేరుతోనే ఈ పల్లె ఏర్పడింది.

మోదపల్లి

ఈ గ్రామం విశాఖ మన్యంలోని పాడేరు మండలంలో ఉంది. ఇక్కడ కొండపై వెలసిన మోదకొండమ్మ తల్లిపేరుతో ఈ గ్రామానికి మోదపల్లి అనే పేరు వచ్చినట్టు స్థానికుల కథనం. ఈ అమ్మవారిని దర్శించేందుకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా ఒడిషా రాష్ట్రం నలుమూలల నుండి భక్తులు వస్తుంటారు. అరణ్య ప్రాంతంలో ఇప్పటికి మోదకొండమ్మ అమ్మవారు పులి రూపంలో సంచరిస్తుందని ఈ ప్రాంత వాసులు నమ్మకం. అమ్మవారు పులి రూపంలో సంచరించేటప్పుడు ఎవరైనా ఎదురుపడిన ఎలాంటి హాని తలపెట్టదని విశ్వసిస్తారు.'మోదకొండమ్మా..... కోటి దండలమ్మా' అంటూ భక్తులు పాటలు పాడుతుంటారు. ఈ దేవత మోదదాసు కొండపై వెలసి ఉంది 2016 మే8.9,10తేదీల్లో తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్మర్యం లో ఉత్సవాలను నిర్వహించారు.

సింహాచలం

హిరణ్యకశిపుడ్ని వధించి ప్రహ్లాదుడిని రక్షించిన నరసింహుడు ఈ సింహగిరిపై వెలిశాడని ప్రతీతి. దూరం నుంచి చూసే వారికి పర్వతం ముందుకు రెండు కాళ్లు చాపి తలవాల్చి నిద్రిస్తున్న సింహం ఆకారంలో ఉంటుంది. అందుకే ఈ ఊరికి సింహాచలం అని పేరు వచ్చింది. సింహాచలం ప్రకృతి సోయగాలకు పుట్టిల్లు. ఒక్కసారి చూస్తే మళ్లీమళ్లీ చూడాలనిపించే అందమైన పొదరిల్లు. ఇక్కడ ప్రతిఏటా అక్షయ తృతీయ సందర్భంగా భారీ ఎత్తున ఉత్సవాలు జరుగుతాయి. నరసింహస్వామి (సింహాద్రిఅప్పన్న) నిజరూప దర్శనం కనిపిస్తుంది. విశాఖపట్నానికి సమీపంలో ఉంది. క్రీ.శ 1098 నాటి చోళరాజు కులోత్తుంగ చోళుడు వేయించిన శాసనం వల్ల ఆనాటిదని తెలుస్తోంది.

నార్త్ సింహాచలం (నారదసింహాచలం)

నారదుడు 14 భువనములు తిరిగి తిరిగి చిట్టచివరకి సింహాచలం వచ్చి పట్టుమని వెయ్యిమెట్లు సైతం లేని ఆ కొండను కూడా ఎక్కే ఓపిక లేక సింహాద్రి అప్పన్నను కొండదిగివచ్చి తన పూజలు అందుకోమని వేడుకున్నాడు. భక్త సులభుడైన అప్పన్న అలాగే కిందకు విచ్చేసి నారదుని సేవలందుకున్నాడు. చీటికిమాటికి కిందకు, పైకి రాకపోకలెందుకని కొండకు దిగువున ఉన్న ఓ చిన్న గుట్టమీద వెలిశాడు. ఇలా నారదునిచే ప్రతిష్ఠితమైన ఈ దిగువ సింహాచలాన్ని నారదసింహాచలంగా వ్యవహరిస్తున్నట్టు అర్చకులు చెబుతారు. మరి కొన్నాళ్లకు నారదసింహాచలం క్షేత్రం అంటూ ఓ గ్రంథం విడుదలైనా ఆశ్చర్యపోనక్కర్లేదు. నార్త్ సింహాచలం ఓ రైల్వేస్టేషన్ కూడా. రెండో ప్రపంచ యుద్ధం కాలంలో చెన్నై, కలకత్తాల మధ్య అటుఇటు వెళ్లే సైన్యం దిగే స్టేషన్‌గా ఇది ఉపయోగపడేది. నార్త్ అంటే ఉత్తర దిక్కు. ఆంగ్లేయులు నారద అని ఉచ్చరించలేక నార్త్ అని పిలిచేవారు. దీనితో నారద సింహాచలం కాస్తా నార్త్ సింహాచలంగా మారింది. ఈ విషయాన్ని ప్రముఖ భాషా శాస్త్రవేత్త ఆచార్య తూమాటి దొణప్ప అప్పట్లో విశాఖలో జరిగిన ఓ సమావేశంలో పేర్కొన్నారు.

అడవివరం

సింహాచలం దేవస్థాన వరాహ పుష్కరిణి, కొండ కింద గల అడవివరంలో ఉంది. స్వామి పుష్కరిణి కొండ దిగువున ఉన్న అటవీ ప్రాంతంలో ఉండడంతో ఇది వరం అయిందని చెబుతారు. ఒకప్పటి దట్టమైన అరణ్యం ఇప్పుడు లేనప్పటికీ ఇది అడవివరంగానే చలామణి అవుతోంది.

పద్మనాభం

ఇది ప్రస్తుతం మండల కేంద్రం. క్రీ.శ 1724లో తొలిసారి సమర శంఖం పూరించిన విజయనగరం సంస్థానాధీశుడు రెండో విజయరామరాజు యుద్ధం చేసిన స్థలం పద్మనాభం. ఇది పద్మనాభ యుద్ధంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ వెలసిన పద్మనాభ స్వామి ఆలయం పేరుతో ఈ ప్రాంతీయులు పద్మనాభంగా నామకరణం చేశారు. ఈ ఆలయం పద్మనాభం కొండపై వెలసి ఉంది. ఇది అతి ప్రాచీన ఆలయం. ఈ స్వామి చాలా మహిమగలవాడని భక్తుల విశ్వాసం. ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఆధ్యాత్మిక చైతన్యానికి ఈ ఆలయం ప్రధాన పాత్ర పోషిస్తుంది. పాండవుల అజ్ఞాత వాసం సందర్భంగా కుంతీదేవి మాధవస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్టు ఇతిహాసం పేర్కొంటోంది. ఫాల్గుణశుద్ధ ఏకాదశినాడు శ్రీపద్మనాభస్వామి వారి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుంది.

పంచదార్ల

ఈ గ్రామం రాంబిల్లి మండలంలో ఉంది. ఇక్కడ భూగర్భం నుంచి ఐదు ధారలుగా జలం పొంగుతూ ఉంటుంది. అందుకే ఇది పంచధారలు అయి కాలక్రమేణా పంచదార్లగా దీనిపేరు స్థిరపడింది. ఈ పంచదార్లు నిరంతరం ప్రవహిస్తుంటాయి. ఈ నీటిలో గంధకం శాతం ఎక్కువుగా ఉంటుంది. అంచేత ఇక్కడ స్నానాలు చేస్తే అనేక రుగ్మతలు దూరం అవుతాయని చెబుతారు. పంచదార్ల ఒకప్పుడు స్వయంభూ అయిన వర్ధమాన లింగం ఉండేదట. అది కాలగతిలో మరుగున పడిపోయింది. అయితే యమధర్మరాజు తన కుష్ఠురోగం నయం కావడానికి ఇక్కడ మరుగునపడి ఉన్న వర్ధమాన లింగాన్ని పున:ప్రతిష్ఠించారు. యమధర్మరాజు చేత పున: ప్రతిష్ఠాపనకు నోచుకుంది. అప్పటి నుంచి ఇది

ధర్మలింగేశ్వర క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. ఏమైనప్పటికి ఇక్కడి పంచధారలు భక్తులను ఆకట్టుకుంటాయి. ఇదిలా ఉండగా ఇక్కడ వచ్చే పర్యాటకులకు ముందుగా రాధామాధవి స్వామి ఆలయం స్వాగతం చెబుతుంది. దీనిని క్షేత్ర పాలక దేవాలయం అని కూడా పిలుస్తారు. ఈ ఆలయం పరిసరాలలోనే పంచదార్లను కలిపే తటాకం ఉంది.

బొజ్జన్న కొండ

అనకాపల్లికి మూడు కిలో మీటర్ల దూరంలో ఉంది. ప్రాచీన గుహలయ, చైత్య విహారాలకు పేరుగొన్న కొండ ఇది. దీని మొదటి పేరు బుద్ధుని కొండగా ఉంది. కాలక్రమంలో జన వ్యవహారంలో బొజ్జన్న కొండగా మారింది.

శంఖారం

బొజ్జన్న కొండ, లింగాల మెట్టల మధ్యన ఉన్న గ్రామాన్ని శంఖారం అంటారు. ఇది జనవ్యవహరంలో 'శంకర'మైంది. సంఘారామమే ఈ విధంగా వికృతి రూపం చెందింది. ఈ స్థలాన్ని 1907లో అలెగ్జాండర్ అనే పురావస్తు శాస్త్రజ్ఞుడు సందర్శించాడు. ఇక్కడ 70 రాగి నాణేలు, సముద్ర గుప్తుని బంగారు నాణెం లభించాయి.

ఊరు పేరు మార్చండి మహాప్రభూ!

ఆ గ్రామం పేరు గోకులపాడు. ఎస్.రాయవరం మండలంలో ఉంది. ఈ గ్రామంలో ప్రతిఏటా రోడ్డు ప్రమాదాలకు గురై మరణించేవారు ఎక్కువుగా ఉంటున్నారు. ఒక్క ఏడాది కాలంలోనే 2014-15 ఈ గ్రామానికి చెందిన 20 మంది మృత్యువాతపడ్డారు. 1993 నుంచి ఏటా ఏదో ఒక ప్రమాదం జరుగుతోందని పలువురు మృతి చెందుతున్నట్టు గ్రామీణులు పేర్కొంటున్నారు. 2015లో గ్రామంలోని బాణసంచా తయారి కేంద్రంలో పేలుడు సంభవించి ఏడుగురు దుర్మరణం చెందారు. ఈ నేపథ్యంలో తమ గ్రామం పేరు మార్చాలని ప్రజలు కోరుతున్నారు. పేరు మారిస్తేగాని తమకు ప్రశాంతత ఉండదని అంటున్నారు. ప్రజలంతా సమావేశమై తమ పల్లె పేరు మార్చాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేశారు. తమ గ్రామం పేరు మార్చేవరకు శాంతి చేకూరదని భావిస్తున్నట్లు ఎం.పి.టి.సి. సభ్యురాలు ఎస్. యశోద వరలక్ష్మి వ్యాఖ్యానించారు.

అనకాపల్లి

అనకాపల్లి అనగా బెల్లం గుర్తుకొస్తుంది. ఇక అనకాపల్లి పట్నంలో వెలసి ఉన్న లక్షలాది మందికి ఆరాధ్యదైవం నూకాంబిక అమ్మవారు. ఈ ఆలయాన్ని నిర్మించి 560 ఏండ్లు అవుతుంది. నూకాంబిక అమ్మవారు నవ శక్తులలో ఒక శక్తి అయిన అనఘాదేవిగా తొలుత ప్రతిష్ఠితమై పూజలు అందుకుంది. అనఘ అంటే నిర్మలమైనది. అనఘాపల్లి కాలక్రమంలో అనకాపల్లిగా మారింది. ఉత్తరాంధ్రలోని అతి పెద్ద వ్యవసాయ మార్కెట్ యార్డులలో ఇక్కడి మార్కెట్ యార్డు గుర్తింపు పొందింది.

కశింకోట

ఇది మండల కేంద్రం. శారదానది తీరాన ఉంది. నిజాం పాలనలో చికాకోల్ సర్కార్‌లో ఓ ఫౌజ్‌దారీగా ఉండేది. గొల్కొండ నవాబుల వద్ద ప్రతినిధిగా పనిచేస్తున్న ఖాశింఖాన్ అనే ఉన్నతాధికారి మంచి పరిపాలకునిగా ప్రజల హృదయాల్లో స్థానం ఏర్పరుచుకున్నారు. ఇక్కడ సుమారు 800 ఏళ్ల క్రితం నిర్మించిన కోట ఎంతో ప్రసిద్ధి చెందింది. అయితే ఈ కోట నేడు పూర్తిగా శిథిలమైంది. ఖాశింఖాన్ పేరుతో గ్రామం ఏర్పాటైంది. ఖాశిం అనే పేరు ప్రజా వ్యవహారంలో కశింగా మారింది. అక్కడి కోటను కూడా గమనంలోకి తీసుకుని కశింకోటగా ఆ గ్రామానికి పేరు పెట్టారు.

అరకు

ఇది లోక్ సభ నియోజకవర్గ కేంద్రం. ఇది డుంబ్రిగూడ మండలంలో ఉంది. ప్రముఖ పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందింది. పద్మాపురం గార్డెన్స్, ట్రైబల్ మ్యూజియం ప్రసిద్ధి చెందాయి. అయితే అరకు లోయ అరకు లోయ మండలంలో ఉండటం విశేషం. అరకు లోయలోనే అందమైన పున్నమి అతిథి గృహాలు ఉన్నాయి. ఏ.పి టూరిజం శాఖ అధీనం లో ఉంది. అరకు అనే పేరు ఎలా వచ్చిందంటే... అరకు అంటే వనమూలికల ఔషధం. ఈ ప్రాంతంలో వనమూలికలు హెచ్చుగా ఉండడంతో దీనికి అరకు అని పిలుస్తారు. ఆ పేరే స్థిరపడింది. మనకు గ్రామాల్లో వృద్ధులైనవారు ద్రవ ఔషధాలను 'అరకు' గానే పిలుస్తారు. అలాగే 'అరకు వాడండి' అని గ్రామాలకు సైకిళ్లపై వచ్చే విక్రేతలు ప్రచారం చేస్తుం టారు.

బలిఘట్టం

ఇది నర్సీపట్నం మండలంలో ఉంది. త్రిశూల పర్వతంపై బ్రహ్మలింగేశ్వరాలయం ఉంది. బలిచక్రవర్తి తపస్సుకు మెచ్చి బ్రహ్మ ఇక్కడ శివలింగాన్ని ప్రతిష్ఠించాడు. ఈ అపురూప ఘట్టం వల్లనే బలిఘట్టం అనే పేరు ఈ గ్రామానికి వచ్చిందని స్థానికుల కథనం. ఇక్కడ స్వామికి 16వ శతాబ్దంలో చోళ రాజులు ఆలయాన్ని నిర్మించినట్టు తెలుస్తోంది. ఈ ఆలయాన్ని కార్తీకమాసం, మహాశివరాత్రి పర్వదినాల్లో స్వామిని హెచ్చు సంఖ్యలో భక్తులు సందర్శిస్తుంటారు.

దేవిపురం

ఈ పల్లె సబ్బవరం మండలంలో ఉంది. దేవిపురంలో శ్రీసహస్రాక్షి రాజరాజేశ్వరి దేవాలయం ఉంది. శ్రీచక్రయంత్రం ఆకారంలో ఆలయాన్ని నిర్మించి దేవిని ప్రతిష్ఠించారు. ఈ పేరుతోనే దేవిపురం వెలసింది. ఈ ఆలయానికి సాక్షాత్తు పరమశివుడే క్షేత్రపాలకుడు. శ్రీదేవి సూచించిన పంచలోహ శ్రీచక్ర మేరు యంత్రం దొరికిన పర్వత ప్రాంతం ఇదే. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద శ్రీచక్ర నమూనాలో నిర్మితమైన ఆలయంగా ప్రసిద్ధి చెందింది.

జి. మాడుగుల

ఇది మండల కేంద్రం. తొలుత ఈ గ్రామం అవతరించినప్పటికే హెచ్చు సంఖ్యలో మడుగులు(చెరువులు) ఉండేవి. దీంతో ఈ గ్రామ ప్రాంతానికి మాడుగుల అనే పేరు వచ్చింది. గంగరాజు అనే వ్యక్తి నామధేయంతో గంగరాజు మాడుగుల అయ్యింది. సంక్షిప్తంగా జి.మాడుగుల అని పిలుస్తారు. మాడుగుల హల్వాకు ఎంతో ప్రసిద్ధి చెందింది.

తగరపువలస

ఇది 16వ నెంబరు జాతీయ రహదారికి ఆనుకొని ఉంది. ప్రముఖ కూడలిగా వ్యాపార కేంద్రంగా ప్రగతి పథంలో దూసుకొని పోతోంది. ఇక్కడ తొలుతగా తగరపుపని చేసే కార్మికులు వేరే ప్రాంతం నుంచి ఈ ప్రదేశానికి వలస వచ్చి ఇళ్లను నిర్మించుకున్నారు. దీంతో దీనికి తగరపువలస అనే పేరు వచ్చినట్టు తెలుస్తోంది.

భీమునిపట్నం

ఇది శాసనసభ నియోజకవర్గ కేంద్రం. గోస్తనీ నది ఇక్కడే సముద్రంలో కలుస్తుంది. విదేశీయుల ఏలుబడి లో సైతం భీమునిపట్నం ప్రాంతం అభివృద్ధి చెందింది. 1641లో భీమిలిలో వ్యాపారం కోసం హైదరాబాదు నవాబు కులీకుతుబ్‌షా డచ్ దేశస్థులకు అనుమతిచ్చాడు. ఇదే ఏడాది డచ్చి వారు ఇక్కడో కోట నిర్మించుకొని విదేశీ వాణిజ్యానికి శ్రీకారం చుట్టారు. 1754లో జరిగిన మరాఠీ దాడుల్లోను, 1781లో ఫ్రాన్స్ బ్రిటన్‌ల మధ్య జరిగిన యుద్ధంలో డచ్ కోట ధ్వంసమైంది. 1825 నాటికి భీమిలి ఆంగ్లేయులవశం అయింది. ఆంగ్లేయుల హయాంలో వారు భీమునిపట్నం అని పలకలేక భీమిలి అని పిలిచేవారు. ఈస్టిండియా, పోర్చుగల్ వారి కాలంలో మనదేశంలో ఇది రెండో మున్సిపాలిటిగా ఆవిర్భవించింది. పర్యాటక కేం ద్రంగా అభివృద్ధి చెందుతోంది. కాగా స్థలపురాణం ప్రకారం ఒకప్పుడు దీనిని ఏకచక్రపురం అని పిలిచేవారు. పాండవులు అరణ్యవాస సమయంలో ఈ ప్రాంతంలో ఓ బ్రాహ్మణుని ఇంట ఉండేవారు. అక్కడ బకాసురుడు అనే వాడు రోజుకు ఓ బండితో భోజనం, రెండు దున్న పోతులు, ఒక మనిషిని ఆహారంగా తీసు కునేవాడు. ఒక రోజున బ్రాహ్మణుని ఏకైక కుమారుని వంతు వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న భీముడు బ్రాహ్మణుని కుమారునికి బదులుగా తానే స్వయంగా వెళ్లి ఆ రాక్షసుణ్ణి ఛంపాడు. అంచేత భీముని పేరు మీదనే ఈ ప్రాంతానికి భీమునిపట్నం అని పేరు వచ్చింది. ఈ ప్రాంతంలోని సౌమ్యగిరిపై లక్ష్మీ నరసింహుని విగ్రహాన్ని ప్రతిష్టించారని చరిత్ర చెబుతుంది. ఈ క్షేత్రం క్రీ.శ1228లో నిర్మాణమైందని శాసనాలు పేర్కొంటున్నాయి. దక్షిణభారతదేశంలో ఇదే ప్రథమ మున్సిపాలిటీ. ప్రస్తుతం విశాఖపట్నం మహానగర పాలక సంస్థ(జి.వి.ఎం.సి) పరిధిలో ఉంది.

గుడిలోవ

ఇది ఆనందపురం మండలంలో ఉంది. ఇక్కడ ప్రకృతి సిద్ధమైన మూడు కొండల నడుమ శ్రీరంగనాథస్వామి వారి ఆలయం ఉంది. క్రీ.శ. 18వ శతాబ్దంలో దీనిని నిర్మించారు. ఈ ఆలయానికి మరికొంత దూరంలోశ్రీనారాయణేశ్వరాలయం నెలకొని ఉంది. లోయ ప్రాంతంలో గుడి ఉన్నందున గుడిలోవ అని పేరు వచ్చింది.

చోడవరం

ఇది మండల కేంద్రం. క్రీ.శ. 13 - 14 శతాబ్దాల మధ్య కాలంలో ఈ ప్రాంతాన్ని చోళరాజులు పరిపాలించేవారు. చోళుల కాలంలో ఈ ప్రాంతాన్ని చోళవరంగా పిలిచేవారు. తరువాతి కాలంలో చోడవరంగా మారి అదే స్థిరపడింది. క్రీ.శ15వ శతాబ్దంలో మత్స్య వంశపురాజులు ఇక్కడ స్వయంభువుగా వెలసిన వినాయకుని ఆలయాన్ని నిర్మించారు. దీన్ని కాణిపాకం తరువాత స్వయంభువుగా వెలసిన రెండవ ఆలయంగా పేర్కొంటారు.

ఎలమంచిలి

ఇది ప్రస్తుతం పురపాలిక, మండల కేంద్రంగా ఉంది. శ్రీకృష్ణదేవరాయుల పరిపాలన కాలంలో ఆయన ఈ ప్రాంతంలో విడిదిగా ఉన్నట్టు చెబుతారు. విడిది కోసం ఓ మండపాన్ని కూడా ఏర్పాటు చేశారు.ప్రస్తుతం ఇది స్థానిక ఆర్.టి.సి కాంప్లెక్స్ పక్కన పాక్షికంగా శిథిలమై ఉంది. విజయనగరం, బొబ్బిలి, కశింకోట, పిఠాపురం తదితర సంస్థానాధీశులెల్లరకు ఒకప్పుడు ఈ కేంద్రం (ప్రాంతం) మజిలీగా ఉండేది. ఆ తరువాత ఎలమజిలీగా చివరకు ఎలమంచిలిగా వ్యవహరిస్తున్నారు. ఈ ప్రాంతంలో గల చెరువులో పలువురు ప్రముఖులు పడవ షికారు చేసేవారు. ఎలము అంటే సుందరమైనది అని అర్థము. రెండవ జయసింహుడు చనిపోయిన తర్వాత (క్రీ.శ. 717) అతని సవతి సోదరులలో చిన్నవాడైన కొక్కిలి విక్రమాదిత్య భట్టారకుడు అగ్రజుడైన మూడవ విష్ణవర్ధను (718-752) నితో కలహించి వేంగిని విడిచాడు. అక్కడ నుంచి మధ్యమ కళింగానికి తరలి వచ్చి ఎలమంచిలిని రాజధానిగా చేసుకున్నాడు. ఇక్కడ గల భాగవతుల ఛారిటబుల్ ట్రస్టు సేవా రంగంలో ప్రముఖ స్థానం పొందింది.

ఎస్. రాయవరం

ఇది మండల కేంద్రం. ఈ గ్రామం పూర్తి పేరు సర్వసిద్ధిరాయవరం. నవయుగ కవితావైతాళికుడు గురజాడ అప్పారావు జన్మించిన ఊరు ఇది. ఇంతకీ ఈ గ్రామానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే.... తెలుగు చాళుక్యులలో "సర్వసిద్ధి" అనే బిరుదు ఓ రాజుకు ఉంది. ఆయన మీద ఉన్న అపారమైన అభిమానంతో ఈ

గ్రామం ఏర్పడింది. మరో కథనం ప్రకారం శ్రీకృష్ణ దేవరాయలు ఇక్కడ విడిది చేసినపుడు ఈ మట్టి శుభ సూచికమని, సర్వ కార్యాలు సిద్ధిస్తాయని మనోనేత్రం నుంచి సంకేతాలు అందుకొని ఇక్కడి నుంచే కళింగసీమలో జైత్రయాత్రలకు శ్రీకారం చుట్టాడు. సింహాచలం, పొట్నూరు, కటకం(1515)లలో ఈ యాత్రలలో జయ కేతనం ఎగరేసాడు.

పెదనందిపల్లె అగ్రహారం, చిననందిపల్లె అగ్రహారం

ఇది ఓ అగ్రహారం. ఇది దేవరాపల్లి మండలంలో ఉంది. మాడుగుల సంస్థానాధీశుడు కృష్ణ భూపతి దీన్ని కొందరు బ్రాహ్మణులకు దానపట్టా కింద ఇచ్చారు. గ్రామంలోని బోడెన్నదొర అనే పాలెగాడికి పెదనంది, చిననంది అనే కుమారులు ఉన్నారు. ఇందులో పెదనంది పేరుతో పెదనందిపల్లె అగ్రహారం, చిననంది పేరుతో చిన నందిపల్లె అగ్రహారం పల్లెలు వెలిశాయి.

నరవ

ఇది పెందుర్తి మండలంలో ఉంది. నరవ వంశీయులు వేరే ప్రాంతం ఈ ప్రాంతానికి తరలి వచ్చి కొత్తగా గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నారు వారి వంశం పేరుతోనే నరవ గ్రామం ఏర్పాటైంది. .

పైడిపాల

ఇది మాకరపుపాలెం మండలంలో ఉంది. పైడిపాల వంశీయులు ఈ ప్రాంతానికి వచ్చి స్థిర నివాసాలను ఏర్పాటు చేసుకున్నారు. వారి వంశం పేరుతోనే పైడిపాల గ్రామం ఆవిర్భవించింది.

ఉపమాక అగ్రహారం

ఈ గ్రామం నక్కపల్లి మండలంలో ఉంది. నక్కపల్లి గ్రామానికి 2 కి.మీ దూరంలో వెలసి ఉంది. ఇక్కడ శ్రీవేంకటేశ్వరాలయం ఎంతో వాసికెక్కింది. గరుడాద్రి అనే పర్వతరాజు ఈ ప్రాంతంలో చేసిన తపస్సుకు మెచ్చి శ్రీవేంకటేశ్వరస్వామి ఇక్కడ వెలిశారు. ఆయన బరువును మోయలేని పర్వతరాజు కుంగిపోతుండడంతో తిరుపతిలో వెలసి ప్రతిరోజు రాత్రిపూట విశ్రాంతి కోసం

ఈ క్షేత్రానికి వస్తానని ఈ ప్రదేశం ఉపమాక అ గ్రహారం పేరుతో ప్రసిద్ధి చెందుతుందని స్వామి స్పష్టం చేశారు. ఇక్కడ ఆచరించిన పూజలు ఫలప్రదం అవుతాయని స్వామి ఆనతిచ్చారు. అంచేత కొండమీద ఆలయం పగటి పూట తెరచి ఉంటుంది. రాత్రిపూట ఈ ఆలయాన్ని తెరవరు. స్వామి చెప్పిన ప్రకారం ఈ గ్రామానికి ఉపమాక అగ్రహారం పేరు వచ్చినట్టు ఇతిహాసం వల్ల తెలుస్తుంది. 6వ శతాబ్దంలో శతాబ్దంలో తూర్పు గోదావరి జిల్లా కాండ్రేగుల సంస్థానాధిపతి స్వామివారికి ఈ ఆలయాన్ని నిర్మించారు. ప్రతి ఏటా ఈ ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు జరుతుంటాయి. ప్రతీ ఏటా ఫాల్గుణశుద్ధ ఏకాదశి నాడు స్వామి వారి తిరుకళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఇక్కడ యాత్రికుల కోసం తి.తి.దే సత్రాలను నిర్మించింది.

పాయకరావుపేట

ఇది మండల, నియోజకవర్గ కేంద్రం. తాండవ నది ఒడ్డున ఉంది. గోల్కొండ నవాబుల దగ్గర (1612-1626) సర్దారుగా పనిచేసిన కాకర్లపూడి అప్పలరాజు ఉండేవాడు. ఇతని యుద్ధ నైపుణ్యాలను చూసి నవాబు పాయకరావు అనే బిరుదునిచ్చారు. కొంత రాజ్య భాగాన్ని పొందారు. పాయక అంటే స్థిరంగా అనే అర్థం వస్తుంది. పాయకరావుపేట తొలి పేరు సత్యవరం. ఆయన తరువాత వంశం వారికి కూడా పాయకరావు అనే పేరు వెనుక ఉండేది. అందరూ కలసి ఈ గ్రామాన్ని అభివృద్ధి చేశారు. దీంతో ఈ గ్రామానికి పాయకరావుపేట అనే పేరు స్థిరపడింది.

వడ్డాది

ఇది బుచ్చయ్యపేట మండలంలో మాడుగులకు సమీపంలో ఉంది. ఓడ్ర జమిందారులు ఈ ప్రాంతాన్ని పరిపాలించేవారు. ఫలితంగా ఒడ్డవాదిగా ఉండేది కాలక్రమంలో వడ్డాదిగా మారినట్టు శాసనాలు సైతం చెబుతున్నాయి.

రావికమతం

ఇది మండల కేంద్రం. రావి అంటే ఓ ప్రవాహం పక్కన ఏటవాలుగా ఉండే ప్రాంతాన్ని రావి అంటారు. అయితే ఇందు కు విభిన్నంగా ఈ గ్రామ

చరిత్రను పరిశీలిస్తే ఈ ప్రాంతంలో రావి చెట్లు ఎక్కువగా ఉండేవి. అంచేత ఈ గ్రామానికి పూర్వ పదం రావి అయింది. కమతం అంటే పంట భూమి అని భావం. ఆ రోజుల్లో ఈ ప్రాంతంలో రావిచెట్లు విపరీతంగా ఉండేవి. వాటి మధ్యనే ప్రజలు ఇళ్లు కట్టుకొని స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు. అంచేత దీనికి రావికమతం అని పేరు వచ్చింది.

మాకవరపుపాలెం

ఇది మండల కేంద్రం. మాకమ్మతల్లి ఇక్కడ వెలసింది. ఆ తల్లిపేరుతోనే ఈ పల్లెకు మాకవరపుపాలెం అనే పేరు వచ్చినట్టు స్థానికుల కథనం.

గోలుగొండ

ఇది మండల కేంద్రం. గోల్కొండ జమిందారులు ఈ ప్రాంతంలో కొందరికి గ్రామాన్ని దానంగా ఇచ్చారు. కాగా గోల్కొండ నుంచి పలువురు ఇక్కడకి వచ్చి స్థిరపడ్డారు. అందుచేత గోల్కొండ పేరుతో ఈ పల్లె గోలుగొండగా మారినట్టు స్థానికులు అందజేసిన సమాచారం వల్ల తెలుస్తోంది.

నర్సీపట్నం

ఇది రెవెన్యూ డివిజన్ కేంద్రం. అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం. స్వాతంత్ర్య సమరానికి ప్రధానకేంద్రంగా నిలిచింది. విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజుకు అండగా నిలిచిన ప్రాంతం ఇది. ఈ గ్రామానికి పేరు ఎలా వచ్చిందంటే..... నరసమ్మ అనే మహిళ ఉండేది. ఆమె బ్రతుకు తెరువుకోసం అల్పాహార, భోజనశాల నిర్వహించేది. ఆమె తయారు చేసిన భోజనం ఎంతో రుచికరంగా ఉండేది. ఆమె తయారు చేసిన అల్పాహారం కోసం ఆంగ్లేయుల వద్ద ఉన్న పోలీసులు స్వయంగా వచ్చి తీసుకువెళ్ళి తమ దొరలకు అందజేసేవారు. కొన్ని సందర్భాలలో ఆమె నేరుగా ఇడ్లీ, ఉప్మాలను దొరలకు అందించేది. ఈ సందర్భంగా ఆమె ఆంగ్లేయుల రహస్యాలను పసిగట్టి ఆ సమాచారాన్ని స్వాతంత్ర్య యోధులకు అందించేది. ఇలా పరోక్షంగా ఆమె మన దేశ స్వాతంత్ర్యానికి ఎంతో సహకరించింది. ఆమె పేరుతోనే ప్రజలు (నరసమ్మ) గ్రామానికి నర్సీపట్నం అని పేరు పెట్టుకున్నారు. సముద్ర తీరాన నర్సీపట్నం లేకపోయినప్పటికి ఊరి పేరు చివర పట్నం

ఉండటం గమనార్హం. అలాగే శ్రీకాకుళం జిల్లా పలాస మండలంలోని టెక్కలిపట్నం కూడా సముద్రతీరాన లేకపోయినప్పటికి చివరి పదం పట్నంగా వచ్చింది. ఇక్కడ నర్సీపట్నం ఏజన్సీ ప్రాంతంలో ఉంది. 'గేట్ వే ఆఫ్ ఏజన్సీ' అని కూడా అంటారు. ఆంగ్లేయుల హయాంలోని తాలూకా కార్యాలయం, సబ్ కలెక్టర్ కార్యాలయం చారిత్రక చిహ్నాలుగా నిలిచి ఉన్నాయి. ఇక్కడకు సమీపంలోని కృష్ణదేవిపేటలో అల్లూరి సీతారామరాజు సమాధి ఉన్నది.

అనంతగిరి

ఇది గిరిజన ప్రాంతంలోని మండల కేంద్రం. ఈ మండలంలో విస్తారంగా కొండలున్నాయి. అనంత మయిన కొండలు గల ప్రాంతం కాబట్టి ఈ గ్రామానికి అనంతగిరి అని పేరు వచ్చిందని పేర్కొంటారు. అనంతగిరిలోనే ప్రసిద్ధి చెందిన బొర్రా గుహలు ఉన్నాయి.

డుంబ్రిగుడ

ఇది శంకరం అడవుల్లో గల మండల కేంద్రం. దట్టమైన పొగమంచు ఉండే ప్రాంతమిది. ఏజన్సీ ప్రాంతంలో డుంబ్రి అంటే ఒంటరి గ్రామం అని అర్థం. పొగమంచు అనికూడా వ్యవహరిస్తుంటారు. గుడ అంటే ప్రజలు ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చి స్థిరపడ్డ గ్రామం. అంచేత ఈ గ్రామానికి డుంబ్రిగుడ అని పేరు వచ్చిందని ఎల్.ఎఫ్.ఎల్. ప్రధానోపాధ్యాయుడు సి.హెచ్. గోపినాథ్ తెలిపారు.

పెద్ద మదీనా... చిన్న మదీనా...

ఇవి జంట గ్రామాలు తరహాలో ఉంటాయి. ఇవి బుచ్చయ్యపేట మండలంలో ఉన్నాయి. ఈ గ్రామాల్లో ముస్లింలు ఉంటారని భావిస్తాం. అయితే ఇక్కడ ఇక్కడ ఒక్క ముస్లిం కూడా లేరు. అయితే గ్రామాలు ఏర్పాటు చేసుకొనేటప్పుడు అతి కొద్ది మంది ముస్లింలు ఉండేవారు. అయితే కాల గమనంలో వారంతా వలస పోయారు. అయినప్పటికీ ఆ ఊరిపేర్లు అలానే ఉండి పోయాయి.

చుక్కపల్లి

ఇది ఓ అగ్రహారం. చీడికాడ మండలంలో తలదాచుకొంటోంది. చోడవరానికి 5 కి.మీ. దూరంలో ఉంది. ఈ అగ్రహారాన్ని జయపురం సంస్థానాధీశుల సామంతులైన మాడుగుల పాలకులు బ్రాహ్మణ పండితులకు దానంగా ఇచ్చారు. విశ్వభూపతి దేవ్ మహారాజు తిరుపతి జోస్యుల వారికి శుక్రుడు అనే గిరిజనుడు నివశించిన శుక్రపల్లి అనే ప్రాంతాన్ని కట్టిపెట్టాడు. శుక్రపల్లి జనవ్యవహారంలో చుక్కపల్లిగా స్థిరపడింది.

మునగపాక

ఇది మండల కేంద్రం. అప్పట్లో మునగచెట్లు ఈ ప్రాంతంలో విస్తారంగా ఉండేవి. ఇక్కడ గ్రామాన్ని ఏర్పాటు చేసుకొనేటప్పుడు కొన్ని పాకలను నిర్మించారు. ఇలా మునగపాక అవతరించింది.

పైడివాడ అగహ్రారం

ఇది సబ్బవరం మండల కేంద్రానికి దక్షిణ దిశగా 6 కి.మీ దూరంలో ఉంది. ఈ అగ్రహారంలో పాడిసంపద ఎక్కువగా ఉండేది. అంచేత దీన్ని పాడివాడ అని పిలిచేవారు. ఉచ్చారణ విపరిణామంల వల్ల ఇది పైడివాడగా రూపాంతరం చెందింది. ఈ అగ్రహారాన్ని వేదపండితులైన రాయప్రోలు జగ్గన్నకు విజయనగరం సంస్థానాధీశులు దానంగా ఇచ్చారు.

సౌభాగ్యరాయపుర అగ్రహారం

ఈ పల్లె పెందుర్తికి తూర్పుదిశలో 8కి.మీ దూరంలో వెలసి ఉంది. ఈ అగ్రహారంలోని వేద పండితుల ప్రతిభకు మెచ్చి విజయనగరం సంస్థానాధీశులు దానంగా ఇచ్చారు. సౌభాగ్యుడు అనే ప్రముఖ వ్యక్తి పేరుతో ఈ అగ్రహరానికి సౌభాగ్య పురం అనే పేరు వచ్చింది. ఇక్కడ రామాలయంతో పాటూ బంగారమ్మ, మర్మమాంబ, పైడితల్లమ్మ, పోలమాంబ, భూలోకమ్మ అనే గ్రామ దేవతల ఆలయాలు ఉన్నాయి.

చిన్నభైరవిభూపతి అగ్రహారం

మండల కేంద్రమైన నాతవరానికి దక్షిణ దిశలో 6కి.మీ దూరంలో ఉంది. గోలుగుండ రాజావారైన వెంకట చినభైరవి భూపతి రాజు వేద పండితులకు ఈ గ్రామాన్ని దానంగా ఇచ్చాడు. అంచేత ఈ గ్రామానికి ప్రజలు కృతజ్ఞతా పూర్వకంగా ఈ పేరును పెట్టుకున్నారు. ఈ పల్లెలో పురాతనమైన శ్రీరామాలయం, నూకాలమ్మ ఆలయం ఉన్నాయి.

తూర్పు గోదావరి జిల్లా

కాకినాడ

తూర్పు గోదావరి జిల్లా కేంద్రం ఇది. భారతదేశ తూర్పు తీరప్రాంతంలో ముఖ్యమైన రేవుపట్టణంగా గుర్తింపు పొందింది. న్యూయార్క్ నగరం మాదిరిగా వీధులు రూలకర్రతో గీసినట్టు సమాంతరంగా ఉండి కూడళ్లలో ఒకదానికొకటి లంబంగా ఉండటం ఈ నగర ప్రత్యేకత. ప్రణాళికా బద్ధంగా ఉండటం వల్ల కో-కెనడాగాను ప్రముఖ ఓడరేవు ఉండటం వల్ల రెండో చెన్నైగాను, చమురు అన్వేషణ వెలికితీత కార్యక్రమాలు ఎక్కువుగా ఉన్నందున మినీ ముంబాయి గాను పిలుస్తుంటారు. ప్రశాంత వాతవరణానికి మారుపేరైన ఈ కేంద్రం పెన్షనర్స్ పారడైజ్‌గా పేరు పొందినది. ఆంగ్లేయుల కాలంలో కోకనాడగా పిలిచేవారు. స్వాతంత్ర్యం వచ్చేక ఈ పేరును కాకినాడగా మార్చారు. ఆంగ్లేయుల పరిపాలనా సమయంలో స్థాపించిన సంస్థల పేర్లు కోకనాడగానే ఉన్నాయి. కోకనాడ చాంబర్ ఆఫ్ కామర్స్, జె.ఎన్.టి.యూలోని కొన్ని శిలాఫలకాలు ఆ పేరుతోనే ఉన్నాయి. ఇక కాకినాడ పేరు మొదట కాకినందివాడ అనే పేరుతో ఉండేదని కాలక్రమంలో కాకినాడగా నామాంతరం చెందిందని చెబుతారు. త్రేతాయుగంలో ఈ ప్రాంతం పెద్ద అడవిగా ఉండేది. దీన్ని కాకాసురుడు పరిపాలిస్తూ ఉండేవాడు. వానవాసంలో ఉన్న సీతను కాకి రూపంలో వేధించినపుడు అతనిని చంపాడు. అందుచే దీనికి కాకినాడ పేరు వచ్చిందని మరో కథనం ప్రచారంలో ఉంది. ఈ ప్రాంతానికి మొదట డచ్‌వారు వ్యాపారం కోసం వచ్చి స్థావరం ఏర్పరుచుకున్నారు. వారి తరువాత ఆంగ్లేయులు స్థావరం ఏర్పరుచుకున్నారు. తరువాత కెనడియన్ బాప్టిస్ట్ క్రైస్తవ మిషనరీలు ఇక్కడకి వచ్చాయి. వారు కాకినాడ నగరాన్ని చూసి ఇది అచ్చంగా వారి కెనాడ నగరాన్ని తలపించడంతో ఈ నగరాన్ని కోకెనాడగా పిలిచేవారు. అది కాలక్రమంగా కాకినాడగా వాడుకలోకి వచ్చింది.

రాజమండి / రాజమహేంద్రవరం

ఇది గోదావరి నది తీరాన వెలిసిన మహానగరం(నగరపాలక సంస్థ) ఉభయగోదావరి జిల్లాలకు వాణిజ్య కేంద్రంగా విలసిల్లుతోంది. రాజమండ్రి తొలిపేరు రాజమహేంద్రి/రాజమహేంద్రవరం. క్రీ.శ. 11వ శతాబ్దంలో గోదావరి నది పరీవాహక ప్రాంతాన్ని రాజరాజనరేంద్రుడు పరిపాలించినప్పుడే రాజమహేంద్రవరం అన్న పేరు ఉండేదని చరిత్రకారులు చెబుతారు. ఆయనకు ఉన్న రాజమహేంద్ర బిరుదును అందుకు ఆధారంగా చూపిస్తారు. తరువాత ఆంగ్లేయులు రాజమహేంద్రవరం పేరును పలుకలేక రాజమ్మండ్రి అని పిలిచే వారు. అదే చివరకు స్థిరపడింది. 1802లో జిల్లా కోర్టు ఏర్పాటు చేసినపుడు అధికార పత్రాలలో రాజమండ్రి పేరుకు చోటు దక్కింది. అయితే ఈ పట్టణానికి గత వైభవాన్ని దృష్టిలో ఉంచుకొని రాజమండ్రి పేరును రాజమహేంద్రవరంగా మారుస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మంత్రి వర్గ సమావేశం తేది. 10. 10. 2015న ఓ తీర్మానాన్ని ఆమోదించింది. 2016 జనవరి1న ఈ మేరకు ప్రభుత్వం గెజిట్‌ను అధికారపూర్వకంగా విడుదల చేసింది. రాజమహేంద్రవరం తెలుగు సంస్కృతికి పుట్టినిల్లుగా ఉంది. రాజరాజనరేంద్రుని కోరిక మేరకు ఆదికవి నన్నయ ఇక్కడే మహాభారతాన్ని ఆంధ్రీకరించాడు. సంఘసంస్కర్త కందూకూరి వీరేశలింగం, ప్రఖ్యాత చిత్రకారుడు దామెర్ల రామారావు ఈ పట్టణంలో జన్మించినవారే. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంకు ఈ పట్టణంతో విడదీయరాని సంబంధం ఉంది.

కాతేరు

ఇది రాజమహేంద్రవరంలో ఓ భాగంగా ఉంది. ఈ ప్రాంతానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే... రాజరాజనరేంద్రుని తొలి భార్య కుమారుడు సారంగధరుడు. రెండో భార్య, చిత్రాంగి ఆమె సారంగధరుణ్ణి మోహించింది. రాకుమారుడు తిరస్కరించడం, అతనిపై చిత్రాంగి అపవాదు వేయడం తెలిసిందే. వాస్తవం తెలుసు కున్న రాజు చిత్రాంగిని చంపించి రాజమహేంద్రవరం శివార్లలో ఒక చోట పాతేరు. కాలక్రమంలో ఈ ప్రదేశంలో ఓ గ్రామం ఏర్పాటైంది అదే పాతేరు. చిత్రాంగిని పాతిన స్థలంలో ఒక రాయి పాతేరు. ఇప్పుడు ఆ రాయి ఆనవాళ్ళు లేవనుకోండి. పాతేరు కాలక్రమంలో కాతేరుగా మారింది.

ర్యాలీ

ఈ గ్రామం రావులపాలెంకు సమీపంలో ఉంది. క్షీరసాగర మథనం తరువాత దేవదానవులు అమృతం కోసం తగవు పడ్డారు. దీన్ని పంచేందుకు విష్ణువు మోహిని అవతారం ఎత్తాడు. ఆ మాయలో పడిన శంకరుడు మోహినిని వెంబడించాడు. శివుడి నుంచి తప్పించుకోవడానికి ఆకాశమార్గంలో వెళ్తుండగా మోహిని తలనుంచి ఓ పువ్వు రాలి ఇక్కడ పడిందట! అందుకే రాలీ అనే పేరు వచ్చింది. జనవ్యవహారంలో ర్యాలీగా మారింది. ఇక్కడ గల జగన్మోహిని కేశవస్వామి ఆలయం ఆనాటి శిల్ప కళా నైపుణ్యానికి కొలమానం. ఈ ఆలయంలోని విగ్రహం ఒకవైపు కేశవస్వామి మరోవైపు మోహిని రూపం దర్శనమిస్తాయి. ఇక్కడ విష్ణు పాదం నుంచి గంగ జనించినట్టుగా ఆకాశ గంగ తరహాలో శిల్పీకరించారు. కాగా మోహిని సిగలో పువ్వు రాలిన గుర్తుగా ఆ భాగం ఖాళీగా ఉంటుంది. చోళ రాజులు నిర్మించిన ఆలయం ఇది. గోదావరికి ఉపనదులైన వశిష్ఠ, గౌతమీ నదులు ఈ ప్రాంతం నుంచి సాగిపోతుంటాయి. ఇక్కడ విష్ణువు గాదిలో వెలిశాడు. ముందు భాగం విష్ణు రూపంలో, వెనుక భాగం మోహిని రూపంలో ఉంటుంది. శిగలో పువ్వు రాలిన గుర్తుగా ఆ భాగం ఖాళీగా ఉంటుంది. విష్ణువు పాదాలనుంచి నిరంతరం నీరు పారుతుంటుంది.

దాక్షారామం

ఇది గొప్ప శైవక్షేత్రం. ఇక్కడ ఉన్న భీమేశ్వరాలయాన్ని క్రీ.శ. 892లో వేంగీ చాళుక్యరాజు చాళుక్యభీముడు నిర్మించాడు. దక్షుడు యజ్ఞం చేసిన వాటిక. కనుక దీనికి దక్షారామం అని పేరు వచ్చింది. ఇదే కాలక్రమంలో ద్రాక్షారామంగా మారింది. దక్షుడు తలపెట్టిన యజ్ఞానికి ఆయన కూతురు, శివుని భార్య అయిన సతీదేవి పిలవకపోయినా వస్తుంది. కన్న కూతురు అని కూడా చూడకుండా ఆమెను అవమానిస్తాడు దక్షుడు. దాంతో అక్కడే గల యజ్ఞగుండంలో పడి సతీదేవి ఆత్మాహుతి చేసుకుంటుంది. 'పిలవని పేరంటం' అనే నానుడి పుట్టుకకు ఈ ఉదంతమే కారణమని చెబుతారు. ఇక్కడ విశేషాలను శ్రీనాథుడు భీమఖండం, కాశీ ఖండం కావ్యాలలో వర్ణిస్తాడు.

ఆత్రేయపురం

ఈ గ్రామం మండల కేంద్రం కూడా. గోదావరి ఈ పల్లెనుంచి ప్రవహిస్తుంది. చూడచక్కని పచ్చని పొలాలు, గంభీరంగా నిలబడే కొబ్బరి చెట్లు, అరటితోటలతో కనువిందు చేస్తుంది. నోరూరించే పూతరేకులకు పుట్టినిల్లు. అత్రి మహర్షి తపస్సు చేసిన స్థలం కావడం వల్ల ఆత్రేయపురం అనే పేరు వచ్చింది. గ్రామం నడిబడ్డులో శ్రీవేణుగోపాలస్వామి ఆలయం దగ్గర ఆత్రి మహర్షి తపస్సు చేసిన గుర్తుగా స్మృతి చిహ్నం నిర్మించారు. మామిడితాండ్ర, ఊరగాయల తయారీకి ఈ ఊరు ప్రసిద్ధి. ఇక్కడ ఎత్తయిన ఆంజనేయస్వామి విగ్రహం ఉంది. చూడముచ్చటగా ఉంటుంది. ఎన్నో తెలుగు చలచిత్రాలను ఈ అందమైన ప్రాంతంలో నిర్మించారు.

వాడపల్లి

ఇది ఆత్రేయపురం మండలంలో ఉంది. స్వామి ఎర్ర చందనం కొయ్యలో వెలసిన స్వయంభువు క్షేత్రం. ఈ దేవుడిని తలచుకుంటే చాలు తప్పని సరిగా కార్యసిద్ధి జరుగుతుందని భక్తుల విశ్వాసం. ఐతిహ్యం ప్రకారం పెనుబోతుల గజేంద్రుడనే వ్యక్తి కొన్ని ఓడలకు అధిపతిగా ఉండేవాడు. ఓ సారి పెను తుఫాను వచ్చింది. అతని ఓడలన్ని సముద్రంలో మునిగిపోయాయి. అయితే తన ఓడలు సురక్షితంగా తీరానికి చేరితే గుడి కట్టిస్తానని మొక్కుకున్నాడు. తుపాను వెలిశాక ఓడలు భద్రంగా ఒడ్డుకు వచ్చాయి. మొక్కుబడి ప్రకారం స్వామివారికి ఆలయాన్ని నిర్మించాడు. ఇది గొప్ప అన్నదాన క్షేత్రంగా కూడా ప్రసిద్ధి చెందింది. సముద్రంలోని నౌకల, మానవుల్ని సంసార బాధల నుంచి ఇక్కడి దేవుడు ఒడ్డుకు చేరుస్తాడని స్థల పురాణం పేర్కొంటోంది. అందుచే దీనిని నౌకాపురం అని కూడా పిలుస్తారు. నౌక అంటే ఓడ అని అర్థం. క్రమంగా ఓడ అనే ఈ పదంతో వాడపల్లిగా స్థిరపడింది. ఏటా చైత్ర శుద్ధ ఏకాదశి రోజున ఈ క్షేత్రంలో స్వామివారి కళ్యాణం, తెప్పోత్సవం జరుగుతుంది.

అప్పన్నపల్లి

ఈ పల్లె మామిడికుదురు మండలంలో ఉంది. అప్పన్న అనే గొప్ప రుషి ధ్యానం చేసిన పవిత్ర స్థలం ఇది. విశ్వకళ్యాణం కోసం సుదీర్ఘకాలం తపస్సు చేసిన చోటు ఇది. అయన పేరుతోనే ఈ పల్లెకు అప్పన్నపల్లి అని నామకరణం చేశారు. కోనసీమలో రెండో తిరుపతిగా విరాజిల్లుతోంది. ప్రముఖ సాంస్కృతిక వారసత్వకేంద్రంగా వర్ధిల్లుతోంది. ముల్లేటి రామస్వామి అనే వ్యాపారికి శ్రీవేంకటేశ్వరస్వామి కలలోకి వచ్చి తన కోసం ఆలయాన్ని నిర్మించాలని కోరాడు. దీనితో అయన బాలాజీ ఆలయాన్ని అతి రమణీయంగా నిర్మించాడు. ఈ ఆలయ ప్రాంగణం శ్రీమహావిష్ణువు వివిధ అవతారాలతో శోభిల్లుతోంది.

పిఠాపురం

పరమేశ్వరుడు కోడిపుంజు రూపంలో వెలసిన కుక్కుటేశ్వరక్షేత్రం. అష్టాదశ శక్తిపీఠాలలో పురూహూతికాదేవి కొలువైన దివ్య తీర్థం. ఇంద్రుడు నిర్మించిన ఐదు వైష్ణవ క్షేత్రాలలో ఇది ఒకటి. దత్తాత్రేయుని మొదటి అవతారమైన శ్రీపాదవల్లభుడు జన్మించిన పుణ్యస్థలం ఇది. ఎన్నో విశిష్టతల సమాహారం పిఠాపురం. పురాణప్రసిద్ధి గాంచిన గొప్ప దివ్యక్షేత్రం పిఠాపురం. పుట్టింట పుట్టెడు అవమానం పొంది, అగ్నికి ఆహుతయిపోయిన ద్రాక్షాయిని పీఠభాగం పడిన, ప్రదేశం కాబట్టి ఈ క్షేత్రానికి పిఠాపురం అనే పేరు వచ్చిందని స్థలపురాణం పేర్కొంటోంది. ఇక్కడ అమ్మవారు పురూహూతికాదేవిగా భక్తులచే పూజలందుకుం టుంది. స్థానికంగా వెలసి ఉన్న కుంతీ మాధవస్వామి ఆలయం ఎంతో ప్రాచీనమైనది. దీన్ని 11వ శతాబ్దంలో నిర్మించినట్టు ఆలయంలోని శాసనాల ద్వారా తెలుస్తోంది.

అన్నవరం

శ్రీ సత్యదేవుడు వెలిసిన పవిత్ర క్షేత్రం అన్నవరం. దీన్ని రత్నగిరి అని కూడా పిలుస్తారు. ఈ ప్రాంత ప్రజలకు రెడ్డి రాజులకు చెందిన అన్నయ మంత్రి వరప్రసాదుడుగా ఉండటం వల్ల దేవస్థానం కార్యకర్తలు మొదట నుంచి నిరంతర అన్నదానం చేస్తూ ఉండటం వల్ల అన్నవరంగా పిలుస్తున్నారు. ఇక్కడి వీరవెంకట సత్యన్నారాయణస్వామి భక్తులకు విశేషంగా ఆకర్షిస్తున్నందువల్ల ఈ అన్నవరం

గ్రామం "దేవుడు అన్నవరం"గా కూడా ప్రసిద్ధి చెందింది. ఈ గ్రామం 108 తిరుపతిలకంటే 18 మహా పీఠాలకంటే అంతులేని పుణ్యాన్నిచ్చే సప్తపురాలకంటేను కూడా గొప్పదైంది. సమస్త కోర్కెలను తీరుస్తూ ముక్తినిస్తుందని "శ్రీసత్యదేవ విలాసం"లో కవి రాజహంస వోలేటి పార్వతీశం ప్రశంసించారు. తే. 28-2-1922 దిన విప్లవ వీరుడైన అల్లూరి సీతారామరాజు అన్నవరం పోలీస్ స్టేషన్‌ను కొల్లగొట్టిన కారణంగా అన్నవరం భారత స్వాతంత్ర్య సమర చరిత్రలో కూడా చోటు చేసుకున్నది.

అమలాపురం

తూర్పు గోదావరి జిల్లాలో అతి ప్రసిద్ధి చెందిన పట్టణం ఇది. దీని పూర్వ నామం అమృతపురి. కాలగమనంలో అమ్మీపురిగా మార్పుచెందింది. ఈ అమ్మీపురి కాలానుగతంగా అమలాపురంగా మారింది. అమలాపురంలోని అమల్వేశ్వరస్వామి, సిద్ధేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి, రామలింగేశ్వరస్వామి, చంద్రమౌళీశ్వర స్వామి ఆలయాలు నెలకొని ఉన్నందున ఈ ఊరిని పంచలింగపురంగా పిలిచేవారు. ఇది ఇలా ఉండగా రాజరాజ నరేంద్రుడు పాలనాకాలంలో అమల అనే రాజనర్తకి ఈ ప్రాంతంలో ఉండేది. ఆమె గూర్చి రాజుగారి వార్తాహరులు తరచుగా వచ్చేవారు. ఆమె రక్షణ కోసం రాజభటులు ఆమె ఇంటిదగ్గర ఉండేవారు. ఊళ్లో కూడా పెద్దఎత్తున కాపలా కాస్తుండేవారు. దీనితో ఈ ప్రాంతాన్ని అమలూరు అని పిలిచేవారు. కాలక్రమంలో అమలూరి, అమలాపురిగా ప్రస్తుతం అమలాపురంగా పిలుస్తున్నారు.

సర్పవరం

కాకినాడకు 5 కి.మీ దూరంలో ఉంది. సామర్లకోట మార్గంలో ఈ గ్రామం కనిపిస్తుంది. ఇక్కడ భావనారాయణస్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. తక్షకుడు పరీక్షిత్తుని కాటువేసిన స్థలం కావడంతో దీనికి సర్పవరం అనే పేరు దఖలు పడింది. అద్భుత శిల్పకళ కలిగిన ఇక్కడ దేవాలయాన్ని నారదుడు సందర్శించి పూజలు జరిపారు.

మందపల్లి

ఈ గ్రామం కొత్తపేట మండలంలో ఉంది. ఈ పల్లె గోదావరి నదికి దగ్గరలో ఉంది. ఇక్కడ శనీశ్వరాలయం ఉంది. కాకినాడకు 40కిలో మీటర్ల దూరంలో ఉంది. మహాశివరాత్రి రోజున లింగోద్భవం జరుగుతుంది. ఆ సందర్భంగా శివలింగంలోని ఓ కళ మందుడిగా రూపాన్ని దాల్చాడు. మందేశ్వరుడు వెలసిన పల్లె కాబట్టి మందేశ్వర పల్లె అయింది. కాలక్రమంలో మందపల్లిగా స్థిరపడింది. ఇక్కడ గల ఆలయాన్ని మందేశ్వరాలయంగా పిలుస్తారు. మందేశ్వరుని పేరుతో ఈ గ్రామానికి మందపల్లి అని నామకరణం చేసారు. ఇక్కడి ఆలయంలో తైలాభిషేకం చేస్తారు. శనిత్రయోదశి రోజున వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హెచ్చు సంఖ్యలో వచ్చి అభిషేకాలు నిర్వహిస్తారు. ఇక్కడ శివలింగాన్ని శనీశ్వరుడే ప్రతిష్ఠించినట్టు స్థలపురాణం వల్ల తెలుస్తోంది. లింగాకారంలో ఉన్న శనీశ్వరాలయం ఇది ఒక్కటేనని చెబుతారు.

కోటిపల్లి

ఇదొక గొప్ప శైవక్షేత్రం. ద్రాక్షారామానికి బాగా దగ్గరలో ఉంది. రాజమండ్రికి సుమారు 70 కి.మీ, దూరంలో సోమేశ్వరాలయం ఉంది. అహల్య విషయంలో ఇంద్రుణ్ణి గౌతముడు శపించిన గాథ మన ప్రాచీన సాహిత్యంలో కనిపిస్తుంది. శాపాన్ని పొందిన ఇంద్రుడు శాప విముక్తి కోసం ఇక్కడ శివలింగ ప్రతిష్ఠ చేశాడు. ఇక్కడ చేసే తపో, దాన, యజ్ఞయాగాదులు కోటి రెట్లు ఫలితం అధికంగా ఇస్తాయని భక్తుల నమ్మకం అంచేతనే "కోటిఫలి" అనే పేరు వచ్చిందని కూడా స్థలపురాణం పేర్కొంటోంది. ఇక్కడ ఈశ్వరున్ని కోటిలింగేశ్వరునిగా పిలుస్తారు. కోటిపల్లిలో స్నానం చేయడం వల్ల పాపాలన్ని పటాపంచలవుతాయని భక్తుల విశ్వాసం. మహాశివరాత్రికి ఇక్కడ పెద్ద ఉత్సవం జరుగుతుంది.

పెద్దాపురం

ఇది పురపాలిక, మండల కేంద్రం. పెద్దాపురానికి రాజమండ్రికి మధ్య గల జగ్గంపేట రహదారిలో సుమారు వంద ఎకరాల విస్తీర్ణం గల ఎత్తయిన ప్రదేశంలో పాండవుల మెట్ట ఉంది. పాండవుల తల్లి కుంతీదేవిని "పృధ" గా ఈ

ప్రాంతీయులు పిలిచేవారు. ఈ పేరుతోనే పృధాపురం వెలసింది. కాలపరిణామ క్రమంలో ఈ ప్రాంతమే పెద్దాపురంగా మారిందని చెబుతారు. పెద్దాపురం గతంలో పేరుమోసిన సంస్థానం.

సఖినేటిపల్లి

మండల కేంద్రమైన సఖినేటిపల్లికి ఇతిహాస పరంగా మంచి ప్రాధాన్యత ఉంది. సీతారామలక్ష్మణులు అరణ్యవాసం సందర్భంగా పాదయాత్ర చేస్తుండగా ఓ జనావాస ప్రాంతానికి వచ్చేసరికి చీకటిపడింది. దీంతో రాత్రిపూట అక్కడ గడిపేందుకు నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీరాముడు సీతతో సఖీ! నేటి ఈ పల్లెలో మనం విశ్రమించాల్సి ఉంటుందని అన్నాడు. అప్పటి నుంచి ఈ జానపదానికి సఖినేటిపల్లి పేరు వచ్చిందని స్థల పురాణం పేర్కొంటోంది.

అంతర్వేది

ఇది సఖినేటిపల్లి మండలంలో ఉంది. ఒకప్పుడు శివుని పట్ల చేసిన అపచారంతో ప్రాయశ్చిత్తంగా బ్రహ్మ రుద్రయాగం చేయాలని నిర్ణయించాడు. ఆ యాగానికి వేదికగా ఈ ప్రదేశాన్ని ఎన్నుకుంటాడు. ఈ కారణంగా అంతర్వేది అనే పేరు వచ్చింది. (అంతర్+వేదిక) అంటే వేదికను గ్రామం లోపల ఏర్పాటు చేసినట్టు స్పష్టం అవుతోంది. ఈ యాగాన్ని వశిష్ఠునిచే చేయించినట్టు స్థలపురాణం వల్ల తెలుస్తోంది. గోదావరి పాయ అంతర్వేది వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. ఈ గ్రామంలో వెలిసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం రాష్ట్రంలోనే ఓ ప్రసిద్ధ పుణ్య క్షేత్రంగా పేరు గడించింది. సప్తమహర్షులలో ఒకడైన వశిష్ఠుడు గౌతమీ, గోదావరి శాఖను సముద్రంలో సంగమింపజేసి ఈ తీరంలోనే రుద్ర యాగం చేశాడు. పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలను ప్రతిష్ఠించి శివుని అనుగ్రహం పొందినట్టు బ్రహ్మపురాణం వల్ల తెలుస్తోంది. వశిష్ఠుని ప్రార్థన మేరకే నరసింహస్వామి ఇక్కడ వెలిసినట్టు ఐతిహ్యం వల్ల తెలుస్తోంది. అంతర్వేదిలో మాఘశుద్ధ దశమి నాడు స్వామి వారి కళ్యాణోత్సవం, ఆ మర్నాడు భీష్మఏకాదశి రోజున రథయాత్రను నిర్వహిస్తారు. 2015 అక్టోబర్17,18 తేదీల్లో ఇక్కడ ప్రపంచ తెలుగు కవితోత్సవాన్ని భారీ ఎత్తున నిర్వహించారు. డా॥ కత్తిమండ ప్రతాప్ కన్వీనర్‌గా వ్యవహరించారు.

పామర్రు

పామర్రు పేరుతో మండలం ఉంది. అయితే మండల కేంద్రం మాత్రం గంగవరం. పామర్రు గ్రామం ఆకారం పాము కంఠం వలె ఉంటుంది. (అఱ్ఱు) అంటే కంఠం అని అర్థం. అంచేత ఈ గ్రామానికి పామర్రు అని పేరు వచ్చిందని చెబుతుంటారు. అరటి, చెరకు, పొద్దుతిరుగుడు, పచ్చని పొలాలు, చెరువులు పల్లె వాతావరణాన్ని ప్రతిబింబిస్తాయి.

రామచందాపురం

త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు వనవాసం చేస్తున్న సమయంలో ఆయోధ్య నుంచి కాలినడకన వస్తూ భద్రాచలం సమీపంలో పంచవటి నిర్మించదలిచాడు. ఈ నిర్మాణానికి ముందు రెండు చోట్ల మజిలీ చేశాడు. ఆయన మజిలీ చేసిన రెండో ప్రాంతం కాకినాడకు సమీపంలో ఉంది. శ్రీరాముడు మజిలీ చేసిన ప్రాంతం కావడంతో రామచంద్రాపురం అనే పేరు వచ్చింది. కాగా మొదట మజిలీ హైదరాబాదు సమీపంలో ఉంది. దానిని కూడా ఆప్రాంతీయులు రామచంద్రాపురం అని పేరు పెట్టారు.

రావులపాలెం

ఇది కోనసీమకు గుండెకాయలాంటిది. దీని తొలి పేరు పాలెం. అయితే దీనికి ఆ పేరు ఎలా వచ్చిందంటే ఇక్కడి వారంతా రామాయణపారాయణం చేస్తుంటారు. స్థానికంగా పురాతన రామాలయం ఉంది. దీన్ని రూ. కోటి వ్యయంతో పునరుద్ధరించారు. శ్రీరామ భక్తుల నిలయం కావడంతో దీనికి రాముని పాలెం అనే పేరు వచ్చింది. లోక వ్యవహారంలో రావులపాలెంగా మారిందని డా॥ ఆకొండి విశ్వనాథం పేర్కొన్నారు. రావులపాలెం పేరు రావడానికి మరో కథనం కూడా ప్రచారంలో ఉంది. ఆ రోజుల్లో ఆంగ్లపాలకులు ఎక్కువగా ఇక్కడ స్థావరంగా ఏర్పాటు చేసుకొని ఉండేవారు. ప్రతిభావంతులైన జమీందారులకు రావుబహద్దూర్ వంటి బిరుదులను ప్రదానం చేసే చేసేవారు. అంచేత రావులపాలెం అనే పేరు వచ్చినట్టు కూడా చెబుతారు. రావులపాలేన్ని చౌరస్తాగా పిలుస్తారు. ఎంచేతనంటే ఇక్కడి నుంచి కాకినాడ-విశాఖ, అమలాపురం-యానాం, ర్యాలీ, అలాగే తణుకు, హైదరాబాదు వెళ్ళేందుకు ఈ గ్రామం కూడలిగా ఉంది.

మండపేట

అతిపురాతన కాలంలో మానవునికి పచ్చి ఆహారమే దిక్కు. ఆ పిమ్మట మనిషి నిప్పును కనుగొన్నాడు. దక్షిణభారతంలో తొలిసారిగా రెండు రాళ్లు రాపిడి చేస్తే నిప్పు పుడుతుందని ఇదే ప్రాంతంలో కనుగొన్నారు. అప్పటిలో ఈ ప్రాంతంలో పట్టుమని పది కుటుంబాలు కూడా ఉండేవి కావు. దాంతో మంటను కనుగొన్న పేటగా పిలిచేవారు. ఆ తరువాత దీన్ని మంటలూరు అని పిలిచేవారు. తరువాత మంటపేట అని కూడా జనవ్యవహారంలో ఉండేది. కాలక్రమంలో మంటపేట, మండపేటగా మారింది.

తాపేశ్వరం

తాపేశ్వరం మండపేట మండలంలోని ప్రసిద్ధి చెందిన గ్రామం. తాపేశ్వరం అనగానే నోరూరించే కాజాలు గుర్తుకు వస్తాయి. అయితే స్థల పురాణం ప్రకారం ఈ గ్రామానికి ఉన్న చరిత్రను పరిశీలిద్దాం. ఈ గ్రామంలోని అగస్తేశ్వరస్వామి వారి వలన మరీ ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయంలోని మూలవిరాట్ శివుడ్ని అగస్త్యేశ్వరుడు అనే తాపసి (ఋషి) ప్రతిష్ఠించాడు. దీంతో ఈ గ్రామం తాపసి ఈశ్వర గ్రామంగా ప్రజలు నామకరణం చేశారు. ఆ తరువాత క్రమంగా ఇది తాపేశ్వరంగా మారింది. అయితే తాపేశ్వరం తొలిపేరు 'వాతాపిపురం'. క్రమంగా ప్రజల నాలుకల్లో తాపేశ్వరంగా మారిందని మరి కొందరి అభిప్రాయం. ఈ గ్రామానికి 120 ఏళ్ల చరిత్ర ఉన్నట్టు చెబుతారు.

గొల్లప్రోలు

ఇది మండల కేంద్రం. శ్రీకృష్ణుడు చిన్నప్పుడు బాగా అల్లరి చేసేవాడనీ.... వాళ్లమ్మ యశోద రుబ్బురోలుకు బాలుడ్ని తాడుతో కట్టేసిందని మనకు తెలుసు. అయితే యాదవులను గొల్లలని కూడా పిలుస్తారు. ఆనాటి కాలానికి చెందిన రుబ్బురోళ్లు తదనంతర కాలంలో హెచ్చు సంఖ్యలో దొరికాయి. దీంతో ఈ ప్రాంతాన్ని గొల్లల రోలుగా పిలిచేవారు. జనవ్యవహారంలో గొల్లప్రోలుగా ఈ గ్రామనామం స్థిరపడింది. ఇక్కడ ఎర్రపత్తిని ఎక్కువగా పండిస్తారు.

బిక్కవోలు

బిక్కవోలు మండల కేంద్రం. ఈ గ్రామంలో తూర్పు చాళుక్యుల కాలానికి చెందిన అనేక పురాతన ఆలయాలు వెలిశాయి. క్రీ.శ. 849-892 మధ్యకాలంలో తూర్పు చాళుక్యరాజు మూడవ గుణగ విజయాదిత్యుని పేరుమీద ఈ ఊరికి ఆ పేరు వచ్చింది. అయనకు బిరుదాంకితుడు అనే బిరుదు ఉండేది. ఆ రాజు పాలించడం వల్ల ఈ గ్రామానికి బిరుదాంకితవోలుగా పిలిచేవారు. కాలక్రమంలో ఇది బిక్కవోలుగా మార్పు చెందింది.

కుయ్యేరు

ఈ పల్లె కాజులూరు మండలంలోనిది. గోదావరి పరీవాహక ప్రాంతంలో ఈ గ్రామం ఉంది. ఇక్కడ కాలువలో నీరు ప్రవహిస్తుంటే కుయ్...కుయ్... మంటూ విచిత్రమైన శబ్దాలు వచ్చేవి. ఈ సెలయేటి ధ్వనులకు తొలుత ప్రజలు భయపడేవారు. తర్వాత అలవాటు అయిపోయింది. కుయ్... అంటూ అరిచే ఏరు ఉన్న ఈ ప్రాంతం కుయ్యేరుగా (కుయ్+ఏరు) మారింది. కాలం గడిచే కొద్ది ఏటి నుంచి ఎలాంటి శబ్దాలు రావడం లేదు. అయినా ఈ ప్రాంతం కుయ్యేరు పేరుతోనే స్థిరపడింది.

ఆదుర్రు

ఇది మామిడికుదురు మండలంలో ఉంది. ఈ గ్రామం వైనతేయ నది తీరంలో ఉంది. ఆశోకుడు నిర్మించిన మూడు దివ్య స్థూపాలలో ఒకటైన ఆదుర్రు స్థూపం ఈ ప్రాంతంలో బయటపడింది. ఈ స్థూపం పేరుతోనే ప్రజలు తాము ఉంటున్న ప్రాంతానికి ఆదుర్రు అని నామకరణం చేశారు.

తలుపులమ్మలోవ

తుని పట్టణానికి సమీపంలో ఉంది. ఇది ప్రాచీన దేవస్థానం. పచ్చని ప్రకృతి ఒడిలో తీగకొండ, ధారకొండ అనే రెండు కొండల మధ్య లోయలో రాతినే ఆలయంగా చేసుకొని అమ్మవారు కొలువై ఉన్నారు. మధ్యలో తలుపులమ్మదేవత, ఒక వైపు సోదరుడు, మరో వైపు అమ్మవారి ప్రతిరూపం కనిపిస్తుంది. తూర్పు గోదావరి జిల్లాలో అన్నవరం తరువాత అధిక ఆదాయం

వస్తున్న ఆలయం ఇది. తలుపులమ్మను ప్రయాణ అధిదేవతగా భావిస్తారు. ఆయురారోగ్యాలను ప్రసాదించే తల్లిగా ఇక్కడే కొలువు తీరమని ఆగస్త్యుడు వేడుకుంటాడు. తలంపులను తీర్చే తల్లిగా తలుపులమ్మగా తమ గ్రామానికి పేరు పెట్టుకున్నారు. కాలక్రమంలో లోయ లోవగా మారింది. ఇలా తలపులమ్మలోవ ఏర్పడింది.

కాట్రేని కోన

ఇది మండల కేంద్రం. కాకినాడకు 43 కి.మీ దూరంలో ఉంది. ఈ గ్రామంలో పంచక క్షేత్రం ఉంది. ఇది ప్రాచీన కాలంలో కాట్రేని దేవత వెలసిన పుణ్యభూమి. ఈ పేరు మీదగానే కాట్రేని కోన గ్రామం వెలసింది. ఇక్కడ కాట్రేడు కనకలింగేశ్వరస్వామిగా, కాట్రేని మాఉళ్లమ్మగా, శ్రీహరి కళ్యాణ వేణుగోపాలస్వామిగా, సుబ్రహ్మణ్యేశ్వరస్వామిగా, కార్తికేయునిగా వెలసిన పంచక క్షేత్రం ఇది.

ధవళేశ్వరం

ఇది రాజమండ్రి లో కాటన్ దొర నిర్మించిన ఆనకట్ట గల ప్రాంతంలో ఈ గ్రామం ఉంది. త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు ఇక్కడ ధవళ లింగాన్ని ప్రతిష్ఠించాడు. ధవళలింగం అంటే తెల్లనైన లింగం అని అర్థం. ఈ లింగం పేరుతోనే ఈ ప్రాంతానికి ఈ పేరు వచ్చింది.

కోరుకొండ

ఇది మండల కేంద్రం. రాజమహేంద్రవరం నుండి ఉత్తర దిశగా గోకవరం వెళ్లే మార్గంలోని కొరుకొండ గ్రామంలో ఎత్తయిన కొండపై శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం ఉంది. 120మీటర్ల ఎత్తులో ఉన్న ఆలయాన్ని చేరుకోడానికి 615 మెట్లు ఉన్నాయి. కొండ పై కొలువై ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని కొలిస్తే కోరుకున్న కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. ఈ నమ్మకం తోనే ఈ ప్రాంతానికి కోరుకొండగా పిలుస్తారు. ఇది ప్రాచీన దివ్య క్షేత్రం. ఈ కొండ పైన రామ పాదాలు, ఆంజనేయ పద్మనాభ స్మామి ఆలయాలు

ఉన్నాయి. ముఖమండపము నందు ఉత్తర,దక్షిణాది ముఖాలుగా ఉన్న రెండు ఉపగర్భాలయాల లో లక్ష్మీదేవి, గోదాదేవి కొలువు తీరి ఉన్నారు. దీన్ని 108 వైష్ణవ దివ్య క్షేత్రాలలో ఒకటిగా చెబుతారు. ఈ దేవాలయాన్ని క్రీ.శ 1353లో చాళుక్య రాజులు నిర్మించినట్లు శాసనాల వల్ల తెలుస్తోంది.

చింతలూరు

ఇది ఆలమూరు మండలంలో ఉంది. చింతలూరు అని దీనికి ఆ పేరు ఎలా వచ్చిందంటే... చింతలు తీర్చే ఊరు ఇది. ఎవరికైనా అనారోగ్యం కలిగితే శారీరకంగా, మానసికంగా కుంగిపోతారు. నివారణ కోసం వైద్య సహాయం తీసుకుంటారు. ఆయుర్వేదానికి ఈ ఊరు ఎంతో ప్రసిద్ధి చెందింది. వైద్యానికి ప్రతి రూపమైన ధన్వంతరీస్వామి వారి ఆలయం ఇక్కడ నెలకొని ఉంది. ఆయుర్వేద వైద్య శాస్త్రానికి అధి దేవత ధన్వంతరీస్వామి. ఈ స్వామిని సేవిస్తే దీర్ఘరోగాలు కూడా మటుమాయమై సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని భక్తుల విశ్వాసం. ఆశ్వయుజ బహుళ త్రయోదశినాడు ధన్వంతరిస్వామి వారి జయంతి ఉత్సవాలు జరుగుతాయి.

కేశనకర్రు

కోనసీమలో ఉన్న ఈ ప్రదేశం అంతా కొబ్బరితోటలతో కళకళ లాడుతుండేది. గోదావరి పరీవాహక ప్రాంతంలో నెలకొని ఉంది. ఈ నది కుండలేశ్వరం వద్ద సముద్రంలో కలుస్తుంది. పూర్వం వేదవ్యాసుడు ఇక్కడ కొంత కాలం నివశించాడు. ఆయన నాలుగు వేదాలను విభజించి రాశాడు. వ్యాసుడు తొలుత వారణాసిలో ఉన్నప్పుడు శివుని కోపానికి గురై తన శిష్యులతో ఈ ప్రాంతానికి వస్తూ మొదటిగా ద్రాక్షారామంలో భీమేశ్వరుడుని దర్శిస్తాడు. మురిమళ్ళ పల్లెలో భద్ర కాళీసమేత వీరభద్రున్ని పూజించి ఈ ప్రదేశానికి వచ్చాడు. అక్కడ మొదలుగా వృద్ధ గౌతమీ మాతకు పూజలు చేసి శివున్ని ప్రతిష్ఠించి దీనిని మరో కాశీపట్నంగా ప్రసిద్ధి చేస్తానన్నాడు. అతని అంతరాత్మ నుంచి ఈ ప్రదేశానికి "కాశీ నూరు ఫలంకురు" అని వినిపించిందట. అప్పటి నుంచి ఈ గ్రామం కాశీనకురు గ్రామంగా పిలవబడుతూ కాలక్రమంలో కేశనకర్రుగా మారింది.

ఈ నదీ ప్రాంతంలో ఉమామహేశ్వర్లుతోపాటు వేణుగోపాలస్వామి, సీతారామ, లక్ష్మణ హనుమంత సహిత దేవాలయాలు శ్రీవల్లీ దేవసేన సహిత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయం అందరిని ఆకర్షిస్తుంటాయి. ఈ గ్రామం పోలవరం మండలంలో ఉంది.

సామర్లకోట

ఇది ప్రముఖ రైల్వే కూడలి. ఈ ప్రాంతంలో కాటయ వేమారెడ్డి తవ్వకాలు జరపగా ఓ అపురూప విగ్రహం క్రీ.శ. 1400ల్లో దొరకింది. ఈ దేవికి ఆయన శ్యామలాదేవి అని నామకరణం చేశారు. ఆ పక్కనే ఓ కోట కూడ కట్టించారు. శ్యామల కోట క్రమేణా సామర్లకోటగా మారింది. ఇక్కడ ప్రసిద్ధి చెందిన భీమేశ్వరాల యం ఉంది. ఇది పంచారామాలలో ఒకటి. దీన్ని కుమారారామం అని, స్కందారామంఅని కూడా పిలుస్తారు. భీముడనే చాళుక్యరాజు నిర్మించాడని చరిత్ర చెబుతోంది. నవయుగ భానుడు కందుకూరి వీరేశలింగం రాసిన "రాజశేఖరచరిత్ర"లో ఈ ఊరి ప్రస్తావన ఉంది.

ఏలేశ్వరం

ఇది గోదావరి తీరంలోని ఓ మండల కేంద్రం. ఐతిహ్యం ప్రకారం ఏల అనే మహర్షి ఈ ప్రాంతంలో తపస్సు చేశాడు. అంచేతనే ఈ ప్రాంతం ఏలేశ్వరంగా విరాజిల్లుతోంది. మన్య ప్రాంతం నుంచి వచ్చే గిరిజనులు ఇక్కడ తమ వ్యాపారాలు సాగిస్తుంటారు.

పట్టుచీర

పట్టుచీర గ్రామం ఏటపాక మండలంలో ఉంది. ఇది గిరిజనులు నివశించే పల్లె అంతకు ముందు ఇది భద్రాచలం మండలంలో ఉండేది. అయితే 2014లో రాష్ట్ర విభజన నేపథ్యంలో ముంపు మండలాలను ఆంధ్రప్రాంతంలో విలీనం చేసే క్రమంలో ఈ పల్లె తూర్పు గోదావరి జిల్లాలో విలీనమైంది. ఇంతకి ఆ ఊరు పేరు చూసి అక్కడ పట్టు వస్త్రాలు నేస్తారని అనుకుంటే పొరపాటే అవుతుంది. సంచార జీవులైన కోయలు ఎక్కడ నివాసం ఉంటే అక్కడ ఏమి ఆలోచించకుండా తమకు నచ్చినపేరును పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తుంది.

అర్తమూరు

ఇది మండపేట మండలంలో నెలకొని ఉంది. అర్థపురి, అర్ధమూరు ఈ గ్రామానికి పూర్వ నామాలు. ప్రజల నుంచి వసూలు చేసిన శిస్తులు, పన్నుల మొత్తాన్ని (అర్థం) ఇక్కడ భద్రపరిచే కోశాగారం ఉండేది. అందుచే ఈ గ్రామానికి అర్థమూరుఅనే పేరు వచ్చింది. తరువాత అత్తమూరు, అరతమూరుగా పిలిచేవారు. ప్రస్తుతం అర్తమూరుగా స్థిరపడింది. ఇదే పేరుతో ఇదే జిల్లాలో కోటనందూరు సమీపాన, విజయనగరం జిల్లా గరివిడి మండలంలోను, కృష్ణాజిల్లా బంటుపల్లి మండలంలోనూ గ్రామాలున్నాయి. అలాగే పశ్చిమగోదావరి జిల్లాలో ఉండి మండలంలోనూ అర్తమూరు ఉంది. ప్రసిద్ధ రచయితలు పింగళి సూరన, పింగళిలక్ష్మీకాంతంలు ఈ ఊరివాళ్లే. అర్తమూరు గురించి మరిగంటి పెదవెంకటాచార్య "మహిని గోదావరీ మండలంబునకు / సద్భూషణంబున నర్తమూరు గ్రామ / మలరుచుండును" అంటూ తన "శ్రీమంతకమణి ప్రభావం"లో ప్రస్తుతించారు.

శివకోడు

ఇది రాజోలుకు 2 కి.మీ దూరంలో ఉంది. శివలింగంపై నిత్యం గంగ ఉద్భవిస్తోంది. కోడు అనేది జలసూచిక. దీంతో ఈ ప్రాంతానికి (గ్రామానికి) శివకోడు అని పేరు వచ్చింది.

ఏడుగుర్రాలపల్లె

ఇది ఏజెన్సీ ప్రాంతంలోని చింటూరు మండలంలో ఉంది. గతంలో ఈ పల్లెలో ఏడు గుర్రాలు ఉండేవి. దీంతో ఈ గ్రామానికి ఏడు గుర్రాల పల్లె అనే పేరు వచ్చింది. ఈ పంచాయితీ పరిధిలో టేకు తదితర వృక్షాలు ఉండేవి. వీటిని నరకి గుర్రాల మీద రవాణా చేసేవారు. ఆంగ్లేయులు తమ ప్రయాణాల కోసం వీటిని వినియోగించేవారు. కాగా గుర్రాలను ఈ ప్రాంతంలోనే మేపేవారు. ఈ గుర్రాలను దృష్టిలో ఉంచు కొని ఈ పల్లెకు ఏడు గుర్రాల పల్లె అని తొలిసారిగా ఆంగ్లేయులు పిలిచారు. ఆ పేరే శాశ్వతంగా స్థిరపడింది. ఈ విషయాన్ని ఆ గ్రామ సర్పంచ్ వై. అర్జున్ ఈ రచయితతో మాట్లాడుతూ ధ్రువీకరించారు.

ముమమల్ల

ఈ గ్రామం ఐ.పోలవరం మండలంలో ఉంది. గౌతమీ నదీ తీరంలో నెలకొని ఉంది. సప్తమహర్షులు తపస్సు చేసిన పుణ్యభూమి ఇది. గోదావరి డెల్టాలో రెండు పాయలు మధ్య భాగంలో ఉన్న ముమమల్ల లంక గ్రామాలకు ముఖద్వారంగా ఉంది. అమలాపురం-కాకినాడ జాతీయ రహదారి ఈ ఊరి మీదుగా వెళ్తోంది. పూర్వ కాలంలో ఇక్కడ ఎటువైపు చూసిన మునులు గుంపులు, గుంపులుగా తపస్సు చేసుకొంటూ కనిపించేవారు. దీంతో ఈ గ్రామానికి మునిమందల అని పేరు వచ్చింది. ఇదే కాలక్రమంలో ముమమల్లగా మారిందని చెబుతారు. కనుచూపు మేరను ఆవరించుకొని ఉండే కొబ్బరి చెట్లతో కోనసీమ అందచందాలకు ప్రతిరూపంగా దర్శనమిస్తుంది ఈ గ్రామం. ఇక్కడ భద్రకాళి సమేత వీరేశ్వరస్వామి దేవాలయం ప్రసిద్ధి చెందింది. ఈ గుడిలో భద్రకాళి, వీరేశ్వరులకు కళ్యాణం చేయిస్తే పెళ్లి కాని వాళ్లకు వెంటనే పెళ్ళిళ్లు అవుతాయని భక్తుల విశ్వాసం. కుమ్మరి సారె, గానుగ చప్పుడు, యంత్రాల శబ్దాల స్వామివారికి వినబడకూడదు.

కడలి

ఇది జగ్గంపేట సమీపంలో ఉంది. ఒకసారి ఏమైందంటే.. ఓ వేటగాడు పక్షులను వేటాడి, వేటాడి బాగా అలసిపోతాడు. మిట్టమధ్యాహ్నం వేళ అయింది. ఓ చెట్టు కింద విశ్రమిస్తాడు. ఆకలి విపరీతంగా వేస్తున్నా ఏమీ దొరకని పరిస్థితి. ఆ చెట్టు కొమ్మల మీద ఉన్న ఆడకపోతం వేటగాడ్ని అతిథిగా భావిస్తుంది. తన గూడుకు నిప్పంటించి శరీరాన్ని ఆహుతిస్తుంది. ఆ తరువాత వచ్చిన మగ పావురం కూడా మంటల్లో పడి మరణిస్తుంది. వేటగాడికి ఆహారంగా ఇవ్వాలని ఇలా ఆత్మ త్యాగానికి పాల్పడ్డాయి. అయితే వేటగాడు సైతం మంటల్లో పడి చనిపోతాడు. పరమేశ్వరునితో పాటు దేవతలంతా నివ్వెరబోయి ఈ త్యాగ సంఘటనను తిలకించేందుకు కడలిలా తరలివస్తారు. జంట కపోతాలకు, వేటగానికి మోక్షాన్ని ప్రసాదిస్తారు. అంచేత ఈ ప్రాంతానికి కడలి అనే పేరు

వచ్చింది. ఇక్కడ ఈశ్వరుణ్ణి కపోతేశ్వరునిగా పిలుస్తారు. ఈ ఆలయంలో శివ లింగంపై రెండు పావురాలు నందీశ్వరుని వెనుక భాగంలో వేటగాడి బమ్మ కలదు. గుడి ముందున్న కపోతగుండంలో మాఘమాసంలో ప్రతీ ఆదివారం గంగాదేవి అంతర్వాహినిగా ప్రవహిస్తుంది.

అయినవిల్లి

ఇది మండల కేంద్రం. కాకినాడకు 72 కి.మీ దూరంలో ఉంది. ఇక్కడి వరసిద్ధి వినాయక దేవాలయం చాలా పురాతనమైంది. కృతయుగం నుంచి ఉన్నట్టుగా చెబుతున్నారు. ఆది గణపతిగా పూజలందుకొంటున్నాడు. తొలిసారి చూసినప్పుడు మామూలుగా దర్శనమిస్తాడు. అలంకారం చేసినపుడు కాణిపాకం వినాయకునిలా కోటి ప్రభలతో సాక్షాత్కరిస్తాడని ప్రఖ్యాత సాహితీ, ఆధ్యాత్మిక వేత్త డా॥ ఆకొండి విశ్వనాథం (ఒంగోలు) అన్నారు. అయినవిల్లి అనే పేరు ఎలా వచ్చిందంటే... ఆయన ఇల్లు (వినాయకుని ఇల్లు) ఇది అని అంటారు. కాలక్రమంలో అయినవిల్లిగా మారినట్టు ఈ గ్రామాన్ని సందర్శించిన రచయితకు పలువురు తెలిపారు. కాగా శివ కుటుంబం ఇక్కడ వెలిసినట్టు చెబుతారు.

పాలెపులంక

ఇది అయినవిల్లి మండలం, మాగాం పంచాయితీలో ఉంది. పాలెపు ఇంటిపేరు గల వారు ఇక్కడ కొత్తగా గ్రామాన్ని ఏర్పాటు చేసుకొవడంతో దీనికి ఆ పేరు వచ్చినట్టు విశ్రాంత అర్థశాస్త్ర అధ్యాపకులు పారుపూడి విశేశ్వరరావు ఈ రచయితకు తెలియజేసారు.

నామాలవారిపాలెం

ఇది అయినవిల్లి మండలం మాగాం పంచాయితీలోని మరో గ్రామం. నామాల వంశీయులు కొత్త గా ఈ ప్రాంతంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకొన్నారు. ఈ వంశం పేరుతోనే నామాలవారిపాలెం అవతరించింది.

జోగిరాజుపాలెం

ఇది అయినవిల్లి మండలం మాగాం పంచాయితీలోనే ఉంది. జోగిరాజు అనే ప్రముఖ వ్యక్తి సారథ్యంలో ఈ గ్రామం ఏర్పడింది. ఆయన పేరు తోనే ఈ గ్రామం ఏర్పాటైంది.

అంబాజీపేట

అంబాజీపేట పేరుతో మండలం ఉన్న మాట వాస్తవమే. అయితే మండల కేంద్రం మాచవరం. అంబాజీ పేట మాచవరం పంచాయితీలో ఓ గ్రామం మాత్రమే. అంబాజీపేట కొబ్బరి మార్కెట్టు, అంబాజీపేట ఆముదం అనే పేర్లతో సంస్థలు ఉన్నప్పటికీ అవన్నీ మాచవరంపంచాయితీలోనే ఉన్నాయి. బయటి ప్రపంచం మాత్రం మాచవరాన్ని అంబాజీపేటగానే వ్యవహరించడం విశేషం. ఇంతకీ అంబాజీపేటకు ఆ పేరు ఎలా వచ్చిందంటే ఈ పల్లెను అమ్మాజీ అనే మహిళ శంకుస్థాపన చేసినందువల్ల అమ్మాజీపేట అనే పేరు వచ్చింది. జనవ్యవహారంలో అమ్మాజీపేట కాలక్రమంలో అంబాజీపేట గా రూపాంతరం చెందింది.

పలివెల

ఇది కొత్తపేట మండలానికి 3 కి.మీ. దూరంలో ఉంది. పల్లవుల పాలన ప్రభావంవల్ల ఈ గ్రామానికి పల్వలపురం అనే పేరు వచ్చింది. కాలగమనంలో పలివెలగా మారింది. ఇక్కడగల శ్రీఉమాకొప్పులింగేశ్వరస్వామి దేవాలయం ఎంతో ప్రసిద్ధిచెందింది. ఈ శివలింగానికి స్త్రీలవలె తలపై కొప్పు ఉండడం విశేషం. ఈ లింగాన్ని అగస్త్యుడు ప్రతిష్ఠించాడు.

పశ్చిమ గోదావరి జిల్లా

ఏలూరు

పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రమిది. ఇది అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గ కేంద్రం కూడా. "ఏల" అన్న చిన్న ఏరు పట్టణ పరిసరాలలో ప్రవహిస్తుండేది. దీంతో ఈ పట్టణానికి ఏలూరు అనే పేరు వచ్చింది. ఈ విషయాన్ని ప్రముఖ భాషాశాస్త్రవేత్త బూదరాజు రాధాకృష్ణ ధ్రువీకరించారు. ఏలు+ఊరు=ఏ లూరు (ముఖ్యపట్టణం) అనే అర్థాన్ని ఇస్తున్నట్టు "ఆంధ్రదేశ చరిత్ర భూగోళ సర్వస్వం" వల్ల తెలుస్తోంది. ఏలూరు పేరును సంస్కృతీకరించి 'హేలాపురి' అని పిలుస్తారు. విశేషం ఏమిటంటే ఏలూరులో హేలాపురి పేరుతో అనేక సంస్థలు ఏర్పాటు కావడం కొసమెరుపు. కాగా హేలాపురి పేరుతో విశాఖపట్నంలో సైతం హేలాపురి విందు భోజనం పేరుతో ఓ ప్రసిద్ధమైన హోటల్ ఏర్పాటైంది. ఏలూరులో ప్రముఖ విద్యావేత్త సి.ఆర్.రెడ్డి పేరుతో ప్రసిద్ధ విద్యా సంస్థలు వెలిసాయి

పాలకొల్లు

ఇది పంచారామాలలో ఒకటి. పూర్వం ఉపమన్యుడు అనే బాలభక్తుడు ఈ ప్రాంతంలో పాలకై ప్రార్థించగా ఈశ్వరుడు ప్రత్యక్షమై తన త్రిశూలాన్ని ఇక్కడ నేలపై గుచ్చాడు. అప్పుడు భూగర్భం నుండి క్షీరం(పాలు) ఉద్భవించింది. అందుచే ఈ ప్రాంతం క్షీరపురిగా వాసికెక్కింది. ఇదే కాలగమనంలో పాలకొల నుగా మారింది. ఆ తరువాత పాలకొల్లు పేరుతో శాశ్వతంగా స్థిరపడింది. ఇక్కడ వెలసిన క్షీరరామలింగేశ్వరుడు నిత్యపూజలు అందుకుంటున్నాడు. తెల్లగా పాలవలె మెరిసే రెండున్నర అడుగుల ఎత్తున్న శివలింగం ఎంతో ప్రసన్నంగా భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఈ శివలింగంపై గల నొక్కులు కుమారస్వామి తారకాసురుని వధించినపుడు అమృతలింగానికి తగిలిన బాణాల దెబ్బలని భక్తుల విశ్వాసం. అమృత లింగాన్ని బ్రహ్మాది దేవతలు వెంటరాగా శ్రీమహావిష్ణువు

ఇక్కడ ప్రతిష్ఠించాడు. శివుని కోరిక పై క్షేత్ర పాలకుడుగా లక్ష్మీసమేతుడై జనార్దనస్వామిగా ఈ క్షేత్రంలో కొలువైనాడు. మొదట చాళుక్య భీముడు ఈ ఆలయాన్ని నిర్మించినట్టు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. దక్షిణ భారతీయ శిల్పకళ రీతులతో ఉండే ఈ ఆలయానికి ప్రధాన ఆకర్షణ గాలిగోపురం. ఇది 125 అడుగుల ఎత్తులో 9 అంతస్తులుగా ఉంది. ఈ గోపురం పై అంతస్తు వరకు ఎక్కేందుకు మెట్లు ఉన్నాయి.

ఆచంట

ఒడయనంబి అనే శివభక్తుడు చన్నును పూజించడంతో ఏర్పడిన శివలింగం ఇక్కడ ఉందని ఐతిహ్యం చెబుతుంది. పౌరాణిక ప్రసిద్ధి పొందిన విషయం ఆ చంట(ఆ చన్నున) శివుడు వెలసిన కారణంగా ఆయనను ఆచంటేశ్వరుడు అని అంటారు. ఈ గ్రామాన్ని ఆచంట అనే పేరుతో పిలుస్తుంటారు. శృంగవరపు కోట దాన శాసన గ్రహీత మాతృశర్మ ఆచంట గ్రామస్థుడని క్రీ॥శ॥ ఐదవ శతాబ్దినాటి శాసనం పేర్కొంటోంది. దీన్ని బట్టి అప్పటికే ఆచంట అన్న పేరు ఉండేదని స్పష్టం అవుతుంది. కాగా క్రీ॥శ॥ 1256లో ఆచంట సూర్వరాజుకు అప్పటి ప్రభువు మైలారదేవిని ఇచ్చి పెళ్లి చేశాడు. ఆచంట రామేశ్వరులకు పోకతోటలు సమర్పించినట్లు శాసనాలు చెబుతున్నాయి.

భీమడోలు

ఇది మండల కేంద్రం. ఐతిహ్యం ప్రకారం పాండవులు అరణ్యవాసం చేస్తున్న సమయంలో భీముడు బకాసురుడుకి ఆహారంగా వెళ్లవలసి వచ్చింది. అప్పుడు బకాసురుడుతో భీముడు హోరాహోరీగా భీమీలి ప్రాంతంలో యుద్ధంచేశాడు. కొన్ని రోజులు, వారాలపాటు నిర్విరామంగా జరిగిన ఆ పోరాటంలో భీముడు బకాసురుడు తోలువలచి డప్పుగా వాయించాడు. వాయించి... వాయించి... చివరకు విసుగెత్తి ఆ డోలును దూరంగా విసిరేశాడు. భీముడు విసిరిన ఆ డోలు పడే చోటు కాబట్టి ఆ ప్రాంతాన్ని భీమడోలు అని పిలుస్తున్నారు. ఏలూరు నుంచి ద్వారకాతిరుమల వెళ్లే మార్గంలో ఉంది.

ద్వారకాతిరుమల

పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రసిద్ధి పొందిన పుణ్య క్షేత్రాలలో ద్వారకా తిరుమల ఒకటి. పూర్వము ద్వారకుడు అనే ముని కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామి గురించి ఘోర తపస్సు చేశారు. స్వా మి ప్రత్యక్షమై ఆయన కోర్కెలను తీర్చాడు. ఆ ముని అంతకముందు ఎన్నో ఏళ్ల పాటు తిరుమల - తిరుపతికికాలినడకన వెళ్లి స్వామిని సందర్శించేవాడు. ఆయన పేరు మీదనే ద్వారకా తిరుమల ఏర్పడింది. ఈ క్షేత్రం తిరుమల-తిరుపతి తరహాలోనే ఉంటుంది. దీన్ని చిన్న తిరుపతి అని కూడా పిలుస్తుంటారు. ఈ క్షేత్రాన్ని దర్శిస్తే తిరుమల-తిరుపతిలో పొందిన అనుభూతినే భక్తులు పొందుతారు. ఈ స్థల పురాణ గూర్చి కృత యుగంలోనే ప్రస్తావించడం విశేషం. ఇక్కడ కొలువుండే వేంకటేశ్వరస్వామి రెండు రూపాలుగా మనకు కనిపిస్తాడు. ముందు భాగం కేవలం సగానికే ఉండి, మిగతా భాగం పాతాళంలో ఉన్నట్టుగా అనిపిస్తోంది. ఈ పురాతన పుణ్యక్షేత్రం సనాతన సంప్రదాయాలకు ఆదర్శమై భక్తులకు ఆపదల నుండి విముక్తి చేస్తూ కొర్కెలను తీర్చే దేవునిగా ప్రసిద్ధి చెందాడు.

అత్తిలి

అత్రి మహర్షి పేరుతో ఈ గ్రామం ఏర్పడింది. తపోభూమిగా ప్రసిద్ధి చెందింది. మొదట అత్రి అనే పదం కాలక్రమంలో అత్తిలిగా రూపాంతరం చెందింది. అత్రి మహర్షి ఆరాధించిన శివలింగమే ఉమాసిద్ధేశ్వరస్వామి అని ఇతిహాసం వల్ల తెలుస్తోంది. ఆ రోజుల్లో అత్రి మహర్షి బోధనలను నాటి పెద్దలు ప్రజలకు వివరించేవారు. అత్రి మహర్షి అత్రి సంహితలో యోగ శాస్త్రం గూర్చి పితృమేధం, ఆచారాలు, గురుప్రశంస, వర్ణధర్మం, జపమాల తదితర విషయాలు గూర్చి వివరించారు.

గరగపర్రు

గర్గ ఋషి తపస్సు చేసిన గొప్ప ప్రాంతం ఇది. ఆయన పేరుతోనే గరగపర్రు ఏర్పడింది. పర్రు అంటే గ్రామమని అర్థం. ఇది పాలకోడేరు మండలంలో

ఉంది. తపోభూమిగా ప్రసిద్ధి చెందింది. మరో ఇద్దరు యోగులు కూడా ఇక్కడ తపస్సు చేశారు. అన్నమాచార్యులు కూడా ఈ గ్రామాన్ని సందర్శించారు.

భీమవరం

పంచారామాలలో భీమవరం(గునుపూడి) ఒకటి. తూర్పు చాళుక్య రాజైన భీమ క్రీ.శ 890-918 సంవత్సరాల మధ్య ఇక్కడ సోమేశ్వర దేవాలయానికి భూమి పూజ చేశారు. అయితే తూర్పు చాళుక్య రాజైన 'భీమ' పేరుమీదనే ఈ పట్టణానికి భీమవరం అనే పేరు వచ్చింది. జాతీయోద్యమ కాలంలో గాంధీజీ భీమవరం విచ్చేసినపుడు రెండో బార్డోలిగా పేర్కొన్నారు. "ఆంధ్ర లాస్ వేగాస్" అనే పేరు కూడా ఉంది.

బ్రాహ్మణగూడెం

ఈ పల్లె చాగల్లు మండలంలో ఉంది. నిడదవోలు పట్టణానికి 4కి.మీ దూరంలో ఉంది. చాలా మంది ఈ ఊరు పేరును చూసి అందరూ బ్రాహ్మణులే ఉంటారని అనుకుంటారు. కాని ఇది నిజం కాదు. అన్ని ఊళ్లలో ఉన్నట్లే తగు మాత్రం బ్రాహ్మణులు ఉన్నారు. పూర్వం బాపన్న అనే వ్యక్తి ఈ ప్రాంతానికి వచ్చి తొలిసారిగా నివాసం ఏర్పాటు చేసుకున్నారు. కాలక్రమేణా చాలా మంది ఇక్కడకు వచ్చి స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. అయితే తొలిసారి బాపన్న వచ్చి ఇక్కడ గ్రామాన్ని ఏర్పాటు చేసినందున అతని పేరుమీదు గా బాపన్నగూడెంగా పిలుస్తూ వచ్చారు. కాలక్రమంలో ఇది బ్రాహ్మణగూడెంగా మారింది.

వీరవాసరం

ఆ ప్రాంతంలో ఓ పెద్ద వానరం(కోతి) ఉండేది. సహజంగానే కోతులు చిలిపిచేష్టలు చేస్తాయి. ఆ వానరం కూడా ప్రజలను ఇబ్బంది పెడుతుండేది. అయితే కోతులను మచ్చిక చేసుకునే ఓ యువకుడు ఆ ప్రాంతానికి వచ్చి ఆ వానరాన్ని మచ్చిక చేసుకున్నాడు. సామాన్య ప్రజలకు ఇబ్బంది లేకుండా చేశాడు. దీంతో ఈ ప్రాంతాన్ని వీరుడు పట్టుకున్న వానరపురంగా పిలిచేవారు. ఆ తరువాత దీన్ని వీరవానరంగా పిలిచేవారు. చివరకు జనవ్యవహారంలో వీరవాసరంగా దీన్ని పిలుస్తున్నారు. ఇది ఒక మండల కేంద్రం కూడా.

వేండ్రా

ఇది పాలకోడేరు మండలంలో ఉంది. వేండ్రా అంటే ఒక రకము కలుపు మొక్క దీన్ని అగ్ని వేండ్రా అని కూడా పిలుస్తారు. వేండ్ర రకం కలుపు మొక్కలు ఎక్కువుగా ఆ ప్రాంతంలో ఉండటంతో దీన్ని వేండ్రా అని నామకరణం చేశారు.

పెనుమంట్ర

తొలుత దీన్ని "గ్రామం" అని పిలవడం విశేషం. గ్రామంలో చాలా కాలం ముందు క్రమం తప్పకుండా కొన్నేళ్లు ప్రతి వేసవిలో అగ్ని ప్రమాదాలు జరిగేవి. గ్రామంలో ఏదో ఒక వైపు కాలిపోవుట జరిగేది. చుట్టు పక్కల గ్రామాల వారు పెద్దగా మండే మంటలను చూసి పెనుమంటలు మండుతున్నాయి అనే వారు. అది పరిపాటిగా జరగటంతో గ్రామాన్ని పెనుమంటగా పిలిచేవారు. వాడుకలో పెనుమంట్రగా మారి స్థిరపడింది.

పోడూరు

ఈ ప్రదేశంలో తొలుత కీకారణ్యం ఉండేది. అయితే కొందరు అడవిని చదును చేసి పోడు వ్యవసాయం చేసేవారు. దీంతో ఈ ప్రాంతాన్ని పోడు అని పిలిచేవారు. కొంత కాలం గడిచాక ఎంపిక చేసిన భాగాన్ని చదును చేసి నివాస యోగ్యం చేశారు. ఊరు కాస్త పెరిగిన తరువాత పోడు కు ఊరు చేర్చి పోడు ఊరుగా పిలిచేవారు. కాలక్రమంలో పోడూరుగా మార్పు చెంది స్థిరపడింది. ఇది ఒక మండల కేంద్రం.

కొవ్వూరు

ఇది పశ్చిమ గోదావరి జిల్లాలోని ముఖ్య పట్టణాలలో ఒకటి. ఈ జిల్లాకు స్వాగత ద్వారం. రాజమండ్రికి 7కి.మీ దూరంలో ఉంది. ఈ గ్రామంలో గోష్పాదక్షేత్రం ఎంతో ప్రసిద్ధి చెందింది. గౌతమి మహర్షికి పరమశివుడు గోవు రూపంలో దర్శనమిచ్చిన క్షేత్రం ఇది. అందుచేత దీన్ని గోష్పాదక్షేత్రమని ఆ మహర్షి స్తుతించారు. అందుకే దీనికి గోవూరు అనే పేరు వచ్చింది. క్రమంగా అది కొవ్వూరుగా స్థిరపడింది.

రాట్నాలకుంట

ఇది పెదవేగి మండలంలో ఉంది. ఈ గ్రామంలో రాట్నాలమ్మ తల్లి అనే గ్రామదేవత ఆలయం ఉంది. చాళుక్య చక్రవర్తుల ఇలవేల్పుగా ప్రఖ్యాతి చెందింది. భక్తుల పాలిట కొంగుబంగారంగా వాసికెక్కింది. రాట్నాలమ్మ పేరుతోనే ఈ ప్రాం తానికి రాట్నాలకుంట అనే పేరు వచ్చింది. ఈ ఆలయం ప్రక్కనే ఓ కొలను (కుంట) ఉండేది.

దువ్వ

ఇది తణుకు మండలంలో ఉంది. ఈ పల్లెలో దానేశ్వరి అమ్మవారు అనే దేవత కొలువై ఉన్నారు. పూర్వకాలం దువ్వకు దుర్వాసపురం అనే పేరు ఉండేది. దుర్వాసమహాముని గొప్ప తపస్సు చేసిన ప్రదేశం అయినందున ఈ ప్రాంతాన్ని పవిత్ర భూమిగా కొలుస్తుంటారు. దానేశ్వరి అమ్మవారిని దుర్వాసుడే ప్రతిష్ఠ చేశాడు. దుర్వాసుని పేరుతో తొలుత దుర్వాసునిపురంగా ఆ తరువాత జనవ్యవహారంలో దువ్వగా స్థిరపడింది.

తటికలపూడి

ఇది కామవరపుకోట మండలంలో ఉంది. ఏలూరుకు 20 కి.మీ దూరంలో ఉంది. ఈ పల్లెలో శ్రీగాంగేశ్వరస్వామి ఆలయం విశిష్టమైనది. ఈ ఆలయంలోని శివలింగం తళుకులీనుతూ ఉండటంతో ఈ గ్రామానికి తళుకుల పూడి అనే పేరు వచ్చింది. జనవ్యవహారంలో తటికలపూడిగా మారిందని చరిత్రకారుల అభిప్రాయం. పూడి అంటే ప్రవాహం సమీపంలో ఉన్న చిన్న గ్రామమని అర్థం. ఈ ఆలయాన్ని క్రీస్తు పూర్వం 800 ఏళ్ల క్రితం వేంగీచాళుక్యుల కాలంలో నిర్మించారు. ఇక్కడ శివలింగంపై సూర్యకిరణాలు పడినప్పుడు తళుకులీనుతూ ఉంటుంది.

హనుమాన్ జంక్షన్

పశ్చిమగోదావరి జిల్లా, కృష్ణాజిల్లా సరిహద్దు ప్రాంతమిది. ఇక్కడ ఆలయం నాలుగు రోడ్ల కూడలిలో ఉంది. శ్రీహనుమాన్‌వారి విగ్రహాన్ని స్థాపించక

ముందు ఈ ప్రాంతాన్ని బావులపాడు కూడలి, అప్పన్నవీడు కూడలి, ఏవూరు కూడలి అని పిలిచేవారు. అయితే హనుమాన్ విగ్రహం స్థాపనతో ఈ ప్రదేశం హనుమాన్ జంక్షన్‌గా మారింది. నూజివీడు జమిందారు,ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉపకులపతిగా పనిచేసిన ఎం.ఆర్.అప్పారావు తండ్రి మేక వెంకటాద్రి బహద్దర్ స్వామివారి విగ్రహాన్ని 1938లో ప్రతిష్ఠించారు. విగ్రహ నిర్మాత ఈ ప్రాంతానికి ఒకసారి వచ్చారు. ఆయనకు బాగా ఆకలి వేసింది. అక్కడ కొనడానికి, తినడానికి ఏమి లభించలేదు. ఈలోగా ఒక కోతి వచ్చి జమిందారు చేతిలో అరటిపండు పెట్టి మాయమైంది. దీంతో ఆయనకు ఎంతో శక్తి వచ్చినట్టు అయింది. హనుమంతుడే తనకు వానరుని రూపంలో ఆకలి తీర్చాడని భావించాడు. దాంతో అక్కడ విగ్రహాన్ని ఏర్పాటు చేశాడు. ప్రతి ఏటా హనుమజ్జయంతి సందర్భంగా ఇక్కడ ఆరు రోజులపాటు ఉత్సవాలు జరుగుతాయి. హనుమాన్ ఆలయానికి ఎదురుగా రామాలయం కూడా ఉంది.

ముత్యాలంబపురం

ఇది తాడేపల్లిగూడెం మండలంలో ఉంది. ఈ గ్రామంలో ముత్యాలమ్మ ఆలయం ప్రసిద్ధి చెందింది. ఈ ముత్యాలమ్మ తల్లి రోడ్డుకు సమీపంలో ఓ ఉప్పుడొంకలో వెలసినట్టు ఆధారాలు ఉన్నాయి. 1965లో ముత్యాలమ్మకు రోడ్డు ప్రక్కనే ఓ ఆలయాన్ని నిర్మించారు. ప్రతి ఏటా దేవీ నవరాత్రుల సందర్భంగా ఉత్సవాలను ని ర్వహిస్తారు. ఈ తల్లి పేరుతోనే ముత్యాలంబపురం వెలిసింది.

సత్తారామేశ్వరం

ఇది పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలంలో ఉంది. గోస్తని నదీ తీరంలో నెలకొని ఉంది. ఇక్కడ రెండు శివాలయాలు ఉన్నాయి. ఇక్కడ శివలింగం 11 నెలలపాటు నీటిలో ఉంటుంది. కేవలం వైశాఖమాసంలోనే శివలింగ దర్శనం లభిస్తుంది. బ్రహ్మహత్య దోష నివారణకుగాను సీతారాములు ఇసుక, నత్తలతో రూపొందించిన శివలింగానికి ప్రతిష్ఠ చేస్తారు. ఇక పరశు రాముడు క్షత్రియ హత్యదోష నివారణార్థం మరో లింగాన్ని ప్రతిష్ఠిస్తాడు. శ్రీరాముడు ప్రతిష్ఠించిన శివలింగాన్ని రామలింగేశ్వరలింగంగా, శంభూక రామేశ్వరలింగంగా

పిలుస్తారు. నత్తలతో కూడిఉన్నది కాబట్టి, నత్తరామలింగేశ్వరంగా ప్రసిద్ధి చెందింది. ఆనాటి నుంచి ఈ ఊరి పేరు నత్తరామేశ్వరంగా స్థిరపడింది.

తాడేపల్లిగూడెం

పశ్చిమ గోదావరి జిల్లాల్లో తాడేపల్లిగూడెం పెద్ద పట్టణాలలో ఒకటిగా ఉంది. భౌగోళికంగా రోడ్డు, రైలు జల మార్గాలు అనుకూలంగా ఉండటంతో ఈ పట్టణానికి మహర్దశ పట్టింది. తొలుత పెద్దతాడేపల్లిగూడెం, చిన్నతాడేపల్లిగూడెంగా ఉండేవి. అయితే ప్రస్తుతం దాదాపు కలిసిపోయాయి. దళిత సామాజిక వర్గానికి చెందిన తాడేపల్లి వంశీయులు ఈ ప్రాంతంలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకోవడంతో దీనికి ఆ పేరు వచ్చినట్టు స్పష్టమౌతోంది. 2011లో ఈ పట్టణం సెలక్షన్ గ్రేడు మున్సిపాలిటీగా ఎదిగింది. వ్యవసాయోత్పత్తుల విక్రయాలలో కోస్తా ఆంధ్రాలో అతిపెద్ద కేంద్రంగా ఉంది. రాష్ట్రంలోనే అతిపెద్ద ఎఫ్.సి.ఐ గిడ్డంగి ఇక్కడ ఉంది. నిట్‌తోపాటు ఉద్యానవన విశ్వావిద్యాలయం (వెంకటరామన్నగూడెం) ఉన్నాయి. ఇది అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం కూడా.

నిడదవోలు

ఇది ప్రముఖ రైల్వే కూడలి. నిడుద అంటే విశాలమైన అని అర్థం. ప్రోలు అంటే పట్టణం అని భావం. ఈ పట్టణాన్ని ఎంతో ప్రణాళికాబద్ధంగా నిర్మించడంతో దీనికి నిడుదవోలు, క్రమంగా నిడదవోలుగా స్థిరపడింది. తూర్పు చాళుక్యులు, కాకతీయులు దీన్ని పరిపాలించారు. తూర్పు చాళుక్యులు నిడదవోలును ఒక దుర్గంగా నిర్మించి యుద్ధాలు చేశారు. నేడు కోట దిబ్బగా పిలిచే ప్రాంతం ఆనాడు తూర్పు చాళుక్యులు నిర్మించిందే. నిడదవోలును సంస్కృతీకరించి నిరవద్యపురంగా పిలుస్తారు. నిరవద్య అంటే ఆక్షేపణలేనిది, ఆదర్శమైనదని అర్థం. కాకతీయ వంశానికి చెందిన రుద్రమదేవిని వివాహమాడిన వీరభద్ర చాళుక్యుడు నిడదవోలును రాజధానిగా చేసుకుని ఈ ప్రాంతాన్ని పాలించారు. తూర్పు చాళుక్యులు నిర్మించిన ఇక్కడ కోటకు రక్షణగా కోటశక్తిగా పూజలు అందుకొని కాలక్రమంలో కోటసత్తెమ్మతల్లిగా ప్రసిద్ధికెక్కింది. అమ్మవారి తిరునాళ్లు ప్రతి ఏటా డిశంబర్ నెలలో జరుగుతాయి.

మొగల్తూరు

ఇది మండల కేంద్రం. నాడు మొగల్ చక్రవర్తులు కలిదిండి రాజ వంశీయులకు ఈ ప్రాంతాన్ని ఇచ్చారు. తుర్రు అంటే పొదలు, ముళ్లు అని అర్థం చేసుకోవాలి. అయితే ఈ ప్రాంతం పొదలు, ముళ్లతో నిండి ఉండేది. అయితే కలిదిండి రాజులు దీన్ని నివాస యోగ్యంగా మార్చారు. అంచేత ఈ ప్రాంతం మొగల్, తుర్ అయింది. క్రమంగా మొగల్తూరుగా స్థిరపడింది. అయితే కొందరు పండితులు మొగల్ అనే పదాన్ని మొగలి పువ్వుగా చిత్రీకరించారు. అంతటితో ఆగకుండా సంస్కృతీకరించి కేతకీపురంగా పిలిచారు. కేతకీ అంటే మొగలుపువ్వు అని అర్థం. ప్రముఖ సినీ నటుడు చిరంజీవి స్వగ్రామం ఇది.

తణుకు

ఇది పురపాలిక కేంద్రం. తణుకుకు తొలిపేరు తారకేశ్వరపురం, దీనినే తారకాపురం, తారకాసురపురం అని పిలిచేవారు. ఐతిహ్యం ప్రకారం అసురుల (రాక్షసులు) రాజైన తారకాసురుని రాజధానిగా చెబుతున్నారు. అయితే తారకాసురుని సంహరించడానికి వీరభద్రుడు దేవగణానికి సేనానిగా వచ్చాడని ప్రతీతి. ఇరువురికి జరిగిన భీకరయుద్ధంలో కుమారస్వామి తారకాసురుడిని వధించిన స్థలం ఇది. కాబట్టి ఈ ప్రాంతానికి తారకేశ్వరపురం అనే పేరు, కాలక్రమంలో తణుకుగా మారింది. కాగా శాతవాహన, చాళుక్య, పల్లవ, చోడాదిరాజ్యాధినేతలు ఇక్కడ జరిగిన యుద్ధాలలో తన్నుకు చచ్చారని అంచేత దీనికి తనుకు అనే పేరు వచ్చినట్టు క్రమంగా తణుకుగా మారినట్టు భావిస్తున్నట్టు ప్రముఖ సాహితీవేత్త కానూరి బదరీనాథ్ పేర్కొన్నారు. ఇక్కడ కేశవస్వామి దేవాలయం, నన్నయ్య యాగం చేసిన స్థలం ప్రసిద్ధమైనవి. ఇక్కడే కాటన్‌దొర విగ్రహం, నన్నయ్య భట్టారక పీఠం, రామకృష్ణ సేవా సమితి ఉన్నాయి. విద్య, వైద్య, పారిశ్రామిక రంగాలలో ఈ ప్రాంతం పురోగమిస్తోంది. అన్నింటికి మించి రాకెట్ ఇంధన తయారీ కేంద్రం ఇక్కడే ఉంది.

మల్లేశ్వరం

ఇది చింతలపూడి మండలంలోఉంది. చాశుక్యమల్లప రాజు ఈ పల్లెలో మల్లేశ్వరస్వామి పేరున శివలింగాన్ని ప్రతిష్ఠించాడు. దీంతో ఈ గ్రామానికి మల్లేశ్వరంగా పేరు పెట్టారు. రెడ్డి రాజులలోని అనవేమారెడ్డి కాలంలో ఇక్కడి మహాశివలింగం పుట్టలలోనుంచి బయట పడింది. కపిల గోవులపాలు ఆరగించిన ఈ స్వామిని కపిల మల్లేశ్వరుడనే పేరున పిలిచి ఈ ఆలయాన్ని నిర్మించాడు. దీనికి వలయు భూవసతిని అనవేమారెడ్డి కల్పించినట్టు శిలాశాసనాల వల్ల తెలుస్తోంది. గోదావరి పొంగినపుడు స్వామివారి గర్భాలయంలో నీరు బయటకు చిందుతుంది. మహశివరాత్రి నాడు స్వామి కళ్యాణం జరుగుతుంది.

లక్ష్మణేశ్వరం

ఇది నరసాపురం మండలంలో ఉంది. శ్రీరామచంద్రుని తమ్ముడైన లక్ష్మణునిచే ప్రతిష్ఠించిన ఆలయం ఇక్కడ ఉన్నది. లక్ష్మణుని పేరుతోనే ఈ గ్రామానికి లక్ష్మణేశ్వరం అనే పేరు వచ్చింది. ఈ గ్రామం వశిష్ట గోదావరికి సమీపంలో ఉంది. ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్ జిల్లా గెజిట్, పశ్చిమగోదావరి, పుట పేజి233లో ప్రస్తావించారు.

ఆకివీడు...మాదివాడ...

ఇది మండల కేంద్రం. ఈ ప్రాంతంలో అక్కన్న, మాదన్నలు నివశించేవారు. అక్కన్న నివశించడం వల్ల ఆకివీడుగా పేరు వచ్చింది. దీని శివారు గ్రామంలో మాదన్న నివశించడం వల్ల మాదివాడ అనే పేరు వచ్చిందని గ్రామీణులు చెబుతున్నారు. అయితే విష్ణుకుండిన విక్రమేంద్ర మహరాజు "తండి తామర శాసనం"లో దాన గ్రహీత స్వగ్రామం "ఆకి" అని పేర్కొన్నారు. ఈ ఆకి గ్రామమే 'ఆకివీడు' అని కొందరు పరిశోధకుల అభిప్రాయం.

కాళ్ళకూరు

ఈ గ్రామం కాళ్ల మండలంలో ఉంది. ఒకసారి ప్రాచీన కాలంలో, చెఱువు గట్టుపై అడుసులో కాళ్లు కూరుకొని ఉన్న ప్రతిమను గ్రామస్థులు చూసారు. ఆ సమయంలో దారిలో మొగల్తూరు జమీందారు తిరుపతి తీర్థయాత్రకు వెళు

తున్నారు. జమీందారుకు ఈ విషయం చెబితే ఏ మాత్రం ఖాతరు చేయకపోతే, తిరుపతి లో స్వామి ఆయనకు కనిపించలేదట. తిరుపతి నుండి తిరిగి వచ్చిన వెంటనే జమీందారు గ్రామస్థులు చూపిన ప్రతిమను వేంకటేశ్వర స్వామిగా ప్రతిష్ఠించాడు. ఇక్కడి దేవుడు కాళ్ళు మట్టిలో కూరుకొని ఉన్నం దున "కాళ్ళకూరు" అయిందని నివేదకులు పేర్కొన్నారు.

మల్లిపూడి

ఇది పెనుమంట్ర మండలంలో ఉంది. జుత్తిగ గ్రామానికి పశ్చిమ దిశలో ఉన్న సరిహద్దు గ్రామమిది. శ్రీ వాసుకీ రవి సోమేశ్వరస్వామి నిత్యపూజకై మల్లియలను (మల్లెపూలను) సేకరించుటకు గ్రామంలో ఒక తోటను సంపాదించారు. అదే నేడు మల్లిపూడిగా మారింది.

దెందులూరు

ఇది మండల కేంద్రం. ఏలూరుకు ఉత్తరదిక్కులో ఈ గ్రామం ఉంది. ఒకప్పుడు విష్ణుకుండినుల రాజధానిగా ప్రఖ్యాతి చెందింది. దీని పూర్వ నామం "టెన్దుళూరు" అని ఏలూరు శాసనాల వల్ల తెలుస్తుంది. క్రీ.శ. 506 ప్రాచీనాంధ్ర శాసనాలు (పుట 520), ఎ.పిగ్రాఫియా ఇండికా (పుట193–198) టెన్దుళూర శాసనం మనకు కనిపిస్తుంది. టెన్దుళూర తర్వాత కాలంలో దెందులూరు అయింది.

పెదవేగి

ఇది మండల కేంద్రం. తూర్పు కనుమల నుంచి సముద్రం వరకు కృష్ణా, గోదావరుల మధ్య వ్యాప్తమై ఉన్న తీరప్రాంతదేశానికి పూర్వము వేంగీఅని పిలిచేవారు. "వేంగి" ప్రభావంతోనే ఇక్కడ పెదవేగి పేరుతో గ్రామం వెలిసింది. ఇది చారిత్రాత్మక గ్రామం. వేంగీ రాజుల రాజధానిగా విరాజిల్లింది. ఈ ప్రాంతంలో ఓ దిబ్బ మీద పురాతత్వ శాస్త్రజ్ఞులు తవ్వకాలు జరిపారు. వాటిలో అనేక విశేషాలు బయల్పడ్డాయి. వానిలో పరమేశ్వరాలయం కూడా ఉంది. ఈ పురాతన ఆలయం వేంగీ రాజుల కాలంలో నిర్మితమైంది. ఆలయం ఆవరణలో మ్యూజియం

ఉంది. దీనిలో క్రీ.శ 5,6,7 శతాబ్దాల నాటి శిథిలమైన శిల్పాలెన్నో కన్పిస్తాయి. "శిలలు ద్రవించి ఏర్పడినవి" అనే భావన కలిగిస్తుంది. ఇక్కడ అతి పెద్దదైన ఆయిల్‌పామ్ కర్మాగారం ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దీన్ని నిర్వహిస్తోంది.

పట్టిసం

ఇది పోలవరం మండలంలో ఉంది. శ్రీశైలం, కాశీ, కాళేశ్వరం, శ్రీకాళహస్తిలతో పాటుగా పంచశివక్షేత్రాలలో పట్టిసం ఒకటి. సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశంలో ఈ క్షేత్ర ప్రస్తావన ఉంది. తన తండ్రియగు దక్షుడొనర్చిన యాగంలో సతీదేవి అవమానానికి గురి అయింది. అత్యంత కోపితుడై ఆమె భర్తయగు మహాదేవుడు వీరభద్రావతారము దాల్చి దక్షుని శిరము ఉత్తరింప పట్టిసం (గండ్రగొడ్డలి) అనే ఆయుధాన్ని ప్రయోగిస్తాడు. అయితే వీరభద్రుడు విసిరిన పట్టిసం ఈ ప్రాంతంలో పడుతుంది. ఈ కారణం వల్ల నాటి నుంచి ఆ దేవ కూటాద్రి, పట్టిసాద్రి లేక పట్టసాచలం అని వ్యవహారంలో ఉంది. ఫలితంగా ఈ ప్రాంతంలో పట్టిసం పేరుతో గ్రామం ఏర్పడింది. మహాశివరాత్రి నాడు పట్టిసం వీరభద్రక్షేత్రంలో విశేషపూజలు జరుగుతాయి. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య "హరహర శంభో మహాదేవ" అనే భక్తుల నినాదాలతో ఈ క్షేత్రం ప్రతిధ్వనిస్తుంది. కార్తీక మాసంలో జరిగే అర్చనల వేళ గోదావరి నదిలో కోటి దీపాల వెలుగులో కనిపించే ఆలయ శోభను వర్ణించడానికి మహాకవులకే మాటలు చాలవు.

కాటకూటేశ్వరం

ఇది నిడదవోలుకు సమీపంలో ఉంది. ఇక్కడ ఉమాకాటకూటేశ్వర లింగేశ్వరస్వామి ఆలయం ఉంది. స్వామి పేరుతోనే ఈ పల్లెకు కాట కూటేశ్వరం అని పేరు పెట్టారు. మహాకవి ధూర్జటి కాళహస్తీశ్వర శతకంలో ఈ దేవాలయం గూర్చి రాశారు.

విజ్జేశ్వరం

ఇది నిడదవోలు మండలం లో ఉంది. ఇక్కడ వెలసిన విజయలింగేశ్వర స్వామి పేరుతో ఈ గ్రామానికి ఆ పేరుపెట్టారు. వశిష్ఠ గోదావరి నదీతీరాన ఉన్న ప్రాచీన ఆలయాలలో ఒకటి.

ఉండి

ఇది మండల కేంద్రం. దీన్ని పూర్వం ఉండేశుడు అనే రాజు పేరున పిలిచేవారు. ఈ విషయాన్ని 'ఆంధ్ర దేశచరిత్ర భూగోళసర్వస్వం' అనే పుస్తకంలో రాశారు. ఇదే గ్రంథంలో దీనికి పూర్వం నుండి దుండిపురం అనే పేరు ఉండేదని ఆ తరువాత ఉండిగా మారిందని పేర్కొన్నారు.

పాలంగి

ఇది ఉండ్రాజవరం మండలంలో ఉంది. పూల అంగడి ఇక్కడ ఉండటం వల్ల పాలంగి అయింది. పూలు అంగడి జనవ్యవహారంలో పాలంగి అయింది.

వేల్పూరు

ఇది మండలం కేంద్రం. వేల్పుల ఊరు అనగా దేవతల గ్రామం అని అర్థం. దేవతలు విడిది చేసిన చోటు అయినందున ఇది వేల్పూరు అనే పేరుతో ఏర్పాటైందని తాము విశ్వసిస్తున్నట్టు నివేదకులు పేర్కొన్నారు.

కొమరవరం

ఇది తణుకు మండలంలో ఉంది. కుమార స్వామి విడిది చేసిన పవిత్రమైన ప్రాంతమిది. ఆ పేరుతోనే కుమారపురం వెలసింది. కాలక్రమంలో కొమరవరంగా రూపాంతరం చెందింది.

వీరభద్రపురం

ఈ గ్రామం తణుకు మండలలలో ఉంది. వీరభద్రుని విడిదిగా ఈ గ్రామాన్ని పేర్కొంటారు. స్వామి పేరుతోనే వీరభద్రపురంగా ఈ గ్రామం అవతరించింది.

కాకుల ఇల్లిందలపర్రు

ఈ గ్రామం ఇరగవరం మండలంలో నెలకొని ఉంది. 11,12 శతాబ్దాలకు చెందిన వేములవాడ భీమకవి తన పర్యటనలో భాగంగా ఇల్లిందలపర్రు ప్రాంతంలోని చౌడేశ్వరస్వామి ఆలయంలో నిద్రించాడు. తెల్లవారుజాము అయ్యేసరికి అతని చుట్టూ కాకులమూక చుట్టూ చేరింది. దీంతో ఈ పల్లెకు భీమకవి కాకులఇల్లిందలపర్రు అని నామకరణం చేసినట్టు ఓ కథనం ప్రచారంలో ఉంది. మరో కథనం ప్రకారం 16వ శతాబ్దంలో శ్రీ కృష్ణ దేవరాయలు రాయకుదురులో ఉన్నప్పుడు శ్రీకాకుళాంధ్ర మహావిష్ణువు దర్శనానికి వెళ్ళి అక్కడ ఓ రాత్రి నిదురించాడు. స్వామి కలలో కనిపించి "ఆముక్తమాల్యద" గ్రంథాన్ని రాయాలని రాయలను కోరాడు. ఆ తరువాత రాయకుదురు వచ్చికొన్ని రోజులు గడిచాక ఇల్లిందలపర్రును సందర్శించాడు. అక్కడగల చోడేశ్వరస్వామి ఆలయాన్ని చూసి తన్మయత్వం చెందాడు. ఇది మహా శైవక్షేత్రం అని భావించి శ్రీకాకుళాంధ్ర చోడేశ్వరస్వామి ఆలయమని కీర్తించాడు. శ్రీకాకుళ ఇల్లిందలపర్రుగా పేర్కొన్నాడు. అయితే జనవ్యవహారంలో కాకుల ఇల్లిందలపర్రుగా మారిందని ప్రముఖ సాహితీవేత్త కానూరి బదరీనాథ్ ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు. ఇతిహాసాలను స్ఫూర్తిగా తీసుకొని ఇంద్రుడు కొంత కాలం నివశించిన ప్రాంత మని భావించడంతో ఇల్లిందల అనే పేరు పూర్వనామంగా పెట్టారు. ఇందులో పర్రు అంటే ప్రవాహాల వెంట జనావాసాలు ఏర్పాటైతే దీనిని పర్రు అని పిలుస్తారు. ఇలా తొలుత ఇల్లిందలపర్రు ఏర్పాటైనట్టు స్థలపురాణం పేర్కొంటోంది.

సోమరాజు ఇల్లిందలపర్రు

ఇది కూడా ఇరగవరం మండలంలో ఉంది. పుసులూరి సోమరాజు అనే గొప్ప రచయిత పేరుతో ఏర్పాటైన గ్రామం ఇది. గుంటూరు ప్రాంతానికి చెందిన ఈ కవికి శనివారంపేట జమీందారులు అగ్రహారంగా ఈ గ్రామాన్ని దానం చేశారు. దీంతో దీనికి సోమరాజు ఇల్లిందలపర్రు అనే పేరు వచ్చింది. ఈ కవి క్రీ.శ. 17వ శ తాబ్దికి చెందినవాడు. చంద్రదూత శతకం, బాలగోపాల శతకం, నందనందనం శతకం రచనలు చేసి కీర్తి పొందారు. ఒక రచయిత పేరుతో ఏర్పడిన గ్రామం ఇదే కావడం విశేషం.

జుత్తిగ

ఇది పెనుమంట్ర మండలంలో ఉంది. పశ్చిమ గోదావరీతీరాన వెలిసిన గొప్పక్షేత్రం ఇది. దీని తొలి పేరు దూతికాపురం. జుత్తిగ తొలి రూపం 'ధూతిక'-ధూతపాపనాశనం "ధూపతేశ్వరం" వంటి వాటిల్లో యీ శబ్దం గోచరిస్తుంది."ధూతిక" అంటే తెల్లని, స్వచ్ఛమైన-పవిత్ర మయిన దేవత అని అర్థం వస్తుంది. అంచేతనే ఈ గ్రామానికి మంచిపేరు పెట్టాలనే ఉద్దేశంతో జుత్తిగ అనే పేరు పెట్టారు. ధూతిక-దూతిక-దుత్తిక-జుత్తిక-జుత్తిగగా మారింది. ఇక్కడి ఉమా వాసుకి రవి సోమేశుని మహాక్షేత్రం, ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాల వలె పరమపవిత్రమే కాకుండా, ఆ స్థాయిని, ప్రతిపత్తిని కల్గిందని చెప్పాలి. ఈ మహాక్షేత్రానికి సంబధించి ప్రఖ్యాత రచయిత కానూరి బదరీనాధ్ (తణుకు) రాసిన "మాదూతికాపురం (జుత్తిగ)" గ్రంథం ఎంతో పేరు పొందింది. అలాగే ఈయన రాసిన "తణుకు తళుకులు" "పానారవిషయము"ప్రసిద్ధమైన గ్రంథాలే.

కొల్లేరు

ఇది ఆకివీడు మండలంలో ఉంది. మన దేశంలో అత్యంత ప్రఖ్యాతమయిన మంచినీటి సరస్సులలో కొల్లేరు ఒకటి. కొల్లు అనే గ్రామ దేవతను ఈ ప్రాంతీయులు పూజించేవారు. అంచేతనే కొల్లేరు అని తమ గ్రామానికి నామకరణం చేశారు. కొల్లు+ఏరు= కొల్లేరు అయింది."దశకుమార చరిత్ర" రాసిన దండికవి ఆంధ్రదేశాన్ని వర్ణించే సందర్భంలో ఆంధ్రనగరికి సమీపంలో ఓ మహాసరస్సు ఉందని వర్ణించి ఓ పద్యాన్ని రాశాడు. కొల్లేరు సరస్సు ఉన్న ప్రదేశంలో పూర్వం 12 ఆమడల వైశాల్యం గల ఓ మహానగరం ఉండేది. ఆ నగరంలోని యజ్ఞయాగాదులు చేసే రుత్వికులు తొలుత కొల్లు దేవతను ఆరాధించే వారని ప్రఖ్యాత రచయిత కానూరి బదరీనాధ్ పేర్కొన్నారు. క్రీ.శ. 634 - 635 నాటి రెండో పులకేశి ఐహోలు శాసనంలో కొల్లేటి ప్రస్తావన ఉంది. ఏలూరు, భీమవరం, తణుకు తాలూకా ప్రాంతాలను కొలను మండలాలుగా వ్యవహరించేవారు. ఈ కొలను నామాన్ని ధరించే అడవి కొలను, ఆరు గొలను (నేటి ఆరు గొల్లు), మోంగోలును (మోగల్లు), కోర్కొలను (కోరుకోల్లు), గుండుగొలను, పాలకొలను (పాలకొల్లు) తదితర గ్రామ నామాలు కొలను పేరుతోనే వెలిశాయని బదరీనాధ్ తాను రాసిన "పానార

విషయము" లో వివరించారు. కొల్లేటికి సంబంధించి జన వ్యవహారంలో ఎన్నో సామెతలు ఉన్నాయి. "కొల్లేటి కాపురం" అంటే అందరికీ తెలిసిందే. "కొల్లేటి కొంగ"లా పొడవుగా ఉన్నాడంటారు. కాగా ఆపదల సమయంలో కొంప కొల్లేరైందని వాపోతుంటారు.

మండపాక

ఇది తణుకు మండలంలో ఉంది. దీని పూర్వ నామం పందిపాక. ఆ తరువాతి కాలంలో మండపాక గా రూపాంతరం చెందింది. మండపాక మాండవ్య మహాఋషి తపోభూమి అయిన కారణం చేత "మాండవ్యపాక"అయి, క్రమంగా "మండపాక" గా మారిందని మరికొందరి వివరణ. ఇప్పటి మండపాక గ్రామానికి పడమటగా పెదపాడు, చినపాడు ఉండేవని, అదే అసలు గ్రామమని, గ్రామంలోని యాదవులు ప్రస్తుతం ఉన్న ఆ పల్లె అప్పుడు పెద్ద మైదానం కావడం వల్ల అక్కడ గొర్రెల మందలు కాస్తుండేవారు. ఓ రోజున ఆ మైదానంలో గజ్జెల మోతలు వినిపించాయి. గ్రామీణులు అక్కడికి వెళ్లి పరిశీలన జరిపారు. అక్కడ అనూహ్యంగా దేవాలయ చిహ్నాలు కనిపించాయి. కాలగమనంలో గ్రామస్థులు పెదపాడు, చినపాడులను విడిచి పెట్టి ఇక్కడే పల్లెను ఏర్పాటు చేసుకున్నారు. ఆ పల్లెకు మందపాక అను పేరు పెట్టారు. కాల ప్రవాహంలో ఇది మండపాక గా మారింది. ఇక్కడ కాకతమ్మ, ఏకవీర దేవతలను, ఎల్లమాంబలను నాడు ప్రతిష్ఠించారు. ఎల్లమాంబ అంటే ఎల్లరకు అంబ అనే అర్థం. అంటే అందరకీ మాత అని పేర్కొనవచ్చు.

రాయకుదురు

ఈ గ్రామం వీరవాసరం మండలంలో ఉంది. దీని తొలి పేరు సుందరపురం. ఇక్కడ సకల సుందరేశ్వరస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయం పేరుతోనే గ్రామం వెలిసింది. ఇదిలా ఉండగా 16వ శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయలు గజపతుల మీద దండయాత్రలకు వెళ్తూ సుందరపురంలో విడిది చేసేవాడు. అక్కడి నుంచే పరిపాలనను కుదురుగా సాగించేవారు. దీంతో ఈ గ్రామానికి రాయలకుదురు అని పేరువచ్చింది. కాలక్రమంలో రాయకుదురుగా మారినట్టు ప్రముఖ సాహితీ వేత్త కానూరి బదరీనాథ్ పేర్కొన్నారు.

మీనవల్లూరు

ఇది పెంటపాడు మండలంలో ఉంది. నీటిలో నిటారుగా ఉరికి చేపలను ముక్కున పెట్టుకొని భక్షించే పక్షులను మీనవల్లంకి పక్షులు అంటారు. ఈ పక్షులు ఈ ప్రాంతంలో విపరీతంగా సంచరించేవి. దీంతో ఈ గ్రామానికి మీనవల్లూరు అనే పేరు వచ్చింది. దీన్ని మీనవల్లికాపురం అని కూడా పిలుస్తారు. కాగా ఈ గ్రామంలో వీరేశ్వరస్వామి వెలిశాడు. వల్లూరము అంటే శివుని హస్త విశేషం. ఈ గ్రామంలోని ప్రజలు వీరేశ్వరస్వామి అభయహస్తం శుభాన్ని కలిగిస్తుందని నమ్ముతారు.

భైరవ పెంటపాడు

ఇది పెంటపాడు పట్టణానికి సమీపంలో ఉంది. బైరాగులు ఉత్తర భారత దేశం నుంచి దక్షిణ భారతదే శానికి వలస వచ్చి పెంటపాడు సమీపంలో నివాసాలను ఏర్పరుచుకున్నారు. ఇక్కడ బైరాగుల మఠం ఉండేది. 1559 లో ఇక్కడ ఈ మఠాన్ని ఒడిషాకు చెందిన మహంతు నిర్వాణ లక్షణ బావాజి స్థాపించారు.

కస్పాపెంటపాడు

ఇది పెంటపాడుకు సమీపంలో ఉంది. కసుబ అనే పదం నుంచి కస్పా వచ్చింది. కసుబ అంటే వర్తక స్థలమని అర్థం. కసుబ పదమే జనవ్యవహరంలో కస్పాగా మారింది. ఇది పెంటపాడుకు సమీపంలో ఉండటంతో కస్పా పెంటపాడు అయింది. పెంటపాడు వైష్ణవ అగ్రహారం. కాగా కస్పా పెంట పాడులో తూర్పు వెలమ సామాజిక వర్గం వారు కళింగ గజపతుల కాలం నాటికే (17వ శతాబ్దం) ఇక్కడకు వచ్చి స్థిరపడ్డారు.

రేలంగి

ఇది ఇరగవరం మండలంలో ఉంది. దీన్ని కొందరు 'రత్నాల అంగడి' అని పిలుస్తారు.ఐతిహ్యం ప్రకారం శ్రీరామ చంద్రుడు తాటకిని వధించినపుడు

ఆమె తలభాగం ఈ ప్రాంతంలో రాలింది. దీంతో రాలింది, రాలింది అంటూ జనాలు కేకలు వేసారు. ఈ అరుపుల పేరుతోనే గ్రామాన్ని ఏర్పాటు చేశారు. రాలింది అనే మాట జన వ్యవహారంలో రేలంగిగా మారిందని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు అల్లూరి పాండురాజు పేర్కొన్నారు. ఈ గ్రామంలో తాటకి శబ్దం కలిసొచ్చే విధంగా తాటకేశ్వర స్వామి ఆలయం ఉండటం విశేషం.

జగన్నాథపురం

ఇది తాడేపల్లిగూడేం మండలంలో ఉంది. పశ్చిమ చాళుక్య సామంతుడైన జననాథుడు పేరుతో ఈ గ్రామాన్ని జననాథనగరంగా ఏర్పడింది. కాలక్రమంలో జగన్నాథపురంగా మారింది. తొలుత ఈ గ్రామం పేరు మల్లీశ్వరపట్నంగా ఉండేది. మొదటి సోమేశ్వరుడు ఇక్కడ మల్లీశ్వర ఆలయాన్ని ఏర్పాటు చేశాడు. ప్రస్తుతం జగన్నాథపురంగా ప్రసిద్ధి చెందింది.

కృష్ణాజిల్లా

మచిలీపట్నం

ఇది కృష్ణాజిల్లా కేంద్రం. బందరుకు మచిలీపట్నం అనే పేరు రావడానికి ఒక కథ ప్రచారంలో ఉంది. ఈ ప్రాంతంలో సముద్రతీరంలో ఉన్న కోట ద్వారం దగ్గర ఒక చేప విగ్రహం ఉండేది. అందుచే ఈ ఊరికి మచిలీపట్నం అనే పేరు వచ్చిందంటారు. మచిలీ అంటే హిందీ భాషలో చేప అని అర్థం. పట్నం అంటే పెద్ద ఊరు. ఆంధ్రదేశంలో పట్నం అనేది సముద్ర, నదీ ప్రాంతాల ఒడ్డన ఉన్న రేవులను ప్రాంతాలకు వాడుతుంటారు. ఉదా: చెన్నపట్నం, విశాఖపట్నం, భీమునిపట్నం, కళింగపట్నం, కృష్ణపట్నం, వాసుదేవపట్నం... తదితరమైనవి పట్నంతో ముగిసే పేర్లు. ఇక మచిలీపట్నం పూర్వనామం మచిలీబందరుగా ఉండేది. గతంలో ప్రముఖ సంపాదకులు ముట్నూరి కృష్ణారావు ఆధ్వర్యంలో కృష్ణా పత్రిక వెలువడేది. ఈ పత్రిక ప్రజల మన్ననలను, ప్రశంసలను పొందింది.

విజయవాడ

విజయవాడ నగరానికి ఎంతో ప్రాచీన చరిత్ర ఉంది. ప్రారంభంలో దీన్ని రాజేంద్రచోళపురం అని పిలిచే వారు. శ్రీకృష్ణదేవరాయులు రచించిన ఆముక్తమాల్యదలో విజయవాటిక అని పేర్కొన్నారు. క్రీ.శ 934 నాటి యుద్ధమల్లుని బెజవాడ శాసనం పురాతన చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తుంది. శాతవాహనులు, ఇక్ష్వాకులు, పల్లవులు, విష్ణుకుండినులు, చాళుక్యులు, ఈ ప్రాంతాన్ని పాలించారు. విష్ణుకుండినుల కాలంలో ఈ నగరం ఉన్నత స్థాయికి చేరుకుంది. ఈ నగరం తొలిపేరు బెజవాడ. క్రీ.శ.7 శతాబ్దంలో వేంగిరాజులకు, 13వ శతాబ్దంలో చోళులకు రాజధానిగా ఉండి మహోన్నత దశను అనుభవించింది. క్రీ.శ.639లో హూయాన్‌త్సాంగ్ బెజవాడను సందర్శించి ఈ పట్టణ వైభవాన్ని తన గ్రంథంలో వర్ణించాడు. ఇక్కడ ఇంద్రకీలాద్రి పర్వతంపై అర్జునుడు శివుని గూర్చి తపస్సు చేసి పాశుపతాస్త్రాన్ని సంపాదించడంలో విజయుడైనాడు. అందుచేత దీన్ని

విజయవాడగా పిలుస్తున్నారు. నాటి మన తొలి స్పీకర్ అయ్యదేవర కాళేశ్వరరావు సూచనల మేరకు 1948-49లో డాక్టర్ టి.వి.ఎస్.చలపతిరావు బెజవాడ పురపాలిక ఛైర్మన్‌గా ఉన్నప్పుడు దీని పేరును బెజవాడ నుండి విజయవాడగా మార్చారు. ప్రస్తుతం విజయవాడ నగరపాలక సంస్థగా ఉంది. అమరావతికి దగ్గరలో ఉండడంతో దీని ప్రాధాన్యత బాగా పెరుగుతోంది.

గొల్లపూడి

ఒకప్పుడు ఇది గ్రామపంచాయితీ కేంద్రం. కాలక్రమంలో విజయవాడ నగరంలో అంతర్భాగమైంది. చారిత్రకంగా చూస్తే గొల్వపూండి, గొల్వపూడి పేర్లతో కనిపిస్తుంది. పూడి అంటే నది లేదా ఏరు కంటే పల్లంగా ఉండే గ్రామం అని అంటారు. ఈ గ్రామానికి ఆనుకొని ప్రవహించే గుడమేరు కంటే పల్లంగా ఉంది. పరోక్షమైన ఆధారాన్ని పరిశీలిస్తే కొల్ల మాణిక్యం అనే వెలయాలి పేరుతో ఏర్పడిన గ్రామం కావచ్చునని సీనియర్ జర్నలిస్ట్ దివంగత లంక వెంకటరమణ తాను రాసిన "విజయవాడ వీధుల కథలు" అనే పుస్తకంలో పేర్కొన్నారు. బెజవాడ మల్లికార్జున్‌స్వామి ఆలయానికి గల దేవదాసీల పేర్ల జాబితాలో కొల్ల మాణిక్యం పేరు ఉంది. ఆమె ఇంటి పేరు అయిన కొల్ల, గొల్లగా రూపాంతరం చెందింది.

మొగల్రాజపురం

ఇది విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఉంది. ఒకప్పుడు ఈ ప్రాంతం మొగలుల ఆధీనంలో ఉండేది. కులీకుతుబ్ షాహీ హయాంలో బందరు ఓడరేవు నుంచి ఇతర ప్రాంతాలకు సరకుల రవాణా ఎగుమతి, దిగుమతులు యుద్ధప్రాతిపదికపై జరిగేవి. ఈ వ్యవహారాలను పర్యవేక్షించేందుకు సంబంధిత మొగలాయి సిబ్బంది ఈ ప్రాంతంలో తాత్కాలికంగా గుడారాలు వేసుకొని ఉండేవారు. దీంతో ఈ ప్రాంతానికి మొగల్రాజపురం అనే పేరు వచ్చింది. ఇక్కడ ఆది మానవుడు నివశించే గుహలు కూడా ఉండేవని చారిత్రక కథనం. కమ్యూనిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో కమ్యూన్ అనే విభాగం ఇక్కడే ఉండేది. తెలంగాణ సాయుధ పోరాటానికి ఇక్కడే శిక్షణ నిచ్చిన ప్రాంతమని విశాలాంధ్ర (విజయవాడ) సంపాదకులు ముత్యాల ప్రసాద్ తనను కలిసిన ఈ రచయితతో అన్నారు. ఇదే ప్రాంతంలో ప్రజాశక్తినగర్ ఉంది.

లెనిన్ సెంటర్

విజయవాడ నగరపాలికలో ఇది ప్రధాన కూడలిలో ఒకటిగా ఉంది. మూడు దశాబ్దాల కితం మాస్కో (రష్యా) నుంచి లెనిన్ విగ్రహాన్ని ఇక్కడకు తెప్పించి ఆవిష్కరించారు. అపురూపమైన ఈ విగ్రహాన్ని ప్రజలు ఎంతో ఆసక్తితో వీక్షిస్తుంటారు.

గాంధీనగర్

జాతీయోద్యమం బెజవాడ నగర చరిత్రనే మార్చివేసింది. జాతిపిత ఈ ప్రాంతాన్ని ప్రభావితం చేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతో కృషి చేసిన పుణ్యపురుషుల పాదస్పర్శతో పునీతమైన నగరం ఇది. మహాత్ముడు దేశ పర్యటన చేసినపుడు బెజవాడ మీదుగా ఎన్నో సార్లు ప్రయాణం చేశారు. 1919లో గాంధీజీ తొలిసారిగా బెజవాడ వచ్చారు. ఆయన ప్రేరణతో రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా పట్టణంలో సత్యాగ్రహ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 1920 ఆగష్టు23న గాంధీజీ రెండోసారి ఇక్కడకు వచ్చారు. ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. 1929 ఏప్రిల్12న కూడా బాపూజీ విజయవాడ వచ్చారు. నేడు గాంధీనగర్ అని మనం పిలుస్తున్న ప్రదేశం అప్పటి పెద్ద మైదానం. అక్కడే జాతీయోద్యమ సభలు ఎక్కువగా జరిగేవి. మహాత్మునిపేరుతోనే గాంధీనగర్ ఏర్పాటైంది.

కరెన్సీనగర్

ఇది విజయవాడ నగర పాలక సంస్థ రెండో డివిజన్ పరిధిలో ఉంది. సుమారు రెండు దశాబ్దాల కితం అన్ని బ్యాంకు శాఖలకు నగదు (కరెన్సీ)ని పంపిణీ చేసే అతి పెద్ద ధనాగారం (చెస్ట్) ఈ ప్రాంతంలో ఉండేది. అదే విధంగా బ్యాంకు ఉద్యోగులు కూడా ఇక్కడ గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. కరెన్సీ పేరుతోనే ఓ అపార్ట్‌మెంట్ ఇక్కడ ఉంది. బ్యాంకు ఉద్యోగల ఆలోచనతో ఈ ప్రాంతానికి కరెన్సీనగర్ అని పేరు పెట్టుకు న్నారు. ఈ విషయాన్ని కార్పొరేటర్ దేవినేని అపర్ణ ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు. విజయవాడలోని 59 డివిజన్లలో తమ డివిజన్ అతి పెద్దదని ఆమె వివరించారు.

బెంజ్ సర్కిల్

ఇది విజయవాడలో అత్యంత ప్రధానమైన ప్రాంతం. బందరు రోడ్డులో ఉంది. బెంజ్ సర్కిల్‌కు ఆ పేరు ఎలా వచ్చిందంటే... కొన్ని దశాబ్దాల క్రితం బెంజ్ కంపెనీ ఇక్కడ ఉండేది. ఆ కంపెనీ లారీలు ఇక్కడ ఓ సమూహంగా ఉండేవి. దీంతో ఈ ప్రాంతానికి బెంజ్‌సర్కిల్ అనే పేరు వచ్చినట్టు విశాలాంధ్ర సంపాదకులు ముత్యాల ప్రసాద్ పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం బెంజ్ కంపెనీ జాడలే లేనప్పటికీ బెంజ్ సర్కిల్‌గానే ఈ ప్రాంతాన్ని పిలుస్తా రు. ఈ సర్కిల్‌కు తూర్పున కంకిపాడు రోడ్డు, పశ్చిమాన దుర్గగుడి ప్రాంతం, ఉత్తరాన ఏలూరు, దక్షిణాన గుంటూరు రోడ్డు ఉన్నాయి. బెంజ్ కంపెనీ స్థానంలో అతి పెద్ద వ్యాపార కేంద్రం వెలసింది.

ఇబ్రహీంపట్నం

శ్రీకృష్ణదేవరాయలు కృష్ణానది దాటి కొండపల్లిపై దాడి చేయడానికి ఇబ్రహీంపట్నం రేవునే ఉపయోగించుకొన్నాడు. ఇబ్రహీం కులీకుతుబ్‌షా పేరుతో నాటి కొండపల్లి పాలకుడు ముస్తాఫాఖాన్ ఇబ్రహీంపట్టణాన్ని నిర్మించాడు. ఘన చరిత్రగల ఇబ్రహీపట్నం నేటి నవీనయుగంలో థర్మల్ స్టేషన్ పేరుతో చెలామణీ అవుతోంది. అయితే సమీపంలో అమరావతి రాజధానిగా ఏర్పడడంతో దీనికి మహర్దశపట్టినట్టే.

కృష్ణలంక

ఇది విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఉంది. కృష్ణా నది రెండు పాయలుగా చీలి మరలా కొంతదూరం పోయి ఒక్కటిగా కలుస్తుంది. ఈ మధ్యలో ఉన్న భూభాగాన్ని లంక అని పిలుస్తారు. కృష్ణా నది పేరుతోకృష్ణలంక ఏర్పడింది. దీని పరిధిలోనే రామలింగేశ్వరనగర్, రాణిగారిపేట, బావాజిపేట, నెహ్రూనగర్ ఉన్నాయి.

దుర్గాపురం

విజయవాడలో కనకదుర్గమ్మ వారి పేరుతో వెలసిన ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. అలాంటి ప్రదేశమే దుర్గాపురం 1930 ప్రాంతంలో బేతవోలు శరభయ్య,

ఆయన చెలికాడు పుచ్చాకోటయ్య కలసి ఈ ప్రాంతంలో కొంత భూమిని కొనుగోలు చేసి దుర్గాలయాన్ని నిర్మించారు. ఈ ప్రాంతానికి దుర్గాపురంగా నామకరణం చేశారు. ఆ పురం ఏర్పడక ముందు ఈ ప్రదేశమంతా జొన్నచేలతో నిండి ఉండేది.

మాచవరం

కాకతీయ రుద్రదేవుడు (1వ ప్రతాపరుద్రుడు) క్రీ.శ. 1158-1195. చాళుక్యుల సామంతునిగా ఉంటూ తూర్పు చాళుక్యులు బలహీనపడటం చూచి క్రీ.శ. 1163లో స్వతంత్రతను ప్రకటించుకున్నారు. ఇతని రెండు శాసనాలు బందరు దగ్గర కాజ గ్రామంలోనూ, పెద్ద కళ్ళేపల్లిలోనూ లభించాయి. ఇతని కాలంలో కాకతీయ రాజ్యం తూర్పు బంగాళాఖాతం నుంచి శ్రీశైలం వరకూ విస్తరించింది. మొదటి ప్రతాప రుద్రుని కాలంలో మాచభూపతి అనే కాకతీయ ప్రతినిధి బందరులో నివశిస్తూ నేటి మాచవరం ప్రాంతపు మెరకతేలిన భూమిని నివేశన స్థలం కింద పట్టాలు గ్రహించాడు. ఆయన పేరుతో మాచవరం ఏర్పడింది. మాచభూపతి పొందిన వరం కనుక గతంలో మాచవరం ప్రత్యేకంగా గ్రామంగా ఉండేది. ఆ తరువాత బందరు పురపాలికలో విలీనం అయింది.

శివగంగ

చల్లపల్లి జమీందారు శ్రీమంత్ యార్లగడ్డ పెదఅంకినీడు, వారి ఇలవేల్పు మహిషాసురమర్దిని అమ్మవారికి 17వ శతాబ్దంలో ఆలయం నిర్మించారు. అమ్మవారి దేవస్థాన పుష్కరిణి కోసం కాశీ నుంచి గంగా నదీ జలం తెప్పించి పోయించినందున దేవాలయ ప్రాంతానికి శివగంగ అని పేరు పెట్టారు. ఇది బందరు పురపాలిక పరిధిలో ఉంది.

అనీస్‌పేట

1558వ సంవత్సరంలో అనీస్‌ఖాన్ అనే పేరు గల మహ్మదీయుడు ఈ ప్రాంతంలో గృహ నిర్మాణాలు చేయించాడు. అనీస్‌ఖాన్ పేరుతోనే ఇక్కడి గ్రామం ఏర్పాటైంది. ఇది బందరు పురపాలికలో ఉంది.

రాజుపేట

వత్సవాయి తిమ్మ 'రాజు' పేరుతో రాజుపేట ఏర్పడింది. పూసపాటి 'గజపతి' మహరాజులు నివశించినందున రాజుపేట అనే పేరు వచ్చిందని చెబుతారు. ముక్కంటి అనే రాజు పరిపాలిస్తున్న కాలంలో ఇనుకుదురుకు 2 కి.మీ దూరంలో రాజుపేటను కొత్తగా నిర్మించినట్టు మెకంజీ కైఫియత్ ద్వారా స్పష్టమవుతోంది. ఇది బందరు పురపాలికలో ఉంది.

ఇంగ్లీషుపాలెం

పూర్వం వస్త్రాలపై అద్దకం(రంగులు) అద్దేవారిని ముసల్మానులు 'రంగరేజులు' అనేవారు. గతం నుంచి బందరు కలంకారీలకు, అద్దకం గుడ్డలకు పెట్టింది పేరు. ఈ రంగ రేజులు నివశించే ప్రాంతం రంగ్రేజు పాలెం. ఇంగ్లీషు వారు బందరు చేరి, అద్దకం కలంకారీ బట్టలు కొనుగోలు కోసం ఈ రంగరేజు పాలెంలో గోదాములు కట్టుకొని, ఇక్కడే ఉండేవారు. ఇంగ్లీషు వారిని ముస్లింలు 'అంగ్రేజులు' అని పిలిచేవారు ఇంగ్లీషు వారు నివశించినందున రంగరేజు పాళెం కాస్త ముస్లింల నోట (ఇంగ్లీషు వారి పాళెం) అది కాస్త ఆంగ్లీకరణలో ఇంగ్లీషు పాలెం అయింది. ఇది కూడా బందరు పురపాలికలోనే ఉంది.

చిలకలపూడి

గతంలో ఇది ఓ పల్లెగా ఉండి. 1865లో బందరు మున్సిపాలిటీలో విలీనమైంది. తాటి చెట్లతో నిండి ఉండేది. ఎండిన తాడిచెట్ల మొవ్వు భాగంలో చిలకలు గుడ్లు పెట్టి సంతానోత్పత్తి చేసుకునే విధానాన్ని గమనించిన పూర్వీకులు గ్రామంలో చిలకల సందడి చూసి చిలుకలు ఎక్కువుగా ఉన్న పూడి (గ్రామం) అని పిలుచు కొన్నారు. అంచేత ఇది చిలకలపూడి అయినట్లు స్పష్టంగా తెలుస్తోంది.

గొడుగుపేట

గొడుగుపేట తొలుత గ్రామంగా ఉండి ఆ తరువాత బందరు పురపాలికలో విలీనమైంది. గొడుగుపేట అనే పదాన్ని సంస్కృతీకరించి ఛత్రపూర్ అని కూడా అన్నారు. నల్లగుడ్డ గొడుగులు రాకముందు పూర్వం ప్రజలు తాటాకుల గొడుగును వానకు, ఎండకు పట్టేవారు. బందరు నగరంలో గొడుగుల పరిశ్రమ వర్ధిల్లిన ప్రదేశం కావడంతో గొడుగుపేట అని పిలుస్తారు. ఇక్కడ శంకర మఠం ఉంది. ప్రముఖ పండితులు వ్యాపారవేత్తలు ఇక్కడ నివశించేవారు.

హంసలదీవి

కృష్ణా జిల్లాలో ప్రసిద్ధి చెందిన ప్రాంతం ఇది. కోడూరు మండలంలో ఉంది. ఒకసారి ఇద్దరు గంధర్వులు ఆకాశయానం చేస్తున్నారు. కృష్ణానది ప్రాంతానికి వచ్చేసరికి అక్కడ ఓ మహర్షి తపస్సు చేసుకుంటున్నాడు. అతని నల్లని శరీరాకారాన్ని చూసిన గంధర్వులు ఎగతాళి చేశారు. ఆ మహర్షి ఆగ్రహంతో కాకులుగా మారిపోవాలని గంధర్వులను శపించాడు. తమను మన్నించాలంటూ ఆ గంధర్వులు మహర్షిని వేడుకున్నారు. కృష్ణానది తీరాల్లో స్నానం చేస్తే ఏదో ఒక తీరంలో కాకులు రూపం పోయి హంసల రూపం వస్తుందని ఆ మహర్షి శాప విమోచనం గూర్చి పేర్కొన్నాడు. ఇలా కృష్ణానది తీరాల్లో స్నానం చేస్తుండగా ఈ దీవి దగ్గర గంధర్వులకు హంసల రూపం వచ్చింది. ప్రతి రోజు రాత్రి వేళ యోగీశ్వరులు హంసల రూపంలో ఇక్కడకు వచ్చి కృష్ణానదిలో స్నానం చేసేవారు. ఆ తరువాత వేణుగోపాలస్వామిని సేవించేవారు. అందుకే ఈ దీవికి హంసల దీవి అని పేరు వచ్చినట్టు ఓ కథ ప్రచారంలో ఉంది. హంస ఆకారంతో పక్షులు ఇక్కడ సంచరించేవని అందుకే ఈ దీవిని హంసల దీవి అంటారని మరో కథనం కూడా ప్రచారంలో ఉంది.

గన్నవరం

ఈ ప్రాంతాన్ని విష్ణుకుండినుల కాలంలో జ్ఞానవరం అనే పిలిచేవారు. ఓ సనాతన ధర్మక్షేత్రంగా వర్ధిల్లింది. ఇంతకు పూర్వం గన్నవరం తాలూకాగా ఉండి మండల కేంద్రంగా మారింది. జనవ్యవహారంలో జ్ఞానవరం గన్నవరంగా మారింది. తొలుత గన్నవరాన్ని కొన్నేళ్ల పాటు గనివారంగా కూడా పిలిచేవారు. అయితే ప్రస్తుతం గన్నవరంగా స్థిరపడింది.

వణుకూరు

ఈ గ్రామం పెనమలూరు మండలంలో ఉంది. పూర్వం ఈ ప్రాంతం అంతా చిన్న,చిన్న గుట్టలు, దిబ్బలతో నిండి ఉండేది. అప్పుడు కొంత మంది సాలెవాళ్లు వచ్చి అక్కడ నివాసం ఏర్పరుచుకున్నారు. వారంతా నూలు వడికి బట్టలు నేస్తుండేవారు. అందుచే ఈ ప్రాంతాన్ని వడుకూరు అని పిలిచేవారు. కాలక్రమంలో వనుకూరుగా మారింది. చివరకు వణుకూరుగా స్థిరపడింది.

నడకుదురు

ఈ గ్రామం చల్లపల్లి మండలంలో ఉంది. నరకాసురుని వధ ఈ ప్రాంతంలోనే జరిగిందని ఇతిహాసం వల్ల తెలుస్తోంది. ప్రజలందరిలోను ఆనందాన్ని నింపిన ఆ నరకాసురుని వధ నడకుదురు ప్రాంతంలోనే జరిగిందని స్కందపురాణం చెబుతోంది. నరకాసురుడు ఇక్కడ ద్విముఖుడు అనే బ్రాహ్మణుణ్ణి సంహరించాడు. ఆ పాప పరిహారార్ధం పృథ్వీశ్వరుడికి ఈ ప్రాంతంలో పూజలు చేశాడని చెబుతారు. నదీ తీర గ్రామమైన నడకుదురు ఆనాడు నరకోత్తారక క్షేత్రంగా విలసిల్లింది. నరకుని వధ అనంతరం శ్రీకృష్ణుడు సత్యభామ సమేతుడై ఇక్కడ వెలసిన లక్ష్మీనారాయణలను ఆరాధించాడని పురాణకథనం. నరకోత్తర క్షేత్రంగా విలసిల్లిన ఈ ప్రాంతం తరువాత కాలంలో నరకొత్తూరు, నడకదూరు, నడకుదురుగా రూపాంతరం చెందింది. శ్రీకృష్ణ డు పూజించినట్టు చెప్పే లక్ష్మీనారాయణ విగ్రహాలు ఇక్కడ కార్తీక వనంలోని ఓ గుడిలో ఉన్నాయి.

గుడివాడ

విజయవాడకు 45 కి.మీ దూరంలో ఉంది. ఇది మండల, నియోజకవర్గ కేంద్రం. ఇక్కడ ఆలయాలు ఎక్కువగా ఉండటం వల్ల గుడులవాడ, గుళ్లవాడగా కాలగమనంలో గుడివాడగా రూపాంతరం చెందింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. ఈ ప్రాంతంలో కృష్ణ మందిరం ఉంది. ఇక్కడ గల భీమేశ్వరాలయం ఎంతో వాసి కెక్కింది. ఈ ఆలయం ముఖమంటపంపై నారదుడు, తుంబురుడు, శ్రీరాముడు, పరమేశ్వరుడు, బ్రహ్మతదితర విగ్రహాలు ఉన్నాయి. ఆలయ ప్రాంగణంలో రావిచెట్టు కింద పెద్ద పుట్ట ఉంది. ఈ వృక్షం మొదలులో శ్రీ మహాగణపతిని ఒకవైపు దాసాంజనేయుని మరో వైపు ప్రతిష్ఠించారు. ఇక్కడి గల జగన్నాధపురంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం కూడా ప్రసిద్ధి చెందినదే. ఇలా ఎన్నో ఆలయాలకు ఈ పట్టణం కేంద్రంగా మారింది.

మువ్వ

ఇక్కడ వేణుగోపాలస్వామి ఆలయం ఓ ప్రముఖ క్షేత్రంగా విరాజిల్లుతోంది. ఆలయ గర్భగుడిలోని వేణుగోపాలుడిని మువ్వగోపాలుడు అంటారు. మువ్వ పేరుతో ఈ గ్రామం తొలుత ఏర్పాటైంది. తరువాత మొవ్వగా స్థిరపడింది. వరదయ్య అనే వాగ్గేయకారుడు మువ్వగోపాలుడిమీద అనేక శృంగార పదకవితలను రాశాడు.

కూచిపూడి

సిరిమువ్వల రవళికి శాశ్వత చిరునామా కూచిపూడి. ఇది మొవ్వకు సమీపంలో ఉంది. గోల్కొండ నవాబు అబ్దుల్ హసన్ కుతుబ్‌షా (1672-1687) ఈ పల్లెను బ్రాహ్మణులకు అగ్రహారంగా దానం చేశాడు. క్రీ.శ 1506 నుంచి 1509 వరకూ పరిపాలించిన వీరనృసింహ దేవరాయల ఆస్థానంలో కూచిపూడి బ్రాహ్మణులు కేళికా నృత్యాన్ని ప్రదర్శించినట్టు మెకంజీ కథనాలను బట్టి స్పష్టమౌతోంది. అంటే కూచిపూడిలో నృత్యనాటకం క్రీ.శ. 1500లకు పూర్వమే ఉన్నట్టు తెలుస్తోంది. సాహిత్య, వేదాంతాలలో నిష్ణాతుడైన సిద్ధేంద్ర యోగి "భామాకలాపం" రచించి కూచిపూడి బ్రాహ్మణులకు నేర్పించారు. ఇంతకీ ఈ గ్రామానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే....కూచి అంటే వికసితమని అర్థం. ఇక్కడ నృత్యకళ బహుముఖాలుగా వికసించింది. దీంతో ఈ పల్లెకు తొలి పదంగా కూచి అని పేరు పెట్టినట్టు ఓ కథనం ప్రచారంలో ఉంది. ఈ ప్రాంతం కృష్ణానది పరీవాహక ప్రాంతంలో ఉంది. దీంతో ఉత్తర పదం పూడి చేరింది. పూడి అంటే జల ప్రవాహం అని అర్థం. ఇలా కూచిపూడి అయింది. ఆంధ్రప్రదేశ్ భాషా, సాంస్కృతిక శాఖ, సిలికానాంధ్ర సంయుక్తంగా 2016 డిసెంబరు 23, 24, 25 తేదీల్లో విజయవాడ ఇందిరాగాంధీ నగరపాలక సంస్థ స్టేడియంలో నిర్వహించిన అంతర్జాతీయ కూచిపూడి నాట్య సమ్మేళనం ప్రపంచ కళాచరిత్రలో ఓ మైలు రాయిగా నిలుస్తుంది. ఈ సమ్మేళనంలో 18 దేశాల నుంచి వచ్చిన 6,117 మంది నాట్య కళాకారులు ప్రదర్శించిన "జయహో కూచిపూడి" గిన్నిస్ ప్రపంచ రికార్డులో నమోదు కావడం గొప్ప విశేషం.

భావదేవరపల్లి

ఈ గ్రామం నాగయలంక మండలానికి 7 కి.మీ దూరంలో ఉంది. ఇక్కడ గల భావన్నారాయణస్వామి ఆలయం ప్రసిద్ధి చెందింది. ఇక్కడ స్వామి స్వయంభువు. మూడు అడుగుల ఎత్తులో స్వామి విగ్రహం ఉంది. ఈ భావన్నారాయణస్వామిని ఎవరెవరు ఏ భావంతో కొలిస్తే ఆ భావానికి అనుకూలంగా స్వామి కరుణిస్తాడని స్థలపురాణం పేర్కొంటోంది. భావనారాయణుని పేరుతోనే భావదేవరపల్లి గ్రామం అవతరించింది.

మోపిదేవి

ఇది మండల కేంద్రం. మచిలీపట్నానికి 30 కి.మీ దూరంలో ఉంది. తొలుత మోహినిపురంగా పిలిచేవారు. జనం వాడుకలో క్రమంగా మోపిదేవిగా స్థిరపడింది. మోపిదేవి ఇంటి పేరుగల కుటుంబాలు ఎన్నో ఉన్నాయి.

కైకలూరు

ఇది మండల కేంద్రము. దీని తొలి పేరు కైంకర్యపురం. ఇది కొల్లేరు సమీప గ్రామం. కైంకర్యపురమే జన వ్యవహారంలో కైకలూరుగా మారినట్టు ఈ గ్రామానికి చెందిన రచయిత పిరాట శ్రీరామమూర్తి పేర్కొన్నారు. ఇక్కడ గల శ్రీశ్యామలాంబ అమ్మవారి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది.

తిరుమలగిరి

జగ్గయ్యపేటకు 3 కి.మీ దూరంలో ఉంది. శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీవెంకటేశ్వరస్వామి గ్రామానికి ఉత్తరంగా ఉన్న తిరుమలగిరిపై వెలిశాడు. తిరుమల గిరి అంటే పవిత్రమైన కొండ అని అర్థం. ఈ కొండ పక్కనే గల గ్రామం తిరుమలగిరి పేరుతో వెలిసింది.

నెమలి

ఇది గంపలగూడెం మండలంలో ఉంది. శ్రీకృష్ణుడు ద్వాపరయుగంలో తన అవతారాన్ని చాలిస్తూ శిరస్సు లోని నెమలి పించాన్ని ఇక్కడ వదిలాడు. అదే చోట తాను విగ్రహరూపాన్ని ధరించి భూగర్భంలో వెలిశాడు. ఈ వేణుగోపాలున్ని

ఎందరో మహానుభావులు యోగ దృష్టితో దర్శించి తరించారు. ఈ ప్రాంతాన్ని నెమలి గ్రామంగా పిలుస్తున్నారు. నెమలిని జాతీయ పక్షిగా గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం 1963 జనవరి 31న ఉత్తర్వులు జారీ చేసింది. ఇక నెమళ్లదిన్నె పేరుతో కడప జిల్లాలో ఓ గ్రామం ఉంది.

ఆగిరిపల్లి

ఇది మండల కేంద్రం. విజయవాడకు 25 కి.మీ దూరంలో ఉంది. ఇక్కడ ఉన్న కొండను శోభనాచలం అంటారు. ఈ కొండపై కొలువైన లక్ష్మీనరసింహస్వామిని వరహనరసింహస్వామి అని కూడా పిలుస్తారు. మహిమగల దేవుడు. ఈ ఆగిరిపల్లిని దక్షిణ సింహాచలంగా వ్యవహరిస్తారు. కిరి అనే మాటకు వరహం అనే అర్థం ఉంది. కనుక ఈ ప్రాంతానికి ఆకిరిపల్లి అనే పేరు వచ్చింది. కాలక్రమంలో ఇది ఆగిరిపల్లిగా మారింది.

ఐలూరు

ఇది తోట్లవల్లూరు మండలలో ఉంది. పూర్వం ఈ గ్రామంలో అయ్యలు నివశించేవారు. అయ్యలు అంటే నియమనిష్టలతో జీవితాన్ని గడిపేవారని అర్థం. వీరు ప్రజలకు ధర్మ ప్రబోధం చేసేవారు అంచేత అయ్యలూరు అని ఈ గ్రామానికి పేరు వచ్చింది. అయ్యలూరు క్రమంగా ఐలూరుగా మారింది. ఇక్కడ గల రామలిం గేశ్వరస్వామి ఆలయం దక్షిణకాశిగా పేరు పొందింది. ఈ ఆలయం విశేషం ఏమిటంటే నందీశ్వరుడు, అమ్మవారు లేని ఆలయం ఇది.

కవుతరం

ఈ గ్రామం గుడ్లవల్లేరు మండలంలో ఉంది. గుడివాడ సమీపంలో ఉన్న కవుతరం సామాజిక చైతన్యానికి ఆటపట్టయిన పట్టణాలలో ఒకటి. ఈ గ్రామంలో గౌతమేశ్వరస్వామి దేవాలయాన్ని తొలుత ఏర్పాటు చేశారు. అంచేత గౌతమవరం అనేపేరు ఆ గ్రామానికి వచ్చింది. ఈ గౌతమవరమే జనవ్యవహారంలో కౌతరం, కవుతరం అయింది.

కొణకంచి

ఇది పెనుగంచిప్రోలు మండలంలో ఉంది. జగ్గయ్యపేట సమీపంలో కొణకంచి ఓ శివారు గ్రామం. ఈ గ్రామంలోని హనుమాలయంలో దొరికిన ఒక శాసనంలో ఈ ఊరిపేరు కొండకంచి అని ఉంది. "శాకాబ్దే గజతర్క ఖేను గణితౌ శ్రీ కొండ స్థిత" అని శ్రీశైలం నుంచి కృష్ణానది పరివాహక ప్రాంతం వెంబడి ఒకటే పర్వత వరుస నదికి ఇరువైపులా కంచెలా ఉందని, ఆ పర్వతం రెండో కొన ఈ ఊరి దగ్గరుంది కాబట్టి ఇది "కొణకంచి" అయిందని దీని భావం. కొనగిరిని అంటివున్న ఊరు కొణకంచి.

శ్రీకాకుళం

విజయవాడకు 65 కి.మీ దూరంలో ఘంటసాల మండలం దివి సీమలో కృష్ణాతీరాన శ్రీకాకుళం అనే గ్రామం ఉంది. ఇక్కడ గల ఆంధ్రమహావిష్ణువు ఆలయం ఎంతో ఖ్యాతికెక్కింది. ఇది ప్రాచీన ఆలయం. ఇందలి విష్ణువు తెలుగు భాషా ప్రియుడు. కలియుగంలో అధర్మాన్ని పాపాన్ని నివారించేందుకు బ్రహ్మదేవుడు కృష్ణా తీరంలోని ఈ ప్రాంతం వద్ద మహా విష్ణువు అనుగ్రహానికై అవతరించాడు. బ్రహ్మసంకల్పాన్ని తెలుసుకున్న విష్ణువు ప్రత్యక్షమై వరం కోరుకోమనగా విష్ణువు ఇక్కడే నివశించడంతో పాటూ తన పేరుతో ప్రసిద్ధ మయ్యే విధంగా వరం ఇవ్వాలని కోరాడు. తదనుగుణంగా ఈ క్షేత్రానికి కాకుళం అనే పేరు వచ్చింది. 'క' అంటే బ్రహ్మ, 'ఆకులము'స్థానం అని అర్థం. బ్రహ్మకు స్థానమైనది కాకుళము. క్రమంగా శ్రీకాకుళంగా స్థిరపడింది. ఇక్కడ ప్రతిష్టించిన శ్రీమహావిష్ణువు శ్రీకాకుళేశ్వరుడు అన్న పేరుతో ప్రఖ్యాతిగాంచాడు. ఆయన పేరుతోనే శ్రీకాకుళం వెలసిందని గ్రహించాలి. శ్రీకాకుళేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీ కృష్ణ దేవరాయలు "ఆముక్తమాల్యద" కావ్య రచనకు శ్రీకారం చుట్టినట్టు స్పష్టమౌతోంది. చారిత్రకంగా, పౌరాణికంగా ప్రసిద్ధి పొందిన శ్రీకాకుళం శాతవాహనుల కాలంలో ఆంధ్రుల తొలి రాజధానిగా ఉండేది.

నందిగామ

ఇది మండల,పురపాలిక కేంద్రం. ఈ ప్రాంతానికి చెందిన రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు ఆంధ్ర ప్రాంతమంతట 108 శివాలయాలను ప్రతిష్ఠ

చేశారు.అందులో భాగంగా ఈ ప్రాంతంలో 400 ఏళ్ల క్రితం ఒక శివాలయాన్ని కూడా నిర్మించారు. ఈ శివాలయంలో ఉన్న నందీశ్వరుని పేరుపై నంది గ్రామాన్ని ఏర్పాటు చేశారు. కాలక్రమంలో నందిగామగా మారింది. అవిభక్త ఆంధ్రప్రదేశ్ తొలి శాసనసభ స్పీకర్ అయ్యదేవర కాళేశ్వరరావు ఈ గ్రామంలోనే జన్మించారు.

జగ్గయ్యపేట

ఇది మండల కేంద్రం. అమరావతిని రాజధానిగా చేసుకొని పరిపాలించిన వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు (18వ శతాబ్దం) తన తండ్రి జగ్గయ్యపేరుతో ఓ గ్రామానికి నామకరణం చేశారు. అదే కృష్ణా జిల్లాలోని జగ్గయ్యపేట. దీని తొలిపేరు బేతవోలు. దీన్నె దొంగల బేతవోలు అని కూడా ఆ రోజుల్లో వ్యవహరించేవారు. గతంలో ఇక్కడ దొంగ బంగారం విక్రయాలు ఎక్కువగా జరిగేవి.

గూడూరు

ఇది మండల కేంద్రం. ఇక్కడ గుడులు ఎక్కువుగా ఉన్నాయి. దీంతో ఆ ఊరికి గూడూరు అనే పేరు వచ్చింది. ఇక్కడ మాధవస్వామి ఆలయం, వెంకటచలపతి ఆలయం, నరసింహాలయం, సీతారామ ఆలయం, షిరిడి సాయిబాబా ఆలయం, వెంకమ్మ, సీతమ్మ పేరంటాళ్లు, పట్టాభిరామయ్య ఆలయం, ఆంజనేయస్వామి ఆలయం, గణపతి దేవస్థానం, సర్వమతానుసారంగా మసీదు ఇక్కడ ఉన్నాయి. నెల్లూరు జిల్లాలో గూడూరు పేరుతోనే మరో ఊరు ఉంది. కాగా కడప గ్రామీణ మండలంలో గూడూరు పేరుతో ఓ గ్రామం వెలసింది.

నూజివీడు

కృష్ణా జిల్లాలోని ప్రాచీన పట్టణాలలో ప్రముఖంగా పేర్కొనదగిన పట్టణం నూజివీడు. జమీందారీ, కుటుంబాలకు నిలయమైన ఈ పట్టణం క్రీ.శ. 1570లో ఏర్పాటైనట్టు చారిత్రక ఆధారాల వల్ల స్పష్టమవుతోంది. నువ్వుచేలతో నిండిన ప్రాంతం కావడంతో ఈ పట్టణానికి నువ్వుచేలవీడు అని నామకరణం చేశారు. అది క్రమంగా నూచేలవీడు, నూజేలవీడు, చివరకు నూజివీడుగా మారింది. ఇక్కడి కోట చూపరులను ఆకట్టుకుంటుంది. ఇందులోనే కోటమహిషమ్మ ఆలయం

ఉంది. 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం కన్నా ముందుగా నూజివీడులో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాటం జరిగినట్టు చరిత్ర పేర్కొంటోంది. నూజివీడు జమీందారులు మంచి దాతృత్వం కలిగినవారు.

ఉయ్యూరు

ఇది మండల, నగర పంచాయితీ కేంద్రం. నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉంది. ఉయ్యూరు పూర్వ నామం ఉర్వరాపురి. కృష్ణానది నుంచి ఉయ్యూరు ప్రాంతానికి వచ్చే పుల్లేరు కాలువ ఇక్కడి ఆర్టీసీ డిపో సమీపంలో గల లాకుపై "డబ్ల్యు.ఇ.ఐ.ఆర్" (ఏర్) అని రాసి ఉంది. ఉర్వి అంటే భూమి, ఏర్ అంటే ఏరు అని గ్రహించాలి. ఈ రెండు పదాల కలయికతో ఉయ్యూరుకు ఆ పేరు వచ్చినట్టు స్థానిక సరసభారతి అధ్యక్షులు గబ్బిట దుర్గాప్రసాద్ ఈ రచయితకు తెలిపారు. పుల్లేరులో "ఏరు"ను సైతం తీసుకోవచ్చు. ఇలా ఉయ్యూరు నామధేయం సంతరించుకుంది. ఉయ్యూరుకు విశిష్ట చరిత్ర ఉంది. నూజివీడు జమీందారుల ఏలు బడిలో ఓ వెలుగు వెలిగింది. ఇక్కడ గల కే.సి.పి చక్కెర కర్మాగారం రైతుల పాలిట కల్పవృక్షంగా ఉంది. ఇక్కడి జగదాంబ సహిత సోమేశ్వరాలయం, పంచ పట్టాభిరామస్వామి ఆలయం నూజివీడు జమీందారుల హయాంలోనే నిర్మితమయ్యాయి. కాగా స్థానిక సువర్చల ఆంజనేయస్వామి ఆలయం కూడా ప్రసిద్ధి చెందినదే.

తిరువూరు

ఇది మండల కేంద్రం. దీని తొలి పేరు లక్ష్మీపురం. జమీందారుల పరిపాలనలో ఉండేది. ఒకసారి ఏమైందంటే అన్నాజీరావు తన భార్యతో కలిసి తిరుమల-తిరుపతి క్షేత్రానికి నాటు బండిపై ప్రయాణం చేసి శ్రీవేంకటేశ్వరస్వామిని సందర్శించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వీరికి శఠగోపాన్ని అందించాడు. పవిత్రమైన శఠగోపంతో ఇంటికి చేరిన ఆ పుణ్య దంపతులు తమ ఇంటికి సమీపంలో ఓ ఆలయాన్ని నిర్మించారు. వారిద్దరూ తిరుపతి నుంచి రావడంతో "తిరు" అని, ఆ శఠగోపం గ్రామగ్రామాల్లో పూజలందుకోవడం వల్ల ఊరు అని పేరు వచ్చింది. తిరు, ఊరు కలయికతో తిరువూరుగా స్థిరపడింది. తిరు అంటే శ్రేష్ఠమైనదని, పూజ్యమైనదని అర్థం చేసుకోవాలి.

గురజాడ

ఇది గ్రామం పమిడిముక్కల మండలంలో ఉంది. మహాకవి గురజాడ అప్పారావు తాత ముత్తాతలు ఈ గ్రామానికి చెందినవారే. గురజాడ వంశంపేరుతో ఈ గ్రామం అవతరించింది. గురజాడ ఇంటిపేరుతో ఓ గ్రామం ఉండడం విశేషం. అయితే ఆ తరువాత గురజాడ వంశీయుల్లో హెచ్చు మంది విశాఖ జిల్లా ప్రాంతానికి వలస వచ్చారు.

ముక్త్యాల

ఇది జగ్గయ్యపేట మండలంలో ఉంది. ఇక్కడ శ్రీ భవానీ ముక్తేశ్వరాలయం నెలకొని ఉంది. ఇది అతి ప్రాచీన శైవ క్షేత్రం. కృతయుగంలో బలిచక్రవర్తి తపస్సుకు మెచ్చి ప్రత్యక్షమైన పరమేశ్వరుడు మరకతలింగస్వరూపుడై ముక్తేశ్వరునిగా కృష్ణాతీరంలో వెలిశాడు. ముక్తేశ్వరలింగంగా పిలిచే ఈ స్వామి ఆలయం విశ్వకర్మునిచే నిర్మించినట్టు స్థలపురాణం వల్ల వ్యక్తం అవుతోంది. ముక్తికి ఆలవాలమైన పవిత్ర క్షేత్రంగా ముక్తిధామంగా విరాజిల్లుతోంది. కృష్ణా తీరానికే వన్నె తెచ్చింది. ఈ ముక్త్యాల సంస్థానం మౌలికంగా సాహితీ పోషణ చేసి ఖ్యాతి గడించింది అని "కృష్ణా జిల్లా సర్వస్వం"లో ఉటంకించారు.

కంకిపాడు

ఇది మండల కేంద్రం. వరి, చెఱకు పంటలను విస్తారంగా పండిస్తారు. వరిధాన్యం ఎకరానికి 35 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వస్తుంది. వరి ఎన్ను (కంకి) ఎంతో బలంగా ఉంటుంది. అంచేత గ్రామ నామంలో కంకి అనే పూర్వ పదం కనిపిస్తుంది. పాడు అంటే పాటి నేల అని అర్థం. కాగా ఒకప్పుడిది జైనుల ఆవాసంగా ఉండేది. అంచేత కంకిపాడు అనే పేరు వచ్చినట్టు స్థానికులు పేర్కొన్నారు.

యలమర్రు

ఇది పెదపారుపూడి మండలం లోని అతి పెద్ద గ్రామాల్లో ఒకటి. దీనికి వెయ్యేళ్ల చరిత్ర ఉంది. సుమారు 80 జంగమదేవర కుటుంబాలు ఉండేవి. ఉయ్యూరు గ్రామంలోని ఒకే సామాజిక వర్గానికి చెందిన నూరు కుటుంబాలవారు

యలమర్రుకు వలస వచ్చి స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఇది ఎంతో చారిత్రాత్మకమైన గ్రామం. ఈ గ్రామానికి చెందిన సుంకర చంద్రమౌళీశ్వరరావు విప్లవయోధుడు. ఆనాటి ప్రజా ఉద్యమాలలో పాల్గొని కారాగార శిక్ష అనుభవించారు. గ్రంథాలయ ఉద్యమంలో ప్రముఖ భూమికను పోషించారు యలమర్రు వంశీయులు ఈ గ్రామాన్ని ఏర్పాటు చేసినట్టు తెలుస్తోంది. ఈ గ్రామంలో వెలసిన శివాలయం, విష్ణు ఆలయం, వేణుగోపాలస్వామి, అంకమ్మ, గంగానమ్మ ఆలయాలు ఎంతో ప్రసిద్ధి చెందిన ఈ పల్లెలో రెండు దశాబ్దాల వ్యవధిలో రెండు ఘోర విషాద సంఘటనలు జరిగాయి. ఇక్కడి నుంచి పశ్చిమగోదావరి జిల్లాకు తరలిపోయిన అనేక కుటుంబాల వారి ఇంటి పేర్లు యలమర్రు కావడం విశేషం.

తోట్లవల్లూరు

దీని అసలు పేరు వల్లూరు. ఇది వల్లూరు జమీందార్ల రాజధాని నగరం. తోటలు ఎక్కువగా ఉన్న వల్లూరు కాబట్టి దీనికి తోట్లవల్లూరు అనే పేరు వచ్చింది. సారవంతమైన భూమి ఉండడంతో బంగారు పంటలు పండుతున్నాయి.

వీరులపాడు

ఇది మండల కేంద్రం. ఇది కమ్యూనిస్టుల కంచుకోట. ఇది ఒకప్పుడు యాదవుల రాజ్యంగా ఓ వెలుగు వెలిగింది. ఈ పల్లెలోని యాదవులు వీర్ల కొలువులు జరిపేవారు. అంటే వీరులనే దేవతలను ఆరాధించేవారు. అంచేత దీనికి వీరులపాడు అనే పేరు వచ్చినట్టు మాజీ సర్పంచ్, సి.పి.ఐ నాయకుడు వట్టికొండ చంద్రమోహన్ ఈ రచయితకు చెప్పారు. అయితే ఈ గ్రామంలో ప్రస్తుతం యాదవులు ఒక్కరు కూడా లేరని వివరించారు. "చరిత్రగతిలో చైతన్య వాహిని–వీరులపాడు" అనే గ్రంథాన్ని పాటిబండ్ల వెంకటపతి రాయలురాశారు. ఈ పల్లెలోని పలువురు నిజాంపాలనకు వ్యతిరేకంగా సాయుధపోరాటం జరిపారు. కమ్యూనిస్ట్ నాయకులు చంద్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య రావినారాయణరెడ్డి తదితరులు రహస్యంగా ఇక్కడే తలదాచుకున్నారు. పల్నాటి యుద్ధటి యుద్ధం తరువాత అక్కడి నుంచి కమ్మ సామాజిక వర్గం వారు ఇక్కడకు వలస వచ్చారు.

ఘంటశాల

ఇది చల్లపల్లికి 5 కి.మీ దూరంలో ఉంది. ఇది అలనాటి ప్రాచీన నౌకా కేంద్రం కూడా. ఇక్కడ వెలసిన బాలపార్వతీ సమేత జలధీశ్వరస్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. దీన్ని అగస్త్యుడు ప్రతిష్ఠించాడు. ఈ ఆలయంలోని రాతి నంది కాలికి ఇనుప కడియం ఉంది. గుడిగంట మోగిస్తే "ఓం" అనే శబ్దం గోపురం శిల నుంచి అంతర్లీనంగా ధ్వనిస్తుంది. దీంతో ఈ ప్రాంతానికి గంట శిల అని పిలిచేవారు. కాలక్రమంలో గంటశిల, ఘంటశాలగా స్థిరపడినట్టు జనవాక్యం. మరో కథనం ప్రకారం బుద్ధుని గుర్రం 'కంటకం' దాని పేరు మీద ఇక్కడ బౌద్ధారామం పేరు కంటకశైలగా వచ్చింది. కంటశైల క్రమేపీ 'ఘంటశాల'గా మారినట్టు ఐతిహ్యం వల్ల తెలుస్తోంది. చరిత్ర రచనా చక్రవర్తి, స్వాతంత్ర్య సమరయోధుడు పండిత గొర్రెపాటి వెంకట సుబ్బయ్య ఈ గ్రామంలోనే జన్మించారు.

అవనిగడ్డ

ఇది మండల, పురపాలిక కేంద్రం. దివిసీమకే గర్వకారణమైన ప్రాంతం ఇది. శాతవాహనుల కాలంలో రేవు, వ్యాపార కేంద్రంగా ఉన్న ఈ ప్రాంతాన్ని "అలాపైని" అనే పేరుతో ప్రసిద్ధమైన ఓడరేవు ఇది. క్రీ.పూ 3 నుంచి 13వ శతాబ్దం వరకు ఈ రేవు ద్వారా పెద్ద నావలతో వ్యాపారం జరిగేది. కృష్ణా ముఖద్వారమైన ఒకప్పటి చిన్న రాజ్యం అవనిగడ్డ. 3వ శతాబ్దానికి చెందిన బృహత్పలాయన ప్రభువులు దీన్ని ఏర్పాటు చేశారు. వీరరాజచోడ నారాయణ దేవర ఆలయం ఉంది. దీన్ని ప్రస్తుతం లక్ష్మీనారాయణ ఆలయం అని పిలుస్తున్నారు. ఇది కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలో ప్రవాహాల ఒడ్డున గల ఎత్తయిన ప్రాంతంలో ఈ పట్టణం ఉంది. అవనికే ఆభరణంగా ఉంది. ప్రవాహాల ఒడ్డున గల భూభాగాన్ని గడ్డ అని పిలుస్తారు. ఇలా దీనికి అవనిగడ్డ అని పేరు వచ్చింది. మాజీ మంత్రి దివంగత మండలి వెంకట కృష్ణారావు, శాసనసభ ఉప సభాధిపతి మండలి బుద్ధప్రసాద్‌ల స్వగ్రామం ఇదే.

అల్లూరు

ఇది ముదినేపల్లి మండలంలో ఉంది. దీని పేరు వెనుక గల చరిత్రను పరిశీలిస్తే.. గోల్కొండ నవాబుల్లో ఒక రైన అల్లీఖాన్ పేరు మీదుగా ఈ పల్లె ఏర్పాటైంది. అల్లి, ఊరు అల్లూరు అయింది. దీన్ని బ్రాహ్మణులకు అల్లీఖాన్ అగ్రహారంగా ఇచ్చాడు.

వడాలి

ఇది ముదినేపల్లి మండలంలో ఉంది. జగన్నాథస్వామిని కొలవాలంటే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఒడిషా రాష్ట్రంలోని పూరీ పట్టణానికి వెళ్ళాల్సిందే. అయితే మరో పూరీని దర్శించాలంటే మన రాష్ట్రంలోని వడాలికి విచ్చేయాల్సిందే. ఈ దేవాలయం దక్షిణాది పూరీగా ప్రసిద్ధి చెందింది. 1765లో ప్రకాశం జిల్లా కర్రపాళేనికి చెందిన పురుషోత్తమానందస్వామి ఈ ఆలయాన్ని నిర్మించినట్టు చరిత్ర చెబుతోంది. తొలుత ఆలయం నిర్మాణం కోసం అవసరమయిన స్థలం కోసం వెతుకుతున్న సమయంలో సన్నపాడు చేరుకోగా ఆ ప్రదేశం అన్ని విధాల అనుగుణంగా ఉందని అవధూత భావించాడు. ఆ స్థలం ఎవరిదని వాకబుచేసి నిజాం అనుమతి కోసం బయలుదేరి వెళ్తూ విజయవాడ వద్ద కృష్ణా నదిలో సన్నపాడు గ్రామస్థులతో కలసి స్నానం చేస్తు న్న స్వామి ఒక్కసారిగా మాయమయ్యాడు. ఈ స్వామి తన శక్తి ప్రభావంతో హైదరాబాదు నిజాం నవాబు అంతఃపురంలో ప్రత్యక్షమయ్యాడు. దాంతో నవాబు ఆశ్చర్యపోయి వచ్చిన కారణమేమిటని అడిగాడు. జగన్నాధస్వామి ఆలయ నిర్మాణం కోసం అవసరమైన స్థలాన్ని ఇవ్వాలని కోరాడు. అందుకు ఒప్పుకున్న నవాబు సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకూ మీరు ఎంత దూరం తిరగ గలిగితే అంత స్థలం ఇస్తానని హమీ ఇచ్చాడు. ఈ మేరకు నవాబు వడాలి ప్రాంతంలో 1200 ఎకరాల భూమిని అప్పగిస్తాడు. ఆలయ నిర్మాణం పూర్తి చేసి పూరీ నుంచి విగ్రహాలను తీసుకొని వచ్చి ప్రతిష్ఠించారని భక్తుల కథనం. నాడు ఈ ఆలయ ప్రాంతం దట్టమైన అటవీ ప్రాంతంతో ఉండి బోయలు (వ్యాధులు) నివశించే ఈ ప్రదేశాన్ని 'వ్యాధాళి' (బోయగాళ్ల సమూహం) అని పిలిచేవారు. వ్యాధావళి, వ్యాధాళిగా, కాలక్రమంలో వడాలిగా రూపాంతరం చెందింది.

గుంటూరు జిల్లా

(అమరావతి - (రాష్ట్రరాజధాని)

ఇది గొప్ప చారిత్రక ప్రదేశంగా వర్ధిల్లుతోంది. ఆధునిక యుగంలో అమరావతి పంచారామాలలో ప్రథమ క్షేత్రంగా విరాజిల్లుతోంది. అమరలింగేశ్వర స్వామి వెలసిన గొప్ప ప్రాంతం అయినందున ఆస్వామి పేరుతోనే అమరావతి పేరు వచ్చిందని కచ్చితంగా చెప్పవచ్చు. ఒకటో శతాబ్ది అమరావతి స్తూపంలో ఒక రాతి పలక మీద "నాగబు" అనే తెలుగు మాట రాసి ఉండటం విశేషం. కొండవీటి రాజు అయిన అనవేమారెడ్డి 1361లో అమరేశ్వరుని ప్రతిష్ఠ చేసినట్టు, 1548 లో హంద్రిపెదప్ప పునప్రతిష్ఠ చేశాడని ఓ శాసనం వల్ల తెలుస్తోంది. ఇతిహాసం ప్రకారమైతే ఈ దేవుణ్ణి తొలుత దేవేంద్రుడు ప్రతిష్ఠించినట్టు ప్రచారంలో ఉంది. 19వ శతాబ్ది మొదటి అర్ధ భాగంలో చింతపల్లి సంస్థానాన్ని పరిపాలించిన రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు ఈ ఆలయాన్ని పునరుద్ధరించినట్టు విశ్రాంత చరిత్ర అధ్యాపకులు టి.ఎస్.ఎన్.మూర్తి ఓ వ్యాసంలో పేర్కొన్నారు. వెంకటాద్రినాయుడు ఈ ఆలయ స్థలానికి అమరావతి అని పేరు పెట్టి తన రాజధానిని చింతపల్లి నుంచి అమరావతికి మార్చారు. అమరావతిలో బౌద్ధ అవశేషాలు లభించాయి. దీంతో బౌద్ధ మతం ఇక్కడ బాగా విలసిల్లినట్టు స్పష్టం అవుతుంది.

నేటి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని ఎంపిక చేయడం గొప్ప పరిణామం. ఇందు కోసం 33 వేల ఎకరాలను భూసేకరణ ద్వారా సమీకరించారు. భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలకు అమరావతి ఆటపట్టు. జల, హరిత, రవాణా, పర్యాటక, వాణిజ్య, నివాస తదితర రంగాలకు సంబంధించి అంశాలను పొందుపర్చుతూ 53676.7 ఎకరాల్లో విస్తరించి అమరావతి రాజధానిని నిర్మిస్తున్నారు. 21వ శతాబ్దంలో అత్యంత అద్భుతమైన రాజధాని నగరంగా అమరావతి నగరం రూపొందుతుంది. కొండపల్లి కోట, కనకదుర్గమ్మ దేవాలయం, ఉండవల్లి గుహలు, మంగళగిరి పానకాల లక్ష్మీనృసింహ దేవాలయం, నీరుకొండ

దేవాలయం, అనంతవరం దేవాలయం, అమరావతి దేవాలయం, బౌద్ధారామాలను కలుపుతూ అమరావతి రాజధానిని నిర్మిస్తున్నారు. ప్రపంచంలోనే అతి గొప్ప రాజధానిగా తీర్చిదిద్దడంలో ప్రభుత్వం నిమగ్నమై ఉంది. అమరావతిలోని బౌద్ధ మ్యూజియం ప్రపంచ ప్రసిద్ధి చెందింది.

ధరణికోట / ధాన్యకటకం

రాజధాని ప్రాంతంలో గౌతమ బుద్ధుడు క్రీ.పూ. 563 నుంచి 483 మధ్యకాలంలో బౌద్ధమత ప్రచారం చేస్తూ ఈ పరిసరాలకు వచ్చాడు. ఇక్కడ బీజాక్షరాలు భూమిలో నిక్షిప్తం చేయడం వల్ల ధరణికటకంగా వాడుకలోకి వచ్చినట్టు స్పష్టమౌతోంది. ఆ తరువాత ధాన్యకటకంగా మారింది. చివరిగా ధరణికోటగా స్థిరపడింది. ఇది ఇలా ఉండగా క్రీ.శ 684వ సంవత్సరంలో ఈ ప్రాంతాన్ని సందర్శించిన చైనా బౌద్ధ యాత్రికుడు హ్యూన్‌సాంగ్ ధాన్యకటకం సమీపంలోని శ్రీ కొండగుహలో వజ్రపాణి ఆరాధన జరుగుతుందని అక్కడ తాంత్రిక ధారణల పఠనం జరుగుతోందని పేర్కొన్నాడు. వజ్రయాన బౌద్ధులు బుద్ధుడే దశబలుని రూపంలో ధాన్యకటకంలో తాంత్రిక ధారణలను బోధించాడని విశ్వసిస్తారు. ధారణ అనే పదం నుంచి ధరణికోట అయినట్టు మరో కథనం ప్రచారంలో ఉంది. టిబెట్ దేశంలో వజ్రయానం ప్రబలంగా ఉంది. శాతవాహనుల కాలంలో ఇది రాజధానిగా ఉండేది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ధాన్యకటక విశ్వవిద్యాలయం ఇక్కడ ఉండేది. ప్రపంచం నలుమూలలు నుంచి సుమారు ఎనిమిది వేల మంది విద్యార్థులు వచ్చి ఇక్కడ విద్యను అభ్యసించేవారు. ఈ విశ్వవిద్యాలయ నమూనాను తీసుకొని టిబెట్ రాజధాని లాసాలో డాంపంగ్ విశ్వవిద్యాల యం నిర్మితమైంది. 2006లో దలైలామా అమరావతిలో కాలచక్ర ఉత్సవాలను నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా శాలిహుండం నుంచి ఇక్కడికి ధాన్యం ఎగుమతి, దిగుమతి జరిగేవి.

ఉద్దండరాయునిపాలెం

ఇది రాజధాని ప్రాంతంలో అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకొంది. శ్రీకృష్ణదేవరాయల కాలంలో ఈ ప్రాంతానికి ఉద్దండరాయునిపాలెం అనే పేరు

వచ్చింది. ఇక్కడే రాజధానికి ప్రధాని నరేంద్రమోదీ 2015 అక్టోబరు 22న శంకుస్థాపన చేశారు. అయితే గతంలోకి వెళితే ఈ ప్రాంతానికి ఈ పేరు ఎలా వచ్చిందంటే... రాయల వారి కొలువులో ఉద్దండరాయుడు పేరుకు తగినట్టే గొప్ప సేనాని. రాయలకు అత్యంతప్రీతి పాత్రుడు. కృష్ణరాయుని సామ్రాజ్య విస్తరణలో ప్రముఖ పాత్రను పోషించాడు. యుద్ధ విద్యలలో ఆరితేరిన వాడు. సామ్రాజ్య విస్తరణకు రాయలు, ఉద్దండరాయునితో కలసి విజయనగరం నుంచి దండయాత్రకు బయలుదేరి మార్గ మధ్యంలో అనేక సంస్థానాలను స్వాధీనం చేసుకొన్నాడు. ఈ క్రమంలో అమరావతి ప్రాంతంలో ఉద్దండరాయుడు బస చేసిన ప్రాంతం కావున ఉద్దండరాయునిపాలెం అయింది.

రాయపూడి

ఇది రాజధాని ప్రాంతంలో ఉంది. శ్రీకృష్ణ దేవరాయలు ఆంధ్ర దేశంలో జైత్రయాత్రలకు బయలుదేరినపుడు మార్గమధ్యంలో కొండపల్లికి వెళ్లడానికి ముందు బసచేసిన ప్రాంతం ఇది. రాయల పేరుతో రాయపూడిఅయింది. రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు ఇక్కడ శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయాన్ని నిర్మించాడు.

వడ్డమాను

బౌద్ధ మతం ఓ వెలుగు వెలిగిన రోజులవి. ఈ మతానికి చెందిన వర్ధమాన మహారాజు ఇక్కడ విడిది చేయడం వల్ల వడ్డమాను గ్రామం ఏర్పడినట్టు స్పష్టమౌతోంది.

తుళ్లూరు

ఇది కొత్త రాజధాని అమరావతిలో అంతర్భాగం. ఇది మండల కేంద్రంగా అవతరించి దశాబ్దాలు గడిచినా అంతంతమాత్రంగానే అభివృద్ధి చెందింది. అయితే రాజధానిలో విలీనం కావడంతో దీనికి మహర్దశ పట్టినట్టే. ఒకప్పుడు దీన్ని తాండవపురిగా పిలిచేవారు. శివపార్వతులు తాండవమాడిన ప్రాంతమని స్థానికుల విశ్వాసం. కనుక తాండవపురి అని గతంలో వ్యవహరించేవారు. ఇక్కడ శ్రీరామలింగేశ్వరాలయంలో పరశురాముడు విగ్రహ ప్రతిష్ఠ చేసినట్టు అర్చకులు చెబుతుంటారు. తుళువంశానికి చెందిన శ్రీకృష్ణదేవరాయులు ఈ ప్రాంతంలో

బస చేసి కృష్ణానది ఆవలి ఒడ్డున కొండపల్లి వద్ద శత్రురాజులతో యుద్ధం చేశాడని మరో కథనం ప్రచారంలో ఉంది. రాయల వంశం పేరుతో తుళు క్రమంగా తులూరుగా మారింది. కాలక్రమంలో, జనవ్యవహారంలో తుళ్ళూరుగా రూపాంతరం చెంది స్థిరపడింది. ఇక్కడ పరశురాముడు ప్రతిష్ఠించిన శ్రీ రామలింగేశ్వర దేవాలయం ఉంది.

రాజధాని ప్రాంతంలో మరికొన్ని....

రాయల వారికి సామంతుడిగా ఉన్న అబ్బరాజు పేరిట అబ్బరాజుపాలెం, మరో సామంతరాజు వెంకటప్ప పేరిట వెంకటపాలెం, సైనికులైన లింగయ్య పేరుతో లింగాయపాలెం, హరిశ్చంద్ర పేరుతో హరిశ్చంద్రపురం ఆవిర్భవించాయి.

మల్లాది

ఇది అమరావతి మండలంలో ఉంది. మల్లాదిలో ప్రాచీనమైన మల్లేశ్వరస్వామి దేవాలయం ఉంది. ఇది కృష్ణా తీరాన కొలువు తీరి ఉంది. మల్లేశ్వరస్వామి ఆలయం వల్లనే మల్లాది అనే పేరు వచ్చినట్టు స్థలపురాణం వల్ల తెలుస్తోంది.

గుంటూరు

గుంటూరు అనగానే నోరూరించే గోంగూర పచ్చడి గుర్తుకు వస్తుంది. ఆ తరువాత మిర్చి అనుకోండి. ఇది జిల్లా కేంద్రం. ఇక్కడ నగరంలో నివశించే నగరవాసిని గుంటురియన్ అని అంటారు. ఇక్కడ ఎక్కువగా రాష్ట్ర వాసులే కాకుండా ఇతర రాష్ట్రాల వారు కూడా నివశిస్తుంటారు. ఇరుగు పొరుగు దేశాల నుంచి చదువు కోసం వచ్చే వాళ్ళు ఉంటారు. గుంటూరుకి ఈ పేరు ఎలా వచ్చిందంటే.....ఇది ఏర్పాటు కాక ముందునీటి గుంటలు ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉండేవి. ఇక్కడ కొత్తగా నివాసాలు ఏర్పాటు చేసుకున్నవారు గోంగూర, మిర్చి పంటలను సాగు చేసేవారు. నీటి గుంటలే జీవనాధారం కావడంతో గుంటూరు అని నామ కరణం చేసుకున్నారు. క్రీ.పూ 2 నుంచి 3వ శతాబ్దం వరకు శాతవాహనుల సామ్రాజ్యంలో ఈ ప్రాంతం కూడా ఉండేది. క్రీ.శ 8 నుంచి క్రీ.శ 12వ శతాబ్దం వరకు ధరణికోటను రాజధానిగా చేసుకొని నేటి

ఆంధ్ర క్షత్రియులలో ధనుంజయ గోత్రీకుల పూర్వీకులైన కోట వంశస్థులు గుంటూరు జిల్లా ప్రాంతంలో పాలించారు. మన రాష్ట్రానికి ఈశాన్యాన కొండవీడు పర్వతశ్రేణికి 9కి.మీ దూరంలో గుంటూరు ఉన్నది. 1866లో పురపాలక సంఘంగా ఏర్పడింది. 1995లో నగరపాలక సంస్థగా మారింది. ప్రస్తుతం గుంటూరులో భాగమైన రామచంద్రాపురం అగ్రహారం గుంటూరు కంటే ఎంతో ప్రాచీనమైనది. ఇక్కడి శ్రీ లక్ష్మీనారాయణస్వామి వారి మంటప స్తంభంపై క్రీ.శ 1296 నాటి శాసనాలలో దీని పేరు కనిపిస్తోంది. ప్రస్తుతం గుంటూరు మహానగరపాలక సంస్థగా ఉంది. ఇక్కడ అతి పెద్ద మిర్చి యార్డు ఉంది. ప్రముఖ విద్యా సంస్థలతో విరాజిల్లుతోంది. రవి కళాశాల పేరుతో తొలి కార్పొరేట్ సంస్థ ఏర్పాటైన ఘనత గుంటూరుదే.

వైకుంఠపురం

వైకుంఠపురం అమరావతి మండలంలో ఉంది. ఇక్కడ స్వయంభూ వేంకటేశ్వరాలయం ఉంది. ఇది ఎంతో ప్రసిద్ధి చెందిన ఆలయం. విష్ణుమూర్తి ఆవాసమై ఉన్నందున ఈ గ్రామానికి వైకుంఠపురం అనే పేరు పెట్టినట్టు స్థానికుల కథనం వల్ల స్పష్టమౌతోంది.

అత్తలూరు

ఇది అమరావతి మండలంలో ఉంది. కమ్మ సామాజిక వర్గానికి చెందిన అత్తలూరు అనే ఇంటి పేరుగలవారు ఈ గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దీంతో దీనికి అత్తలూరు అనే పేరు వచ్చింది.

చిలకలూరిపేట

చిలకలూరిపేటను పూర్వం పురుషోత్తమ పట్టణం అని, చిలకలతోట అని, రాజాగారి తోట అని, చిలకలూరిపాడు అని పిలిచేవారు. పురుషోత్తపట్నం అనేది పట్నం శివార్లలో ఉన్న గ్రామం. ఆంగ్లేయులు దీనిని చిక్‌పేట అని పిలిచేవారు. ఇక్కడి పండ్లతోటల వల్ల చిలుకలు ఎక్కువుగా వచ్చేవి. అందుచేత దీనిని చిలకలూరు అని జమిందార్ల కాలంలో పిలిచేవారు. అయితే కాలగమనంలో ఇది చిలకలూరిపేటగా మారింది. కోటప్ప కొండ ఈ గ్రామానికి 13 కి.మీ దూరంలో ఉంది.

మంగళగిరి

విజయవాడకు 12 కి.మీ.కు దూరంలో ఉంది. ఇక్కడి కొండపై వెలిసిన పానకాల లక్ష్మీనరసింహస్వామి దేవాలయం జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. భక్తులకు కొంగు బంగారమైన గిరి (కొండ) ఎంతో మంగళకరమైనది (శుభప్రదాయిని) అంచేత దీన్ని మంగళగిరిగా నామకరణం చేసినట్లు ఐతిహ్యం వల్ల తెలుస్తోంది. ఇక్కడి స్వామికి పానకం అంటే ఎంతో ఇష్టం. స్వామి వారు పానకం తాగుతున్నప్పుడు గుటగుట అనే శబ్దం వస్తుంది. స్వామి ఎంత పెద్ద పాత్రతో పానకం పోసిన సగం మాత్రమే సేవిస్తారు. స్వామి తాగిన పానకం ఎటు వెళుతుందో తెలియదు. బెల్లం పానకం వరదలైనను ఈగలు, చీమలు దరిచేరకపోవడం ఆశ్చ ర్యం కలుగుతోంది. ఈ క్షేత్ర చరిత్ర బ్రహ్మవైవర్త పురాణంలో ఉంది.

వేమూరు

మండల కేంద్రమైన వేమూరుకు విచిత్రమైన చరిత్ర ఉంది. వేము అంటే వేప అని అర్థం. పూర్వం ఓ సిద్ధపురుషుడు దాహం వేసి మంచి నీరు అడిగితే ఎవరూ ఇవ్వని కారణంగా ఆయన ఆగ్రహించి శపించాడు. దీంతో ఆ ఊరి నీళ్లు చేదు కావాలని శాపం సారాంశం. అప్పటి నుంచి ఇక్కడ త్రాగునీరు వేము తరహాలో చేదుగా ఉంటుందని చెబుతారు. దీంతో ఈ గ్రామానికి వేమూరు అనే పేరు వచ్చింది. అయితే ఈ గ్రామం చుట్టు ప్రక్కల ఉండే పల్లెల్లో నీళ్లు తీయగా ఉంటాయి.

వినుకొండ

ఇది మండల కేంద్రం. సీతాపహరణ వృత్తాంతాన్ని శ్రీరాముడు విన్నచోట అయినందున వినుకొండ పేరుతో ఈ పల్లె వెలసింది. నవయుగ చక్రవర్తి, కవి దిగ్గజం గుఱ్ఱం జాషువా స్వగ్రామం గూర్చి స్థల పురాణంగా చెబుతారు. సీతాపహరణ ఉదంతాన్ని వివరిస్తూ జటాయువు అనే పక్షి శ్రీరాముడుకి తెలియజేసిన ప్రాంతమిదని పేర్కొన్నారు. వినుకొండను సంస్కృతీకరించి కొందరు పండితులు 'శృతగిరి" అని పేరు పెట్టారు.

సత్రశాల

ఇది రెంటచింతల మండలం జెట్టిపాలెం మండలంలో కృష్ణా తీరాన కుడి గట్టున వెలసిన శైవ క్షేత్రం. ఇక్కడ భ్రమరాంబ, మల్లికార్జున ఆలయం ఉంది. విశ్వామిత్రుడు బ్రహ్మర్షి పదవి కోసం ఇక్కడే సత్రయాగం చేశాడు. అందుకే దీనికి సత్రశాల అనే పేరు వచ్చినట్టు ఐతిహ్యం వల్ల తెలుస్తోంది.

తాడికొండ

ఇది మండల కేంద్రం. ఈ గ్రామం దేవాలయాలకు నిలయం. ఈ గ్రామానికి జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్యులు వచ్చినట్టు ఇక్కడ లభించిన విగ్రహాలను బట్టి తెలుస్తోంది. ఆయన ఈ గ్రామంలో నవలింగాలను ప్రతిష్ఠించినట్టు ఇతిహాసం వల్ల తెలుస్తోంది. పూర్వం ఈ గ్రామాన్ని తాళాద్రి అని పిలిచేవారు. అంటే తాటిచెట్లతో కూడిన కొండ అని అర్థం. అందువల్ల దీనిని తాడికొండగా నామకరణం చేసినట్టు తెలుస్తోంది. దీనికి కారణం ధరణికోటను పాలించేరాజులు యుద్ధ సమయాలలో ఇక్కడ ఉన్న ఎత్తయిన కొండమీద నుంచి సూచనలు, సమాచార మార్పిడి, సిగ్నల్ వ్యవస్థగా ఉపయోగించుకునేవారు. ఉదాహరణకు కొండమీద పొగపెట్టడం - ఎవరైనా శత్రురాజులు రాజ్యంపై దాడి చేయడానికి వస్తున్నప్పుడు కొండ మీద పొగపెట్టేవారు. అలాగే శత్రుసైన్యాలు దాడి చేసినప్పుడు కొండ మీద మంటపెట్టేవారు.

కోటప్పకొండ

ఇది నరసారావుపేట మండలంలో ఉంది. సుప్రసిద్ధ శైవక్షేత్రంగా విరాజిల్లుతోంది. యల్లమంద గ్రామ సమీపంలో ఉన్న త్రికోటేశ్వరస్వామి నిత్య పూజలు అందకుంటున్నాడు. స్వామి త్రికూటాచలంపై వెలిసిన కోటేశ్వరస్వామి పేరుతో కోటప్పకొండ ఏర్పడింది. 11వ శతాబ్దంలో వెలనాటి చోళులు, ఆరి సామంతులు ఈ ఆలయాన్ని అభివృద్ధి చేసినట్టు శాసనాల వల్ల తెలుస్తోంది. యల్లమంద గ్రామ సమీపంలో ఉన్న కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారి పేరుతో భక్తులు తమ సంతానానికి బాలకోటమ్మ, బాల కోటయ్య, కోటమ్మ, కోటి, కోటయ్య, కోటేశ్వరమ్మ తదితర పేర్లు పెట్టుకుంటున్నారు. మహాశివరాత్రి నాడు ఇక్కడ భారీ ఎత్తున ఉత్సవాలు జరుపుతారు. ఈ కొండ మీదకు ఎన్నో రకాల పక్షులు వస్తుంటాయి. అయితే ఒక్క కాకి కూడా కనిపించదు. ఒక మునిశాపం

కారణంగా ఇక్కడకు కాకులు రావని స్థలపురాణం వల్ల తెలుస్తోంది. కోటప్పకొండ మరో శ్రీశైలంగా వర్ధిల్లుతోంది.

చెరుకుపల్లి

ఇది మండంల కేంద్రం. సుమారు 3శతాబ్దాల కితం పెనుమూడి గ్రామానికి చెందిన ఎల్లాప్రగడ శాస్తుర్లు బాపట్ల సమీప గ్రామానికి కాలినడకన వెళ్తూ ఓ చోట ఆగారు. ఆ ప్రాంత పరిసరాలను పరిశీలించారు. గ్రామ నిర్మాణానికి ఆ ప్రాంతం అనువైనదిగా భావించారు. కొన్నాళ్లు గడిచాక కొంతమంది కుటుంబ సమేతంగా ఆ ప్రాంతానికి వచ్చి గ్రామాన్ని నిర్మించారు. అయితే నీటి వనరులకై అన్వేషణ చేస్తుండగా చలమలోతులోనే చెరుకురసం వంటి మంచినీరు లభించింది. దీంతో ఈ గ్రామానికి చెరుకుపల్లి అని నామకరణం చేశారు. అలాగే ఆ గ్రామస్థులంతా తమ ఇంటిపేరుని చెరుకుపల్లిగా పెట్టుకున్నారు.

దాచేపల్లి

ఇది మండల కేంద్రం. బంగినపల్లి మామిడిపండు పేరు అందరికి తెలిసిందే. దాచినపల్లి అనే రకం మామిడి పండు ఉంది. ఈ రెండు రకాలు ఒకేలా నిగనిగలాడుతుంటాయి. బంగినపళ్లను కోసి ముక్కలుగా తినవచ్చు. అయితే దాచినపళ్ల పై తొక్క గట్టిగా ఉంటుంది. చిన్న గాటుపెడితే చాలు రసం ధారగా వచ్చేస్తుంది. కాలక్రమంలో ఈ పళ్ల చెట్లు అంతరించిపోయాయి. అయితే ఈ పంట ఎక్కువుగా పండే దాచేపల్లిలో ఆపంట పేరుతో గ్రామం ఏర్పడింది. ఆ రకం పంట ప్రస్తుతం లేకపోయినా మధురస్మృతిగానే మిగిలిపోయింది.

మాచర్ల

క్రీ.శ.1182లో పల్నాటియుద్ధంగా పేరు గాంచిన దాయాదుల పోరు మాచెర్ల, గురజాల పట్నాల మధ్య జరిగింది. ఈ యుద్ధం పల్నాటి హైహయ వంశంతోపాటు తీరాంధ్రలోని రాజవంశాలన్నింటిని బలహీనపరిచింది. ఫలితంగా కాకతీయ సామ్రాజ్య విస్తరణకు సులువైన మార్గం ఏర్పడింది. హైహయ రాజుల కాలంలో ఈ ప్రాంతంలో ఓ గొప్ప చెరువు ఉండేది. దాని మధ్య మహదేవి ఆలయం ఉండటం వల్ల మహదేవిచర్ల పేరు ఉండేది. జన వ్యవహారంలో మాచర్లగా మారింది.

గోవాడ

ఇది అమృతలూరు మండలంలో ఉంది. గోవాడ గొప్ప శైవక్షేత్రం. ఇక్కడి దేవుడు బాలకోటేశ్వరుడు. దీని ప్రాచీన నామం దగ్గుమల్లి ఆ రోజుల్లో బౌద్ధ, జైన, శైవుల మధ్య జరిగిన తగాదాల్లో గ్రామం శిథిలమైంది. దీంతో ప్రజలు దగ్గుమల్లికి కూతవేటు దూరంలో ఇళ్ళు కట్టుకున్నారు. జీవనోపాధి కోసం పెద్ద సంఖ్యలో గోవులను పెంచారు. దీంతో అది గోవులవాడగా మారింది. జన వ్యవహారంలో చివరకు గోవాడగా స్థిరపడింది.

పొన్నూరు

ఇది శాసనసభ నియోజకవర్గ కేంద్రం. గుంటూరు పట్టణానికి 28 కి.మీ దూరంలో ఉంది. పొన్నూరుకు ఆ పేరు ఎలా వచ్చిందంటే... పొన్+ఊరు అనే రెండు తమిళ పదాల కలయికతో ఏర్పడింది. పొన్ అంటే బంగారం. ఉరు అంటే గ్రామం అని అర్థం. అంచేత ఈ గ్రామాన్ని "బంగారు" గ్రామం అని కూడా పిలు స్తారు. పండితులు దీన్ని సంస్కృతీకరించి "స్వర్ణపురి" అని పేర్కొంటారు. ఈ గ్రామాన్ని ఏర్పాటు చేసుకొనేటప్పుడు పెద్దలంతా ఓ చోట కూర్చొని ఈ అందమైన పేరును పెట్టారు. ఈ గ్రామంలోని సాక్షి భావనారాయణస్వామి, సహస్ర లింగేశ్వరస్వామి దేవాలయాలతో పాటు ఏక శిలపైచెక్కిన నిలువెత్తు హనుమంతుని విగ్రహం గరుత్మంతుల విగ్రహం కనువిందు చేస్తుంటాయి. పుణ్యస్థలిగా పేరుగాంచిన పొన్నూరును చిన్న కాశీ అని కూడా పిలుస్తారు.

రేపల్లె

'వ్రే' అంటే గోవులు అని అర్థం. గోవులు ఎక్కువుగా ఉన్నందున వ్రేపల్లెగా మారింది. కాలక్రమేణా రేపల్లెగా మారింది. ప్రస్తుతం రోజులు ఎలా ఉన్నాయంటే, ఎవరైనా వస్తే వారు ఎప్పుడు వెళ్లిపోతారో అన్నట్టుగా ఉన్నాయి. కారణం పెరిగిపోయన ధరల వల్లే! కాని అక్కడ మాత్రం బంధువులు వస్తే వెళ్లనివ్వరు. వారు వెళ్తానంటే రేపెళ్ళండి అంటారు. ఏ రోజు కారోజు ఇదే మాట. దీంతో ఈ ప్రాంతాన్ని రేపెళ్ళిగా పిలిచేవారు. కాలక్రమంలో రేపల్లెగా స్థిరపడింది.

పిడుగురాళ్ళ

ఇది మండల కేంద్రం. ఆకాశంలో దట్టంగా మేఘాలు ఉన్నప్పుడు మెరుపులు, ఉరుములు సర్వసాధారణం. ఒక్కో సారి మెరుపులు మెరుస్తున్నప్పుడు దిక్కులు పిక్కటిల్లేల ఊరుములు రావడం పిడుగులు పడటం తెలిసిందే. పిడుగులు పడినపుడు ఒక్కోసారి వడగళ్లు పడటం కూడా చూస్తుంటాం. అయితే వేలాది సంవత్సరాల కిందట చాలా అసహజంగా అక్కడ మాత్రం పిడుగులు పడినప్పుడు వడగళ్లు కాకుండా చిన్నచిన్న రాళ్లు కురిశాయట. ప్రపంచంలో ఎప్పుడు ఈ విధంగా జరగలేదు. దీంతో ఈ ప్రాంతాన్ని పిడుగురాళ్లు అని పిలిచేవారు. జనవ్యవహారంలో పిడుగురాళ్లగా మారింది.

నందివెలుగు

తెనాలి మండలంలో ఉన్న గ్రామం ఇది. అగస్త్య మహర్షి ప్రతిష్ఠించిన దివ్య శివలింగం ఇక్కడ ఉన్నది. చాళుక్యులు ఈ ప్రాంతాన్ని పరిపాలిస్తున్న రోజుల్లో శివభక్తుడైన విష్ణువర్ధన మహారాజు ఓ సారి ఈ ప్రాంతం లోని అడవికి రాగా ఈశ్వరుడు ప్రత్యక్షమయ్యాడు. విష్ణువర్ధనుడు ఈ మహాలింగానికి తేజపుంజాలతో నిత్యార్చన జరగాలని సంకల్పించాడు. ఆలయ ప్రాంగణంలోని వినాయకుని బొజ్జలోను, నందీశ్వరుని కొమ్ములలోను నిక్షిప్తం చేయించాడు. వినాయకుడి బొజ్జలోని రత్నాల నుంచి వెలువడే తేజపుంజాలు నంది కొమ్ములలోని రత్నాలపై పడి పరావర్తనం చెంది మూలవిరాట్టు పాదాలపై పడి నిత్యార్చన చేసేలా అతి గొప్పగా నిర్మాణం చేశారు. ఆనాటి శిల్పులు నంది కొమ్ముల నుంచి వెలుగు రేఖలు వచ్చే ఏర్పాటు వల్ల ఈ గ్రామం పేరు నందివెలుగుగా రూపుదిద్దుకుంది.

గుత్తికొండ

ఇది పిడుగురాళ్ల మండలంలో ఉంది. దీన్ని సంస్కృతీకరించి గుచ్ఛాద్రి అని కూడా పిలుస్తారని ఆ గ్రామానికి చెందిన తెలుగు అకాడమి పూర్వ ఉపసంచాలకులు డా॥ అక్కిరాజు రమాపతిరావు పేర్కొన్నారు. ఇంతకీ ఆ గ్రామానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే ఈ ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన గుత్తికొండ బిలం

ఉంది. ఈ పేరుతోనే గుత్తికొండ వెలసిందని చెబుతారు. విశేషం ఏమిటంటే క్రీ.శ 1182లో జరిగిన పల్నాటి యుద్ధంలో బ్రహ్మనాయుడు తనతోపాటుగా 66 మంది యోధులు కలిసి గుత్తికొండ బిలంలో బస చేశారు.

నరసరావుపేట

రాజకీయ చైతన్యానికి మారుపేరుగా కళలకు ఆటపట్టుగా సాహితీవేత్తలకు నెలవుగా ఈ పట్టణం ఉంది. విద్యా, వాణిజ్యాలకు కంచుకోటగా ఉంది. పురాతన స్వదేశీ సంస్థానాలలో నరసరావుపేట సంస్థానం ఎంతో ప్రసిద్ధి పొందింది. మూడు శతాబ్దాల కితం మల్రాజు వంశీయులు ఈ ప్రాంతాన్ని పరిపాలించారు. నరసరావుపేటకు మూలమైన గ్రామం అట్లూరు. ఈ గ్రామానికి అనుబంధంగా క్రీ.శ1797లో మల్రాజు నరసరాయని పేరుపై రాజ మల్రాజు వెంకటగుండారావు, కోటను నిర్మించి నరసరావుపేటగా నామకరణం చేశారు. అప్పటి నుండి అట్లూరు నరసరావుపేటగా మారింది. పట్టణం ఏర్పడి 218 ఏళ్లు పూర్తయింది. 1915 జూన్ 18న ఈ పట్టణం పురపాలికగా మారింది. కాగా 2015 డిశంబర్ 11,12,13 తేదీల్లో నరసరావుపేట మున్సిపాలిటి శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ పట్టణంలో శృంగేరి పీఠాధిపతి భారతీ తీర్థస్వామి జన్మించారు. మీసాల కృష్ణనిగా పేరు గాంచిన బెల్లంకొండ సుబ్బారావు, నాటి సినీనటుడు సి.ఎస్.ఆర్. ఆంజనేయులు ఇక్కడే జన్మించారు. నాటి సి.ఎం కాసు బ్రహ్మానందరెడ్డి ఇదే నియోజకవర్గం నుంచి ఎన్నిక య్యారు.

భట్టిప్రోలు

ఇది మండల కేంద్రం. దీని తొలిపేరు ప్రతీపాలపురం. ఆంధ్ర శాతవాహనుల కాలం పూర్వం నుండి ఉన్న ప్రముఖ నగరం. శాసనాల ప్రకారం కుబేరుడు అనే రాజు ప్రతీపాలపురాన్ని పరిపాలించారు. భట్టిప్రోలు ప్రాముఖ్యత, ప్రస్తావన అక్కడ తవ్వకాలలో బయటపడ్డ బౌద్ధస్థూపాల ద్వారా అంతర్జాతీయ స్థాయిలో వెళ్ళింది. భట్టిప్రోలులో ఒక పాడుబడిన దిబ్బ ఉండేది. ఆ దిబ్బను భట్టి విక్రమార్కుని కోట, చిన్నలంజదిబ్బ, పెద్ద లంజదిబ్బ అని పిలిచేవారు. ప్రపంచ మానవాళికి శాశ్వతానందమైన అష్టాంగ మార్గాన్ని బోధించిన గౌతమ

బుద్ధుని పరమపవిత్రమైన అస్థికలు నిక్షిప్తం చేసిన మహాస్థూపం అది. అయితే ఆ స్థూపం నిరాదరణకు గురై శిథిలమైంది. ఇదిలా ఉండగా భట్టి విక్రమార్కుడు పరిపాలించిన పట్టణంపేరుతో ఈ ప్రాంతం భట్టిప్రోలు అయింది. ఇక్కడి నుంచి విదేశాలకు వస్త్రాల ఎగుమతి జరిగేది. భట్టిప్రోలును 'ప్రిటుంద్ర' నగరం అని కూడా పిలిచేవారు. ఈ పదానికి నేతపని అని అర్థం. ఇప్పటికీ రేపల్లె ప్రక్కన పేటేరు అనే ఊరు ఉంది. అది ఈనాటికీ బట్టల తయారీకి ప్రసిద్ధి చెందింది.

తెనాలి

తెనాలి రెవెన్యూ డివిజన్. తెనాలిలోని మూడు కాలువలు ప్రవహించడం వలన తెనాలికి ఆపేరు వచ్చింది. ఈ మూడు కాలువలను హిందీ భాషలో తీన్ నాల్ (తీన్=మూడు, నాల్=కాలువలు) కాలువను నాల్ అని అంటారు. ఆ తీన్‌నాల్‌ని తరువాతి కాలంలో తెనాలి అన్నారు. ఈ పట్టణానికి ప్యారిస్ నగరంలో వలె ప్రధాన రహదారికి ఇరువైపులా రెండు పెద్ద కాలువలు ఉన్నాయి. అందువలన తెనాలిని ఆంధ్ర ప్యారిస్ అంటారు. ప్యారిస్ వలె తెనాలి పట్టణం కళలకు పుట్టినిల్లు. ఇది సినీ రంగస్థల, ప్రముఖ రచయితలకు పుట్టినిల్లుగా ఎనలేని గుర్తింపు పొందింది.

ఫిరంగిపురం

ఇది మండల కేంద్రం. ఈ గ్రామానికి 5 కి.మీ దూరంలో కొండవీడు ఉంది. రెడ్డిరాజులకు ఈ గ్రామం నుంచి ఫిరంగుల తయారీ, రవాణా కేంద్రంగా ఉండేది. దీంతో ఈ ప్రాంతానికి ఫిరంగిపురం అనే పేరు వచ్చింది. ఇక్కడి ఈ పరిశ్రమకు ఏనాడో ముగింపు పలికారు.

బాపట్ల

ఇది గుంటూరు జిల్లాలో అతి పెద్ద పట్టణాలలో పెద్దది. క్రీ.శ 594లో ఇక్కడ భావన్నారాయణ స్వామి ఆలయాన్ని క్రిమికంఠ చోళుడు నిర్మించాడు. ప్రతి ఏటా వైశాఖంలో శుద్ధ సప్తమి నుంచి పూర్ణిమ వరకూ బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఆలయం పేరుతో భావపురిగా ఇది అవతరించింది. ఆ తరువాత భావపట్ల గా మారింది. చివరకు బాపట్లగా స్థిరపడింది. మరో కథనం ప్రకారం

స్వాతంత్ర్య సమరం ముమ్మరంగా సాగుతున్న రోజులవి. గాంధీ పేరు ఎత్తితే వారికి లాఠీ దెబ్బలు తప్పేవి కావు. పుల్లట్లు వ్యాపారం చేసుకొనే ఓ వృద్ధుడు తన అంగడికి బాపు అట్లు అనే పేరు పెట్టాడు. బాపు అంటే అర్థం తెలియని ఆంగ్లేయులు అతని జోలికి వెళ్లలేదు. బాపు పుల్లట్లు వ్యాపారం జోరుగా సాగింది. దీంతో ఈ ప్రాంతానికి బాపు అట్లు క్రమంగా బాపట్ల అని పేరు వచ్చింది. బాపట్ల వ్యవసాయ కళాశాల జాతీయ స్థాయిలోనే పేరు గాంచింది.

మోదుకూరు

ఇది తుళ్ళూరు మండలంలో ఉంది. గుంటూరుకు 40 కి.మీ దూరంలో ఉంది. పూర్వం ఈ ప్రదేశం అంతా మోదుగ చెట్లతో విస్తరించి ఉండేది. అందువల్లనే ఇక్కడ ఏర్పాటు అయిన గ్రామానికి మోదుకూరు అనే పేరు వచ్చింది. పశ్చిమ దేశం నుంచి వ్యాపారం కోసం వచ్చిన ఒక లింగ బలిజ వర్తకుడు ఇక్కడ విశ్రాంతి తీసుకుంటుండగా అతనికి వీరభద్రస్వామి కలలో కనిపించాడు. స్వామి ఆనతిమేరకు మోదుగ చెట్లను తొలగించి ఓ ఆలయాన్ని (వీరభద్రస్వామి ఆలయం) నిర్మించాడు.

ప్రత్తిపాడు

ఇది మండల కేంద్రం. ఈ గ్రామంలో రుక్మిణి, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయం పౌరాణిక చారిత్రక ప్రాశస్త్యంతో అలరారుతోంది. ప్రాచీనకాలంలో ఈ గ్రామంలో భక్తుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో భక్తులవాడగా పేరు పెట్టారు. కాలక్రమంలో భర్తిపాడు, ఆ తరువాత కాలంలో ప్రత్తిపాడుగా స్థిరపడింది.

ముటుకూరు

ఇది దుర్గి మండలంలో ఉంది. పల్నాటి యుద్ధం జరిగిన తర్వాత బ్రహ్మనాయుడు ఈ ప్రాంతంలో కొంత కాలం అజ్ఞాతంగా ఉన్నాడు. ఆయన ఇక్కడ మాటు (వేచి ఉండటం) వల్ల మాటుకూరు అనే పేరు ఈ గ్రామానికి వచ్చినట్టు భావిస్తున్నట్టు ప్రముఖ సాహితీవేత్త ఎం.పి. జానుకవి ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు. మటుకూరు, మాటుకూరు చివరకు ముటుకూరుగా స్థిరపడిందన్నారు.

వంగిపురం

ఈ గ్రామం ప్రత్తిపాడు మండలంలో ఉంది. చోళుల కాలంనాటి వేంగిపురమే వంగిపురంగా మారింది. వైష్ణవ క్షేత్రాల్లో వంగిపురం వల్లభనారాయణస్వామి ఆలయం ప్రసిద్ధి చెందింది. అలాగే ఇక్కడ గల గంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయాన్ని చోళచాళుక్య వంశరాజులు క్రీ.శ. 11వ శతాబ్దంలో నిర్మించారు. ఈ ఆలయంలో శివలింగాన్ని అగస్త్యుడు ప్రతిష్టించాడు.

సోలస

ఈ గ్రామం ఎడ్లపాడు మండలంలో ఉంది. ఇక్కడ రంగనాథస్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఒకప్పుడు కాకులు దూరని కారడవిగా ఉన్న ఈ ప్రదేశాన్ని నాదెండ్ల ప్రాంతానికి చెందిన కొందరు పశువుల కోసం ఇక్కడ సువిశాలమైన చెరువును త్రవ్వించారు. కొన్నాళ్లు గడిచాక చెరువు చెంతనే ఓ గ్రామాన్ని నిర్మించుకున్నారు. పశువుల కాపర్లకు నాయకుడైన వలసయ్య పేరుమీదుగా వలసగా గ్రామానికి పేరు పెట్టారు. అది క్రమంగా సోలసగా మారింది.

కారంపూడి

ఇది మండల కేంద్రం. మాచర్ల, గురజాల రాజ్యాల యుద్ధ క్షేత్రమిది. 1182లో జరిగిన కారంపూడి యుద్ధం చరిత్ర ప్రసిద్ధి చెందింది. ఈ యుద్ధంలో ఉభయపక్షాల సైనికులు కారంపొడిని ఉపయోగించినట్టు చెబుతారు. దీని వల్ల ఈ గ్రామానికి కారంపూడి అనే పేరు వచ్చింది. మరో కథనం ప్రకారం మిర్చి నుంచి కారం పొడిని తయారుచేసే కుటీర పరిశ్రమలు ఇక్కడ కోకొల్లలుగా ఉండేవి. మిర్చిని దంచి కారం పొడిని తీసేవారు. దీంతో ఈ గ్రామానికి కారంపొడి అని పేరువచ్చింది. జనవ్యవహారంలో కారంపూడిగా రూపాంతరం చెందింది. "కారెమపూడి పట్టణము కాశిగదా పల్నాటివారికిన్" అన్నాడు శ్రీనాథుడు.

నిజాంపట్నం

ఇది మండల కేంద్రం. నిజాంపట్నం అనగానే ఓడరేవు గుర్తుకువస్తుంది. దీని తొలిపేరు పెద్దపల్లి. దక్షిణ భారతావనిలో తొలి ఆంగ్లేయ వర్తక స్థావరాన్ని 1611లో ఇక్కడ స్థాపించారు. కాగా 1621లో ఆంగ్లేయులు ఇక్కడ ఓ కర్మాగారాన్ని ఏర్పాటు చేశారు. నిజాం ప్రభువు దీన్ని ఫ్రెంచి వారికి అప్పగించాడు. అయితే 1759లో సలాబత్‌జంగ్ బ్రిటిషు వారికి తిరిగి అప్పగించాడు. నిజాం పేరుతో నిజాంపట్నం వెలసింది. సాగర తీర ప్రాంతాల్లో ఉన్న జనావాసాలకు ఉత్తరపదంలో పట్నం చేరుతుంది.

నాదెండ్ల

ఇది మండల కేంద్రం. నందపురం చారిత్రక నామం. నంద నందనుడైన గోవర్ధనస్వామి ఆలయం, చెన్నకేశవ స్వామి ఆలయం జంట ఆలయాలుగా ప్రసిద్ధి చెందాయి. నందవంశ రాజుల పాలనలో నాదెండ్ల ప్రాంతం ఉండేది. నాటి నందపురమే నేటి నాదెండ్లగా స్థిరపడింది.

సంక్రాంతిపాడు

ఈ పల్లె నాదెండ్ల మండలంలో ఉంది. సంక్రాంతి శుభసమయంలో ఈ గ్రామం ఏర్పాటైంది. దీంతో స్థానికులు తమ పల్లెకు సంక్రాంతిపాడు అని పేరు పెట్టుకున్నారు. ఎంత అందమైన పేరు ఇది.

పెద్దకాకాని

ఈ గ్రామం గుంటూరుకు 7కి.మీ దూరంలో ఉంది. ఇది మండల కేంద్రం. ఇక్కడ వెలిసిన శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఇక్కడ పరమేశ్వరుడు స్వయంభువుగా వెలిశాడు. భరద్వాజ మహాముని భూప్రదక్షిణ చేస్తున్న సమయంలో ఒకనాడు ఈ క్షేత్రాన్ని సందర్శించాడు. అక్కడ యజ్ఞం ప్రారంభించాడు. ఈలోగా అక్కడికి ఒక కాకి వచ్చి దేవతలకు సమర్పిస్తున్న ఆహుతులను తాను తినడం మొదలుపెట్టింది. యజ్ఞం అపవిత్రమై పోతుందన్న ఆవేదనతో భరద్వాజుడు ఆ కాకిని వారింపబోయాడు. అప్పుడు కాకి

మనుష్య భాషలో ఈ విధంగా చెప్పింది. ఓ మహర్షి నేను కాకాసురుడ్ని సకల సృష్టికర్త అయిన బ్రహ్మను గూర్చి తపస్సు చేసి ఒక వరాన్ని పొందాను. అందువల్ల దేవతలకు సమర్పించే నైవేద్యాలను నేను భక్షించవచ్చు. నీవు తల పెట్టిన యజ్ఞం నిరాటంకంగా పూర్తిచేయడం వల్ల నాకు శాపవిమోచనం జరుగుతుందని పేర్కొన్నాడు. సమస్త నదీ జలాలతో ఈ మల్లేశ్వర స్వామిని అభిషేకం చేసి జలం నా మీద వెదజల్లితే శాపవిమోచనం కలుగుతుందని కాకి చెప్పింది. కాకి చెప్పినట్టే భరద్వాజుడు చేయడంతో ఆ కాకి నల్లని రూపాన్ని వీడి తెల్లని రంగును పొంది మానస సరోవరానికి వెళ్లిపోయింది. భరద్వాజుడు ఇట్టి గొప్ప శివలింగాన్ని మల్లెపూలతో పూజించాడు. అందువల్ల ఇక్కడి శివునికి మల్లేశ్వరుడనే పేరు వచ్చింది. కాకాసురుడు శాసవిమోచనం పొందిన స్థలం కాబట్టి దీనికి 'కాకాని' అనే పేరు వచ్చింది. ప్రముఖ సినీ దర్శకుడు, నిర్మాత, హాస్యనటుడు పోసాని కృష్ణమురళి స్వగ్రామం ఇదే కావడం విశేషం.

క్వారీ

ఇది బాలకోటేశ్వరస్వామి వెలిసిన పవిత్ర స్థలం. ఇక్కడి శివలింగం చోళుల కాలం నాటిది. కాలక్రమేణా కాలగర్భంలో మరుగున పడింది. ఆ తరువాత కాలంలో ఇక్కడ జరిగిన క్వారీ తవ్వకాలలో బయటపడింది. దీంతో ఈ ప్రాంతానికి క్వారీ అనే పేరు వచ్చినట్టు చెబుతారు. మహాశివరాత్రికి వివిధ గ్రామాల నుంచి ప్రభలు కట్టి భక్తులు స్వామిని సందర్శిస్తారు.

కిష్కింధ పాలెం

కిష్కింధ పాలెం అనగానే రామాయణంలోని కిష్కింధ కాండ సహజంగానే గుర్తుకు వస్తుంది. అయితే ఈ కిష్కింధ వేరు. సుమారు 2000 జనాభా ఉన్న ఈ పల్లె కొల్లూరు మండలంలో ఉంది. దీన్ని చిన కాకినాడ అని కూడా గతంలో పిలిచేవారు. కిష్కింధ పాలెం గ్రామానికి ఆ పేరు ఇలా వచ్చింది....చాలా ఏళ్ల నుంచి ఆ పల్లెలో వందలాది కోతులు వీరవిహారం చేసేవి. గ్రామంలోని శ్రీరామాలయం గోపురంపై ఎక్కువగా ఉండేవి. భక్తులు కొబ్బరి చెక్కలు ఇచ్చి

ఆనంద పడేవారు. అయితే కోతులు రానురానూ గ్రామంలో పండించే అరటి, మొక్కజొన్న, కంద, పసుపు తదితర పంటలను ధ్వంసం చేసేవి. దీంతో రైతులంతా ఆలోచించి గ్రామంలోని కోతులను పట్టించి అడవిలో విడిచి పెట్టారు. ఇదంతా జరిగి ఓ దశాబ్ద కాలం అవుతుంది. ఈ విషయాన్ని ఆ గ్రామ సర్పంచ్ రావుల రమేష్ ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు.కోతులకు (వానరులకు) స్థావరం కిష్కింధ. దీన్ని దృష్టిలో ఉంచుకొని స్థానికులు తమ గ్రామానికి కిష్కింధపాలెం అని అందమైన పేరును పెట్టుకున్నారు.

జిల్లెళ్ళమూడి

ఇది బాపట్ల మండలంలో ఉంది. బాపట్లకు 14 కీ.మి దూరంలో, పెదనందిపాడుకు వెళ్ళే మార్గంలో ఉంది. జిల్లెళ్ళమూడి అనగానే జిల్లెళ్ళమూడి అమ్మ (బ్రహ్మాండం అనసూయ దేవి) గుర్తుకు వస్తారు. ఆంధ్రుల అన్నపూర్ణగా భక్తులు ప్రశంసిస్తారు. అక్కడ గల అతి పెద్ద ఆశ్రమం, ఓరియంటల్ కళాశాల ఎంతో ప్రసిద్ధి చెందాయి. ఇంతకీ జిల్లెళ్ళమూడికి ఆ పేరు ఎలా వచ్చిందంటే... ఎన్నో ఏళ్ళ కితం ఈ ప్రాంతమంతా అడవిగా ఉండేది. జిల్లేడు చెట్లు తామర తంపరగా ఉండేవి. అయితే ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చిన కొందరు అడవిని, జిల్లేడు చెట్లను నరకి చదునుచేసుకొన్నారు. ఇళ్ళను నిర్మించుకున్నారు. దీంతో ఈ గృహ సముదాయానికి జిల్లెళ్ళమూడి అని పేరుపెట్టారు. మూడి అంటే ప్రసవం అని అర్థం. పుడమి తల్లి ప్రసవించిన అతి గొప్ప గ్రామం కావాలని ఆకాంక్షిస్తూ నాటి పెద్దలు ఈ పల్లెకు ఆ పేరు పెట్టినట్టు తెలుస్తోంది. 1958 లో అన్నపూర్ణ ఆలయాన్ని ఏర్పాటు చేశారు. నిరంతర అన్నదానం జరుగుతోంది. 1973లో ఆశ్రమ స్వర్ణోత్సవాల సందర్భంగా లక్ష మందికి ఒకే పంక్తిలో అన్నపమారాధన జరపడం ఓ అపురూపఘట్టంగా పేర్కొనవచ్చునని ఆశ్రమ కమిటీ ఉపాధ్యక్షులు నాదెండ్ల లక్షణరావు ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు.

ప్రకాశం జిల్లా

ఒంగోలు

ఇది జిల్లా కేంద్రం. మౌర్య,శాతవాహనుల హయాంలో ఈ పట్టణం రూపుదిద్దుకుంది. కాకతీయుల పాలనలో ఈ పట్టణం వెలుగులోకి వచ్చింది. తరువాత కాలంలో వంగవోలు రాజులు పరిపాలించారు. అందుచేత ఈ ప్రాంతానికి వంగవోలు అనే పేరు వచ్చింది. కాలక్రమంలో వంగవోలు పేరు ఒంగోలుగా స్థిరపడింది. ఒంగోలు పట్టణాన్ని మున్సిపాలిటీగా 1876లో వ్యవస్థీకరించారు. టంగుటూరు ప్రకాశం పేరుతో ఈ జిల్లా ఏర్పాటైంది. ఒంగోడు 4వశతాబ్ది శాసనం. ఒంగోలు / వంగవోలు / ఒంగోడు = ఒక కొండ శిఖరం కలది. ఇది దీని ప్రత్యేకత. ఒన్ + కోడు = ఒంగోడు. ఒన్ = ఒకటి, ఒక్ / ఒన్, కోడు = కొండ శిఖరం. లడయోరభేధ: = ఒంగోలు. పూర్వం వంగప్రోలు / వంగవోలు / వంగలప్రోలు అనే పేర్లతో కూడా ఒంగోలు వుండేది. కాలక్రమంలో ఒంగోలుగా స్థిరపడింది. ఆంధ్రకేసరి సుప్రసిద్ధులైన టంగుటూరి ప్రకాశం పంతులు బాల్యం ఒంగోలులోనే సాగింది. ఒంగోలు గిత్తలు ప్రపంచ ప్రఖ్యాతి చెందాయి.

ఉప్పుగుండూరు

ఇది మండల కేంద్రం. నాగులుప్పలపాడు మండలంలో బంగాళాఖాతానికి ఈ గ్రామం 8 కి.మీ.దూరంలో ఉంది. సముద్రం తీరం గ్రామాలవారు తాము పండించిన ఉప్పును ఈ ఊరిలో అమ్మేవారు ఇక్కడి నేల కూడా ఉప్పు పేరుకొని ఉంటుంది. అందుకే ఉప్పుకుంట, ఉప్పుగుండ అనేవి ఉప్పుగుండూరు అయి ఉండవచ్చుని చెబుతారు. చారిత్రకంగా పరిశీలిస్తే క్రీ.శ.12,13 శతాబ్దాల నాటి శాసనాల్లో ఉప్పుగుండూరు, క్రీ.శ.1138 నాటి కామచూడ మహారాజు కొణిదెన శాసనంలో ఉప్పుగుండూరు అని ఉంది. ఈ గ్రామాన్ని సంస్కృతీకరించి 'లవణపాషాణపురం' అని అందంగా పిలుస్తారు.

మార్కాపురం

మార్కాపురంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం చరిత్ర ప్రసిద్ధి పొందింది. శ్రీశైలం క్షేత్రాన్ని సందర్శించాలనుకొనే వారు రైలు మార్గం ద్వారా ఇక్కడి నుంచే వెళ్లవలసి ఉంటుంది. చెన్నకేశవస్వామి ఆలయం భక్తుల పాలిట కల్పతరువుగా అలరారుతోంది. ఆలయంలోని 40స్తంభాల మండపంలోని కొన్ని స్తంభాలు సరిగమలను పలుకుతాయి. ధనుర్మాసమంతా సూర్యోదయ, సూర్యాస్తమయ సమయంలో కిరణాలు మూలవిరాట్ పైపడతాయి. ఉత్తరాయణంలో ఉదయ కిరణాలు స్వామివారి పాదాలపైన, దక్షిణాయనంలో మహలక్ష్మి పాదాలపైన పడుతుంది. ఆలయంలో మూలవిరాట్‌కు ఇరువైపుల శ్రీదేవి, భూదేవి విగ్రహాలు, ఎడమవైపు మారికా, మారకులు అనే దంపతుల విగ్రహాలు దేవాలయ చరిత్రకు గుర్తులుగా నిలిచి ఉన్నాయి. పూర్వం మారిక పేరుతో విలసిల్లిన మారికాపురం కాలక్రమంలో మార్కాపురంగా మారింది.

అద్దంకి

అద్ద, అంకి అనే ఇద్దరు ప్రేమికులు తమ ప్రేమ కోసం ప్రాణాలను అర్పిస్తారు. ఇలా ప్రేమికుల పేర్లతోనే అద్దంకి గ్రామం ఏర్పడింది. విశేషం ఏమిటంటే పండరంగని అద్దంకి శాసనం (క్రీ.శ. 848) ఇక్కడే వెలుగు చూసింది. గుండ్లకమ్మ అనే నది ఈ గ్రామం నుంచి ప్రవహిస్తుంది. ప్రోలయ వేమారెడ్డి అద్దంకిని రాజధానిగా చేసుకొని పరిపాలన చేశాడు. కవిత్రయంలో చివరివాడైన ఎర్రన ఆంధ్రమహాభారతాన్ని ఇక్కడే పూర్తి చేశాడు.

మేదరమెట్ల

ఈ గ్రామం కొరిశపాడు మండలంలోనిది. మేదర వృత్తి చేసినవారు తొలిసారిగా గ్రామంలో నివాసం ఏర్పరుచుకోవడం వల్ల మేదరమెట్ల అనే పేరు ఈ గ్రామానికి వచ్చింది. ఈ ఇంటి పేరు గల వారు రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో ఉన్నారు.

ఆకివీడు

ఈ గ్రామం రేచర్ల మండలంలోనిది పూర్వము పెద్దవీడుకు చెందిన పెద్దినేయ అనే పశువుల కాపరి పెద్దినేపాడు అనే గ్రామాన్ని స్థాపించాడు. అతనికి ఆకెమ్మ అనే సోదరి ఉండేది. ఆమె వేరొక స్థలంలో నివాసం ఏర్పరుచుకుంది. అక్కడ ఆకివీడు అనే పేరుతో కొత్త గ్రామం ఏర్పడింది. వీడు అంటే ప్రాంతం, పట్టణం అని అంటారు.

రావినూతల

ఇది కోరిశపాడు మండలంలో ఉంది. రావి అంటే ఓ ప్రవాహం పక్కన ఏటవాలుగా ఉండే ప్రాంతమని గ్రహించాలి. నూతల అంటే ఓ రకమైన గడ్డి. ఈ పల్లె నీటి ప్రవాహం పక్కన గల ఏటవాలు ప్రాంతంలోనే ఉంది. ఈ రెండు అంశాలు ముడిపడి ఉండటంతో దీనికి రావినూతల అనే పేరు వచ్చినట్టు విశ్రాంత ప్రధానాచార్యులు డా॥ నాగభైరవ ఆదినారాయణ పేర్కొన్నారు. రావి తొలి పదంగా ఉన్న అన్ని గ్రామాలకు దాదాపు ఇది వర్తిస్తుంది.

త్రిపురాంతకం

ఇది మండల కేంద్రం. ఈ గ్రామంలో త్రిపురాంతకేశ్వరాలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఇతిహాసాల ప్రకారం మహాశివుడు త్రిపురాలను ఏలే త్రిపురాసురులను ఇక్కడే అంతం చేశాడు. అందుచే ఈ ఊరికి త్రిపురాంతకం అని పేరు వచ్చింది. ఇక్కడ ఉన్న శివలింగం పై భాగాన ఒక అంగుళంలోపల రంధ్రం ఉంటుంది. ఆ రంధ్రంలో గంగ (నీరు) ఎల్లవేళలా ఊరుతూ ఉంటుంది.

సంతనూతలపాడు

ఇది మండల, నియోజకవర్గ కేంద్రం. ఈ పల్లె ఏర్పాటైనప్పుడే సంతతో పాటూ నూతల(గడ్డి), పాడు అంటే పాటి నేల అని అర్థం. అలా ఈ గ్రామానికి ఆ పేరు వచ్చినట్టు డా॥ నాగభైరవ ఆదినారాయణ వివరించారు.

మేడపి

ఇది త్రిపురాంతకం మండలంలోని ఒక గ్రామం. కోడి పందేలలో ఓటమి చెందిన బ్రహ్మనాయుడు త్రిపురాంతకం వచ్చిన తరువాత ఇక్కడకి సమీపంలో ఉన్న మేడిచెట్లను కొట్టివేయించి ఓ గ్రామాన్ని నిర్మించాడు. మేడిచెట్ల పేరుతో ఈ ప్రాంతానికి మేడపి అనే పేరు వచ్చింది.

పుల్లలచెరువు

ఇది మండల కేంద్రం. ఈ ప్రాంతంలో పులులు హెచ్చు సంఖ్యలో ఉండడంతో పులులచేరువ అనే పేరు వచ్చింది. అంటే పులులకు చేరువైన స్థలం అని అర్థం. అయితే జనవ్యవహారంలో పుల్లలచెరువుగా స్థిరపడింది.

చీరాల

ఇది శాసనసభ నియోజక వర్గ కేంద్రం. త్రేతాయుగంలో రావణుడు సీతాదేవిని ఎత్తుకుపోతుండగా ఆమె తన చీర కొంగును చింపి తన ఆభరణాలన్నింటిని కడుతుండగా, సీతాదేవి చీరకొంగు చింపుతున్న సమయంలో చీరలోని ఒక పీలిక గాలికి ఎగిరిపొయింది. ఆ చీర ముక్క క్రింద పడిన ప్రాంతాన్ని చీర రాలిన ప్రాంతంగా పిలిచేవారు. అదే విధంగా చీరరాలూరుగా మారింది. జనవ్యవహారంలో చీరాలగా స్థిరపడింది. చీరాల వస్త్ర పరిశ్రమకు ప్రముఖ కేంద్రంగా విరజిల్లుతోంది. దీనిని శుద్ధనగరం అని కూడా పిలిచేవారు. మరో కథనం ప్రకారం దీని తొలి పేరు క్షీరపురి. ఎందుకంటే ఇక్కడ సముద్రం పాల తెలుపుతో దర్శనమిస్తుంది. ఆ తరువాత కాలంలో చేనేత చీరలకు ఈ ఊరు ప్రసిద్ధి చెందింది. ఫలితంగా దీని పేరు చీరాలగా మారింది. ఇక్కడి నేత చీరలు, సీకో చీరలు, కుప్పడం రకాలు ప్రసిద్ధి చెందాయి.

వేటపాలెం

ఇది మండల కేంద్రం. చీరాలకు 9 కి.మీ దూరంలో ఉంది. వేటపాలెం అనగానే అక్కడి ప్రపంచ ప్రసిద్ధి చెందిన "సారస్వతనికేతనం" (గ్రంథాలయం) గుర్తుకు వస్తుంది. నాటి రాజులు ఈ ప్రాంతంలో మృగాలను వేటాడేవారు. దీంతో ఈ ప్రాంతానికి వేటపాలెం అని పేరు వచ్చింది. దీన్ని 'మృగయాపురి'

అని కూడా పండితులు సంస్కృతీకరించి పిలుస్తుంటారు. అక్కడి భోగలింగేశ్వర స్వామిని దర్శించిన భక్తులలో ఒకరైన డా॥ ఆకొండి విశ్వనాథం స్వామిపై ఆశువుగా ఓ శతకాన్ని పలికారు. అదే భోగలింగేశ్వర శతకం.

చెరుకూరు

ఇది పర్చూరు మండలంలో ఉంది. చెరుకు + ఊరు (చెరుకూరు) చెరకు బాగా పండించే ఊరుగా ప్రసిద్ధి చెందింది. అంచేతనే చెరుకూరైంది. పండితులు దీన్ని 'ఇక్షుపురి' అన్నారు. (ఇక్షు అంటే చెరకు అని గ్రహించాలి).

సింగరాయకొండ

ఈ గ్రామం అద్దంకికి 6 కి.మీ దూరంలో ఉంది. ఇది మండల కేంద్రం కూడా. భవనాశి సరస్సు ఒడ్డున ఉంది. దీని తొలిపేరు సింగన్నకొండ. శ్రీలక్ష్మీనరసింహస్వామికి భక్తుడైన సింగన్నకు దర్శనమిచ్చిన స్థలం. ఇక్కడ లక్ష్మీనరసింహస్వామి భక్తులపాలిట కొంగుబంగారంగా చెబుతారు. సింగన్నపేరుతోనే ఈ పల్లె సింగరకొండగా సింగారించు కొంది. కాలక్రమంలో సింగరాయకొండగా స్థిరపడింది. ఇక్కడి దేవాలయాన్ని 14వ శతాబ్దంలో నిర్మించారు. ఆ తరువాత శ్రీకృష్ణ దేవరాయలు ఈ ఆలయాన్ని ఎంతగానో అభివృద్ధి చేశాడు. ఇక్కడ గల హనుమాన్ ఆలయం కూడా ఎంతో ప్రసిద్ధి చెందింది.

కొత్తపట్నం

ఇది ఒంగోలుకు 18 కి.మీ దూరంలో ఉంది. ఒంగోలు పట్టణానికి అతి సమీపాన సాగరతీరంలో ఉంది. ఈ తీరం ఎంతో పరిశుభ్రంగా ఉంటుంది. వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. ఇది కొత్తగా ఏర్పాటైన గ్రామం కాబట్టి కొత్తపట్నం అయింది.

వల్లూరు

ఒంగోలు పట్టణానికి 5కి.మీ దూరంలో టంగుటూరు మండలంలో ఈ గ్రామం వెలసింది. ఈ పల్లెలో వల్లూరమ్మ దేవస్థానం ఎంతో ప్రసిద్ధి చెందింది. వల్లూరమ్మ దేవత పేరుతోనే ఈ గ్రామానికి వల్లూరు అనే పేరు వచ్చినట్టు

చెబుతారు. మరో కథనం ప్రకారం కాకతీయ ప్రభువుల ముఖ్య సలహాదారులైన వల్లూరు వంశస్థులు ఈ గ్రామానికి అగ్రహారీకులుగా వ్యవహరించేవారు. వారి పేరుతోనే ఈ పల్లెకు వల్లూరు అనే పేరు వచ్చింది.

మోక్షగుండం

ఇది బెస్తవారిపేట మండలంలో ఉంది. మోక్ష మిచ్చే కోనేరు ఇక్కడ వెలిసింది. గుండం అంటే నీటి మడుగు. ఇందులో మునిగితే మొక్షం వస్తుందని భక్తుల విశ్వాసం. ప్రఖ్యాత ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మస్థలం ఇది. విశ్వేశ్వరయ్య ఇంటి పేరు ఈ గ్రామం కావడం విశేషం.

చదలవాడ

ఇది నాగులప్పలపాడు మండలంలో ఉంది. దీని పూర్వనామం చతుర్వాటిక. శ్రీరాముడు ఇక్కడే తనకు సహకరించిన వానర సైన్యాన్ని నాలుగు భాగాలు చేసి నాలుగు దిక్కులకు పంపాడు. అంచేత ఈ పుణ్యస్థలి చతుర్వాటిక అయ్యింది. కాలగమనంలో చదలవాడ అయింది. ఇక్కడ గల శ్రీరఘునాథస్వామి ఆలయం పురాణ ప్రసిద్ధి చెందింది. కవిత్రయంలోని ఎర్రన గుడ్లూరులో పుట్టి ఇక్కడి వచ్చి కొంత కాలం ఉండి స్వామిని సేవించాడు. అందుకే డా॥ ఆకొండి విశ్వనాథం 1982లో ఇక్కడ ఎర్రన పీఠాన్ని స్థాపించారు.

మల్లవరం

ఇది మద్దిపాడు మండలంలో ఉంది. గుండ్లకమ్మ నదీతీరంలో శ్రీపతి(మల్లన్న) విశ్రాంతి తీసుకున్న గిరియే మల్లవరగిరి. మల్లన్న భక్తునికి వరం ఇచ్చిన గిరి ఇది. కాలక్రమంలో మల్లవరంగా స్థిరపడింది.

కనిగిరి

ఇది మండల కేంద్రం. ఈ గ్రామం తొలిపేరు కనకగిరి కాలక్రమంలో జనవ్యవహారంలో కనిగిరిగా మారింది. రావణబ్రహ్మ తన సోదరి శూర్పణఖకు కనకాన్ని (బంగారం) ధారపోసి ఇచ్చిన గిరి (కొండ) ప్రాంతమే కనకగిరి.

నాయనిపల్లి

ఇది వేటపాలెం మండలంలో ఉంది. చోళరాజు వేటాడి, వేటాడి అలసిపోయి ఈ ప్రాంతంలో విశ్రాంతి తీసుకున్నాడు. దీన్ని గమనించిన బోయలు ఇది మన నాయుడుపల్లి అన్నారు. అదే క్రమంగా నాయునిపల్లెగా మారింది. చివరిగా నాయనిపల్లిగా స్థిరపడింది.

మణికేశ్వరం

ఇది అద్దంకి మండలంలో ఉంది. దీన్ని తొలుత మానికేశ్వరంగా పిలిచేవారు. పూర్వం ఓ భక్త వ్యాపారి కొలపాత్రయగు మానికతో కొలిచి వ్యాపారం చేసేవాడు. ఒక రోజు ఉదయాన్నే లేచి లేవగానే మానిక కనిపించింది. దాన్ని శివలింగం అనుకొని పూజించాడు. ఆ మానిక శివలింగంగా మారిందని ఐతిహ్యం చెబుతోంది. అతడు కొంత కాలం తరువాత శివైక్యం చెందాడు. మానికి ఈశ్వరునిగా మారిన చోటే మాణికేశ్వరం/మణికేశ్వరం అయింది.

భైరవకోన

ఇది చంద్రశేఖరపురం మండలంలో ఉంది. అంబవరం, కొత్తపల్లి గ్రామ సమీపంలో ఉంది. పల్లవులు కాలంనాటి అద్భుత శిల్పకళకు సాక్షీభూతంగా ఉంది. ఈ ప్రాంతానికి భైరవుడు అనే క్షేత్రపాలకుడు ఉండేవాడు. అలాగే ఈ ప్రాంతాన్ని కాలభైరవుడు అనే చక్రవర్తి పాలించాడని ఆయన పేరుమీదనే భైరవకోన అనే పేరు వచ్చింది. ఇక్కడ ఒకే రాతి మీద ఎనిమిది దేవాలయాలు ఉండడం విశేషం.

రామతీర్థం

ఇక్కడ శ్రీ మోక్షరామలింగేశ్వరుడు ఆలయం వెలిసాడు. శ్రీరాముడు సందర్శించిన పవిత్ర స్థలం ఇది. రావణుడు పంపిన రాక్షసులను శ్రీరాముడు ఇక్కడే సంహరించాడు. ఈ ప్రాంతంలో శ్రీరాముడు కోనేరు తవ్వించాడు. అందులో స్నానమాచరించాడు. ఈ కోనేరును విభూది గుండం అని కూడా అంటారు. కోనేరు మట్టిని నొసట ధరిస్తే విభూది వర్ణం వస్తుంది. దీంతో ఈ ప్రదేశానికి

రామతీర్థం అనే పేరు వచ్చినట్టు ఐతిహ్యం వల్ల తెలుస్తోంది. చైత్ర పౌర్ణమి నాడు జరిగే జాతర సమయంలో ఈ ప్రాంతంలో కాకి గానీ, గద్దగానీ కనిపించవు.

చీమకుర్తి

చిక్కయ్య అనే గజదొంగ ఈ ప్రాంతంలో బీభత్సం సృష్టిస్తుండేవాడు. ప్రజలను భయభ్రాంతులను చేసేవాడు. అయితే ఓ స్వామి ప్రబోధంతో ప్రభావితుడయ్యాడు. నీతి, నిజాయితీలతో బతకడం నేర్చుకున్నాడు. అయినప్పటికీ అతడ్ని ప్రజలు విశ్వాసంలోకి తీసుకోలేదు. ఈ ప్రాంతంలో గల చీమలమర్రి చెంత చిక్కయ్య కుత్తుకను (మెడ) నరికేశారు. ఆ స్థలమే చీమకుర్తిగా మారింది. ఈ ప్రాంతంలోనే స్వామి వెలిసి చిక్కయ్య నిర్దోషి అని సాక్ష్యం చెబుతాడు. భక్తునికి మోక్షం కల్పిస్తాడు. అలాంటి పుణ్యస్థలి చీమకుర్తి.

మాలకొండ / మాల్యాద్రి

శ్రీమహావిష్ణువు లక్ష్మీ దేవితో కలిసి భూలోకంలో విహరించగోరి తన వనమాలను పర్వతాకారం దాల్చమని చెప్పాడు. పర్యవసానంగా ఇక్కడ మాలాకారంలో కొండలు రూపాన్ని దాల్చాయి. అందుకే ఈ ప్రాంతానికి మాలకొండ అని పేరు పెట్టారు. దీన్ని సంస్కృతీకరించి మాల్యాద్రి అని వ్యవహరిస్తున్నారు. ఇక్కడ గల లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఇది ఏకశిలా నిర్మితం.

కరవది

శ్రీరాముడు ఖరుడనే రాక్షసుడ్ని వధ చేసిన స్థలం ఇది. ఖరవధా స్థలి కాలక్రమంలో జనవ్యవహరంలో కరవదిగా మారింది. కరావతి అనే శిలా శాసనం కూడా ఉంది.

దేవరంపాడు

మదన గోపాలస్వామి అవతరించిన పవిత్ర స్థలం ఇది. ఆ దేవుడు వెలిసిన పాడు (గ్రామం) ఇది. దేవుడు అనే పదానికి వికృతి రూపం దేవర. దేవర, పాడు కలయికతో దేవరంపాడు ఓ గ్రామంగా ముస్తాబైంది.

గుడ్లూరు

ఇది మండల కేంద్రం. శుభాలను ప్రసాదించే నీలకంఠేశ్వరస్వామి వెలిసిన పుణ్యభూమి ఇది. శివుని కన్నులారా గాంచినట్టు చేసిన పురం ఇది. ఒక్క ముక్కలో చెప్పాలంటే నేత్రపురి ఇది. నేత్రాన్ని సామాన్య జనం గుడ్డు, కనుగుడ్డు అని వ్యవహరిస్తుంటారు. గుడ్డు పేరుతో గుడ్లూరు అయిందని స్థానికుల ఉవాచ.

గొడ్రాలికొండ

ఇది పద్దారవీడు మండలంలోని రాజంపల్లి గ్రామం సమీపంలో ఉంది. ఇక్కడ గల కొండపై తిరుమలనాథ స్వామి వారి దేవాలయం ఉంది. ఇది చాలా పురాతన ఆలయం. ఈ క్షేత్రానికి ఎంతో చారిత్రక ప్రాధాన్యత ఉంది. సంతానం లేని దంపతులు నియమ, నిష్ఠలతో స్వామి వారిని కొలుస్తూ ప్రదక్షిణ చేస్తే వారికి సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం.

గుంటగంగ

ఇది మండల కేంద్రం. సోమవరప్పాడు పంచాయితీ పరిధిలో గుంటగంగ అనే గంగా భవానీ ఆలయం ఉన్నది. ఇది పురాతనమైన ఆలయం ఈ దేవాలయానికి దక్షిణవైపు రాతిగుండు కిందుగా జలపాతం ఉంది. దీన్ని మొదట గుండుగంగగా పిలిచేవారు. అయితే రాతి గుండును తొలగిస్తే పెద్ద జలాశయం ఏర్పడుతుందని రైతులు భావించారు. గుండును తొలగించగా అక్కడ ఒక గుంట మాత్రమే ఏర్పడింది. పర్యవసానంగా గుండుగంగ క్రమేపి గుంటగంగగా మారింది. చైత్ర బహుళ విదియ రోజున ఇక్కడ జరిగే తిరునాళ్లకు ప్రకాశం, నెల్లూరు, గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన లక్షలాది మంది భక్తులు పాల్గంటారు. దీన్ని దక్షిణ కాశీగా పిలుస్తారు.

చిన్న గంజాం, పెద్ద గంజాం

ఇది మండల కేంద్రం. ఒడిషాలోని కొంత మంది ఇక్కడకు వలస వచ్చి స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. తమ పూర్వాశ్రమంపై కృతజ్ఞతాభావంతో గంజాం అని పేరు పెట్టుకున్నారు. తొలుత పెద్ద గంజాం ఏర్పాటు కాగా దీనికి 5కి.మీ దూరంలో చిన్న గంజాం ఏర్పడింది. ఈ రెండు ప్రాంతాలు ఉప్పు గల్లీలకు ప్రసిద్ధి చెందాయి.

సంతరావూరు

ఇది చినగంజాం మండలంలో ఉంది. తొలుత ఈ జనావాసం తొలిపేరు మురహరిరాయని పట్టణం. క్రీ.శ87లో మురహరిరాయుడు అనే పాలకుడు తన పేరు మీదుగా ఈ పట్టణాన్ని నిర్మించాడు. ఆ తరువాత ఆ జనావాసంలో పట్టణం దక్షిణవైపునకు విస్తరించింది. అక్కడ ఓ పెద్ద రావి చెట్టు ఉండేది. అందుకే ఆ పట్టణం రావూరు(రావి+ఊరు) అనే పేరుతో ప్రసిద్ధి చెందింది. అయితే అప్పట్లో పెద్ద సంత నిర్వహించేవారు. బకింగ్‌హామ్ కాలువ నుంచి వివిధ ప్రాంతాల నుంచి పడవల ద్వారా దినుసులు వచ్చేవి. దీంతో ఇది సంతరావూరు అనే పేరుతో స్థిరపడింది. గతంలో ఈ గ్రామంలో పెద్ద సమస్య ఎదురుకావడంతో శ్రీకృష్ణదేవరాయలు వచ్చి ఆ సమస్యను పరిష్కరించారు. ఈ పల్లెపై ఇదే గ్రామానికి చెందిన విశ్రాంత డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు తోటకూర వెంకటనారాయణ రాసిన "మా ఊరు. సంతరావూరు" అనే గ్రంథంలో ఈ విషయాలను ముచ్చటించారు. శాతవాహనుల కాలం నుంచి వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు వరకూ గ్రామంలోజరిగిన చారిత్రక ఘట్టాలను వివరించారు. కాగా కల్నల్ మెకంజీ సేకరించిన కైఫియత్‌లో ఈ గ్రామ చరిత్ర ఉంది.

రంగధాముల

ఇది ఫరూక్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామ సమీపంలో వెలిసింది. ఈ ప్రాంతంలో గల శ్రీరంగనాయకస్వామి ఆలయం ఉంది. ఇక్కడ స్వామి అంగరంగ వైభవంగా నీరాజనాలు అందుకుంటూ భక్తుల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నాడు. సర్వోదయ నాయకుడు ఆచార్య వినోబాభావే, త్రిదండి చినజియర్ స్వామి లాంటి ప్రముఖులు ఎందరో ఈ ఆలయాన్ని సందర్శించారు. స్వామి పేరుతోనే ఈ గ్రామానికి రంగధాముల అనే పేరు వచ్చింది. ధామము అంటే దివ్యతేజస్సుతో ఉన్న స్థలం అని అర్థం చేసుకోవచ్చు. ధామం జన వ్యవహారంలో ధాముల అయింది.

పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

నెల్లూరు పట్టణం

ఇది జిల్లా కేంద్రం. ప్రస్తుతం పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా వ్యవహరిస్తున్నారు. నెల్లూరు అనగానే నెల్లూరు నెరజాన అనే పాట గుర్తురాక మానదు. నెల్లూరును విక్రమసింహపురిగా కూడా పిలుస్తారు. విక్రమసింహ మహావీర, మనుమసిద్ధి మహారాజు సింహపురిని ముఖ్యపట్టణంగా చేసుకొని నెల్లూరు ప్రాంతాన్ని పరిపాలించారు. అందుచే విక్రమసింహపురి అనే పేరు కూడా వచ్చింది. ఇక్కడి విశ్వవిద్యాలయాన్ని ఈ పేరుతోనే పిలుస్తున్నారు. కాగా ఈ ప్రాంతంలో ఆ రోజుల్లో సింహాలు విపరీతంగా సంచరించడంతో సింహపురిఅనే పేరు వచ్చింది. మనుమసిద్ధి మహారాజు కాలంలో ఈ ప్రాంతం సస్యశ్యామలమైన వరి పంట అత్యధికంగా పండేది. అందుకే ఈ ప్రాంతాన్ని నెల్లి(తమిళ భాషలో వరి అని అర్థం) అలా నెల్లివూరు అనే పేరు వచ్చింది. ఈ ప్రాంత స్థల పురాణం ప్రకారం కాలక్రమంలో నెల్లివూరు నెల్లూరుగా మార్పు చెందింది. మరో కథనం ప్రకారం నెల్లి (ఉసిరిక) చెట్టుకింద మూలస్థానేశ్వరుడు ఉద్భవించి ఆ తరువాత జనపదాలు విస్తరించుటవల్ల నెల్లూరు అయింది. నెల్లూరు పట్టణాన్ని సింహపురిగా కూడా పిలుస్తారు.

రంగనాయకులపేట

ఇది నెల్లూరు పట్టణ పరిధిలో ఉంది. ప్రసిద్ధి చెందిన రంగనాథస్వామి దేవాలయాల్లో తల్పగిరి రంగనాథస్వామి ఆలయం ఒకటి. ఈ ఆలయం నెల్లూరులో ఉంది. స్వామి పేరుతోనే ఇక్కడ ఓ ఆవాస ప్రాంతం ఏర్పాటైంది. దానికి రంగనాయకులపేట అని పేరు పెట్టారు. మహాకవి తిక్కన ఈ దేవాలయంలోనే మహాభారతాన్ని తెలుగులోకి అనువదించాడు.

దగదర్తి

ఇది మండల కేంద్రం. ఈ గ్రామం ఏర్పడినప్పుడు దగ, దర్తి అనే ఇద్దరు యానాది కులస్థులు ముందుగా ఈ ప్రాంతంలో స్థిరపడిపోయారు. అందువలనే ఈ గ్రామానికి దగదర్తి అనే పేరు వచ్చింది.

యాచసముద్రం

ఇది వెంకటగిరి మండలంలో ఉంది. వెంకటగిరి జమీందార్లలోని వీరకుమార యాచేంద్రుని పేరు మీదుగా ఈ గ్రామం ఏర్పడింది. ఆయనే ఈ గ్రామాన్ని నిర్మించినట్టు చెబుతారు. కాగా సముద్రం పెద్ద చెరువుకు సంకేతంగా వ్యవహరిస్తున్నారు. గ్రామంలో పెద్ద చెరువును నిర్మించారు.

సంగం

మండల కేంద్రమైన సంగం నెల్లూరుకు 32 కి.మీ దూరంలో ఉంది. ఇక్కడ కామాక్షి సమేత సంగమేశ్వరాలయం ఉంది. అత్యంత పురాతనమైన దేవాలయం ఇది. పెన్నానదిలో బీరా, పేరు బొగ్గూరు, వాగులు కలిసే సంగమ ప్రదేశంలో ఈ ఆలయం ఉంది. ఆ పేరుతోనే సంగం ఏర్పడింది. పరశురాముడు తన తల్లిని చంపినందుకు పాప పరిహారంగా ఇక్కడ సంగం స్థానంలో శివలింగాన్ని ప్రతిష్ఠించాడని ఐతిహ్యం వల్ల తెలుస్తోంది. ఈ ఆలయంలో ప్రతిఏటా ఏప్రిల్‌లో 9రోజులపాటు సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి.

కావలి

ఇది రెవెన్యూ డివిజన్ కేంద్రం. నెల్లూరు జిల్లాలో గల ముఖ్యపట్టణాలలో ఇది ఒకటి. విద్య, సాంస్కృతిక రంగాలలో ఎంతో పేరు పొందింది. శ్రీకృష్ణదేవరాయుల కాలంలో ఇక్కడ ఒక చెక్‌పోస్టు తరహాలో పెద్ద కాపలా కేంద్రం ఉండేది. దీని పేరుతోనే కాపలగా ఈ గ్రామానికి పేరు పెట్టారు. కాపల క్రమంగా కావలిగా మారిందని స్థానికులు అందజేసిన సమాచారం వల్ల తెలుస్తోంది.

ప్రభగిరి పట్టణం

ఇది పొదలకూరు మండలంలో ఉంది. 13వ శతాబ్దంలో శ్రీకృష్ణ దేవరాయుల సామంతరాజైన ప్రభాకరవర్ధనుడు ఈ ప్రాంతాన్ని పాలించాడు. ఆయన పరిపాలనలో ప్రజలంతా క్షేమంగా ఉండేవారు. ఇదే ప్రాంతం లో కొండ ఉండేది. ప్రభాకరవర్ధనుని పేరుతోనే ఈ గ్రామం వెలసింది. ఇక్కడ గల పెరుమాళ్లస్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది.

ముత్తుకూరు

ఈ గ్రామానికి ముత్యం శబ్దం నుంచి ఈ పేరు వచ్చింది. శ్రీకృష్ణ దేవరాయుల బంధువైన ముత్తయ పేరుతో ఈ గ్రామం వెలిసి ఉండవచ్చుని స్థానికుల కథనం.

మనుబోలు

ఇది మండల కేంద్రం. సంస్కృతపరమైన ఊరు. మనుప్రోలు=మనుపట్టణం అని అర్థము. మనుస్మృతి ఆధారంగా ఈ గ్రామం ఏర్పడినట్టు ఐతిహ్యం వల్ల తెలుస్తోంది. శాతవాహనుల కాలంలో ఈ గ్రామం అవతరించింది. కాలక్రమంలో వ్యవహారిక భాషలో మనుప్రోలు ఆ తరువాత మనుబోలుగా మారింది.

మామిడిపూడి

ఇది ముత్తుకూరు మండలంలో ఉంది. ఇది వృక్ష సూచి. మామిడి అంటే మామిడి చెట్టు, పూడి అనేది జల సూచి. మామిడి, మామిల్ల ఇంటిపేరుతో గల కొన్ని కుటుంబాలు ఉన్నాయి.

కోవూరు

ఇది మండల కేంద్రం. కోవి అంటే ఒక రకమైన చెట్టు (రేల, కానుగ) కోవిఊరు = కోవూరు అయింది. ఇది వృక్షనామ సూచి.

నాగమాంబపురం

ఇది బుచ్చిరెడ్డిపాలెంలో ఉంది. గోల్కొండ నవాబు ఈ ప్రాంతాన్ని సందర్శించినపుడు నాగమాంబ అనే మహిళ అతనికి స్వాగత సత్కారాలను ఘనంగా నిర్వహించింది. ముగ్ధుడైన ఆ నవాబు ఈ గ్రామాన్ని ఆమెకు బహుమతిగా ఇచ్చాడు. ఆమె పేరుమీద ఈ గ్రామం ఏర్పడింది.

పద్మనాభ సత్రం

ఇది కొడవలూరు మండలంలో ఉంది. వెలమ కులానికి చెందిన జలదంకి పద్మనాభనాయుడు ఈ ప్రాంతంలో సత్రాన్ని, కోనేరును కట్టించాడు. ఇతని పేరుతో ఈ ఊరు ఏర్పడింది.

పాటూరు

ఇది కోవూరు మండలంలో ఉంది. కొన్ని శతాబ్దాల క్రితం ఈ గ్రామంలో యాదవులు పాడిని ఎంతో అభివృద్ధి చేశారు. పాడి అంటే పాలు అని అర్థం. అంచేత దీనికి పాలటూరు అనే పేరుండేది. కాలక్రమంలో పాలటూరు పాటూరుగా మారింది.

వెంకటాచలం

ఇది మండల కేంద్రం. ములుపూడి వెంకటాచలం అనే యోధుని పేరుతో ఏర్పాటైన గ్రామం ఇది. ఈస్టిండియా కంపెనీ నెల్లూరు ప్రాంత సైన్యాధిపతి వెంకటాచలానికి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారికి మధ్య భూతగాదాలు వచ్చాయి. ఇతన్ని అంతమొందించేందుకు వారు సిద్ధమయ్యారు. వెంకటాచలం ఇంటి వద్ద విశ్రమిస్తున్న సమయంలో ఆ వర్గం వారు సామూహికంగా దాడి చేశారు. వారి చేతిలో చావడం ఇష్టంలేక తనకు తానే కత్తితో పొడుచుకొని మరణిస్తాడు. దీంతో ఆ ప్రాంతీయులు తమ గ్రామానికి వెంకటాచలం అని నామకరణం చేసినట్టు సాహితీవేత్త కానూరి బదరీనాథ్ ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు.

పురిణి

ఇది అల్లూరు మండలంలో ఉంది. పురిణమ్మ అనే గ్రామదేవత ఆధారంగా ఈ ఊరికి ఆ పేరు వచ్చింది. ఈమె జైనుల దేవత.

బుచ్చిరెడ్డిపాలెం

ఇది మండల కేంద్రం. బుచ్చిరెడ్డి అనే ప్రముఖ వ్యక్తిపేరుతో ఈ గ్రామాన్ని ఏర్పాటు చేశారు. ఈ గ్రామం నెల్లూరుకు 15 కి.మీ దూరంలో ఉంది. చేపలు, రొయ్యల పెంపకానికి ఎంతో ప్రసిద్ధి చెందింది. ఉత్తరప్రదేశ్ తొలి గవర్నర్ బెజవాడ గోపాలరెడ్డి, ప్రముఖ తెలుగు సినిమా నిర్మాత, దర్శకుడు ఎ.ఎం. రత్నం ఈ గ్రామానికి చెందినవారే కా వడం విశేషం.

గూడూరు

ఇది మండల, నియోజకవర్గ కేంద్రం. రాష్ట్రంలోని అతిపెద్ద రైల్వే జంక్షన్‌లలో ఒకటి. వాణిజ్య పరంగా ప్రముఖమైనది. ఇక్కడ నిమ్మకాయలు, అభ్రకం (మైకా), రొయ్యల సాగు ప్రసిద్ధికెక్కాయి. తొలుత ఈ ఊరిని కుముదూరు అని పిలిచేవారు. క్రమేపి ఇది గూడూరుగా మారింది. కుమ్మరి అమ్మల ఊరని అర్థం. గూడు–ఊరు ఆ తరువాత గూడూరు అయింది. (గుడిసెల–ఊరు). గూడూరు ప్రాంతం శాతవాహనులు, పల్లవులు, చోళులు, కాకతీయులు, విజయనగరరాజులు, గొల్కొండ నవాబులు, వెంకటగిరి సంస్థానాధీశుల ఏలుబడిలో ఉండేది. క్రీ.శ 1000 సంవత్సరం విరియాల కామసాని గూడూరు శాసనం ఎంతో ప్రసిద్ధి చెందింది. గూడూరు పేరుతో కృష్ణాజిల్లాలో మరో ఊరు కూడ ఉంది.

గూడలి

ఇది కోట మండలంలో ఉంది. దీని తొలి పేరు కూడలి కాలక్రమంలో గూడలి అయింది. సువర్ణముఖి, చల్లకాల్వ కలిసే సంగమం కాబట్టి నదుల కూడలి క్రమేణా గూడలి అయింది.

దుగ్గరాజుపట్నం

ఇది వాకాడు మండలంలో ఉంది. దుగ్గరాజు అనే వ్యక్తి ఈ తీరప్రాంతంలో పట్టణాన్ని నిర్మించారు. దీన్ని వ్యక్తి నామ సూచికగా పేర్కొనవచ్చు. ఆయన రేవు ప్రాంతంగా అభివృద్ధి చేశాడు. ప్రముఖ రేవు పట్టణం ఇది.

కోట

ఇది మండల కేంద్రం. తొండమాను చక్రవర్తి ఈ ప్రాంతంలోని శక్తికి కోటమ్మ అనే పేరు పెట్టాడు. అటవి భూమిని చదును చేసాడు. కోటమ్మ పేరు స్ఫురించే విధంగా కోట అనే గ్రామాన్ని నిర్మించాడు.

వాకాడు

ఇది మండల కేంద్రం. వాక అంటే నది అని అర్థం. కాడు అంటే అడవి అని అర్థం. అనగా స్వర్ణముఖి నది ప్రక్కనే ఉన్న అడవి. ఈ రెండు ఉన్న ప్రాంతం కాబట్టి వాకాడు అయ్యింది. మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి స్వగ్రామం ఇది. వాకాడు పేరుతోనే పలు విద్యాసంస్థలు వెలిశాయి.

అక్కసముద్రం

ఇది బాలయ్యపల్లె మండలంలో ఉంది. వెలుగోటి వంశానికి చెందిన ఐదుగురు అక్కాచెల్లెళ్లు ఆత్మత్యాగానికి గుర్తుగా బంగారు యాచమనాయుడు గుడి కట్టించాడు. అందువల్ల ఈ ఊరికి అక్కసముద్రం అని పేరు వచ్చింది. సముద్రం అంటే గ్రామం అనే అర్థంలో తీసుకోవాలి.

మంగళంపాడు

ఇది వ్యవసాయ సంబంధమైన గ్రామం. ఇది సూళ్లూరుపేట మండలంలో ఉంది. తమిళంలో అగ్రహారాన్ని మంగళం అంటారు. పాడు అనేది జైనులు ఉన్న ప్రాంతమని గ్రహించాలి.

ముత్యాలపాడు

ఇది చిల్లకూరు మండలంలో ఉంది. శ్రీకృష్ణదేవరాయుల పాలనలో ముత్యాల రాశులు పోసి ఇక్కడే అమ్మేవారని ప్రతీతి. ఇది గూడూరు పట్టణానికి సమీపంలో ఉంది. పాడు అంటే జైనులు నివసించిన ప్రాంతం లేదా గ్రామం అని అర్థం.

నాయుడుపేట

ఇది మండల కేంద్రం. వెంకటగిరి జమీందారు అయిన బంగారు యాచమనాయుడు ఈ ప్రాంతాన్ని వైశ్యులకు ఉదారంగా ఇచ్చాడు. దీంతో ఆ సామాజిక వర్గం వారు ఆయన పేరు కలిసొచ్చే విధంగా నాయుడుపేట అని పేరు పెట్టుకున్నారు.

చెవిరెడ్డిపల్లి

ఇది వెంకటగిరి మండలంలో ఉంది. వెంకటగిరి జమీందార్లకు మూలపురుషుడు చెవిరెడ్డి. ఆయన పేరుతోనే ఈ పల్లె ఏర్పడింది.

తీర్థంపాడు

ఇది డక్కిలి మండలంలో ఉంది. ఋషులు స్నానం ఆచరించే పుష్కరిణి (తీర్థం) ఉండడం వల్ల ఈ ప్రాంతానికి తీర్థంపాడు అనే పేరు వచ్చింది.

డక్కిలి

ఇది మండల కేంద్రం. డక్కు ఉన్నవాళ్లు గ్రామం కాబట్టి ఆ పేరు వచ్చింది. డక్కు వాళ్లు అంటే పెద్ద ధంకాలు మోగించి జీవనం గడిపేవారు.

అలిమిలి

ఇది బాలయ్యపల్లె మండలంలో ఉంది. అల్లి అన్నది తామర జాతులలో ఒకటి. మిలమిలలాడే అల్లిపూలు ఎక్కువగా అభించే గ్రామం కావడంతో ఈ గ్రామానికి అలిమిలి అనే పేరు వచ్చినట్టు చెబుతారు.

తుమ్మూరు

ఇది నాయుడపేట మండలంలో ఉంది. విపరీతమైన తుమ్మచెట్లు ఈ ప్రాంతంలో ఉండటంతో స్థానికులు తమ పల్లెకు తుమ్మూరు(తుమ్మ-ఊరు) అని పేరు పెట్టుకున్నారు. కాగా తుంబురుడు పేరుమీదుగా ఈ గ్రామం ఏర్పాటైనట్టు మరో కథనం ప్రచారంలో ఉంది.

శ్రీహరికోట

ఇది సూళ్ళూరు పేటకు కూత వేటు దూరంలో ఉంది. నెల్లూరు జిల్లాలో ఒక తీర ప్రాంతపు ద్వీపం. మన రాష్ట్రంలో కోరమండల్ తీరంలో ఉంది. ఇక్కడ నుండి ఎన్నో రాకెట్ ప్రయోగాలు జరిగాయి. ఇక్కడ సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం ఉంది. దీన్ని ఇస్రో వారు నిర్వహిస్తున్నారు. శ్రీరాముడు ఈ దీవిలో అరకోటి లింగాలను ప్రతిష్ఠించాడు. ఇక్కడ రాక్షస ప్రభావాన్ని తొలగించాడు. అందుచేత ఈ ప్రాంతానికి శ్రీఅరకోటై అనే పేరు వచ్చింది. కాలగమనంలో శ్రీహరికోటగా మారింది.

అయ్యవారిపాలెం

ఈ గ్రామం గూడూరు మండలంలో ఉంది. కులసూచి ప్రకారం అయ్యవార్లు అనే బ్రాహ్మణులకు ఈ గ్రామాన్ని వెంకటగిరి రాజావారు అగ్రహారంగా ఇచ్చారు. దీంతో ఆ పల్లెకు అయ్యవారిపాలెం అనే పేరు వచ్చింది.

మళ్లాం

ఇది చిట్టమూరు మండలంలో ఉంది. పూర్వం మళ్లాసురుడు ఉండేవాడు. ఆ రాక్షసుడి పేరు మీద మళ్లాం అని పేరు వచ్చిందని ఐతిహ్యం వల్ల తెలుస్తోంది. ఇక్కడ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయం చాలా ప్రశస్త మైనది.

బ్రాహ్మణక్రాక

ఇది జలదంకి మండలంలో ఉంది. కాకతీయుల ఆరాధ్య దైవం కాకతి. అందువల్ల ఈ గ్రామానికి తొలుత క్రాకపురి అని పిలిచేవారు. ఈ ప్రాంతంలో కాకమ్మ గుడి, కాకమ్మ చెరువు, కాకమ్మగుంట ఉన్నాయి. ఆ తరువాత హరిహర బుక్కరాయులు, 15 వేల ఎకరాల భూమిని 64 గోత్రాలకు చెందిన బ్రాహ్మణులకు దానం ఇచ్చారు. అందువల్ల ఈ గ్రామానికి బ్రాహ్మణక్రాక అని పేరు వచ్చింది. క్రాక అంటె కాకిదొండ చెట్టు అని అర్థం. ఈ పల్లెలోని బ్రాహ్మణులు కాకిదొండ చెట్లు సంరక్షణపై ఎంతో ఆసక్తి చూపేవారు.

మహిమలూరు

ఇది ఆత్మకూరు మండలం. మహిమళ్లు అనే కాపు ఈ గ్రామాన్ని నిర్మించారు. మొదట్లో మహిమళ్లు అనే పేరుతో ఈ గ్రామాన్ని పిలిచేవారు. ప్రజలకు ఈ శబ్దం స్వచ్ఛంగా ఉచ్చరించడం రాక చివరకు మహిమలూరుగా స్థిరపడింది.

సూళ్ళూరుపేట

ఇది మండల కేంద్రం. నెల్లూరుకు 98కి.మీ దూరంలో ఉంది. ఇక్కడ గల చంగాలమ్మ పరమేశ్వరి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. తొలుత ఈమె టెంకాళిమాతగా అవతరించింది. చంగాలమ్మగా ప్రాచుర్యం పొందింది. సూళ్లూరుపేట గ్రామానికి ఈ పేరు రావడానికి చంగాలమ్మ వారి ఆలయం పాత్ర ఉంది. అది ఎలా అంటే ఇక్కడ చంగాలమ్మ ఉత్సవాలు జరిగినప్పుడు ఒక పెద్దకర్రకు ఓ మేకును కొట్టి మూడుసార్లు గాలిలో కర్రను గిరగిర తిప్పుతారు. ఇలా తిప్పడాన్ని సుళ్లు ఉత్సవం అంటారు. ఆ విధంగా ఈ ఊరికి సూళ్లూరుపేట

అనే పేరు వచ్చింది. చంగాలమ్మ జాతర ప్రతిఏటా అత్యంత వైభవంగా జరుగుతుంది. పెళ్లికాని వారికి వివాహం, సంతానం లేనివారికి సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం. ఈ ఆలయంలో ఉగాది రోజున లక్షకుంకుమార్చన, మహలక్ష్మీ యాగాలు, ఆషాఢమాసంలో లలితమహోత్సవం, లలితహోమాలు అష్టదుర్గ హోమాలు, దీపావళి అమావాస్య ఘడియల్లో ధనలక్ష్మీ శతనామ కుంకుమార్చనలు జరుగుతాయి.

వెంకటగిరి

ఇది మండల కేంద్రం. దీని తొలిపేరు కలిమిడి. చేనేత, పట్టు చీరలకు ప్రసిద్ధి చెందిన పట్టణం. ఇక్కడ వెలిసిన శ్రీకాశీవిశ్వనాథ ఆలయం ఎంతో ప్రాచుర్యం పొందింది. చారిత్రాత్మకమైంది. పూర్వం వెంకటగిరి వెలమరాజుల కాలంలో రాజధానిగా విరాజిల్లింది. శ్రీ వేంకటేశ్వరస్వామిపై ఉన్న భక్తిభావంతో వెలుగోటి వెంకటాద్రినాయుడు ఈ గ్రామానికి ఉన్న కిలిమిడి అనే పేరును రద్దుచేసి వెంకటగిరిగా మార్చారు. ఇక్కడ కాశీవిశ్వనాథ ఆలయ ప్రాంగణంలో పంచభూత స్థలమనే పవిత్ర ప్రదేశం ఉంది. ఈ ప్రదేశంలో శ్రీకాళహస్తీశ్వ రుడు, కుమార సుందరేశ్వరుడు, ఏకాంబరేశ్వరుడు, రామమల్లేశ్వరుడు తదితర దేవతలు కొలువై ఉన్నారు. ఇక్కడ గల కొండ ప్రాముఖ్యం చెందింది. పాపాలు నశింపజేసే గిరి కావడంతో వెంకటగిరిగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడగల హేండ్‌లూమ్ టెక్నాలజి శిక్షణ కేంద్రం ఎంతో ప్రసిద్ధి చెందింది.

కృష్ణపట్నం

నెల్లూరుకు 25 కి.మీ దూరంలో ఉంది. ఈ ప్రాంతంలో శ్రీవేణుగోపాలస్వామి ఆలయం ఎంతో ముఖ్యమైనది. ఈ ఆలయాన్ని విజయనగర రాజుల కాలంలో నిర్మించారు. ఈ ప్రసిద్ధి చెందిన వేణుగోపాలస్వామి ఆలయం గోడలపై రామాయణం, భాగవత కథలను అతి మనోహరంగా శిల్పాల రూపంలో మలిచారు. వేణుగోపాల దేవాలయం దృష్టిలో ఉంచుకొని కృష్ణపట్నం అనే పేరు వచ్చింది. ఈ ప్రాంతం సముద్రతీరంలో వెలసినందున చివరన పట్నం అని చేరింది. ఇది నౌకాకేంద్రంగా అభివృద్ధి చెందుతోంది.

వేదగిరి

ఇది బుచ్చిరెడ్డిపాలెం మండలంలో ఉంది. నెల్లూరు పట్టణానికి వాయువ్య దిశలో 15 కి.మీ దూరంలో వేదగిరి నెలకొని ఉంది. ఈ గ్రామంలో నరసింహకొండ అని పిలిచే కొండపై వెలసిన దివ్యక్షేత్రం శ్రీవేదగిరి లక్ష్మీనరసింహవారి ఆలయం. ఈ క్షేత్రం చాలా పురాతనమైనది. ఇక్కడ ఉన్న చిన్నకొండపై దేవాలయం ఉండటం వల్ల ఈ కొండను నరసింహకొండ అని పిలుస్తారు. ఈ కారణంగానే ఈ కొండ దిగువ భాగాన ఉన్నఊరికి నరసింహకొండ అనే పేరు వచ్చింది. ఆ రోజుల్లో ఈ స్వామి చెంత వేదపఠనం జరుగుతుండేది. అందువల్లనే దీనికి వేదగిరి (వేదాద్రి) అనే పేరు వచ్చింది.

పెంచలకోన

ఇది రావూరు మండలంలో ఉంది. రావూరుకు 30 కి.మీ దూరంలో ఉంది. ఇక్కడ గల పెంచలకోన క్షేత్రం ఎంతో ప్రసిద్ధి చెందింది. పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉంది. ఇక్కడ స్వామివారు విశ్వకళ్యాణం కోసం పెంచలకోన క్షేత్రంలో పెనుశిలా రూపంలో స్వయంభువుగా వెలిసినట్టు ఐతిహ్యం వల్ల తెలుస్తోంది. ఈ కొండ శిఖరాల నుంచి జాలువారే జలధదార స్వచ్ఛంగా ప్రవహించి దిగువున కండలేరు జలాశయంలో కలుస్తుంది. ఇక్కడ నరసింహస్వామి కొండ ప్రాంతానికి చెందిన చెంచు వనిత లక్ష్మీదేవిని పెనవేసుకొని అవతరించినందున ఈ ప్రాంతానికి పెనుశిల క్షేత్రమని పేరు వచ్చింది. పెనుశిల పెంచలకోనగా రూపాంతరం చెందినట్టు స్పష్టం అవుతుంది. చివరకు అదే స్థిరపడింది.

జొన్నవాడ

ఇది బుచ్చిరెడ్డిపాలెం మండలంలో ఉంది. నెల్లూరుకు 12 కి.మీ దూరంలో పెన్నానది తీరంలో వెలసింది. ఇక్కడ మల్లిఖార్జునకామాక్షి దేవస్థానం ఉంది. కామాక్షి అమ్మవారిని శక్తిపీఠంగా కొలుస్తారు. క్రీ.శ 1150లోఈ ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయంలో తిక్కన యజ్ఞంచేసి సోమయాజి అయ్యాడు. తొలుత ఈ గ్రామాన్ని రత్నగిరి అని పిలిచేవారు. అయితే కశ్యప మహర్షి జన్నం అనే యజ్ఞం చేశాడు. అందుచేత దీని పేరు జన్నవాడగా పిలిచేవారు. అయితే కాలక్రమంలో జన్నవాడయే జొన్నవాడగా మారింది.

మన్నారు పోలూరు

ఈ గ్రామం సూళ్ళూరు పేట మండలంలో ఉంది. ఈ పల్లెలో అళఘూమన్నారు కృష్ణస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయంలో జాంబవతి, సత్యభామ సమేత శ్రీకృష్ణుడు కొలువై ఉన్నాడు. ఆలయం ఎంతో అందంగా ఉండటం వల్ల దేవాలయంలో ప్రతిష్ఠించిన స్వామిని అళఘూమన్నారు (తమిళంలో అళఘూ అంటే అందం అని అర్థం) అంటారు. ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీరామాలయం కూడా ఉన్నది. ఒకే ప్రాంగణం లో శ్రీకృష్ణ, శ్రీరామ ఆలయాలు ఉండి వాటికి విడివిడిగా ధ్వజస్థంభాలు ఉండటం విశేషం. ఈ ఆళఘుమన్నారు స్వామికి ఎదురుగా ఉన్న గరుత్మంతుని విగ్రహం కన్నుల నుండి నీరు బట్లు, బొట్లుగా పడుతుంటాయి. శ్రీకృష్ణ జాంబవంతుల మధ్య మల్లయుద్ధం ఇక్కడే జరిగింది. మహా విష్ణువు మల్ల యుద్ధం చేసిన ఊరు కావడంతో ఈ ప్రాంతానికి మల్లహరిపోరు ఊరు అని పేరు వచ్చింది. కాలగమనంలో మన్నారుపోలూరుగా మారింది. ఆ పేరే చివరకు స్థిరడింది. 18వ శతాబ్దం కాలంలో వెంకటగిరి రాజా ఈ ఆలయానికి మాన్యం క్రింద ఐదు గ్రామాలు ఇచ్చినట్లు శాసనాల ద్వారా వెల్లడవుతుంది.

తడ

ఇది మండలం కేంద్రం. తమిళంలో తడై అనే పదం నుంచి తడ వచ్చింది. దీనికి అడ్డగించు, గట్టు, కట్ట అని అర్థాలు ఉన్నాయి. గ్రామనామపరంగా సరిహద్దు గ్రామము అని గ్రహించవచ్చు. ఏదైన జలాశయం గట్టు అని పేర్కొనవచ్చు. తీరప్రాంతంలో ఇది చివరది.

మసీదు అగ్రహారం

ఇది అనంతసాగరం మండలంలో ఉంది. మసీదు= మసజిను (ముస్లింల ప్రార్థనా మందిరం) బ్రాహ్మణుల నివాసానికి పరిమితమైన అగ్రహారం పై ఉర్దూ ఉపసర్గ. అందులోను మసీదు చేరడం విశేషం.

గొలగమూడి

ఇది వెంకటాచలం మండలంలో ఉంది. ఈ ప్రాంతంలో యాదవులు ఎక్కువగా ఉండేవారు. గొలగమూడియ్య అనే ఆయన, కాటంరాజు యుద్ధంలో మరణించిన తర్వాత అతనికి ఈ ప్రాంతంలో అంత్యక్రియలు చేస్తున్నారు. కనపర్తి అనే ఊరిలోని ప్రజలు అక్కడికి వచ్చి మృతుడు తమ గ్రామం వాడని ఇరు వర్గాల ప్రజలు తగాదాపడ్డారు. అతని పార్థివదేహం నుండి తలను తమ గ్రామానికి తీసుకొని పోయారు అందవల్లనే ఈ ప్రాంతంలోని గ్రామానికి గొలగమూడి అనే పేరు వచ్చింది. గ్రామంలో ఉన్న ఆలయంలో గొలగమూడివారి అర్థదేహం (తల లేకుండా) ఉన్న విగ్రహం కనిపిస్తుంది. స్వామివారి ప్రియశిష్యులు అన్న సమారాధనలు నిర్వహిస్తుంటారు. 20వ శతాబ్దం మధ్యకాలంలో ఆధ్యాత్మిక బోధనలు చేసిన వెంకయ్యస్వామి ఇక్కడే మహాసమాధి అయ్యారు. ఆయన పేరుతో ఓ ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు.

సైదాపురం

ఇది మండల కేంద్రం. ఆ రోజుల్లో సైదాపురం జమీందారీ ముఖ్య పట్టణం. కాకతీయ సామ్రాజ్యం పతనం తర్వాత వెలమ సామాజిక వర్గం వారు వెంకటగిరి సంస్థానంలో ఉన్న ప్రాంతాలకు వలస వచ్చారు. అయితే నల్గొండ ప్రాంతంలోని సైదాపురం నుంచి వీరు ఇక్కడకు వచ్చి ఈ ప్రాంతానికి సైదాపురం అని పేరు పెట్టుకున్నారు. 1840 సంవత్సరం నాటికి సైదాపురం జమీందారు అప్పులపాలై ఆస్తులను వేలం వేసుకొనే స్థితికి చేరుకొన్నాడు. కాలక్రమేణా ఈ పట్టణ వైభవం క్షీణించి ప్రస్తుతం వెలవెలపోతోంది.

చెన్నూరు

ఇది గూడూరు మండలంలో ఉంది. స్థానికంగా ఉన్న చెన్నకేశ్వరస్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. చెన్నకేశ్వరస్వామి పేరును బట్టి దీనికి చెన్నూరు అనే పేరు వచ్చింది.

పుట్టమరాజుకండ్రిగ

ఇది ప్రభగిరిపట్టణం మండలంలో ఉంది. ఇందులో పుట్టమరాజు అనేది వ్యక్తి నామధేయం. కండ్రిగ అంటే భూమిలో కొంత భాగం లేదా ఖండిక అని

గ్రహించవచ్చు. ఈ గ్రామాన్ని క్రికెట్ దిగ్గజం మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ 2014 దత్తత తీసుకొని అభివృద్ధి చేశారు.

పెనుబల్లి

ఇది బుచ్చిరెడ్డిపాలెం మండలంలో ఉంది. ఐతిహ్యం ప్రకారం పూర్వం కశ్యప ప్రజాపతి ఒక యజ్ఞాన్ని జొన్నవాడలో నిర్వహించాడు. ఆ తరువాత ఈ ప్రాంతంలో పెద్ద బలి ఇచ్చాడు. దీంతో ఈ గ్రామానికి పెనుబలి అనే పేరు వచ్చింది. క్రమంగా జన వ్యవహారంలో పెనుబల్లిగా స్థిరపడింది.

శిద్దనకొండూరు

ఇది కనిగిరి మండలంలో ఉంది. ఇక్కడికి సమీపంలోని కొండపై సిద్ధేశ్వరస్వామి ఆలయం ఉంది. సిద్ధేశ్వరుని పేరుతో శిద్దనకొండూరు ఏర్పడింది.

కోటితీర్థం

ఇక్కడ గల కోటీశ్వరస్వామి ఆలయం చెంతనే గల పుణ్యోదకం ఎంతో ప్రశస్తికెక్కింది. ఈ ఆలయ ప్రాముఖ్యత దృష్ట్యా కోటితీర్థం గ్రామం ఏర్పడినట్టు స్పష్టమౌతోంది.

అలివేలుమంగాపురం

ఇది ఉదయగిరి మండలంలో ఉంది. తిరుపతిలో కూడా ఇదే పేరుతో ఓ గ్రామం ఉన్న సంగతి తెలిసిందే. ఉదయగిరి కొండపై శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, అక్కడినుండి 15కి.మి అలివేలు మంగాపురం ఉంది. అమ్మవారి పేరుతోనే అలివేలుమంగాపురం వెలిసింది.

గౌరవరం

ఇది కావలి మండలంలో ఉంది. గౌరీదేవి వెలసి ఉన్న గ్రామం కావడంతో దీనికి గౌరీపురం అని పిలిచేవారు. కాలక్రమంలో గౌరవరం అయిందని చెబుతారు. కానీ గవరలు (వైశ్యులు) పేరుతో గవరవరం అని పేరు వచ్చిందని ప్రచారంలో ఉంది. కాగా బిట్రగుంటలో ఉన్న ప్రాచీన శ్రీ వేంకటేశ్వరాలయాన్ని అభివృద్ధి చేసిన లాంగుల్ల గజపతి కుమార్తె గౌరమాంబ పేరున కూడా ఈ గ్రామం వెలిసినట్టు మరో కథనం ప్రచారంలో ఉంది.

సోమశిల

ఇది అనంతసాగరం మండలంలో ఉంది. జిల్లాలో ఎంతో ప్రాముఖ్యత పొందిన ప్రాంతం ఇది. ఇక్కడ గల సోమేశ్వరస్వామి ఆలయం నిత్యం భక్తుల కోలాహలంతో నిండి ఉంటుంది. ఆలయం పేరుతోనే ఈ గ్రామానికి సోమశిల అనే పేరు వచ్చినట్టు ఐతిహ్యం వల్ల తెలుస్తోంది.

మునులపూడి

ఇది బుచ్చిరెడ్డిపాలెం మండలంలో ఉంది. ఇక్కడ తపస్సు చేసినందున దీనికి మునులపూడి అనే పేరు వచ్చినట్టు స్థలపురాణం వల్ల తెలుస్తోంది.

ములుపూడి

ఇది వెంకటగిరి మండలంలో ఉంది. తొలుత దీన్ని మునిపురం అని పిలిచేవారు. ఇక్కడ తొలిసారిగా నివాసం ఏర్పాటు చేసుకున్న ఓ ముని పేరుతో ఈ గ్రామం అవతరించింది. జనవ్యవహారంలో ములుమూడిగా రూపాంతరం చెందింది. అశ్వత్థామ కొంత కాలం ఇక్కడ నివశించినట్టు స్థలపురాణం వల్ల తెలుస్తోంది.

బుధపాడు

ఇది ఆత్మకూరు మండలంలో ఉంది. మహిమలూరుకు దక్షిణ దిశలో ఈ గ్రామం నెలకొని ఉంది. ఒకప్పుడు ఈ ప్రాంతంలో బౌద్ధమత ప్రచారం హెచ్చుగా ఉండేది. అంచేత దీనికి బుధపాడు అనే పేరు వచ్చినట్టు స్పష్టమౌతోంది. బుధనాం, బుధవాడ, బొజ్జనపల్లి వంటి గ్రామాలకు బౌద్ధమత ప్రచారం కారణంగానే ఆ పేరు వచ్చినట్టు చెబుతారు.

ఘటిక సిద్ధేశ్వరం

ఇది సీతారాంపురం మండలంలో ఉంది. ఈ గ్రామంలో ఇష్టకామేశ్వరీ సిద్దేశ్వరాలయం ఉంది. ఇది ప్రాచీన ఆలయం. ఆలయం కొన్నాళ్ళకు జీర్ణావస్థలోకి చేరడంతో అవధూత కాశీనాయన పునరుద్ధరించారు. దీనికి ఘటిక అనే పేరు పూర్వ పదంగా ఎందుకు వచ్చిందంటే.... ఘటిక అంటే ఫలితం కలిగించేదని అర్థం. ఇలా సిద్దేశ్వరుని పేరుతో ఘటిక సిద్ధేశ్వరంగా గ్రామీణులు నామకరణం చేశారు.

చిత్తూరు జిల్లా

చిత్తూరు

ఇది జిల్లా కేంద్రం. తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న పట్టణం. చిత్తూరు తొలిపేరు చిత్తిఊరు. చిత్తి అంటే జ్ఞాన లేదా స్వయంప్రకాశమైన చైతన్యము అని అర్థం. అప్పట్లో పెద్దలు బాగా ఆలోచించి చిత్తి ఊరు అని పేరు పెట్టారు. అయితే క్రమేపి జనవ్యవహారంలో చిత్తూరుగా మారిందని చెబుతారు. కాగా చిరు+ఊరు, చిట్టి+ఊరు (చిట్టి అంటే చిన్న) అయితే క్రమేపి జన వ్యవహారంలో చిత్తూరుగా మారిందని తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఆచార్యులు డా॥ పేట శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. ఇది ధాన్యం, చెరకు, మామిడి, వేరుశనగ వ్యాపార కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. నూనెగింజలు, బియ్యం మిల్లింగు పరిశ్రమలు ఉన్నాయి.

కార్వేటి నగరం

కార్వేటి నగరం ఓ మండల కేంద్రం. ఈ జిల్లాలో వెలసిన ఒకప్పటి గొప్ప సంస్థానం. ఈ ఊరు తమిళనాడు రాష్ట్ర సరిహద్దుల్లో ఉంది. అంచేత తెలుగు, తమిళ మిశ్ర భాషా సంస్కృతులు కనిపిస్తాయి. తమిళంలో కాడి అంటే అడవి. వెట్టి అంటే నరకడం అని అర్థం. నగరి అంటే రాజులు నివాసం ఉండే ప్రాంగణం. అడవిని నరకి నిర్మించిన రాజప్రసాదం అనే అర్థంలో దీనికి కాడి వెట్టినగరి అనే పేరు వచ్చింది. కాలప్రవాహం లో కార్వేటినగరంగా స్థిరపడింది. ఇక్కడ ఇప్పటికీ ఆనాటి సంస్థానపు ఆనవాళ్లు కనిపిస్తాయి.

వడమూలపేట

ఇది మండల కేంద్రం. మహారాజ బహదర్‌వారిపేట శివార్లలో ఆర్యవైశ్యులు తిరుమల బాటకు ఇరువైపులా ఇళ్లు కట్టుకొని నివాసం ఉండేవాళ్లు. జ్యోతిష శాస్త్రంలో దిట్ట, వేమాపురం శ్రోత్రియందారుగా హక్కుల పొంది పౌరోహిత్యం చేస్తున్న కాశిరాజు పురుషోత్తమయ్య అక్కడ గల వర్తకుల

సహకారంతో ఆంజనేయ దేవాలయం కట్టించారు. దేవాలయానికి కుంభాభిషేకం జరిపించారు. స్వామివారికి పూలమాలలతో పాటు, వడలమాలను అలంకరింపజేశారు. అప్పటి నుంచి ఈ ఊరు పేరు వడలమాలపేట అయింది. కాలక్రమంలో వడమూలపేటగా రూపాంతరం చెందింది.

పూతలపట్టు

పూతలపట్టు ఓ మండలకేంద్రం. చిత్తూరుతిరుపతి మార్గంలో చిత్తూరుకు 17 కి.మీ. దూరంలో ఉంది. శ్రీరామచంద్రుడు అరణ్యవాస సమయంలో ఇక్కడ విడిది చేశారు. అప్పుడు శ్రీరాముడు సీతమ్మవారి కోసం ఓ మొగలిపువ్వును కోశాడట. విషయం తెలియని సీతాదేవి ఏం చేస్తున్నారందట. బదులుగా శ్రీరాముడు పువ్వుతలపట్టు అన్నాడట. రాముడి నోటినుంచి వచ్చిన మాట క్రమేపి వ్యవహారంలో పూతలపట్టుగా స్థిరపడింది. భీముడు ద్రౌపది పరంగా కూడా ఇలానే చెబుతాడని మరో కథనం ప్రచారంలో ఉంది.

తిరుపతి

తిరు అనేది తమిళ పదం. శ్రేష్టమైన అని దీని అర్థం. పతి అంటే ప్రభువు లేదా కాపాడేవాడు అని పేర్కొనవచ్చు. ఇలా తిరుపతికి పేరు వచ్చింది. ఇక్కడ శ్రీవేంకటేశ్వరస్వామి సోదరుడైన గోవిందరాజస్వామి ఆలయం ఉంది. దీనిని రామానుజాచార్యులు నిర్మించారు. స్వామి వారికి వరహపుష్కరిణి ఉన్నది. ఇది ప్రసిద్ధ పుణ్యక్షేత్రం. దీన్ని దిగువ తిరుపతి అని కూడా అంటారు.

తిరుమల

దీన్ని ఎగువ తిరుపతి అని అంటారు. ఏడు కొండల స్వామి వెలసిన అతి పెద్ద పుణ్యక్షేత్రం ఇది. ప్రపంచంలో అత్యధికంగా భక్తులు దర్శించే దివ్యక్షేత్రం. తిరు అంటే శ్రీ, శ్రేష్టమైన లేదా గొప్పదైన అని అర్థం. మల (మలై) అంటే కొండ అని అర్థం. ఇలా తిరుమలకు ఆ పేరు వచ్చింది. బ్రహ్మ వెలిగించిన రెండు అఖండ దీపాలు కలియుగాంతం వరకూ వెలుగుతాయని చెబుతారు. ఇక్కడ వెలిసిన గోగర్భం, ఆకాశగంగ, పాపనాశనం,సరస్వతీ తీర్థం. గాలవ తీర్థం, కపిల తీర్థం. తదితర తీర్థాలు ఎంతో ప్రసిద్ధి చెందినవి. పాండవ సనకసకనందన,

తుంబుర తీర్థాలు కూడా ఉన్నాయి. తిరుమల క్షేత్రం చారిత్రక ఆధారాలను బట్టి క్రీ.శ10వ శతాబ్ది నుంచి విశేషమైన ప్రశస్తి పొందింది. 16వ శతాబ్దిలో ఈ ప్రాంతాన్ని పరిపాలించిన శ్రీ కృష్ణదేవరాయలు ఈ క్షేత్రాన్ని బహుముఖాలుగా అభివృద్ధి చేశాడు.

తిరుచానూరు

దిగువ తిరుపతికి 4 కి.మీ దూరంలో ఉన్న తిరుచానూరు ప్రసిద్ధ క్షేత్రం. తిరుమలను సందర్శించే భక్తులు ఈ క్షేత్రాన్ని తప్పక సందర్శిస్తారు. శుకమహర్షి స్వర్ణముఖీనదీ తీరాన తపస్సు చేస్తుండగా ప్రజలు మెల్లమెల్లగా ఇక్కడ నివాసాలేర్పరచుకున్నారు. ఈ స్థావరానికి శ్రీశుకనూరు అని పేరు పెట్టారు. దీన్ని తమిళం లో తిరుచ్చుగనూరు అని అంటారు. ఆ తరువాత తిరుచానూరు అయినట్టు ఆచార్య డా॥ పేట శ్రీనివాసులరెడ్డి ఓ వ్యాసంలో పేర్కొన్నారు. ఈ తిరుచానూరే కాలక్రమంలో అలమేలు మంగాపురంగా పరిణమించింది.

వేపంజేరి

ఇది గంగాధరనెల్లూరు మండలంలో, తిరుపతి నుంచి 65 కి.మీ దూరంలో ఉంది. ఈ గ్రామంలో శ్రీ లక్ష్మీ నారాయణస్వామి కొలువై ఉన్నాడు. వేం అనగా పాపం. పంచ అనగా ఐదు, హరి అనగా పోగొట్టేది. అంటే పంచభూతాల సమ్మేళితమైన మానవుడు తెలిసీతెలియక చేసే తప్పులను హరించే నారాయణుడు కాబట్టి ఈ ప్రదేశం వేపంచహరిగా దీనికి పేరు పెట్టారు. తదుపరి కాలంలో వేపంజేరిగా స్థిరపడింది.

అరగొండ

ఇది గొల్లపల్లె మండలంలో ఉంది. కాణిపాకానికి 10 కి.మీ దూరంలో ఉంది. త్రేతాయుగంలో రామ, రావణుల మధ్య యుద్ధం జరుగుతోంది. రావణుడి కొడుకైన ఇంద్రజిత్తు చేతిలో లక్ష్మణుడు మూర్ఛపోతాడు. లక్ష్మణున్ని మేల్కొలిపేందుకు సంజీవనిమూలిక అవసరమైంది. దీంతో ఆంజనేయుడు జైశ్రీరాం అంటూ వాయువేగంతో ఆకాశమార్గాన ప్రయాణిస్తాడు. సంజీవని పర్వతం ఉన్న చోటుకి చేరుకుంటాడు. ఆ పర్వతం పై సంజీవని ఎక్కడ ఉందో తెలియక పర్వతాన్ని

ఏకంగా పెకలిస్తాడు. తన అరచేతులపై తీసుకొని వస్తుండగా అర్ధకొండ (సగం కొండ) విరిగి నేలమీద పడింది. ఆ కొండ పడిన ప్రాంతమే అర్ధగిరి. ఆ ప్రాంతంలో ఓ గ్రామం వెలిసింది. ఈ గ్రామమే అరకొండగా కాలక్రమేణా అరగొండగా రూపాంతరం చెందింది. అరగొండలో వెలసిన అర్ధగిరి వీరాంజనేయ స్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఇక్కడ గల సంజీవరాయ పుష్కరిణి జీవనదిలా ఉంటుంది. ఈ పుష్కరిణి ఇంకిపోదు, ఎండిపోదు. ఔషధసంబంధ యుక్తమైనది.

తరిగొండ

ఇది గుట్టపుకొండ మండలంలో ఉంది. ఇక్కడ గల లక్ష్మీ నరసింహాలయం ఎంతో ప్రాచీనమైంది. దుర్వాసుడు దీన్ని ప్రతిష్టించినట్టు స్థలపురాణం వల్ల తెలుస్తుంది. ఒకప్పుడు ఈ ప్రాంతమంతా పెద్ద అడవిగా ఉండేది. ఒకసారి ఈ అరణ్యానికి ఎనెలదొర పశువుల మందతో సహా సతీసమేతంగా వచ్చి ఇక్కడ కొంత కాలం గడిపారు. ఒకరోజున దొరవారి భార్య చల్ల చిలుకుతున్న సమయంలో తరికుండలో ఒక రాయి కనిపించింది. మర్నాడు కూడా అలాగే తరికుండలో రాయి కనిపించింది. ఈ విషయాన్ని భర్తకు చెప్పింది. ఆయన ఎంతో ఆశ్చర్యపోయాడు. ఆ రోజు రాత్రి వారికి స్వప్నంలో లక్ష్మీ నరసింహస్వామి కనిపించి రాజా.. నేను లక్ష్మీనరసింహుడను. నీ ధర్మపత్నికి తరికుండలో కనిపించిన వాడను నేనే. ఈ అడవిలో నాకు ఒక ఆలయం నిర్మించు. దీని వల్ల మేలు కలుగుతుంది అని చెప్పి అదృశ్యమయ్యాడు. ఈ మేరకు ఆ దంపతులు అక్షీ్మనరసింహుని అనుగ్రహంతో ఆలయాన్ని నిర్మించాడు. ఈ ఆలయం క్రమంగా ఎనలేని ప్రఖ్యాతిని పొందింది. ఈ ప్రాంతంలో వెలసిన గ్రామానికి తరికుండ అని నామకరణం చేశారు. జనవ్యవహారంలో తరిగొండ అయింది. ప్రఖ్యాత రచయిత్రి తరిగొండ వెంగమాంబ ఈ గ్రామంలోనే జన్మించడం విశేషం.

మక్బరా

ఇది గుర్రంకొండ మండల కేంద్రానికి 3కి.మీ దూరంలో ఉంది. మకర్బా అంటే ఉర్దూ భాషలో సమాధి అని అర్థం. టిప్పు సుల్తాను మేనమామ, గుర్రంకొండ నవాబు అయిన మీర్‌రజా అలీఖాన్ సమాధి ఉంది. ఈ సమాధి వల్లనే ఈ గ్రామానికి మక్బరా (సమాధి) అనే పేరు వచ్చింది.

కాణిపాకం

ఇది ఐరాల మండలంలో ఉంది. చిత్తూరుకు 12 కి.మీ.దూరంలో ఉంది. శాసనాధారాల ప్రకారం కాణిపాకం వరసిద్ధివినాయక ఆలయాన్ని క్రీ.శ 11వ శతాబ్దం మొదటి కులోత్తుంగ చోళుడు కట్టించాడు. కాణి అంటే పావు ఎకరా మడిభూమి అని అర్థం. పారకం అంటే నీళ్లు పొలంలోకి పారటం అని అర్థం. చరిత్ర ప్రకారం ఒకప్పుడు ముగ్గురు అన్నదమ్ములు ఉండేవారు. వారు ముగ్గురు అవిటితనంతో బాధపడేవారు. వారిలో ఒకరు గుడ్డి, మూగ, చెవుడు. పొలంలో సాగు చేసుకుంటూ కాలం గడిపేవారు. పూర్వకాలంలో బావి నుండి ఏతాలతో నీటిని తోడేవారు. ఒకరు కింద ఉంటే ఇద్దరు ఏతంపైన ఉండి నీళ్లు తోడేవాళ్లు అ లా ఉండగా నూతిలో నీరు ఎండిపోయింది. ముగ్గురులో ఒకరు నూతిలోకి దిగి నీళ్లు తోడటం మొదలుపెట్టారు. కొంత సేపటికి గడ్డపారకు రాయి తగలడంతో ఆపి కింద జాగ్రత్తగా చూసాడు. గడ్డపార ఒక నల్లని రాతికి తగిలి ఆ రాతి నుంచి రక్తం రావటం చూసి ఆశ్చర్యపోయాడు. కొద్ది క్షణాల్లో బావిలో నీరంతా రక్తం రంగులో మారిపోయింది. ఆ మహిమతో ముగ్గురి అవిటితనం పోయి వారు పరిపూర్ణ ఆరోగ్యవంతులయ్యారు. ఈ విషయం విన్న చుట్టు పక్కల గ్రామస్థులు తండోపతండాలుగా నూతి వద్దకు చేరుకున్నారు. ఇంకా లోతు తవ్వటానికి ప్రత్నించారు. వారి ప్రయత్నం ఫలించకుండానే వినాయకుని (స్వయంభువు) విగ్రహం ఊరే నీటి నుండి ఆవిర్భవించింది. ఈ మహిమ చూసిన ప్రజలు ఆయన స్వయంభువు అని గ్రహించికొబ్బరి నీళ్లతో అభిషేకం చేశారు. ఆ నీళ్లు ఎకరం పావుదూరం చిన్న కాలువలా ప్రవహించింది. కాణిపారకం అనే తమిళ పదంతో పిలిచేవారు. కాలక్రమేణా కాణిపాకంగా పిలువసాగారు. ఎవరైనా చెడు పని చేసినా లేదా ఇద్దరి వ్యక్తుల మధ్య ఏదైనా వివాదం వచ్చినా, వారితో ఈ స్వామి ఎదుట ప్రమాణం చేయిస్తారు.

గంగాపురం

ఈ పల్లె చౌడేపల్లి మండలంలో ఉంది. భక్తుల పాలిట కొంగుబంగారంగా ఉన్న బోయకొండ గంగమ్మ ఆలయం సమీప గ్రామం కావడంతో ఆ ప్రాంతానికి గంగాపురం అనే పేరు వచ్చింది. గంగమ్మను దర్శించాలంటే కొండకింద ఉన్న

గంగాపురం రావలసిందే. నవాబుల దాడికి భయపడి బోయలు కొండెక్కి అమ్మవారిని శరణు వేడారని, భక్తుల మొర ఆలకించి నవాబుల తలను నరికారని, ఆ సముదాయంలో ఓ బండరాయి రెండుగా చీలిందని స్థలపురాణం. గంగాపురంలో బోయ గంగమ్మ ఆలయ కార్యాలయం, బస్టాండు ఉన్నాయి. ఈ అమ్మవారిని దర్శించేందుకు వేలాది మంది భక్తులు వస్తుంటారు.

చంద్రగిరి

ఇది మండల, రెవెన్యూ డివిజన్ కేంద్రం. చంద్రగిరిలో క్రీ.శ. 1640లో ఓ కోటను నిర్మించారు. శ్రీకృష్ణదేవ రాయ ఆస్థానంలో ఉన్న మహామంత్రి తిమ్మరుసు జన్మస్థలం ఇది. అర్ధచంద్రాకారంగా ఉన్న కొండ కింద భాగంలో ఈ కోటను నిర్మించారు. ఈ కోట పేరుతోనే చంద్రగిరి పట్టణం ఏర్పడింది. విజయనగరం రాజుల చరిత్రలో చంద్రగిరి ప్రముఖస్థానం పొందింది. శ్రీకృష్ణదేవరాయులు తిరుమలను సందర్శించేటప్పుడు ఇక్కడే విడిది చేసేవారు. ఇక్కడ రాజ్‌మహల్ మూడు అంతస్తులు, రాణిమహాల్ రెండు అంతస్తులుగా నిర్మించారు. ఈ రెండు సందర్శించదగ్గ సుందర ప్రదేశాలు.

మండపంపల్లె

ఇది చంద్రగిరి మండలంలో ఉంది. రాతి మండపం ఉండటం వల్ల చంద్రగిరి మండలంలో ఆ గ్రామానికి మండపంపల్లె అనే నేరు వచ్చింది. చంద్రగిరిలో రాయల కాలంలో కోట నిర్మించడంతో రాయలవారు చంద్రగిరి నుండి కార్వేటి నగరానికి ఈ పల్లె మీదుగా వేళ్లే వారు. దీంతో రాయలు కాలంలో అక్కడ సేద తీరేందుకు రాతి మండపాన్ని నిర్మించారు. క్రమేపి ఈ మండపంలో ఆ దారిన వచ్చే ప్రయాణికులు, తిరుమల శ్రీవారి దర్శనం కోసం కాలిబాటన వచ్చే భక్తులు విశ్రాంతి తీసుకొనేవారు. ఈ నేపథ్యంలో ఈ గ్రామానికి మండపం పల్లెగా నామకరణం చేశారు. అయితే ఈ మండపం నేడు శిథిలావస్థలో ఉంది.

సురుటుపల్లి

ఇది నాగులపురం మండలంలో, తిరుపతికి 77 కి.మీ దూరంలో ఉంది. ప్రతి చోటా లింగాకారంలో ఉండే శివుడు ఇక్కడ మాత్రం భారీ

విగ్రహరూపంలో పార్వతీదేవి ఒడిలో శయనించి ఉంటాడు. పాలసముద్రాన్ని చిలికే సమయంలో వెలువడిన హాలాహలాన్ని శివుడుకంఠంలో బంధించి కైలాసానికి వెళ్ళే సమయంలో కొద్దిగా విషం మత్తులో పార్వతి ఒడిలో సేద తీర్చుకున్నాడు. ఆ సమయంలో దేవతలు శంకరుని చూడటానికి రావటం వల్ల ఈ ప్రాంతానికి సురులపల్లి అనే పేరు వచ్చినట్టు ఐతిహ్యం వల్ల తెలుస్తోంది. కాలక్రమంలో ఆ పేరే సురుటుపల్లిగా స్థిరపడింది.

పీలేరు

ఇది మండల కేంద్రం. పిలి అంటే నెమలి అని అర్థం. ఆ ప్రాంతంలో గల ఏటి వద్ద నెమళ్లు హెచ్చు సంఖ్యలో ఉండేవట. అందుచే పిలి, ఏరు క్రమంగా పీలేరు అయిందని పేర్కొంటారు.

సదుం

ఇది మండల కేంద్రం. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఆచార్యులు డా॥పేట శ్రీనివాసులరెడ్డి (పేటశ్రీ) కథనం ప్రకారం సీతమ్మ అనే ఆమె తరచూ చెరువు కట్ట తెగిపోతున్నప్పుడు చెరువు కట్టలో ఆత్మబలి చేసుకుంది. అప్పుడు ఆమెపై మట్టిపోసి పూడ్చడం వల్ల "సీతం" అయి "సీదం"గా మారి సదుం అనే పేరు వచ్చింది. ఇది ఇతిహాసమేనని వివరించారు. కాగా మరో కథనం ప్రకారం సదుం అనే ఓ ఆంగ్లే యుడు ఈ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేశాడు. ప్రజల అభిమానాన్ని చూరగొన్నాడు. దీంతో స్థానికులు కృతజ్ఞతా పూర్వకంగా ఈ ప్రాంతాన్ని సదుం అనే పేరు పెట్టారు. వీటిలో పేటశ్రీ పేర్కొన్న అభిప్రాయమే సముచితంగా వుంది.

శ్రీకాళహస్తి

ఇది మండల, శాసనసభ నియోజకవర్గకేంద్రం. పూర్వం ఓ అటవీ ప్రాంతంలో ఒక శివలింగం ఉంది. ఓ ఏనుగు రోజూ సువర్ణముఖి నదిలో స్నానం చేసి కొంత నీరు పుక్కిలి పట్టి తెచ్చి ఆ నీటితో శివలింగానికి అభిషేకం చేసి పూలు, పత్రి తెచ్చి పూజ చేసేది. ఏనుగు వెళ్లిపోగానే ఒక పాము వచ్చి ఆ ఆకులు, పూలు పక్కకు జరిపి రత్నాలతో పూజించేది. అలాగే ఒక సాలెపురుగు

స్వామి చుట్టూ గూడు అల్లి సేవించేది. అయితే ఒకరి పూజ మరొకరికి నచ్చేది కాదు. చివరకు ముగ్గురు స్వామి అనుగ్రహంతో ముక్తి పొందారు. శ్రీ అంటే సాలె పురుగు, కాళం అంటే పాము, హస్తి అంటే ఏనుగు ఈ మూడు జీవుల పేరుతోనే శ్రీకాళహస్తికి ఆ పేరు వచ్చింది.

నారాయణవనం

ఇది మండల కేంద్రం. తిరుపతికి 40 కి.మీ దూరం, పూత్తురుకు 5 కి.మీ దూరంలో ఉంది. ఒకనాటి రాజధాని నగరం అయిన నారాయణవనం నేడు ఓ మెస్తారు గ్రామంగా ఉంది. ఈ గ్రామానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఎందుకంటే శ్రీలక్ష్మీనారాయణుల కళ్యాణం జరిగిన వేదిక ఇది. నారాయణవనాన్ని నారాయణవరం అని కూడా పిలుస్తారు. నారాయణుడు సంచరించిన పవిత్రవనం ఇది. అందుకే నారాయణవనం అని ఈ గ్రామాన్ని వ్యవహరిస్తున్నారు. గ్రామానికి వన్నె తెచ్చేలా పుణ్య అరుణా నది ఈ ప్రాంతాన్ని మరింత పవిత్రం చేస్తోంది. తొండమాన్ చక్రవర్తి స్వయంగా ఈ ప్రాంతంలో శ్రీవేంకటేశ్వరాలయాన్ని నిర్మించాడు.

తొండవాడ

ఇది చంద్రగిరి మండలంలో ఉంది. తొండమాన్ చక్రవర్తి ఈ గ్రామాన్ని నిర్మించినట్టు తెలుస్తోంది. ఆయన పేరుతోనే తొండవాడ గ్రామం అవతరించినట్టు ఐతిహ్యం వల్ల తెలుస్తోంది. ఇక్కడ అగస్త్యమహాముని పేరుతో అగస్త్యేశ్వరక్షేత్రం వెలిసింది. శ్రీ వేంకటేశ్వరుణ్ణి పతిగా పొందుటకు అగస్త్యమహాముని సూచన మేరకు పద్మావతీ దేవి ఇక్కడే వ్రతం ఆచరించింది.

ఏర్పేడు

ఇది మండల కేంద్రం. ఏర్ శబ్దానికి తమిళంలో 'నాగలి' అని అర్థం. ఈ గ్రామాన్ని తొలుత ఏర్పాటు చేసినవరంతా రైతులే. నాగలిపై ఉన్న మక్కువతో ఏర్ అని పేరు పెట్టారు. ఉత్తర పదమైన పేడు అంటే పేట అని గ్రహించాలి. ఏర్, పేడు ఏర్పేడు అయింది. ఇక్కడి విశేషమేమిటంటే 1926లో మళయాళ స్వామిగా పేరు పొందిన అసంగానందగిరిస్వామి ఓ గొప్ప ఆశ్రమాన్ని నిర్మించారు. అదియే వ్యాసాశ్రమంగా వాసికెక్కింది.

గుడిమల్లం

ఇది శ్రీకాళహస్తి మండలంలో ఉంది. రేణిగుంటకు 11కి.మీ దూరంలో ఉంది. ఇక్కడ గల ఆలయంలోని శివలింగం ఆకారం ఎక్కడా లేని విధంగా పురుషాంగాన్ని పోలి ఉంటుంది. దానిమీద రాక్షసుని భుజాల పై నిల్చున్న శివమూర్తి ఉంటారు. చోళులు తరువాత పల్లవులు కొంతకాలం ఈ ఆలయ నిర్వాహణ చేశారు. చోళ శాసనాల ప్రకారం ఈ ప్రాంతాన్ని తిరువిప్పరంబేడు అని పిలిచేవారు. అనగా తెలుగులో శ్రీవిప్రపీఠం అంటారు. పల్లవుల నిర్వహణలోకి వచ్చాక ఇది గుడిపల్లం అయింది. కాలక్రమంలో ఇది గుడిమల్లంగా మారింది. ఆలయం చుట్టూ నిర్మితమైన గ్రామాన్ని గుడిపల్లంగానే వ్యవహరిస్తున్నారు.

మంగళం

ఈ ఊరు మండల కేంద్రం. తిరుపతికి సమీపంలో ఉంది. ఇక్కడ మంగళి వృత్తి పనిచేసేవారంతా గొప్ప వాద్యకారులు. ఈ వాద్యకారులు తిరుమల తిరుపతి కొండమీదకు వెళుతూ స్వామి వారి సన్నిధిలో మంగళవాద్యాలను వినిపించేవారు. వారి పేరుతోనే మంగళం గ్రామం ఏర్పడింది. మంగళం సంస్కృత పదం. అయితే తెలుగు, తమిళ భాషల్లో మంగళంగానే ఉపయోగిస్తున్నారు. మంగళం అంటే శుభం అని అర్థం.

మొగిలి

ఇది బంగారుపాలెం మండలంలో ఉంది. ఈ ఊరికి ఆ పేరు ఎలా వచ్చిందంటే... ఇక్కడ ఆ రోజుల్లో మొగలి పొదలు చాలా ఎక్కువగా ఉండేవి. దీంతో ఈ గ్రామాన్ని ఏర్పాటు చేసుకొనేటప్పుడు మొగలి అని నామకరణం చేశారు. ఇక్కడ మొగిలీశ్వరస్వామి ఆలయం కూడా ఉంది.

గిరింపేట

చిత్తూరుకు ఒక మైలు దూరంలో గల గ్రామం ఇది. ఆంగ్లేయుల పాలన కాలంలో కలెక్టర్‌గా పనిచేసిన గ్రియం అనే దొర పేరుమీదుగా ఈ గ్రామం వెలసింది. ఈ పల్లెను ఆయన ఎంతగానో అభివృద్ధి చేశాడు. జన వ్యవహారంలో గిరింపేటగా మారింది. దీనికి నవీపేట అనే మరో పేరు కూడా ఉంది. నవి అంటే ఉర్దూలో గుమస్తా లెక్కలు రాసేవాడని అర్థం.

చౌడేపల్లి

ఇది మండల కేంద్రం. చౌడేపల్లిని తొలుత చిక్కరాయపురం అని పిలిచేవారు. క్రీ.శ.6వ శతాబ్దంలో చిక్కరాయులు ఈ ప్రాంతాన్ని పరిపాలించినందున ఆ పేరుతో చిక్కరాయపురం వెలసింది. అయితే గ్రామదేవతగా చౌడేశ్వరమ్మ ఆవిర్భావంతో అటు పిమ్మట చౌడపురిగా ఆ తరువాత కాలక్రమేణా చౌడేపల్లిగా రూపాంతరం చెందింది. ఆమె వస్త్రదేవతగా పూజలు అందుకుంటోంది. కాగా ఈ ప్రాంతంలో చౌడు భూములు ఎక్కువగా ఉన్నందున చౌడేపల్లి అనే పేరు వచ్చినట్టు స్థానికులు తెలిపారు. ఆ రోజుల్లో ఇక్కడ యుద్ధసామగ్రిని తయారు చేసేవారని ప్రముఖ పాత్రికేయులు దాసరి కృష్ణారెడ్డి పేర్కొన్నారు.

రాగిమాకులపల్లె

ఇది రామసముద్రం మండలంలో ఉంది. పూర్వం ఇక్కడ రావిచెట్లు ఎక్కువగా ఉండేవి. దీంతో ఈ ప్రాంతానికి రాగిమాకులపల్లె లనే పేరు వచ్చింది. గతంలో హెచ్చు సంఖ్యలో ఉన్న ఈ రావిచెట్లు రానురానూ తగ్గిపోయాయి. అయినప్పటికీ రావిచెట్లతోనే ఈ గ్రామానికి గుర్తింపు వచ్చింది. ఇక్కడ వెలసిన ప్రాచీన తిమ్మరాయస్వామి ఆలయం గతంలో అంగరంగ వైభోగంతో ఉండేది. అయితే ప్రస్తుతం ఈ ఆలయశోభ మసకబారింది.

మల్లంగుంట

ఈ పల్లె తిరుపతి గ్రామీణ మండలంలో ఉంది. మల్లయ్య అనే రైతు వ్యవసాయం కోసం పొలం వద్ద నీటి గుంటను నిర్మిస్తాడు. అన్న మార్గంలోనే తమ్ముడు తుమ్మయ్య కూడా తన పొలం వద్ద సాగు నీటి గుంటను ఏర్పాటు చేసుకొని పంటల పండించేవారు. అయితే ఆ ఇద్దరు గతించిన తర్వాత వారసులు లేకపోవడంతో ఆ భూముల్లో కొందరు ఇళ్లను ఏర్పాటుచేసుకున్నారు. మల్లయ్య పొలాలకు సంబంధించిన చోట మల్లయ్యగుంట అని తుమ్మయ్య పొలాల వద్ద ఏర్పాటు చేసుకున్న గుంటను తుమ్మయ్యగుంట అని పిలుస్తారు. కాకపోతేమల్లయ్య పేరుతో మల్లంగుంట గ్రామం ఏర్పాటైంది. ఈ పల్లెలో చెంగాలమ్మ అనే వృద్ధురాలు మహా శివరాత్రి పర్వదినాన పరమేశ్వరుని భక్తితో తలకోన సిద్ధేశ్వర స్వామి ఆలయం

వద్ద అగ్ని ప్రవేశం చేసి సజీవ దహనం అయింది. ఆమె జ్ఞాపకార్థం మల్లంగుంటలో చెంగాలమ్మపేరిట ఆలయాన్ని నిర్మించారు. ప్రతి మహాశివరాత్రి నాడు ఘనంగా ఉత్సవాలు జరుపుతారు.

వాల్మీకిపురం / వాయల్పాడు

ఇది మండల కేంద్రం. పూర్వం వాల్మీకి మహర్షి ఇక్కడ గల నూరు కొప్పుల కొండ దరిలో ఆశ్రమం నిర్మించుకున్నాడు. అక్కడే తపస్సు చేశాడు. అందుకే ఈ గ్రామానికి వాల్మీకిపురం అనే పేరు ఉంది. త్రేతాయుగంలో జాంబవంతుడు ఇక్కడ శ్రీరాముడ్ని ప్రతిష్ఠించాడని అదే ఇప్పటి పట్టాభిరామాలయం అని చెబుతారు. సంప్రదాయమైన పేరును ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు ఇటివలే అధికారికంగా వాయల్పాడు గ్రామాన్ని వాల్మీకి పురంగా మార్చారు. ఈ ఆలయంలో విజయనగర సామ్రాజ్య, చోళరాజ్య శిల్పకళా చాతుర్యం కనిపిస్తుంది. ఈ గ్రామంలో వావిలి చెట్లు విరివిగా ఉన్నందున వావిలపాడు అని పేరు వచ్చింది. కాలక్రమంలో ముస్లింల పాలనలో వావిలపనపహాడని, ఆ తరువాత ఆంగ్లేయులపాలనలో వాయల్పాడుగా మారింది. ప్రస్తుతం వాల్మీకి పురంగా స్థిరపడింది. ఇక్కడ ప్రతి ఏటా శ్రీరామలీలా నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు.

కీలపట్ల

ఇది గంగవరం మండలంలో ఉంది. చోళరాజుల హయాంలో సిపాయిల ముఖ్యమైన పటాలం అటవీ ప్రాంతమైన కోటిపల్లె సమీపంలో ఉండేది. చిన్న దండు ఉండే ప్రాంతాన్ని కీల్‌పటాలంగా పిలిచేవారు. ప్రజల వాడుకలో కీల్‌పటాలం, కీలపట్టు చివరకు కీలపట్లగా మారింది. మరో కథనం ప్రకారం గతంలో ఈ పల్లెలో నాలుగు కోటలు ఉండేవని చెబుతారు. తొలుత కోటల పల్లెగా, కోటిపల్లెగా ఉండేదని కాలక్రమంలో కీలపట్లగా స్థిరపడిందని పేర్కొంటారు. కీలపట్లలోని శ్రీకోనేటిరాయ స్వామి ఆలయం ప్రసిద్ధి చెందింది.

తొండమనాడు

ఇది శ్రీకాళహస్తి మండలంలో ఉంది. తొండమాన చక్రవర్తి పాలనకు గుర్తుగా ఈ గ్రామం అవతరించింది. దీనికి వేల సంవత్సరాల చరిత్ర ఉంది.

పురాణాలలో కూడా తొండమనాడుకు విశిష్టస్థానం ఉంది. శ్రీవెంకటేశ్వరస్వామికి పిల్లనిచ్చిన ఆకాశరాజుకు సోదరుడే తొండమాన్ చక్రవర్తి. నారాయణపురాన్ని రాజధానిగా చేసుకొని ఆకాశరాజు పరిపాలన చేసేవాడు. తొండేరు (ఇప్పటి తొండమనాడు) ప్రాంతం కేంద్రంగా తొండమాన్ చక్రవర్తి పరిపాలించేవాడు. వెంకటేశ్వరస్వామి అంటే తొండమాన చక్రవర్తికి విపరీతమైన భక్తి. దీంతో రోజూ స్వామిని దర్శించుకునేవాడు. ఆనందనిలయంగా పిలిచే తిరుమలలోని స్వామి వారి గర్భగుడిని తొండమానుడు నిర్మించాడు. ఒకరోజు తొండమానుడు స్వామి వద్దకు వచ్చి తనకు వయసు మీరిందని ఇకపై దర్శనానికి రాలేనని విన్నవించుకున్నాడు. దీంతో శ్రీనివాసుడు మీకోటలో పశ్చిమాన కొలువై ఉంటానని తొండమానుడుకి వరం ఇచ్చాడు. ఇచ్చిన మాటప్రకారం శ్రీదేవి, భూదేవి సమేతుడై తొండమానుడు కోటలో వెలిసాడు. తిరుమలలోని ఆనందనిలయంలాగే ఇక్కడ స్వామి వారికి గర్భగుడి నిర్మించాడు. అప్పటి నుంచి శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామిగా పూజలు అందుకుంటున్నాడు. స్వామివారు కూర్చొని దర్శనమివ్వడం ఇక్కడ ప్రత్యేకత. ప్రపంచంలో మరెక్కడా స్వామివారు కూర్చొనే ఆలయం లేదు. తి.తి.దే ఈ ఆలయాన్ని అభివృద్ధి చేస్తోంది.

గోవిందరెడ్డి దరఖాస్తు (జి.ఆర్. దరఖాస్తు)

ఈ గ్రామం వరదయ్యపాలెం మండలంలో ఉంది. వరదయ్యపాలెంకు 2 కి.మీ దూరంలో ఉంది. ఈ గ్రామం పూర్తి పేరు గోవిందరెడ్డి దరఖాస్తు. అయితే అందరు సంక్షిప్తంగా జి.ఆర్. దరఖాస్తు అని పిలుస్తారు. గోవిందరెడ్డి అనే వ్యక్తి ఈ ప్రాంతంలో భూములను కొని అక్కడే స్థిరపడ్డారు. ఆయన విద్యావంతుడు. అప్పటిలో గ్రామీణులంతా నిరక్షరాస్యులే. దీంతో ప్రజలు గోవిందరెడ్డి చేత తమ అవసరాల కోసం దరఖాస్తులు రాయించుకునేవారు. దీంతో వారంతా కృతజ్ఞతాపూర్వకంగా తమ గ్రామానికి గోవిందరెడ్డి దరఖాస్తు అని పేరు పెట్టుకున్నారు. అయితే ఆయన సామాజిక వర్గానికి చెందిన వారు ప్రస్తుతం ఒకరు కూడా లేరు. ఎస్.సి, ఎస్.టి తదితర బలహీనవర్గాలకు చెందినవారే హెచ్చుసంఖ్యలో ఉన్నారు. తమకు ఇంత అందమైన పేరుపెట్టడం ఎంతో ఆనందంగా ఉందని సుబ్రమణి రమణమ్మ సంతోషంగా తెలియజేశారు.

రామసముద్రం

ఇది మండల కేంద్రం. విజయనగరరాజులు చంద్రగిరికి వెళ్తున్నప్పుడు మార్గమధ్యంలో ఈ ప్రాంతంలోని జనార్దనస్వామి ఆలయంలో విశ్రమిస్తారు. ఆలయ మండపంలో ఓ నాట్యగత్తె చేస్తున్న నృత్యాన్ని చూసి పరవశించిపోయారు. నీకేం కావాలో కోరుకోమని అన్నారు. నా పేరు రమాసుందరి. ఇదే పేరుతో గ్రామాన్ని ఏర్పాటు చేయాలని కోరింది. రాజులు సరేనన్నారు. ఆ పల్లెకు రమాసుందరిపురంగా నామకరణం చేశారు. అయితే జనవ్యవహారంలో రామసముద్రంగా స్థిరపడినట్టు ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ దాసరి కృష్ణారెడ్డి ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు.

పుంగనూరు

ఇది మండల కేంద్రం. పుంగ్వము అంటే తమిళంలో పశువు లేదా ఎద్దు అని అర్థం. ఇక్కడ ఉన్న ఆవులన్నీ మేలు జాతి రకానికి చెందినవే. పుంగవం పేరు కాలక్రమంలో పుంగనూరు అయింది. పుంగవం అంటే పుంగచెట్టు అనే అర్థం కూడా ఉంది. ఇక్కడ పుంగచెట్లు ఎక్కువగా ఉన్నాయి. ఈ చెట్ల గింజల నుంచి తైలం తీస్తారు. అంచేత పుంగనూరు అనే పేరు వచ్చినట్టు స్థానిక సీనియర్ పాత్రికేయులు దాసరి కృష్ణారెడ్డి అన్నారు. ఇతిహాసం ప్రకారం పూర్వం పుంగమ్మ అనే మహిళ ఓ చెరువు తవ్వించింది. వానలు పడి చెరువు నిండినప్పుడల్లా ఓ చోట కట్ట తెగిపోయేది. ఇక లాభం లేదను కొని ఈ గండిపడిన చోట తాను దూకి బలిచ్చుకుంది. పుంగమ్మమీద మట్టి పోసిగండిని పూడ్చారు. నేటి వరకూ చెరువు కట్ట తెగలేదు. అక్కడ వెలసిన ఊరికి "పుంగమ్మ ఊరు" అని, అదే తరువాత పుంగనూరుగా మారిందని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులు డా॥ పేట శ్రీనివాసులరెడ్డి (పేటశ్రీ) పేర్కొన్నారు. కాగా మరో కథనం ప్రకారం ఒకప్పుడు ఇది పరశురామ క్షేత్రంగా ఉండేది. పరశురాముడు ఈ ప్రాంతంలో నడయాడినట్టు చెబుతారు. దీంతో పుణ్యపురమని కాలక్రమంలో పుంగపురంగా మారి నేడు పుంగనూరుగా స్థిరపడింది. తిమ్మరాయలు సంతతివారు పుంగనూరు జమీందారులుగా వ్యవహరించారు. అమరశిల్పి జక్కన్న కుమారుడు

ఒకే ఒక రాత్రిలో చెక్కిన కళాత్మకమైన ఓ కోనేరు ఉంది. ఇక్కడ గంగమ్మ జాతరను ప్రతిఏటా ఘనంగా నిర్వహిస్తారు. చింతపండు, పశువుల వ్యాపారం పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. జాతీయ స్థాయిలోనే ఈ వ్యాపారానికి మంచి గుర్తింపు ఉంది.

మూగవారిపల్లె

ఇది రామసముద్రం మండలంలో ఉంది. ఇక్కడ తరతరాలుగా కొన్ని ఇండ్లలో పుట్టిన పిల్లలు మూగవారు కావడంతో దీనికి మూగవారిపల్లె అని పిలుస్తారు. పుంగనూరుకు 8కి.మి దూరంలో కౌండిన్య నదీతీరంలో ఉంది. కాగా ఈ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో ఆవులను మేపేవారు. అందులో ఓ ఆవు అక్కడ ఉన్న పుట్టపై పొదుగు పెట్టి అందులో పాలు పోసేది. అయితే ఆ గోవు రైతు ఇంటి వద్దకు వచ్చే సరికి పాలు ఇచ్చేది కాదు. రైతు కాపరిని మందలించేవాడు. దీంతో కాపరి ఆ గోవుపై ప్రత్యేక దృష్టి పెట్టాడు. ఆవు పుట్టలో పాలు పోస్తున్న దృశ్యాన్ని గమనించాడు. పుట్ట మీద గొడ్డలితో బాదాడు. బయటకు రక్తం చిమ్మింది. ఆ దృశ్యాన్ని కళ్ళారా చూసిన కాపరి నిశ్చేష్టుడై మూగవాడయ్యాడు. దీంతో ఆ ప్రాంతంలో ఏర్పాటైన గ్రామానికి మూగవారిపల్లె అని పేరు పెట్టారు. మూగవాని పేరుతో చిన్న ఆలయాన్ని కూడా నిర్మించారు. ఈ కథనం ప్రచారంలో ఉంది.

బల్లావారిపల్లె

ఇది రామసముద్రం మండలంలో మాలేనత్తం పంచాయితీలో ఉంది. బల్లా అనేది కర్ణాటక రాష్ట్ర పలుకుబడి. ఇది కొలమానానికి సంబంధించించిన పరికరం. బల్లాను వేరుశెనగ కాయల కొలతకు వాడేవారు. కర్ణాటక సరిహద్దు ఈ పల్లెకు 10 కి.మీ. దూరంలో ఉంది. తొలిసారిగా ఈ ప్రాంతంలో బల్లాను ఉపయోగించడం వల్ల దీనికి బల్లావారిపల్లె అనే పేరు వచ్చింది.

పంచలింగాలకొత్తూరు

ఇది చౌడేపల్లి మండలంలో ఉంది. ఇక్కడ అయిదు శివలింగాలు ఉన్నాయి. పాండవుల పేర్లతో ఈ లింగాలు ఉండటం విశేషం. అక్కడకు రెండు కి.మీ దూరంలో కొత్తగా ఏర్పాటు చేసుకున్న కొత్తూరు ఉంది. ఇలా పంచలింగాల కొత్తూరుగా ఈ గ్రామానికి పేరు పెట్టారని సీనియర్ పాత్రికేయులు దాసరి కృష్ణారెడ్డి పేర్కొన్నారు.

అప్పలాయగుంట

ఈ గ్రామం వడమాలపేట మండలంలో ఉంది. భక్తులకు కోరిన కోర్కెలు తీర్చుతూ దర్శనం ఇస్తున్న శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి కొలువైన గ్రామం ఇది. ఐతిహ్యం ప్రకారం కొన్నేళ్ల కిందట అప్పులయ్య అనే వ్యక్తి తిరుమల వెంకటేశ్వరస్వామి దర్శనార్థం నడుచుకుంటూ వెళ్తూ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో సేద తీర్చుకున్నాడు. కొంతసేపటి తరువాత లేచి మళ్లీ పాదయాత్రకు సిద్ధం అయ్యాడు. కొంతదూరం వెళ్లే సరికి డబ్బు సంచి వదిలిపెట్టినట్టు గమనించాడు. అక్కడ నుంచి యథాస్థానానికి వచ్చాడు. అక్కడ చూడగా డబ్బు సంచి చెక్కు చెదరకుండా ఉంది. దీంతో అప్పులయ్య దేవుని దీవెనెలతో, దాతల ప్రోత్సాహంతో ఒక గుంట (బావి)ని నిర్మించాడు. అప్పులయ్య సౌజన్యంతో నిర్మించిన గుంట.... అప్పులయ్యగుంటగానూ తరువాత కాలంలో అప్పలాయగుంటగా మారింది.

ఎం.డి. పుత్తూరు

ఇది ఏర్పేడు మండలంలో ఉంది. గ్రామ దేవత పేరుతో వెలసిన గ్రామం ఇది. ఈ గ్రామంలో మహంకాళి దేవి పుత్తూరు అనే దేవత ఆలయం ఉంది. ఈ గ్రామం రేణిగుంట, శ్రీకాళహస్తి మార్గంలో ఉంది. దీంతో ఎం.డి పుత్తూరుగా ఈ గ్రామాన్ని పిలుస్తున్నారు. ఇప్పుడు ఆ పేరే స్థిరపడింది.

మొలకలచెరువు

ఇది మండల కేంద్రం. 17వ శతాబ్దంలో గుర్రం కొండ నవాబుల హయాంలో నడుమరెడ్లపల్లె ప్రాంతం ఉండేది. అప్పట్లో మహ్మదుల్లారెడ్డి పాలనలో ఈ ప్రాంతం ఎంతో సుభిక్షంగా ఉండేది. మంత్రి తల్లి వీరమ్మ కాశీ నుంచి తెచ్చిన శివలింగాన్ని ములకచెరువులో ప్రతిష్ఠించింది. మల్లికార్జునస్వామి ఆలయాన్ని నిర్మించింది. ఈ ప్రాంతంలో ఏ గింజలు వేసినా మొలకెత్తేవి. చెరువు కింద వేసిన ప్రతి విత్తనం బాగా మొలకలెత్తి పంటలు బాగా పండేవి. ఇలా ఎక్కడ విత్తనాలు వేసినా మొలకలెత్తుతుండడంతో నడుమరెడ్లపల్లె క్రమంగా మొలకలచెరువుగా స్థిరపడింది.

నాగలపల్లి

ఇది మండల కేంద్రం. మొదట ఈ ఊరిని నాగలిపల్లి అని పిలిచేవారు. అయితే ఈ ప్రాంతంలోని పొలాలును దున్నటానికి ఇక్కడ పెద్ద ఎత్తున నాగళ్లు తయారు చేసేవారు. నాగలిపల్లి కాలక్రమంలో నాగలపల్లిగా రూపాంతరం చెందింది.

ఉప్పునెల్లి

ఇది రామసముద్రం మండలంలో ఉంది. బ్రాహ్మణులకు అగ్రహారంగా ఇచ్చిన పల్లె ఇది. ఒకప్పుడు ఇక్కడ 116 దేవాలయాలుండేవి. కాలక్రమంలో వాటిలో అయిదారు ఆలయాలు మాత్రమే ఉన్నాయి. మిగిలినవన్నీ భూస్థాపితమయ్యాయి. బ్రాహ్మణులు అనే పదానికి విప్రులు అనే పర్యాయపదం ఉంది. జనవ్యవహారంలో విప్రులూరు ఉప్పునెల్లిగా మారింది.

ఏటవాకిలి

ఇది రామసముద్రం మండలంలో ఉంది. ఆనాటి రాజులు, ఆంగ్లేయులు, పాలేగాళ్లు ఈ ప్రాంతంలో వన్యమృగాలను వేటాడేవారు. అప్పట్లో ఈ ప్రాంతమంతా కీకారణ్యంగా ఉండేది. క్రూరమృగాలను వేటాడి,రైతల పొలాల్లో పండే పంటలను పరిరక్షించేవారు. వారంతా ఈ ప్రాంతం నుంచి వేటాడే మొదటి స్థానం కావడం తో ఇక్కడ ఏర్పడిన పల్లెకు వేటవాకిలి అని పేరు పెట్టారు. క్రమంగా జనం వాడుకలో ఏటవాకిలిగా మారింది.

పుదిసట్ల

ఇది చౌడేపల్లి మండలంలో ఉంది. దీన్ని తొలుత పుదుపటలం అని పిలిచేవారు. కొత్త గ్రామం అని అర్థం చేసుకోవాలి. జనం వాడుకలో పుదిపట్ల అయింది. పుదియ అంటే కొత్తది. పటలం అంటే ఇంటి పైకప్పు అని అర్థం. ఈ పల్లెను ఏర్పాటు చేసుకొనేటప్పుడు ఆర్థిక పరిస్థితుల వల్ల కొన్నాళ్ళ పాటు పై కప్పులు లేకుండానే ఆ ఇళ్లలో నివశించేవారు. క్రమంగా పైకప్పులు నిర్మించుకున్నారు.

మొగలి

ఇది బంగారుపాళ్యం మండలంలో, పలమనేరుకు సమీపంలో ఉంది. ఈ ప్రాంతంలో మొగలి పొదలు విస్తారంగా ఉండేవి. దీంతో మొగలి అనే పేరు వచ్చినట్టు స్థానికులు చెబుతున్నారు. ఇక్కడి మొగిలీశ్వరాలయం ఎంతో పురాతనమైంది.

అప్పినేపల్లి

ఇది పెద్దపంజాం మండలంలో ఉంది. తమిళనాడు నుంచి మురుగన్ అనే వ్యక్తి ఈ ప్రాంతానికి వచ్చి అపినే అనే పంటను పండించి వ్యాపారం చేసేవాడు. ఆ తరువాత మరి కొంతమంది ఇక్కడికి చేరి ఇదే పంటను పండించేవారు. అపినే అంటే గంజాయి తరహా పంట. ఈ పంట పేరుతోనే వీరంతా తమ గ్రామానికి అప్పినేపల్లి అని పేరు పెట్టుకున్నారు.

కుప్పం

ఇది శాసనసభ నియోజక వర్గ కేంద్రం. బెస్తవారు (మత్స్య కారులు) హెచ్చు సంఖ్యలో నివశించే గ్రామం కావడంతో దీనికి కుప్పం అనే పేరు వచ్చింది. కుప్పం అంటే బెస్తవారి పల్లె అని గ్రహించాలి. కుప్పం నియోజకవర్గం నుంచే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాతినిథ్యం వహిస్తున్నారు.

తిమ్మినాయునిగడ్డ

ఇది కేవీపల్లె మండలంలో ఉంది. కొన్ని దశాబ్దాల కితం తిమ్మినాయుడు అనే వ్యక్తి ఈ ప్రాంతంలో తొలిసారిగా నివాసం ఏర్పరుచుకున్నారు. కాలక్రమేణా అతనికుటుంబం వృద్ధి చెందింది. అక్కడ ఓపల్లె ఏర్పడింది. అంచేత దీనిని తిమ్మినాయునిగడ్డగా పేరు పెట్టారు.

సుగాలిమిట్ట

ఇది పుంగనూరు గ్రామీణ మండలంలో ఉంది. పుంగనూరుమదనపల్లె మార్గంలో ఘాట్ రోడ్డుపై ఉంది. సముద్రమట్టానికి 30 వేల అడుగుల ఎత్తున ఉండడంతో పాటూ ప్రశాంతమైన గాలితో ఆహ్లాదకర వాతావరణంలో నెలకొని

ఉంది. మిట్ట అంటే ఎత్తయిన ప్రదేశం. అంచేత ఇది సుగాలిమిట్టగా ప్రసిద్ధి చెందింది. ఇలా ఆ ఊరికి ఈ పేరు వచ్చింది. ఈ ప్రాంతంలో సుగాలీలు (బంజారు జాతి వారు) వలసల వచ్చి స్థిరపడ్డారు. ఈ కారణంగా కూడా సుగాలిమిట్ట సార్థక నామధేయాన్ని సంతరించుకుంది. సుగాలీలు అడవిలో ఎండు కట్టెలను నరకి పుంగనూరులో విక్రయించేవారు.

కండ్రిగలు

చిత్తూరు జిల్లాలో కండ్రిగ పేరుతో వందలాది గ్రామాలు దర్శనమిస్తాయి. కండ్రిగ అంటే గ్రామం అని, భూమిలో కొంత భాగమని అర్థం. పూర్వం సంస్థానాధీశులు తమను ఆశ్రయించిన వారికి గ్రామంలోని కొంత భూమిని ఇచ్చేవారు. ఖండ్రిక అనే పదానికి కండ్రిగ పర్యాయపదం లేదా వికృతి రూపంగా గ్రహించాలి.

పుల్లారెడ్డి కండ్రిగ

ఇది చిత్తూరు మండలంలో ఉంది. ఈ కండ్రిగ వ్యక్తి నామ ప్రాధాన్యతతో ఏర్పడిన పల్లె.

బుచ్చినాయుడు కండ్రిగ

ఇది మండల కేంద్రం. ఈ కండ్రిగ బుచ్చినాయుడు పేరుతో ఏర్పడిన గ్రామం. ఆయనే ఈ గ్రామాన్ని ఏర్పాటు చేసినట్టు స్థానికుల కథనం.

మిట్ట కండ్రిగ

ఇది రామచంద్రపురం మండలంలో తలదాచుకుంటోంది. మిట్ట అంటే ఎత్తయిన ప్రాంతం. అంచేత మిట్టకండ్రిగగా మారింది. ఈ పల్లె రాయల చెరువు ప్రాంతంలో ఉంది.

భీమగానిపల్లె

ఇది పుంగనూరు మండలంలో ఉంది. భీమేశ్వరుడు స్వయంభువుగా ఇక్కడ అవతరించాడు. ఈ దేవుని పై గల విశ్వాసంతో తమ గ్రామానికి భీమగానిపల్లె అని పేరు పెట్టుకున్నారు. ఈ విషయాన్ని పాత్రికేయులు దాసరి కృష్ణారెడ్డి తెలిపారు.

సుబ్బరాజు కండ్రిగ

ఇది వరదయ్యపాళెం మండలంలో ఉంది. సుబ్బరాజు అనే వ్యక్తి ఈ గ్రామాన్ని ఏర్పాటు చేసినట్టు స్థానికులు పేర్కొంటున్నారు.

గాంధీనగర్ (దొడ్డయ్యకుంట)

ఇది పలమనేరు మండలంలోని అటవీ ప్రాంతంలోని ఉంది. ఇక్కడ 100 కుటుంబాలు ఉన్నాయి. రెవెన్యూరికార్డులలో దొడ్డయ్యకుంట అని, నామ ఫలకాలపై గాంధీనగర్ అని కనిపిస్తుంది. గతంలో ఈ ప్రాంతంలో ఓ పెద్ద నీటి కుంట ఉండేది. ఇక్కడ దొడ్డయ్య అనే వ్యక్తి వ్యవసాయం, పశుపోషణ సాగించేవాడు. అతని పేరు మీదనే దొడ్డయ్యకుంట గ్రామం ఏర్పాటైంది. అయితే రెండు దశాబ్దాల కితం గ్రామీణులంతా ఏకాభిప్రాయంతో తమ గ్రామం పేరును గాంధీనగర్‌గా మార్చుకున్నారు. అయితే రెవెన్యూ రికార్డులలో దొడ్డయ్యకుంటగానే మిగిలింది.

నగరి

ఇది తమిళనాడు సరిహద్దులో ఉంది. పురపాలిక, నియోజకవర్గ కేంద్రంగా ఉంది. ఇది ప్రాచీన పట్టణం. నగరమ్ అనే తమిళ పదం నుంచి నగరిగా వచ్చింది. ఇది నగర ఛాయలతోనే ప్రణాళికాబద్ధంగా ఏర్పడింది. నగరి సమీపంలోని కైలాసకోన జలపాతాలు ఆహ్లాదకరంగా ఉంటాయి. మహాభాగవతంలోని "గజేంద్రమోక్షం" ఘట్టం ఇక్కడే జరిగినట్టు ఇతిహాసం పేర్కొంటోంది.

శంకర్రాయులపేట

ఇది పెద్దపంజాని మండలంలో ఉంది. సుగుటూరు వంశీయుడైన మొట్టమొదటి జమీందారు శంకర్రాయుల పాలనలో ప్రజల సౌకర్యార్థం పెద్ద తటాకాన్ని నిర్మించారు. ఆ చెరువును శంకర్రాయుల పేరుతో పిలుస్తున్నారు. దీనిని మాడిచెరువు అని కూడా అంటారు. ఆ బహద్దరు పేరు కలిసొచ్చే విధంగా గ్రామానికి శంకర్రాయులపేటగా నామకరణం చేశారు.

యర్రావారిపాలెం

ఇది మండల కేంద్రం. కాపు సామాజిక వర్గానికి చెందిన యర్రా వంశీయులు ఈ గ్రామాన్ని తొలుత ఏ ర్పాటు చేశారు. దీంతో ఈ గ్రామానికి యర్రావారిపాలెం అనే పేరు వచ్చినట్టు స్థానికులు పేర్కొన్నారు. అయితే ఇక్కడి నుంచి హెచ్చు సంఖ్యలో ఈ వంశీయులు పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం ఉప్పులూరు, కృష్ణా జిల్లా వడ్లమన్నాడ గ్రామానికి తరలి వచ్చినట్టు ప్రముఖ సాహితీవేత్త కానూరి బదరీనాథ్ ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు.

నారావారిపల్లి

ఇది చంద్రగిరి మండలంలో ఉంది. కమ్మ సామాజికవర్గానికి చెందిన నారావారి కుటుంబాలు కొన్ని ఈ ప్రాంతంలో పొలాలను కొనుగోలు చేసి అక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఆ తరువాత అనేక కుటుంబాల వారు ఇక్కడకు వచ్చి స్థిరపడ్డారు. నారావారి ఇంటిపేరుతోనే ఈ గ్రామానికి నామకరణం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వగ్రామం ఇదే. ఇక్కడి నాగాలమ్మ ఆలయం ప్రసిద్ధి చెందింది. ఇది తిరుపతికి కూతవేటు దూరంలో ఉంది.

చలిమామిడిపల్లె

ఇది నిమ్మనపల్లె మండలంలో ఉంది. గతంలో బి.కొత్తపేట మండలం నుంచి రెండు కుటుంబాలు నాటు బండిపై వలస వెళ్తున్నారు. అయితే నిమ్మనపల్లె, రెడ్డివారిపల్లె సమీపంలో బహుదా ప్రాజెక్టువద్ద బండి చక్రం విరిగింది. పిట్లవారిపల్లె, పేనుగుండవారిపల్లె మహారాణి వీరిని తన వద్దనే ఉండి పని చేయాలని కోరింది. ఈ మేరకు వారు గుర్రాలు, జింకలు, లేళ్లు మేపుతూ ఉండేవారు. మహారాణికి వృద్ధాప్యం వచ్చింది. పనివారికి కొంతభూమి కేటాయించాలని నిర్ణయించుకొంది. అయితే పనివారు తమకేమి వద్దని, తామునివశించే ప్రాంతానికి చలిమామిడిపల్లెగా మార్చాలని కోరారు. ఆ బండి చక్రం విరిగిన ప్రాంతాన్ని చలిమామిడి రేవులుగా, చలిమామిడి కొండగా పేరు పెట్టింది. వారికి వీటి మీద సర్వహక్కులు ప్రసాదించింది. ఇలా చివరకు చలిమామిడిపల్లెగా ఇది స్థిరపడింది.

మదనపల్లె

ఇది రెవెన్యూ డివిజన్, పురపాలిక, శాసనసభ నియోజకవర్గ కేంద్రం. దీని తొలి పేరు మదనకామరాజు పురం. కాలక్రమంలో ఆంగ్లేయుల హయాంలో మదనపల్లెగా రూపాంతరం చెందింది. బెంగాలీ భాషలో రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన జనగణమన గీతాన్ని 1919 ఫిబ్రవరి 25న ఆంగ్లంలో "ది మార్నింగ్ సాంగ్ ఆఫ్ ఇండియా" పేరిట తర్జుమా చేసి తొలిసారిగా మదనపల్లెలోని బీ.టీ కళాశాలలో వినిపించారు. జనగణమణ గీతం భారతీయుల నోట పలికినంత కాలం మదనపల్లె పేరు చరిత్ర పుటల్లో శాశ్వతంగా నిలిచిపోతుంది. అలాగే స్వాతంత్ర్య పోరాటం కాలంలో ఇక్కడ 1913లో అనిబిసెంట్ దివ్యజ్ఞాన కళాశాలను ఏర్పాటు చేశారు.

దిగువపల్లి

ఇది చౌడేపల్లి మండలంలో ఉంది. బోయకొండ గంగమ్మ అమ్మవారి ఆలయం దిగువ ప్రాంతంలో ఈ గ్రామం ఉండడంతో దీనికి దిగువపల్లి అనే పేరు వచ్చింది. చిత్తూరు జిల్లాలో బోయకొండమ్మ ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయంలో ప్రతి ఏటా జనవరి ఒకటిన అలాగే దసరా నవరాత్రి ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తారు.

రేణిగుంట

ఇది ప్రధాన రైల్వే కూడలి. తిరుమల-తిరుపతికి సమీపంలో ఉంది. తిరుపతి విమానాశ్రయం ఇక్కడే నెలకొని ఉంది. వివిధ దినపత్రికల ప్రచురణ కేంద్రంగా ఉంది. ఒకప్పుడు ఇదో చిన్న పల్లె. అయితే తిరుపతి ప్రభావంతో ఇది ప్రముఖ రవాణా కూడలిగా మారింది. గతంలోకి వెళితే.... ఈ ప్రాంతంలో రేను వృక్షాలు విపరీతంగా ఉండేవి. చిన్నచిన్న గుంటలను ఏర్పాటు చేసుకొని వీటికి నీటి సదుపాయం కల్పించారు. రేను అంటే రేగు చెట్లు. అయితే పలువురు ఈ ప్రాంతాన్ని ఎంపిక చేసుకొని రేనుచెట్లను తొలగించి నివాసాలు ఏర్పాటు చేసుకొన్నారు. ఈ చెట్ల పేరు కలిసొచ్చే విధంగా "రేనుగుంట" అని నామకరణం చేశారు. కాలక్రమంలో ఇది రేణుగుంటగా చివరకు రేణిగుంటగా స్థిరపడింది.

వై.ఎస్.ఆర్ కడప జిల్లా

కడప

ఇది జిల్లా కేంద్రం. ఈ పట్టణానికి 2వేల సంవత్సరాల చరిత్ర ఉంది. దీనికి దేవుని కడప, దేవర కడప, పాతకడప అనే పేర్లు కూడా ఉన్నాయి. తిరుపతి వెళ్లే యాత్రికుల్లో హెచ్చుమంది నగరం మీదుగా వెళ్తుంటారు. కడపలోని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించి అక్కడ నుంచి కాలిబాటలో వెళ్లే వారుకూడా ఉన్నారు. కృపాచార్యులు ఇక్కడే తపస్సు చేసినందున దీన్ని కృపానగరం అని కూడా పిలుస్తుంటారు. క్రీ.శ. రెండో శతాబ్దంలో గ్రీకు దేశీయుడు టాలమీ తన యాత్రాపుస్తకంలో కరిగె, కరిపె అనే శబ్దాలను ఈ పట్టణాన్ని ఉద్దేశించి రాశాడు. కరిపె అంటే నల్లగడ్డ అని అర్థం. 1873లో బ్లాక్ బెర్రి అనే కలెక్టర్ కరిపే అనే పదానికి బ్లాక్ చిప్ అని వాడాడు. కరిగెడ్డ, కరిబెడ్డ అని పిలిచేవారు. కాల పరిణామ క్రమంలో ఈ పదాలు రూపాంతరం చెంది కడపగా మారింది. శ్రీనివాసుణ్ణి కీర్తిస్తూ... "కాదనకు నా మాట కడప రాయ... నీకు గాదే బోసె వలపులు కడపరాయ" అనే అన్నమాచార్యుల కీర్తన వల్ల ఆయన కాలం నాటికే ఇది కడపగా స్థిరపడినట్టు అర్థం చేసుకోవచ్చు.

ఒంటిమిట్ట

ఒంటిమిట్ట కైఫియత్ ఆధారంగా వంటడు, మిట్టడు అనే బోయలు నిర్మించినందు వల్ల వంటిమిట్ట అయిందని స్పష్టమౌతోంది. ఒక గడ్డమీద చిన్న గుడి ఉంది. ఆ గుడిని పెంపు చేయమని కంపరాయులను బోయలు కోరారు. అక్కడే గుడి నిర్మాణం అయింది. గడ్డను మెట్ట అని కూడా పిలుస్తారు. మెట్టమీదే గుడినిర్మాణం అయినందున ఒంటిమెట్ట అయ్యింది. క్రీ.శ.1355-56 ప్రాంతంలో బుక్కరాయలు సింహాసనం అధిష్టించి గోదావరీ నది ఒడ్డున ఇసుకపల్లెలో తయారైన సీతాలక్ష్మణ సహిత కోదండరామ విగ్రహాన్ని తెచ్చి ఒంటిమిట్టలో ప్రతిష్టించారు.

ఒంటిమెట్ట అనే పేరుమీదనే తరువాతి కాలంలో అయ్యలరాజు తిప్పయ్య అనే కవి ఒంటిమెట్ట రఘువీరా! జానకీ నాయకా! అని తన శతకంలో చెప్పాడు. రాతల్లో ఒంటి మెట్ట అని కనిపిస్తుంది. క్రమంగా శాసనాల్లో ఒంటిమెట్ట, వంటిమెట్ట అని కనిపిస్తోంది. వంటిమిట్ట ప్రస్తుతం ఒంటిమిట్టగా స్థిరపడింది. ఈ విషయాన్ని విద్వాన్ కట్టా నర్శింహులు తాను రాసిన "ఒంటిమిట్ట రామయ్య చరిత్ర" పుస్తకంలో (2015) రాశారు. శిథిలమైన ఈ ఆలయాన్ని ఆంధ్రవాల్మీకిగా ప్రసిద్ధి చెందిన శ్రీరామభక్తుడు వావిలికొలను సుబ్బారావు పునరుద్ధరించారు. రాష్ట్ర విభజన సందర్భంగా భద్రాచలం తెలంగాణాలో విలీనం అయింది. దీంతో రాయలసీమ ప్రాంతంలోని ఒంటిమిట్టలో 2015 ఏప్రిల్‌లో శ్రీరామనవమి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికార పూర్వకంగా నిర్వహించింది. ఈ రామాలయాన్ని తి.తి.దే పరిధిలోకి తీసుకొని వస్తూ తే.28.07.2015 దీన పాలకవర్గం సమావేశమై ఏకగ్రీవంగా ఓ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ మేరకు తి.తి.దే ఆలయాన్ని స్వాధీనం చేసుకుంది. ఆలయ ప్రాంగణం లో ఆంజనేయస్వామి భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. తి.తి.దే రూ.100 కోట్ల వ్యయంతో ఈ ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నది.

పుష్పగిరి

ఇది వల్లూరు మండలంలో ఉంది. పవిత్ర పుణ్యక్షేత్రం ఇది. పినాకిని నదీతీరంలో ఉంది. పుష్పగిరిని పంచనది సంగమంగా పేర్కొంటారు. పాపాఘ్ని, కుందూ, వల్కల, మాండవ్య నదులు పినాకినిలో కలుస్తున్నాయి. చోళుల కాలంలో ఇక్కడి వైద్యనాధస్వామి ఆలయం, చాళుక్యుల కాలంలో శివకేశవుల ఆలయాన్ని నిర్మించారు. రాష్ట్రంలోని ఏకైక అద్వైత పీఠం ఇది. రావణ సంహారానికి శ్రీరాముడు లంకకు వెళ్తూ ఈ గ్రామాన్ని సందర్శించాడు. ఇక్కడి వైద్యనాథేశ్వరస్వామిని కొన్ని రోజులు పుష్పగుచ్ఛాలతో పూజించాడు. ఆ తరువాత వాటి అన్నింటిని అక్కడి కొలనులో వేసాడు. అవన్నీ పుష్పమాలతో ఏర్పడిన కొండవలె తేలాయి. దీంతో స్థానికులు ఈ గ్రామానికి పుష్పగిరి అని పేరుపెట్టారు.

బద్వేలు

మాట్లకుమార అనంత కాలంలో ఆముదాల ఏరు, తిక్కలేరు, గుండ్లవాగు అను మూడు వాగుల సంగమం బద్రపల్లె గ్రామం వద్ద జరుగుతుంది. ఇక్కడ పెద్ద చెరువు కూడా నిర్మించారు. బద్రపల్లె కాలక్రమంలో బద్దవోలు, బద్దెవోలు అయ్యినది. ఇదియే నేటి బద్వేలు పట్టణం. మరొక కథనం ప్రకారం ఈ ప్రాంతాన్ని పరిపాలించిన సుమతీ శతకకారుడు బద్దె భూపాలుడు (బద్దెన) పేరు మీదుగా మొదటగా బద్దెనవోలు అని, ఆ తరువాతి కాలంలో అదియే బద్దెవోలుగాను కాలక్రమంలో ఇది నేటి బద్వేలుగాను రూపాంతరం చెందింది.

ప్రొద్దుటూరు

స్థల పురాణం ప్రకారం శ్రీరాముడు శివలింగాన్ని ప్రొద్దు పొడవకముందే తయారు చేసి ప్రతిష్ఠించాడు. అందుకు ఈ ఊరిని పొద్దుటూరు అని పేరు పెట్టారు. ఇతిహాసం ఇదే చెబుతోంది. కాగా పొదలు ఎక్కువగా ఉన్న కారణంగా పొదలూరు, కాలక్రమంలో ప్రొద్దుటూరుగా మారింది. ఇక్కడ విజయదశమి వేడుకలు మైసూరు తరహాలో ఘనంగా నిర్వహిస్తారు. ఇక్కడ రామలింగేశ్వరాలయం, ఆగస్త్యేశ్వరాలయం, కన్యకాపరమేశ్వరి ఆలయం ప్రసిద్ధి చెందాయి. బంగారానికి కూడా ప్రసిద్ధి చెంది మరో ముంబయిగా పేరు పొందింది.

జమ్మలమడుగు

ఇది మండల కేంద్రం. జంబులమడుగుగా తొలుత పిలిచేవారు. ప్రస్తుతం ఉన్న ప్రాంతానికి దిగువన రెండు చెరువులు ఉండేవి. ఆ చెరువుల్లోకి పెన్నా నది కాలువల నుండి నీళ్లు వచ్చేవి. ఈ చెరువులు నిర్మించే ముందు ఒక మడుగుగా ఏర్పడ్డాయి. జంబు అనగా ఒక రకమైన గడ్డి ఈ ముడుగులో ఇది కలిసి ఉండటం వలన జంబులుమడుగుగా మారింది. కొన్నేళ్లకు కొద్దికొద్దిగా నీరు తగ్గిపోయి ఎండిపోవడంతో ఇక్కడ ఓ గ్రామం ఏర్పడింది. జంబులమడుగు కాలక్రమేణా జమ్మలమడుగుగా మారింది.

సిద్ధవటం

ఇది మండల కేంద్రం. పెన్నానది గట్టున ఉన్నది. ఇక్కడ వటం (మర్రిచెట్టు) కింద సిద్ధులు నివశిస్తుండేవారు. దీంతో ఈ ప్రాంతానికి సిద్ధవటం అనే పేరు వచ్చినట్టు ఐతిహ్యం వల్ల తెలుస్తోంది. ఇక్కడ సిద్ధవటేశ్వరాలయం ఉండేది. అయితే కాలగర్భంలో కలిసిపోయింది. శ్రీశైలానికి దక్షిణద్వారంగా ఉంది. బౌద్ధ గ్రంథాల్లో సిద్ధవటం ప్రస్తావన ఉంది. క్రీ.శ. 12వ శతాబ్దం నుంచి ఇక్కడ రాజులకోట కూడా ఉండేది. వటం (మర్రి) పేరుతో ఆంధ్రదేశంలో ఎన్నో గ్రామాలు ఉన్నాయి. మర్రివలస, మర్రిపాడు తదితరమైనవి.

వెల్లాల

కడప జిల్లాలో ప్రొద్దుటూరుకు సమీపంలో కర్నూలు జిల్లాకు దగ్గరగా ఈ వెల్లాల అనే గ్రామం ఉంది. ఈ వెల్లాల ఎంతో చరిత్ర ప్రసిద్ధి కెక్కింది. ఇక్కడ యాదవులు ఆవులను మేపుకునే వారు. అందులో తెల్ల ఆవులను విడిగా ఉంచి దేవ స్వరూపులు అనే పేరుతో వాటిని దేవ గోవులుగా భావించి వాటికి ప్రత్యేకమైన మందలు ఏర్పాటు చేసుకొని అక్కడ ఉంచేవారు. వెల్ల అనగా తెల్లని, ఆల అంటే ఆవులని తెల్లని ఆవులన్ని ఒకే చోట ఉన్నాయి కాబట్టి వెల్ల ఆవులుగా పిలిచేవారు. కాలక్రమేణా వెల్లాలగా మారింది. ఇక్కడ ఒక.రాజు వేటకు వచ్చేవాడు. వేటలో నీరు దొరకని సందర్భంలో ఈ వెల్లాల నుంచి యాదవులు మజ్జిగ, నీళ్లు కడవలతో తీసుకువచ్చి ఉపచర్యలు చేస్తారు, తమ వద్ద ఉంచుతారు. తెల్లవారిన తరువాత రాజు మీకు ఏమి కావాలని కోరుకోమని అడగగా మాకు కొన్ని దేవాలయాలు నిర్మించమని అడిగారు. వారి కోరిక మేరకు ఇక్కడ భీమేశ్వరస్వామి, సంజీవరాయుని దేవాలయాలను రాజు నిర్మించాడని స్థలపురాణం వల్ల తెలుస్తోంది.

కోడూరు

ఇది కడప నుంచి తిరుపతి వెళ్ళే మార్గంలోని మండల కేంద్రం. ఈ ప్రాంతంలో మామిడి, నిమ్మ బత్తాయి పంటలు ఎక్కువగా పండిస్తారు. ఇక్కడ ప్రాంతీయ పంటల పరిశోధన కేంద్రం ఉంది. కోడు అంటే జల సూచి, జల సమృద్ధి అని అర్థం చేసుకోవాలి. కోడూరుకు పై భాగంలో ఏరు ఉంది. మనం ఏరు దాటితే ఒకే ఏరు రెండుగా చీలి కనిపిస్తుంది. కోడు+ఊరు=కోడూరు అవుతుంది.

రైల్వేకోడూరు

ఇది మండల కేంద్రం. ఈ ప్రాంతానికి తిరుమల కొండ నుంచి వచ్చే ముష్టేరు, గుండలేరు, గుంజన ఏర్లు ఇక్కడ ప్రవహిస్తున్నాయి. పంటలను సుభిక్షం చేస్తుంటాయి. కోడు అంటే జల సూచిక అని అర్థం. అంచేత ఈ పల్లె కోడూరు అయింది. రైల్వే స్టేషన్ ఉండటంతో రైల్వేకోడూరు అని పేరు వచ్చింది.

అట్లూరు

ఇది మండల కేంద్రం. ఈ పేరు వెనుక చరిత్ర ఒకింత ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. నాగరికత తెలియని రోజుల్లో పచ్చిమాంసం, కూరగాయలు తినే ప్రజలు ఉండేవారు. అలాంటి రోజుల్లో ఓ వ్యక్తి ఇల్లు వదలి బయటకు వచ్చాడు. అతని చేతిలో జింక చర్మం, ఆ చర్మం మీద ఎర్రఎర్రగా కాలి సువాసనలతో కూడిన వేడి అట్టు ఉంది. ఆ అట్టు చూసే వారికి నోరూరుతోంది. అందరూ అతని చుట్టూ గుమిగూడారు. ఎలా చేశావనిఅడిగారు. నిప్పు మీద పలకగా ఉన్న రాయిని పెట్టి ఆ వేడి సెగలో పిండి పదార్థాన్ని పోసి అట్టుగా వేశాడు.ఆ పద్ధతి అందరికీ నచ్చింది. ఈ విషయం అలా అలా వ్యాపించి చికరకు ఈ ప్రాంతం అట్టు ఊరుగా మారింది. లోక వ్యవహారంలో అట్లూరుగా స్థిరపడింది.

కన్నలూరు

ఇది జమ్మలమడుగు మండలంలో ఉంది. పెన్నకు ఉత్తర దిక్కుగా అరణ్యం ఉండేది. ఈ అడవిని నరికి కొందరు కిరాతకులు అక్కడ కుటీరాలు వేసుకుని కాపురాలు చేసేవారు. ఆ పల్లెకు తూర్పున బావిని తవ్వుకున్నారు. ఆ బావిలోని నీరు దివ్యంగా ఉండేది. దేవకన్యకలు ప్రతిదినం సూర్యోదయానికి ముందే ఈ బావిలోస్నానం చేసి వెళ్లేవారు. అప్పుడప్పుడు మనుషులకు కనిపించేవారు. చుట్టూ పొలాలు తయారయ్యాయి. కన్యకలు అక్కడ బావిస్నానానికి వస్తూ ఉండేవారు. అంచేత ఈ గ్రామాన్ని కన్యలూరు అని పిలిచేవారు.

నాగవరం

ఈ గ్రామం చిట్వేలు మండలంలో ఉంది. కోడూరు సమీపంలోని బొమ్మవరం గ్రామానికి తూర్పు దిశలో గుంజన నది ఉత్తరవాహినిగా ప్రవహిస్తూ ఉంది. ఈ ప్రాంతంలో నాగేశ్వరుడనే శివలింగాన్ని ప్రతిష్ఠ చేసి గ్రామం నిర్మించినందున నాగవరం అని పేరు వచ్చింది. ఇక్కడ చెన్నకేశ్వరస్వామి ఆలయాన్ని కూడా నిర్మించారు. నాగం అంటే ఏనుగు అని అర్థం. కుంజరం అన్నా ఏనుగు. ఈ ప్రాంతంలో ఏనుగులు విపరీతంగా సంచరిస్తుండేవి. అంచేత గ్రామానికి కూడా ఏనుగు పేరుమీద నాగవరం అయి ఉంటుందని చెబుతారు. కౌరవపాండవుల రాజధాని ఏనుగు పేరు మీదనే హస్తిపురం, హస్తినాపురం అయింది. అలాగే నాగవరం కూడా అయి ఉండవచ్చునని విద్వాన్ కట్టా నరసింహులు పేర్కొన్నారు.

గువ్వల చెరువు

ఇది రామాపురం మండలంలో ఉంది. కడప సమీపంలో నెలకొని ఉంది. ఇక్కడ ఒక చెరువు ఉంది. అది గోవుల కోసం నిర్మించింది. అయితే ఇప్పుడు ఆ చెరువును గోవుల చెరువు అని పిలుస్తున్నారు. జనవ్యవహారంలో గోవులచెరువు గువ్వలచెరువుగా మారిపోయింది.

దానవులపాడు

ఇది జమ్మలమడుగు మండలంలో, ప్రొద్దుటూరుకు వెళ్ళే దారిలో పెన్నానది ఒడ్డున ఈ గ్రామం ఉంది. దీన్ని కురుమరి అని పిలిచేవారు. జైనులు ఇక్కడ ఒక ఊరు ఏర్పాటు చేసుకోవాలనుకున్నప్పుడు బలిచ్చేం దుకు ఒక గొర్రెను అడగ్గా స్థానికంగా ఎక్కడా దొరక్కపోయేసరికి యాదవులు మా పేరుతో ఈ ఊరు ఉంటే గొర్రెను ఇస్తామని అన్నారు. ఎక్కడ దొరకని పరిస్థితిలో జైనులు వారి దగ్గరే తీసుకొని బలి ఇచ్చి అక్కడ ఊరు నిర్మించారు. దానివలన కురుమరి అనే పేరు వచ్చింది. కురు అనగా గొర్రె అని, అందువలన కురుమని అనే పేరు వచ్చిందని చెబుతారు. మరొక కథనం ప్రకారం వాతాపి, ఇరువుడు అనే ఇద్దరు రాక్షసులు ఉండేవారు. వీరు అన్నదమ్ములు. వీళ్లు మునులను ఇబ్బంది పెట్టేవారని దుర్వాసుడు ఇరువుడిని గొర్రెగా మార్చి ఆహారంగా మునులకు పెట్టారు. వారు

భోజనం అయి కూర్చున్నాక వాతాపి పిలవగానే ఇరువురుడు మునుల పొట్టలను చీల్చుకొని వచ్చి మరల మాములు స్థితికి మారేవాడు. అందుకే భోజనానికి ముందు వాతాపిజీర్ణం అనే తలుస్తూ ఉండటం వల్ల పొట్టలో ఉన్న ఆహారం జీర్ణం అవుతుందని అంటారు. వాతాపి, ఇరువురుడు ఇద్దరు దానవులు ఉన్న ఈ ప్రాంతాన్ని దానవులపాడు అని పిలుస్తారు.

నెమళ్ళదిన్నె

ఇది పెద్దముడియం మండలంలో ఉంది. ఈ ప్రాంతంలో పూర్వం నెమళ్లు విస్తారంగా సంచరించేవి. ఎతయిన ప్రదేశంలో (దిన్నె) ఉండేవి. దీంతో నెమళ్ల పేరుతోనే కొత్తగా ఏర్పాటు చేసుకున్న తమ గ్రామానికి నెమళ్ల దిన్నె అనే పేరు పెట్టారు. దిన్నె ఉత్తర పదంగా వచ్చిన గ్రామాలు తెలుగు రాష్ట్రాల్లో మరికొన్ని కనిపి స్తాయి. గాజులదిన్నె, తొండలదిన్నె, మడాకులదిన్నె వంటివి కనిపిస్తాయి.

ముక్తిరామేశ్వరం

ఇది ప్రొద్దుటూరు మండలంలో ప్రొద్దుటూరుకు 6 కి.మీ ముక్తిరామేశ్వరం ఉంది. శ్రీరామ చంద్రుడు ప్రతిష్టించిన శివలింగం ఉన్నందువల్ల ఈ ప్రాంతానికి రామేశ్వరమని, మార్జాల రూపంలో ఉన్న రావణుని శ్రీరాముడు తన బాణాలచే వధించాడు. ఫలితంగా అతనికి(రావణునికి) ముక్తి అభించినందున ముక్తిరామేశ్వరం అనే పేరు వచ్చింది.

గండికోట

మండలకేంద్రమైన జమ్మలమడుగుకు 15 కి.మీ దూరంలో పెన్నానది ఒడ్డున ఉంది. ఈ నది ఇక్కడ శేషాచలం కొండలను చీల్చుకొని కిందుగా, చాలా లోతుగా ప్రవహిస్తుంది. గండి కొట్టుకుంటూ పెన్నా ముందుకు తోసుకుపోవటం వలన 'గండి' అని పిలిచేవారు. ఈ ప్రాంతంలో కోట నిర్మించినందున గండికోట అని నామకరణం చేశారు. ఈ గండికోటను తొలుత కాకరాజు నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. 'కాకరాజు నిర్మించనో గండికోట' అనే పాటద్వారా ఈ విషయం తెలుస్తోంది. తరువాత అంబదేవరాజులు ప్రతాపరుద్రుడు, సంగమ వంశీయులు, హరిహర రాయులు, బుక్కరాయులు పరిపాలించారు. నల్లసేనపురాయితో ఇక్కడ కోట నిర్మాణం జరిగింది. ఆ గండి ఉన్న ప్రాంతం

ఆసరాగా తీసుకొని శత్రువులు దుర్భేద్యంగా కోట నిర్మించినందువల్ల గండికోట అని పేరు వచ్చింది.

రాయచోటి

ఇది మండల కేంద్రం. దీని అసలు నామం రాచవీడు. కొన్నేళ్లకు రాచవీటికి అనే పేరుతో పిలిచేవారు. రాచవీడు అంటే రాజు నివశించే పట్టణం అని అర్థం. కాలక్రమేణా రాయచోటిగా మారింది. ఇక్కడ వీరభద్ర దేవాలయం ఉంది. ఈ ఆలయ దర్శనార్థం ఉత్సవాల సమయంలో కర్ణాటక నుండి ప్రజలు అధికంగా వస్తారు.

టంగుటూరు

ముందుగా దీన్ని టంగటూరు అని పిలిచేవారు. ఆంగ్లేయుల పరిపాలన తరువాత టంగుటూరుగా మారింది. నాలుగో శతాబ్దం నుంచి ఈ ప్రాంతంలో తమిళ ప్రభావం ఉంది. చోళరాజులు ఈ ప్రాంతాన్ని పరిపాలించేవారు. ఎనిమిదో శతాబ్దం నుంచి బలంగా రాజ్యం ఏలారు. వెల్లూరును పరిపాలించిన చోళులు ఈ ప్రాంతానికి వచ్చారు. ఒక చోళరాజు తన చెల్లెలి కోసం ఒక ఊరు కట్టాడు. ఆమె పేరు టంగకి. ఆమె పేరు మీద టంగటూరు అని కాలక్రమేణా టంగుటూరుగా మారింది. ఇది మండల కేంద్రం.

పులివెందుల

ఇది నియోజకవర్గ, మండల కేంద్రం. ఇది కడపకు 75 కి.మీ దూరంలో ఉంది. ఈ ప్రాంతంలో పులులు ఎక్కువుగా సంచరించేవి. అడపాదడపా ఇక్కడే విందు చేసుకునేవి. అంచేత ఈ ప్రాంతాన్ని పులిమండలం అని పిలిచేవారు. కాలగమనంలో ఇది పులివెందులగా మారింది. మరో కథనం ప్రకారం పులివెంద అనే చెట్లు ఎక్కువుగా ఉన్నందున పులివెందుల అనే పేరు వచ్చినట్టు చెబుతారు. చోళరాజుల్లో రెండోపులకేసి అన్నదమ్ముల గలాటాలో సోదరుడి నుండి తప్పించుకుని కొంత కాలం ఈ ప్రాంతంలో ఉన్నాడు. శ్రీ కృష్ణదేవరాయులు వేయించిన తొలి శాసనం(1509) ఈ పట్టణానికి సమీపంలో ఉన్న శ్రీరంగనాథస్వామి దేవస్థానంలో ఉంది. ఈ నియోజకవర్గం నుంచి వై. ఎస్. జగన్మోహనరెడ్డి శాసనసభ్యునిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

కమలాపురం

ఇది నియోజకవర్గ, మండల కేంద్రం. ఈ ప్రాంతంలో కొలనులు అధికంగా ఉండేవి. అందులో కమల పుష్పాలు ఎక్కువగా ఉండేవి. దీంతో ప్రజలు తమ గ్రామానికి కమలాపురం అని నామకరణం చేశారని ఐతిహ్యం వల్ల తెలుస్తోంది.

సంబటూరు

ఇది కమలాపురం పట్టణానికి సమీపంలో ఉంది. ఇక్కడ చెన్నకేశవస్వామి ఆలయం ఉంది. కడప జిల్లాలో సంపెట వంశీయరాజులు 3 శతాబ్దాలపాటు పరిపాలించారు.ఆ కాలంలో ఈ వంశీయుల పేరుమీదుగా సంపెటూరు అని పిలిచేవారు. కాలక్రమంలో సంబటూరుగా మారింది. స్థలపురాణం వల్ల ఈ విషయం తెలుస్తోంది.

దుగ్గనపల్లి

ఇది వీరబల్లి మండలంలో, జమ్మలమడుగు సమీపంలో ఉంది. ఈ ప్రాంతానికి ప్రకాశం జిల్లా నుంచి దుగ్గిరెడ్డి అనే కాపు అతని సోదరుడు భార్య పిల్లలతో కాడి ఎద్దులతో వచ్చి ఆగుతాడు. ఇక్కడకు దగ్గరలో నివాసం కోసం చూడగా దగ్గరలోని రైతులు ఆయన కోరిన స్థలాన్ని ఇస్తారు. దీంతో అక్కడ నివాసం ఏర్పరుచుకున్నారు. అంచేత దుగ్గిరెడ్డి పేరుతో దుగ్గనపల్లి అనే గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

వల్లూరు

ఇది మండల కేంద్రం. కడపకు సమీపంలో ఉంది. దీంతో పూర్వ నామధేయం త్రైలోక్య వల్లభాపురం. త్రైలోక్యుడు అనే రాజు ఈ ప్రాంతంలో కోటను నిర్మించుకుని పరిపాలన చేసేవాడు. ఈ త్రైలోక్య వల్లభుడు నిర్మించిన గ్రామమైనందున త్రైలోక్య వల్లభాపురం అని పేరు వచ్చింది. జనం వాడుకలో వల్లభపురం అయింది. చివరకు వల్లూరుగా స్థిరపడింది. కాకతీయుల కాలంలో వల్లూరు ప్రగతి సాధించింది.

ఎర్రగుడిపాడు

ఇది కమలాపునం మండలంలో ఉంది. తొలి తెలుగు శాసనాలలో ఒక శాసనం ఇక్కడ లభ్యం అయింది. విజయనగర రాజుల కాలంలో చెన్నకేశవ దేవాలయాలు ఇక్కడ నిర్మాణం అయ్యాయి. ఒకప్పుడు ఇక్కడ జైనుల ఆవాసం ఉందని, అందువలనే పాడు (ఆవాసం) అని ఉంది. మరో కథనం ప్రకారం ఎర్రమాచిరెడ్డి ఒకాయన ఈ ఊరి మీదుగా పుష్పగిరి దర్శనానికి తన కుటుంబంతో బయలుదేరి ఈ ఊరిలో రాత్రికి బస చేయగా మాచిరెడ్డికి కలలో చెన్నకేశవుడు కనిపించి ఇక్కడే ఉండమనగా మాచిరెడ్డి తిరుగు ప్రయాణం ప్రారంభించాడు. బండి కదలక ఆటంకం కలిగింది. దాంతో ఇక్కడ ఉన్న చెన్నకేశవుని ఆలయాన్ని పునరుద్ధరించాడు. కమలాపురం నుండి ఒక మదపుటేనుగు ఇక్కడ ఆలయానికి వచ్చింది. ఆ సమయంలో ఈ మాచిరెడ్డి ఆ ఏనుగుకు పూలు అందించగా అది శాంతిస్తుంది. ఆ కారణంగా ఎర్రమాచిరెడ్డి పేరుమీదనే ఎర్రగుడిపాడు అనే పేరు వచ్చింది.

తాళ్ళపాక

ఇది రాజంపేట మండలంలో ఉంది. తాళ్ళపాక అనగానే అన్నమాచార్యులు, అన్నమాచార్యులు అనగానే తాళ్ళపాక గుర్తుకు వస్తాయి. తాళ్ళపాకకు ఆ పేరు ఎలా వచ్చిందంటే.....ఈ ప్రాంతాన్ని పాకనాడు అని పిలుస్తారు. తాళ్ల అంటే తాటి చెట్లు తాళ వృక్షాల కలపతో, ఆకులతో నాడు పాకల నిర్మించుకొనేవారు. అలా ఏర్పాటైన పల్లె తాళ్లపాక ఇక్కడ అన్నమాచార్యుల గూర్చి ప్రస్తావించాలి. 1408 మే 9న అన్నమాచార్యులు ఈ పల్లెలో జన్మించాడు. తన 8వ ఏట తాళ్లపాక సమీపంలో పొలాల్లో గడ్డి కోయగా వేలు తెగింది. దీంతో భౌతికత పట్ల విరక్తి కలిగి తిరుమల వెంకటేశ్వరస్వామి దర్శనం కోసం బయలుదేరి వెళ్ళాడు. 1424 నుంచి మొదలుపెట్టి 32వేల కీర్తనలు రాశాడు. 1978లో తి.తి.దే తిరుపతిలో అన్నమాచార్య ప్రాజెక్టును స్థాపించింది. తాళ్లపాకలో అన్నమాచార్యుని జయంతి, వర్ధంతులను నిర్వహిస్తోంది. ప్రపంచంలో ఎక్కడా

లేని విధంగా రూ.3.5 కోట్ల వ్యయంతో 108 అడుగుల అన్నమయ్య విగ్రహాన్ని నెలకొల్పారు. అయితే దీన్ని యాత్రాస్థలంగా అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. అయితే త్యాగరాజ స్వామి జన్మస్థలి తిరువయ్యూరును అక్కడి తమిళనాడు ప్రభుత్వం ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడం గమనార్హం. క్రీ.పూ 300 ఏళ్ల కిందట తాళ్లపాక నగరరాజ్యంగా విరాజిల్లినట్టు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం (తిరుపతి) పురావస్తు విభాగం తన పరిశోధనల్లో తేల్చిచెప్పింది.

దొమ్మరనంద్యాల

ఇది జమ్మలమడుగు సమీపంలో ఉంది. దీనిపేరు మొదట నంద్యాల. దొమ్మర కులస్థుల వృత్తి గారడి. ఈ నాడు దీనిని సర్కస్ అనే పేరుతో పిలుస్తున్నారు. వారు ప్రజలను మెప్పించి డబ్బు సంపాదించేవారు. ఒక దొమ్మరివాడు తన ప్రతిభతో చేతులకు చేటలు కట్టి ఆశాశంలో ఎగిరేవాడు. ఒకసారి గండికోటకు రాజైన తిమ్మారాయుడుని దర్శనం చేసుకోవాలని, ఈ గండికోటలోని మాధవదేవరాయపురం దేవాలయం నుండి ఆకాశంలో సంచరించాలని చేతులకు చేటలు కట్టుకొని బయలుదేరాడు. కొంత దూరం పోయాక శక్తి అయిపోయి క్రిందపడి మరణించారు. ఈ విషయం తెలుసుకున్న రాజు ఆ నంద్యాల ప్రాంతాన్ని వారి సామాజిక వర్గం వారికి(దొమ్మర) దానం ఇచ్చాడు. వారి పేరుమీద దొమ్మరనంద్యాల అవతరించింది.

జాండ్లవరం

ఇది మైదుకూరుకు, బద్వేలుకు వెళ్లే దారిలో మధ్యన ఉన్నది. జైనుల నివాసానికి ఈ ప్రాంతం ప్రసిద్ధి. జైనుల మరం అనే పేరు చారిత్రాత్మకంగా వినబడేది. మరం అంటే ఆవాసం అని అర్థం. మర్రిచెట్లు జైనుల నివాసంగా ఉండేవి. ఆ మర్రిచెట్లు వద్ద ఓ గ్రామాన్ని ఏర్పాటు చేసుకునేవారు. వాటిని జైనుల మరం అని పిలిచేవారు. వాడుక భాషలో జైనుల అనే పదం జాండయి, మరం కాలక్రమంలో వరంగా మారింది. చివరకు జాండ్లవరంగా స్థిరపడింది.

పెరినిపాడు

జాండ్లవరానికి సమీపంలో ఉంది. ప్రస్తుతం అదృశ్యమైన గ్రామం ఇది. జనాభా లేకపోయినప్పటికి శిథిలమైన దేవాలయాలు, పురాతనకట్టడాలు ఈ ప్రాంతంలో ఉన్నాయి. దీనికి ఈ పేరు రావటానికి చారిత్రక అంశం ఉంది. హంపిట చిన్నయదేవ మహారాజు ఈ ప్రాంతం నుంచి విజయవాడ సమీపంలోని తమ బంధువుల అమ్మాయిని వివాహం చేసుకోవాలని వెళ్తూ ఈ ప్రాంతంలో మంచినీళ్ల కోసం యాదవులను అడుగుగా వారు నీళ్లు ఇచ్చి కొద్ది సేపు సేదతీరమంటారు. రాజు అక్కడ సేద తీరుతున్న సమయంలో పెడిగడ్డి పైన రెండు పక్షులు సంభాషణ విని నవ్వుతున్న ఇద్దరు యాదవులను రాజు అడుగగా వారు చెప్పలేక మీరు వెళ్తున్న ఆ ప్రాంతంలో గల అమ్మాయి గర్భవతి అని, ఈ ప్రాంతం సమీపంలో గొప్ప నిధి ఉందని అది రాజుకు దొరుకుతుందని వారు తెలియజేయగా రాజు అశ్చర్యపోతాడు. గూఢచారులను విజయవాడకు పంపించగా యువరాణి గర్భవతి అని తెలుస్తోంది. మిగతా రెండు యథార్థమని ఈ ప్రాంతంలో కోట నిర్మించు కోవాలని రాజు తలచి నిధి కోసం చూడగా నిధి దొరుకుతుంది. ఆ నిధితో కోట నిర్మించుకుంటాడు. అయితే రాజుకు పక్షులు సంభాషణ చెప్పిన యాదవుల్లో పెద్దవాడు పేరయ్యనాయుడు అతని పేరుమీద పేరయ్యపాడు అని, కాలక్రమంలో పేరినిపాడుగా మారింది.

బ్రహ్మంగారిమఠం / కందిమల్లయ్యపల్లె

ఇది మండల కేంద్రం. దీని తొలిపేరు కందిమల్లయ్యపల్లె. కంది మల్లయ్య అనే మోతుబరి పేరు మీదుగా కందిమల్లయ్యపల్లె ఏర్పడింది. ఆ తరువాత కాలజ్ఞాని పోతూలూరి వీరబ్రహ్మంగారి ప్రభావంతో అతి గొప్ప మఠం ఏర్పాటైంది. దీంతో కందిమల్లయ్యపల్లె పేరు బ్రహ్మంగారి మఠంగా పేరుపొందింది. కాలజ్ఞానం రచించిన గొప్ప దార్శనికుడు. వీరబ్రహ్మం. సామాన్య ప్రజలకు అర్థమయ్యే సులభశైలిలో తత్వాలు రచించారు. మానవుని వలె జీవితం గడిపి అనేక మహిమలు చూపి అష్టాంగయోగ సాధనలో ఘనాపాఠీగా నిలిచారు. క్రీ.శ 1693లో జీవ

సమాధి అయ్యారు. కులరహిత సమాజానికి, సర్వమానవ సౌభ్రాతృత్వానికి కృషి చేసిన మహానుభావుడు. ఆయన గొప్ప ప్రవక్తగా వాసికెక్కారు. విష్ణువు అవతారమని కొందరు పేర్కొంటారు. డా॥ కొండవీటి వెంకటకవి రాసిన వీరబ్రహ్మేంద్ర సుప్రభాతం ఎంతో ప్రసిద్ధి చెందింది.

నందలూరు

ఇది మండల కేంద్రం. ఈ గ్రామం కడప నుంచి తిరుపతి వెళ్లే మార్గంలో ఉంది. ఇది మండల కేంద్రం. ఇది చెయ్యేరు నది తీరంలో గల గ్రామం. నందులు పాలించిన ఊరు ఇది. తొలుత నందుల ఊరు అని పేర్కొనేవారు. ఆ తరువాత కాలక్రమంలో నందలూరు అయిందని ఒక కథనం వల్ల తెలుస్తోంది. నిరంతరుడు అనే రాజు నదిని ఆనుకొని ఆయన పేరిట నిరంతరపురం అనే గ్రామాన్ని నిర్మించాడు. అయితే ఆ గ్రామం వరదల్లో కొట్టుకుపోయింది. దీంతో ప్రజలు సమీపంలో శేషమాంబపురం గ్రామాన్ని నిర్మించుకున్నారు. కొద్ది రోజులు పోయిన తరువాత ఓ రాజనర్తకి నెలంత ఆ ప్రాంతానికి విహారం కోసం వచ్చింది. ఎప్పటికైన వరదల భయం ఉంటుందని భావించి నదికి కొంచెం దూరంలో నెలందలూరు అనే గ్రామాన్ని నిర్మించింది. ఇదే నలందలూరుగా, నందలూరుగా మారిపోయిందని చెబుతారు. ఈ ప్రాంతంలో ఆడవారిపేర్లతో ఎక్కువుగా ఉండటం విశేషం. రాజంపేట, పుల్లంపేట, ఎల్లమ్మపేట తదితర గ్రామాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలోనే ఆడకూరు అనే గ్రామం కూడా ఉంది.

రాజంపేట/పుల్లంపేట

ఇది మండల, అసెంబ్లీ, లోక్‌సభ నియోజక వర్గ కేంద్రం. కడప నుంచి తిరుపతి వెళ్లే మార్గంలో రాజంపేట ఉంది. మట్టిని రాజులు ఈ ప్రాంతాన్ని పరిపాలించేవారు. ఈ రాజులలో ఒకరైన రాజయ్య పేరుతో రాజయ్య పేట ఏర్పాటైంది. కాలక్రమంలో రాజంపేటగా మారింది. పుల్లమ్మ అనే మహిళ ప్రాబల్యంతో ఏర్పడింది. అలాగే మంగంపేట కూడా ఈ విధంగానే ఏర్పడింది. మంగంపేట బేరటీస్ గనులకు ప్రసిద్ధి చెందింది.

కలశపాడు

ఇది మండల కేంద్రం పోరుమామిళ్ల నుంచి గిద్దలూరు వెళ్లే మార్గంలో ఉంది. కళశం శబ్దం నుంచి కళశపాడు అయింది. కళశం అంటే కుండ. చల్లదనాన్ని, ఆరోగ్యాన్నిచ్చే కళశం పేరుతో ఈ గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నారు. సదాశివరాయలు నాటి శాసనాల ప్రకారం కలశపాడు పాలనా కేంద్రంగా ఉండేది. గ్రామానికి తూర్పుగా చెన్నకేశవ అలయం ఉంది. సమీపంలో ఇందూరు అప్పయ్య మఠం కూడా ఉంది. ఇక్కడ 18వ శతాబ్దం నాటి చర్చి ఒకటి ఉంది. ప్రతి ఏటా ఇక్కడ తిరునాళ్లు నిర్వహిస్తారు.

నల్లచెరువుపల్లి

ఇది వేముల మండలంలో ఉంది. పులివెందుల నుంచి రామిరెడ్డిపల్లికి వెళ్లే మార్గంలో 2కి.మి దూరంలో ఈ గ్రామం ఉంది. శ్రీనాథుడు ఇక్కడ విడిది చేశాడు. సమీపంలో మెగతఏరు ప్రవహిస్తుంది. నల్ల అనే భోగం స్త్రీ ఇక్కడ చెరువు నిర్మించింది. ఆమె పేరుతో ఈ గ్రామానికి నల్లచెరువుపల్లె అనే పేరు వచ్చింది.

నందిమండలం

ఇది మండల కేంద్రం. ఇది కర్నూలుకు 33కి.మి దూరంలో ఉంది. సమీపంలో పాపాఘ్ని అనే నది ఉంది. ఇక్కడి కొండ మీద విశ్వనాథ దేవాలయం ఉంది. తొలుత ఈ గ్రామాన్ని నందిమంగళం అని పిలిచేవారు. కాలగమనంలో నందిమండలంగా మారింది. మరో కథనం ప్రకారం వరాహనంది అనే జైనుడు నివశించినందున ఈ పేరు వచ్చిందని చెబుతారు.

మాచనూరు

ఇది పెండ్లిమర్రి మండలంలో ఉంది. పాపాఘ్ని నదికి దక్షిణ దిశలో నెలకొని ఉంది. ఇక్కడ జాంబవంతుడు ఆశ్రమం నిర్మించుకొని ఉండేవాడని ప్రతీతి. ద్వాపరయుగం తరువాత మాచన అనేవాడు ఆలమంద నిలుపుకొని నివాసం ఏర్పాటుచేసుకొన్నాడు. ఇక్కడి పల్లె మాచన పేరుమీదుగా మాచనపోలు అయింది. ఆతరువాతి కాలంలో ఈ గ్రామాన్ని మాచనూరు అని పిలుస్తున్నారు.

ఇక్కడ గల చెన్నకేశ్వరస్వామి ఆలయం ప్రసిద్ధి చెందింది. తి.తి.దే వారు ప్రకటించిన 29 గేయ సంపుటాల్లో రెండు చోట్ల మాచనూరు చెన్నకేశవస్వామి ప్రస్తావన ఉంది.

ఎల్లాయపల్లి

ఇది ఓబులవారిపల్లి మండలంలో రాజంపేటకోడూరు మార్గంలో ఉంది. ఎల్లాయపల్లి గ్రామం అనగానే అక్కడి చిన్మయారణ్య ఆశ్రమం గుర్తుకు వస్తుంది. అంచేత ఈ గ్రామం పేరు వినని వారు చాలా తక్కువ మందే ఉంటారు. ఇంతకీ ఆ గ్రామానికి పేరు వెనుక గల చరిత్రను పరిశీలిస్తే... నెల్లూరు జిల్లా ఉదయగిరి ప్రాంతం నుంచి ఎలగోడు అనే వ్యక్తి కుటుంబం నుంచి విడువడి ఇక్కడికి వచ్చి చిట్టడవిలో కొంత భాగాన్ని నరకి తాటాకు ఇల్లు వేసుకున్నాడు. జొన్న పంట వేసుకొని జీవించేవాడు. ఆ తరువాత మరికొన్ని కుటుంబాలు ఇక్కడికి వచ్చి ఇళ్లు నిర్మించుకున్నారు. ఎలగోడు తొలి నివాసం ఏర్పాటు చేసుకున్న వ్యక్తి కావడంతో దీనికి ఎలగోడుపల్లి అని పేరు వచ్చింది. జనవ్యవహారంలో ఎల్లాయపల్లి అని స్థిరపడిందని గ్రామానికి చెందిన వృద్ధులు ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు. 1982లో చిన్మయానంద స్వామి శిష్యురాలైన శారదా ప్రియానందస్వామి ఇక్కడ ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ ఆశ్రమానికి స్వామి శీలానంద నిర్వహిస్తున్నారు. ఈ క్షేత్రం నిరంతరం ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పరిమళిస్తూ ధర్మక్షేత్రంగా వర్ధిల్లుతోంది. ఈ ఆశ్రమంలో గొప్ప శివాలయం ఉంది. అలాగే చిన్మయ హరిహర విద్యాలయం, ఆడిటోరియం ఉన్నాయి. సమీపంలో ఆంజనేయస్వామి ఆలయం ఉన్నాంది.

చిన్నమండెం

రాయచోటి నుంచి మదనపల్లె వెళ్ళే మార్గంలో ఇది ఉంది. మాండవ్యనదీ తీరంలో వెలసింది. ఇక్కడ గల లక్ష్మీ నరసింహస్వామి ఆలయం ప్రసిద్ధిగాంచింది. మాండవ్యుడు అనే మహర్షికి ఇద్దరు కుమారులలో చిన్నవాడైన చిన్నమాండవ్యుడు నరసింహస్వామి భక్తుడు. ఆయన పేరు మీదనే ఈ జానపదంలోని క్షేత్రానికి చిన్నమండెం అనే పేరు వచ్చినట్టు ఐతిహ్యం వల్ల తెలుస్తోంది. ముళ్ల పొదలలో

నిక్షిప్తమైఉన్న నరసింహస్వామి విగ్రహాన్ని కనుగొని తీసుకొని వచ్చి ప్రతిష్టించడంతో స్వామికి మండెం నరసింహస్వామి అనే పేరు స్థిరపడింది. ఇక్కడ ఆలయాన్ని 11వ శతాబ్దంలో కులోత్తుంగచోళుడు నిర్మించినట్టు శాసనం వల్ల తెలుస్తోంది.

పెద్దముడియం

ఇది మండల కేంద్రం. ఈ గ్రామాన్ని తొలుత ముడివేము అని పిలిచేవారు. వేము అంటే వేప వృక్షం అని అర్థం. వేపవృక్షాలు ఇక్కడ ఎక్కువగా ఉండేవి. ఆ తరువాత పెద్దముడివేము అని పిలిచేవారు. తర్వాత ముడియం పెద్దముడియంగా మారింది. 1904లో ఈ గ్రామంలో జరిపిన తవ్వకాలలో ఈ ప్రాంతంలో ఆలయం వద్ద భారీగా నాణేలు, వజ్రాలు, బంగారం ఇతరమైనవి లభించాయి.

చెన్నూరు

ఇది మండల కేంద్రం. విజయనగర రాజుల కాలంలో ఇది కొన్ని గ్రామాలకు ముఖ్య పట్టణంగా ఉండేది. ఇక్కడ నుంచి పన్నుల వసూలు చేసేవారు. క్రీ.శ155 నుంచి ఈ ప్రాంతం తాలూకా కేంద్రంగా ఉండేదని కెఫియత్ వల్ల తెలుస్తోంది. దీని తొలి పేరు చెరువునూరు. .చెరువు+ఊరు అని గ్రహించాలి. ఇది తమలపాకులకు ప్రసిద్ధి చెందింది. తమలపాకుల పంటకు అవసరమైన చెరువులు అందుబాటులో ఉండేవి. చెరువూరు క్రమంగా చెన్నూరుగా రూపాంతరం చెందింది. గతంలో ఇక్కడ వజ్రాల వ్యాపారం జరిగేది.

చిలమకూరు

ఇది ఎర్రగుంట మండలంలో, కడప – తాడిపత్రి మార్గంలో ఉంది. కలమల్ల రైల్వే స్టేషనుకు కూతవేటు దూరంలో ఉన్న ఈ గ్రామం అత్యంత ప్రాచీనమైనది. రేనాటి చోళల పరిపాలనా కేంద్రంగా ఉండేది. ఇక్కడ గల అగస్త్యేశ్వరాలయం శిల్ప కళతో ఉట్టి పడుతుంది. ఇక్కడకు సమీపంలోని గల వినాయక విగ్రహం భక్తులను ఆకర్షిస్తోంది. క్రీ.శ. 1442లో ఆంజనేయ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అలాగే విక్రమాదిత్య చోళుని శాసనం లభ్యమైంది. దీన్ని

మద్రాసు మ్యూజియంలో భద్రపరిచారు. దీని తొలి పేరు చిలుంబూరు. ఇది క్రమంగా చిలమకూరుగా మారిందని విద్వాన్ కట్టా నరసింహులు పేర్కొన్నారు. చిరుంపూరు క్రమంగా చిలమకూరుగా కూడా మారి ఉండవచ్చుననే వాదన కూడా ఉంది. చిరుంపూరు అంటే చిన్న పట్టణం అని అర్థం చేసుకోవచ్చు.

రామవరప్పాడు

చోళ రాజులు ఇక్కడ రామేశ్వరాలయాన్ని నిర్మించారు. దీంతో ఈ గ్రామానికి రామవరప్పాడు అనే పేరు వచ్చినట్టు విద్వాన్ కట్టా నరసింహులు తాను రాసిన కైఫియత్ కతలు అనే పుస్తకంలో రాశారు.

మంగంపేట పెనుబాలపట్నం

మంగంపేట కోడూరు మండలంలో ఉంది. మట్లరాజు తసతల్లి మంగమ్మపేరుతో ఈ గ్రామాన్ని నిర్మించాడు. ఈ గ్రామం ముగ్గురాళ్ల గనులకు ప్రపంచంలోనే ఎంతో ప్రసిద్ధి చెందింది. మనదేశంలో 98శాతం ఉత్పత్తులు ఇక్కడి నుంచే జరగడం విశేషం. ఈ గ్రామం పెనుబాలపట్నం స్థానంలో ఏర్పడినట్టు విద్వాన్ కట్టా నరసింహులు తెలిపారు. తిరుమలకు ఉత్తర దిశగా ఉన్న అటవీ ప్రాంతంలో మూడు తలలు కలిగిన కొండచిలువ తిరుగుతుండేది. పటమటి ప్రాంతం నుంచి తిరుమలకు వచ్చే యాత్రికులు ఈ ప్రాంతంలో ఆగి విశ్రాంతి తీసుకొనేవారు. అక్కడే భోజనం చేసి తిరిగి తిరుమలకు బయలుదేరి వెళ్తుంటారు. ఆ స్థలంలో సంచరిస్తున్న మహాసర్పాన్ని చూసి యాత్రికులు భయపడేవారు. ఈ విషయం అందరికీ తెలిసిపోయింది. మరికొన్నాళ్లకు ఆ సర్పం కాలధర్మం చెందింది. మహాసర్పం ఈ ప్రాంతంలో ఉండేది కనుక ఆ సర్పం పేరే 'పెనుబాముల' అని తమ ఊరికి పేరు పెట్టుకున్నారు. ఈ పల్లె మరి కొన్నాళ్లకు పట్నంగా మారింది. చివరకు పెనుబాలపట్నంగా రూపాంతరం చెందింది. నల్లసిద్ధదేవ మహారాజు ఈ ప్రాంతానికి రాజుగా ఉన్నప్పుడు పెనుబాలపట్నంలో విడిది చేశాడు. ఇక్కడ చెన్నకేశవ దేవాలయం కట్టించాడు. పెనుబాల కొందరికి ఇంటి పేరుగానూ,

మరికొందరికి గోత్రంగానూ ఉంది. అయితే పెనుబాలపట్నంలోని స్థానిక ప్రభువులు విజయనగర సామ్రాజ్యాధీశుడు సాళువ నరసింహరాయులపై తిరుగుబాటు చేశారు. దీనికి ప్రతిగా అక్కడ గల కోటను, గ్రామాన్ని సాళువ నరసింహరాయులు ధ్వంసం చేసాడు. దీంతో ఆ గ్రామం అంతరించిపోయింది. దీని స్థానంలో మంగంపేట వెలసింది.

నరసాపురం / కాశినాయన మండల కేంద్రం

నరసాపురం మండల కేంద్రం. అయితే మండల. కేంద్రం పేరు నరసాపురంతో కాకుండా శ్రీ అవధూత కాశినాయన పేరుతో ఉండడం విశేషం. పోరుమామిళ్లకు వాయువ్యదిశలో ఉంది. అవధూత కాశిరెడ్డినాయన ఈ ప్రాంతంలో శిథిలమైన ఎన్నో ఆలయాలను పునరుద్ధరించాడు. ముఖ్యంగా నెల్లూరు జిల్లాలోను, కర్నూలు జిల్లాలోను అహోబిలం, శ్రీశైలం ప్రాంతాల్లోని ఎన్నోపాడుబడిన ఆలయాలను బాగుచేయించారు. ఈయన పోరుమామిళ్ల ప్రాంతీయుడు. అనేక దేవాలయాల్లో నిత్యాన్నదానాన్ని ఏర్పాటు చేసిన ఘనత ఆయనకే దక్కుతుంది. తనకు ఎవరైనా బోధనలకు, భోజనానికి ఆహ్వానిస్తే తనతో వచ్చిన వారికి ఆతిథ్యం ఏర్పాటు చేస్తేనే వెళ్ళేవారు. అన్నింటికి మించి నరసాపురం సమీపంలోనే ఉన్న నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న జ్యోతి(నరసింహక్షేత్రం)ని అన్ని విధాల అభివృద్ధి చేశాడు. ఈ క్షేత్రాన్ని సందర్శించేందుకు కడప జిల్లా వాసులే కాకుండా సమీప జిల్లాల భక్తులు కూడా వస్తుంటారు. అంచేతనే ఈ మండలానికి శ్రీ అవధూత కాశినాయన అనే పేరును పెట్టారు. 1995లో కాశినాయన జ్యోతి క్షేత్రంలో పరమపదించారు. అవధూతను 1990 దశకంలో తాను స్వయంగా కలిసినట్టు విద్వాన్ కట్టా నరసింహులు పేర్కొన్నారు. అయితే నరసాపు రానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే నరసయ్య అనే వ్యక్తి నామధేయంతో ఏర్పడింది.

కర్నూలు జిల్లా

కర్నూలు

ఇది జిల్లా కేంద్రం, రాయలసీమ ముఖద్వారంగా ఉంది. 1953 అక్టోబర్1న ఆంధ్రరాష్ట్ర రాజధానిగా ఏర్పాటై ఓ వెలుగు వెలిగింది. ఇక్ష్వాక రాజులలో మొదటివాడైన బాహుబల శాంతములూని కాలంలో మహాతలవర స్కందనాధుడు ఈ పట్టణాన్ని నిర్మించాడు. ఆయన పేరుమీదుగా ఈ పట్టణానికి స్కందనప్రోలు అని నామకరణం చేశారు. స్కందనప్రోలు కాలగమనంలో కందనవోలుగా మారింది. ఆ తరువాత కర్నూలుగా స్థిరపడిందని చెబుతారు. స్కందన అనేది సంస్కృత శబ్దం. కాలగమనంలో కందనగా ఆపై కర్నూలుగా మారింది. మహబూబ్‌గర్ జిల్లాలోని నాగర్‌కర్నూలును సైతం స్కందనాధుడే నిర్మించిన విషయాన్ని గుర్తుకు తెచ్చుకోవాలి. మరో కథనం ప్రకారం క్రీ.శ11వ శతాబ్దంలో ఆలంపూర్‌లో కడుతున్న ఆలయం కోసం బండ్లమీద ఇసుకను, రాళ్లను తరలించే క్రమంలో ఈ ప్రాంతంలో నదిలోకి బండ్లు దిగేముందు బండి చక్రాల ఇరుసుకు కందెన రాయడానికి ఆపేవారట. దీనివల్ల ఈ ప్రాంతానికి కందెనవోలు అనే పేరు వచ్చింది. అదే రానురాను కర్నూలుగా రూపాంతరం చెందింది. కందెన రాయించుకునే ఈ ప్రదేశం పేరు బండ్లమెట్ట కాగా ఇప్పటికీ బండిమెట్ట అని వ్యవహరించే ప్రదేశం పాతనగరంలో ఉంది. క్రీ.శ.1775లో ఆధ్యాత్మ రామాయణాన్ని రచించిన పెద్దన సోమయాజీ కందెనవోలు అనే పదం వాడారు. కైఫియత్‌ల్లో కందనోలు, కందనూలు అనే పేర్లు కనిపిస్తున్నాయి. అయ్యలరాజు నారాయణకవి తన హంసవింశతిలోని గ్రామనామాల జాబితాలో కందనూలు ఒకటి.

కొండారెడ్డిబురుజు

ఇది కర్నూలు ప్రజల ఆత్మగౌరవానికి నిదర్శనంగా నిలుస్తుంది. రాయలసీమ ముఖద్వారంగా ప్రసిద్ధిగాంచిన కర్నూలుకు వన్నె తెచ్చిన ఎరర్రాతి కట్టడం ఇది. కొండారెడ్డి బురుజును విజయనగర సామ్రాజ్యానికి చెందిన

అచ్యుతదేవరాయలు నిర్మించినట్టు పేర్కొంటారు. ఈ బురుజు కర్నూలుకు రక్షణ కవచం లాంటిదని అంటారు. అలంపూరు చివరి పాలకుడైన కొండారెడ్డి (1597-1643) గోల్కొండ రాజుల సామంతరాజైన కర్నూలు నవాబును పలుసార్లు ఓడించాడు. అయితే యుద్ధం చిరకాలం కొనసాగింది. కొండారెడ్డి చివరకు పట్టుబడి బురుజుకు అనుబంధంగా ఉన్న జైలులో నిర్భంధానికి గురయ్యాడు. అయితే అతడు కోట నుంచి తుంగభద్ర వరకూ సొరంగ మార్గం తవ్వాడు. ఈ మార్గం నుంచి బయట పడ్డాడు. ఏమైనప్పటికీ ఈ బురుజు కొండారెడ్డి పేరుతోనే ప్రసిద్ధమైంది.

నంద్యాల

నంద్యాల డివిజన్, మండల కేంద్రం. నందిక్షేత్ర పాలకుడైన బ్రహ్మానందీశ్వరుడు కేంద్రస్థానంలో ప్రథమ నంది, నాగనంది, సూర్యనంది, సోమనంది, మహానంది, విష్ణునంది, శివనంది, గరుడనంది, కృష్ణనంది అనే నవనందులను నందుల చక్రవర్తి ప్రతిష్ఠించారు. అంచేత ఈ ప్రాంతానికి నందుల సముదాయమని పేరు వచ్చింది. ఆంగ్లేయులు దీనిని నంద్యాలగా పిలిచేవారు. అదే చివరకు స్థిరపడింది. నేటికీ జానపదులు పాడుకొనే భజనగేయాల్లో "నవనంది నంద్యాల"అని పాడు కోవడాన్ని గమనించవచ్చని డా॥డి గాయత్రి ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు. నంద్యాలకు భారత రాజకీయాలలో విశిష్టమైన స్థానం ఉంది. ఒక రాష్ట్రపతిని, ఒక ప్రధానమంత్రిని అందించిన ఏకైక లోక్‌సభ నియోజకవర్గంగా ప్రాచుర్యం పొందింది. నంద్యాల స్థానికులు కానప్పటికి నీలం సంజీవరెడ్డి రాష్ట్రపతిగా, పి.వి.నరసింహారావు ప్ర ధానమంత్రిగా పోటీ చేసి రికార్డు స్థాయి ఆధిక్యతతో గెలిపొందారు. నంద్యాలకు పూర్వం నందియాల అని కూడా పిలిచేవారు. ఐ.బీ.పి.ఎస్ శిక్షణ కోసం రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అభ్యర్థులు ఇక్కడి శిక్షణకేంద్రానికి వచ్చి తర్ఫీదుతీసు కొని జయకేతనం ఎగరేస్తున్నారు.

పంచలింగాలు

ఇది కర్నూలు మండలంలోని ఒక గ్రామం. ఈ పల్లెలోని పంచలింగేశ్వ రాలయంలో పంచలింగాలు ఉన్నందువల్ల ఈ గ్రామానికి పంచలింగాలు అని పేరును ఆ రోజుల్లో పెట్టినట్టు స్థలపురాణం వల్ల తెలుస్తోంది.

డోన్

ఇది పెద్ద రైల్వే కూడలి. మండల కేంద్రం. డోన్‌కు పూర్వనామం ద్రోణాచలం. ఈ గ్రామానికి సమీపాన గల కొండపై మహా విలువిద్యకారుడు ద్రోణుడు తపస్సు చేశాడు. అతని పేరుమీదనే ద్రోణాచలం అని పేరు వచ్చింది. ఇతను అర్జునున్ని గొప్ప విలువిద్యకారునిగా తీర్చిదిద్దాడు. మహాభారతంలో ద్రోణాచార్యుని పాత్ర కీలకమైనది. నేడు కేంద్రప్రభుత్వం క్రీడల్లో ఘనాపాఠీలకు ద్రోణాచార్యుని పేరుమీదుగానే పురస్కారాలను అందజేస్తున్నారు. ఆంగ్లేయులు ద్రోణాచలం పేరును పిలవలేక డోన్ అని పిలిచేవారు. డోన్‌కు మదనపల్లెగా పిలిచేవారని మరో కథనం ప్రచారంలో ఉంది.

శ్రీశైలం

శ్రీశైలం ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటి. ఇది దక్షిణ కైలాసంగా వాసికెక్కింది. "శ్రీశైల శిఖరం దృష్ట్వా పునర్జన్మ నవిద్యతే" అంటారు. శ్రీశైలం వెళ్లిన వారికి జ్యోతిర్లింగం, శక్తి పీఠం దర్శనమిస్తాయి. ఈ క్షేత్రం ఒకటవ శతాబ్దం నాటి నుంచి ప్రసిద్ధి కెక్కింది. శాతవాహనులు, విష్ణుకుండినులు, రాష్ట్రకూటులు చాళుక్యులు,చోళులు, కాకతీయులు, కొండవీటి రెడ్డిరాజులు, విజయనగర రాజులచే సేవలందుకున్న దివ్యక్షేత్రం. తొలుత శ్రీశైలాన్ని సిరిధాన్ అని పిలిచేవారు. శాతవాహన రాజు పూలమావి "నాసిక్" గుహలలో చెక్కించిన ఓ శాసనంలో సిరిధాన్ గూర్చి ఉంది. 3వ శతాబ్దంలో ఇక్ష్వాకుల కాలంలో సిరిధాన్‌ను శ్రీగిరిగా పిలిచారు.ఆ తరువాత శ్రీశైలంగా రూపాంతరం చెందింది. ఇక ఇతిహాసపరంగా చూస్తే పూర్వం శిలాదుడనే మహర్షిసంతానం కోసం పరమేశ్వరున్ని తపస్సు చేశాడు. అతని తపస్సుకు మెచ్చి శివుడు ప్రత్యక్షమై వరాలు కోరుకోమనగా స్వామి నీకు భక్తులై ఉండే ఇద్దరు పుత్రులను ప్రసాదించమని కోరాడు. వర ప్రభావంతో ఈ దంపతులకు ఇద్దరు కుమారులు పుట్టారువారి పేర్లు నంది, పర్వతుడు. వారిద్దరు కూడా ఈశ్వరుని కొరకు తపస్సు చేశారు.

పరమేశ్వరుడు ప్రత్యక్షమయ్యాడు. ముందుగా నంది వరం కోరుతూ నీవు ఎల్లప్పుడూ నాపై పవళించి ఉండాలి. నిన్ను నేను మోసే భాగ్యాన్ని కలిగించాలని కోరాడు. అతని కోరికగా శ్రీశైలానికి 200కి.మీ దూరంలో మహానంది రూపాన్ని పొందాడు. అప్పటి నుంచి శివుని వాహనంగా మారాడు. తరువాత పర్వతుడు వరం కోరుతూ నేను పర్వత రూపం దాల్చి తనపై శాశ్వతంగా నివశించాలని కోరాడు. దీంతో 'శ్రీ' పర్వత మనేపేరు తో పర్వతున్ని రూపొందించి దానిపై శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకున్నాడు. ఈ పర్వతమే శ్రీపర్వతమని శ్రీగిరి అని ఆ తరువాత శ్రీశైలంగా స్థిరపడింది. శ్రీశైలంపై వెలిసిన భ్రమరాంబ, మల్లికార్జునుడు నిత్య పూజలు అందుకొంటున్నారు. ప్రతీ ఏటా మహాశివరాత్రికి చేనేతకార్మికులు మల్లికార్జునునికి తలపాగా, భ్రమరాంబకు చీరలను సమర్పిస్తుంటారు. ఆంధ్రదేశాన్ని త్రిలింగ దేశమని పిలువ డానికి శ్రీశైలక్షేత్రం కారణం. శ్రీశైల, భీమేశ్వర, కాళేశ్వర లింగాలనే క్షేత్రాలు ఉండటం వల్ల ఆంధ్ర త్రిలింగ దేశమనే పేరు వచ్చింది. అయితే కాళేశ్వరం రాష్ట్రవిభజనలో (2014) తెలంగాణాలోకి వెళ్ళింది. కృత, త్రేతా, ద్వాపర, కలి యుగాలకు సంబంధించిన దివ్య చరిత్ర ఉన్న క్షేత్రం శ్రీశైలం.

మహానంది

ఇది మండల కేంద్రం. కర్నూలు జిల్లా నంద్యాలకు 14కి.మీ దూరంలో ఉంది. ఈ ఊరికి అనుకొని పరిసరాలలో 15 కి.మీ పరిధిలో నవ నందులు (9నందులు) ఉన్నాయి. అన్నింటిలోకి ఈ ఊరిలో ఉన్న ఆలయం ముఖ్యమైనది. దీంతో ఈ క్షేత్రానికి మహానంది అనే పేరు వచ్చింది. ఇది గొప్ప శైవక్షేత్రం. ఇక్కడ గల మహానందీశ్వరుడు, అమ్మవారు కామేశ్వరిదేవిగా కొలువై ఉన్నారు.

సంజామల

ఇది మండల కేంద్రం. పూర్వం రాజులు, చక్రవర్తులు, దండయాత్రల సందర్భంగా సంధ్యా సమయంలో కాకులు దూరని కారడవిలో విడిది చేసేవారు. అంచేత ఈ ప్రాంతానికి సంజామల అనే పేరు వచ్చింది. అయితే క్రమంగా జనవ్యవహారంలో సంజామలగా మారింది. అదే స్థిరపడింది.

వెలుగోడు

ఇది మండల కేంద్రం. పూర్వం ఇది దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో ఎలుగుబంట్లు ఎక్కువగా ఉండేవి. అయితే కాలక్రమంలో అటవీ ప్రాంతం అదృశ్యమై అక్కడ ఓ గ్రామం ఏర్పడింది. అయినప్పటికి ఎలుగుబంట్లు బెడద ఎక్కువుగా ఉండటంతో ఎలుగువాడగా మారింది. జనవ్యవహారంలో వెలుగోడుగా పరిణమించింది.

కోవెలకుంట్ల

ఇది మండల కేంద్రం. ఈ గ్రామంలో పాండురంగ విఠలేశ్వర ఆలయం ఉంది. ఇది చాలా పురాతన ఆలయంగా ప్రసిద్ధి చెందింది. క్రీ.శ. 13వ శతాబ్దంలో కాకతీయ ప్రభువుల కాలంలో కోయిల పేరుగల నాట్యగత్తె కలలో పాండురంగస్వామి కనిపించి ఆ ప్రదేశంలో తనకు ఓ ఆలయాన్ని నిర్మించాలని ఆదేశించారు. ఆ స్వామివారి ఆనతి మేరకు ఇచ్చట ఆలయాన్ని నిర్మించింది. పాండురంగ విఠలేశ్వర సాలగ్రామ విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్టు ఐతిహ్యం వల్ల తెలుస్తోంది. ఈ స్వామికి ధూప, దీప, నైవేద్యాలకు కొన్ని భూములను దానం చేసి ఈ ఆలయ అభివృద్ధికి ఎంతో ఆమె కృషి చేసింది. అందువల్ల ఆమె పేరుతో కోయిలకుంట్లగా మారింది. కుంట అంటే కొలను అని అర్థం. ఈ ప్రాంతంలో ఓ కొలను ఉండేది. దీంతో కోవెల కొయిల అయింది. కుంట్ల అంటే కొలను అని అర్థం. చివరకు కోవెలకుంట్లగా స్థిరపడింది. తూర్పు ముఖంగా ప్రవేశ ద్వారం గల ఈ ఆలయానికి దక్షిణదిశలో ఆళ్వార్ల విగ్రహాలు ఉత్తర వైపున లక్ష్మీదేవి ఆలయం ఉన్నది. క్రీ.శ.1571, 1573, 1584 సంవత్సరాల నాటి శాసనాలు ఈ ఆలయ వైభవాన్ని తెలియజేస్తున్నాయి.

రుద్రకోడూరు

ఇది ఆత్మకూరు మండలంలో ఆత్మకూరుకు 20 కి.మీ దూరంలో నంద్యాల మార్గంలో 4 కి.మీ ప్రయాణించి నల్లకాలువ గ్రామాన్ని చేరుకోవచ్చు. అక్కడి నుండి 16కి.మీ అడవిలో ప్రయాణించి రుద్రకోడూరు చేరుకోవచ్చు.ఇక్కడ అతి ప్రాచీనమైన రుద్రకోటీశ్వరాలయం ఉంది. ఈ ఆలయానికి సమీపంలో కోడూరు

అనే చెంచుగూడెం ఉంది. రుద్రకోటీశ్వరాన్ని రుద్రకోడూరు అని పిలుస్తారు. ఇక్కడ పుణ్యతీర్థంలో స్నానం చేసి రుద్రకోటీశ్వరుని దర్శిస్తే ముక్తి, మోక్షం లభిస్తాయని భక్తుల విశ్వాసం. కోడూరు అనేది జలసూచి. ఈ ఆలయానికి ఎదురుగా రెండు కోనేరులు ఉన్నాయి. వేసవిలో కూడా పుష్కలంగా నీరు ఉంటుంది.

వీరారెడ్డిపల్లె

ఇది శిరివెల్ల మండలంలో ఉంది. ఇది మండల కేంద్రం కాకపోయినప్పటికీ ఎంతగానో అభివృద్ధి చెందిన గ్రామం. 2011 జనాభా లెక్కల ప్రకారం 3282. వీరారెడ్డిపల్లె వ్యక్తి నామధేయ ప్రాతిపదికపై ఏర్పడింది. ఇక్కడ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, శ్రీలక్ష్మీ చెన్నకేశవ, వీరభద్ర ఆలయం, లింగమయ్యస్వామి ఆలయాలు ఎంతో ప్రసిద్ధి చెందాయి.

బనగానపల్లె

ఇది మండల కేంద్రం. బనగానపల్లె జుర్రేరు ఏటి గట్టున ఉంది. ఈ గ్రామానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే.... ఈ గ్రామం ఏర్పాటు కాక ముందు ఉన్న ప్రాంతంలో బంగినపల్లి రకాల మామిడి చెట్లు విస్తారంగా ఉండేవి. దీని పేరుతోనే బంగినపల్లి అనే పేరు వచ్చింది. లోక వ్యవహారంలో క్రమంగా బనగానపల్లె అనే పేరు స్థిరపడినట్టు ఈ ప్రాంతానికి చెందిన పలువురు పండితులు పేర్కొంటున్నారు. కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మం ఇక్కడే గల రవ్వలకొండ వద్ద తపస్సు చేశారు. 25ఏళ్ళ పాటు ఇక్కడే నివశించారు. గరిమరెడ్డి అచ్చమాంబ, వెంకటరెడ్డి వారింట బ్రహ్మంగారు పశువుల కాపరిగా ఉండేవారు. ఇక్కడ వారికి ఎన్నో మహిమలు చూపారు. వీరు అచ్చమాంబకు, వెంకటరెడ్డికి జ్ఞానోపదేశం చేశారు.

యాగంటి

ఇది బనగానపల్లె మండలంలో ఉంది. బనగానపల్లి నుంచి 15 కి.మీ దూరంలో ఎర్రమల కొండలలో వెలసిన యాగండంలో శ్రీ ఉమామహేశ్వర దేవస్థానం ఉంది. ఈ ఆలయంలో ఉమామహేశ్వరులు స్వయంభువుగా వెలిశారు. ఈ ఆలయంలో ఆదిదంపతులైన శివపార్వతులు ఒకే శిలలో దర్శనమిస్తారు.

క్రీ.శ14వ శతాబ్ద కాలంలో విజయనగర సామ్రాజ్య సంగం వంశపు రాజు మొదటి హరిహర బుక్కరాయులు, మొదటి బుక్కరాయులు నిర్మించినట్టు ఆధారాల వల్ల తెలుస్తోంది. వైష్ణవ సంప్రదాయాల ప్రకారం ఈ ఆలయంనిర్మితమైంది. పూర్వం ఆగస్త్య మహర్షి యాగంటి ప్రాంతంలో పర్యటించి శ్రీనీలకంఠేశ్వర స్వామికి ఆలయాన్ని నిర్మింపజేశారు. వెంకటేశ్వరుని శిలావిగ్రహం రూపొందించే సమయంలో స్వామి వారి బొటనవేలి గోరు విరిగిపోయింది. ఎందుకు ఇలా జరిగిందని ఆగస్త్యుడు శివుని కోసం గొప్ప తపస్సు చేశాడు. మధ్యలో కాకులు అతని ఏకాగ్రతను భంగం చేశాయి. దీంతో అగస్త్యుడు శపించాడు. ఈ ప్రాంతంలో కాకులు తిరగ కూడదని ఆగ్రహంతో శాపం ఇచ్చాడు దీంతో అప్పటి నుంచి ఒక్క కాకి కూడా ఇక్కడ కనిపించదు. అగస్త్యుడి తపస్సుకు మెచ్చి పరమేశ్వరుడు ప్రత్యక్షమై మహర్షీ! వేంకటేశ్వరుని విగ్రహం గూర్చి చింతించవద్దు. ఇక్కడ నేను ఉమాసమేతుడునై ఏకశిలపై వెలిసి భక్తులను కాపాడుతానని అన్నాడు. దీంతో అగస్త్యుడు సంతోషం తో 'నేగంటి' అనే కీర్తన పాడుతూ నృత్యం చేశాడు. అందువలన ఈ క్షేత్రానికి నేగంటి అనే పేరు వచ్చింది. జనవ్యవహారంలో యాగంటిగా మారింది.

మంత్రాలయం

ఇది కర్నూలుకు 80కి.మీ దూరంలో ఉంది. తుంగభద్రానది ఒడ్డున వెలసిన మహిమాలయం ఇది. ఇక్కడ ఎంతో మంది మహాయోగులు, జ్ఞానులు తపస్సు చేసి మంత్రసిద్ధి పొందారు. దీంతో ఇది మంత్రాలయంగా ప్రసిద్ధికెక్కింది. ఈ దివ్య క్షేత్రంలో శ్రీగురు రాఘవేంద్రస్వామివారు అనేక ఆధ్యాత్మిక గ్రంథాలకు వ్యాఖ్యానాలు రాసి జ్ఞానభక్తిని ప్రబోధించారు. ఆయన ఇక్కడే జీవ సమాధి పొందారు. ఈ సమాధిని "రాఘవేంద్ర బృందావనం" అని పిలుస్తారు. బృందావనం వెలసిన చోట భక్త ప్రహ్లాదుడు యజ్ఞం చేశాడని, అతడే కలియుగంలో రాఘవేంద్రస్వామిగా జన్మించినట్టు స్థలపురాణం వల్ల తెలుస్తోంది. ప్రతి ఏటా శ్రావణ బహుళ ద్వితీయనాడు "ఆరాధన" ఉత్సవం జరుగుతుంది. జమదగ్ని సతీమణి రేణుకాదేవి మంచాలదేవతగా ఇక్కడ అవతరించింది. ఆమె పేరు మీదుగా ఈ గ్రామానికి మంచాల అనే పేరు వచ్చింది. ఈ మంచాల గ్రామమే మంత్రాలయక్షేత్రంగా ప్రసిద్ధికెక్కింది.

కోడుమూరు

ఇది మండల కేంద్రం. మంత్రాలయం నుంచి కర్నూలు వెళ్ళే మార్గంలో ఉంది. హంద్రీనది పరీవాహక ప్రాంతంలో నెలకొని ఉంది. ఇందులో కోడు జలసూచిక. జలసూచిక ఉన్న ప్రాంతాల్లో హెచ్చువాటికి గ్రామనామాల్లో పూర్వ లేదా ఉత్తర పదంగా కనిపిస్తుంది. ఇక్కడ గల వల్లెమ్మ దేవాలయం హంద్రీనదికి సమీపంలోనే ఉంది. ఇది వస్త్ర, జౌళి పరిశ్రమల వాణిజ్యకేంద్రంగా పేరు పొందింది.

చాగలమర్రి

ఇది మండల కేంద్రం. చాగలమర్రి ఈ గ్రామానికి తొలిపేరు త్యాగాలమర్రి కాలక్రమంలో చాకలమర్రి, చాగలమర్రిగా మారినట్టు స్పష్టం అవుతోంది. ఈ గ్రామం కర్నూలు, కడప జిల్లాలకు సరిహద్దుల్లో వెలిసి ఉంది. స్వాతంత్ర్య సమరంలో అల్లూరి సీతారామరాజును మోసగించి దారుణంగా హతమార్చిన బాష్టియన్ దొర కర్నూలు, కడప ప్రాంతాలకు కలెక్టర్‌గా ఉండేవాడు. ఆ సమయంలో ఆ పరిసర ప్రాంతాలకు చెందిన తిరుగుబాటు దారులైన అనేక మందిని చాగలమర్రి ప్రాంతంలో చెట్టుకొమ్మకు కట్టి ఉరితీయించారు. ఆనాటి త్యాగాలకు మౌనసాక్షిగా చాగలమర్రి నిలుస్తుంది.

ముచ్చుమర్రి

ఈ గ్రామం పగిడ్యాల మండలంలో ఉంది. ముచ్చు అంటే దొంగ అని అర్థం. పూర్వం ఈ పల్లె నుండి సంగమేశ్వరానికి వెళ్లే దారిలో ఒక మర్రిచెట్టు ఉండేది. కాలినడకన ప్రయాణం చేసే ప్రజలు ఈ చెట్టు క్రింద కాసేపు సేద తీరేవారు. అక్కడ దొంగలు ఆ ప్రజలను దోపిడి చేసేవారట. ఈ విధంగా మర్రిచెట్టు వద్ద విశ్రాంతి తీసుకోవడానికి వచ్చే ప్రజలను దొంగలు దోచుకోవడం కారణంగా ఈ గ్రామం ముచ్చుమర్రి అని పేరు వచ్చించది.

నందికొట్కూరు

ఇది మండల కేంద్రం. క్రీ.శ. 13వ శతాబ్దం ప్రాంతంలో ఇనాముగా పొందిన నర్సింగదేవుడు హయాంలో శ్రీసూర్యనారాయణాస్వామి ఆలయానికి

కుడి భాగంలో భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి, వీరభద్రస్వామి ఆలయానికి కాకతీయ శిల్ప నిర్మాణపద్ధతుల్లో నిర్మించారు. ఆ తరువాత తన ప్రభువైన ప్రతాపరుద్రుడి అనుమతితో శైవ సంప్రదాయ విధానంలో నవనందులు పరివృత్తంగా చుట్టూ తొమ్మిది నందుల స్థూపాన్ని నిర్మించాడు. అప్పుడు ఈ ప్రాంతాన్ని నవనందికొట్కూరుగా పిలిచేవారు. జనవ్యవహారంలో అది నందికొట్కూరుగా మారింది.

దీబగుంట్ల

ఇది గోస్పాడు మండలంలో ఉంది. ఈ గ్రామానికి తొలిపేరు దేవుడిగడ్డ. ఈ గ్రామీణులలో ఒకరికి వీరభద్రస్వామి స్వప్నంలో కనిపించి తన విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని కోరినట్టు చెబుతారు. దీంతో ఈ గ్రామంలోని మల్లిఖార్జున స్వామి ఆలయంలో ఆ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దేవుని ఆదేశంపై వెలిసినందువలన దేవునిగడ్డగా మారింది. కాలగమనంలో దీబగుంట్లగా మారింది.

పత్తికొండ

ఇది మండల కేంద్రం. స్థానిక కైఫియత్ ప్రకారం ఒక గొర్రెలకాపరి అడవిని నరికి ఈ ప్రాంతంలో పత్తిని పండించడం ప్రారంభించాడు. ఈ ప్రాంతంలో పంటలు బాగా పండటంతో ఇతర ప్రాంతాల వారు కూడా ఇక్కడికి చేరారు. దీంతో ఈ గ్రామం ఏర్పడింది. విజయనగర యువరాజైన కోనేరు రాజు వంశీయుడు వెంకటరాజు జాగీరు పొందాడు. గ్రామాన్ని సమీపంలోని కొండమీదకు తరలించారు. పత్తికొండ అని పేరు వచ్చింది.

ఆళ్ళగడ్డ

ఇది మండల కేంద్రం. దీని తొలినామం ఆవులగడ్డ. ఆవులగడ్డయే కాలక్రమంలో ఆళ్ళగడ్డగా మారిందని ఐతిహ్యం వల్ల తెలుస్తుంది. ఈ గ్రామం కళలకు, శిల్పాచార్యులకు ప్రసిద్ధి. ఇక్కడ విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన దిరిగడ్డ బాలవీరాచారి (1926-1986) మహాశిల్పి బిరుదాంకితులు, వీరికి 1975లో హైదరాబాదులో జరిగిన ప్రపంచ తొలి తెలుగుమహాసభలలో సత్కరించారు.

బండిఆత్మకూరు

ఇది మండల కేంద్రం. 19వ శతాబ్ది తొలి భాగంలో ఈ గ్రామానికి బండాతుకూరుగా పేరు ఉండేది. కాలక్రమేణా బండి ఆత్మకూరుగా మారింది. ఈ పేరు వెనుక ఆసక్తిదాయక కథనం ఉంది. కొన్నేళ్ళ కితం ఓ పెద్ద భూస్వామి కుటుంబంలో యువ వితంతువు ఉండేది. ఆమె ఎంతో అందంగా ఉండేది. ఒకరోజు భిక్షాటనకు వచ్చిన సాధువు ఆమెను వలలో వేసుకోవాలనుకున్నాడు. వెంటనే ఓ పథకాన్ని రచించాడు. సాధువుకు కాస్తా బియ్యం తేవడానికి ఇంట్లోకి వెళ్ళగానే ఇదే అదనుగా తలసోసిన సాధువు తలంటుకొనే నూనెలో ఓ విధమైన పసరును కలిపాడు. ఇంతలో పాలేర్లు ఎద్దుల బండ్లను ఆపి, బండ్లకు కందెన వేయడానికి నూనె అడగ్గా అక్కడే ఉన్న నూనెను ఆమె వారికిచ్చింది. వెంటనే నూనెను కందెనలో కలిపి బండ్లకు వేసి భోజనానికి వెళ్ళారు. అయితే పసరు ప్రభావంతో బండ్లు ఎద్దులు లేకుండానే ఓంకార క్షేత్రంలో ఉన్న సాధువు వద్దకు చేరుకున్నాయి. పాలేర్లు రోడ్డుపై ఉన్న గుర్తుల ఆధారంగా వెళ్ళగా ఓంకార క్షేత్రంలో ఉన్నట్టు తెలుసుకున్నారు. తాను వేసుకున్న పన్నాగం ఫలించకపోవడంతో సాధువు అక్కడి నుంచి నెమ్మదిగా జారుకున్నాడు. బండ్లు ఎద్దులు లేకుండానే ఓంకార క్షేత్రానికి వెళ్ళిన విచిత్ర సంఘటనే ఈ గ్రామానికి బండి ఆత్మకూరు అనే పేరు వచ్చినట్టు తెలుస్తోందని డా॥ డి.గాయత్రి పేర్కొన్నారు.

ఆదోని

ఇది మండల కేంద్రం. క్రీ.శ. 16వ శతాబ్దంలో ఆదోని యాదవుల పాలనలో ఉండేది. అప్పుడు దీనిపేరు యాదవగిరి. ముస్లింల పాలనలో ఆదవోని అయ్యింది. ఆదవోని కాలక్రమంలో ఆదోనిగా రూపాంతరం చెందింది. ఈ గ్రామం ముఖ్య వాణిజ్యకేంద్రం. ఇక్కడ అతి పెద్ద మార్కెట్ యార్డు ఉంది. ఆంగ్లేయుల హయాంలో దీనిని రెండో ముంబయిగా పిలిచేవారు. ఒకప్పుడు పత్తి వ్యాపారం బాగా జరిగేది.

మద్దికేరతూర్పు

ఇది మండల కేంద్రం. ఇక్కడ మద్దమాంబ తిరునాళ్లు ఎంతో ప్రసిద్ధి చెందింది. మద్దమాంబ పేరుతో మద్దికేరతూర్పు గ్రామం ఏర్పడింది. ఇక్కడ

ప్రతిఏటా గుర్రపారువేట ఉత్సవం పెద్దఎత్తున జరుగుతుంది. యాదవ సామాజిక వర్గానికి చెందిన వారు శ్రీభోగేశ్వర స్వామిని ఇష్టదైవంగా కొలుస్తారు.

నన్నూరు

ఈ గ్రామం ఓర్వకల్ మండలంలో ఉంది. చాలా కాలం క్రితం నాగేశ్వరస్వామివారి పేరుతో నాగియనూరుగా దీన్ని పిలిచేవారు. జనవ్యవహారంలో నన్నూరుగా మారింది. ప్రస్తుతం గ్రామం ఉన్న స్థలానికి ఉత్తరవైపున 3 కీ.మీ దూరంలో గల బురుజుమాడ ఆంజనేయ స్వామివారి కొండపై గతంలో నన్నూరు ఉండేది. ఆసమయంలో వింతవ్యాధి సోకి ఈ పల్లెలో మృత్యువాతకు గురైన వారి సంఖ్య పెరుగుతూ వచ్చింది. దీంతో ఉన్న నాలుగు కుటుంబాలు ప్రస్తుతం ఉన్న నాగేశ్వరస్వామి దేవాలయం వద్ద స్థిరపడ్డారు. ఇదిలా ఉండగా ఈ గ్రామానికి చుట్టూ నవనందులు ఉన్నందున నన్నూరుగా మారిందని నాగనూరుగా మారిందని, మరికొందరు పేర్కొంటారు.

అహోబిలం

ఇది ఆళ్ళగడ్డ మండలంలో ఉంది. గతంలో అహోబిలానికి సింగవేలు తుంద్రం అనే పేరు ఉండేది. అహోబిలం పట్టణానికి ఈ పేరు రావడానికి రెండు కారణాలు ఉన్నట్లుచెబుతున్నారు. ఇది ప్రసిద్ధి చెంది నరసింహక్షేత్రం. ఇది 16వ శతాబ్దం నాటిది. అహోబిలం రెండు భాగాలుగా రెండు ప్రదేశాల్లో ఉంది. ఒక భాగాన్ని ఎగువ అహోబిలం అని, రెండో భాగాన్ని దిగువ అహోబిలం అని అంటారు. ఎగువ అహోబిలంలో ఉగ్రనరసింహస్వామిఆలయం, దిగువ అహోబిలంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉంది. దిగువ అహోబిలం అనే చోటనేచిన్న గ్రామం ఉంది. కొండ దిగువున గల లక్ష్మీనరసింహస్వామి వెలసిన గుహను అనుసరించి ఈ క్షేత్రానికి అహోబిలం అనే పేరు వచ్చినట్టు తెలుస్తోంది. అధస్ బిలం అనేది అహోబిలం(దిగువున గల బిలం) అయిందని అర్థం చేసుకోవచ్చు. ఇతిహాస పరంగా చూస్తే స్వామి ఉగ్రరూపాన్ని ధరించి హిరణ్యకశిపుని సంహరించడాన్ని చూసిన దేవతలు 'అహోవీరం అహోశౌర్యం, అహోబాహుప రాక్రమం, నారసింహం, పరం దైవం, అహోబల మహోబలం' అంటూ స్వామి బలపరాక్రమాలను ప్రశంసించారు. ఈ విధంగా అహోబలం

అని దేవతలు కీర్తించడం వల్ల ఆహోబలం అని పేరు ఏర్పడింది. కాలగమనంలో ఆహోబిలంగా మారిందని చెబుతారు.

పాణ్యం

ఇది మండల కేంద్రం. ఈగ్రామానికి 1.5 కి.మీ దూరంలో పాణికేశ్వర స్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. క్రీ.శ 9వ శతాబ్దంలో విష్ణువర్ధన మహారాజు రాజ్యకాంక్షతో దిగ్విజయ యాత్రకు బయలుదేరారు. అప్పటికి అతని కుమార్తె వయసు 15. కొన్నేళ్ల తరువాత ఓ ఆర్ధరాత్రి తిరిగి రాజ్యానికి వచ్చాడు. అలసిసొలసిన రాజు తన పాన్పుపై పడుకొని పక్కనే ఉన్న మహిళను తన పట్టపురాణి అనుకొని చేయి వేశాడు. అయితే చేయి తగిలిన వెంటనే ఆ యువతి మేల్కొంది. అరుస్తూ బయటకు పరిగెత్తింది. ఆమె తన కుమార్తె అని గ్రహించిన రాజు మరునాడు మంత్రులు సామంతులను సమావేశం పరిచి పరస్త్రీపై గాని కూతురుపై గాని కామవాంఛతో చేతులు వేసిన వారికి ఏమి శిక్షవేస్తాడని అడిగాడు. శిక్షాస్మృతి ప్రకారం రెండు చేతులుఖండిస్తారని చెప్పారు. దాంతో రాజు తన రెండు చేతులను ఖండించాలని ఆజ్ఞాపించాడు. రెండు హస్తాలు ఖండించిన తరువాత ఆబాధను భరించలేక ఆలయపరిసరాలలో తిరుగుతూ సమీపంలో ఉన్న పాముపుట్టలో తన రెండు చేతులను పెట్టాడు. అయితే పాము కాటువేయకపోగా తన రెండు చేతులు యథాతథంగా వచ్చాయి. అయితే రాత్రి కలలో ఈశ్వరుడు కనిపించి ఆ పుట్టలో ఉన్నది తానేనని తనకు గుడిని నిర్మించాలని ఆజ్ఞాపించాడు. పాణి అంటే చేయి. తనకు రెండు చేతులు తిరిగి వచ్చినందుకు స్వామిని పాణికేశ్వరస్వామిగా పిలుస్తూ పూజలు చేయడం ప్రారంభించారు. ఆలయం పేరుమీదుగానే గ్రామం పేరు కూడా 'పాణియంగా' మారింది. అయితే కాలక్రమంలో పాణ్యంగా స్థిరపడింది.

ఈరాట

ఈ గ్రామం హొళగుంద మండలంలోనిది. ఈ గ్రామ పూర్వనామం విరాటపురం. హొళగుందకు 7కి.మీ దూరంలో ఉన్న కొండపై విరాటరాజులు అందమైన కోటలు నిర్మించారు. అందుకే ఈ గ్రామాన్ని విరాటపురం పిలిచేవారు. కాలక్రమంలో ఈరాటగా మారింది.

ఉయ్యాలవాడ

ఈ గ్రామం ఓర్వకల్ మండలంలో ఉంది. పూర్వం కాల్వ,రామల్లకోట గ్రామాలు ఉండేవి. ఈ గ్రామాలకు మధ్య దట్టమైన అడవి ఉండేది. ఈ ప్రాంతంలోని అడవుల్లో నాయుడు, నల్లమ్మ అనే దంపతులు అడవులలో ఉంటూ దారి దోపిడీలు చేసేవారు. ఒక రోజు ఆ దారిలో వెళ్తున్న సాధువును అడవిదొంగ నాయుడు దోపిడీ చేసేందుకు నిలదీశాడు. అప్పుడు ఆసాధువు వెంటనే దొంగతో దోపిడీ చేసిన సొమ్మును ఏం చేస్తా వు? దొంగతనం వల్ల పాపం వస్తుంది కదా! దోపిడీ సొమ్మును పొందినట్లే ఈ పాపంలో నీ భార్య భాగం పంచుకుంటుందేమో అడిగి రా.. అంతవరకు ఇక్కడే ఉంటానన్నాడు సాధువు. ఆ మాటలు విన్న దొంగ తన భార్యవద్దకు వెళ్ళి నా పాపంలో కూడా భాగం పంచుకుంటావా. అని అడిగాడు. అందుకు నల్లమ్మ నీతో సహజీవనం చేస్తున్నందున దోపిడీ సొమ్ములో భాగం పొందుతున్నాను. కాని పాపంతో తనకు సంబంధం లేదని చెప్పింది. సాధువు చెప్పిన మాటలకు పరివర్తన చెందిన దొంగ పాపపరిహారం కోసం తాను ఏమిచేయాలో చెప్పమని వేడుకున్నాడు. బాటసారుల కోసం కుంటలు నిర్మించమని చెప్పాడు. దీంతో నాయుడు, నల్లమ్మలు కలిసి రెండు కొండల మధ్య నాయుడు చెరువు (గ్రామచెరువు), నల్లమ్మకుంట (నల్లకుంట), కుందుచెరువు, బెల్లచెరువు, ఎర్రచెరువు అనే ఐదు చెరువులను నిర్మించారు. ఈ ప్రాంతంలో నీరు ఎక్కువగా ఉండటంతో అనువైన ప్రాంతంగా ఉందని నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. రెండు కొండల మధ్య నల్ల చెరువులోని నీరు ఉయ్యాల వలె తొలుకులు కొడుతూ ఉండటంతో అక్కడ వాడల్లోని ప్రజలు ఉయ్యాలవాడ అని పేరు పెట్టారు.

పాములపాడు

ఇది మండల కేంద్రం. జిల్లాలో అతి పెద్ద మండల కేంద్రాల్లో ఇది ఒకటి. ఒకప్పుడు ఈ ప్రాంతంలో పాముల సంచారం ఎక్కువగా ఉండేది. కొత్తగా గ్రామాన్ని ఏర్పాటు చేసుకొనేటప్పుడు పాములు పట్టించే వాళ్ళను ఇక్కడకు తెప్పించి వాటిని అరణ్యంలో విడిచి పెట్టే ఏర్పాట్లు చేశారు. తర్వాత నివాస గృహాలను

ఏర్పాటు చేసేకున్నారు. అయితే ఈ ఊరి పేరు చివర పాడు ఎలా ఎర్పడిందంటే ఈ ప్రాంతమంతా పాటినేలగా ఉండేది. జైనులు కొంత కాలం ఇక్కడ నివశించినట్టు స్థానికుల కథనం వల్ల తెలుస్తోంది.

శకునాల

ఇది ఓర్వకల్ మండలంలో ఉంది. ఈ గ్రామానికి ఎంతో విశిష్టత ఉంది. ఈ పల్లెలో శకునపక్షులు విస్తృతంగా తిరిగేవి. వీటి అరుపులు మేరకు శుభశకునమో, అపశకునమో గ్రహించి తదనుగుణంగా వ్యవహరించేవారు. మంచి శకునమైతే పనులు చేపట్టేవారు. అపశకునమైతే వాయిదా వేసుకునేవారు. దీన్ని బట్టి తమ గ్రామానికి శకునాల అని పేరు పెట్టుకున్నారు.

అవుకు

ఇది నియోజకవర్గ ,మండల కేంద్రం. ఈ గ్రామం ఏర్పాటు అయ్యేటప్పుడు ఏ పేరు పెట్టాలో నిర్ణయించేందుకు గాను పెద్దలు, పురోహితులు రచ్చబండపై సమాలోచనలు జరుపుతున్నారు. ఇంతలో ఓ కుక్క గట్టిగా భౌ....భౌ... అని మొరిగింది. అయితే ఆ ఆరుపును అనుకరించి తమ పల్లెకు అవుకు అని పేరు పెట్టారు. విజయనగరం సామ్రాజ్యంలోని ప్రసిద్ధ సంస్థానాలలో అవుకు సంస్థానం ఒకటి. రాజకీయ శిల్ప కళారం గాలలో విశిష్ట ప్రాధాన్యతను సంతరించుకున్న సంస్థానం ఇది.

అబ్దుల్లాపురం

ఇది వెలుగోడు మండలంలో ఉంది. పూర్వం అబ్దుల్లా అనే ముస్లిం మతస్థుడు ఆవాసం ఏర్పరుచుకొని నివసించేవాడు. ఎవరు లేని ఈ ప్రాంతంలో ఆయన ఒక్కడే కుటుంబంతో ఉండేవాడు. కాలక్రమేణా అది అబ్దుల్లా పేరుతోనే అబ్దుల్లాపురంగా మారింది. ప్రస్తుతం ఈ గ్రామంలో అన్ని కులాలు, మతాలవారు ఉన్నప్పటికి ముస్లిం మతానికి చెందిన కుటుంబం నేడు ఒక్కటి కూడా లేదు. వారంతా వెలుగోడుకు వలసపోయారు.

గోనెగండ్ల

ఇది మండల కేంద్రం. ప్రారంభంలో దీనిపేరు గోనెగుండ్లు. పూర్వం ఈ గ్రామంలో గుండ్లు చాలా పొడవు గా గోనె సంచుల ఆకారంలో ఉండేవట. అందుకే ఈ గ్రామాన్ని గోనెగుండ్లు అనే పేరుతో పిలిచేవారు. కాలగమనంలో గోనెగండ్ల అనే పేరుతో స్థిరపడింది.

గని

ఇది గడివేముల మండలంలో ఉంది. సుమారు 7శతాబ్దాల కితం ఈ గ్రామాన్ని నిర్మించారు. ఈ పల్లెలో హెచ్చుసంఖ్యలో పండితులు ఉండేవారు. అందువల్ల ఈ గ్రామానికి విద్వత్ఖని అని పేరుపెట్టారు. విద్వత్ఖని జనవ్యవహారంలో గనిగా మారింది.

సిరివెల్ల

ఇది మండల కేంద్రం. సిరి అంటే సంపద. దీని తొలి పేరు సిలివెల్లువ. ఓ మునీశ్వరుడు మహానంది నుంచి తిరుపతి వెంకటేశ్వరస్వామి దర్శనానికి కాలిబాటన వెళుతూ ఈ ప్రాంతంలో విశ్రాంతి తీసుకున్నాడు. ఆయన తన మనోనేత్రంతో ఈ ప్రాంతం సిరిసంపదలతో విరాజిల్లుతుందని పేర్కొన్నాడు. దీనికి సిరివెల్లువ అని పేరు పెట్టాడు. అయితే ఆంగ్లేయుల కాలంలో సిరివెల్‌గా పిలిచేవారు. 1956 తరువాత ఇది సిరివెల్లగా స్థిరపడింది.

రుద్రవరం

ప్రతాపరుద్ర చక్రవర్తి శ్రీశైలం వెళ్తూ ఇక్కడ బసచేశాడు. దీంతో ఈ ప్రాంతం ప్రసిద్ధి చెందింది. అందువల్ల ఆయన పేరుమీదుగా రుద్రవరం అనే పేరు స్థిరపడిందని స్థానికులు అందజేసిన సమాచారం వల్ల తెలుస్తోంది.

కరివేన

ఈ గ్రామం ఆత్మకూరు మండలంలో ఉంది. కరి అంటే ఏనుగు. ఇది ఏనుగులు సంచరించే అటవీ ప్రాంతం. 8దశాబ్దాల క్రితం ఏర్పడిన కరివేన గ్రామం ఒకప్పుడు కరివనం. కాలక్రమంలో కరివేనగా మారింది. పూర్వం ప్రతాపరుద్రుడు మహోదయ పుణ్యసమయంలో ఇక్కడ బ్రాహ్మణులచేత

పుణ్యకార్యాలు చేయించినట్టు తెలుస్తోంది. వివిధ రకాల పరీక్షల్లో తమ ప్రతిభను చాటిన బ్రాహ్మణులకు 2800 ఎకరాలు విరాళంగా ఇచ్చారని చరిత్ర చెబుతుంది.

ఆస్పరి

ఇది మండల కేంద్రం. శ్రీ కృష్ణదేవరాయుల కాలంలో ఆదోని కోట నుండి ఈ గ్రామం మీదుగా గుత్తికోట కు పోతూ గుర్రాలను ఇక్కడ ఉన్న చెట్లకు కట్టేసి సైనికులు విశ్రాంతి తీసుకునేవారు. అందుకే ఈ గ్రామానికి అశ్వపురి అని పిలిచేవారు. కాలక్రమంలో ఆస్పరిగా మారినట్టు చెబుతారు.

కొలనుభారతి

కర్నూలు జిల్లా ఆత్మకూరు సమీపంలో శివపురం తర్వాత కొలనుభారతి కొలువు తీరిన సంగతి తెలిసిన వారు చాలా తక్కువ మంది. సరస్వతికి కొలనుభారతి అనే పేరు ఎందుకొచ్చింది. కొల్లం అంటే చెంచుల సమూహం. ఆ జనావాసాల మధ్య ఉంది. కాబట్టి కొల్లంభారతి అనే వారట. అదే కొలనుభారతి అయింది. ఇది సప్త దేవాలయాల సముదాయం. అవేకాక జనార్ధన స్వామి దేవాలయం కూడా ఉంది. ఈ సప్త శివాలయాలనూ రెడ్ శాండ్‌స్టోన్ తో నిర్మించినందు వల్ల చాళుక్యులు ఈ ఆలయాలు నిర్మించామని అనుకుంటాం కాని ఆధారాలు ఏమీలేవు. ఆ ఆలయాలు శిధిలం కాగా, ఇటీవలే వీటిని నిర్మించి కొత్త శివలింగాలను ప్రతిష్ఠించి ఒక్కో ఆలయంలో సప్త మాతృకల్లో ఒకొక్కరి విగ్రహాలను నిలిపారు. ఇక్కడ ఉన్న జలధారకు "చారుఘోషిణి" ఆని పేరు.

పెరవలి

క్రీ.శ 1336-37 సంవత్సరంలో విజయనగరరాజు బుక్కరాయలు ఇక్కడ ఓ దేవాలయాన్ని, మండపాలను నిర్మించాడు. ఈ పిమ్మట శ్రీ కృష్ణదేవరాయలు ఈ ఆలయాన్ని అభివృద్ధి చేసాడు. దక్షిణాన సండు కింద చెరువు లోతట్టు ప్రాంతంలో గ్రామం ఉండడంవల్ల పెరవలి అనే పేరు వచ్చింది అని పెద్దలు చెబుతారు.ఆలయ ధ్వజ, గోపుర, ఉత్తరాన మహాద్వారం, తూర్పున చిన్నద్వారం ఉన్నాయి. ఆలయ ప్రాంగణంలో మహావృక్షం ఉన్నది. ఈ ఆలయాన్ని విజయనగర కోటను ఒకేసారి నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది.

కులమాల

ఈ గ్రామం గోనెగండ్ల మండలంలో ఉంది. గతంలో ఈ పల్లెను పూలమాల అని పిలిచేవారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైన గ్రామీణులంతా ఐకమత్యంతో మాల (దండ)లోని పూలుగా ఉండాలన్నది వీరి లక్ష్యం. అంచేత ఒకప్పుడు ఈ గ్రామాన్ని పూలమాలగా పిలిచేవారు. నేటికి గ్రామంలోని వారి మధ్య ఏమైన సమస్యలు వస్తే కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా కలసిమెలసి పరిష్కారం చేసుకుంటారు. వీరంతా సంఘటితంగా వ్యవహరిస్తుంటారు. అంచేత ఈ గ్రామానికి కులమాలగా పేరు వచ్చింది. ఈ పేరే కాలప్రవాహంలో కుల మాలగా స్థిరపడింది.

దొంగలకొండ

ఈ పల్లె గోనెగండ్ల మండలంలో ఉంది. గతంలో మదర్‌సా అనే పేరుగల గజదొంగ ఇక్కడ సమీప ప్రాంతాలలో ఉండే గుహల్లో నివసిస్తూ ఉండేవాడు. ఈ దొంగ తాను దోచుకున్న డబ్బును కొండగుహలోనే దాచుకునేవాడు. అందుకే ఈ పల్లెను దొంగలకొండ అనే పేరుతో పిలుస్తున్నారు. కాగా మదర్‌సా నివాసమున్నందుకు మదర్‌సాకొండ అనే పేరుతో కూడా పిలుస్తున్నారు.

దూదెకొండ

ఈ పల్లె పత్తికొండ మండల కేంద్రం సమీపంలో ఉంది. ఇక్కడ ఉన్న దూదెకొండను ఒకప్పుడు పోతులపాలెంగా, దుర్గమ్మకొండగా పిలిచేవారు. సుమారు 3శతాబ్దాలు క్రితం ఇది ఓ కొండపై ఉండేది. దగ్గరలోని మండగిరిని పాలించిన విజయనగర రాజవంశీయులకు చెందిన అనెగొంది రాజులు దుర్గమ్మ కొండను తమ ఏలుబడిలోకి తెచ్చుకున్నారు. దుర్గామాతకు నెలవైన ఈ పల్లెను ఆ రోజుల్లో దుర్గమ్మకొండగా పిలిచేవారు. కాలగమనంలో దూదెకొండగా మారింది. ఒకసారి దుర్గమ్మ కొండపల్లెలో ప్లేగువ్యాధి వచ్చి వందలాది మంది మరణించారు. దీంతో జనం భయపడి ఇతర ప్రాంతాలకు వలసవెళ్లారు. అయితే ఈ పల్లె దాదాపు అంతరించిపోతున్న దశలో దూదేకుల కూలానికి చెందిన చక్రప్ప, బుడ్డ కాశన్న అనేవారు ఉన్న ఊరిలో ఇళ్లు కట్టు కోవడానికి తమ అయిదు ఎకరాల పొలాన్ని

పలువురికి దానంగా ఇచ్చారు. దీంతో కొండ కిందకి వచ్చి పలువురు ఇళ్లు నిర్మించుకున్నారు. దూదేకుల సామాజిక వర్గానికి చెందినవారి సహకారంతో గ్రామం మళ్ళీ ఊపిరి పోసుకుంది. దీంతో దూదేకుల కొండగా రానురాను దూదెకొండగా మారింది. అంతవరకు ఉన్న దుర్గమ్మ కొండగా ఉన్న పేరు కాలగమనంలో కనుమరుగైంది.

జోలపల్లె

ఈ గ్రామం గోస్పాడు మండలంలో ఉంది. గతంలో ఈ గ్రామం తొలిపేరు జోలపల్లె. జోలె పట్టిన పల్లె క్రమంగా జోలపల్లెగా మారింది. ఒకప్పుడు ఇక్కడ పల్లె ఉండేది కాదు. అబ్దుల్లా అనే వ్యక్తి నవాబులవద్దకు వెళ్ళి గ్రామం ఏర్పాటుకు అనుమతి తీసుకున్నారు. విరాళాల కోసం జోలెపట్టడంతో గ్రామానికి అదే పేరు వచ్చింది. కాలక్రమంలో జోలెపల్లె, జోలపల్లెగా మారింది.

కాల్వబుగ్గ

కర్నూలు నుంచి 30కి.మీ దూరంలో జాతీయ రహదారి పక్కనే కాల్వబుగ్గ ఉంది. ప్రసిద్ధి చెందిన బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయం ఎర్రమల్ల కొండల్లో వెలసి ఉంది. ఈ ప్రాంతమంతా కాల్వలతో నీటి బుగ్గలతో నిండి ఉంటుంది. అంచేత ఈ పల్లెకు కాల్వబుగ్గ అనే పేరు పెట్టారు. కాల్వ అంటే కాలువ, బుగ్గ అంటే పైకి ఉబికి వచ్చే నీరు. గ్రామంలోని బుగ్గరామలింగేశ్వర స్వామిని దర్శించుకొనేందుకు వచ్చే భక్తులు బుగ్గ కోనేరు లో స్నానం చేయడాన్ని పుణ్యంగా భావిస్తారు.

బొమ్మలసత్రం

నంద్యాల ముఖద్వారం బొమ్మల సత్రం. నంద్యాల పేరు తలవగానే తొలుత జ్ఞాపకము వచ్చేది బొమ్మలసత్రమే. పట్టణంలో అక్కడ ప్రముఖనాయకుల విగ్రహాలను ఏర్పాటు చేయడంతో ఆ పేరు వచ్చింది. కర్నూలు, కడప వైపు నుంచి నంద్యాలలో ప్రవేశించాలంటే ప్రధానద్వారం బొమ్మలసత్రం. బ్రిటిష్

హయాంలో ప్రస్తుతం ఆర్టీసీ బస్సులు ఆగే కూడలికి కూతవేటు దూరంలో ఉప కలెక్టర్ బంగ్లాను ఏర్పాటు చేశారు. 1958 లో ఊడుమాత్పారం గ్రామానికి చెందిన భజంత్రీబుగ్గయ్య అనే దాత ఆ ప్రాంతంలో రోడ్డుపక్కన బాటసారులు కోసం ఓ సత్రాన్ని నిర్మించారు. ఈ సత్రం పై దేవుళ్ళ విగ్రహలతోపాటు గాంధీ, నెహ్రూ, నేతాజీ వంటి మహానుభావుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. సత్రం పై బొమ్మలు ఏర్పాటు చేయడం వల్ల బొమ్మలసత్రంగా స్థిరపడింది.

రెడ్డిపల్లె

ఈ పల్లె రుద్రవరం మండలంలో ఉంది. ఒకే సామాజిక వర్గం వారు ఈ పల్లెలో ఉండటం విశేషం. ఈ గ్రామంలో అందరూ దళితులే. వివరాల్లోకి వెళితే దాదాపు 5 శతాబ్దాల కితం ఈ గ్రామంలో రెడ్లు, ముస్లింలు, బోయలు, యాదవులు ఉండేవారు. రెడ్లు అధికంగా ఉండటంతో "రెడ్డిపల్లి" అనే పేరు వచ్చింది. గ్రామీణులంతా దగ్గరలోని అటవీప్రాంతంలో ఆకులు సేకరించి బీడి కార్మికులుగా ఉండేవారు. వైద్య సదుపాయాలు అంతగాలేని ఆరోజుల్లో కలరా వ్యాధి వ్యాపించి గ్రామాలకు గ్రామాలే తుడుచుపెట్టుకొనిపోయాయి. వ్యాధి కలకలంతో రెడ్డిపల్లెలోని ప్రజలంతా వలసవెళ్ళారు. దళితకుటుంబాలు నాలుగే మిగిలాయి. అయితే కాలగమనంలో ఇక్కడి వారే వివాహాలుచేసుకున్నారు. ప్రస్తుతం ఈ పల్లెలో 110 కుటుంబాలు ఇక్కడ ఉన్నా యి. వీరంతా బంధువులే. ఎవరి ఇంటిలో శుభకార్యం జరిగిన ఊరంతా సంక్రాతిని తలపిస్తుందని రచయిత్రి డా॥డి. గాయత్రి వ్యాఖ్యాపించారు.

చిప్పగిరి

ఇది మండల కేంద్రం. ఒకప్పుడు దీనిని శిల్పగిరి గా పిలిచేవారు. బౌద్ధ, జైన, హిందూ, క్రైస్తవ, ముస్లిం మతాలకు చెందిన వందలాది ప్రార్థనాలయాలు ఇక్కడ ఉండడం విశేషం. చిప్పగిరి కొండపై వేంచేసి ఉన్న జైన దేవాలయం కర్ణాటకలోని హంపీ జైన దేవాలయాన్ని పోలి ఉండటం విశేషం. శిల్పగిరి జనవ్యవహారంలో చిప్పగిరిగా మారింది.

మిడుతూరు

ఇది మండల కేంద్రం. పూర్వం ఈ గ్రామంలో కోతుల, మిడుతల బెడద ఎక్కువగా ఉండేది. అంచేత ఆ గ్రామానికి కోతులమిడుతూరు పేరు పెట్టారు. కోతుల ఆహారం కోసం 66 ఎకరాల మాన్యం ఉండేది. ప్రస్తుతం ఈ మాన్యాన్ని బడాబాబులు అమ్ము కోవడంతో కోతులకు ఆహారం లేకుండా పోయింది. అయినప్పటికి నేటికి గ్రామీణుల్లో కొందరు భిక్షాటన చేయగా వచ్చిన ధాన్యాన్ని కోతులకు అందిస్తున్నారు.

రామళ్ళకోట

ఈ గ్రామం వెల్దుర్తి మండలంలో ఉంది. ఒకప్పుడు రామళ్ళకోట కొండల్లో రత్నాలు దొరికేవి. అందుకే ఈ గ్రామాన్ని రవ్వలకోట అని పిలిచేవారు. కాలక్రమంలో రామళ్ళకోటగా మారింది. ఈ గ్రామంలో 101 చిన్న, పెద్ద దేవాలయాలు ఉన్నాయి.

మునిమడుగు

ఈ గ్రామం ప్యాపిలి మండలంలో ఉంది. మండలంలోని మునిమడుగు గ్రామంలో ఈదరంగ భూపాలుడి పాలన భిన్నత్వంలో ఏకత్వం చాటుతుండగా, శ్రీ కృష్ణదేవరాయలుకాలంలో ప్రసిద్ధి చెందిన ఈ ప్రాంత చివరిపాలకులు రెడ్డి రాజులు. వారిపాలనా ప్రాభవానికి చిహ్నంగా గ్రామం చుట్టూ కోట, కోటలోపల రాజాదర్బార్, అద్దాల మేడ, శిల్ప సంపద ఇప్పటికీ కనిపిస్తున్నాయి, పూర్వం మునిమడుగు గ్రామం ఋషులకు నిలయమై ఉండేదని, మునులు ఇక్కడ తపస్సు చేసేవారని ఇతిహాసం చెబుతోంది.

సంగమేశ్వరం

సప్తనదుల సంగమం సంగమేశ్వరక్షేత్రం. ఇది కొత్తపల్లి మండలంలో కృష్ణా తీరాన వెలసింది. ఇక్కడ భీమ, మలప్రభ, భవనాశి, తుంగ, భద్ర, వేణి, కృష్ణా..... మొత్తం 7 నదుల నీళ్ళు ఉంటాయని పేర్కొంటారు. ఇక్కడి వేపదారు శివలింగాన్ని ధర్మరాజు ప్రతిష్టించినట్టు ఐతిహ్యం వల్ల తెలుస్తోంది. సంగమేశ్వరం ఏడాదిలో 8 నెలల పాటు శ్రీశైలం ఆనకట్ట నీళ్ళలో మునిగి ఉంటుంది. నాలుగు నెలలు మాత్రమే భక్తులు దర్శించుకొనేందుకు వీలుకలుగుతుంది.

ముచ్చట్ల

ఈ ప్రాంతం బేతంచర్ల మండలం పరిధిలో ఉంది. ఈ ప్రదేశంలో కొండలు, కోనలు, చెట్లు, చేమల నడుమ ముక్కోటి దేవతలు ఎంతో ఆనందంతో ముచ్చటించి మల్లికార్జునుడిని ప్రతిష్ఠించిన గొప్ప ఆలయం 'ముచ్చట్ల' మల్లికార్జున స్వామి ఆలయం. ఈ గాలి గోపురం 30 అడుగుల ఎత్తులో ఉండి శిల్ప సౌందర్యంతో అలరారుతోంది.

రసీదుపురం

ఇది ఒకప్పుడు రషీద్ అనే వ్యక్తిపేరు మీదుగా ఏర్పడిన గ్రామం. అయితే కాలక్రమంలో రషీదుపురం, రసీదుపురంగా మారింది.

రుద్రవరం

ఇది మండల కేంద్రం. ప్రతాపరుద్రుడు శ్రీశైలం వెళుతూ మార్గమధ్యంలో ఇక్కడ బస చేశాడు. అంచేత ఆయన పేరు మీదుగా రుద్రవరం గ్రామం వెలసింది. అలాగే ప్రతాపరుద్రుడు ఇక్కడ గల భాస్కరనందీశ్వరస్వామి దేవాలయంలో శివలింగాన్ని ప్రతిష్ఠించినందున దేవుని పేరు తన పేరు కలిసొచ్చే విధంగా రుద్రవరం అని పేరు పెట్టినట్టుగా కూడా చెబుతారు.

అనంతపురం జిల్లా

అనంతపురం

ఇది నగర పాలక సంస్థ. రాయలసీమ జిల్లాల దత్త మండలంగా దీన్ని పేర్కొంటారు. అనంతపురం విజయనగర సామ్రాజ్యంతో ప్రారంభమైంది. దీని తొలి పేరు అనంతపురి. ఈ సామ్రాజ్యానికి శంకుస్థాపన చేసిన బుక్కరాయులు తన సతీమణి అనంతాదేవి పేరును ఈ పట్టణానికి పెట్టారు. కాలక్రమంలో అనంతపురి కాస్తా అనంతపురంగా మారింది. ఇక్కడ గల ఇస్కాన్ మందిరం, జే.ఎన్.టి.యు ఇంజినీరింగ్ కళాశాల, హనుమగిరిలో హనుమంతుని విగ్రహం ప్రసిద్ధి చెందాయి. ఇది జిల్లా కేంద్రం అని వేరే చెప్పనక్కర్లేదు.

పుట్టపర్తి

పుట్టపర్తికి ప్రాచీన నామం గొల్లపల్లె. భగవాన్ శ్రీసత్యసాయిబాబా వెలసిన దివ్య క్షేత్రం ఇది. ఈ పేరు వెనుక గల చరిత్రను పరిశీలిస్తే ఒకింత ఆశ్చర్యం, ఆనందం కలిగిస్తాయి. ప్రస్తుతం శ్రీవేణుగోపాల స్వామి ఆలయం ఉన్న చోట పూర్వం ఒక చిన్న పుట్ట నెలకొన్నది. ఆ పుట్టలో ఓ దేవతా సర్పం ఉండేది. ఈ ప్రాంతంలో ఉండే గొల్లలు తమ గోవులను మేపడానికి ఊరు బయటకు తీసుకొని పోయేవారు. ఒక ఆవు తప్పించుకుని ఆ పుట్టదగ్గరకు పోయేది. దాని పొదుగులోని పాలను పాము తాగేది. ఒక రోజున కొంత మంది గొల్లలు చూసి పుట్టదగ్గరకు పోయి ఆ పామును చంపాలని ప్రయత్నించారు. పాలు తాగుతుంటే ఆ పామును పెద్దరాయితో కొట్టారు. అప్పుడు ఆ పాము ఐసలు కొట్టి ఈ ప్రాంతంలోని గొల్లలు కాని, గోవులు కాని బతకడానికి వీలుండదని శపించింది. అందువల్ల ఈ ప్రదేశంలో ఉన్న గొల్లలు దూరంగా ఉన్న గోకులంలో ఇళ్లు కట్టుకున్నారు. గొల్లలు ఎవ్వరూ ఇక్కడ నిద్ర చేసేవారు కాదు. సాయంత్రం అయ్యే సరికి గోకులానికి తిరిగి వచ్చేవారు. దీంతో ఈ గ్రామమంతా పుట్టల మయమైంది. అందువల్ల ఈ పల్లె "పుట్టవర్ధని" అని పేరు పొందింది. కాలాంతరంలో పుట్టపర్తిగా పేరు స్థిరపడింది.

ఆనాడు గొల్లలు పాముపై విసిరేసిన రాయి ఇప్పుడు వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు అందుకొంటోంది. ఇక పర్తి అంటే ప్రదేశం లేదా ప్రాంతం అని అర్థం. కొన్ని గ్రామాలకు ఉత్తర పదంలో పర్తి వంటివి చేరుతుండటం గమనిస్తునే ఉన్నాం. తూర్పు గోదావరి జిల్లాలో అనపర్తి, విశాఖపట్నంలో దొండపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాలో వనపర్తి ఇలానే ఏర్పాటయ్యాయి. పుట్టపర్తి నేడు దివ్యక్షేత్రంగా వర్ధిల్లుతోంది. మినీ ప్రపంచంగా వికశిస్తోంది. సత్య సాయిబాబా కీర్తి దశదిశలా వ్యాపించడానికి పుట్టపర్తి వేదికైంది. ఒకప్పుడు 150 మంది జనాభాతో ఉండేది. నేడు లక్షలాది మంది భక్తులు ఇక్కడకు వస్తున్నారు. గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. సత్య సాయిబాబా పేరుతో ఎన్నో విద్యా, వైద్య సంస్థలు ఇక్కడ వెలిశాయి. ఇక్కడ విమానాశ్రమం కూడా ఉంది.

ప్రశాంతి నిలయం

పుట్టపర్తిలో భగవాన్ సత్యసాయిబాబా కొలువుదీరిన ప్రశాంతి నిలయం పేరుకు తగ్గట్టుగానే ప్రశాంత వాతావరణం నెలకొని ఉంటుంది. ప్రశాంతి నిలయాన్ని వేలాది మంది భక్తులు దర్శిస్తుంటారు. అయినప్పటికీ ఎలాంటి శబ్దం లేకుండా ఎవరికి వారు ప్రశాంతతకు భంగం కలిగించకుండా నడుచుకోవడం దీని ప్రత్యేకత. ఇక్కడ ఓంకార నాదం, సుప్రభాతసేవలు, ఆధ్యాత్మిక ప్రార్థనలు నిత్యకృత్యాలు.

ఉరవకొండ

ఇది మండల కేంద్రం. తొలుత ఈ గ్రామాన్ని ఉరగకొండ అని పిలిచేవారు. ఉరగము అంటే సర్పం అని అర్థం. ఈ ఊరిలో ఉన్న కొండ అనేక ఫణాలు గల సర్పం వలె కనబడేది. అందుకే ఈ గ్రామానికి ఆ పేరు వచ్చిందని ఇతిహాసం వల్ల తెలుస్తుంది. కాలక్రమంలో ఉరగకొండ, ఉరవకొండగా స్థిరపడింది. ప్రఖ్యాతి చెందిన కరిబసవస్వామి మఠం, పిరమిడ్ ధ్యానకేంద్రాలు ఇక్కడ ఉన్నాయి. ఎందరో మహానుభావులు ఇక్కడ ఉన్న కరిబసవస్వామి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకోవటం విశేషం. భగవాన్ శ్రీసత్యసాయిబాబా సత్యన్నారాయణరాజు అనే పేరుతో ఇదే పాఠశాలలో చదువుకున్నారు. సత్యసాయి తన అవతార ప్రకటనను

ఇక్కడే చేయడం మరో విశేషం. ప్రముఖ సినీనటుడు చిరంజీవి తాను నటించిన అంజి చిత్రంలో ఉరవకొండ అనే పేరును ప్రముఖంగా ప్రస్తావించారు.

లేపాక్షి

ఇది మండల కేంద్రం. త్రేతాయుగంలో రావణుడు సీతను అపహరించుకొని పోతుంటే కూర్మగిరి మీద జటాయువు అడ్డగించింది. కోపోద్రిక్తుడైన లంకాధీశుడు ఆ పక్షి రెక్కలను తెగనరికాడు. కుప్పకూలిపోయిన జటాయువు 'రామా..రామా' అని విలపిస్తోంది. సీతాన్వేషణలో ఉన్న శ్రీరాముడు ఈ దృశ్యాన్ని చూసి చలించిపోయాడు. ఆ పక్షికి సాంత్వన చేకూర్చాడు. "లే-పక్షి" అన్నాడు. దీంతో ఈ ప్రాంతం లేపాక్షి పేరుతో స్థిరపడినట్టు ఐతిహ్యం వల్ల తెలుస్తోంది. జటాయువు జ్ఞాపకార్థం సమీపంలో గల కూర్మశైలంపై శ్రీరాముడు శివలింగ ప్రతిష్ఠ చేశాడు. లేపాక్షిలోని నందీశ్వరుడు సజీవశిల్పంగా దర్శనమిస్తాడు. ఈ ఏకశిలా రాతినంది భారతదేశంలోనే అతి పెద్దది. 26.5 అడుగుల పొడవు, 15 అడుగుల ఎత్తుండే ఈ నంది సందర్శకులను కట్టిపడేస్తోంది. ఇక విజయనగర ప్రభువు అచ్యుతరాయుల కోశాధికారి అయిన విరూపణ్ణ క్రీ.శ. 1533లో లేపాక్షిలో వీరభద్రస్వామి ఆలయాన్ని నిర్మించాడు. 'లేపాక్షి బసవయ్య లేచి రావయ్య' అని అడివి బాపిరాజు ఓ కవితలో అద్భుతంగా వర్ణించారు. 2016 ఫిబ్రవరి 27, 28 తేదీలలో రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా లేపాక్షి నంది ఉత్సవాలను ఘనంగా నిర్వహించింది.

తిమ్మమ్మమర్రిమాను

ఇది కదిరి నియోజకవర్గంలోని నంబులపూలకుంట మండలం గూటిబైలుకు కూతవేటు దూరంలో ఉంది. తిమ్మమ్మ మర్రిమాను పేరుతోనే చిన్న గ్రామం వెలసింది. ఈ మాను 7 ఎకరాల విస్తీర్ణంలో 1100 ఊడలతో విస్తరించి ఉంది. చెన్నైలోని అన్నఅడియార్ మర్రిచెట్టు కంటే, కోల్‌కత్తాలోని బొటానికల్ గార్డెన్‌లో ఉన్న మర్రి చెట్టు కన్నా తిమ్మమ్మ మర్రిమాను పెద్దది. దీంతో ఇది

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్‌లో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. మహా పతివ్రత తిమ్మమ్మమాంబ పేరు మీద తిమ్మమ్మమర్రిమానుగా ప్రసిద్ధి చెందింది. తిమ్మమ్మకు బాలవీరయ్యతో పెళ్ళయింది. వివాహం జరిగిన కొద్ది రోజులకే భర్త మరణిస్తాడు. దీంతో ఆమె తన భర్తతో పాటు సహగమనం చేసుకుంది. ఆ తరువాత కొంత కాలానికి ఆ చితి దగ్గర నాటిన ఓ మర్రి కొమ్మ మొక్క చిగురిస్తుంది. ఆ మొక్కే మహావృక్షంగా మారింది. ఇందుకు గుర్తుగా ఒక సమాధిని సైతం నిర్మించారు. అందులో తిమ్మమాంబ, బాలవీరయ్య విగ్రహాలున్నాయి. ప్రతి ఏటా మహా శివరాత్రి సందర్భంగా తిమ్మమ్మ ఉత్సవాలను భారీ ఎత్తున నిర్వహిస్తారు. ఇక్కడ శివఘాట్‌ను నిర్మించారు. తి.తి.దే తిమ్మమ్మ మర్రిమానును దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తోంది.

మునిమడుగు

ఈ గ్రామం పెనుగొండ మండలంలో ఉంది. ఈ గ్రామంలో శతాబ్దాల కితం నాటి చెరువు ఒకటి ఉంది. నాడు అది ఒక అగ్రహారమని, పాలెగాళ్ల పరిపాలనలో ఉండేదని పేర్కొంటారు. ఇందుకు నిదర్శనంగా శిథిలమైన ఓ కోట ఇప్పటికీ ఉంది. ఇప్పుడు చెరువు ఉన్న స్థలంలో ఒకప్పుడు ఊట మడుగులాంటి చిన్న చెరువు, దానిలో ఎప్పుడూ నీరు ఉండేది. దీని సమీపంలో మునులు ఆశ్రమాలు నిర్మించుకుని వేదపాఠశాల ను ఏర్పాటు చేశారు. ఈ ఊరికి మునిమడుగు అనే పేరు రావడానికి ఇదే కారణమైందని చెబుతారు. ఈ గ్రామీణులైన పాణ్యం వంశస్థులు తాతల నుంచి సంక్రమించిన ఇళ్లు చాలా వరకు శిథిలమయ్యాయి. దీంతో వాటిని తొలగించి ఆ స్థలంలో శ్రీవల్లీ దేవసేన సమేత నాగ సుబ్రహ్మణ్యే శ్వరస్వామి ఆలయాన్ని నిర్మించారు. ఇక్కడికి ఆంధ్రప్రాంతంతో పాటూ కర్ణాటక నుంచి కూడా భక్తులు వచ్చి దర్శనాలు చేసుకుంటారు.

కదిరి

"కాటమరాయుడా కదిరీ నరసింహుడా" అనే పాటను మనం తరచూ వింటూనే ఉంటాం. కదిరి విశిష్టత అలాంటిది. ఇది మండల కేంద్రం. ఒకప్పటి తాలూకా కేంద్రం కూడా. ఇక్కడ గల శ్రీలక్ష్మీనరసింహం దేవాలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఇక్కడ ఖదిర చెట్లు ఎక్కువుగా ఉన్నందున ఖదిరి అయ్యింది.

కాలక్రమంలో కదిరిగా స్థిరపడింది. ఖదిర అంటే చంద్ర చెట్టు అని అర్థం. ఇదిలా ఉండగా ఇప్పటి కదిరి పట్నానికి తూర్పున స్తోత్రాద్రి మీద శ్రీమహావిష్ణువు ప్రత్యక్షమై తన పాదముద్రికలను ప్రదర్శించినట్లు స్థలపురాణం వల్ల తెలుస్తోంది. శ్రీ మహావిష్ణువు పాదం మోపిన కొండ కావడంతో ఈ ప్రాంతానికి ఖాద్రి అనే పేరు వచ్చింది. 'ఖ' అంటే విష్ణు పాదం. 'ఆద్రి' అంటే కొండ అలా ఖాద్రి కదిరిగా మారిందని స్థలపురాణం పేర్కొంటోంది. కదిరిలో శ్రీలక్ష్మీనరసింహస్వామితో పాటు ప్రహ్లాదుడు కూడా దర్శనమిస్తాడు. ఇక్కడ బ్రహ్మోత్సవాలు ప్రతి ఏటా ఫాల్గుణ మాసంలో 16రోజుల పాటు వైభవంగా జరుగుతాయి.

విడపనుకల్లు

దీని పూర్వ నామం విడప్పకల్లు. శ్రీ కృష్ణదేవరాయలు అహోబిలం, తిరుమల తదితర క్షేత్రాలను తిలకించి తిరుగు ప్రయాణంలో విడిది స్థానమైన విడప్పలో విశ్రాంతి కోసం ఓ సుందరవనంలో విడిది చేశారు. విడప్ప అనే నాయకున్ని పిలిపించి ఈ ప్రదేశం యుద్ధానికి అనువైనదని, అక్కడ పెద్ద బండరాయి (కళ్) కూడా ఉండేదని ఈ ప్రాంతంలో కోటలు, బురుజు కట్టి తమ రాజ్య సంస్థానాధీశుడై ఉండాలని ఆదేశించాడు. రాయలు ఆజ్ఞానుసారం విడప్ప ఇక్కడే ఓ కోట, సంస్థానాన్ని ఏర్పాటు చేసుకొని రాయలకు కప్పం చెల్లించేవాడు. క్రీ.శ15,16 శతాబ్దాలకు ఇది విడప్పకల్లుగానూ, తరువాతి కాలంలో విడపనకల్లుగా స్థిరపడింది. ఇక్కడ శ్రీకడ్డేగౌరమ్మ దేవాలయం ప్రసిద్ధిగాంచింది. ప్రతీ ఏటా కార్తీక పౌర్ణమి రోజున శనగపిండితో ఉత్సవమూర్తులను ప్రతిష్టించి మూడు రోజులపాటు ఉత్సవాలు జరిపి అనంతరం నిమజ్జనం చేయాలని ఓ వృద్ధురాలు భక్తులకు సూచించి అదృశ్యమైనది. ఆమె చెప్పిన ప్రకారమే ఉత్సవాలను ప్రతి ఏటా జరుపుతు న్నారు.

కళ్యాణదుర్గం

ఇది ఎంతో చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకున్న గ్రామం. ఇది మండల, రెవెన్యూ డివిజన్ కేంద్రం. మధురకవి శ్రీనివాసరామ్మూర్తి తన తపోవన కావ్యంలో "కళ్యాణదుర్గపురమున కళ్యాణసముచితంగా నెలకొని కౌశల్యంబు

నెరపుతుంటివి కళ్యాణగిరేంద్ర నీకు గావింతు సుతుల్" అని పేర్కొన్నాడు. చుట్టూ ఎత్తయిన కొండల ఉనికిగా చేసుకొని క్రీ.శ18వ శతాబ్దంలో కళ్యాణప్ప నాయకుడు అనే పాలేగార్ కోటకట్టి పాలించుటచేత కళ్యాణదుర్గం అనే పేరు వచ్చింది. ఇక్కడ గల అక్కమాంబాదేవి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. కళ్యాణదుర్గం అతి ప్రాచీన సంస్థానంగా వెలుగొందింది.

బండమీదపల్లె

ఇది సింగనమల మండలంలో ఉంది. బండ (కొండ) పై కొంత మేరకు ఊరు ఉంది. మరికొంత భాగం బండ పక్కన ఉంది. సుమారు 1500 జనాభా ఉంటుంది. చక్రాయిపేట మజిరీ గ్రామంగా ఉంది. ప్రముఖ సాహితీ వేత్త డా॥ శాంతి నారాయణ ఈ విషయాన్ని ధ్రువీకరించారు.

ధర్మవరం

ఇది మండల కేంద్రం. క్రీ.శ11వ శతాబ్దంలో క్రియాశక్తి ఓడయార్ అనే వ్యక్తి తన తల్లి జ్ఞాపకార్థం ఓ చెరువును నిర్మించాడు. ఓడయార్ తల్లిపేరు ధర్మాంబ. దీంతో చెరువు సమీంలోని గ్రామం ధర్మాంబపురం అయ్యింది. ఈ పేరు ఆంగ్లేయుల కాలంలో ధర్మవరంగా మారింది. అందమైన పట్టుచీరలకు ప్రసిద్ధి చెందిన గొప్ప గ్రామం ఇది. ఇక్కడ నేత కళాకారులు రూపొందించిన మయూరం, పుష్పవల్లి, నవరత్నాలు, బ్రహ్మకమలం, సప్తస్వరాల చీరలు ఎంతో పేరు పొందాయి.

ముదిగొబ్బ

ఇది మండల కేంద్రం. గుబ్బ అంటే ఎత్తయిన దిబ్బలా ఉంటుంది. ముది అంటే ప్రాచీనమైనదని అర్థం చేసుకోవచ్చు. ఇలా దీనికి ఆ పేరు వచ్చినట్టు విశ్రాంత తెలుగు ఉపన్యాసకులు డా॥ శాంతి నారాయణ అభి ప్రాయపడ్డారు.

నంబులిపులికుంట

ఇది మండల కేంద్రం. ఈ గ్రామం ఉన్న ప్రాంతంలో తమిళ సంతతికి చెందిన ఆళ్వార్ల కుటుంబాలు ఉండేవి. వీరు శ్రీమహావిష్ణు భక్తులు. ఈ ప్రాంతంలో అతి పవిత్రమైన పాపాఘ్ని నది పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తుంది. ఈ నదీ

పరీవాహక ప్రాంతంలో ఎన్నో వైష్ణవ ఆలయాలు ఉన్నాయి. ఆళ్వార్లు విష్ణుదేవుని ఆరాధించేందుకు అవసరమైన పూలకోసం పెంచే పూలతోటను తమిళంలో నంబుల్ అనే పేరుతో వ్యవహరించేవారు. నంబుల్+పూలు+కుంట అనే అర్ధంతో నంబులపూలకుంట అనే పేరు వచ్చింది. అయితే జనవ్యవహారంలో క్రమంగా నంబులపులికుంటగా మారింది.

పేలుబండ

అమరాపురం మండలం శివరాం పంచాయితీ పరిధిలో ఈ గ్రామం ఉంది. ఆవులు,దూడలు విచ్చలవిడిగా ఈప్రాంతంలో పచ్చగడ్డి మేయడం వల్ల పేయలబండగా పేరు వచ్చింది. ఆ పేరు క్రమంగా రూపాంతరం చెంది పేలుబండగా మారిందని పరిశీలకుల అభిప్రాయం. ఈ పేలుబండలోని కోట ఎంతో ప్రసిద్ధి చెందింది. పర్యాటక కేంద్రంగా విలసిల్లుతోంది. ఈ క్షేత్రంలో లక్ష్మీరంగనాథ స్వామి కొలువుతీరి ఉన్నారు. ఈ ఆలయ శిల్పం, సంస్కృతీ , వాస్తు, వేదాంతం, పురాణం తదితర సంప్రదాయాలకు అద్దం పడుతుంది. పేలుబండ సంస్థానం విజయనగర సామ్రాజ్యాధీశుల కాలం నాటిదని ఇక్కడి శిలా శాసనం వలన తెలుస్తోంది.

పెద్దచోళగిరి

అలనాటి చోళరాజులు పరిపాలించిన గ్రామమే పెద్దచోళగిరి. ఇది గుడిబండ మండలంలోనిది. ఈ గ్రామానికి ఆనుకొని ఉన్న కొండ చరిత్ర పరంగా జిల్లాలోనే ఎత్తయిన కొండ. దీంతో ఈ గ్రామానికి పెద్దచోళగిరి అనే పేరు పెట్టారు. ఈ గ్రామానికి దక్షిణ భాగంలో ముఖద్వారాన్ని ఆనాటి చోళరాజులు నిర్మించారు. ఇక్కడే విరుపాక్షేశ్వరాలయం ఉన్నది. ఈ దేవాలయం ముందు ఎక్కడా లేని విధంగా పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. సప్తమాతృకేయులు, నందీశ్వర విగ్రహాలు అలరిస్తాయి. ఈ ఆలయం ముందు అన్ని కాలాల్లోను పాతాళగంగ ప్రవహిస్తోంది. అందుచే దీనిని దక్షిణకాశి అని కూడా పిలుస్తారు.

తాడిపత్రి

ఇది మండల, పురపాలిక, నియోజకవర్గ కేంద్రం. ఈ ప్రాంతంలో తాటిచెట్లు ఎక్కువుగా ఉన్నందున తాటిపల్లి అనే పేరు వచ్చింది. తాటకి అనే రాక్షసిని శ్రీరాముడు సంహరించడం వల్ల ఈ పేరు వచ్చిందని మరో కథనం ప్రచారంలో ఉంది. మొదట తాటిపల్లి తరువాత తాటిపర్తి , ప్రస్తుతం తాడిపత్రి పేరుతో స్థిరపడింది. వేద కాలంలో భాస్కర క్షేత్రం అని పేరు కూడా ఉంది. ఇక్కడ శ్రీబుగ్గరామలింగేశ్వరాలయం, చింతల వేంకటేశ్వరాలయాలు చరిత్ర ప్రసిద్ధి గాంచినవి.

పామిడి

ఇది మండల కేంద్రం. ఈ గ్రామంలో గల భోగేశ్వరాలయం చాలా ప్రసిద్ధమైంది. ఈ ఆలయం త్రిలోచన లింగంగా పేరు గాంచింది. ఈ శివలింగం నాగుపాముచే చుట్టబడి ఉండేది. అందువల్ల గ్రామీణులు తమ గ్రామానికి పాముముడిగా నామకరణం చేశారు. రానురాను జనవ్యవహారంలో పామిడిగా ప్రసిద్ధి చెందింది. ఈ శివలింగం త్రిలోచనాలతో (మూడునేత్రాలతో) వెలసింది. ఇలాంటి శివలింగం మరేచోట లేదంటారు. ఈ ఆలయం ప్రాంగణంలో నందీశ్వర, వినాయక, నవగ్రహ విగ్రహాలను ప్రతిష్టించారు. ఈ ఆలయానికి దగ్గరలో పార్వతీదేవికి ప్రత్యేకంగా ఓ ఆలయాన్ని కూడా నిర్మించారు.

నాగులమడక

ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల మధ్య అనంతపురం జిల్లా రుద్దం మండలం సరిహద్దుల్లో ఈ గ్రామం ఉంది. ఈ ప్రాంతంలో సుమారు 4శతాబ్దాల క్రితం అన్నంభట్టు అనే బ్రాహ్మణునికి ఓ కల వచ్చింది. ఆ కలలో కనిపించిన శిలా ప్రతిమ కోసం సమీపంలో గల పినాకిని నదీతీరంలో ఉన్న ఇసుక తిన్నెలను నాగలితో దున్నించాడు. అయితే నాగలి అంచు తగిలి ఓ శిలా విగ్రహం బయటపడింది. ఆ విగ్రహం ఏడుపడగల నాగేంద్రస్వామి సుబ్రమణ్యేశ్వర స్వామి రూపంలో ఆ ఎంతో లీవిగా పైకెత్తిన పడగలతో శరీరం మూడు చుట్టులు చుట్టి ఆసన శిలపై కూర్చున్న భంగిమలో ఉన్న అత్యంత అరుదైన శిలావిగ్రహం అది.

దీంతో అక్కడే ఆ యన ఆలయాన్ని కట్టించి ప్రతిష్ఠించారు. మడక అంటే నాగలి, నాగలి అంచుకు తగిలిన ఆ నాగదేవత విగ్రహాన్ని ఇక్కడ ప్రతిష్ఠించారు. అంచేత నాటి నుంచి ఈ గ్రామానికి నాగులమడక గానే తెలుగువారు పిలుస్తున్నారు. కన్నడిగులు నాగలమడికే అని పేర్కొంటారు. పుష్యశుద్ధ, షష్ఠి రోజున ఇక్కడ స్వామికి బ్రహ్మరథోత్సవం అతి వైభవంగా నిర్వహిస్తున్నారు. క్రీ.శ1875 నుంచి ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ నాగళ్ళమడకను దర్శించాలనుకొనే వారు అనంతపురం నుంచి తావగడకు వెళ్లి అక్కడి నుంచి వివిధ వాహనాల పై ఆలయానికి చేరుకోవచ్చు.

నెమళ్ళపల్లె

మండల కేంద్రమైన పామిడి గ్రామానికి 10 కి.మీ దూరంలో నెమళ్లపల్లె దర్శనమిస్తుంది. పూర్వం ఈ ప్రాంతంలో నెమళ్లు ఎక్కువగా ఉండడంతో నెమళ్లపల్లె అనే పేరు వచ్చింది. ఇక్కడ ఉన్న ఆంజనేయస్వామికి సంజీవరాయుడు అని పిలుస్తారు. 6 శతాబ్దాల కితం నీలం వంశీయులు ఈ ఆలయానికి మరమ్మత్తులు చేపట్టారు. 1980లో రాష్ట్ర దేవాదాయధర్మాదాయ శాఖ ఈ ఆలయాన్ని పునరుద్ధరించింది.

పెనుగొండ

ఇది మండల కేంద్రం. అనంతపురం నుంచి 70 కి.మీ దూరంలో బెంగుళూరుకు వెళ్లే రహదారిలో పెనుగొండ దుర్గం ఉంది. ఈ దుర్గం 914 మీ.ఎత్తులో ఉన్న కొండపైన నిర్మించారు. మరో చంప గ్రామంలో మరికొంత భాగం దర్శనమిస్తుంది. తొలినాళ్ళలో విజయనగర సామ్రాజ్యానికి రెండో రాజధానిగా ఉండేది. విజయనగర ప్రభువులు దీనిని వేసవి విడిదిగా ఉపయోగించేవారు. ఇక్కడ గల కోటను పెద్దకొండపై నిర్మించడం చేత పెనుకొండ అని ప్రజలు నామకరణం చేశారు. కాలక్రమంలో పెనుగొండగా మారింది. పెనుగొండను "ఘనగిరి" అని ప్రఖ్యాత సాహితీవేత్త రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ చక్కగా సంస్కృతీకరించారు. ఇక్కడ గల అందమైన ప్రకృతి ఒడిలో కుంభకర్ణుడి తోట పర్యాటకులను ఆకర్షిస్తుంది.

హిందూపురం

ఇది లోక్‌సభ, శాసనసభ, మండల కేంద్రం. ఓ ప్రముఖ వాణిజ్య కేంద్రంగా వర్ధిల్లుతోంది. రాజకీయంగా చైతన్య వంతమైన పట్టణం. ప్రముఖ మరాఠ యోధుడు మురారిరావు ఈ గ్రామాన్ని నిర్మించాడు. మురారిరావు తన తండ్రి బిరుదమైన హిందూరావు పేరు మీద ఈ పట్టణాన్ని ఏర్పాటు చేసినట్లు స్పష్టం అవుతుంది. ఎన్.టి.ఆర్ ఇక్కడ నుంచే శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు.

గుంతకల్

ఇది ప్రముఖ రైల్వే కూడలి. దక్షిణమధ్య రైల్వేలో ఉంది. జిల్లాలో గల అతి పెద్దపట్టణాల్లో ఇది మూడవది. గుంతకల్ రైల్వే డివిజన్ కేంద్రం. ఇక్కడ వెలసిన గుంతకల్లప్పస్వామి పేరు మీదుగా ఈ పట్టణానికి గుంతకల్ అని పేరు వచ్చిందని చెబుతారు. ఈ పట్టణ జనాభాలో ముస్లింలు రెండో స్థానంలో ఉన్నారు.

గోరంట్ల

చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో ఏర్పడిన ఒక పల్లె ఇది. ఈ ప్రాంతంలో అడుగడుగునా గోరింటాకు చెట్లు ఎక్కువుగా ఉండటం వల్ల దీనికి గోరింటాకుపల్లె అని పేరు వచ్చింది. జనవ్యవహారంలో గోరంట్లగా మారింది. ఇక శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలంలో దాదాపు ఇదే పేరుతో గోరింట అనే గ్రామం ఏర్పడింది.

ముకుందాపురం

ఈ గ్రామం గార్లెదిన్నె మండలంలో ఉంది. దీని తొలిపేరు మురికినీళ్లపల్లి. బత్తాయి తోటల పెంపకంలో రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో ఉంది. 1979వ సంవత్సరంలో విద్యుత్ సరఫరా కోసం గ్రామీణులు అప్పటి జిల్లా కలెక్టర్ శర్మకు దరఖాస్తు చేసుకున్నారు. కలెక్టర్ స్వయంగా ఈ గ్రామాన్ని సందర్శించారు. గ్రామానికి విద్యుత్ సరఫరా చేస్తామని అయితే మురికినీళ్లపల్లె పేరు బాగాలేదని,

ఊరు పేరు మార్చాలని కలెక్టర్ అన్నారు. దీంతో ప్రజలు స్పందించారు. ఆ మర్నాడు రచ్చబండపై అప్పటి సర్పంచి వేయులరెడ్డితో సహా గ్రామీణులు సమావేశమయ్యారు. ముకుందాపురంగా పేరు మార్చారు. ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. దీంతో మురికినీటిపల్లి ముకుందాపురంగా పేరు మారింది.

పాలపాటిదిన్నె

నల్ల చెరువు మండల సమీపంలోని పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయం ప్రసిద్ధి చెందింది. భక్తుల కోర్కెలు తీర్చే కరుణామయునిగా ఆంజనేయుడు విరాజిల్లుతున్నాడు. ఈ ఆలయాన్ని శ్రీకృష్ణ దేవరాయుల కాలంలో ప్రతిష్ఠించారని ఐతిహ్యం వల్ల తెలుస్తోంది. రాయల కాలంలో పశువుల కొరత ఏర్పడింది. దీంతో ఇతర ప్రాంతాల నుంచి ఆవులమందను ఈ ప్రాంతానికి తోలుకొని వచ్చారు. ఒక రోజున మిట్టమధ్యాహ్నం ఆవులను సేదతీర్చాడానికి ఓ చెట్టు నీడలోకి తెచ్చారు. ఆ ప్రాంతంలో విశ్రాంతి తీసుకుంటున్న ఆవుల పొదుగుల నుంచి పితకకుండానే పాలు కారి ఓ పుట్టలోకి పోవడాన్ని ఓ కాపరి గమనించి ఈ విషయాన్ని రాయులకు తెలిపాడు. దీంతో ఆ స్థలం పవిత్రమైందిగా భావించి ఈ ప్రాంతానికి పాలపాటిదిన్నెగా నామకరణం చేశారు. దిన్నె అంటే ఎత్తయిన స్థలం లేదా వేదిక అని అర్థం చేసుకొవచ్చు . అక్కడే ఆంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించారు.

మడకశిర

ఇది నియోజకవర్గం, మండల కేంద్రం. ఇక్కడ 85 శాతం మంది ప్రజలు కన్నడ భాషను మాట్లాడటం విశేషం. 25 శాతం మందికి తెలుగు మాట్లాడటం. రాయడం రాదంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఇక్కడ హెచ్చు మంది వ్యవసాయం మీదనే ఆధారపడి ఉన్నారు. ఇక్కడ గ్రామం ఏర్పాటు అయ్యేటప్పుడు ప్రతి రైతుకు మడక (నాగలి)ఉండేది. శిర అంటే తల అనే అర్థాన్ని చెప్పుకోవచ్చు. తమకు నాగలి శిరస్సు వంటిదనే భావన ఉండేది. దీంతో మడకశిర అనే పేరును తన గ్రామానికి పెట్టుకున్నారు.

నెట్టికళ్లు

నెట్టికళ్లు అంటే మంచి రాయి అని అర్థం. ఎంతో విలువైన రాతితో ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఇక్కడ ఏర్పాటు చేశారు. నెట్టికళ్లులో ఆవిర్భవించినందున శ్రీస్వామివారికి నెట్టికంటి ఆంజనేయస్వామి అనే పేరు ప్రసిద్ధమైంది. ఈ ప్రాంతంలో ఏర్పాటైన గ్రామమే నెట్టికళ్లు. నెట్టికంటి అనగా ఒంటి కన్ను కలవాడని అర్థం. విగ్రహంలో స్వామి కుడికంటితో భక్తులను చూస్తూ వారివారి మనోవాంఛలను నెరవేరుస్తున్నారు. కోరి, కొలిచినవారి బాధలకు స్వామివారు కలలో కనిపించి నివారణ మార్గాలను చెబుతారు. స్వామివారి దివ్య మంగళ సుందర విగ్రహాన్ని అభిషేక సమయంలో నిజరూప దర్శనంలో గమనించవచ్చు. నెట్టికళ్లు గ్రామం కసాపురం గ్రామానికి సమీపంలో ఉండటం వల్ల కసాపురం ఆంజనేయస్వామి అని కూడా వ్యవహరిస్తారు.

బుక్కరాయసముద్రం

ఇది మండల కేంద్రం. అనంతసాగరం చెరువు సమీపంలో విజయనగర రాజుల మంత్రి చిక్క ఒడయార్ తవ్వించిన అనంతసాగరం అనే చెరువు సమీపంలో రాజు బుక్కరాయలు పేరు మీదుగా ఓ గ్రామాన్ని ఏర్పాటు చేసారు. దీన్ని బుక్కరాయ సముద్రం అని పిలుస్తారు అదే చివరకు స్థిరపడింది.

రాయదుర్గం

శ్రీకృష్ణదేవరాయల సామంతరాజు రామరాయలు పరిపాలించిన ప్రాంతం రాయదుర్గం. రామరాయలు పాలించడంతో రాయదుర్గం పట్టణం ఏర్పడింది.

గుమ్మగట్ట

ఇది మండల కేంద్రం. కాకతీయుల కాలం నాటి రాజ్య విస్తీర్ణాన్ని సూచిస్తూ ఇక్కడ బొమ్మలు నిర్మించారు. బొమ్మలగట్ట జనవ్యవహారంలో గుమ్మగట్టగా మారింది.

బుక్కపట్టణం

విజయనగర సామ్రాజ్య స్థాపకుల్లో ఒకరైన బుక్కరాయలు ఒక పెద్ద చెరువు తవ్వించారు. చెరువు సమీపంలో రాజు పేరు మీదుగా బుక్కపట్టణం అనే గ్రామం ఏర్పడింది.

రాప్తాడు

ఇది శాసనసభ, నియోజకవర్గ కేంద్రం. ఈ గ్రామం సమీపంలో పండమేరు అనే వంక ఉంది. పూర్వం ఆ వంక ఏరుగా పారుతుండేది. ఏరు దాటడానికి దారి ఉండేది కాదు. తాడు సాయంతో ప్రజలు ఏరు దాటేవారు. తాడును ఆంగ్లంలో రోప్ అంటారు. రోప్ మార్గం ఉన్నందున రోప్‌వే అయింది. క్రమంగా రాప్తాడు గా మారింది.

బొందకల్

రాయదుర్గం సమీపంలో ఉన్న ఓ ప్రాంతంలో ప్లేగు వ్యాధితో వందలాది మంది చనిపోయారు. శవాలను బొందలుగా పిలుస్తారు. అక్కడే పెద్ద రాయి ఉండేది. కల్ అంటే రాయి అని అర్థం. ఈ పేరుతోనే బందకల్‌గా ఏర్పడింది.

పుల్లలరేవు

ఇది రాప్తాడు మండలంలో ఉంది. ఇక్కడి రేవు వద్దకు పులులు వచ్చేవి. పులులరేవు క్రమంగా పుల్లలరేవుగా మారింది.

సుబ్బారావుపేట

ఇది ధర్మవరం వండలంలో ఉంది. వ్యక్తి నామధేయంగా ఏర్పాటైన గ్రామం ఇది. జానపద కళలకు పుట్టిల్లుగా పేరు పొందింది. ఈ గ్రామంలో ప్రతి ఇంటా జానపద కళాకారులున్నారు. జానపద గేయాలు, నృత్యాలు, కోలాటం, మరగాళ్లు, నామాలసింగడు తదితర ప్రక్రియల్లో వీరు సుప్రసిద్ధులు.

ఆకుతోటపల్లి

ఇది శ్రీ కృష్ణదేవరాయవిశ్వవిద్యాలయం సమీపంలో ఉంది. ఒకప్పుడు ఈ గ్రామం తమలపాకుల తోటలకు ప్రసిద్ధి. ప్రస్తుతం ఒక్క ఆకు తోట కూడా లేదు. పూర్వం ఆకుల తోటలకు ప్రసిద్ధి కావున ఆకుతోటపల్లిగా పిలిచేవారు. అదే చివరకు స్థిరపడింది.

నార్పల

ఇది మండల కేంద్రం. ఇక్కడ చిన్న ఏరు ప్రవహించేది. ఏరులోని చలమలలో ఓ ఆంగ్లేయుడు నీరు తాగాడట. నీరు ఎంతో తీయగా ఉన్నందున "నారేఫల్" అని పిలిచేవారు. నారేఫల్ నార్పలగా జనవ్యవహారంలో

పరిణమించింది. ఇదిలా ఉండగా ఇక్కడ గల కూతలేరు నుంచి పొలాలకు కాల్వలు ఏర్పాటు చేసుకొని అక్కడి నుంచి నారుమళ్లకు నీటిని మళ్ళించేవారు. నారుమళ్లు క్రమంగా నార్పలగా మారినట్టు కాళసముద్రం సుధాకర ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు.

గూగూడు

ఇది నార్పల మండలంలో ఉంది. ఈ గ్రామం మొహరం ఉత్సవాలకు ప్రసిద్ధి. గుహుడు అనే ముని ఇక్కడ తపస్సు చేశాడు. గుహుడు నడయాడిన ప్రాంతం కాబట్టి దీనికి జనవ్యవహారంలో గూగూడుగా పేరు వచ్చింది.

కాళసముద్రం

ఇది కదిరి మండలంలో ఉంది. కదిరికి 10 కి.మీ దూరంలో ఉంది. ఇక్కడ పూర్వీకులు 101 గానుగులు వేసి చమురు, నూనెలు తీసేవారు. అయితే 500 ఏళ్ల కితం ఒకసారి పని చేసేటప్పుడు నూనె కాలువలా ప్రవహించి అల్లకల్లోలం సృష్టించిందని ఈ గ్రామానికి చెందిన కాళసముద్రం సుధాకర ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు.

గుత్తి

ఇది పురపాలిక కేంద్రం. పూర్వం గుత్తి కోట సమీపంలో ఉన్న గౌరి అనే గుట్టపై గౌతమ మహర్షి తపస్సు చేశాడు. ఆ కారణంగా దీనికి గౌతమపురి అని పేరు వచ్చింది. కాలక్రమంలో గుత్తిగా మారింది. గుత్తికోట దూరం నుంచి చూస్తే పూలగుత్తిలా కనిపిస్తోంది. అందువల్లే ఈ కోటకు ఆ పేరు వచ్చిందని మరో కథనం. అలాగే ఆ రోజుల్లో ఈ కోటను సామంతరాజులకు గుత్తకిచ్చేవారు. ఆ కారణంగా కూడా ఈ కోటకు గుత్తికోట అనే పేరు వచ్చింది. శంఖు ఆకృతిలో నిర్మించిన ఈ కోట అటు మౌర్యులు, ఇటు విజయనగర రాజుల కళాపోషణ, పౌరుషాన్ని చాటుతోంది. దీన్ని 14వ శతాబ్దంలో నిర్మించారు. కింది నుంచి చూస్తే వంకరటింకరగా కనిపించే కోట చైనా గోడను తలపిస్తుంది. ఎత్తయిన కొండపై నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు 101బావులు నిర్మించారు. ఈ కోటలో నగరేశ్వరస్వామి, ఎల్లమ్మ, వేణుగోపాలస్వామి, లక్ష్మీ నరసింహస్వామి, రామాలయం, సత్తెమ్మ దేవాలయాలు ఉన్నాయి. ఈ కోటను 25 హెక్టార్ల విస్తీర్ణంలో నిర్మించారు.

ఆ గ్రంథకర్తల ఇంటి పేర్లు ఊరి పేర్లే

'బమ్మెర' పోతన
'తెనాలి' రామకృష్ణుడు
'పిల్లలమర్రి' పినవీరభద్రుడు
'వినుకొండ' వల్లభరాయుడు
'వేములవాడ' భీమకవి
'విన్నకోట' పెద్దన
'తాళ్ళపాక' అన్నమాచార్యులు
'తాళ్ళపాక' చిన్నమ్మ
'తాళ్ళపాక' చినతిరుమలాచార్యులు
'తరిగొండ' వెంగమాంబ
'వెలగపూడి' వెంగయామాత్యుడు
'దూబగుంట' నారాయణకవి
'కూచిమంచి' తిమ్మకవి
'పుష్పగిరి' తిమ్మన
'కందుకూరి (రు)' వీరేశలింగం
'కందుకూరి' (రు) రుద్రకవి
'గురజాడ' అప్పారావు
'రాయప్రోలు' సుబ్బారావు
'శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ)
'కట్టమంచి రామలింగారెడ్డి
'సురవరం' ప్రతాపరెడ్డి
'పుట్టపర్తి' నారాయణాచార్యులు
'కాటూరి' (రు) వెంకటేశ్వరరావు

'చిలుకూరి'(రు) నారాయణరావు
'చిలుకూరి(రు) వీరభద్రరావు
'దేవులపల్లి' కృష్ణశాస్త్రి
'దేవులపల్లి' రామానుజరావు
'బెజవాడ' గోపాలరెడ్డి
'మల్లంపల్లి' సోమశేఖరశర్మ
'రాళ్ళపల్లి' అనంతకృష్ణశర్మ
'కాళ్ళకూరి(రు)' నారాయణరావు
'రాచకొండ విశ్వనాథశాస్త్రి
'కాళీపట్నం' రామారావు
'బలివాడ' కాంతారావు
'తిరుమల' రామచంద్ర
'ఖండవల్లి' లక్ష్మీరంజనం
'ప్రయాగ' కోదండరామశాస్త్రి
'ధర్మవరం' కృష్ణమాచార్యులు
'రావూరి'(రు) భరద్వాజ
'దేవరకొండ' బాలగంగాధరతిలక్
'నండూరి' వెంకటసుబ్బారావు
'దువ్వూరి(రు)' రామిరెడ్డి
'నిడదవోలు' వెంకట్రావు
'వావిలాల' వాసుదేవశాస్త్రి
'కనుపర్తి' వరలక్ష్మమ్మ
'మాడుగల' నాగఫణిశర్మ

'మాడుగుల' సూర్యప్రసాదరాయకవి
'రావినూతల' శ్రీరాములు
'యార్లగడ్డ' బాలగంగాధరరావు
'యార్లగడ్డ' లక్ష్మీప్రసాద్
'రాయదుర్గం' వెంకటనర్సయ్య
'కోరాడ' రామచంద్రశాస్త్రి
'గుంటూరు' శేషేంద్రశర్మ
'వడ్లమూడి' గోపాలకృష్ణయ్య
'వడ్లమూడి' వెంకటరత్నం
'యద్దనపూడి' సులోచనారాణి
'ముప్పాల రంగనాయకమ్మ
'కొత్తపల్లి' వీరభద్రరావు
'దీర్ఘాసి' విజయభాస్కర్
'వాంద్రంగి' రామారావు (భావశ్రీ)
'ధరణికోట' శ్రీనివాసులు
'దూసి' ధర్మారావు
'వంతరాం' రామకృష్ణారావు
'ఆచంట' జానకిరామ్
'వడ్డాది' సుబ్బారాయుడు
'కొత్తపల్లి' రవిబాబు
'గొల్లపూడి' మారుతీరావు
'రాచపాళెం' చంద్రశేఖరెడ్డి
'గార' శ్రీరామమూర్తి
'కొప్పరపు' సోదరకవులు
'మునిపల్లె' రాజు
'కొలకలూరి' ఇనాక్
'మోదూకూరి'(రు) జాన్సన్

ఊరి పేర్లతో ప్రసిద్ధి చెందినవి

మందసకోవా

పొందూరుఖాది

సారవకోట చుప్పులు

నరసన్నపేట, సోంపేట అప్పడాలు

పొన్నాడ వంకాయలు

వీరఘట్టం చాంతాడు (ఈ గ్రామానికి చెందిన కోడి రామ్మూర్తి ప్రపంచ ప్రసిద్ధ మల్లయోధుడు. ఆయన తన విన్యాసాలలో అత్యంత పొడవైన చాంతాడును ఉపయోగించేవాడు. ఎవరైన పొడవైన వాటిని వినియోగించేటప్పు డు వీరఘట్టం చాంతాడు అంటారు)

తిరుపతి వేమాలు / బోడిగుళ్లు, లడ్డూలు

బొగులమల్లారం ఆముదం

చిత్తూరు మామిడి

అనంతపురం, శ్రీకాళహస్తి పూసల పరిశ్రమ

కుదురుకు కూర్మం (మానసిక స్వస్థతకు, ప్రశాంతతకు ఇక్కడి ఆలయం ప్రసిద్ధి చెందింది)

వండానపేట (రేగిడి మండలం) కొడవళ్ళు)

కూర్మం పెళ్లి కునుకు పైన్నపుల్లి పట్టుకున్నట్టు (ఏదైన కార్యాన్ని చేపట్టినప్పుడు సమర్థులైన వారిని ఆశ్రయించాలి. అంతేకాని సమర్థులు కానివారిని ఆశ్రయించే సందర్భాల్లో దీన్ని వాడుతుంటారు.)

లోలుగు / చిలకపాలెం / దూసి పకోడి (ప్రస్తుతం దూసి పకోడి అంతరించి పోయింది)

గుణుపూరు జంగాలు (పనులు చేపట్టేటప్పుడు త్రీవ నిర్లక్ష్యం చేసేవారిని ఉద్దేశించి దీన్ని ఉప యోగిస్తారు. ఎలా అంటే గుణుపూరు జంగాలు తాము యాచన చేసి ఇంటికి వచ్చినపుడు అమ్మకు ఇళ్లు కడదాం అంటారు. మరునాటి ఉదయం ఎవరికి వారు యాచనకు వెళ్లేవారు)

రాపాక హార్మోనియం

నేపడ ఉప్పు

పలాస జీడిపప్పు / మునగ కాడలు

ఉద్దానం - సిక్కోలు కోనసీమ

బుడితి - ఇత్తడి పరిశ్రమ

బొబ్బిలి వీణ

బొబ్బిలి వారిలా తొందరెందుకు (బొబ్బిలి పౌరుషానికి ప్రతీట్లు. నాటి సంస్థానాధీశులకు చిన్న విమర్శ ఎదురైనా తట్టుకోలేకపోయేవారు. ఆలోచించకుండా తొందరపాటుగా నిర్ణయాలు తీసుకొనేవారు. అప్పటినుంచి బొబ్బిలి వారిలా తొందరెందుకు అనే నానుడి బహుళ ప్రచారంలోకి వచ్చింది.

ఉత్తరావల్లి అరటిపళ్లు

విశాఖ ఉక్కు

అనకాపల్లి బెల్లం

పటికోప్పాక కొయ్యబొమ్మలు

సింహాచలం సంపంగి

రంపచోడవరం గృహోపకరణాలు (ఫర్నిచర్)

అంబాజీపేట ఆముదం

కడియం పూలమొక్కలు

తాపేశ్వరం కాజా

ఆత్రేయపురం పూతరేకులు

ఉప్పాడ చీరలు

పెద్దాపురంసిల్క్‌చీరలు / పాపలు

రాజానగరం జాంపళ్లు

రాజోలు వంకాయలు

సర్వవరం మామిడితాండ్ర

పిఠాపురం ఆయుర్వేదం

కోనసీమ కొబ్బరి

ఏలూరు తివాచీలు

పాలకొల్లు, నరసాపురం షూ లేసు అల్లికలు

వడ్డూరు కట్లు (ఆయుర్వేదం)

పెల్ల పచ్చ కామెర్ల మందు

జగ్గయ్యపేట దోసకాయలు

మచిలీపట్నం అద్దకం

ఉండి ఎడ్లు బండ్లు

కొయ్యలగూడెం కోడిపుంజులు

దీలుగుమర్రి జంతికలు

చాగళ్ళు చలివిడి ముద్దలు

ధమడోలు అప్పడాలు

తుని తగవు (వాదికి ప్రతివాదికి, ఇద్దరికి సమంగా ఇచ్చే తీర్పు

ఒంగోలు గిత్తలు

గుంటూరు గోంగూర

మంగళగిరి చీరలు

చిలకలూరిపేట చిలకలు

నూజివీడు రసాలు / పిఠ

కొండపల్లి బొమ్మలు

చీరాల, పేరాల చేనేత చీరలు

భట్టిప్రోలు పంచాయతీ (తుని తగ్గువలె)

నెల్లూరు నెరజాణ

నెల్లూరు సన్నాలు

మార్కాపురం పలకలు

వెంకటగిరి జరీచీరలు

కాళహస్తి కళంకారి

పెడన చీరలు

ప్రత్తూరు తైలం

కదిరి మల్లెలు, దవనాలు

నంద్యాల అముదం

శ్రీశైలం తలపాగా (ఈ తల పాగాను ఏ గ్రామంలో నేసినా సరే శ్రీశైలం తలపాగా గానే వ్యవహరిస్తారు)

కర్నూలు ఫుల్లారెడ్డి స్వీట్లు

ఎమ్మిగనూరు చేనేత వస్త్రాలు

దేవరకొండ దేవతా విగ్రహాలు

నంద్యాల నందిపైపులు

చెన్నూరు తమలపాకులు

నర్సాపురం కుర్చీలు

కూచిపూడి భాగవతులు

కొండవీడు చాంతాడు (చాలా పొడవు అని అర్థంలో)

ఆధార గ్రంథాలు

విద్వాన్ కట్టా నరసింహులు (తి.తి.దే ప్రచురణల సలహాదారు – తిరుపతి)

– కైఫియత్ కతలు, ఒంటిమిట్ట రామయ్య చరిత్ర

డా॥ కాళిదాసు పురుషోత్తం

(విశ్రాంత ప్రధానాచార్యులు, సర్వోదయ డిగ్రీ కళాశాల, నెల్లూరు)

– వెంకటగిరి సంస్థాన చరిత్ర, సాహిత్యం.

ఆచార్య తూమాటి దొణప్ప

(పూర్వ ఉపకులపతి శ్రీపొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం)

– ఆంధ్ర సంస్థానములు, సాహిత్యపోషణము

ఆచార్య యార్లగడ్డ బాలగంగాధరరావు

(పూర్వ ఆచార్యులు, నాగార్జున విశ్వవిద్యాలయం)

– నామ విజ్ఞానం

డా॥ డి. గాయత్రి (ప్రముఖ రచయిత్రి, కర్నూలు)

కర్నూలు జిల్లా జానపదుల నమ్మకాలు, శకునాలు
(పిహెచ్.డి సిద్ధాంత గ్రంథం)
పరిమళించిన జానపద సుగంధం

కానూరి బదరీనాథ్ (ప్రముఖ సాహితీ వేత్త, తణుకు

– పానార విషయము
మా దూతికాపురము (జుత్తిగ–చరిత్ర)

గాజుల సత్యన్నారాయణ

– భారత ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలు, ఆధ్యాత్మిక దర్శిని

శ్యామలా దేవి

– మన ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలు

డా॥డి.వి.సూర్యారావు (విశాఖపట్నం)

– సంపదలగని గోస్తని – మిసిమి మాసపత్రిక

నెల్లూరు జిల్లాపరిషత్ ప్రచురణ (1963)

– విక్రమ సింహపురి మండల సర్వస్వం

మెకంజీ (పూర్వ సర్వేయర్ జనరల్ ఆఫ్ ఇండియా)

– కైఫియత్‌లు

ఆచార్య గంధం అప్పారావు

– పరిశోధన పద్ధతులు

లంక వెంకటరమణ

– విజయవాడ వీధుల కథలు

మహమ్మద్ సిలార్

– తరతరాల బందరు చరిత్ర

కొండవీటి త్రినాథ్

– గోదావరి

యిడుకుళ్ల జనార్ధన్

– హిందూ దేవాలయాల్లో విజ్ఞాన శాస్త్ర అంశాలు

సయ్యద్ మీర్ మహమ్మద్ (విశ్రాంత ఎ.ఎస్.పి)

– ఉత్తరాంధ్రలోనిబ్రాహ్మణాగ్రహారములు

ఏటుకూరు బలరామమూర్తి

– ఆంధ్రుల సంక్షిప్తచరిత్ర

డా॥ ఎ.విజయ దత్తాత్రేయ శర్మ

– నెల్లూరు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల గ్రామనామములు..'ఒక పరిశీలన అనే వ్యాసాలు'

శతజయంతి ఉత్సవ కమిటీ

– మహారాజా పూసపాటి అలక్‌నారాయణ గజపతి శత జయంతి ఉత్సవ సంచిక

ఆదిభట్లవెంకటరమణ – శ్రీకాకుళంజిల్లాచరిత్ర

పత్రికలు

ఆంధ్రజ్యోతి చిత్తూరుజిల్లా, ఆంధ్రభూమి, విశాలాంధ్ర, ఈనాడు, సాక్షి, తదితర దిన పత్రికల జిల్లా అనుబంధాలు, ప్రత్యేకసంచికలు తెలుగు వెలుగు మాసపత్రిక, కుముదం భక్తి ప్రత్యేక సంచికలు, వివిధ జిల్లాల వెబ్‌సైట్లు, వికీపీడియా, మీలో ఎవరు కోటీశ్వరుడు ('మా' టీవి వారి ప్రసారం), సారస్వతనికేతనం (వేటపాలెం), పౌర గ్రంథాలయం(విశాఖపట్నం). డా॥ వి.ఎస్‌కృష్ణ గ్రంథాలయం (ఆంధ్రవిశ్వవిద్యాలయం).










ఈ పుస్తకానికి మార్గదర్శకులు వీరే...




విద్వాన్ కట్టా నరసింహులు




డా॥ కాళిదాసు పురుషోత్తం




డా॥ డి. గాయత్రి




కాసూరి బదరీనాథ్



డా॥ ఆకొండి విశ్వనాథం




డా॥ డి.వి. సూర్యారావు



నెయ్యిల ఉమామహేశ్వరరావు



చందన రవీంద్ర



మణిపాత్రుని నాగేశ్వరరావు



మంగళగిరి (గుంటూరు)




భైరవకోన (ప్రకాశం జిల్లా)




చంగాలమ్మతల్లి పాళ్లూరుపేట(నెల్లూరు)



తిరుమల-తిరుపతి(చిత్తూరు)



లేపాక్షి(అనంతపురం)



కొండారెడ్డి బురుజు (కర్నూలు)



ఒంటిమిట్ట రామాలయం (కడప)

నా గురించి



పేరు : వాండ్రంగి కొండలరావు, ఎం.ఏ. (తెలుగు), బి.యిడి.

విద్యాభ్యాసం : బి.ఏ. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, శ్రీకాకుళం
ఎం.ఏ. , ఆంధ్ర విశ్వ విద్యాలయం, విశాఖపట్నం.
బి.యిడి. - ఎం.ఆర్. విద్యా కళాశాల, విజయనగరం.

వృత్తి : అక్రిడిటెడ్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, విశ్రాంత తెలుగు భాషోపాధ్యాయులు.

స్వగ్రామం : వాండ్రంగి

చరవాణి : 9490528730, 9490595391

శాశ్వత నివాసం : పాండూరు, శ్రీకాకుళం జిల్లా

తల్లిదండ్రులు : కీ॥శే॥ రాధాకాంతమ్మ, చినగురుమూర్తి

ధర్మపత్ని : రమాదేవి

రచనలు : పాండూరు మరో పోర్‌బందర్, సాయిశరణు:, గురమ్మ పేరంటాలు కథ మహిమలు, బాల అన్నమ్మ పేరంటాలు కథ మహిమలు (ఈ పుస్తకాన్ని మిత్రుడు శ్రీ భూపతిరావుతో కలిసి రాసింది) మాదేవుడు మీరే మాస్టారు (మిత్రుడు ఎన్. ఉమామహేశ్వరరావుతో కలిసి రాసింది).

పురస్కారాలు : తే 21-06-2015దిన ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగు రక్షణ వేదిక ఆధ్వర్యంలో సాహిత్య రంగంలో ఉత్తమ పురస్కారాన్ని రాష్ట్ర మంత్రులు పల్లె రఘునాధరెడ్డి, గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా అందుకున్నాను.

* తే 19-07-2015 దిన విజయనగరం జెడ్పీ హాల్లో తెలుగు రక్షణ వేదిక అధ్వర్యంలో గోదావరి మహాపుష్కర పురస్కారం.
* తే 12-07-2015 దిన భారత సాహితీ సాంస్కృతిక సేవా సంస్థచే పత్రికా రంగంలో "సాహితీరత్నం" అవార్డు.
* తే 20-03-1991 దిన ఈనాడు ఛైర్మన్ రామోజీరావు గారి చేతులు మీదుగా ఉత్తమ అవార్డు.
* పాండూరు మరో పోర్‌బందర్ పుస్తకం కోసం 2013లో నటసమ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు గారితో ఇంటర్వ్యూ.
* పాండూరు మరో పోర్‌బందర్ పుస్తకానికి తే 26-8-2014న అక్కినేని నాగార్జున అలాగే నాటి ప్రెస్ అకాడమీ ఛైర్మన్ ఆదపాక సత్యారావు, డి.పి.ఆర్.వో.ఎల్. రమేష్ లచే అభినందనలు
* తేది 16-11-2016 న నేషనల్ ప్రెస్ డే సందర్భంగా డా॥ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం (శ్రీకాకుళం) చే పురస్కారం.
* తేది 18-12-2016 న కాశీబుగ్గ జనజాగృతి సంస్థచే వ్యాస బ్రహ్మ పురస్కారం.

ఇలా ఎన్నో అవార్డులు... మరెన్నో ప్రశంసలు..

తెలుగు వెలుగు, ఈనాడు, సాక్షి, ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతి, విశాలాంధ్ర, బాలభారతం, బాలబాట, ధర్మశాస్త్రం, భక్తి సమాచారం, ప్రపంచ తెలుగు మహాసభల ప్రత్యేక సంచికలు తదితర పత్రికలలో వందలాది వ్యాసాల ప్రచురణ.
2500 పుస్తకాలతో సొంత గ్రంథాలయం

Sathyam-984 999 6538